
# “ అవ్యక్త డ్రామా ”



“ అవ్యక్త డ్రామా ”

SpARC WING

కృతి

(సంకలనం )

స్పార్క్ (SpARC)

ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ ఈశ్వరీయ
విశ్వ విద్యాలయము

మరియు

రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్

పాండవ భవనము, ఆబూ పర్వతము, రాజస్థాన్

తెలుగు అనువాదము, బెంగళూరు సిటీ సబ్ జోన్

# " స్పార్క్ "

స్పార్క్(SpARC) ఒక అనుసంధాన లేక అన్వేషణ ప్రభాగము (రిసర్చ్ వింగ్). ఇది దేశ-విదేశాలలో అనేక స్థానాలలో పని చేస్తోంది. స్పార్క్ శబ్దానికి విస్తారము - స్పిరిచువల్ అప్లికేషన్స్ రిసర్చి సెంటర్(Spiritual Applications Research Centre). దీని లక్ష్యము విశ్వ నవ నిర్మాణ కార్యములో ఆధ్యాత్మికత మరియు విజ్ఞానము రెండింటిని ఒకదానికొకటి సహయోగులుగా చేయడం. ఈ లక్ష్యము పూర్తి అయ్యేందుకు స్పార్క్ మనన చింతన, విచార సాగర మథనాల ఈ ఈశ్వరీయ జ్ఞానానికి వైజ్ఞానిక పృష్ఠ భూమిని మరియు విజ్ఞానము యొక్క విరోధ యుక్త శాఖలకు ఆధ్యాత్మిక పృష్ఠ భూమిని ప్రదానము చేస్తూ మరియు రెండిటిని పరస్పరము ఒకదానికొక దానిని సమీపానికి తెచ్చి, రెండూ కలిసి పని చేసేందుకు రెడీ చేస్తోంది.

ఈ కార్యములో వేగంగా ముందుకు వెళ్లేందుకు జీవితంలో అన్ని సమస్యలకు ఆధ్యాత్మికతను ప్రయోగించి, ఉపయోగించుట ద్వారా ప్రాప్తించిన పరిణామాలను అందరిచే ఆచరింపబడునట్లు చేసేందుకు ప్రభావశాలీ విధిని, సాధనాలను, టెక్నిక్‌ను వికసింపజేసేందుకు మొదలైన కార్యాలలో అన్ని విధాలైన అనుసంధాలను ప్రోత్సహిస్తుంది.

## " వాహ్ డ్రామా వాహ్ ! "

## వ్యాసము(లేఖ్) – 1

మానవ జీవితములో ఏదో ఒక విషయము వచ్చి సమస్యగా తయారవుతూ ఉంది. ముఖ్యంగా ఈ కలియుగ అంతిమ సమయములో శారీరిక వ్యాధులు, సంతానము, ఏవో కొన్ని పరిస్థితులు, ప్రభుత్వము చేసే చట్టాలు, వ్యాపారములో హెచ్చు-తగ్గులు, ఏదో ఒక విషయము అసంతృప్తిగా చేస్తూ ఉంది. అటువంటి సమయములో డ్రామా ఢాలును గుర్తుంచుకుంటే చాలు అని బాబా చెప్తున్నారు. పూర్వము యుద్ధ సమయములో సైనికులు



కవచము ధరించి కత్తి, ఢాలును తీసుకెళ్లేవారు. శత్రువు కత్తి దెబ్బల నుండి రక్షించుకునేందుకు ఢాలును ఉపయోగించేవారు. కవచము, ఢాలు లేకుంటే శత్రువు ద్వారా కత్తి దెబ్బలకు గురవుతారు, దెబ్బలు తగులుతాయి. ముఖ్యంగా ఈ పురుషార్థ జీవితములో మనకు దెబ్బలు తగలకుండా, దు:ఖపడకుండా ఉండేందుకు కవచము, ఢాలు – డ్రామా. యుద్ధము నుండి రక్షించుకునే సాధనము – డ్రామా. " వాహ్ డ్రామా వాహ్." సాకారములో బాబా " వాహ్ డ్రామా! " అనునప్పుడు వారి ముఖము చూడదగినదిగా ఉండేది. ఎవరైనా ఒక వ్యక్తి అసంతృప్తిగా ఉన్నప్పుడు ఆ వ్యక్తికి ఏదైనా కవచము, ఏదైనా ఒక రక్షణా సాధనము అవసరము. ఆ సాధనమే " డ్రామా. "

## డ్రామా పై నిశ్చయముంచుకోవడం వలన అనేక లాభాలు

ఈ డ్రామా చాలా గొప్ప విధి. ఎవరైనా డ్రామా పట్టాల పై నిలబడకుండా ఉంటే వారు చాలా దు:ఖము అనుభవించవలసి వస్తుంది. రైలుబండి రైలు పట్టాల పై నడవకుంటే రైలు పట్టాల పై లేకుంటే ఎన్ని పెట్టెలు పడిపోతాయి, ఎంత మంది మరణిస్తారు. కారణమేమి? రైలు పట్టాల పై లేదు. మనము డ్రామా పట్టాల పై నడవాలి. ఇటు, అటు పోరాదు. ప్రారంభములో మేము బాబాను కలుసుకునేందుకు వెళ్లినప్పుడు 108 సార్లు నిశ్చయ పత్రము వ్రాయమనేవారు. అందులో డ్రామా పై నాకు పూర్తి నిశ్చయముంది అని కూడా వ్రాయించేవారు. డ్రామా పై నిశ్చయముండుట వలన జీవితములో చాలా లాభాలు కలుగుతాయి. ఈర్ష్య సమాప్తమైపోతుంది. ఏ ఆత్మ పాత్ర వారిదే అని నిశ్చయమైనప్పుడు, నా పాత్ర నేను చేస్తున్నాను, వారి పాత్ర వారు చేస్తున్నారు అని నిశ్చయము కలిగినప్పుడు ఈర్ష్య ఎందుకుంటుంది? ద్వేషమెందుకుంటుంది? జుగుప్స ఎందుకుంటుంది? కొట్లాట ఎందుకు?

## ఇది బనీ బనాయా బన్ రహీ డ్రామా

## ఇది తయారై – తయారు చేయబడుతున్న డ్రామా (బనా బనాయి డ్రామా)

ఇది తయారు చేయబడిన డ్రామా అని అర్థము చేసుకోనందువలన చాలా మాటలు వస్తాయి. కేవలం డ్రామా కాదు. బాబా

చెప్పారు - ఇది రెడీమేడ్(ReadyMade) డ్రామా. ఈ మాట ఇంతకు ముందు మనమెప్పుడూ విని ఉండము. తయారవుతూనైనా ఉంటుంది లేక ముందే తయారైనదైనా ఉంటుంది. రెండూ ఒకేసారి జరగవు కదా. కాని బాబా భాషయే వేరు. ఇది బనా బనాయా బన్‌రహీ డ్రామా(తయారై, తయారవుతున్న డ్రామా) అని అంటారు. దీని అర్థమేముంటుంది? ఏదైనా వస్తువు అలా రెడీగా తయారై ఉంటుందా? ఉదాహరణానికి రొట్టె ఉంది అనుకోండి. అది రెడిగా తయారై ఉంటుందా? దానిని ఎవరైనా తయారు చేయాలి. కాని బాబా చెప్పారు - డ్రామా అనాది. దానిని నేను కూడా తయారు చేయలేదు. నేను కూడా డ్రామా అనుసారమే నడుస్తాను. ఇది అనాది కాలము నుండి నడుస్తూనే వచ్చింది, అంతేకాదు ఇలాగే నడుస్తుంది కూడా. కల్ప-కల్పము ఇలాగే నడుస్తుంది. పిల్లలూ! ఒక దోమ ఇక్కడ నుండి ఎగిరి మీ ముక్కు పై కూర్చున్నదనుకోండి, 5000 సంవత్సరాల తర్వాత కూడా అది సరిగ్గా మళ్ళీ అక్కడే కూర్చుంటుంది. ఇది మారేది కాదు. ఈ డ్రామా ఏ మాత్రమూ మారదు. అంతేకాదు బాబా చెప్పారు - ఈ డ్రామా చాలా ఆక్యురేట్(ఖచ్చితమైనది/Accurate). అద్భుతం కదా. ప్రమాదము జరిగి కాలు విరిగితే డ్రామా ఆక్యురేట్. మన కాలు విరిగింది, డ్రామా ఆక్యురేట్. ఆ సమయంలో మనిషి ఇలా ఆలోచిస్తే ఎలా ఉంటుంది?

బాబా తమ జీవితములో తేలికగా ఉండడం మేము చూశాము. ఎప్పుడూ ఏ మాత్రము భారము గాని, చింత గాని లేదు. కారణమేమి? ఈ డ్రామా చాలా ఆక్యురేట్, చాలా అద్భుతమైనది. బనా-బనాయా డ్రామా. ఇది తయారు చేయబడిన డ్రామా. భగవంతుడు తయారు చేయలేదు. అలా చేసి ఉంటే దోషము వారి పైకి వస్తుంది. ఇది బనా బనాయా డ్రామా (రెడీమేడ్ డ్రామా).

## డ్రామా సంతోషించేందుకే

ఇది రెడీమేడ్(తయారైన) డ్రామా. అందుకే భగవంతుని పై దోషము రాదు. దోషము మనది కూడా కాదు. ఎందుకంటే డ్రామాలో అందరికి



ఎవరి పాత్ర వారికుంది. ప్రతి ఒక్కరి పాత్రను చూచి సంతోషించండి. డ్రామా తయారు చేసేది, చూచేది సంతోషించేందుకే, మనసును వినోదపరచేందుకే. కొంతమంది ఇదంతా ఆ ప్రభువు లీల అని అంటారు. కొంతమంది ఇది నాలుగు రోజుల నాటకము అని అంటారు. డ్రామాను గురించి బాబా మాటలు - "ఈ డ్రామా ఆక్యురేట్ మరియు అనాది". వాహ్! డ్రామా వాహ్!" అని భావించి నడుస్తూ ఉంటే సంతోషంగా ఉంటారు. సంతోషంగా ఉంటే తృప్తిగా(సంతుష్టంగా) ఉండగలరు. సంతోషంగా ఉన్నప్పుడు ఈ డ్రామా సంతోషించేందుకే అని అర్థము చేసుకుంటారు. ఇది అర్థము చేసుకోకుంటే అన్ని పరిస్థితులలో సంతుష్టముగా ఉండడం అసంభవము.

## ఇవన్నీ ఆశ్చర్య న్యాయానుసారము జరిగేవి

బాబా చెప్తున్నారు - ఎలాగైతే ఆత్మ, పరమాత్మల గురించి అర్థం చేసుకోవడం అవసరమో, కర్మల గుహ్య గతిని అర్థం చేసుకోవడం అవసరమో, భగవంతుని అవతరణ, వారి కర్తవ్యములైన స్థాపన, పాలన, వినాశముల రహస్యాన్ని అర్థం చేసుకోవడం అవసరమో, డ్రామాను అర్థం చేసుకోవడం కూడా అంతే అవసరము. ఇదేమీ తక్కువ ప్రాముఖ్యమైనదేమీ కాదు. ఎంతోమంది ఈ జ్ఞానాన్ని వదిలి వెళ్ళిపోయారు ఎందుకంటే వారికి ఈ డ్రామా అర్థము కాలేదు. వారు డ్రామా పట్టాల పై నిలవలేకపోయారు. దానికి ఫలితమేమంటే ఇంత అద్భుతమైన జ్ఞానాన్ని వదిలి, ఇంత గొప్ప భాగ్యాన్ని కాలదన్ని, తమ భాగ్యరేఖను సమాప్తము చేసుకొని వెళ్ళిపోయారు. అప్పుడు కూడా బాబా వాహ్ డ్రామా వాహ్! అనే అంటారు. బాబా ఉన్నప్పుడు ఎంతమంది వచ్చారో మీరు ఆలోచించండి భగవంతుడు బ్రహ్మ శరీరము ద్వారా చదివిస్తున్నారని మాకు నిశ్చయముందని రక్తముతో వ్రాసి ఇచ్చారు. అయినా వెళ్ళిపోయారు. ఎన్నెన్ని సంవత్సరాలు శ్రమ తీసుకున్నారు, బాబా నుండి ఎంత పాలన తీసుకున్నారు కాని వెళ్ళిపోయారు. అయినా బాబా ఇంత శ్రమించానే, ఇలా జరిగిందే అని దు:ఖించలేదు. యుక్త వయస్సులోని

ఒక కుమారుడు మరణిస్తే తండ్రికి ఎంత దు:ఖము కులగుతుంది! కాని బాబా ఎవరి కొరకు ఇంత శ్రమించారో, రాత్రింబవళ్లు ఎవరి సేవ చేశారో వారు యజ్ఞాన్ని, బాబాను వదిలి వెళ్లిపోయారు. నమ్మకద్రోహులుగా అయినా బాబా వారిని అలా అనలేదు, వారిని దోషులుగా చేయలేదు. 'మంచిది పిల్లలూ! డ్రామా' అని అన్నారు. వారి భాగ్యమలా ఉంది. లేశ మాత్రము (కొద్దిగా) కూడా కోపము గాని, దు:ఖము గాని రాలేదు. ఏమి జరిగినా అన్ని విషయాలలో సంతుష్టంగా(తృప్తిగా, సంతోషము) ఉండినారు. డ్రామాలో ఎవరి పాత్ర ఉంటుందో వారు వస్తారు, వారు వారసత్వము తీసుకునే తీరాలి. ఎవరి పాత్ర లేదో, ఎంత ప్రయత్నించినా వారు రానే రారు. వచ్చినా వెళ్లిపోతారు. అందరూ వారసత్వము తీసుకోలేరు. ఏం చేయాలి! వచ్చిన వారిలో కొంతమంది ఎలా ప్రవర్తిస్తారంటే దాస-దాసీలుగా అవుతారు. కొంతమంది తింటూ, త్రాగుతూ, అలంకరించుకుంటూ, ఫ్యాషన్ దుస్తులు ధరిస్తూ, తిరుగుతూ ఉంటారు. సేవ చేయరు, శ్రమ చేయరు, పురుషార్థము చేయరు. అలా ఉంటే ఏమవుతారు? దాస-దాసీలుగా అవుతారు. బాబా చెప్తున్నారు - నూతన సృష్టి స్థాపన జరుగుతూ ఉంది, అందులో అన్ని రకాల ప్రజలు తయారవుతూ ఉన్నారు. అందువలన పిల్లలూ! చింతించే విషయమే లేదు. ఎవరు ఏమిగా అవుతారో ఇప్పటి నుండే కనిపిస్తారు. వారి లక్షణాల ద్వారా, వారి వ్యవహారము ద్వారా తెలిసిపోతుంది. కాని డ్రామా రహస్యాన్ని ముందుంచుకొని, సాక్షిగా చూస్తూ వీరి పాత్ర ఇంతేనని సంతుష్టంగా ఉండండి.

## సంతుష్టముగా (తృప్తిగా) లేకుంటే యోగము కుదరదు

ఎంతవరకు సంతుష్టత(తృప్తి) లేదో అంతవరకు యోగ స్థితి సరిగ్గా ఉండదు, నిలకడ ఉండదు, చంచలమవుతూ ఉంటుంది. మీరు ఎప్పుడైనా చూడండి - యోగము తెగిపోతూ ఉంటుంది. డ్రామాలో అలజడి జరిగినప్పుడు స్థిరంగా ఉండకుంటే యోగము కూడా స్థిరంగా ఉండదు, స్థితి కూడా నిశ్చలంగా, స్థిరంగా ఉండదు. ఆ సమయములో కదిలిపోతారు.



కనుక మనము సంతుష్టంగా ఉంటే యోగము కుదురుతుంది. 1. పరిస్థితులతో 2. వ్యక్తులతో 3. స్వయంతో 4. బాబాతో కూడా సంతుష్టంగా ఉండాలి. బాబా మాకు మంచి పాత్రనివ్వలేదని కూడా అనుకోరాదు. ఇది చాలా లోతైన విషయము. **బాబా చెప్తారు - పిల్లలూ! ఇది చాలా లోతైన రహస్యము. బెల్లమునకు, బెల్లపు సంచికి మాత్రమే తెలుసు(గుడ్ జానే గుడ్ కీ గోత్రీ జానే............).** ఎవరో అరుదుగా కొంతమంది మాత్రమే ఈ రహస్యమును అర్థము చేసుకుంటారు. ఎంత అర్థము చేసుకున్నా, ఎంత తెలివిగలవారైనా బాబా చెప్పింది అంగీకరించండి. ఎల్లప్పుడూ 'వాహ్ డ్రామా వాహ్', 'వాహ్ బాబా వాహ్', 'వాహ్ నా భాగ్యము !!!' అని గుర్తుంచుకొని సంతోషంగా ఉండండి. ఏమి జరిగినా ఇలా భావించండి - **"నేను మళ్లీ వచ్చేశాను, భగవంతుని దానిగా అయ్యాను, వారి నుండి వారసత్వము లభిస్తుంది. వారి జతలో పాత్ర చేస్తున్నాను, నూతన సృష్టి స్థాపనా కార్యములో నేను కూడా నిమిత్తముగా అయ్యాను. అణువంత సేవ చేసి నేను కూడా నా భవిష్యత్తును శ్రేష్ఠంగా తయారు చేసుకుంటున్నాను".** ఈ విధంగా సంతోషంగా ఉండండి, సంతుష్టంగా ఉండండి. దీనినే పాజిటివ్ థింకింగ్(Positive Thinking/సకారాత్మక చింతన) అని అంటారు. మీ సంతోషము, తృప్తి పెరుగునట్లు ఆలోచించండి. ఎందుకు? ఎందుకంటే తృప్తి లేకుంటే యోగము నిలువదు.

## " వాహ్ డ్రామా వాహ్ !"

## వ్యాసము (లేఖ్) – 2

## డ్రామా పృష్ఠభూమి (బ్యాక్‌గ్రౌండ్/Background) గురించి ఒక విస్తృతమైన (వివిధ రకాల) చింతన

అనంతమైన ఈ విశ్వనాటక రంగము పై ఏ మహాలీలను (నాటకాన్ని) మనము చూస్తున్నామో, ఆ నాటకములోని పాత్రధారులందరూ తెర వెనుక భాగములో ముందే ఉపస్థితమై ఉంటారు. నియమానుసారము అభినయ క్రమములో నాటక రంగము పైకి ఏ సమయములో ఎవరు అవసరమో వారు వచ్చి వారి పాత్రను అభినయించి మరలా తెర వెనుకకు

వెళ్ళిపోతారు. అనంతకాలము నుండి అభినయిస్తున్న ఈ అవిరామ యాత్ర మన జీవితములో అనేకమైన కటు - మృదు అనుభవాలతో మన ప్రాణాలను స్పందింపజేస్తూ ఉంటుంది. ఘాత-ప్రతిఘాతాలు, ఉత్థాన-పతనాలు, నాశనము-సృష్టి ఇంకా మరెన్నో గడచిపోయిన కథా యాత్రలు స్మృతి ప్రదేశాన్ని(జ్ఞాపకాలు) ఆందోళనపరుస్తూ ఉంటాయి. సృష్టి చక్రములో జరిగే ఈ మహాలీలను నిర్ణయించిన బిందువు ఎవరో, ఎక్కడ ఉన్నారో ఎవ్వరికీ తెలియదు. సాధారణ జనుల మనసుకు ఈ విషయము గురించి ఎలా తెలుస్తుంది? తమ అలంకరింపబడిన కోరికల ఆధారముతో మానవుడు తన వికాస యాత్రలో ముందుకు వెళ్ళే పురుషార్థమైతే చేస్తూనే ఉంటాడు. కాని వారి ప్రతి అడుగులో ముందే నిశ్చయింపబడిన ఒక(అదృశ్యమైన) ప్రబలమైన శక్తి నిలబడి ఉంటుంది. అది మానవుడు సంకల్పించిన కోరికలకు, వారి ప్రణాళికలకు వ్యతిరేకంగా ఎక్కడకు కావాలంటే అక్కడకు తిప్పేస్తుంది, మానవుడు వద్దనుకున్నా అలా తిరగవలసి వస్తుంది లేక మారవలసి వస్తుంది. అప్పుడప్పుడు చెదిరిపోయిన సఫలతా సూత్రములన్నీ (దారాలన్నీ) చేతిలోకి వచ్చినట్లు అనిపిస్తుంది, కాని అతిశీఘ్రముగా సమయ ప్రవాహములో ఆ సూత్రాలన్నీ చేతి నుండి జారిపోయి ఎలా చెదిరిపోతాయంటే అవి ఎక్కడున్నాయో కనీసము అడ్రస్సు కూడా తెలియక మానవుడు దిక్కుతోచక దోచుకోబడిన వాని వలె అసహాయుడై కలవరపడి తీరములో నిల్చొని చూస్తూ ఉండిపోతాడు. మానవ జీవిత ప్రాంగణములో క్షణ ప్రతి క్షణము అనేక ఘటనల సంయోగ - వియోగాలు, అనుకూల - ప్రతికూలాలు, కటువు-మృదువు.......... మొదలైన అనేక అధ్యాయాల నిర్మాణము జరుగుతూ ఉంటుంది. వ్యక్తుల అంతర మనస్సు అకస్మాత్తుగా జరిగే జరగరాని ఘటనలు తమ జీవితములో జరగరాదని తలుస్తారు. కాని వద్దనుకున్నంత మాత్రాన ఏదీ నిలబడదు. అన్నీ జరిగిపోతాయి. కనులు మూసి తెరిచే లోపల కన్న కలలు కరిగిపోతాయి. అశుభమైన విషయాలే కాక వ్యక్తులు శుభాన్ని కోరుతున్నా, ఎంత ప్రయత్నిస్తున్నా చివరికి లక్ష్యాన్ని ఎంతవరకు చేరుకుంటున్నారో అందరికీ తమ తమ వ్యక్తిగత అనుభవాలు తప్పక



ఉంటాయి. దీనినెవ్వరూ కాదనలేరు.

## నియతి ( విధి )

పై తెలుపబడిన స్థితి ద్వారా లీలా చక్రములో ఏమేమి జరిగిపోయిందో, ఇప్పుడేమి జరుగుతోందో, ఇక మీద ఏమి జరగబోతుందో......... అంతా ఇంతకు ముందే నిర్ణయింపబడిందని స్పష్టమవుతుంది. ఇది ముందే తయారు చేయబడిన లీల లేక డ్రామా. ఈ డ్రామా ఉన్నదున్నట్లు ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత రిపీట్ అవుతూ ఉంటుంది. దీనిని పరివర్తన చేసేందుకు వ్యక్తి స్వతంత్రుడు కాడు. విశ్వములోని ఈ విశాలమైన పృష్ఠ భూమిపై జడము, చైతన్యాలు, నిమిత్తమైన వారితో జోడింపబడి ఏ ఘటనలైతే జరిగిపోయాయో, వర్తమానములో జరుగుతున్నాయో, భవిష్యత్తులో జరుగుతాయో............... అవన్నీ ఇంతకు ముందే నిర్ణయించబడినవి అనగా ముందే తయారు చేయబడినవి. ఇందులో గురిగింజంత కూడా రద్దు చేసేందుకు గాని, మాపు చేసేందుకు గాని అవకాశము లేదు. డ్రామాలోని ఈ రహస్యము మూడు కాలాలలోనూ సత్యమైనది. ఏమి జరగవలసి ఉండినదో అదే జరిగింది, అదే జరుగుతోంది, అదే జరుగుతుంది. ఈ సత్యాన్ని ప్రదర్శించేందుకు అనేక శబ్ధాలున్నాయి - ఉదాహరణానికి నిశ్చితము, తలవ్రాత, విధి, ప్రారబ్ధము, భాగ్యము, డ్రామా లేక లీల మొదలైనవి. దీనినే మనము నియతి అని అంటున్నాము. అవిరామ లీల నిరంతరము నడుస్తూనే ఉంది. జ్ఞాన పరిపక్వత లేనందున వ్యక్తులు ఇది నేను చేశాను, ఇది నా పరివారము, ఇది నా సంపద, ఇతనిని నేను చంపాను, ఇతడు నన్ను రక్షించాడు....... అంతేకాక ఇంకా ఎన్నో వ్యర్థమైన బాధ్యతలను క్షుద్ర అహంభావముతో తమ పై వేసుకుంటూ మోస్తూ ఉంటారు. సమయ వేగము చాలా మృదువైనది, చాలా నిర్మలమైనది. దాని దారి అక్కడక్కడా సమతలంగా, అక్కడక్కడా కఠినంగా ఉంటుంది. కాని పూర్వమే నిర్ణయించబడిన ప్రక్రియలోనే అందరూ నడవాల్సి ఉంటుంది. భూత, వర్తమాన, భవిష్య క్రియలన్నీ అదృశ్య శక్తుల ముందు సంచాలితమౌతూ ఉంటాయి. దీనినే ఆధ్యాత్మిక భాషలో డ్రామా లేక నియతి

అని అంటారు.

గతంలో ఏ ఏ పనులు జరిగిపోయాయో లేక వర్తమాన మహాలీలలో ప్రత్యక్షంగా కనిపిస్తూ జరుగుతున్నాయో లేక భవిష్యత్తులో జరగబోయే పనులకై ఆసక్తి మరియు అనాసక్తుల వంతెన నిర్మిస్తున్నారో అవన్నీ ఇంతకు ముందే నిర్ణయించబడ్డాయి, ఇప్పుడు నిర్ణయిస్తారు, నిర్ణయించబడ్తాయి. పూర్వ నిశ్చితము కంటే వేరుగా ఏదీ జరగదు. ఆధ్యాత్మికతలో నిపుణుడైన సాధకుడు సహజంగా కర్తగా అవ్వడు, కాని సాక్షి భావముతో ఘటనా ప్రవాహాన్ని ఏకరస దృష్టితో చూస్తూ ఉంటాడు. అణువు అణువులో జరుగుతున్న ప్రకంపనాలు పూర్వ నియోజితాలు. జనన - మరణ క్రీడలు కూడా నిశ్చితమైనవే. భావాలు, సంకల్పాల రూపములో ఏ ప్రకంపనాలైతే ఉత్పన్నమవుతాయో అవి కూడా ఇంతకు ముందే నిశ్చయింపబడినవి. మూడు కాలాలలో, జడము లేక చైతన్యములో ఏ స్థితి తయారవుతుందో, ఏ పరివర్తన అయితే జరుగుతుందో అది అనుకూలము గాని, ప్రతికూలము గాని, నిమిత్తంగా జరగనీ లేక సాధనతో జరిగినా అవి జరిగే తీరతాయి ఎందుకంటే అవన్నీ ఇంతకు ముందే నిర్ణయింపబడిన క్రమబద్ధ వ్యవస్థ. చర్మ చక్షువులతో చూచినప్పుడు హాస్యము-విషాదము (సుఖ-దు:ఖాలు), లాభ-నష్టాలు, సంయోగ-వియోగాలు మొదలైన ఘటనలు జరిగినప్పుడు పరిస్థితుల ప్రభావముతో జరుగుతున్నట్లు కనిపిస్తాయి కాని జ్ఞాన జ్యోతితో వెలుగుతున్న సాధకుడు ఇవన్నీ పూర్వ నిశ్చితములే అని అనుభవము చేస్తాడు. నియతికి తగిన వ్యక్తి ఇటైనా అటైనా నిమిత్తము కావచ్చు. అప్పుడు అన్నీ ఇంతకు ముందే నిశ్చయింపబడినవైతే ఏది జరగాలో అదే జరుగుతుంది, కనుక వ్యక్తి చేసేందుకు స్వతంత్రుడు కాడా? అను ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ సిద్ధాంతము కర్మయోగ తేజస్సును నష్టపరచదా? ఈ విధంగా ఆలోచించినప్పుడు వ్యక్తి సోమరిగా అవ్వడా? మొదలైన ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఈ విషయాల పై తటస్థ దృష్టితో చింతన చేస్తాము రండి !



## అన్నీ పూర్వ నిశ్చితములే (నియోజితములే)

విధి ప్రబలమైనది. ఈ అనంతమైన డ్రామాలో ఇందుకు అనేక ఉదాహరణలు, ఋజువులు కనిపిస్తాయి. సర్వజ్ఞుడైన పరమాత్ముని విషయము వదిలేసినా జ్యోతిష్య శాస్త్రములో విధి ప్రబలమనేందుకు ఖండించలేని, కాదనలేని అనేక ఋజువులున్నాయి. జరగబోయే ఘటనలు కొంతమందికి తరచుగా స్వప్నావస్థలో కనిపిస్తూ ఉంటాయి. ఆ ఘటనలు జరిగిపోయిన తర్వాత దీని సూచన నాకు ముందే స్వప్నములో జరిగిందని అంటారు. అయితే ఇది ఎలా సంభవమనే ప్రశ్న వస్తుంది. స్వప్నములో చలనచిత్రము వలె ఇంకా జరగనిది జరిగినట్లు వెల్లడి అగుట, కార్యము - కారణాల క్రమబద్ధమైన సూత్రములో నిశ్చయింపబడే ఉంది. యోగుల జీవితములో వారు ధ్యానములో ఉన్న సమయములో శుద్ధ అనుభూతిలో జరగబోయే కార్యాలు ప్రతిబింబించి నిశ్చిత సమయములో ఏ మాత్రము తేడా లేకుండా జరిగాయి. వర్తమాన సమయములో జరుగుచున్న ముఖ్యమైన ఘటనలు నాస్టర్‌డామ్‌గారు 400 సంవత్సరాల క్రితమే చూశానని వారి భవిష్య వాణి అధ్యయనము ఋజువు చేస్తుంది. ఇది ముందే నియమించబడిన విధి(నియతి) కాక మరేమిటి? అయినా ఇదంతా వదలండి, దీని రెండవ వైపు చూడండి.

ఇచ్ఛ (కోరిక), పురుషార్థము, ఋజువు(ప్రమాణము) - ఇవి నియతి యొక్క అంగములు. ఎవరైనా సాధకుడు తటస్థముగా ఉండి జాగ్రత్తగా తన జీవితాన్ని, తన సమీపములో ఉన్న వ్యక్తుల జీవితాలలోని ఘటనలను అధ్యయనము చేసి పరిశీలిస్తే అదృశ్య రహస్యమయమైన నియతి(విధి) యొక్క శాశ్వత సత్య సిద్ధాంతమేదో తెలుస్తుంది. అయితే వ్యక్తి కర్మ చేసేందుకు లేక పురుషార్థము చేసేందుకు స్వతంత్రుడు కాడా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఒక క్రూరమైన వ్యక్తి అకస్మాత్తుగా ఒక చిన్న ఘటన ద్వారా కరుణామూర్తిగా అవుతాడు. భయంకరమైన క్రోధమున్న వ్యక్తి కరుణామూర్తిగానే కాక క్షమా గుణానికి అవతారంగా అవుతాడు. చాలా అపఖ్యాతిగల హంతకుడు సాకారములో సజ్జనతా ప్రతిమూర్తిగా

మారిపోతాడు. అప్పుడు నియతి సత్యమైనదని దాని మహిమాన్విత గొప్పదనము గురించి ఆ వ్యక్తికి అర్థమవుతుంది. జీవితము మారవలసి ఉంటే ఒక్క క్షణములో మారిపోతుంది, లేకుంటే సంవత్సరాలు పడ్తుంది. పురుషార్థము చేయకనే ఇంత గొప్ప పరివర్తన విధి కాకుంటే మరి ఏమిటి? ఇంత శ్రేష్ఠంగా, శుభంగా పరివర్తన దానంతట అదే అవ్వడం నియతి కాకుంటే పురుషార్థమా? అందుకే నియతి(విధి) అన్నిటికన్నా గొప్పది.

## నియంత (భగవంతుడు) – నియతి (విధి) తల పై

సృష్టి మహాపరివర్తనలో అన్నీ నియతి(విధి) మాత్రమే కాదు, నియతి తల పై కూడ నియంత కూర్చొని ఉన్నారు. వారే పరమ ఆత్మ. వారిని మనము పరమపిత శివ పరమాత్మ అని అంటున్నాము. వారే నియంత. సృష్టిలోని నియతిని వారేమీ మార్పు చేయరు. కాని వారు నియతి పట్టు నుండి సదా - సర్వాదా ముక్తులుగా ఉంటారు. ఈ మహాలీలలో సంయోగము ద్వారా సుఖ, దు:ఖ ఘటనలు ఏవైతే జరుగుతాయో అవి మనుష్యాత్మలు మరియు ప్రకృతులతో ముందే తయారైన క్రమ బద్ధమైన వరుస(శృంఖల). కాని నియంత, నియతి(డ్రామా)లోని అన్ని గతి-విధులను చూస్తూ ఉంటారు. వారికీ గతి విధులన్నీ తెలుసు. కాని దాని ఫలితము నుండి, పరిణామము నుండి సదా ముక్తులుగా ఉండి తమ పరమ విశిష్ఠమైన స్థానము కలిగి ఉంటారు. వారు ఈ సృష్టిలో జరుగుచున్న మహాలీలలో చాలాకాలము నుండే మనుష్యులు సుఖ-శాంతులతో జీవించే నియతిని తయారు చేసేందుకు నిమిత్తమై తమ పాత్రను అభినయించేందుకు వస్తారు. “ నేను కూడా ఈ మధురమైన డ్రామా బంధనములో బంధింపబడి ఉన్నాను ” అని అనడం వారి పరమ నిరహంకారత. మనుష్యాత్మలతో సర్వ సంబంధాలు జోడించి సర్వ ప్రాప్తులు చేయించడంలో సహాయకుడనని చెప్తారు. అంతేకాని వారు మన వలె కర్మ ఫలాన్ని తీసుకోరు(అనుభవించరు). పాత్రకు లేక నియతికి అధీనులై శరీరములో ఎప్పుడూ బంధింపబడరు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వస్తారు,



ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లిపోతారు. వారు పరమ స్వతంత్రులు. కాని ఏ ఇతర వ్యక్తి నియతి నుండి స్వతంత్రంగా లేడు. ఈ స్థానము, సమయాల హద్దు నుండి దూరంగా, ఎక్కడైతే నియతి అడుగుల శబ్దము కూడా వినిపించదో - ఆ శాంతిధామములో వారు సదా ముక్తులుగా ఉంటారు. నియతిలోని కళ్యాణము, అకళ్యాణాలకు దూరంగా వారు సదా కళ్యాణకారి పాత్రనే అభినయిస్తారు. అర్థకల్పము వరకు సృష్టిని కళ్యాణకారిగా, సుఖకారిగా తయారు చేసే పాత్రను సదా బంధనముక్తులై నిమిత్తంగా చేస్తారు. అందుకే వారిని మనము నియంత అని అంటాము. జగత్ - నియంత అయిన పరమపిత శివుడు మనకు చెప్తున్నారు - ఓ ఆత్మలారా! ప్రతి మనుష్యాత్మకు వారి జన్మలన్నిటిలో మూడు భాగాలు వారికి సుఖమునిచ్చేవే. కాని అజ్ఞానము వలన ఈ డ్రామా సుఖ-దు:ఖాలను అనుభవము చేయిస్తుంది. కాని సత్యమేమంటే ఇది చివరికి కళ్యాణకారి విధితోనే జోడింపబడి ఉంది.

## నియతిని (విధి, తలవ్రాత, భాగ్యము, డ్రామా, లీల....) గురించి ఆలోచించడం వలన లాభాలు

ఒకే అంకము గల ఈ నాటకములో వర్తమాన సమయములో మనము నియతి మరియు నియంతల గురించిన చింతనతో జోడింపబడి ఉన్నాము. ఈ విధిని(డ్రామాను) గురించిన జ్ఞానము వ్యక్తిని కర్మశీలునిగా చేస్తుంది, సోమరిగా చెయ్యదు. ఎందుకు? ఉత్సాహవంతముగా చేస్తుంది ఎందుకంటే ఈ చింతనే వ్యక్తిని అన్ని విధములైన చెడు ఆలోచనల నుండి ముక్తము చేస్తుంది. ఎప్పుడూ ఎవరి పట్లా ఈర్ష్య, ఘృణా భావాలను రానీయదు. నియతిని గురించిన ఆలోచన ద్వారా వ్యక్తి సోమరిగా అవ్వడు కాని సోమరితనము వ్యక్తి నియతిలో ఉంది. అలాగే కర్మశీలురుగా అవ్వడం కూడా నియతే. నియతి మరియు నియంతలను గురించిన ఈ సంతులిత చింతన(బ్యాలెన్స్‌గా ఆలోచించడం) మానవుని మనసును నిర్భయంగా, నిశ్చలంగా చేస్తుంది. నియతి(డ్రామా), భావము లేక ఈ సత్యచింతన

సాధకుని సమభావమును అత్యున్నత శిఖరము పైకి తీసుకెళ్తుంది. ఈ పృష్ఠ - భూమిలో(బ్యాక్ గ్రౌండ్) ఆలోచించడం వలన సాధకునికి అత్యంత దివ్యమైన జీవితము లభిస్తుంది. అందువలన సాధకునికి శుభాశుభ పరుధుల నుండి వెలుపలికి తీసుకెళ్ళగలిగిన ప్రజ్ఞా కిరణాలు ప్రస్ఫుటితమౌతాయి. నియతిని గురించిన ఈ చింతన సాధకుని రాగ ద్వేషాలతో, వ్యాకులతలతో విచలితము చెయ్యదు. అంతేకాక విఘ్నాలు కష్టాలనే పర్వత శ్రేణులెన్ని వచ్చినా అవన్నీ అత్యంత సమర్పిత భావములో సమాప్తమైపోతాయి. నియతి, నియంతల ఈ చింతన మానవుని మనస్సును అనేక దురాలోచనలు, ద్వంద్వములు, టెన్షన్‌ల నుండి ముక్తము చేసి 'నేను' అను అహం భావమును లేక కర్తా భావమును త్యాగము చేయమని శుభ(పావన) సందేశమునిస్తుంది. జరిగేది ఎలాగైనా జరుగుతుంది, జరగనిది ఎప్పుడూ జరగదు. శాంత చిత్తముతో కర్మలాచరించాలి. ఏ సమయానికి జరగాలో ఆ సమయానికి తప్పకుండా జరుగుతుంది, లేకుంటే జరగదు. అనుకూలము గాని, ప్రతికూలము గాని ఆ కర్మ ఫలితాన్ని నియంతకు(పరమాత్మకు) సమర్పించాలి. అందువలన నియతి(డ్రామా) సిద్ధాంతము మానవుని మనసును నిష్కాలుష్యముగా, తేజోమయమైన జ్ఞాన ప్రకాశముతో ప్రతి క్షణము వెలుగుతూ ఉండు మంగళకరమైన సందేశమునిస్తుంది. ఈ చింతన ఒక ప్రశాంతమైన సాగరము. అందులో వికారాల హాహాకారాల తుఫానులు శాంతించి అంతమైపోతాయి. ఒక పరమ శాంత స్నిగ్ధ వాతావరణము యొక్క సుగంధములో ఆత్మ లీనమైపోతుంది. నియతి, నియంతల ఈ రహస్యాన్ని సకారాత్మకంగా తెలుసుకొని ఏకరస స్థితిని పొందుకోవడం కూడా ఒక నియతియే. అర్థము చేసుకోగలిగితే చేసుకోండి. లేకుంటే అది కూడా నియతియే.



## " వాహ్ డ్రామా వాహ్ "

## వ్యాసము (లేఖ్) – 3

## సాక్షీ భావము

జీవిత లక్ష్యము - ఆనందాన్ని ప్రాప్తి చేసుకోవడం. అందుకొరకు అందరూ ప్రయత్నిస్తున్నారు. కాని ఆనందము కొరకు నిరంతరము ప్రయత్నిస్తున్నా ఈ రోజు మానవులందరూ దు:ఖము, అశాంతిగా ఉన్నారు. అందువలన మనిషికి జీవితము పట్ల గల దృష్టికోణము భ్రమించి తప్పుదారి పట్టిందని తప్పకుండా ఒప్పుకోవలసి వస్తుంది. ఆనందము పొందేందుకు మనము ఏ దారిని పట్టుకున్నామో, అందులో ముందుకు వెళ్ళే కొలది నిరంతరము దు:ఖమే లభిస్తూ ఉంటే, ఆగి నేను తప్పు దారిలో నడవడము లేదు కదా అని ఆలోచించి పరిశీలించుకునే అవసరముంటుంది. వాస్తవానికి మన జీవితము పట్ల మనకు యదార్థ దృష్టికోణము లేదు.

సృష్టి ఒక అత్యంత పెద్ద నాటక రంగము. దాని పై అనేక రకాలైన మనోరంజక నాటకము నడుస్తోంది. ఈ నాటకములోని ఆనందాన్ని అనుభవించేందుకు సాక్షీ భావము చాలా అవసరము. మనము ఎందులో లీనమౌతామో, మునిగిపోతామో అదే మన ప్రపంచమైపోతుంది, ఎందులో మనము సాక్షీ భావము ఉంచుకుంటామో అది నాటకమైపోతుంది. ప్రపంచానికి, నాటకానికి తేడా ఇంత మాత్రమే. ఈ వ్యత్యాసానికి మూలము దృష్టికోణమే. పచ్చ కామెర్ల రోగికి ప్రపంచమంతా పసుపు పచ్చగానే కనిపిస్తుంది, శ్రావణమాసములో గ్రుడ్డివానికి కూడా ఆకుపచ్చదనమే కనిపిస్తుంది. కళ్ళకు నల్ల కళ్ళజోడు పెట్టుకుంటే ఏ వస్తువైనా నల్లగానే కనిపిస్తుంది. ఎరుపు రంగు కళ్ళజోడు పెట్టుకుంటే అంతా ఎర్రగానే కనిపిస్తుంది. తాదాత్మ్యత(లీనమయ్యే) లేక ఆసక్తి గల మనోభావముంటే ప్రపంచము దు:ఖదాయకంగా, జటిలంగా, జంజాటమనిపిస్తుంది. సాక్షిగా ఉంటూ అనాసక్త మనోభావముంటే ఆనందదాయక నాటకమనిపిస్తుంది. అందువలన పరిస్థితిని కాక స్వస్థితిని మార్చుకునే పురుషార్థము చేయాలి.

సాక్షి స్థితిలో స్థితమైన వ్యక్తికి ఈ ప్రపంచము ఒక నాటకమైపోతుంది. వారు అనేక ఆత్మల వివిధ పాత్రలను చూచి సదా హర్షితమవుతూ ఉంటారు. మనోరంజనము కొరకు వారు ఏ నాటకశాలకు గాని, సినిమా హాలుకు గాని వెళ్ళే అవసరము ఉండదు. వారి ముందు సదా మనోహరమైన, మనసును రంజింపజేసే నాటకము నడుస్తూనే ఉంటుంది. మిత్రులు-శత్రువులు, స్వజనులు-పరజనుల విభిన్న ఆటను చూస్తూ వారు ఎల్లప్పుడూ తేలికగా, ప్రఫుల్లితంగా ఉంటారు. ఇందుకు విపరీతంగా అందులో లీనమయ్యే మనోభావముంటే నాటకము కూడా చిక్కుకునేలా చేయు ప్రపంచముగా అవుతుంది. నాటకములో కల్పిత పాత్రలతో తాదాత్మ్యత పొందే కారణంగా ఎంతోమంది సినిమా హాలులో కూర్చొని కన్నీరు కార్చి బరువెక్కిన హృదయాలతో బయటకు వస్తారు.

నాటకములోని పాత్రధారులకు, ఏ పాత్రను అభినయిస్తున్నామో దానికి భిన్నమైన వారమని వారికి సదా ఆంతరిక అనుభూతి ఉంటుంది. అందువలన వారు నాటకములోని సుఖ-దు:ఖాలకు అనాసక్తులుగా ఉంటారు. అంతేకాక అభినయములోని ఆనందాన్ని అనుభవిస్తారు. ప్రస్తుతము ఆత్మలమైన మనందరము కూడా ఈ సృష్టి నాటకానికి అత్యంత దూరంగా ఉండే బ్రహ్మలోక నివాసులము, జ్యోతిర్బిందు రూపులము. ఈ సృష్టి నాటకములో మనము శరీరాలను ధరించి పాత్రలు అభినయిస్తున్నాము. వాస్తవానికి మనము ఈ శరీరాలు కాము, శరీరానికి భిన్నమైన ఆత్మలము. ఆత్మలమైన మనము ఈ గొప్ప సృష్టి నాటకములో రకరకాల శరీరాలు ధరించి అనేక విధాలైన గెలుపు-ఓటముల మనోరంజక ఆటను ఆడుతున్నాము. ఈ సృష్టి నాటకములో పరమ ఆనందాన్ని అనుభవించేందుకు పరంధామము నుండి వచ్చాము అంతేగాని ఇందులో చిక్కుకొని దు:ఖపడేందుకు గాని, అశాంతి చెందేందుకు గాని రాలేదు. ఈ డ్రామాలో మనము శత్రువు-మిత్రుడు, తండ్రి-పుత్రుడు, పతి-పత్ని లేక ఇతర ఏ పాత్రనైనా పోషించవచ్చు, కాని ఆత్మ రూపములో మనమందరమూ నిరాకార పరమపిత పరమాత్మ శివుని సంతానమైనందున అందరమూ



సోదరులమే. అందువలన నాటకములోని అభినయము యొక్క ఏ ప్రభావమూ ఆత్మలమైన మన మూల సంబంధము పై పడరాదు. ఇదే జీవితములో యదార్థమైన దృష్టికోణము. దీనిని మర్చిపోయినందున మానవుని జీవితము ఇంత కఠినముగా, ఆపదలమయమై, దు:ఖము-అశాంతిమయమైపోయింది.

## సాక్షీ స్థితియే శాంతికి జనని

ఏ సిద్ధాంతమైనా సత్యమా కాదా తెలుసుకునేందుకు గీటురాయి, జీవితములో దాని ప్రభావము. ఆసక్తిపూర్వకమైన మనిషి జీవితము సదా చింతతో, టెన్షన్‌తో మరియు చిక్కులతో కూడి ఉంటుంది. అందుకు విపరీతంగా సాక్షి భావముతో ఉండే మనిషి సదా నిశ్చింతగా, తేలికగా, హర్షితంగా ఉంటాడు. అత్యంత కఠిన పరిస్థితిలో గాని, విపత్కర పరిస్థితిలో గాని విచలితునిగా అవ్వడం. వాటిని కూడా వైవిధ్యపూర్ణ నాటకములో ఒక భాగముగా భావించి, స్థిరంగా, అచలంగా ఉంటాడు. ఎవరైనా మిమ్మలను అవమానపరచినప్పుడు మీరు సాక్షిగా ఉండి - "ఈ ఆత్మ అజ్ఞాన వశమై చేస్తున్న ఈ తప్పు పనికి ఫలితంగా ఈ ఆత్మ దు:ఖము అనుభవించవలసి వస్తుంది" అని వారిని చూస్తూ ఉంటే, ఏ అవమానమైతే మొదట మిమ్ములను బాణము వలె గుచ్చుకొని బాధించిందో, ఇప్పుడది మిమ్ములను కొద్దిగా కూడా స్పర్శించదు. ఆ అజ్ఞాని ఆత్మ పట్ల మీ హృదయములో కోపానికి బదులు కరుణా భావము ఉదయిస్తుంది. కనుక ఏ కఠిన వాక్యాలైతే చాలా రోజుల నుండి మీ నిద్రను, విశ్రాంతిని పాడు చేశాయో ఇప్పుడవి మీ పై ఎలాంటి ప్రభావము చూపలేవు. మీ ఆత్మ కమలపుష్ప సమానంగా, మానావమానాలు, నింద-స్తుతి, సుఖ-దు:ఖాల నుండి సదా అతీతంగా ఉంటూ ఆనందంగా ఉంటుంది.

ఈ అనాదిలో నిశ్చితమైన సృష్టి నాటకము ఎంత కళ్యాణకారిగా, యుక్తియుక్తంగా, న్యాయపూర్వకంగా తయారు చేయబడిందంటే - ఎవ్వరూ ఎవ్వరికీ కారణము లేకుండా దు:ఖమివ్వరు. మనకు లభించే

సుఖ-దు:ఖములన్నీ అవన్నీ వారింతకు ముందు చేసిన కర్మల లెక్కాచారమే. అందువలన సాక్షీ భావము గల మనుష్యులు తమ కష్టాలను, దు:ఖమును తమ పూర్వ కర్మల ఫలముగా భావించి ప్రసన్నంగా ఉంటారు. ఎందుకంటే వీటి వలన మా వికర్మల ఖాతా సమాప్తమైపోతోందని, కర్మాతీత స్థితి వస్తూ ఉందని ప్రసన్నంగా ఉంటారు. దానితో పాటు సుఖప్రదమైన భవిష్యత్తు కొరకు వారు శ్రేష్ఠ కర్మలు చేయు పురుషార్థము కూడా చేస్తూ ఉంటారు. అనారోగ్యాన్ని, జబ్బులను వారు తమ కర్మభోగముగా భావించి, సాహస పూర్వకముగా, ప్రసన్నతాపూర్వకముగా సహిస్తారు. ఇతరులకు వారు ఒక ఉన్నతమైన ఆదర్శముగా ఉంటారు. కఠిన వ్యాధులలో కూడా వారు ఆనందంగా ఉంటూ పతితపావనులైన పరమపిత శివ పరమాత్ముని పావన స్మృతిలో ఉంటారు. వ్యాధులు కూడా వారికి కష్టమును కలిగించలేవు. అంతేకాక వారి వికర్మల ఖాతా కూడా త్వరగా సమాప్తమైపోతుంది.

కష్టాలు మన మనోభావాలను సూచిస్తాయి. మంచి మనోభావాలు గల మనుజుడు పర్వతము వంటి కష్టాలను కూడా ఆవగింజంత చిన్నవిగా చేసుకుంటాడు. అదే తప్పు మనోవృత్తి గల వారిగా ఉంటే దారిలోని ఆవగింజ కూడా పర్వతమై అడ్డుగా నిలుస్తుంది. వాస్తవానికి కష్టాలు మనకు సహనశీలత, నిర్భయత, హర్షితముఖతల పాఠాలను చదివించేందుకు వస్తాయి. కష్టాలను సంతోషంగా సహించే మన ఆత్మ అష్టశక్తి సంపన్నంగా, సర్వగుణ సంపన్నంగా అవుతుంది. కాని కష్టాలను చూచి భయపడేవారు సదా నిర్బలురుగానే ఉండిపోతారు. సాక్షి దృష్టి కలిగిన మనుష్యులు కష్టాలను సదా ఆహ్వానిస్తారు. అంతేకాక దారిలోని ఆటంకాలను (బండరాళ్లను) కూడా స్వర్గములోకి వెళ్లేందుకు మెట్లుగా భావిస్తారు. తుఫానులు వారికి దివ్యగుణాల తోఫాలను(బహుమతులను) తీసుకొని వస్తాయి. అలల తాకిడిని ఆనందంగా సహిస్తూ వారు రాయి నుండి విగ్రహంగా అవుతారు.

'సాక్షి' - ఈ రెండు అక్షరాలలో ధర్మ రహస్యము, ఆనంద రహస్యము దాగి ఉన్నాయి. ఎవరైతే జీవితములో సాక్షీ భావాన్ని అనుసరిస్తారో వారే



సత్యమైన ధార్మికులు. వారి జీవితాలు సంపూర్ణ ఆనందమయంగా ఉంటాయి. పరమాత్మ ఆనందసాగరులు ఎందుకంటే వారు సదా సాక్షిగా ఉంటారు. ఈ సృష్టి ఉత్థాన-పతనాల డ్రామాను వారు సాక్షిగా ఉండి చూస్తూ ఉంటారు. ఎందుకంటే జ్ఞాన సాగరములో సృష్టి నాటకము యొక్క ఆదిమధ్యాంతాల యదార్థ జ్ఞానముంది. మనుష్యాత్మలు కూడా సత్య-త్రేతా యుగాలలో ఆత్మాభిమానులుగా ఉన్నందున సుఖంగా ఉంటారు. ద్వాపర కలియుగాలలో సాక్షి భావాన్ని పోగొట్టుకొని చిన్న చిన్న విషయాలలో కూడా ఏమి? ఎందుకు? ఎలా? మొదలైన ప్రశ్నల వర్షము కురిపించారు. ఫలితంగా వారు ఘోరమైన దు:ఖము-అశాంతి పాలయ్యారు. ఇటువంటి సమయములో జ్ఞానసాగరులైన పరమాత్మ మనకు మళ్లీ అనాది, నిశ్చిత డ్రామా యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానమిచ్చి పూర్తి సాక్షిగా తయారు చేస్తున్నారు. సృష్టి నాటకాన్ని మరియు తమ సంకల్ప వికల్పాలను సాక్షిగా ఉండి చూచే మనుష్యులే సత్యమైన యోగులు.

## వాహ్ డ్రామా వాహ్ !

**18-01-1969**

ఈ రోజు వతనానికి వెళ్లినప్పుడు అక్కడకు చేరుకోగానే బాప్‌దాదా ఎదురుగానే కనిపించారు. కాని బ్రహ్మాబాబా మెడలో అనేక మాలలు చూశాను. బాబా నాతో - ఈ మాలలు తీసేసి చూడు! అని అన్నారు. నేను మాలలు తీసి చూడగా వాటిలో కొన్ని పెద్దవిగా, మరికొన్ని చిన్నవిగా ఉన్నాయి. వీటి రహస్యమేమిటి బాబా? అని అడిగాను. బాబా ఇలా చెప్పారు - బచ్చీ, ఇవి అందరి ఫిర్యాదుల మాలలు, ఆక్షేపణల మాలలు. ఎందుకంటే పిల్లలు ఏకాంతంలో కూర్చున్నప్పుడు బాబాకు స్నేహంలో ఫిర్యాదులే చేస్తారు. ప్రతి పుత్రుడు తండ్రికి ఫిర్యాదుల మాల తప్పకుండా ధరింపజేశాడు. బాబా అన్నారు - పిల్లలకు భలే డ్రామా గుర్తుంది. కాని అత్యంత ప్రియమైన వస్తువుగా అయితే తప్పకుండా ఉంది. కావున అనుకోకుండా డ్రామాలోని అద్భుతాన్ని చూసి ప్రతి పుత్రుడు లోలోపల మనసులోనే ఫిర్యాదులు చేస్తూ ఉంటాడు.

జ్ఞానమైతే పిల్లలకు ఉంది. కాని జ్ఞానముతో పాటు స్నేహము, ప్రేమ కూడా ఉన్నాయి. అందువలన ఈ ఫిర్యాదులు తప్పని అనను.

ఈ రోజు వతనంలోకి వెళ్తూనే అక్కడ శివబాబా, మన బ్రహ్మాబాబా ఇరువురూ కూర్చుని ఉండడం చూశాను. వారి ముందు చిన్న పర్వతం తయారై ఉండడం కూడా చూశాను. అదేమిటి? ఏమి చూశానంటే లెక్కలేనన్ని జాబుల(ఉత్తరాల) గుట్ట ఉంది. ఎన్ని జాబులు ఉన్నాయంటే, అవి ఒక పర్వతంగా అయిపోయాయి. నేను చేరుకోగానే, బ్రహ్మాబాబా నన్ను చూస్తూ - ఈశూ ఎక్కడ? చాలా జాబులైపోయాయి అని అన్నారు. అందుకు నేను - బాబా, నేను వచ్చాను అని చెప్పాను. ఈశూ బచ్చీని కూడా వెంట తీసుకొచ్చావు కదా! అని బాబా అన్నారు. చూస్తూ ఉండు, ఈశూ బచ్చీ, నేను ఇద్దరూ కలిసి రెండు నిమిషాల్లో జాబులన్నింటినీ పూర్తి చేస్తాము అని బ్రహ్మాబాబా అన్నారు. శివబాబా అయితే సాక్షిగా ఉండి చిరునవ్వు నవ్వుతూ ఉన్నారు. ఇంతలో ఈశూ బెహన్ కూడా అక్కడ ఎమర్జ్(ప్రత్యక్షం) అయ్యింది. ఈశూ ముఖం చాలా ప్రశాంతంగా ఉంది. బాబా అన్నారు - బచ్చీ, ఏమాలోచిస్తున్నావు? ఈ రోజయితే ఉత్తరాలకు జవాబు ఇవ్వాలి. ఆ సమయంలో సాకార వతన సంస్కారం పూర్తిగా ఎమర్జ్ అయ్యి ఉంది. మమ్మా నిల్చొని చూస్తూ ఉన్నారు. ఇంతలోనే శివబాబా బ్రహ్మాబాబాతో - మీరెక్కడున్నారు? వతనంలో కూర్చుని ఉన్నారా? అని అన్నారు. తర్వాత ఒక్క సెకండులోనే రూపం మారిపోయింది. బాబా ఏమీ అనలేదు. ఒక్కసారిగా గాఢమైన నిశ్శబ్ధంగా అయిపోయింది. ఇంతలో బాబా నాతో బచ్చీ, ఈ ఉత్తరాలన్నీ తెరచి చూడు అని అన్నారు. అప్పుడు నేను - బాబా, ఉత్తరాలైతే లెక్కలేనన్ని ఉన్నాయని అన్నాను. అప్పుడు బాబా, బచ్చీ! ఎన్ని ఉన్నా ఒక్క సెకండు పడ్తుంది ఎందుకంటే అన్నింటిలో ఒకే విషయం ఉందని అన్నారు. ఆ తర్వాత అన్ని ఉత్తరాలలో పిల్లల ఫిర్యాదులే ఉన్నాయని వినిపించాను. ఇప్పుడు చూడండి, బాబా పిల్లలకు రెస్పాండ్ (బదులు) ఇస్తారు. ఒక్క సెకండులో నేను అందరికీ ఎలా జవాబులు ఇచ్చేస్తానో చూడు అని అన్నారు. తర్వాత బాబా ఎర్రని అక్షరాలతో ఇక్కడ



వ్రాసినట్లే ఉత్తరం వ్రాశారు. ఉత్తరంలో ఇలా వ్రాశారు -

బ్రాహ్మణ కులభూషణ, స్వదర్శన చక్రధారి, ప్రకాశించే రత్నాలైన పిల్లలకు - సమాచారమేమంటే, పిల్లలందరి ఫిర్యాదుల ఉత్తరాలు సూక్ష్మవతనంలో నాకు లభించాయి. రెస్పాండ్‌లో(బదులుగా) బాప్‌దాదా పిల్లలకు చెప్తున్నారు - (డ్రామా భావి) నిశ్చితమైన డ్రామా బంధనంలో సర్వ ఆత్మలు బంధించబడి ఉన్నారు. అందరూ పాత్రను అభినయిస్తున్నారు. ఆ డ్రామా యొక్క మధురాతి మధురమైన బంధనానుసారంగా, ఈ రోజు అవ్యక్త వతనంలో పాత్రను అభినయిస్తున్నాను. పిల్లలందరూ హృదయ పూర్వకమైన, గాఢమైన ప్రేమతో అవ్యక్త రూపం ద్వారా చాలా చాలా చాలా ప్రియ స్మృతులను స్వీకరించండి. తండ్రి స్థితి ఎలా ఉందో పిల్లలు కూడా అలాంటి స్థితినే కలిగి ఉండాలి.

మళ్ళీ నేను బాబాతో, బాబా! మేమంతా బాబా ముందు ఉన్నట్లయితే బాబాను వెళ్ళకుండా ఆపేవారమని పిల్లలందరూ అంటున్నారని చెప్పాను. అప్పుడు బాబా - బచ్చీ, ఆపి ఉన్నట్లయితే ఇది డ్రామా ఎలా అవుతుంది అని అన్నారు. మళ్ళీ నేను బాబాతో - బాబా, ఇప్పటి ఈ దృశ్యం కృత్రిమంగా అనిపిస్తూ ఉంది, నిజమైన డ్రామాలాగ లేదని అన్నాను. అప్పుడు బాబా, బచ్చీ! స్నేహమనే మధురమైన తీగ జోడించబడి ఉన్న కారణంగా మీకు చివరి వరకు ఇది అద్భుతంగానే కనిపిస్తుంది మరియు ఇప్పటి వరకైతే సంబంధం ఉంది. భలే సాకార రథం వెళ్ళిపోయింది కాని బ్రహ్మా రూపంలో అవ్యక్త పాత్రను అభినయిస్తున్నారని అన్నారు. బాబా అన్నారు - నేను కూడా అప్పుడప్పుడు సాకార వతనంలోకి వెళ్ళిపోతూ ఉంటాను. అప్పుడు శివబాబా ఎక్కడ కూర్చుని ఉన్నావని అడుగుతారు. ఇక్కడ సాకార వతనంలో వలె కూర్చున్నాను, ఇక్కడ ఈ ఇల్లు తయారవుతోంది, అక్కడి వరకు వెళ్తాను అని అన్నారు. అప్పుడు నేను బాబాతో - బాబా, అప్పుడప్పుడు(మీరు) బాబా తిరుగుతూ ఉన్నట్లుగా అనిపిస్తుందని అన్నాను. అప్పుడు బాబా - నేను తిరుగుతూ ఉంటాను, అప్పుడు పిల్లలకు అనుభవమవుతూనే ఉంటుందని అన్నారు అనగా ఆత్మిక సంభాషణ జరుగుతూ ఉంది.

తర్వాత బాబా ఒక దృశ్యాన్ని చూపించారు. ఒక చక్రంలో అనేక చక్రాలున్నట్లు కనిపించింది. చక్రమెలా తయారయ్యిందంటే ఆ చక్రంలో నుండి వెలుపలికి వచ్చేందుకు 4-5 మార్గాలు కనిపించాయి. కాని బయటకు రాలేకపోయారు. కేవలం బ్రహ్మాబాబాను మాత్రమే చూపించారు. చక్రంలో తిరుగుతూ తిరుగుతూ పాయింట్(జీరో) వద్ద నిలబడిపోయారు. బయటకు రాలేదు. ఇది డ్రామా బంధనమని నాకు అర్థం చేయించారు. బ్రహ్మ కూడా డ్రామా చక్రం నుండి బయట పడలేరు. డ్రామా బంధనం నుండి ఎవ్వరూ బయట పడలేరు. ఆ జీరో పాయింట్ వరకూ చేరుకున్నారు అయినా మధురమైన డ్రామా బంధనముంది. ఈ మధురమైన బంధనాన్ని ఆట రూపంలో చూపించారు. తర్వాత పటిక బెల్లం(మిశ్రీ), బాదం తినిపించారు. ఇక వెళ్లు బచ్చీ, సమయమైపోయింది అని శెలవు ఇచ్చారు.

ఈ రోజు వతనంలోకి వెళ్లినప్పుడు ఎవ్వరూ కనిపించలేదు. దూరం నుండి ఏదో శబ్దం వస్తూ ఉంది. ఏదో ముఖ్యమైన కార్యం జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. ముందు నేను కొంచెం సేపు ఆగాను, తర్వాత ముందుకు వెళ్లి ఏమి చూశానంటే శివబాబా, బ్రహ్మాబాబా, మమ్మా మరియు విశ్వకిశోర్ నలుగురూ పరస్పరం మాట్లాడుకుంటున్నారు. వారి ముందు చాలా ప్లాన్లు ఉంచబడి ఉన్నాయి. అందులో కొన్ని గుర్తులు మొదలైనవి కనిపిస్తున్నాయి. మమ్మా పిల్లలందరి స్థితి - గతులను అడుగుతున్నారు. నేను మమ్మాతో - మమ్మా, మీరు బాబాను కూడా పిలిపించుకున్నారు అని అన్నాను. అప్పుడు మమ్మా - పిల్లల నుండి మాత-పితలను వేరు చేయడం నాకు కూడా ఇష్టం లేదు, కాని డ్రామా అని అన్నారు. అప్పుడు నేను బాబాతో - బాబా, ఈ ప్లాన్లు మొదలైనవి ఏమిటి? అని అడిగాను. అప్పుడు బాబా అన్నారు - బచ్చీ! ఎలాగైతే మార్షల్(సైనికాధికారి) వద్ద ఎక్కడెక్కడ ఏమేమి జరుగుతూ ఉందో, ఇక ముందు ఏమి జరగాలో మొత్తం ప్లాన్ అంతా ఉంటుందో, అలా ఇక్కడ కూడా స్థాపనా కార్యం గురించే మాట్లాడుకుంటున్నాము. దానిని తర్వాత వినిపిస్తాము.



**21-01-1969**

బ్రహ్మాబాబాతో స్నేహముంటే అందుకు గుర్తు ఏమి? రెండు కన్నీటి బిందువులు రాల్చడం స్నేహము కాదు. స్నేహమంటే బ్రహ్మాబాబాకు దేని పై స్నేహముండేదో దాని పై మీకు కూడా స్నేహముండాలి. బ్రహ్మాబాబాకు సేవ అంటే స్నేహము, చాలా ఇష్టము. చివర్లో కూడా సేవకు ఋజువునిచ్చారు కదా. కనుక స్నేహమంటే - సేవ పై ప్రేమ, అతడి ఆజ్ఞల పై ప్రేమ. ఇకపోతే మాకు తెలియకుండా పిల్లల నుండి శెలవు తీసుకోకుండా సాకార బాబాను వతనానికి ఎందుకు పిలుచుకున్నారని ఎవ్వరూ అనుకోకండి. శెలవు ఇమ్మంటే మీరు ఇచ్చేవారా? అందుకే డ్రామాలో ఇంతకు ముందు కూడా ఎవరెవరు వెళ్ళారో వారెవ్వరూ శెలవు తీసుకొని వెళ్లలేదు. కనుక బ్రాహ్మణ కుల డ్రామాలో ఈ పద్ధతి ఉందని అర్థం చేసుకోండి. డ్రామాలో ఏ పద్ధతి అయితే నిర్ణయించబడి ఉందో ఆ పద్ధతి ప్రకారమే జరిగింది. మీ అందరికి సాకార బాబా అంటే చాలా ప్రేమ ఉండేదని తెలుసు. ఉండేది అని కాదు, ఇప్పుడు కూడా ఉంది. ప్రేమ లేకుంటే ఈ సభలో ఎలా ఉంటారు? సాకారములో అనుసరించేందుకు వీరి శరీరమే ఉండేది, కనుక ప్రేమ ఎందుకుండదు? స్నేహముండేది, ఇప్పుడు కూడా ఉంది. ఇది తండ్రి-పిల్లల గుర్తు. సాకారము కూడా వతనములో మందహాసము చేస్తున్నాడు. పిల్లలకు ప్రేమ ఉంటే నాకెందుకు లేదు అయితే డ్రామాలో ఏ పాత్ర జరుగుతుందో అది కళ్యాణకారి అని అతనికి తెలుసు. అతడు చలించడు. అతడు పూర్తి అచలంగా, కదలకుండా స్థిరంగా ఉండేవాడు, ఇప్పుడు కూడా అలాగే ఉన్నాడు. అయితే పిల్లలైన మీ కంటే వెయ్యి రెట్లు ఎక్కువ స్నేహము అతనికి ఉంది. ఇప్పుడు స్నేహానికి ఋజువివ్వాలి. ఇది కూడా ఒక దాగుడుమూతల ఆట(దాచిపెట్టుకునే ఆట). కనుక విచార సాగర మథనము చెయ్యండి. ఆందోళనతో మథనము చేయకండి......... తీసుకున్న శక్తిని ప్రాక్టికల్‌లోకి తీసుకు రండి. చివరి నినాదము ఇదే - “భారతమాత శక్తి అవతారము”. కుమారుడు తండ్రిని ప్రత్యక్షము చేస్తాడు, డ్రామా చేయిస్తుంది. నేను పిల్లలను కలుసుకునేందుకు వస్తానని సాకార బాబా చెప్పాడు. ఒకవేళ ఈ రోజు

వచ్చి ఉంటే పిల్లలు కన్నీరు కార్చేవారు.

**22-01-1969**

ఈ డ్రామాను తండ్రి ప్రాక్టికల్‌గా రచించారని బాప్‌దాదా చెప్పారు. ఏ పిల్లల జీవన నావ తండ్రి జతలో ఉంటుందో ఆ నావ ఊగిసలాడదు. ఇప్పుడు మీరు పరీక్షలనే సముద్రములో పయనిస్తున్నారు. కనుక ఎవరి సంబంధము అనగా ఎవరి చెయ్యి బాప్‌దాదా చేతిలో ఉంటుందో వారి జీవితమనే నావ అటూ-ఇటూ ఊగదు, మునగదు. పిల్లలైన మీరు దీనిని డ్రామా అని భావించి నడుస్తూ ఉంటే ఆందోళనపడరు. అంతేకాక ఎవరి బుద్ధి అనే చెయ్యి, తోడు వదులుగా ఉంటుందో వారు కదులుతూ, ఊగిసలాడుతూ ఉంటారు. అందువలన పిల్లలు ముఖ్యంగా తమ బుద్ధి రూపీ చేతిని శక్తివంతముగా ఉంచుకునేందుకు గమనముంచాలి.

**23-01-1969**

ఈ రోజు నేను పిల్లలైన మీ అందరినీ అవ్యక్త రూపములో కలుసుకునేందుకు వచ్చాను. ఏ పిల్లలైతే అవ్యక్త రూపములో స్థితులై ఉంటారో, వారే ఇది అర్థము చేసుకోగలరు. పిల్లలైన మీరంతా అవ్యక్త రూపములో స్థితమై ఎవరిని చూస్తున్నారు? వ్యక్త రూపమునా? లేక అవ్యక్త రూపమునా? మీరు వ్యక్త స్థితిలో ఉన్నారా లేక అవ్యక్త స్థితిలో ఉన్నారా? వ్యక్తములో చూస్తే తండ్రిని చూడలేరు. ఈ రోజు అవ్యక్త వతనము నుండి మిమ్ములను కలుసుకునేందుకు వచ్చాను. అవ్యక్త వతనములో శబ్ధముండదు. కాని ఇక్కడ శబ్ధములోకి వచ్చాను. పిల్లలైన మీ అందరిలో ఏ సంకల్పము నడుస్తోంది? ఇప్పుడిది అవ్యక్త మిలనము. కల్పక్రితము వలె పిల్లలతో ఆత్మిక సంభాషణ నడుస్తోంది. ఆత్మిక సంభాషణ చేసేందుకు, పిల్లలైన మీతో కలిసేందుకు మధురమైన బాబా నన్ను పంపించారు. ఇంతకు ముందున్న నేను ఇప్పుడు కూడా ఉన్నాను. రెండు మూడు రోజుల ముందు మధురమైన బాబాతో ఆత్మిక సంభాషణ జరుగుతూ జరిగింది. అందులో ఏమి జరిగిందో మీకు తెలుసా? వతనాన్ని అనుభవము చేసేందుకు రెడీగా ఉన్నావా? అని నన్ను బాబా అడిగారు. నేనేమి జవాబు ఇచ్చి ఉంటాను?



బాబా, మీ ఆజ్ఞానుసారము ఎలా నడిపిస్తారో, ఎక్కడ కూర్చోబెడ్తారో, ఏ రూపములో కూర్చోబెడ్తారో అక్కడ కూర్చుంటాను అని చెప్పాను. బాప్‌దాదా మాకెందుకు తెలుపలేదు? అని పిల్లలకు సంకల్పము వస్తూ ఉండవచ్చు. నేను కూడా బాబాను అదే అడిగాను. అందుకు బాబా - " పిల్లలందరినీ కూర్చోబెట్టుకొని అడిగితే అనుమతినిస్తారా? నీవు కూడా పిల్లలను చూసి, సేవను చూసి పిల్లల స్నేహములోకి వచ్చేస్తావు. అందువలన తండ్రి ఏమి చేయించారో అదే డ్రామాలో నిర్ణయించబడింది అని అంటారు." వ్యక్త రూపములో లేరు గాని, అవ్యక్త రూపములో కలుస్తూనే ఉన్నారు. సేవ కూడా అలాగే వృద్ధి చెందుతూ ఉంది. పిల్లలు అలాగే స్మృతి చేస్తున్నారు కాని వ్యత్యాసమేమంటే అప్పుడు వ్యక్తములో అవ్యక్తముగా ఉన్నాడు, ఇప్పుడు అవ్యక్తముగానే ఉన్నాడు. ఇప్పుడితడు అవ్యక్తముగానే ఉన్నాడు.

### వీడ్కోలు సమయములో

డ్రామాలో పాత్ర ఏదైతే ఉందో అందులో ఏదో గుప్త రహస్యము నిండి ఉందని పిల్లలైన మీకు తెలుసు. ఏ రహస్యము నిండి ఉందో అది సమయానుసారము వినిపిస్తూ ఉంటాము. ఇప్పుడైతే మీ అదే స్మృతి-చిహ్నము ఏదైతే ఆకాశములో ఉందో దానిని ప్రపంచములోని వారు ఈ స్థూల కనులతో - భూమి పై ఉన్న ఈ నక్షత్రాలు ఎవరి శ్రీమతమును అనుసరిస్తున్నారు? అని చూస్తారు. ఎక్కువ సమయము అక్కడే కూర్చోవద్దు అని బాబా నాతో చెప్పారు. కనుక శెలవు.

**25-01-1969**

సమర్పణేమో అయ్యారు కాని ఇప్పుడు సమర్పణ స్థితి ఉన్నతమైపోయింది. ఎవరి శ్వాస శ్వాసలో స్మృతి ఉంటుందో వారినే సమర్పితమని అంటారు. ఒక శ్వాసలో కూడా విస్మృతి ఉండరాదు. ప్రతి శ్వాసలో స్మృతి ఉండాలి. అలా ఉండువారి గుర్తు ఏమి? వారి ముఖం పై ఏమి కనిపిస్తుంది? వారి ముఖము ఎలా ఉంటుందో తెలుసా? (హర్షిత ముఖము). హర్షితముఖము కాక ఇంకా ఏమైనా ఉంటుందా? ఎవరెంత

సహనశీలురుగా ఉంటారో వారిలో అంత శక్తి పెరుగుతుంది. ఎవరైతే శ్వాస శ్వాసలో స్మృతి కలిగి ఉంటారో వారిలో సహనశీలతా గుణము తప్పకుండా ఉంటుంది. సహనశీలురుగా ఉన్నందున ఒకటేమో హర్షితంగా ఉంటారు, రెండవది వారి ముఖములో శక్తి కనిపిస్తూ ఉంటుంది. వారి ముఖము పై నిర్బలత కనిపించదు. వారిలో నిర్బలత ఉండదు. అప్పుడప్పుడు ఏమవుతుందో, ఏమి చేయాలి.................... ఈ నిర్బలతా శబ్దాలు నోటి నుండి వెలువడరాదు. మనసులో సంకల్పము వస్తే నోటి నుండి కూడా అవే మాటలు వస్తాయి. కనుక మనసులో రాకూడదు. మన్మనాభవ, మధ్యాజీభవ. మన్మనాభవకు అర్థము చాలా నిగూఢము. ఎలాగైతే డ్రామా సెకండు సెకండు నడుస్తూ ఉంటుందో దానితో పాటు మానసిక స్థితి కూడా అలాగే డ్రామా పట్టాల పై చక్కగా నడుస్తూ ఉండాలి, కొద్దిగా కూడా పక్కకు కదలరాదు. సంకల్పములో గాని, వాచాలో గాని కదలిక(చంచలత) ఉండరాదు, స్థితి అలా ఉండాలి. డ్రామా పట్టాల పై నడుస్తూ ఉన్నారు, కాని అప్పుడప్పుడు నిలబడిపోతారు. అప్పుడప్పుడు నోరు, అప్పుడప్పుడు మానసిక స్థితి కదిలిపోతూ ఉంటుంది. మళ్లీ పట్టుకుంటారు. ఇది కూడా ఒక మచ్చగా ఏర్పడుతుంది.

అయినా ఒక మాట ఇంతవరకు కొంత వాచా వరకు వచ్చింది, ఆచరణలోకి రాలేదు. వాచా వరకు వచ్చి ఆచరణలో రానిదేది? ఇంతవరకు వినిపించిన డ్రామా అనే ఢాలు.

**02-02-1969**

ఇప్పుడు డ్రామాలోని దృశ్యాలు త్వరత్వరగా నడుస్తూ సమాప్తమైపోవాలని అందరి మనసులో ఉంది. అయితే త్వరగా అవుతుందా? అవ్వగలదా? అవుతుందా లేక అవ్వగలదా? తయారైన విధి - అది ఎలా తయారయిందో అలాగే ఉంటుంది. అయితే తయారైన విధిలో ఇలా కనిపిస్తుంది. కల్పక్రితము వలె సంకల్పము వస్తే సంకల్పముతో పాటు ఇంతకు ముందు కూడా పురుషార్థము తప్పకుండా తీవ్రంగా చేసి ఉంటారు. అప్పుడే కదా డ్రామా సీన్లు త్వరగా పూర్తి చేసుకొని అందరూ



అవ్యక్తవాసులై పోవాలనే సంకల్పము వస్తుంది. అందరూ అలా అవాల్సిందే.

బాప్‌దాదా అందరినీ తమ వెంట తీసుకెళ్తామని చెప్తూ ఉండినారు గదా, ఇప్పుడు వారేమో వెళ్లిపోయారే ఎలా? అని చాలామంది పిల్లల మనసులో ప్రశ్న తలెత్తుతూ ఉంది. కాని వెళ్లిపోయారా? ముక్తిధామానికి పిల్లలు లేకుండా, లేక ఊరేగింపు లేకుండా వెళ్లలేరు. సమూహము (ఊరేగిపు) లేకుండా ఒంటరిగా వెళ్లగలరా? ఊరేగింపు రెడీగా ఉందా? ఇంతవరకు సమూహము జతలోనే వెళ్తారని విన్నాము. ఇంకా పెళ్లివారు అలంకరించుకుంటూ ఉంటే ఒంటరిగా ఎలా వెళ్తారు? ఇప్పుడింకా సూక్ష్మవతనములోనే అవ్యక్త రూపములో స్థాపనా కార్యము జరుగుతూ ఉంటుంది. ఎంతవరకు స్థాపనా కార్యము సమాప్తమవ్వదో అంతవరకు కార్యము సఫలము చేయకుండా ఇంటికి వెళ్లరు. జతలోనే వెళ్తారు, తర్వాత ఏం చేస్తారు? ఏమి చేస్తారో తెలుసా? జతలో వెళ్తారు, జతలోనే ఉంటారు తర్వాత మళ్లీ జతలోనే సృష్టిలోకి వస్తారు. ఎప్పుడూ చేతిని, తోడును వదలము అని పిల్లల పాట ఉంది కదా. కనుక పిల్లలు కూడా ప్రమాణము చేశారు, తండ్రి కూడా మాటిచ్చారు. తండ్రి ఎప్పుడూ మాట తప్పరు. ఇంకా ఏవైనా ప్రశ్నలున్నాయా? సమయానుసారము ఎప్పటికప్పుడు అన్నీ స్పష్టమౌతూనే పోతాయి. అన్ని ప్రశ్నలకు సమాధానాలు లభిస్తూ పోతాయి. చాలామంది మనసులో(బ్రహ్మాబాబా) మళ్లీ జన్మిస్తారా? ఏమి జరుగుతుంది? అని ప్రశ్న కూడా మెదులుతూ ఉంటుంది. జన్మిస్తారా? మీ మమ్మా జన్మించినట్లు జన్మిస్తారా? మీ వివేకమేమని చెప్తుంది? డ్రామాలోని భావి ఏమిటో చూడగలరా? కొద్ది కొద్దిగా చూడగల్గుతున్నారా? మేము త్రికాలదర్శులైన తండ్రి పిల్లలమని మీరు అందరికీ చెప్తారు కదా, మరి జరగబోయే దాని గురించి తెలియదా? మీ మనసా వివేకమనుసారము ఏమి జరగాలి? మీరు అవ్యక్త స్థితిలో స్థితమై బ్రహ్మాబాబా జన్మిస్తారా? లేదా? అని అడిగితే జవాబు వచ్చేస్తుంది(ఈ విధంగా బాప్‌దాదా ముగ్గురు నలుగురిని ప్రశ్నించారు) మెజారిటీ వారు జన్మించరు అని జవాబునిచ్చారు. సమాధానము ఈ రోజే కావాలా లేక తర్వాతనా. ఈ ప్రశ్న వలన ఆందోళన

పడడం లేదు కదా. ఇది కూడా ఒక రచింపబడిన ఆట. చిన్న-చిన్న పిల్లలు కొలనులో రాళ్ళు వేస్తూ అలలు వస్తూ ఉంటే సంతోషంగా చూస్తూ ఆడుకుంటూ ఉంటారు. అలా ఇది కూడా ఒక ఆట. మీ అందరి విచార సాగరములో ప్రశ్నలనే రాళ్ళు వేసి మీ బుద్ధి రూపీ సాగరములో అలలు ఉత్పన్నము చేస్తున్నారు. ఆ అలల ఆటను బాప్‌దాదా చూస్తున్నారు. ఇప్పుడు మీ అందరి జతలో అవ్యక్త రూపములో స్థాపనా కార్యములో లగ్నమై ఉంటారు. స్థాపనా పాత్ర ఎంతవరకు ఉందో అంతవరకు అవ్యక్త రూపముతో మీ అందరి జతలోనే ఉంటారు. అర్థమయ్యిందా.

స్నేహాన్ని చూస్తే డ్రామా గుర్తుకొస్తుంది. మధ్యలో డ్రామా వచ్చినప్పుడు సైలెన్స్‌గా అయిపోతారు. స్నేహములోకి వస్తే స్థితి ఎలా అవుతుంది. నదిగా అయిపోతుంది. కాని అలా అవ్వరాదు. ఎందుకంటే డ్రామా. మనము ఏ కర్మ చేస్తామో మనలను చూచి అందరూ అదే చేస్తారు. కనుక సైలెన్స్‌గా (నిశ్శబ్ధముగా) ఉండండి. అందరూ జతలో ఉండి ఉంటే చివరి సమయములో కర్మాతీత స్థితి ఏదైతే అనుభవమయ్యిందో అది డ్రామానుసారము వేరుగా ఉండేది. కాని డ్రామాలో అలాగే ఉంది. అందువలన కొంతమంది మాత్రమే(బ్రహ్మబాబా) ముందుండినారు. ముందు ఉండినా లేనట్లే ఉన్నారు. స్నేహమైతే వతనములో కూడా ఉంది, ఇక ముందు కూడా ఉంటుంది. అవినాశి కదా. కాని స్నేహాన్ని డ్రామా సైలెన్స్‌లోకి తీసుకొస్తుందని వినిపించాము కదా. అదే సైలెన్స్ శక్తిని తీసుకొస్తుంది. తర్వాత మళ్లీ సాకారములో మిలనము జరుగుతుంది. ఇప్పుడు అవ్యక్త రూపములో కలుస్తారు. తర్వాత సాకార రూపములో సత్యయుగములో కలుస్తారు. ఆ దృశ్యము గుర్తు వస్తోంది కదా. ఆడుకుంటారు, పాఠశాలకు వచ్చి కలుస్తారు...... కంటి పాపలైన మీరు వతనములో సత్యయుగ దృశ్యాలు చూస్తూ ఉంటారు. తండ్రి ఏదైతే చూస్తారో అది పిల్లలు కూడా చూస్తూ ఉంటారు, ఇంకా చూస్తూ పోతారు.

**15-02-1969**

ఇదింకా చదువుకునే సమయము. తండ్రి తమ కర్తవ్యము



చేస్తున్నారు. ఆదేశాలనిస్తారు, చదివిస్తారు. ఎంతవరకు చదివించాలో అంతవరకు చదివిస్తూనే ఉంటారు. వినాశనము మీ ముందే నిలబడి ఉంది, దాని సంబంధము తండ్రితో ఉంది. తండ్రి వదిలి వెళ్ళిపోయాడని భావించకండి. విడిపోలేదు, వీడ్కోలు కూడా కాదు. ఎంతవరకు వినాశనము జరగదో అంతవరకు తండ్రి మీ జతలోనే ఉంటారు. ఏదో పని ఉండి తండ్రి వతనానికి వెళ్ళారు. సమయానుసారము ఆ పనులన్నీ జరుగుతూనే ఉంటాయి. ఇందులో వీడ్కోలూ లేదు, విడిపోవడమూ లేదు. విడిపోయినట్లు అనిపిస్తుందా? మీరు వీడ్కోలు ఇచ్చారా? వీడ్కోలు ఇచ్చి ఉంటే విడిచి కూడా వెళ్ళేవారు. వీడ్కోలు ఇచ్చి ఉండకపోతే విడిచి కూడా వెళ్లరు. డ్రామాలో ఈ పాత్ర నడుస్తూ ఉంటుంది. తండ్రి ఆట(లీల) నడుస్తూ ఉంది. ఆటలో ఆట నడుస్తూ ఉంటుంది. పోను పోను చాలా ఆటలు చూడాలి. అంత ధైర్యముందా? ధైర్యముంటే చాలా చూస్తారు. ముందు ముందు చాలా చూడవలసి వస్తుంది. అయితే ప్రతి అడుగు చాలా చాలా సంభాళించుకుంటూ వెయ్యాలి. అలా సంభాళించుకుంటూ అడుగు వెయ్యకుంటే ఎక్కడైనా గుంతలూ వస్తాయి, ప్రమాదాలూ జరుగుతాయి. పిల్లలను కలుసుకునేందుకు కొంత సమయము కొరకు వచ్చాను. చెయ్యవలసిన పనులు చాలా ఉన్నాయి. వతనము నుండి చాలా చెయ్యవలసి వస్తుంది. పిల్లల మనసును కూడా తృప్తిపరచాల్సి ఉంటుంది. భక్తుల మనసు కూడా పూర్తి చెయ్యవలసి వస్తుంది. అన్ని పనులు సంగమ యుగములోనే జరుగుతాయి. తండ్రి పరిచయము లభించింది, ఖజానా లభించింది, లాటరి లభించింది. ఇప్పుడు పిల్లల సేవ పూర్తి అయ్యింది. ఇప్పుడు వతనము నుండి అందరి సేవ చెయ్యాలి. స్వంత పిల్లలూ ఉన్నారు, సవతి పిల్లలూ ఉన్నారు. అందరి సేవా చెయ్యాలి. ఉదయము కూడా వచ్చి దృష్టి ద్వారా పరిచయమిచ్చేశాను. దృష్టి ద్వారా సర్చిలైటు ఇచ్చి అందరికి సుఖమివ్వడం తండ్రి కర్తవ్యము.

**04-03-1969**

సంగమ యుగములో మీ ముఖ్య శృంగారము కూడా మస్తకం

పై ఆత్మ దీపం వెలిగించడం. దీనికి గుర్తుగానే బల్బు వెలిగిస్తారు. కానీ ఇవన్నీ జరిగేందుకు హోలీ అర్థమును గుర్తుంచుకోవాలి. హోలీ - ఏదైతే జరిగిందో అది జరిగిపోయింది, అయిపోయింది. ఏ దృశ్యం అయిపోయిందో అది హో - లీ(అయిపోయింది) అనగా గడిచిపోయింది. వర్తమాన సమయములో ఏ పాయింటును గమనముంచుకోవాలంటే ఈ హోలీ పాయింటును అనగా డ్రామా డాలును గుర్తుంచుకోవాలి. ఎప్పుడైతే ఇలా దృఢంగా అవుతారో అప్పుడు ఆ రంగు కూడా పక్కాగా అంటుకోగలదు. హోలీ అర్థాన్ని జీవితంలోకి తీసుకురానట్లయితే రంగు కచ్చాగా అయిపోతుంది. పక్కా రంగు అంటుకునేందుకు ప్రతి సమయంలో - అయిపోయిందేదో అయిపోయింది, గడచినదేదో గడచిపోయింది అని అనుకోండి. ఇలాంటి హోలీ జరుపుకుంటున్నారా? లేక అప్పుడప్పుడు డ్రామా దృశ్యం చూసి ఏదైనా ఆలోచన నడుస్తుందా? జ్ఞాన మథనం చేయడం వేరు. కాని డ్రామా దృశ్యాన్ని మథనం చేయడం - ఏమిటి? ఎందుకు? ఎలా?........... ఇలాంటి మథనాన్ని ఏమంటారు? పెరుగును మథనం చేస్తే వెన్న వస్తుంది. నీటిని మథనం చేస్తే ఏమొస్తుంది? ఏమీ రాదు. రిజల్టులో వచ్చేదేమంటే - ఒకటి అలసట, రెండవది సమయం వృథా అవ్వడం. అందువలన దీనిని నీటిని మథనం చేయడం అని అంటారు. ఇలాంటి మథనం చేసేందుకు బదులు జ్ఞాన మథనం చేయండి.

**28-11-1969**

ఒకవేళ గడిచిపోయిన విషయాలను ఆలోచిస్తూ ఉంటే అది కూడా ఒక సమస్యగా అవుతుంది. సమస్యలైతే చాలానే వస్తాయి. ఇది కూడా ఒక కొత్త సమస్యగా మారుతుంది. గడిచిన దానిని పరివర్తన చేయాలంటే కావలసిన బలాన్ని నింపుకునేందుకు ఆ రూపంతోనే ఆలోచించండి. ఒకవేళ ఎందుకు? ఎలా జరిగింది? ఇప్పుడు ఎలా జరుగుతుంది? జంప్ చేయగలనా? దాటుకోగలనా? లేదా? అని ప్రశ్నించుకోవద్దు. ప్రశ్నార్థకానికి బదులు బిందువు(ఫుల్‌స్టాప్) పెట్టండి. బిందువు పెట్టడం సులభం కదా. ప్రశ్నార్థకం కొందరికి వ్రాయడం వస్తుంది,



కొందరికి రాదు. కాని ఇక్కడ ప్రశ్నలు వేయడం అందరికీ వచ్చు! బిందువు ఉంచుతూ వెళ్ళినట్లయితే బిందు రూపంలో స్థితము అవ్వగలరు.

**17-05-1969**

సత్యయుగంలో ఆట బొమ్మలు ఎలా ఉంటాయి? అక్కడ రత్నాలతో ఆడుకుంటారు. మీరు సత్యయుగీ సుఖాల లిస్టును, కలియుగీ దు:ఖాల లిస్టునైతే పూర్తి చేశారు(అనుభవించారు). కాని సంగమ యుగ సుఖాల లిస్ట్ తయారు చేసుకుంటే దీని కంటే రెండింతలు అవుతుంది. అదే సత్యయుగీ సంస్కారాన్ని ఇప్పుడు నింపుకోవాలి. ఏ విధంగా చిన్న పిల్లలు రోజంతా ఆటలలోనే మునిగి ఆనందంగా ఉంటారో, ఏ విషయం గురించీ చింత ఉండదో, అదే విధంగా ప్రతి సమయం సుఖాల లిస్ట్, రత్నాల లిస్ట్ బుద్ధిలో పరుగులు తీయించండి లేక ఈ సుఖాలనే రత్నాలతో ఆడుకుంటూ ఉన్నట్లయితే ఎప్పుడూ డ్రామా ఆటలో ఓడిపోరు. ఇప్పుడైతే అక్కడక్కడ ఓటమి కూడా జరుగుతూ ఉంటుంది.

**26-06-1969**

ఇది రెండవ ప్రశ్న. మీ హోంవర్క్ ఏదైతే నడుస్తూ ఉందో, విశేషంగా దాని పై గమనమిప్పిస్తాను. ఈ పాత్ర డ్రామానుసారంగా జరిగింది. సాకార రూపాన్ని అవ్యక్త రూపంగా ఎందుకు చేశారు? ఇందుకు కూడా చాలా గుహ్య రహస్యాలు ఉన్నాయి. దీని లోతుల్లోకి వెళ్ళండి. కేవలం సముద్రపు అలలలోనే స్నానం చేయడంలో నిమగ్నం అవ్వకండి. కానీ సాగరం లోతుల్లోకి వెళ్ళండి. అక్కడ ఏ రత్నాలు లభిస్తే అవి తీసుకు రండి. దీని గుహ్య రహస్యం డ్రామాలో ఏమి ఫిక్స్ అయ్యి ఉంది! ఏదైనా గుహ్య రహస్యముందా? అని ఆలోచించండి. ఏ రహస్యమూ లేకుండా ఎలాంటి నడవడిక జరగనే జరగదు. మంచిది. ఇప్పుడు సమయం అయిపోయింది.

**06-12-1969**

ఈ రోజు సభలో ఏ విశేషమైన సుగంధమూ ఉంది, విశేషమైన ఆకర్షణ కూడా ఉంది? స్నేహమైతే అందరికీ ఉంది. మిమ్ములను ఎందుకు

పిలిపించాను? వచ్చిన వారందరూ వాపసు వెళ్లేందుకు తయారై వచ్చారా? ఎవరైతే ఎవరెడీగా ఉంటారో వారు సదా తయారుగానే ఉంటారు. పిలుపు వచ్చింది, ఒక్క సెకండులో తమదంతా సర్దుకోనూ గలరు, జంప్ కూడా చేయగలరు. ప్రత్యక్షంగా కూడా డ్రామా పిలుపు పై వెళ్లేందుకు ఎంత సమయం పట్టిందో చూచారు కదా. ఒకవైపు సర్దుకోవడం, మరొకవైపు హైజంప్ చేయడం ఈ రెండు దృశ్యాలను చూచారు. ఇది డ్రామాలో ఎందుకు జరిగింది? నేర్పించేందుకు. కావున ఇలా ఎవరెడీగా అవ్వవలసి ఉంటుంది. ఇప్పుడు ఎవరెడీ లైన్ మొదలైపోయింది. ఈ లైనులో ఎవరి నెంబర్ అయినా రావచ్చు. అందరి సంకల్పంలో ఏదైతే ఉందో అది ఎప్పటికీ జరగదు. జరిగినా అప్రయత్నంగా జరుగుతుంది. బ్రాహ్మణ కులము యొక్క ఈ పద్ధతి, ఆచారము మొదలయ్యింది. ఈ పద్ధతి, ఆచారము కూడా డ్రామాలో ఎందుకు తయారయ్యింది? దీనికి కూడా చాలా గుప్తమైన రహస్యముంది. కనుక ఇలాంటి పురుషార్థం ముందు నుండే చేసుకోండి - వెంటనే సర్దుకోగలగాలి, జంప్ కూడా చేయగలగాలి. సర్దుకునే శక్తి ఎవరిలో ఉంటుంది? ఎవరైతే సరళ స్వభావం కలిగిన వారుగా ఉంటారో వారిలో సర్దుకునే శక్తి సహజంగా వస్తుంది. సరళ స్వభావం కలిగిన వారు సర్వుల సహయోగులుగా కూడా ఉంటారు. ఎవరైతే అందరికీ స్నేహీలుగా ఉంటారో వారికి అందరి ద్వారా సహయోగం ప్రాప్తి అవుతుంది. అందువలన అన్ని విషయాలను ఎదుర్కోవడం, సర్దుకోవడం సహజంగా చేసుకోగలరు. స్వభావం ఎంత సరళంగా ఉంటుందో మాయ అంత తక్కువగా ఎదుర్కొంటుంది. వారు అందరికీ ప్రియమనిపిస్తారు. సరళ స్వభావం గలవారికి వ్యర్థ సంకల్పాలు ఎప్పుడూ నడవవు, సమయం వ్యర్థంగా పోదు. వ్యర్థ సంకల్పాలు నడవని కారణంగా వారి బుద్ధి విశాలంగా, దూరదేశిగా ఉంటుంది. అందువలన వారిని ఏ సమస్యా ఎదుర్కోలేదు. ఎంత సరళత ఉంటుందో, అంత స్వచ్ఛత కూడా ఉంటుంది. స్వచ్ఛత అందరినీ తమ వైపు ఆకర్షిస్తుంది. స్వచ్ఛత అనగా సత్యత మరియు శుభ్రత. స్వభావాన్ని సరళంగా చేసుకున్నప్పుడు సత్యత, స్వచ్ఛత ఉంటాయి. సరళ స్వభావం కలిగినవారు



బహురూపులుగా కూడా అవ్వగలరు.

ఈ మధువనానికే అలాంటి ఇలాంటి వారెవ్వరూ కాలు పెట్టలేరనే మహిమ ఉంది. మధువనము సౌభాగ్యరేఖ. దీని లోపల ఇతరులెవ్వరూ పాదాలు పెట్టలేరు. మీ అందరికి బాప్‌దాదా అర్థం చేయిస్తున్నదేమంటే, ఇది స్నేహపు రేఖ. ఈ స్నేహ వలయంలో బాప్‌దాదా నివసిస్తారు. భలే తమ తలను సమర్పించేందుకు సిద్ధపడినా, దీని లోపలికి ఎవ్వరూ రాలేరు. సాకార రూపంలో స్నేహం లభించడం చిన్న విషయమేమీ కాదు. ఆ స్నేహం కొరకు ముందు ముందు ఎప్పుడైతే ఏడ్వడం చూస్తారో అప్పుడు మీకు దాని విలువ తెలుస్తుంది. వెక్కి వెక్కి ఏడుస్తూ మీ చరణాల పై పడ్తారు. ఒక్క స్నేహ బిందువుకు దప్పికగొని మీ చరణాల పై పడ్తారు. మీరు స్నేహ సాగరుడినే మీలో ఇముడ్చుకున్నారు. వారు ఒక్క బిందువుకు కూడా దప్పికగొని ఉంటారు. ఇలాంటి సౌభాగ్యం ఎవరికి ఉంటుంది? సర్వ సంబంధాల సుఖము, సారము ఏదైతే ఆత్మలైన మీలో నిండి ఉందో అది ఇతరులెవ్వరిలో ఉండజాలదు. కావున డ్రామాలో ఇంత ఉన్నతమైన భాగ్యాన్ని సదా మీ ఎదురుగా ఉంచుకోండి. ఎదురుగా ఉంచుకున్నట్లయితే రిటర్న్ ఇవ్వాలని దానంతకదే జ్ఞాపకం వస్తుంది.

**18-01-1970**

ఈ సంవత్సరంలో మొదట ఏ పరీక్ష జరిగింది? ఈ నిశ్చయ పరీక్షలో ప్రతి ఒక్కరు ఎన్నెన్ని మార్కులు తీసుకున్నారో అది ఎవరిది వారికి తెలుసు. నిశ్చయం కొరకు అయితే పరీక్ష జరిగిపోయింది. ఇప్పుడు ఏ పరీక్ష జరుగుతుంది? పరీక్ష గురించి తెలిసి కూడా ఫెయిల్ అవుతారు. కొంతమందికి ఇది పెద్ద పేపర్. కాని కొంతమందికి ఇప్పుడు పెద్ద పేపర్ రావలసి ఉంది. ఎలాగైతే ఈ పేపర్‌లో నిశ్చయానికి పరీక్ష జరిగిందో అలాగే ఇప్పుడు ఏ పరీక్ష జరగాలి? వ్యక్తంలో కూడా ఇప్పటికీ తోడున్నారు. ఎలాగైతే మొదట కూడా నిమిత్తంగా ఉన్న సాకార శరీరం తోడుగా ఉండేదో అలాగే ఇప్పుడు కూడా డ్రామాలో నిమిత్తంగా ఉన్నవారు సాకారంలో తోడుగా ఉన్నారు. ఇంతకు ముందు కూడా నిమిత్తమైనవారే ఉన్నారు. ఇప్పుడు కూడా

నిమిత్తమైనవారే ఉన్నారు. ఈ పూర్తి పరివారము యొక్క సాకార సహకారం చాలా శ్రేష్ఠమైనది. అవ్యక్తంగా అయితే తోడుగా ఉండనే ఉన్నారు. ఎంత స్నేహం ఉంటుందో, అంత సహయోగం కూడా లభిస్తుంది. స్నేహం యొక్క లోపం కారణంగా సహయోగం కూడా తక్కువగా లభిస్తుంది. సాకారంతో స్నేహం అనగా మొత్తం వృక్షంతో స్నేహం. సాకారుడు ఒంటరిగా లేరు. ప్రజాపిత బ్రహ్మ ఉంటే వారితో పరివారం కూడా ఉన్నారు. మాలలో పూసలు కదా. మాలలో ఒక్క పూస మాత్రమే ఉండదు కదా. ఒక విధంగా మీరు కూడా మాలలో స్నేహ సూత్రంలో కూర్చబడి ఉన్నారు. దైవీ కులం భవిష్యత్తులో ఉంటుంది. ఈ బ్రాహ్మణ కులానికి చాలా మహత్యముంది. ఇప్పుడు ఎంతెంతగా బ్రాహ్మణ కులంతో స్నేహం మరియు సమీపత ఉంటుందో దైవీ రాజ్యంలో అంత సమీపత ఉంటుంది.

**22-01-1970**

విన్న మాటలను వర్ణన చెయ్యడం కొంచెం కష్టంగా ఉంటుంది. కాని చూసిన దానిని వర్ణన చేయడం సులభమవుతుంది, స్పష్టంగా ఉంటుంది. ఈ దివ్య నేత్రం లేక అవ్యక్త నేత్రాల ద్వారా ప్రతి ఒక్కరి మూడు రూపాలను కూడా అంత సహజంగా వర్ణన చేయడం జరుగుతుంది. అలాగే మీ అందరికీ ఒకరి మూడు రూపాలు మరొకరికి కనిపిస్తాయి. ఇప్పుడు యథా యోగ్యత - యథా శక్తి ఉంది. కాని కొంత సమయం తర్వాత ఈ యథాశక్తి అనే శబ్ధం కూడా సమాప్తమైపోతుంది. ప్రతి ఒక్కరు తమ-తమ నెంబరు అనుసారంగా సంపూర్ణతను ప్రాప్తి చేసుకుంటారు. ఇప్పుడు బాప్‌దాదా మీ అందరి సంపూర్ణ రూపాలను చూస్తున్నారు. సంపూర్ణత నెంబరువారుగా ఉంటుంది. మాలలో 108 పూసలెవరైతే ఉన్నారో అందులో నెంబర్‌వన్ పూసను, 108వ పూసను ఇరువురినీ సంపూర్ణులని అంటారా? అనరా? విజయీ రత్నాలని అంటారా? విజయీ రత్నం అనగా తమ నెంబరు అనుసారంగా సంపూర్ణత ప్రాప్తమై ఉండాలి. వీరి కోసం మొత్తం డ్రామాలో అదే సంపూర్ణతకు మొదటి స్టేజి(స్థితి). ఎలాగైతే సత్యయుగంలో 8వ రత్నం కూడా విశ్వమహారాజు అని పిలిపించుకుంటారు కదా. కాని మొదటి



నెంబరు విశ్వ మహారాజు సృష్టిలో అనుభవించు సంపూర్ణ సుఖానికి, 8వ నెంబరు వారికి గల సంపూర్ణ సుఖానికి తేడా ఉంటుంది కదా! అదే విధంగా ఇక్కడ కూడా ప్రతి ఒక్కరు తమ తమ నెంబరు ప్రమాణంగా సంపూర్ణతను ప్రాప్తి చేసుకుంటున్నారు. అందువలన బాప్‌దాదా సంపూర్ణ స్టేజిని, వర్తమాన సమయంలో పురుషార్థాన్ని చూస్తూ ఉంటారు. ఇప్పుడెలా ఉన్నారు? ఎలా అవుతారు?

అవ్యక్త కలయిక కూడా కలయికనే. అందువలన అందరూ ఈ నిశ్చయం ఉంచుకోవాలి - మేము రాజ్యపదవి తప్పకుండా తీసుకుంటాము. మేము అవ్వకపోతే ఇంకెవరవుతారు? కోట్లలో కొద్దిమంది అని ఎలాంటి ఆత్మలను లెక్కిస్తారు? డ్రామాలో ఇటువంటి కోట్లలో కొద్దిమంది ఆత్మలలో మేమున్నాము. ఈ నిశ్చయం మీరు ఎప్పుడూ మర్చిపోకండి. బాప్‌దాదా పిల్లలందరి భవిష్యత్తును చూచి సంతోషపడ్తారు. ఒక్కొక్కరితో కలవాలని మనసులో ఉంది. కాని మీ అందరికీ ఈ వ్యక్త ప్రపంచం ఉన్నట్లు బాప్‌దాదాకు వ్యక్త ప్రపంచం లేదు. కాబట్టి మీ ప్రపంచం అనుసారంగా సమయాన్ని కూడా చూడాల్సి వస్తుంది. వతనంలో సమయం చూచే పని ఉండదు. గడియారం ఉండదు. కాని ఈ వ్యక్త ప్రపంచంలో ఇవన్నీ చూడాల్సి ఉంటుంది. అక్కడ సూర్య చంద్రులే ఉండరు. కనుక రాత్రి-పగలు ఏ లెక్కతో ఉంటాయి? అందువలన అక్కడ సమయం యొక్క బంధన ఉండదు.

**26-01-1970**

మథనం చేయడానికైతే చాలా ఖజానా ఉంది. ఇందులో మనసును బిజీగా ఉంచుకోవాలి. సమయ వేగము తీవ్రంగా ఉందా లేక మీ పురుషార్థ వేగము తీవ్రంగా ఉందా? ఒకవేళ సమయం వేగంగా వెళ్తూ పురుషార్థం బలహీనంగా ఉంటే ఫలితం ఏమవుతుంది? సమయం ముందుకు వెళ్ళిపోతుంది. పురుషార్థులు ఉండిపోతారు. సమయం అను బండి తప్పిపోతుంది. ప్రయాణీకులు ఉండిపోతారు. సమయంలో ఎలాంటి వేగాన్ని చూస్తున్నారు? సమయంలో గతించిన దానిని గతింపజేసే తీవ్రత ఉంది. అదే మాటను సమయం మళ్ళీ ఎప్పుడైనా రిపీట్ చేస్తుందా? కనుక

పురుషార్థంలో లోపాలేవైతే ఉన్నాయో, అయిపోయిందేదో అయిపోయింది అని భావించి రాబోయే ప్రతి సెకండు ఉన్నతి అవుతూ పోండి. అప్పుడు సమయంతో సమాన వేగంతో వెళ్ళగలరు. సమయం రచన కదా. రచనలో ఈ గుణం ఉంటే రచయితలో కూడా ఉండాలి. డ్రామా రచన అయితే మీరు రచయితకు పిల్లలు కదా. కనుక రచయిత పిల్లలైన మీరు రచన కంటే బలహీనంగా ఎందుకు ఉన్నారు? అందుకు కేవలం ఒక్క విషయం పై గమనముంచండి. ఏ విధంగా డ్రామాలో ప్రతి క్షణం అనగా ఏదైతే గడచిపోయిందో, ఏ రూపంలో గడచిపోయిందో అది మళ్లీ రిపీట్(పునరావృతం) కాదు. మళ్లీ 5000 సంవత్సరాల తర్వాతనే రిపీట్ అవుతుంది. అలాగే బలహీనతలను మాటిమాటికీ ఎందుకు రిపీట్ చేస్తారు? ఈ బలహీనతలు పునరావృతం అవ్వకుండా ఉంటే పురుషార్థము వేగంగా జరుగుతుంది. ఎప్పుడైతే బలహీనతలు సర్దుకుంటాయో అప్పుడు ఆ స్థానంలో బలహీనతలకు బదులు శక్తి నిండుతుంది. ఒకవేళ బలహీనతలు రిపీట్ అవుతూ ఉంటే శక్తి నిండదు. అందువలన గడిచిపోయిందేదో గడిచిపోయింది. గడిచిపోయిన బలహీన మాటలు సంకల్పంలో కూడా రారాదు. ఒకవేళ సంకల్పంలో వస్తే మాట మరియు కర్మలోకి కూడా వచ్చేస్తాయి. సంకల్పంలోనే సమాప్తం చేస్తే మాట-కర్మలోకి రావు. అప్పుడు మనసు-మాట-కర్మ మూడూ శక్తిశాలిగా అయిపోతాయి. చెడు వస్తువులను సదా వెంటనే విసిరి పడేస్తారు. మంచి వస్తువులను ఉపయోగించుకుంటారు. కనుక చెడు వస్తువులను విసిరి పడేసినట్లుగా చెడు మాటలను కూడా విసిరి పడేయండి. అప్పుడు సమయం పురుషార్థం కంటే వేగంగా వెళ్ళదు. అప్పుడు మేము తయారుగా కూర్చున్నాము, సమయం కొరకు ఎదురు చూస్తున్నాము అని అంటారు. సమయం రాగానే మేము వెళ్ళిపోతాము - ఇలాంటి స్థితి ఉంటుంది. ఒకవేళ మీరు తయారుగా లేకుంటే సమయం మా కోసం కొంచెం ఆగిపోతే బాగుంటుందని ఆలోచిస్తారు.



**05-03-1970**

ఇప్పుడు పిల్లలైన మీ వద్ద ఎలాంటి క్యూ ఉంది. ఎప్పుడైతే 'ఈ క్యూ' సమాప్తమైపోతుందో 'ఆ క్యూ' మొదలవుతుంది. ఇప్పుడు ఏ క్యూ ఉందో మీకు తెలుసా? (సంకల్పాల క్యూ) అందులో కూడా ముఖ్యంగా పురుషార్థాన్ని బలహీనపరచే సంకాల్పాలు ఏవి? వ్యర్థ సంకల్పాలు. వ్యర్థ సంకల్పాలకు మూల కారణం ఏది? పాత సంస్కారాలు ఏ రూపంలో వస్తాయి? వ్యర్థ సంకల్పాల బీజం ఏ ఒక్క శబ్ధంలో వస్తుందో చెప్పండి. వ్యర్థ సంకల్పాలు లేక వికల్పాలు నడుస్తూ ఉంటే బుద్ధిలో ఒకే శబ్ధం(మాట) వస్తూ ఉంటుంది. "ఇది ఎందుకు జరిగింది? 'ఎందుకు' అనే శబ్ధంతో వ్యర్థ సంకల్పాల క్యూ మొదలవుతుంది. మీరు గమనిస్తే ఆంగ్ల భాషలో కూడా ఎందుకు అనే శబ్ధానికి గుర్తు(-చిహ్నము) అన్నిటికంటే వంకరగా ఉంటుంది. కనుక ఎందుకు అనే క్యూ చాలా పెద్దది. ఈ క్యూ సమాప్తమైనప్పుడే సంపూర్ణత వస్తుంది. తర్వాత ఆ క్యూ ఉంటుంది. ఎప్పుడైతే ఎందుకు అనే శబ్ధం పోతుందో అప్పుడు డ్రామా జ్ఞానం పై స్థిరంగా, ఏకరసంగా ఉంటారు. కనుక ఇప్పుడు ఎందుకు అను క్యూను సమాప్తం చేయాలి. అర్థమయ్యిందా? ఎందుకు? అన్న ఒక్క శబ్ధంతో సెకండులో ఎన్నో సంకల్పాలు పుట్టుకొస్తాయి. ఎందుకు? అన్న ఒక్క శబ్ధంతో కల్పన చేయడం(ఊహించడం) మొదలవుతుంది. అందువలన తండ్రి కూడా ఈ నీటితో ప్రతిజ్ఞ చేయించేందుకు వచ్చారు. ఏ ప్రతిజ్ఞ చేసినా నీటిని సాక్షిగా పెట్టుకొని చేస్తారు. కనుక ఇప్పుడు ఈ ప్రతిజ్ఞ చెయ్యండి.

**23-03-1970**

**దీదీగారితో** :- బాలకులే మాలికులు(యజమానులు) అందువలన గద్దె పై సమానంగా కూర్చోబెట్టుకుంటున్నారు. వ్యక్త రూపంలో అయితే ఈ సెరిమనీ(ఉత్సవము) చేస్తున్నారు. అవ్యక్త రూపంలో ఈ సెరిమనీ ఉంటుందా? బాలకులను మాలికులుగా చేశారు. ఇప్పటి నుండి సింహాసన అధికారులుగా చేస్తారు. సాకారములో హృదయ సింహాసనాధికారులు, ఇప్పుడు సేవకు సింహాసనాధికారులు, భవిష్యత్తులో రాజ్య సింహాసన

అనాధికారులుగా ఉంటాము. సంగమ యుగములో ఇప్పుడే సింహాసన అధికారులుగా అవుతారు. డ్రామాలో ఫిక్స్ అయిన పాత్ర ఎంత రహస్యయుక్తంగా ఉంది! దీనిని రోజురోజుకు స్పష్టంగా అర్థము చేసుకుంటూ పోతారు. స్నేహము కంటే కర్తవ్యము బంధనములో బంధిస్తుంది. ఎలాగైతే స్నేహం ఒక బంధనమో అలా కర్తవ్యము కూడా ఒక బంధనమే. కనుక ఇది కర్తవ్య బంధనము. కర్తవ్య బంధనము అవ్యక్త రూపములో ఉంది. స్నేహ బంధనము సాకార రూపములో ఉండేది.

**02-04-1970**

ఇప్పుడు భాష కూడా పరివర్తనవ్వాలి. సాకార రూపంలో అన్నీ చేసి చూపించాను. "నేను నడిపిస్తున్నాను అని ఎప్పుడైనా చెప్పానా? నేను మురళి చాలా బాగా నడిపిస్తానని ఎప్పుడైనా చెప్పానా? నేను సేవ చేశాను, నేను పిల్లలకు టచ్ చేశాను అని ఎప్పుడైనా చెప్పానా?" ఇలా నేను చేస్తున్నానని చెప్పడం(అంగీకరించడం) సమాప్తమైపోవాలి. దీనినే చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకోవడమని అంటారు. "మీ పై అర్పణమౌతాము" అని మీరు పాడే పాట జ్ఞాపకము వస్తోందా? అర్పణమవ్వడం లేక చనిపోవడమని దేనినంటారు? "నాది" అనుదానిని తొలగించుకోవడమే -"బలి కావడం లేక చనిపోవడం" "నాది" అని అనుకోకుంటే(అంగీకరించకుంటే) గర్జన చేయగలరు. ఏ విషయమైనా "నింద-స్తుతి, నేను లేదు, నువ్వు లేదు. నాది-నీది ఏదీ లేదు." (దేనిని స్వీకరించకండి). అప్పుడు గర్జన జరుగుతుంది. మీ మనసులో సంకల్పము తర్వాత చేస్తారు. మీ మనసులోకి సంకల్పము వస్తూనే అది మొదట బాప్‌దాదా వద్దకు చేరుకుంటుంది. ముందే ఎందుకు చేరుకుంటుంది? ఇది కూడా ఒక రహస్యమైన చిక్కు ప్రశ్నే. మీరు మనసులో సంకల్పించినప్పుడు అది మనసుకు(మెదడుకు) చేరకముందే బాప్‌దాదా వద్ద స్పష్టమైపోతుంది. ఎందుకంటే వారు సంపూర్ణమవ్వడం వలన డ్రామాలో ఫిక్స్ అయిన ప్రతి విషయము స్పష్టంగా కనిపిస్తుంది(తెలుస్తుంది). అందువలన డ్రామాలో ఫిక్స్ అయిన ప్రతి విషయాన్ని ముందే స్పష్టంగా చూడగలరు. కనుక భవిష్యత్తును చూసి ముందే మాట్లాడతాను. మీ సంకల్పాలు



మొదట ఎప్పుడో చేరుకున్నట్లుగా మాట్లాడతాను. మీరు పాత్ర చేస్తున్నప్పుడు బాప్‌దాదా కూడా పాత్రను అభినయిస్తారు. మీరు ఆత్మిక సంభాషణ చేసే పాత్ర అభినయిస్తే, బాప్‌దాదా వినే పాత్రను అభినయిస్తారు. అర్థమయిందా? మీరు ఎలా ఉన్నారో, అలా స్వయం పూర్తిగా తెలుసుకోలేక పోవచ్చు కాని బాప్‌దాదా తెలుసుకోగలరు. కనుక ఇప్పుడు నాలుగు బలాలను సమానతలోకి తీసుకు రండి. అప్పుడే సాకారుని సమానంగా అవ్వగలరు. సంస్కారాలను ఎంతగా సమానతలోకి తెస్తారో అంత సమీపంలోకి వస్తారు. ఏ సంస్కారాలు?............. సాకారుని సంస్కారాలు - ఉపరామ స్థితి(అతీత స్థితి) మరియు సాక్షీ ద్రష్ట. ఇవి సాకారుని సంపూర్ణ స్థితిలోని శ్రేష్ఠ లక్షణాలు. ఈ సంస్కారాలలో సమానతను తీసుకురావాలి. ఈ గుణాలతో సర్వుల హృదయాలను జయించగలరు. ఎవరైతే సంగమ యుగములో సర్వుల హృదయాల పై విజయులుగా అవుతారో వారే భవిష్యత్తులో విశ్వమహారాజులుగా అవుతారు. విశ్వంలో అందరూ వచ్చేస్తారు. కనుక 'బీజం ఇక్కడ వేయాలి, ఫలం అక్కడ తీసుకోవాలి.'

**22-01-1971**

అందరూ తమ రిజల్టు చూసుకుంటూనే ఉంటారు. ఎక్కువగా ఏమి కనిపిస్తుంది? కొందరిలో స్నేహంగా ఉండే విశేషత, కొందరిలో సహయోగిగా ఉండే విశేషత ఉంది. కాని శక్తిరూప ధారణ తక్కువగా ఉంది. ఇందుకు గుర్తుగా ఏమి కనిపిస్తుందో తెలుసా? శక్తి లోపించింది అనేందుకు గుర్తులు ఏవి? పరిశీలనా శక్తి లోపానికి గుర్తులేవి? ఒక విషయం అయితే వినిపించాను. సేవలో సఫలత ఉండదు. అందుకు స్పష్టమైన గుర్తు రెండు శబ్దాలలో కనిపిస్తుంది - వారి ప్రతి మాటలో ఎందుకు? ఏమిటి? ఎలా ? అని ప్రశ్నార్థకాలు చాలా ఉంటాయి. డ్రామా అని బిందువు పెట్టడం వీరికి చాలా కష్టంగా ఉంటుంది. అందువలన స్వయం ఎందుకు? ఏమిటి? ఎలాగా? అని చిక్కుల్లో ఉంటారు.

**24-05-1971**

సదా ప్రతి సంకల్పం నిశ్చయబుద్ధి గలదిగా ఉండాలి. కర్మ చేసేందుకు

ముందు " మాకు విజయం లభించే ఉంది " అని నిశ్చయం చేసుకోండి. అనేక కల్పాలు విజయులుగా అయ్యారు. అనేక కల్పాలు, అనేక సార్లు విజయము పొంది విజయ మాలలో కూర్చబడి, పూజింపబడేవారుగా అయ్యారు. ఇప్పుడు దానినే రిపీట్ చెయ్యలేరా? ఇంతకుముందు ఏ కర్మ చేశారో అదే మళ్ళీ రిపీట్ చెయ్యాలి. అందుకే దీనిని తయారైన, తయారవుతున్న............. అని అంటారు. తయారై ఉంది కాని ఇప్పుడు మళ్ళీ రిపీట్ చేసి తయారై, తయారవుతున్న(బనా-బనాయా) అను సామెతను పూర్తి చేయాలి.

**08-06-1971**

'సహనశీలత' అనేది చాలా ముఖ్యమైన ధారణ. మీలో ఎంత సహనశీలత ఉంటే అంత స్వయంలో కూడా సంతుష్టంగా(తృప్తిగా) ఉన్నారు, ఇతరులు కూడా సంతుష్టంగా ఉన్నారని అర్థం చేసుకోండి. సంతుష్టంగా(తృప్తిగా) ఉండడం అంటే, సఫలత పొందడం. ఏదైనా విషయాన్ని సహిస్తున్నారు, సహించడం అనగా దాని లోతుల్లోకి వెళ్ళడం. ఉదాహరణానికి సముద్రం లోతుల్లోకి వెళ్తే రత్నాలు తీసుకొస్తారు. అలాగే సహనంగా ఉండేవారు లోతుల్లోకి వెళ్తారు. ఈ లోతుల్లో వెళ్ళడం ద్వారా చాలా చాలా శక్తులు ప్రాప్తి అవుతాయి. సహనశీలురే మనన శక్తిని ప్రాప్తి చేసుకోగలరు. సహనశీలురుగా ఉండేవారు లోలోపల మననంలోనే తత్పరులై ఉంటారు. మననంలో తత్పరులైనవారే నిమగ్నమై ఉంటారు. కనుక సహనశీలత చాలా అవసరము. వారి ముఖమే గుణమూర్తిగా అయిపోతుంది. సహనశీలతను ధారణ చేయడంలో ఇంత అటెన్షన్ ఉంచుకోవాలి. సహనశీలురే డ్రామా ఢాలు పై నిలువగలరు. సహనశీలత లేకపోతే డ్రామా ఢాలును(రక్షణ పరికరమును) పట్టుకోవడం కష్టమే. సహనశీలత ఉన్నవారే సాక్షిగా అవ్వగలరు. అంతేకాక డ్రామా అను ఢాలును కూడా పట్టుకోగలరు.

**11-07-1971**

నిశ్చయబుద్ధి గలవారిగా అయ్యి కళ్యాణ భావన ఉంచుకుంటే,



దృష్టి-వృత్తి రెండూ మారిపోతాయి. ఎలాంటి క్రోధం ఉన్న వ్యక్తి అయినా, ఎదిరించే వారు గాని, అవమానించే వారు గాని, తిట్టేవారు గాని 'ప్రతి ఆత్మ పట్ల కళ్యాణ భావన ఉంటే' వారి ఆవేశం మారిపోయి దయా హృదయులుగా అవుతారు. అప్పుడు ఫలితం ఎలా ఉంటుంది? వారిని కదిలించగలరా? ఆ శుభ(కళ్యాణ) భావన వారి సంస్కారాలను పరివర్తన చేసే ఫలంగా కనిపిస్తుంది. ఇది తప్పకుండా జరుగుతుంది. కొన్ని విత్తనాలతో ప్రత్యక్ష ఫలం వస్తుంది. కొన్ని వెంటనే ప్రత్యక్ష ఫలాన్ని ఇవ్వవు. కొంత సమయం పడ్తుంది. ఫలం(ఫలితం) రాలేదే అని సహనం కోల్పోకండి. అన్ని ఫలాలు వెంటనే లభించవు. కొన్ని విత్తనాలు సహజంగా(న్యాచురల్) వర్షం కురిసినప్పుడే ఫలములనిస్తాయి. నీరు పోస్తే లభించవు. ఇది కూడా డ్రామాలో ఫిక్స్ అయ్యింది. నాటిన అవినాశి బీజాలలో కొన్ని ప్రత్యక్ష ఫలాలనిస్తాయి. కొన్ని ప్రాకృతిక ఆపదలు వచ్చినప్పుడు, డ్రామా దృశ్యము మారిపోవునప్పుడు ఆ సహజ వాతావరణంలో, వాయుమండలంలో ఆ బీజం నుండి ఫలం వస్తుంది. వినాశనమైతే జరుగుతుంది - ఇదేమో గ్యారెంటీ. బీజమే అవినాశిగా ఉంటే ఫలం రాకపోవడమనేది ఉండదు. కానీ కొంతమంది దగ్గరకు వస్తారు. కొంతమంది వెనుక వచ్చేవారైతే ఇప్పుడే ఎలా వస్తారు? వారు ఫలాలు కూడా వెనుకనే ఇస్తారు. అందువలన సేవ చేస్తూ ఎప్పుడూ చేసిన సేవ వ్యర్థమైపోయిందని అనుకోకండి. నంబరువారిగా సమయ ప్రమాణంగా ఫలాలు కనిపిస్తూ ఉంటాయి.

**27-09-1971**

మాస్టర్ రచయిత స్థితిలో స్థితమవ్వడం వలన ఇలాంటి దృశ్యాలు కనిపిస్తాయి. ఏ సారమూ కనిపించదు. అర్థంలేని మాటలు వినిపిస్తాయి. కనుక సత్యతను ప్రసిద్ధము చేయాలన్న ధైర్యము, ఉత్సాహము వస్తుందా? లేక ఇంకా సమయం ఉందా? ఇంకా సత్యాన్ని ప్రసిద్ధం చేయడంలో సమయం ఉందా? నశా ఉండాలి, మెరుపు కూడా ఉండాలి. ఎలాంటి నశా ఉండాలంటే "సత్యం ముందు మన అందరి అల్పకాలిక ఆడంబరాలు నడవవు" అని వారికి అనుభవమవ్వాలి. ఎలాగైతే స్టేజి పై డ్రామాలో

వికారాలు చేతులు జోడించి, తల వంచి నమస్కరిస్తూ వెళ్ళిపోతాయో అలా ఈ డ్రామాను ప్రత్యక్షంగా విశ్వమనే స్టేజి పై చూపించాలి. ఇప్పుడు ఈ డ్రామా స్టేజి పై పాత్ర చేసేవారిని అనంతమైన ఈ స్టేజి పైకి తీసుకురండి. దీనినే సేవ అని అంటారు. ఇలాంటి సేవాధారులు విజయ మాలలో విశేష మణులుగా అవుతారు. ఇలాంటి సేవాధారులుగా అవ్వాల్సి ఉంటుంది. ఇపుడైతే ఇది అభ్యాసం చేస్తున్నారు. మొదట చిన్న వేటలు వేటాడడం అభ్యాసం చేస్తారు. తర్వాత పులిని వేటాడ్తారు. అంతిమంలో ఎలాంటి ప్రత్యక్ష పాత్రను చూస్తారంటే ఈ చిన్న డ్రామా చూచినట్లే చూస్తారు. అప్పుడు ఒకవైపు జయ జయ ధ్వనులు మరొక వైపు హాహాకారాలు జరగుతాయి. రెండూ ఒకే స్టేజి పై చూస్తారు.

**27-02-1972**

నిశ్చయబుద్ధి గలవారు తమ విజయం లేక సఫలత నిశ్చితం అని భావించి నడుస్తారు, నిశ్చయింపబడింది. ఇలా సఫలత నశ్చితమయ్యే ఉంది అని భావించి ఎవరైతే నడుస్తారో, వారి స్థితి ఎలా ఉంటుంది? వారి ముఖము పై ఎలాంటి విశేషమైన మెరుపు కనిపిస్తుంది? మా విజయం నిశ్చితం అని నిశ్చయంగా ఏమో వినిపించారు. కాని వారి ముఖం పై ఏమి కనిపిస్తుంది? విజయం నిశ్చితమైనప్పుడు నిశ్చింతులుగా ఉంటారు కదా. ఏ విషయంలోనూ చింతా రేఖలు కనిపించవు. ఇలాంటి నిశ్చయబుద్ధి గల విజయులుగా, సదా నిశ్చింతగా ఉంటున్నారా? అలా లేకుంటే 100% నిశ్చయబుద్ధి అని ఎలా అంటారు? 100% నిశ్చయబుద్ధి గలవారనగా నిశ్చిత విజయులుగా, నిశ్చింతులుగా ఉండాలి. ఇప్పుడు ఈ లక్షణముతో మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి - 100% అన్ని విషయాలలో నిశ్చయబుద్ధి గలవారిగా ఉన్నారా? కేవలం తండ్రి పైన నిశ్చయాన్ని కూడా 100% నిశ్చయబుద్ధి అని అనరు. తండ్రి పై నిశ్చయ బుద్ధితో పాటు, స్వయం పై కూడా నిశ్చయబుద్ధి కలిగి ఉండాలి. దీనితో పాటు డ్రామాలో ప్రతి సెకండు జరుగుతున్న పాత్ర ఏదైతే రిపీట్ అవుతూ ఉందో దానిలో కూడా 100% నిశ్చయబుద్ధి కలిగి ఉండాలి. దీనినే నిశ్చయబుద్ధి గలవారని అంటారు.



తండ్రి పై 100% నిశ్చయముగా ఉన్నారు కదా. దీనిలో సంశయము లేనే లేదు. కేవలం ఒక్క దానిలో మాత్రమే పాస్ అవ్వడం కాదు. మీ పై మీకు కూడా "నేను కల్పక్రితము తండ్రితో పాటు పాత్రను అభినయించిన శ్రేష్ఠమైన ఆత్మను" అని నిశ్చయముండాలి. అంతేకాక డ్రామాలో ప్రతి పాత్ర శ్రేష్ఠ ఆత్మనైన నాకు కళ్యాణకారిగానే ఉంది అనే స్థితిలోనే చూడాలి. ఈ మూడు రకాల నిశ్చయాలలో సదా ఎవరు పాస్ అవుతారో, అటువంటి నిశ్చయబుద్ధి గల ఆత్మలే ముక్తి-జీవన్ముక్తిలో కూడా తండ్రికి దగ్గరగా ఉంటారు.

**02-04-1972**

ప్రతి కర్మను, సంకల్పాన్ని - " మహాన్‌గా ఉన్నాయా? అని చెక్ చేసుకోండి. అనగా అతిథిగా భావించి నడుస్తున్నానా? లేక కార్యం చేస్తున్నానా? " ఇలా చెక్ చేసుకుంటూ ఉంటే మోహం సమాప్తి అవుతుంది. అతిథిగా కేవలం ఈ సృష్టిలోనే కాదు, ఈ శరీరం అనే ఇంటిలో కూడా అతిథిగా ఉండాలి. తమను తాము అతిథిగా భావించినప్పుడు దేహ భ్రాంతి వలన కలిగే ఆకర్షణ మరియు స్మృతి రూపములో మిగిలి ఉన్న సంస్కారాలు చాలా సహజంగా తొలగిపోతాయి.

మీ ఇంటిని ఏదో కారణంగా అమ్మినారనుకోండి, ఇక మీది అనేది ఉండదు. భలే మీరు ఆ స్థానంలో ఉంటున్నా, అతిథిగా భావించి ఉంటారు. కావున తమదిగా భావించి ఉండడంలో, అతిథిగా భావించి ఉండడంలో ఎంత తేడా ఉంటుంది! కనుక ఈ శరీరం - దేనినైతే నేను ఈ శరీరమును అని భావిస్తూ వచ్చారో దానిని ఇప్పుడిది నాది కాదు అని భావించండి. ఇప్పుడు నాది అని అంటారా? ఇప్పుడు ఈ శరీరం మీది కాదు. దీనితో మరజీవాగా అయ్యారు. అనగా శరీరం కూడా నాది కాదు. శరీరాన్ని అర్పణ చేశారా లేక నాదే అని భావిస్తున్నారా? ఇప్పుడు ఈ పాత శరీరం యొక్క ఆయువు సమాప్తి అయిపోయింది. ఇప్పుడు డ్రామానుసారము ఈశ్వరీయ కర్తవ్యం కొరకు ఈ శరీరం నడుస్తోంది. అందువలన ఇది నా శరీరం అని ఇప్పుడు మీరు అనేందుకు వీలు లేదు. ఈ శరీరం నాది-నాది అనేది కూడా సమాప్తమైపోయింది. ఇప్పుడు తండ్రి మీ ఆత్మ కర్మ చేసేందుకై ఈ

శరీరాన్ని తాత్కాలికంగా అప్పు రూపంలో(లోన్‌గా) ఇచ్చారు. ఎలాగైతే తండ్రి - " ఇది నా శరీరం కాదు. లోన్ తీసుకొని కర్తవ్యం చేసేందుకు పాత్రను అభినయిస్తున్నాను" అని భావిస్తారో, మీరు కూడా అలాగే భావించాలి. మీరు కూడా తండ్రి సమానమైనవారే కదా. నా శరీరం అని అనుకుంటే అన్ని మాటలు వచ్చేస్తాయి. నాది అనే శబ్ధంతో పాటు చాలా ఉన్నాయి. 'నాది' అనేది సమాప్తమైతే దానితో పాటు ఉన్నవన్నీ సమాప్తమైపోతాయి, అతీతంగా అయిపోతారు. ఈ శరీరాన్ని ఈశ్వరీయ కర్తవ్యార్థం లోన్‌గా తీసుకున్నాము. ఇక ఈ శరీరము ఏ ఇతర కర్తవ్యం కోసం కాదు. ఇలా తమను అతిథిగా భావించి నడిస్తే, ప్రతి కర్మ స్వతహాగానే మహోన్నతంగా ఉంటుంది.

**27-04-1972**

మీ అదృష్టాన్ని తయారు చేసుకోగలరా? లేక తయారైన దాని పై నడవాల్సి ఉంటుందా? భాగ్యాన్ని పరివర్తన చేసుకోగలరా? లేదా? దురదృష్టవంతుల నుండి అదృష్టవంతులుగా అవ్వగలరా? అదృష్టాన్ని తయారు చేసుకునే పురుషార్థానికి సమయం(అవకాశం) ఉందా? (ఉంది). భాగ్యాన్ని మేల్కొల్పుకొని వచ్చారా? భాగ్యాన్ని మేల్కొల్పుకునేందుకు వచ్చారా? భాగ్యాన్ని ఎవరైతే మేల్కొల్పుకొని వచ్చారో దానిని వెంట తీసుకొని వచ్చారు కదా? మరి ఇంకేం తయారు చేసుకుంటారు? మేల్కొల్పుకొని వచ్చినవారు దాని అనుసారంగానే తండ్రికి చెందిన వారిగా అయ్యారు. కాని తండ్రి వారిగా అవ్వడమే భాగ్యము కదా. భాగ్యాన్ని తయారు చేసుకొని కూడా వచ్చారు మరియు తయారు చేసుకోగలరు కూడా. అంతేకదా? ఏదైనా విషయంలో ఎక్కువ పురుషార్థము చేస్తున్నట్లయితే తమ లోపల నుండి ఎప్పుడైనా "నా భాగ్యంలో ఇదే ఉంది" అని సంకల్పం వస్తుంది కదా? పురుషార్థం చేసిన తర్వాత కూడా సఫలత లభించకపోతే నా భాగ్యంలో ఇలాగే ఉంది అని భావిస్తారు కదా. సఫలత లభించనందుకు కారణమేమి? తమ వంతుగా పురుషార్థం చేశారు కాని సఫలత లభించకపోతే ఏమంటారు? డ్రామాలో ఇలాగే ఉంది అని అంటారు. కనుక డ్రామాలో



తయారైన అదృష్టాన్నే తీసుకొని వచ్చారు కదా.

**24-06-1972**

చాలా సులభమైన అందరూ చేయగల ఏ ముఖ్యమైన విషయం పై శ్రద్ధ ఉండాలి ? రివైజ్ కోర్సులో కూడా అదే సహజ యుక్తి మాటిమాటికీ రివైజ్ అవుతూ ఉంది. రివైజ్ కోర్సు శ్రద్ధగా వింటున్నారా? చదువుతున్నారా ? మాకన్నీ తెలిశాయి అని భావించడం లేదు కదా? అన్నీ తెలుసులే అని భావించి రివైజ్ కోర్సును తేలికగా వదిలేయడం లేదు కదా? ఈ రోజు పరీక్ష తీసుకుంటాము. ఒక్క రోజు కూడా రివైజ్ కోర్సు మురళీని మిస్ చేయని వారు లేక ధారణలో ఏకాగ్రత, శ్రద్ధ ఇవ్వనివారు చేతులెత్తండి. ఎక్కడో ఒకచోట ప్రయాణములో మురళీని మిస్ చేస్తారా ? చదువుతారా లేక మిస్ అవుతుందా? ఇప్పుడు జ్ఞానమైతే అంతా తెలుసుకున్నాములే అని భావించడం లేదు కదా? భలే తెలుసుకున్నారు కాని తెలుసుకోవలసింది ఇంకా చాలా ఉంది. ఎవరైతే రివైజ్ కోర్సును మంచిగా రివైజ్ చేస్తారో వారు స్వయం కూడా అలా అనుభవం చేస్తారు. రివైజ్ చేస్తూ పాతదిగా అనిపిస్తుందా? లేక కొత్తగా అనిపిస్తుందా? కొత్త వారికైతే చాలా విషయాలు ఉంటాయి. కాని పాతవారు రివైజ్ కోర్సులో మళ్ళీ ఏమి అనుభవం చేస్తున్నారు? కొత్తగా అనిపిస్తుందా? ఎందుకంటే డ్రామానుసారంగా రివైజ్ ఎందుకు అయ్యింది? ఇది కూడా డ్రామాలో ఫిక్స్ అయ్యింది. ఎందుకు రివైజ్ చేయించడం జరుగుతుంది? అటెన్షన్ తక్కువై స్మృతి తక్కువైతే మాటిమాటికీ రివైజ్ చేయించడం జరుగుతుంది. ఇప్పుడు ఇంకా ఆచరణలోకి రాలేదు కనుక రివైజ్ చేయించడం జరుగుతుంది. ఎంత విన్నారో, ఎంత వినిపిస్తున్నారో అంత ప్రాక్టికల్‌గా నింపుకోలేదు. అందువలన శక్తివంతంగా చేసేందుకు మళ్ళీ ఈ కోర్సు నడుస్తోంది. పాతవారిని శక్తివంతంగా చేసేందుకు, కొత్తవారిని శక్తివంతంగా చేయుటతో పాటు తమ హక్కు పూర్తిగా పొందేందుకు కూడా ఈ రివైజ్ కోర్సు నడుస్తున్నది. కావున ఇప్పుడు ఈ లోపాన్ని కూడా సరి చేసుకునేందుకు 'అటెన్షన్‌ను' మాటిమాటికీ రివైజ్ చేయండి.

12-07-1972

పరీక్షలు చాలా రానున్నాయి. పరీక్ష ఏమో జరగాల్సిందే. పరీక్ష అంతిమ ఫలితం వెలువడే సమయం దగ్గరకు వచ్చే కొలది ప్రతి సమయం ప్రాక్టికల్ పేపర్లు స్వతహాగానే వస్తూ ఉంటాయి. పరీక్షలు ప్రోగ్రాం అనుసారము(ముందే తెలిపి) తీసుకోరు. ఆటోమేటిక్‌గా(స్వతహాగా) డ్రామానుసారం సమయ ప్రతి సమయం ప్రాక్టికల్ పేపర్లు వస్తూ ఉంటాయి. కనుక పరీక్షలో పాసవుతాము అనే ధైర్యము మాలో ఉంది అని భావిస్తున్నారా? భయపడేవారు కారు కదా? అంగదుని వలె తమ బుద్ధి యోగాన్ని కొద్దిగా కూడా కదిలించకుండా ఉన్నారు కదా.

18-07-1972

ఇంకా వ్యాకులపడుతున్నారా? ఒకవేళ ఇప్పటివరకు మీకే ఏదో ఒక రకమైన బాధ ఉంటే ఇతర ఆత్మల బాధలను ఎలా నిర్మూలిస్తారు? బాధలను తొలగించేవారా? లేక స్వయం మీరే బాధపడేవారా? ఎలాగైతే ఎవరైనా ఏదైనా భట్టీ మొదలైనవి చేసే దాని సమాప్తి మహోత్సవం లేక పరివర్తన మహోత్సవం జరుపుకుంటారో అలా ఏదైతే ఈ అనంతమైన భట్టీ నడుస్తోందో ఇందులో బలహీనతల సమాప్తి మహోత్సవం లేక పరివర్తన మహోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు? అందుకు ఏదైనా తేదీ నిశ్చయించారా? డ్రామా చేయిస్తుందా? డ్రామా అయితే సర్వ ఆత్మలను పాత ప్రపంచం నుండి సమాప్తి మహోత్సవం చేయిస్తుంది. కాని తీవ్ర పురుషార్థీ శ్రేష్ఠ ఆత్మలైన మీరు దానికి ముందే బలహీనతల సమాప్తి మహోత్సవం జరుపుకోవాలి కదా! లేక ఇతర ఆత్మల వలె మీరు కూడా వారికి తోడుగా చివర్లో చేస్తారా! ఎలాగైతే సమవేశాలు, ప్రసంగాలు మొదలైనవి చేయవలసి వస్తే అందుకు తేది నిర్ణయించుకొని దానికి అనుసారంగా ఏర్పాట్లు చేసుకొని ఆ కార్యాన్ని సఫలం చేసి సంపన్నంగా చేస్తారో అలా బలహీనతలను నిర్మూలించుకునే సెమినార్ జరిగే తేదీని నిశ్చితం చేయలేరా? ఈ సెమినార్ జరగడం సంభవమేనా?



19-09-1972

సంకల్పంలో, స్వప్నంలో కూడా రానటువంటి పరీక్షలు ఇప్పుడు రానున్నాయి. హద్దు డ్రామాను ఎలా సాక్షిగా చూస్తారో అలా ఈ బేహద్ డ్రామాను చూసే అభ్యాసం కావాలి. అప్పుడు బాధ, సంతోషము రెండు పాత్రలను సాక్షిగా చూస్తారు. తేడా ఉండదు. ఎందుకంటే డ్రామా అని భావిస్తారు. కావున ఇటువంటి ఏకరస స్థితి కావాలి. రమణీయమైన పాత్ర కావచ్చు, స్నేహీ ఆత్మ పాత్ర కావచ్చు, గంభీరతా పాత్ర కావచ్చు అన్నిటిని సాక్షిగా ఉండి చూడండి. సాక్షి దృష్ట స్థితి ఉండాలి. భయపడే లేక యుద్ధం చేస్తూ ఉన్న స్థితి ఉండరాదు. కొంతమంది భయపడరు కానీ యుద్ధంలో లగ్నమవుతారు. వారికి తప్పకుండా కొంత కళ్యాణం జరగవచ్చు కాని సాక్షీ దృష్టగా ఉండే స్థితి పూర్తిగా వేరు. దీనినే ఏకరస స్థితి అని అంటారు.

24-12-1972

ఎవరైనా వారి సంస్కార స్వభావ రూపములో మీ ముందుకు పరీక్ష రూపములో వస్తే ఒక్క బాబా స్మృతి ద్వారా అటువంటి ఆత్మ పట్ల కూడా మీ శ్రేష్ఠ సంస్కారమైన దయాభావ సంస్కారాన్ని లేక స్వభావాన్ని ఒక్క సెకండులో ధారణ చేయవచ్చు. ఎవరైనా దేహధారీ దృష్టితో మీ ముందుకు వస్తే మీరు ఒక సెకండులో వారి దృష్టిని ఆత్మిక దృష్టిలోకి పరివర్తన చేసెయ్యండి. ఎవరైనా మిమ్ములను క్రింద పడేసే వృత్తి ద్వారా లేక తమ సాంగత్య దోషములోకి తీసుకెళ్ళే దృష్టితో మీ ముందుకు వస్తే మీరు వారిని సదా శ్రేష్ఠ సాంగత్యము(బాబా సాంగత్యము) ఆధారముతో వారిని కూడా సాంగత్య దోషము నుండి వెలుపలికి తీసి శ్రేష్ఠ సాంగత్యము చేయువారిగా చెయ్యండి. ఇలా పరివర్తన చేసే యుక్తి ఉంటే ఎప్పుడూ విఘ్నాలతో ఓడిపోరు. మీ సంపర్కములోకి వచ్చు సర్వాత్మలు మీరు చేయు ఈ శ్రేష్ఠమైన సూక్ష్మ సేవకు బలిహారమైపోతారు. ఆత్మలను పరివర్తన చేసినందున తండ్రికెలాగైతే ధన్యవాదాలు తెలుపుతారో, బలిహారమవుతారో అలా మీ సంపర్కములోకి వచ్చు ఆత్మలందరూ మీకు ధన్యవాదాలు తెలుపుతారు. సులభమైన యుక్తి ఇదొక్కటే కదా. నిజానికి ఏ విషయమైనా,

ఏ దృశ్యమైనా, ఏ వస్తువైనా పరివర్తన అవ్వనే అవుతుంది. ఈ డ్రామాయే పరివర్తన శీలి. జనులకు వినాశమయ్యే తీరాలి, అందరూ ముక్తిధామానికి వెళ్లే తీరాలని అయితే వినాశానికి ముందే జ్ఞాన-యోగాల ఆధారముతో వికర్మలను వినాశము చేసుకుంటే శిక్షల నుండి తప్పించుకుంటారని చెప్పారు. ఎలాగైనా వెళ్లాల్సిందే, అయినా ఎవరు చేస్తారో, వారు పొందుతారని చెప్పారు.

**23-01-1973**

ఇప్పుడు డ్రామా లీలు వేగంగా పరివర్తనవుతుంది. ప్రస్తుతము జరిగే విషయాలన్నీ పరివర్తనవుతాయి. వ్యక్తము ద్వారా అవ్యక్త మిలనము, ఇదంతా వేగంగా పరివర్తనవుతుంది. అందువలన అవ్యక్త మిలనపు విశేష అనుభవాన్ని విశేష రూపములో చేయించారు. ఇక ముందు కూడా అవ్యక్త స్థితి ద్వారా అవ్యక్త మిలనపు విచిత్ర అనుభవాలను చాలా చేస్తారు. ఈ సంవత్సరములో అవ్యక్త మిలనము ద్వారా విశేష శక్తులను ప్రాప్తి చేసుకునే వరదానము లభించింది. అందువలన ఈ మాసము సమాప్తము అయిపోయిందని అనుకొని అభ్యాసము మానేయకండి. ఈ అభ్యాసాన్ని, ఈ అనుభవాన్ని ఎవరైతే నిరంతరము పెంచుకుంటూ ఉంటారో వారికి చాలా కొత్త కొత్త అనుభవాలు అవుతూ ఉంటాయి. అర్థమయిందా?

**09-04-1973**

ఏ ఏ శక్తులున్నాయో వాటిని ఆచరణలోకి తీసుకు రావాలి. వాటినే గుణాలని అంటారు. ఇక కర్తవ్యమేమిటి? కష్టమును సులభము చేయడమే, పరివర్తన చేయడం. పారిపోయేవారు కాదు. నివాస స్థానమేది? ఏ స్థానములో స్థితమై బ్రాహ్మణుల ముఖ్య కర్తవ్యాన్ని చాలా బాగా చేయగలరో ఆ స్థానమేది? బ్రాహ్మణుల ముఖ్య కర్తవ్యము బుద్ధిని స్థిరపరచుట. ఆ స్థానములో నిరంతరము ఉండగలగాలి. నడుస్తూ - తిరుగుతూ కూడా ఆ స్థితిలో ఉండగలగాలి. అందులో అన్ని విషయాల సారము వచ్చేయాలి. విస్తారములో అయితే అన్ని విషయాలు వచ్చేస్తాయి. కాని విస్తారాన్ని ఒక్క



శబ్దములో ఇమడ్చండి. నివాస స్థానమనగా సదా ఆ స్థితిలో స్థితమయ్యే స్థానము. అది సాక్షీద్రష్టా స్థితి. ఈ సాక్షిద్రష్టా స్థితి అనేది ఢాలు. డ్రామా పట్టాల పై ప్రతి కర్మ, ప్రతి సంకల్పము నడవాలంటే ఈ సాక్షిద్రష్టా స్థితి సదా ఉండాలి.

**13-04-1973**

ఇప్పుడైతే మీరు మీ పురుషార్థము మరియు శరీరము కొరకు సమయము ఇవ్వవలసి వస్తుంది. శక్తి కూడా ఇవ్వవలసి వస్తుంది. మీ పురుషార్థము కొరకు మనసు కూడా లగ్నము చేయవలసి ఉంటుంది. తర్వాత ఈ స్టేజి సమాప్తమైపోతుంది. ఈ పురుషార్థము మార్పు చెంది ఒక్క సెకండులో ఒక్క సంకల్పము కూడా స్వయం పట్ల పోకుండా అనుభవమవుతుంది. విశ్వ కళ్యాణము కొరకే చేస్తారు. ఇటువంటి స్థితిని సంపూర్ణ స్థితి లేక సంపన్న స్థితి అని అంటారు. సంపన్నము అవ్వకుంటే సంపూర్ణులుగా కూడా అవ్వరు. ఎందుకంటే సంపన్న స్థితినే సంపూర్ణ స్థితి అని అంటారు. కనుక ఈ విధంగా మీ పురుషార్థాన్ని ఇంకా సూక్ష్మంగా చేసుకుంటూ పోవాలి. విశేష ఆత్మల పురుషార్థము కూడా తప్పకుండా భిన్నంగా ఉంటుంది. కనుక పురుషార్థములో ఇటువంటి పరివర్తన అనుభవమవుతూ ఉందా? ఇప్పుడైతే దాత పిల్లలైన మీరు దాత స్థితిలోకి రావాలి. వారికి ఇవ్వడమే తీసుకోవడం అవుతుంది. కనుక ఇప్పుడు సమయ సమీపతతో పాటు సంపన్న స్థితి కూడా కావాలి. ఆత్మలైన మీ సంపన్న స్థితే సంపూర్ణతను సమీపానికి తెస్తుంది. కనుక ఇప్పుడు మీరు స్వయాన్ని చెక్ చేసుకోండి - ఎలాగైతే మొదట మీ పురుషార్థములో సమయము ఖర్చవుతూ ఉండేదో, అలా ఇప్పుడు రోజురోజుకు ఇతరుల పట్ల ఎక్కువ సమయము ఖర్చు పెడ్తున్నారా? మీ కాన్షన్, అభిమానము డ్రామానుసారము న్యాచురల్‌గా సమాప్తమౌతూ పోతుంది. పరిస్థితులనుసారము కూడా ఇలా జరుగుతూ పోతుంది. దీని వలన ఆటోమేటిక్‌గా సోల్‌కాన్షస్‌లో ఉంటారు. కార్యములో లగ్నమగుట అనగా సోల్‌కాన్షస్‌లో ఉండడం. సోల్‌కాన్షస్ లేకుంటే కార్యము సఫలము కాదు. కనుక నిరంతరము ఆత్మాభిమాని స్టేజి

స్వతహాగా తయారైపోతుంది. విశ్వకళ్యాణకారులుగా అయ్యారా లేక ఆత్మ కళ్యాణకారులుగా అయ్యారా? మీ లెక్కాచారము చూసుకోవడంలో బిజీగా ఉన్నారా లేక విశ్వములోని ఆత్మలందరి కర్మబంధనాలు లేక వారందరి లెక్కాచారాలను చుక్తా చేసుకోవడంలో బిజీగా ఉన్నారా? ఎందులో బిజీగా ఉన్నారు? సదా విశ్వ కళ్యాణము పట్ల తనువు-మనసు-ధనములన్నీ ఉపయోగించాలనే లక్ష్యముంచుతున్నారా?

**20-06-1973**

ఎప్పుడు ఎలాంటి పరిస్థితి వచ్చినా, మిమ్ములను కదిలించేందుకు ఎటువంటి విఘ్నము వచ్చినా, ఎవరి జతలో స్వయం సర్వశక్తివంతుడైన తండ్రి ఉంటారో వారిని ఆ విఘ్నాలేం చేస్తాయి? వారి ముందు విఘ్నము ఎలా పరివర్తనైపోతుంది? - విఘ్నము లగ్నానికి సాధనంగా అయిపోతుంది. హర్షితమవుతారు కదా. ఏదైనా పరిస్థితి లేక వ్యక్తి విఘ్నము కలిగించేందుకు నిమిత్తంగా అయితే వారి పట్ల ఘృణా దృష్టి, వ్యర్థ సంకల్పాలు ఉత్పన్నం అవ్వరాదు. అందుకు భిన్నంగా వారి పట్ల 'వాహ్ వాహ్' అను మాటలు వెలువడాలి. ఇటువంటి దృష్టి ఉంచుకుంటే మీ అందరిది శ్రేష్ఠ దృష్టి అయిపోతుంది. ఎవరు ఎలా ఉండినా మీ దృష్టి మరియు వృత్తి సదా శుభ చింతకంగా ఉండాలి. కళ్యాణ భావన ఉండాలి. ప్రతి మాటలో కళ్యాణము కనిపించాలి. కళ్యాణకారి తండ్రి సంతానము కళ్యాణకారులుగానే ఉంటారు కదా. కళ్యాణకారులుగా అయిన తర్వాత ఏ విధమైన అకళ్యాణము జరగదు. ఈ నిశ్చయము మరియు స్మృతి స్వరూపంగా అయినారంటే మీరు ఎప్పుడూ ఆందోళన చెందరు.

ఎలాగైతే ఆకుపచ్చని కళ్లజోడును, ఎర్ర కళ్లజోడును ధరించిన వారికి అంతా ఆకుపచ్చగా, ఎర్రగా కనిపిస్తుందో అలా మీ మూడవ నేత్రము పై కళ్యాణకారి కళ్లజోడు ఉంది. మూడవ నేత్రమంటేనే కళ్యాణకారి. అందులో అకళ్యాణము కనిపించుట అసంభవము. అజ్ఞానులు దేనినైతే అకళ్యాణంగా భావిస్తారో అందులో మీకు కళ్యాణమే ఇమిడి ఉంటుంది. ఉదాహరణకు జనులు అకళ్యాణముగా భావిస్తారు కాని వినాశనము ద్వారానే గతి -



సద్గతి ద్వారాలు తెరుచుకుంటాయని మీరు భావిస్తారు. కనుక ఏ విషయము మీ ముందుకు వచ్చినా అన్నిటిలో కళ్యాణమే నిండి ఉందనే నిశ్చయబుద్ధితో నడిస్తే ఏమి లభిస్తుంది? ఏకరస స్థితి వచ్చేస్తుంది. ఏమి జరిగినా ఆగిపోరాదు. ఎవరు ఆగిపోతారో వారు బలహీనులుగా ఉంటారు. మహావీరులెప్పుడూ ఆగిపోరు. విఘ్నాలు వస్తే ఆగిపోరాదు.

**08-07-1973**

స్థితి ఎప్పుడైనా హెచ్చు తగ్గులయ్యేందుకు కారణము - మేళా అనగా మిలనము నుండి బుద్ధిని దూరము చేసేస్తారు. అనగా మేళా నుండి వెలుపలికి వచ్చేస్తారు. దానిని ఆటగా భావించరు. కనుక మేళా మరియు ఆట - ఈ రెండు మాటలు సదా గుర్తుంచుకోండి. మేళాలో అన్ని మాటలు వచ్చేస్తాయి. ఏ ఏ మాటలు కలుసుకుంటాయి అని ఇంతకుముందు కూడా వినిపించాము. మేళా అను శబ్దము గుర్తు వస్తూనే సంస్కారాల మిలనము, తండ్రి మరియు పిల్లల మిలనము, సర్వ సంబంధాల ద్వారా సదా ప్రాప్తి మిలనము - ఇవన్నీ ఈ మేళాలో వచ్చేస్తాయి. ఈ సృష్టి ఒక ఆట(డ్రామా). ఇది ముఖ్యమైన విషయము. కాని రకరకాల మాయావీ పరీక్షలు లేక ఏ పరిస్థితులు వచ్చినా అవి కూడా మీకు ఒక ఆటనే. వీటిని ఆటగా భావిస్తే మీరు వ్యాకులపడరు. నవ్వుతూ ఉంటారు. కనుక పరీక్షలు కూడా ఒక ఆటనే. మూడవది - ఆటగా భావిస్తే రకరకాల వెరైటీ సంస్కారాల పాత్రలనేదైతే చూస్తారో, ఆ పాత్రధారులకు ఈ అనంతమైన ఆటలో ఆ పాత్రలు నిశ్చితమై ఉన్నాయి. ఈ విషయము గుర్తుంటే స్థితి ఎప్పుడూ హెచ్చుతగ్గులు కాదు. సదా ఏకరస స్థితి ఉంటుంది. ఇది వెరైటీ డ్రామా అనగా ఒక ఆట అని స్మృతిలో ఉంటే, వెరైటీ డ్రామాలో వెరైటీ పాత్రలు లేకుండా ఎప్పుడైనా ఉంటుందా? దీని పేరే వెరైటీ డ్రామా. ఎలాగైతే హద్దు సినిమాలలో రకరకాల పేర్లతో రకరకాల ఆటలుంటాయో, ఉదాహరణానికి 'అనవసరమైన రక్తపాతము' అను సినిమాలో ఏదైనా భయము కలిగించే, బాధ కలిగించే దృశ్యము చూస్తే విచలితమవుతారా? అవ్వరు కదా. ఎందుకంటే సినిమా పేరే 'అనవసరమైన రక్త పాతము'. దాని అర్థము ముందే తెలుసుకొని

ఆటను చూస్తారు. అలాగే ఏదైనా యుద్ధము, కొట్లాట, జగడము, కోపానికి సంబంధించిన కథలుగా ఉంటే వాటిని చూచి నవ్వుతారా, ఏడుస్తారా? తప్పకుండా నవ్వుతారు కదా. ఎందుకంటే అది ఒక ఆట అని ముందే తెలుసు. అలాగే ఈ బేహద్ ఆట పేరే వెరైటీ డ్రామా అనగా ఆట. కనుక ఇందులో వెరైటీ సంస్కారాలు లేక వెరైటీ స్వభావాలు లేక వెరైటీ పరిస్థితులు చూచి ఎప్పుడైనా విచలితమవుతారా? లేక వాటిని కూడా సాక్షిగా ఉండి ఏకరస స్థితిలో స్థితమై చూస్తారా? కనుక ఇది ఒక వెరైటీ డ్రామా అని భావిస్తే లేక గుర్తుంటే పురుషార్థము చేయడంలో కష్టమని దేనిని భావిస్తున్నారో అది సులభమైపోదా?

మేళా, ఆట అను రెండు శబ్దాలను కూడా మర్చిపోయి స్వయం వ్యాకులపడ్తారు. ఎందుకంటే స్మృతి అనగా సాక్షి స్థితి అను సీటును వదిలేస్తారు. సీటును వదిలి ఎవరైనా డ్రామాను చూస్తే వారి స్థితి ఎలా అయిపోతుంది? కనుక సీటు పై సెట్ అయ్యి వెరైటీ డ్రామా అని గుర్తుంచుకొని ఒక్కొక్కరి పాత్రను చూస్తూ ఉంటే సదా హర్షితంగా ఉంటారు. నోటి ద్వారా " వాహ్ వాహ్ " అను శబ్దము వెలువడ్తుంది. 'వాహ్ మధురమైన డ్రామా' అని మెచ్చుకుంటారు. ఇది ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? అను మాటలు వెలువడవు. అందుకు భిన్నంగా "వాహ్ వాహ్" అను శబ్దాలు వెలువడ్తాయి. అనగా సదా సంతోషంగా ఊగుతూ, సదా స్వయం మాస్టర్ సర్వశక్తివాన్ అని అనుభవము చేస్తారు. ఇలా స్వయాన్ని ప్రాక్టికల్‌గా అనుభవము చేస్తున్నారా?

**02-08-1973**

అడ్వాన్స్ పార్టీ వారు ఇప్పుడు ఏ కార్యము చేస్తున్నారు? మీ కొరకే ఈ రోజు మొత్తం భూమినంతా తయారు చేస్తున్నారు. వారు పరివారంలోకి వచ్చినా, రాకున్నా స్థాపనా కార్యము ఏదైతే జరగనున్నదో దానికి వారు నిమిత్తమవుతారు. ఏదో ఒక శక్తిశాలి స్టేజిని(స్థితిని/మోదాను) తీసుకొని నిమిత్తంగా అవుతారు. స్థాపనా కార్యంలో సహాయకులుగా అయ్యేందుకు కావలసిన పవర్స్(శక్తులు/అధికారాలు) తీసుకుంటారు (కలిగి



ఉంటారు). ఈ రోజుల్లో మీరు గమనిస్తే కొత్త రక్తానికి(న్యూ బ్లడ్‌కు) గౌరవం ఎక్కువగా ఉంది. పోను పోను చిన్నవారి బుద్ధి పని చేసినట్లు పెద్దవారిది పని చేయదు. పెద్దవారితో పోలిస్తే చిన్నతనములో బుద్ధి సతోప్రధానంగా ఉంటుంది. ఏదో కొంత పవిత్రతా శక్తి ఉన్నందున వారి బుద్ధి పని చేసినట్లు పెద్దల బుద్ధి పని చెయ్యదు. ఈ మార్పు జరుగుతుంది. పెద్దలు కూడా పిల్లల సలహాలను గౌరవిస్తారు. ఇప్పుడు కూడా పెద్దవారు మేము పాతకాలము వాళ్లమని, మీరు ఈ కాలానికి చెందినవారని, వారికి గౌరవం ఇవ్వకుంటే, వారిని పెద్దవారిగా భావించి నడిపించకపోతే పని జరగదని భావిస్తారు. ఇంతకు ముందు పిల్లలను అధికారంతో నడిపించేవారు. ఇప్పుడలా కాదు. పిల్లలను కూడా యజమానులుగా భావించి నడిపిస్తున్నారు. అయితే ఈ పాత్ర కూడా డ్రామాలో ఉంది. చిన్నవారే అద్భుతం చేసి చూపిస్తారు. అడ్వాన్స్ పార్టీ వారి కార్యం అయితే నడుస్తూనే ఉంది. కాని వారు కూడా మీ స్థితి అడ్వాన్స్‌లోకి రావాలని ఆగి ఉన్నారు. వారి కార్యం కూడా మీ సంబంధంతోనే నడవాలి.

**15-04-1974**

అందరూ ఉన్నతి వైపు ముందుకు వెళ్తున్నారా? ఉన్నతమయ్యే కళకు గుర్తు ఏమిటో తెలుసా? సదా లగ్నములో మగ్నమై ఉంటారు, విఘ్నవినాశకులుగా ఉంటారు. ఈ రెండు గుర్తులు అనుభవములోకి వస్తున్నాయా? లేక విఘ్నాలను చూచి విఘ్నవినాశకులుగా అయ్యేందుకు బదులు మీ స్థితి క్రిందికి రావడం లేదు కదా? అనేక రకాలుగా వచ్చిన తుఫానులు మీ బుద్ధిలో తుఫాన్లకు జన్మనివ్వడం లేదు కదా? ఉదాహరణానికి ఎవరి ద్వారానైనా బహుమతి(తోఫా) లభిస్తే బుద్ధిలో హల్‌చల్(ఆందోళన) ఉండదు, ఇంకా ఉత్సాహముంటుంది. ఇదే విధంగా వచ్చిన తుఫాన్లు ఉత్సాహాన్ని పెంచుతున్నాయా లేక అలజడిని పెంచుతున్నాయా? ఒకవేళ తుఫాన్లను తుఫాన్లుగా భావిస్తే అలజడి కలుగుతుంది. కానుకగా భావించి అనుభవిస్తే వాటి ద్వారా ఉత్సాహము, ధైర్యము చాలా పెరుగుతాయి. ఇది ఉన్నతమయ్యే కళకు గుర్తు. భయపడేందుకు

బదులు లోతుల్లోకి వెళ్లి అనుభవాలనే కొత్త-కొత్త రత్నాలను ఈ పరీక్షలనే సాగరము నుండి ప్రాప్తి చేసుకుంటారు. అలా అనుభవము చేస్తున్నారా? ఏమి జరుగుతోంది? ఎందుకు జరుగుతోంది? ఇది ఎలా జరుగుతుంది?........... ఇటువంటి సంకల్పాలు నడుస్తూ ఉంటే, దానిని అలజడి అని అంటారు. అలజడి లోపల రత్నాలు ఇమిడి ఉంటాయి. పై పైన అనగా బాహ్యముఖిత దృష్టి ద్వారా, బాహ్య బుద్ధి ద్వారా చూస్తే అలజడిగా అనిపిస్తుంది లేక అనుభవమౌతుంది. కాని వాటినే అంతర్ముఖి దృష్టితో లేక బుద్ధితో చూస్తే అనేక విధాలైన జ్ఞాన రత్నాలు అనగా జ్ఞాన బిందువులు ప్రాప్తి అవుతాయి.

ఏ విషయాన్ని చూచినా, విన్నా ఆశ్చర్యము అనుభవమౌతే అది కూడా ఫైనల్ స్థితి కాదు. ఇలా జరిగి ఉండరాదు, మంచిది. ఏదైతే జరిగిందో అది జరగాల్సిందే - ఇటువంటి సంకల్పాలు డ్రామాలో ఉండినా ఉత్పన్నమౌతూ ఉంటే దానిని కూడా అంశమాత్ర అలజడి రూపమని అంటారు. ఇప్పటివరకు ఎందుకు? ఏమిటి? అను ప్రశ్నలు వస్తున్నాయంటే అలజడి ఉన్నట్లే. విఘ్నాలు రావడం అవసరమే. విఘ్నాలు రావడం ఎంత అవసరమో అంతగా ఇది బుద్ధిలో గుర్తుంటే మహారథులు అంత హర్షితంగా ఉంటారు. “కొత్తదేమీ లేదు” అను స్థితిని ‘ ఫైనల్ స్టేజ్ ’ అని అంటారు. ఏదైనా అలజడి పనులు చేసినా, పాత్ర చేసినా సాగర సమానం పై నుండి అలజడిగా కనిపించినా అనగా కర్మేంద్రియాలు అలజడిలోకి వస్తున్నా ‘కొత్తదేమీ లేదు’ అను స్థితి ఉండాలి. ఏకాగ్రము, ఏకరసము, ఏకాంతము అనగా రచయిత మరియు రచనల అంత్యము తెలిసిన త్రికాలదర్శి స్టేజిలో విశ్రాంతిగా శాంతి స్థితిలో స్థితమై ఉన్నారా? లేక కర్మేంద్రియాల అలజడి ఆంతరిక స్థితిని కూడా కదిలిస్తోందా? స్థూల సాగరము రెండు రూపాలను చూపిస్తున్నప్పుడు మాస్టర్ జ్ఞానసాగరులు అటువంటి రూపాన్ని చూపించలేరా? దీనిని ప్రకృతి పురుషుని నుండే కాపి చేసింది. మీరు పురుషోత్తములు. ప్రకృతి తన విశేషతలను, గుణాలను చూపిస్తున్నప్పుడు పురుషోత్తములైన మీరు చూపించలేరా!



## 30-06-1974

ఈ రోజు పిల్లలందరికీ సూక్ష్మవతన సమాచారాన్ని వినిపిస్తాను. సూక్ష్మవతనములో విహరించాలని మీ అందరికీ ఇష్టముంటుంది కదా? అనగా ఒకసారి వతనాన్ని తప్పక చూడాలని ఉంది కదా? ఈ సంకల్పము లేక కోరిక ఎందుకు ఉంటుందో తెలుసా? ఎందుకంటే బాప్‌దాదా సూక్ష్మవతన వాసులై పాత్రను అభినయిస్తారు అందువలన మేము కూడా ఒకసారి బాప్‌దాదా జతలో ఈ అనుభవము చేయాలని సంకల్పము వస్తుంది. అందువలన బాప్‌దాదాయే తమ అనుభవాన్ని వినిపిస్తున్నారు.

ముఖ్యంగా అనుభవము చేసేందుకు గాని, వినేందుకు గాని అన్నిటికంటే మంచి సమయమేదో మీకు తెలుసు కదా? విశేషంగా పిల్లల కొరకు అమృతవేళ సమయమే నిశ్చితమై ఉంది. తర్వాత విశ్వములోని ఇతర ఆత్మల పట్ల యథాశక్తి వారి భావనల ఫలము లేక ఏ విధమైన రజోప్రధాన కర్మలు అల్పకాలికంగా ఏ ఆత్మల ద్వారా జరుగుతూ ఉంటాయో, వారికి కూడా వారి కర్మల అనుసారము అల్పకాల ఫలితము ఇచ్చేందుకు, దీనితో పాటు భక్తుల పిలుపులు వినేందుకు, భక్తుల రకరకాల భావనల అనుసారము సాక్షాత్కారం చేయించేందుకు అంతేకాక ఇప్పటికీ నలువైపులా దాగి ఉన్న బ్రాహ్మణాత్మలకు సందేశాన్ని చేర్పించేందుకు పిల్లలను నిమిత్తంగా చేయు కార్యములో, పాత ప్రపంచాన్ని సమాప్తము చేయించేందుకు నిమిత్తంగా ఉన్న వైజ్ఞానికుల క్షేమ-సమాచారాలు చూచేందుకు, జ్ఞానీ ఆత్మలు స్నేహీ సహయోగీ పిల్లలకు రోజంతటిలో ఈశ్వరీయ సేవ చేసేందుకు, మాయాజీతులుగా అవ్వడంలో “ పిల్లలు ధైర్యము చేస్తే బాబా సహాయం చేస్తారు” అను నియమానుసారము వారికి కూడా సహాయము చేయు కార్యంలో డ్రామానుసారము నిమిత్తంగా ఉంటారు. రోజంతా తండ్రి ఏమి చేస్తూ ఉంటారో అర్థమయ్యిందా? సాకార తండ్రి కూడా ఇప్పుడు అవ్యక్తమైనందున సదా కాలానికి నిరాకార తండ్రికి సాథీగా, సహయోగిగా అయ్యే పాత్రను తీవ్ర వేగముతో అభినయించగలరు.

సైన్స్ వారు సమయాన్ని, తమ శక్తిని అనగా శ్రమను, సాధనాల

విస్తారాన్ని సూక్ష్మంగా మరియు క్లుప్తంగా(షార్ట్‌గా) చేస్తున్నారు. కనీసము ఒక్క సెకండు వరకు చేరుకునేందుకు తీవ్ర పురుషార్థము చేస్తున్నారు. అందులో సఫలతను కూడా పొందుతున్నారు. ఎలాగైతే వినాశనము కొరకు నిమిత్తమైన ఆత్మల గతి(వేగము) సూక్ష్మంగా, తీవ్రంగా అవుతూ పోతూ ఉందో అలాగే స్థాపన కొరకు నిమిత్తమైన ఆత్మల స్థితి మరియు గతి కూడా సూక్ష్మంగా, తీవ్రంగా కావాలి కదా? అప్పుడే రెండు కార్యాలు సంపన్నమౌతాయి. ఇప్పుడు వ్యక్త శరీరానికి, అవ్యక్త శరీరానికి గల వ్యత్యాసము అర్థమయ్యిందా? అవ్యక్తమవ్వడం డ్రామానుసారము ఏ సేవకు నిమిత్తముగా అయ్యిందో ఈ రహస్యాన్ని అర్థము చేసుకున్నారా? బ్రహ్మా పాత్ర స్థాపనా కార్యంలో చివరి వరకు నిశ్చితమై ఉంది. ఎంతవరకు స్థాపనా కార్యము సంపన్నము అవ్వలేదో అంతవరకు అందుకు నిమిత్తమైన ఆత్మ(బ్రహ్మా) పాత్ర సమాప్తమవ్వదు. అంతవరకు ఆ ఆత్మ మరో పాత్ర చెయ్యలేదు. నూతన జగత్తును రచించు కార్యము సంపన్నము చేయు పాత్ర డ్రామాలో జగత్పితకు నిశ్చయింపబడింది. మానవ సృష్టిలోని అన్ని వంశావళి వారిని రచిస్తారనే గాయనము కేవలం బ్రహ్మాకు మాత్రమే ఉంది. అందుకే బ్రహ్మా గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్ అని మహిమ చేయబడ్డారు. కేవలం స్థితి, స్థానము, వేగము పరివర్తనయ్యాయి కాని ఇప్పటికీ బ్రహ్మా అదే పాత్ర చేస్తున్నాడు.

ఇంత సమయం బ్రహ్మాబాబా ఏం చేస్తున్నారని చాలా మందికి సంకల్పము వస్తుంది. తండ్రి కూడా ప్రశ్నిస్తున్నారు - "బ్రహ్మాతో పాటు బ్రాహ్మణులు సర్వాత్మల కళ్యాణము కొరకు నూతన సృష్టిని స్థాపించేందుకు నిశ్చయించిన పాత్ర సమాప్తమయ్యిందా? పాత్ర సమాప్తము అవ్వకుంటే, ఇంకా సృష్టి పరివర్తనే జరగకుంటే బ్రహ్మా పాత్ర సమాప్తమెలా అవుతుంది?" స్నేహము కారణంగానే వతనంలో బ్రహ్మాబాబా ఇంత సమయము ఏం చేస్తున్నారనే సంకల్పం వస్తుంది. వతనంలో ఇంత సమయం ఎందుకున్నారు, ఏమి చేస్తుంటారు అను సంకల్పాలు ఎప్పుడు వస్తాయి? ఇది కూడా ఒక గుప్త రహస్యమే - కర్మబంధనాల నుండి ముక్తమై సంపన్నమైన ఆత్మ, ఈ



కల్పములో జనన-మరణ చక్రమును సమాప్తము చేసుకున్న ఆత్మ, నిరాకార తండ్రికి ఫస్ట్ నంబరు సాథీ ఆత్మ, విశ్వకళ్యాణము కొరకు నిమిత్తమైన ఫస్ట్ ఆత్మ, స్వయం పట్ల, విశ్వం పట్ల సర్వ సిద్ధులు ప్రాప్తి చేసుకున్న ఆత్మ ఎక్కడ కావాలంటే అక్కడ ఎంత సమయము కావాలనుకుంటే అంత సమయము స్వతంత్ర రూపములో పాత్ర చేయగలదు. అల్పకాల సిద్ధి పొందిన ఆత్మలు తాము పొందిన సిద్ధి ఆధారముతో తమ రూపాన్ని పరివర్తన చేసుకోగలిగితే, సర్వ సిద్ధులు ప్రాప్తి అయిన ఆత్మ అవ్యక్త రూపధారిగా అయ్యి ఎంత సమయము కావాలంటే అంత సమయము డ్రామానుసారము ఉండలేదా?

**11-07-1974**

ముఖ్యంగా ఈ రెండు ఫిర్యాదులున్నాయి. ఒకటి-రెండు పార్టీలతో కలుసుకున్నప్పుడు విశేషంగా ఈ రెండు ఫిర్యాదులే ఉంటాయి. అందువలన డ్రామానుసారము పదే పదే ఈ మాటలే మాట్లాడడం, పదే పదే తండ్రి ద్వారా ఇదే శిక్షణ లభించడం - దీనికి కూడా లెక్కాచారము తయారౌతుంది. అందువలన డ్రామానుసారము ఇంతవరకు స్పెషల్ సర్వీసు తీసుకునే పాత్ర కూడా సమాప్తమౌతూ ఉంది. ఇందులో కూడా రహస్యముంది. అదే మాట చాలాసార్లు అడుగుతారు - వచ్చే సంవత్సరము ఈ ఫిర్యాదు ఉండదని ఈ సంవత్సరం ప్రమాణము చేసి వెళ్తారు. మరుసటి సంవత్సరము మళ్లీ అదే ఫిర్యాదు, అవే మాటలు వచ్చే సంవత్సరము ఉండవని చెప్తారు. జరిగిపోయిన సంవత్సరము ఏ ఖాతాలోకి వెళ్లినట్లు? బాప్‌దాదాకు చేసిన ప్రమాణాన్ని మర్చిపోతారులే అని అనుకుంటారు. బాప్‌దాదాకేం గుర్తుంటుందిలే అని భావిస్తారు. బాప్‌దాదాకు అందరి ప్రమాణాలు గుర్తుంటాయి. కాని బాప్‌దాదా పిల్లలను అగౌరవపరచరు. ఎదురుగా కూర్చొని ప్రమాణము నిలబెట్టుకోలేదని నేరుగా అంటే అది కూడా అగౌరవపరచినట్లే కదా. శిరోకిరీటధారులుగా తయారు చేస్తున్నప్పుడు, స్వయం కంటే పిల్లలను ముందు పెట్టినప్పుడు అటువంటి ఆత్మలనెలా అగౌరవపరుస్తారు? అందువలన కేవలం ఒక చిరునవ్వు నవ్వుతారు. అంతేగాని గుర్తుండదని

అనుకోకండి. ఆత్మలనైతే ఏదో ఒక విధంగా మభ్యపెడతారు. నిమిత్తముగా ఉన్న టీచర్లను చాలా చతురతతో దాటేస్తారు. మా భావాన్ని మీరు అర్థం చేసుకోలేదని అంటారు. మా భావమది కాదు, నోటి నుండి మాట జారిపోయిందని అంటారు. కాని బాప్‌దాదాకు భావము యొక్క భావము తెలుసు. వారి నుండి దాచలేరు. టీచరైతే నేనే పొరపాటు పడ్డానని, అలా జరగవచ్చు అని అనుకుంటారు. కాని తండ్రి పొరపాటు పడరు కదా. అందువలన ఇప్పుడు చిన్న చిన్న విషయాలకు సమయము లేదు. ఇది కూడా వ్యర్థములో చేరుతుంది. తండ్రితో ఎంత శ్రమ తీసుకుంటున్నారో అంత రిటర్ను ఇవ్వవలసి వస్తుంది. వ్యక్త రూపంలో శ్రమ తీసుకున్నారు, అవ్యక్త రూపంలో కూడా ఎన్ని సంవత్సరాల నుండి శ్రమ తీసుకుంటున్నారు ? 6వ సంవత్సరం నడుస్తూ ఉంది. అవ్యక్త రూపంలో కూడా 6 సంవత్సరాలు ఈ విషయాల పైననే శిక్షణ లభిస్తూ ఉంది. ఇప్పుడు కూడా అదే శిక్షణ కావాలా? ఇది సేవ తీసుకునే సమయమా? లేక రిటర్న్ ఇచ్చే సమయమా? రిటర్ను ఇవ్వకుంటే ప్రజలను తయారు చేసుకోలేరు. అందువలన ఇప్పుడు స్వయాన్ని శక్తిశాలిగా చేసుకోండి. జ్ఞాన స్వరూపులుగా చేసుకోండి. స్వయాన్ని అనేక ప్రకారాలైన 'క్యూ'ల నుండి ముక్తము చేసుకోండి. లభించే యుక్తులను పనిలో ఉపయోగించరు. అందుకే ముక్తులుగా అవ్వడం లేదు. మంచిది. ఇదంతా 'క్యూ' కు రెస్పాన్స్. ఇప్పుడు బాప్‌దాదా పిల్లలతో వీడ్కోలు తీసుకుంటారు.

**08-02-1975**

**కళ్యాణకారి** తండ్రి శ్రీమతాన్ని అనుసరించే ఆత్మలు కళ్యాణం గురించి, ఉన్నతమయ్యే కళ గురించి తప్ప ఇతర ఏ సంకల్పాలు చెయ్యలేరు. వారి ప్రతి సంకల్పము, ప్రతి కార్యము పట్ల, సదా వర్తమానము లేక భవిష్యత్తు పట్ల సమర్థంగానే ఉంటాయి, వ్యర్థంగా ఉండవు. భయపడడం లేదు కదా! ఎదుర్కోవాల్సి ఉంటుంది. పేపర్‌ను(పరీక్షను) ఎదుర్కోవడము అనగా ముందుకు వెళ్లడము అనగా సంపూర్ణతకు అతిసమీపంగా రావడం. ఇప్పుడు ఈ పేపరు రానున్నది. స్వయం స్పష్టమైన బుద్ధిగలవారిగా ఉంటే



ఇతరులకు కూడా స్పష్టము చేయగలరు. అంటే ఇదైతే జరగదు అని భావించడం లేదు కదా! డ్రామాలో ఏదైతే జరుగుతూ వస్తోందో సమయ ప్రతి సమయము అది వెన్న నుండి వెంట్రుక వలె సహజంగానే జరిగింది కదా ఏమైనా కష్టము కలిగిందా? బాప్‌దాదా కన్నుల పై కూర్చోబెట్టుకొని, హృదయ సింహాసనం పై కూర్చోబెట్టుకొని దాటిస్తూ తీసుకొస్తున్నారు కదా!ఎవరైనా చివరి వరకు తోడు నిభాయించే పనిని లేక ఎటువంటి పరిస్థితులనైనా దాటించే ప్రతిజ్ఞను లేక కార్యాన్ని నిభాయిస్తారా? లేదు. జతలో తీసుకునే వెళ్లాలి కదా. ఇక్కడ మీకు సర్వశక్తివంతులు తోడుగా ఉన్నప్పటికీ ఈ సంకల్పము ఉత్పన్నమవుతూ ఉంటే వారిని ఏమంటారు? ఇలాంటి వ్యర్థ సంకల్పాలు సమాప్తి చేసి ఏ స్థాపనా కార్యానికి నిమిత్తంగా అయ్యారో, బాప్‌దాదాకు సహాయకులుగా ఉన్నారో ఆ కార్యంలో నిమగ్నమై ఉండండి. తమ లగ్నమనే అగ్నిని తీవ్రము చెయ్యండి. ఈ లగ్నమనే అగ్ని ద్వారానే వినాశనపు అగ్ని తీవ్ర స్వరూపాన్ని ధరిస్తుంది. ఇది మీ ద్వారా రచింపబడిన అవినాశి జ్ఞాన యజ్ఞము. బ్రాహ్మణులైన మీరు దీనికి నిమిత్తంగా ఉన్నారు. ఈ యజ్ఞంలో మొదట స్వయం మీరే అన్ని బలహీనతలను, లోపాలను ఆహుతి వేయండి. అప్పుడే మొత్తం ప్రాత పపంచము ఆహుతై సమాప్తి అవుతుంది. ఇప్పుడు దృఢ సంకల్పం అనే అగ్నిని రాజేయండి, అప్పుడే ఇది సంపన్నమవుతుంది.

**10-02-1975**

పాండవులు బాణం వేస్తూనే నీళ్లు వచ్చాయి అని కల్పక్రితపు గాయనముంది అనగా పురుషార్థము చేశారు, ఫలం లభించిందని అర్థము. ఇది ప్రత్యక్ష ఫలం పొందే సమయము. ఇది సీజన్. వరదానీ సమయము, దీని లాభము తీసుకోండి. మీ సాధనాలను, మీ ప్రతి సమయమును, మీ సంపదను త్యాగం చేయండి. అప్పుడే ప్రత్యక్ష ఫలం యొక్క భాగ్యాన్ని ప్రాప్తి చేసుకోగలరు. మీ విశ్రాంతిని సేవ కొరకు అర్పణ చేసిన సంపదను స్వయానికి వినియోగించినట్లయితే ఎప్పుడూ సఫలత లభించదు. ఉదాహరణానికి ఆదిలోని ఆత్మలు సేవ ప్రారంభంలో తమ ఆహారాన్ని కూడా

తక్కువ చేసుకొని ప్రతి వస్తువును సేవలో వినియోగించారు. అందుకు ప్రత్యక్ష ఫలము ఆత్మలైన మీరే. అలాగే మధ్యలో తండ్రి మరియు డ్రామా, సహజ సాధనాలను స్వయం పట్ల వినియోగించుకునే అనుభవము కూడా చేయించారు. కాని ఇప్పుడు అంతిమములో ప్రకృతి దాసీగా అయినప్పటికీ, అన్ని సాధనాలు ప్రాప్తించినప్పటికీ స్వయం పట్ల కాక సేవ కొరకు వినియోగించండి ఎందుకంటే ఇక ముందు అనేకమంది ఆత్మలు సాధనాలను మరియు సంపదను మీ ముందు చాలా ఎక్కువగా అర్పణ చేస్తారు కానీ స్వయం కొరకు ఎప్పుడూ స్వీకరించకండి. స్వయం కొరకు స్వీకరిస్తే స్వయాన్ని శ్రేష్ఠ పదవి నుండి వంచితులుగా చేసుకుంటారు.

**02-08-1975**

స్వయాన్ని ఫస్ట్ నంబరులో ఉన్నామని భావిస్తున్నారా లేక సెకండు నంబరులోనా? లండన్ గ్రూపు ఏ నంబరులో ఉంది? డబల్ విదేశీ గ్రూపు బాప్‌దాదాను విశేషంగా ఆహ్వానము చేశారు. అందరూ విదేశీయులే కాని వీరు డబల్ విదేశీయులు. అయితే డబల్ విదేశీయులు విశేష రూపముతో బాప్‌దాదాను ప్రత్యక్షము చేయాల్సి ఉంటుంది. ఎప్పుడైతే వారు నయనాల వెలుగుగా అవుతారో అప్పుడే ప్రత్యక్షము చేయగల్గుతారు. భుజాలుగా కాదు. విదేశీయులు సేవకు క్రొత్త ప్లాన్లు తయారుచేయాలి. ఏ విధంగా భారతదేశంలో నివసించే సేవాధారీ ఆత్మలు క్రొత్త క్రొత్త సేవా పద్ధతులను కనుగొంటున్నారో అలా డబల్ విదేశీయులు ఏ క్రొత్త పద్ధతులను కనుగొన్నారు? ఏ విధంగా భారతదేశంలో కనుగొన్న వాటితో విదేశాలలో కూడా సేవ చేస్తున్నారో అలా విదేశాలలో కనుగొన్న ప్లాన్లతో భారతదేశంలో సేవ జరగాలి. ఏ విధంగా ప్రదర్శినీలు, మేళా(ఫేర్)లు, ప్రొజెక్టర్-షో, గీతా పాఠశాలలు ఇవన్నీ భారతదేశంలో నివసించేవారి అన్వేషణలో, అలా విదేశీయులు ఏమి కనుగొన్నారు? (మారిషస్‌లో ప్రధానమంత్రిని పిలిచారు). ఎవరినైనా పిలవడం ఇది కూడా ఇక్కడి నుండే మొదలైంది. కానీ దానిని ప్రత్యక్షంగా(ప్రాక్టికల్‌లో) అక్కడ తీసుకొచ్చారు. భారతదేశము వారు ప్రాక్టికల్‌గా చేయలేదు, మంచిది. ఏదైతే చేశారో దానికి బాప్‌దాదా



అభినందనలు తెలుపుతున్నారు. కాని అక్కడ నుండి ఏవైనా కొత్త సేవా పద్ధతులు కనుక్కున్నారా? విదేశీ వాతావరణ ప్రమాణంగా అలాంటి విహంగ మార్గ సేవా సాధనాలను కనుగొనాలి. వాటి ద్వారా కొద్ది సమయములోనే విదేశాలలో సందేశము చేరుకోవాలి. టి.వి లేక రేడియోలలో మీ కార్యక్రమాలు వస్తున్నాయి. అది అక్కడ సాధారణమైన విషయము. ఏ విధంగా మీ సేవలు వస్తాయో అలా ఇతరులవి కూడా వస్తాయి. ఇండియాలో ఇది గొప్ప విషయమే కాని చాలా స్థానాలలో ఇది సాధారణమైనదే. కనుక కొద్ది సమయములోనే ధైర్యము, ఉల్లాస- ఉత్సాహాలను చూపిస్తూ సేవను ముందుకు తీసుకెళ్లే పురుషార్థం చేశారు. అందుకు బాప్‌దాదా 'లాస్ట్ సో ఫాస్ట్' అను టైటిల్‌ను ఇచ్చారు. కాని ఇప్పుడు పరస్పరంలో విదేశీయులందరూ కలిసి ఎలాంటి క్రొత్త సేవా పద్ధతి కనుగొనాలంటే విదేశీయుల నుండి బలంగా ఆ ధ్వని భారతవాసుల వరకు చేరుకోవాలి. విదేశీయుల సేవకు ముఖ్యమైన ఫౌండేషన్(పునాది) ఇదే. విదేశీయుల శబ్ధం ద్వారా భారతదేశంలోని కుంభకర్ణులు మేలుకోవాలి. విదేశీ సేవల లక్ష్యం ఇదే. విదేశాలది, విదేశాలలో చూపించడం ఏమంత గొప్ప విషయము కాదు. ఈ లక్ష్యంతోనే విదేశాల సేవ డ్రామాలో ఇమిడి ఉంది. ఇప్పటివరకు కూడా ఏ అన్వేషణ అయినా విదేశాల నుండే వస్తూ వచ్చింది. భారతవాసులు భారతదేశ అన్వేషణలను కూడా విదేశీయుల ద్వారానే అంగీకరిస్తూ వచ్చారు. అలాగే ఈ ఈశ్వరీయ ప్రత్యక్షతా శబ్ధము కూడా విదేశీ సేవ ద్వారానే భారతదేశంలో ప్రఖ్యాతమౌతుంది. విదేశీయులు ఈ కార్యము కొరకు నిమిత్తమయ్యారు. కనుక ఇప్పుడు అలాంటి అన్వేషణ చెయ్యండి. అలాంటి ఆత్మను నిమిత్తముగా చెయ్యండి - వారి అనుభవ యుక్త శబ్ధము వ్యాపించాలి, నోటి శబ్ధము కాదు. అనుభవయుక్త శబ్ధము విదేశాల నుండి భారతదేశము వరకు చేరుకోవాలి. అంతిమ సమయంలో విదేశీ సేవకు ఇంత మహత్యం ఎందుకు ఇచ్చారు? ఎందుకంటే వెళ్లేవారికి కూడా ఇలాంటి సున్నితమైన లేక సమీప సమయములో విదేశాలకు ఎందుకు పంపించారు? అని సంకల్పం ఉంటుంది. అంతిమంలో విదేశాల నుండే

భారతదేశంలోకి రావాలి. అయినా విదేశీ సేవ ముందుకు వెళ్తోంది. మంచి మంచి ఫ్యాండ్స్‌ను భారతదేశంలో అవసరం ఉండినా విదేశీ సేవ కోసం పంపిస్తున్నారు. ఇతర మతాలకు స్వర్గంలోకి వచ్చే పాత్ర లేదని కూడా తెలుసు. కాని ఎవరైతే కన్వర్ట్ అయ్యి మతం మార్చుకున్నారో ఆ ఆత్మలను తమ ఆది ధర్మంలోకి తెచ్చేందుకు పంపించడం జరుగుతుంది. వారు చాలా కొద్దిమందే ఉంటారు. విదేశీ సేవకు ముఖ్య లక్ష్యము ఇదే - విదేశీయుల ద్వారా భారతదేశానికి సందేశము లభించే రహస్యము డ్రామాలో ఇమిడి ఉంది. కాబట్టి విదేశీ సేవకు ఫస్ట్‌ఛాన్స్ ఇచ్చారు. గీతా పాఠశాలలు తెరవడం, టి.వి.లో చెప్పడం ఇవేవీ లక్ష్యం కాదు. ఇవన్నీ లక్ష్యం వరకు చేరుకునే సాధనాలు. అర్థమయ్యిందా? కనుక ఇప్పుడు భారతదేశం వరకు సందేశము త్వరత్వరగా ఎలా వ్యాపింపచేయాలని పరస్పరం కలిసి నిర్ణయించండి. విదేశాల ద్వారా భారతదేశములో శబ్దం ఎలా వ్యాపించాలి?

**02-09-1975**

మీరి ఆహ్వానంతో పాటు మరోవైపు బాప్‌దాదా కూడా ఆహ్వానిస్తున్నారు - **సమానంగా మరియు సంపూర్ణంగా, సూక్ష్మవతన నివాసీ ఫరిస్తాగా అయ్యి తండ్రి జతలో ఇంటికి వెళ్లాలి.** వెళ్లాలా లేక సంగమ యుగము మంచిగా అనిపిస్తోందా? ఎవర్‌రెడీగా ఉన్నారా? ఎక్కడ కూర్చోపెడ్తారో, ఏ రూపంలో, ఎంతవరకు కూర్చోబెడ్తారో.......... ఈ ప్రతిజ్ఞలో సదా స్థితమై ఉన్నారా? లాస్ట్ ఆర్డర్(-చివరి ఆజ్ఞ) ఆత్మిక మిలట్రీకి ఎంత సమయంలో లభిస్తుంది. ఒక్క సెకండు మాత్రమే. ఒక్క గంట ముందు కూడా వార్త (వార్నింగ్\Warning) చెప్పరు. అప్పుడే అష్టరత్నాలు వెలువడ్తారు. తారీఖు చెప్పి పరీక్ష తీసుకోరు. డ్రామాలో నిశ్చితమైయున్న తారీఖు, సమయము చెప్పరు. ఇప్పుడు ఏవరేజ్‌గా(అందాసుగా) చెప్తారు. **కాని లాస్ట్ పేపరంటే ఒక్కటే ప్రశ్న ఉంటుంది, సమయము ఒక్క సెకండే ఉంటుంది. కనుక పిల్లలు ఎవర్‌రెడీగా ఉండాలి.**



**05-09-1975**

ఫరిస్తా స్థితిలో సదా స్థితమై ఉంటున్నారా? ఫరిస్తా స్వరూప లైట్‌లో ఇతర ఆత్మలకు కూడా లైటే కనిపిస్తుంది. హద్దు డ్రామాలో నటులు నటిస్తున్నప్పుడు లైటు కారణంగా అతి సుందరంగా కనిపిస్తారు. వారే సాధారణ జీవితంలో సాధారణ లైట్‌లో పాత్ర చేస్తున్నప్పుడు రెండిటికీ రాత్రి, పగలుకున్నంత తేడా కనిపిస్తుంది కదా. లైట్ ఫోకస్ వారి ఫీచర్స్ (ముఖకవళికల)నే పరివర్తన చేసేస్తుంది. అలాగే బేహద్ డ్రామాలో మీరు హీరో-హీరోయిన్ పాత్రధారులు. **అవ్యక్త స్థితి అను లైట్‌లో పాత్ర చేస్తే ఏం కనిపిస్తుంది? అలౌకిక ఫరిస్తా.** సాకారులకు బదులు సూక్ష్మవతన వాసులుగా కనిపిస్తారు. సాకారులుగా ఉండినా, ఆకారులుగా అనుభవం అవుతారు. మీ ప్రతి కర్మ ప్రతి ఒక్కరినీ స్వతహాగానే ఆకర్షిస్తుంది.

ఈ రోజుల్లో హద్దు సినిమా లేక డ్రామా కలియుగీ మనుష్యుల ఆకర్షణకు ముఖ్యకేంద్రము. వద్దనుకున్నా, చూడరాదు అనుకున్నా, హద్దు యాక్టర్ల నటన తమవైపు ఆకర్షిస్తుంది. కాని దానికి ఆధారం లైటు. అలాగే ఈ అంతిమ సమయములో మాయ ఆకర్షణ అతిగా అయిన తర్వాత సమాప్తం అవ్వనున్నది. అనంతమైన హీరో పాత్రధారులు సదా బిందు(జీరో) స్వరూపంలో స్థితమై ఉంటూ జీరో తండ్రి జతలో ప్రతి పాత్ర చేస్తారు. దివ్యజ్యోతి స్వరూపములో స్థితమైనవారి స్థితి కూడా లైట్‌గా ఉంటుంది మరియు స్టేజ్ పై వారి ప్రతి పాత్ర లైట్‌లోనే ఉంటుంది అనగా ఎవరైతే డబల్‌లైట్ ఫరిస్తాలుగా ఉంటారో వారు ప్రతి ఆత్మను స్వతహాగానే తమ వైపుకు ఆకర్షించుకుంటారు. ఈనాటి ప్రపంచంలో డ్రామా కాక ఇంకా ఏముంది? ఫరిస్తాల నయనాల వలె ఆకర్షించేది ఏముంది? టి.వి. ఎలాగైతే టి.వి ద్వారా ఈ ప్రపంచములోని ఎలాంటెలాంటి దృశ్యాలు చూస్తూ ఆకర్షితులవుతారో అనగా దిగేకళలోకి వెళ్తారో అలాగే ఫరిస్తాల నయనాలు దివ్య దూరదర్శిని చేసే పనిని చేస్తాయి. వారి ప్రతి ఒక్కరి నయనాల ద్వారా కేవలం ఈ ప్రపంచమునే కాదు, మూడు లోకాలను దర్శిస్తారు. ఇటువంటి ఫరిస్తాల మస్తకములో మెరిసే మణి, ఆత్మలకు సర్చ్‌లైట్ లేక

లైట్‌హౌస్ వలె స్వ స్వరూపాన్ని, స్వ మార్గాన్ని, శ్రేష్ఠ గమ్యాన్ని స్పష్టంగా సాక్షాత్కారం చేయిస్తుంది.

**18-09-1975**

అనేక రకాలైన మాయ భ్రమలకు గుర్తు ఏది? ఏ విధంగా చక్రధారీ ఆత్మ లైట్ కిరీటధారిగా ఉంటుందో, తండ్రి వారసత్వానికి అధికారిగా ఉంటుందో, అలా మాయ యొక్క అనేక రకాల చక్రంలో వచ్చిన వారి గుర్తులు ఏవి? ఎలాగైతే వారి తల పై లైట్ కిరీటం ఉంటుందో, అలా వీరి తల పైన అనేక విఘ్నాల బరువు ఉంటుంది, కిరీటం ఉండదు. సదా ఏదో ఒక బరువు వారి తల పై అనగా బుద్ధిలో అనుభవం అవుతుంది. అలాంటి ఆత్మ ఎల్లప్పుడూ రుణగ్రస్థంగా, రోగగ్రస్థంగా ఉంటుంది. వారి మస్తకం పై, ముఖము పై సదా ప్రశ్నార్థకమే ఉంటుంది. ప్రతి విషయంలో ఎందుకు? ఏమిటి? ఎలా? అను ప్రశ్నలు ఉంటాయి. ఒక్క సెకండు కూడా బుద్ధి ఏకాగ్రంగా అనగా ఫుల్‌స్టాప్‌లో ఉండదు. ఫుల్‌స్టాప్‌కు గుర్తు బిందువు అనగా మనస్సులో కూడా బిందుస్వరూప స్థితి ఉండదు. వాచాలో, కర్మణాలో కూడా జరిగి పోయిందేదో జరిగి పోయింది, క్రొత్తదేమీ లేదు, ఏది జరుగుతోందో అది కళ్యాణమే అని ఫుల్‌స్టాప్ అనగా బిందువు పెట్టడం వారికి రాదు.

**28-10-1975**

ఈ విశేషమైన బలహీనతను తొలగించేందుకు విశేషమైన సంఘటన ఉండాలి. మహాకాళీ స్వరూప శక్తుల సంఘటన కావాలి. వారు తమ యోగాగ్ని ప్రభావంతో ఈ వాతావరణాన్ని పరివర్తన చేయాలి. ఇప్పుడు డ్రామానుసారము ప్రతి ఒక్కరి ప్రవర్తన అనే అద్దంలో అంతిమ ఫలితం స్పష్టం అవ్వనున్నది. ఇక ముందు ముందు మహారథీ పిల్లలు తమ జ్ఞాన శక్తి ద్వారా ప్రతి ఒక్కరి ముఖం ద్వారా వారి కర్మల కథను స్పష్టంగా చూడగలరు. ఎలాగైతే శూద్రుల భోజనము చెడు వాసన వస్తుందో, అలాగే శూద్ర సంకల్పాల భోజనము స్వీకరించే ఆత్మల వైబ్రేషన్లు బుద్ధిలో స్పష్టంగా టచ్ అవుతాయి. దీనికి ఆధారము లేక యంత్రము బుద్ధి లైను స్పష్టంగా



ఉండాలి. ఎవరి యంత్రము శక్తిశాలిగా ఉంటుందో, వారు సహజంగా తెలుసుకోగలరు.

**09-12-1975**

ఇప్పుడు ప్రత్యక్షతా సంవత్సరం జరుపుకునేందుకు ముందు స్వయంలో లేక నిమిత్తంగా అయిన సేవాధారుల సంఘటనలో ఈ శక్తి కూడా ప్రత్యక్షం అవ్వాలి. ఒకవేళ స్వయంలోనే శక్తి ప్రత్యక్షత జరగకపోతే తండ్రిని ప్రత్యక్షం చేయడంలో ఎంత సఫలత కోరుకుంటారో అంత సఫలత కలగదు. డ్రామానుసారం అవ్వాల్సిందే, అదేమో జరుగుతుంది కూడా. కాని నిమిత్తంగా అయిన వారికి అందుకు ఫలితం కనిపించాలి. అది జరగదు. డ్రామా చేయిస్తూ ఉంటుంది.

**01-02-1976**

ఇప్పుడు మిమ్మల్ని మీరు “నేను ఎలాంటి దీపపు పురుగును ?” అని ప్రశ్నించుకోండి. అనేక రకాల స్మృతుల భ్రమణం సమాప్తమయ్యిందా? లేక ఇప్పటివరకూ ఏదో ఒక భ్రమించే స్థితి తన వైపు ఆకర్షిస్తోందా? **ఒకవేళ ఏదైనా వ్యర్థ స్మృతుల చక్రంలోకి వస్తూ ఉంటే స్వదర్శన చక్రధారీ సంగమ యుగీ బ్రాహ్మణుల టైటిల్ ప్రాప్తించదు.** స్వదర్శన చక్రధారులుగా అవ్వనివారు భవిష్యత్తులో చక్రవర్తి రాజులుగా కూడా అవ్వలేరు. 63 జన్మలు భక్తిమార్గంలో అనేక రకాల వ్యర్థ చక్ర భ్రమణంలోనే పోగొట్టుకున్నారు. అదే సంస్కారాన్ని ఇప్పుడు సంగమ యుగంలో కూడా కోరుకోకపోయినా ఎందుకు ఎమర్జ్ చేసుకుంటున్నారు? ఇలా వ్యర్థ చక్ర భ్రమణంలో ప్రాప్తి అనుభవం అవుతుందా? నిరాశ అవుతుందా? 63 జన్మలు చక్ర భ్రమణం చేస్తూ అన్నీ పోగొట్టుకుంటూ స్వయాన్ని మరియు తండ్రిని మర్చిపోయినా ఇంకా అలసిపోలేదా? సరైన గమ్యం లభించినా ఇంకా ఎందుకు భ్రమిస్తున్నారు? అవినాశి ప్రాప్తి అవుతున్నా వినాశి అల్పకాలిక ప్రాప్తి ఇప్పటికీ అకర్షిస్తోందా? ఇంకా ఏదైనా ఇతర ఆధారాన్ని ప్రాప్తి చేయించేవారు కనిపిస్తున్నారా? లేక శ్రేష్ఠ గమ్యము గురించి తెలిసినా అల్పకాలిక ఆధారాలను భవిష్యత్తు కోసం దాచిపెట్టుకొని ఉంచుకుంటున్నారా? ఇలాంటి నేర్పరులు కూడా

చాలామంది ఉన్నారు. తీసుకోవడంలో అందరూ తెలివిగానే ఉన్నారు. కాని వదిలే సమయంలో తండ్రితో నేర్పరితనం చేస్తున్నారు. ఎలాంటి నేర్పరితనం చేస్తున్నారు? వదిలే సమయంలో అమాయకులుగా అవుతారు. పురుషార్థలము, సమయానికి అదే వదిలిపోతుందిలే, పరిస్థితులలా ఉన్నాయి, లెక్కాచారాలు కఠినంగా ఉన్నాయి, కోరుకుంటున్నాను కాని ఏమి చేయాలి? నెమ్మది నెమ్మదిగా జరుగుతుందిలే....... ఇలా అమాయకులుగా అయ్యి ఇలాంటి మాటలు తయారు చేసుకుంటారు. జ్ఞానసాగరులైన తండ్రికి కూడా జ్ఞానాన్ని ఇవ్వడం మొదలుపెడ్తారు. **కర్మల గతి తెలిసిన తండ్రికి తమ కర్మ కథలను వినిపిస్తారు. తీసుకునే సమయంలో చతురులుగా అయ్యి చతురతతో - మీరు దయాహృదయులు కదా! వరదాతలు కదా! నేను కూడా అధికారిని, మీ పుత్రునిగా అయ్యాను, పూర్తి అధికారం లభించాలి కదా! అని అంటారు.** తీసుకోవడంలో పూర్తిగా తీసుకోవాలి, కాని వదిలిపెట్టడంలో ఎంతో కొంత దాచుకోవాలి అనగా కొన్ని కొన్ని తమ పాత సంస్కారాలు, స్వభావాలు లేక సంబంధాలను కూడా తోడుగా ఉంచుకుంటారు. కనుక చతురులే కదా. తీసుకోవడం పూర్తిగా తీసుకుంటారు కాని ఇవ్వడం యథాశక్తి. ఇలాంటి చతురత చేసేవారు ఎలాంటి ప్రాలబ్ధాన్ని పొందుతారు? ఇటువంటి చతుర పిల్లల పట్ల డ్రామానుసారము ఏ చతురత జరుగుతుంది?

అందరూ స్వర్గానికేమో అధికారులుగా అవుతారు. కాని రాజధానిలో నంబరువారుగా ఉండనే ఉంటారు కదా. స్వర్గ వారసత్వము తండ్రి అందరికీ ఇస్తారు. కాని ప్రతి ఒక్కరికి తమ సీటు వారి నంబరును బట్టి ఉంటుంది. కనుక డ్రామానుసారము ఎలాంటి పురుషార్థమో అలాంటి పదవి స్వతహాగానే ప్రాప్తిస్తుంది. తండ్రి ఏమీ నంబర్లు ఇవ్వరు. కొంతమందికి రాజు జ్ఞానం, కొంతమందికి ప్రజా జ్ఞానం వేరు వేరుగా ఇవ్వరు. కొందరికి సూర్యవంశీ పదవి, కొందరికి చంద్రవంశీ పదవి కొరకు వేరు వేరుగా చదివించరు. కొందరికి మహారథీలని, కొందరికి గుర్రపు సవారీవారని ముద్ర వేయరు. కాని డ్రామానుసారము ఎవరు ఎలా పురుషార్థం చేస్తారో



అలాంటి పదవినే ప్రాప్తి చేసుకుంటారు. అందువలన తీసుకోవడంలో ఎలా చతురులుగా అవుతారో, అలా ఇవ్వడంలో కూడా నేర్పరులుగా అవ్వండి, అమాయకులుగా అవ్వకండి. మాయ చతురతను తెలుసుకొని మాయాజీతులుగా అవ్వండి. ఇప్పటి వరకు యథార్థ గమ్య స్థానానికి బదులు వేరే ఏదో ఒక అల్పకాలిక గమ్యముగా(ఆధారము) లేదు కదా అని చెక్ చేసుకోండి. కోరుకోకపోయినా బుద్ధి ఎక్కడికైనా వెళ్తోందా? బుద్ధి ఎక్కడికో వెళ్తున్నది అంటే అక్కడ ఏదో ఒక ఆధారం ఉందని అర్థం. కావున హద్దులోని ఆధారాలన్నీ చెక్ చేసుకొని ఇప్పుడు సమాప్తం చెయ్యండి లేకపోతే ఇవే ఆధారాలు సదాకాలపు శ్రేష్ఠమైన గమ్యాన్ని దూరం చేసేస్తాయి. ఇలా చేయండి అని బాబా శ్రీమతాన్ని స్పష్టంగా ఇస్తారు. కానీ పిల్లలు 'ఇలా' అనుటకు బదులు 'ఎలా' అని మార్చేసుకుంటారు. ఎలా అని అనడం సమాప్తి చేసి తండ్రి ఎలా నడిపిస్తే అలా నడవండి.

**02-02-1976**

భక్తుల చార్టులో - అల్పకాలిక భక్తి ఫలము ఏదైతే భక్తులకు లభిస్తుందో లేక ప్రాప్తిస్తుందో అందులో 75% భక్తులు కేవలం తమ పేరు, గౌరవం మరియు ప్రతిష్ఠ పట్ల స్వార్థ స్వరూప భక్తులుగా ఉన్నట్లు చూశారు. అందువలన వారి కర్మల ఫలమునిచ్చే ఖాతా సమాప్తమైపోయి ఉంది. వారికి తండ్రి ఫలం ఇవ్వాల్సిన అవసరం లేదు. మిగిలిన 25% భక్తులు నంబరువారుగా శ్రద్ధతో భక్తి చేస్తున్నారు. ఆ భక్తి ఫలం ఈ పాత ప్రపంచంలోనే ప్రాప్తిస్తుంది ఎందుకంటే భక్తి ఖాతా ఇప్పుడు అర్థకల్పం కోసం సమాప్తమవుతుంది. భక్తిలో పద్ధతి కూడా ఎలా ఉందంటే, ఇప్పుడిప్పుడే చేస్తారు, ఇప్పుడిప్పుడే లభిస్తుంది అనగా అల్పకాలిక శ్రద్ధకు ఫలం ఇప్పుడే అల్పకాలానికి ప్రాప్తిస్తుంది. భవిష్యత్తుకు జమ అవ్వదు. ఉదాహరణకు వర్షాకాలంలో చీమలకు రెక్కలొస్తాయి. అవి చాలా సంతోషంగా ఎగరడం ప్రారంభిస్తాయి. భక్తులకు లభించే ప్రాప్తి కూడా ఇలాంటిదే. ఈ అల్పకాల విహారము, వాటిని ఆ సీజనులోనే సమాప్తి చేసేస్తుంది. అక్కడే ప్రాప్తి, అక్కడే సమాప్తి. అలాగే ఇప్పటి భక్తులు అనగా

కలియుగీ తమోప్రధాన భక్తులు అల్పకాల ప్రాప్తితోనే సంతోషపడ్తారు. అందువలన వారి ఫల ప్రాప్తి డ్రామానుసారము సమాప్తి అయ్యే ఉంది. కేవలం 5% ప్రాప్తి మిగిలి ఉంది. ఇప్పుడు ఈ అతి సమయములో చాలా పెద్దగా ఆర్తనాదాలు చేస్తారు, అందులో కూడా విశేషించి శక్తులనే పిలుస్తారు. వరదానాలు ఇవ్వండి, శక్తులు ఇవ్వండి, ధైర్యం, సాహసం ఇవ్వండి అని పిలుస్తారు. ఇప్పుడు అతిలోకి వెళ్లి మళ్లీ సమాప్తి అవుతుంది. కావున భక్తుల లెక్కాచారము తెలిపే రిజిస్టరు సమాప్తి అయ్యే ఉంది. ఏదైతే కొద్దిగా మిగిలి ఉందో అది ఇప్పుడిప్పుడే కర్మ, ఇప్పుడిప్పుడే ఫలం రూపంలో సమాప్తమైపోతుంది. ఇది భక్తుల సమాచారము.

**07-02-1976**

ఇది మహారథుల పురుషార్థము అని స్పష్టమయ్యే మహారథుల మహాన్ స్థితికి విశేష గుర్తులెలా ఉంటాయి? ఒకటి - మహాన్ పురుషార్థులు అనగా మహారథులు. వీరు ఏ దృశ్యము చూచినా డ్రామా ప్లాను అనుసారము ఇది అనేకసార్లు జరిగింది, ఇప్పుడు మళ్లీ రిపీట్ (పునరావృతము) అవుతూ ఉంది, "నథింగ్ న్యూ"(కొత్తదేమీ కాదు) అని అనిపిస్తుంది. వారికి ఎందుకు? ఏమి? అను ప్రశ్నలు ఉత్పన్నమయ్యే కొత్త విషయంగా అనుభవము కాదు. రెండవది - ప్రాక్టికల్‌గా, స్మృతి స్వరూపంలో అనేకసార్లు చూచిన దృశ్యంగా ఇప్పుడు కేవలం నిమిత్త మాత్రం రిపీట్ చేస్తున్నామని అనుభవమవుతుంది. ఇప్పుడు కొత్తగా ఏదీ చేయడం లేదని, రిపీట్ చేస్తున్నామని అనిపిస్తుంది. జ్ఞాపకం తెచ్చుకోవలసిన అవసరముండదు. కల్పక్రితము ఏది జరిగిందో ఇప్పుడు మళ్లీ జరుగుతూ ఉంది. ఒక సెకండు క్రితము జరిగిన విషయము చాలా స్పష్టంగా ఎలా గుర్తుంటుందో, అలా కల్పక్రితము జరిగిపోయిన ఆ దృశ్యము అలాగే స్మృతిలో ఉంటుంది. ఒక సెకండు ముందు జరిగిపోయిన అంకము స్మృతిలో ఉన్నట్లు ఉంటుంది. ఎందుకంటే ఒకటి సాక్షి స్థితి, రెండవది త్రికాలదర్శి. ఈ రెండూ మహారథుల స్థితులైనందున కల్పక్రితపు స్మృతి పూర్తి ఫ్రెష్‌గా, తాజాగా ఉంటుంది. అందువలన నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు) అని



అనిపిస్తుంది.

రెండవది ఏముంటుంది? ఏదైనా ఎంత భయంకర పరిస్థితి అయినా, చాలా పెద్ద సమస్య అయినా, తమ స్థితి ఉన్నతంగా ఉన్నందున అది చాలా చిన్నదిగా కనిపిస్తుంది. పెద్ద విషయంగానూ అనుభవం కాదు, భయంకరమైనదిగా కూడా అనుభవం కాదు. ఒక ఎత్తైన పర్వతం పై నిలబడి క్రింద ఉన్న ఏ వస్తువును చూచినా, పెద్ద వస్తువు కూడా చిన్నదిగా కనిపిస్తుంది కదా. అత్యంత పెద్ద కర్మాగారము(ఫ్యాక్టరీ) కూడా ఒక మాడల్ (నమూనా) రూపంలో కనిపిస్తుంది. అదే విధంగా మహారథుల మహాన్ పురుషార్థము ముందు వారికి ఏ పెద్ద విషయమూ పెద్దదిగా అనుభవమవ్వదు. కనుక మహావీరులనగా మహారథులు చేసే మహాపురుషార్థాన్ని చూపే ఈ రెండు గుర్తులుండేవారు. దీనినే వేరే మాటలలో "శూలము ముల్లులా అనుభవమవుతుంది (శూలీ సే కాంటా)" అని అంటారు. ఇటువంటి మహావీరుల నోటి నుండి జరగబోయే ఫలితం ఏదైతే ఉందో, అనగా ఏదైతే జరగబోతోందో, డ్రామాలో ఏదైతే నిశ్చయమై ఉందో సదా అవే మాటలే వస్తాయి. దీనినే సిద్ధి స్వరూపమని అంటారు. వారి నోటి నుండి ఏ మాటలు వెలువడ్తాయో, వారి ద్వారా ఏ కర్మలు జరుగుతాయో అవి జరిగేవిగానే(సిద్ధమయ్యేవిగా) ఉంటాయి, వ్యర్థమైనవిగా ఉండవు. మహారథుల గుర్తు - వికర్మల ఖాతా అయితే సమాప్తమవ్వనే అవుతుంది. అంతేకాక వ్యర్థ ఖాతా కూడా సమాప్తమవుతుంది. మాస్టర్ సర్వశక్తివంతులు కదా. మాస్టర్ సర్వశక్తివంతుల ప్రాక్టికల్ స్వరూపము - వికర్మల ఖాతాతో పాటు వ్యర్థ ఖాతా కూడా సమాప్తమైపోతుంది. ఇది మహారథుల పురుషార్థానికి గుర్తు.

**29-01-1977**

అందరూ సదా సంతోషంగా ఉన్నారు కదా? మూడు కాలాల రహస్యాన్ని తెలుసుకున్నారు కనుక ప్రసన్నమైపోయారు కదా? ఎప్పుడైనా ఎవరైనా అప్రసన్నంగా, అసంతుష్టంగా ఉన్నారంటే డ్రామా రహస్యాన్ని మరచిపోయారని అర్థమౌతుంది. ఎవరైతే సదా డ్రామా రహస్యాన్ని, మూడు

కాలాల గురించి తెలుసుకున్నారో వారు సంతుష్టంగా ఉంటారు కదా. అప్రసన్నంగా(నారాజ్‌గా) ఉండేందుకు కారణము రాజ్(రహస్యము) తెలుసుకోలేక పోవడమే. మూడు కాలాల గురించి తెలిసిన వారిని త్రికాలదర్శి అని అంటారు. వారు సదా రాజీగా (ప్రసన్నంగా), సంతోషంగా ఉంటారు. మధువన నివాసులంటే సదా సంతోషంగా, రాజీగా ఉండేవారు. ఇతరులతో అప్రసన్నంగా ఉండడం అనగా తమను తాము రహస్యాన్ని తెలుసుకునే స్థితి నుండి క్రిందికి తెచ్చుకోవడమే. సింహాసనము వదిలి క్రిందికి వచ్చేస్తారు. అప్పుడు నారాజ్ అయిపోతారు. త్రికాలదర్శులనగా నాలెడ్జ్‌ఫుల్. నాలెడ్జ్‌ఫుల్ స్థితి ఒక సింహాసనం. అది ఉన్నతమైనది. ఈ సింహాసనము దిగి క్రిందికి వచ్చినప్పుడు నారాజ్‌గా(అసంతుష్టంగా) అయిపోతారు. ఎలాంటి స్థానమో అలాంటి స్థితి ఉండాలి.

**28-04-1977**

స్మృతిలో ఉండుట వలన సమర్థత వస్తుంది. సమర్థత ఉంటే ఎటువంటి పరిస్థితి అయినా స్వస్థితిని కదిలించలేదు. పరీక్షలను ఒక ఆటగా భావించి నడుస్తూ ఉండాలి. ఆటలో లేక నాటకములో ఏదైనా పరిస్థితిని చూస్తే డగ్‌మగ్ అవుతారా?(చలిస్తారా?) ఎవరైనా మరణించినా లేక ఏమి జరిగినా స్థితి కదిలిపోదు. ఎందుకంటే అది ఒక ఆట అని తెలుసు. అలాగే పరిస్థితులను ఒక పాత్రగా భావించండి. పరిస్థితుల పాత్రను సాక్షిగా ఉండి చూచుట వలన విచలితమవ్వరు, ముడుచుకొని పోరు, సంతోషంగా ఉంటారు. డ్రామా పాయింటును మర్చిపోతే ఉదాసీనులై వాడిపోతారు,

**03-05-1977**

బాప్‌దాదా ఈ అనంతమైన అనాది అవినాశి డ్రామాలో ఏ విశేషమైన అంకమును చూచి హర్షితమౌతారు? తెలుసా? వర్తమాన సమయంలో బాప్‌దాదా బ్రాహ్మణుల విచిత్రమైన, నవ్వు తెప్పించే లీలను చూస్తున్నారు. పిల్లలు ఎలాగైతే "ఓ ప్రభూ! మీ లీల అపరం అపారము" అని



అంటారో అలా తండ్రి కూడా పిల్లల లీల చాలా అద్భుతం(ఆశ్చర్యం కలిగించేది) వెరైటీ లీల అని అంటారు. అన్నిటికంటే అద్భుతంగా ఏ లీల కనిపిస్తూ ఉందో తెలుసా? ఇప్పుడిప్పుడే "చేయాల్సింది చాలా ఉంది" అని అంటారు. కాని ఏమి చేస్తారు? అది స్వయం మీకు కూడా తెలుసు. ఎందుకు చేస్తున్నారో కూడా తెలుసు. ఉదాహరణానికి ఏదైనా వికారాలకు వశీభూతమైన ఆత్మ, పరవశమైన ఆత్మ, స్పృహ తప్పిన ఆత్మ ఏమి మాట్లాడుతుందో, ఏమి చేస్తుందో కొంచెం కూడా అర్థము చేసుకోలేదు. ఇలాంటి లీల బ్రాహ్మణులు కూడా చేస్తున్నారు. బాప్‌దాదా ఇటువంటి లీలను చూచి దయాహృదయులుగా కూడా అవుతారు. న్యాయకర్త సుప్రీం జడ్జిగా కూడా అవుతారు. అనగా లవ్ అండ్ లా(ప్రేమ మరియు చట్టము) రెండిటిని బ్యాలన్స్ చేస్తారు. ఒకవైపు దయాహృదయులై తండ్రి సంబంధములో కొంత రాయితీ కూడా ఇస్తారు అనగా ఒకటి, రెండు, మూడు సార్లు క్షమిస్తారు కూడా. మరోవైపు సుప్రీం జడ్జి రూపములో కళ్యాణకారి అయినందున పిల్లల కళ్యాణము కొరకు ఈశ్వరీయ నియమాలు కూడా తెలుపుతారు. ఈ సంగమ యుగములో అన్నిటికంటే పెద్ద అనాది లా ఏది (నియమమేది)? డ్రామా ప్లాను అనుసారము ఒక లక్ష రెట్లు ప్రాప్తి మరియు పశ్చాత్తాపం లేక అనుభవించడం. ఈ నియమము ఆటోమేటిక్‌గా నడుస్తూనే ఉంటుంది. తండ్రి స్థూల పద్ధతులలాగా, ఆచారాలలాగా ఈ కర్మకు ఇది తీసుకోండి, ఈ కర్మకు ఈ శిక్ష అని చెప్పవలసిన, చెయ్యవలసిన పని లేదు. ఇది ఆటోమేటిక్‌గా నడిచే ఈశ్వరీయ మిషనరీ (స్వయంగా నడిచే ఈశ్వరీయ యంత్రము). దీనిని కొంతమంది పిల్లలు తెలుసుకోలేరు. అందుకే కర్మల గతి అతిగుహ్యమైనదని మహిమ చేయబడింది.

ఏ ఆధారమైతే వినాశి మరియు పరివర్తనాత్మకమో దానిని ఆధారంగా చేసుకున్న కారణంగా స్వయం కూడా సర్వ ప్రాప్తులను వినాశీ సమయంలోనే అనుభవం చేస్తారు. స్థితి కూడా ఏకరసంగా ఉండదు. మాటిమాటికి పరివర్తనవుతూ ఉంటుంది. ఇప్పుడిప్పుడే చాలా సంతోషంగా, ఆనందంగా ఉంటారు, ఇప్పుడిప్పుడే వాడిపోయి కళాహీనమైన మూర్తిలాగా

ఉదాసీన, నీరసమూర్తిలాగా ఉంటారు. కారణమేమంటే ఆధారమే అలాంటిది. చాలామంది ఆత్మలు చాలా మంచి ఉల్లాస-ఉత్సాహాలతో ధైర్యంగా తండ్రి సహయోగంతో చాలా ముందుకు, గమ్యానికి సమీపం వరకు చేరుకుంటారు. కాని 63 జన్మల లెక్కాచారము ఇక్కడే సమాప్తమవ్వాలి. మీ వెనుకటి సంస్కార, స్వభావాలు బయటపడి సదా కొరకు సమాప్తమవుతూ ఉంటాయి. ఆ కర్మల గుహ్యగతి తెలియక చివరి వరకు ఇలాగే నడుస్తుందా(జరుగుతుందా) అని భయపడిపోతారు. ఇంకా ఇంతవరకు కూడా ఈ ఘర్షణ ఎందుకు జరుగుతూ ఉంది?,........ ఇటువంటి వ్యర్థ సంకల్పాల వివాదాల కారణంగా బాబాను ప్రేమించలేరు. ఆలోచించడంలోనే సమయాన్ని వ్యర్థం చేసేస్తారు. కోటానుకోట్లలో కొద్ది మంది మాత్రమే తుఫానులను కూడా డ్రామా ఇచ్చే కానుకలుగా భావించి స్వభావ, సంస్కారాల ఘర్షణను ముందుకు వెళ్లేందుకు ఆధారంగా భావించి మాయను గుర్తించి దాటుకుంటారు. సదా తండ్రిని తోడుగా చేసుకొని సాక్షిగా ఉండి ప్రతి ఆత్మ పాత్రను చూస్తూ సదా హర్షితంగా ముందుకు పోతూ ఉంటారు. ఇప్పుడిక గమ్యానికి చేరుకుంటామనే నిశ్చయం వారికి సదా ఉంటుంది. తండ్రి తమ పిల్లల ఇన్ని రకాల లీలలను చూస్తున్నారు.

**05-05-1977**

నిశ్చయబుద్ధి గలవారి గుర్తు - సదా నిశ్చింతులుగా ఉంటారు. నిశ్చింతులుగా ఉన్నవారే ఏకరసంగా ఉంటారు. ఏమి జరిగినా ఎందుకు? ఏమి? ఎలా? అని ఆలోచించకండి. త్రికాలదర్శులై నిశ్చింతగా ఉండండి. ప్రతి అడుగులో కళ్యాణముంది. ఎందులోనైనా అకళ్యాణము కనిపించినా అందులో కూడా కళ్యాణము ఇమిడి ఉంది. కేవలం అంతర్ముఖులై చూడండి. బ్రాహ్మణులకు అకళ్యాణం ఎప్పుడూ జరగదు ఎందుకంటే కళ్యాణకారి తండ్రి చేతిని పట్టుకున్నారు కదా.

**09-05-1977**

అన్ని రకాల టెన్షన్‌లకు అతీతంగా స్వయం పై, సమయము పై, తండ్రి తోడు పై అటెన్షన్ ఉంచి సెకండు సెకండు పాత్రను అభినయించండి. మీరు ఆల్‌మైటీ అథారిటీ(సర్వశక్తి సాగరుల) సంతానము, మాస్టర్ సర్వశక్తివంతులు. ఇటువంటి నాలెడ్జ్‌ఫుల్ ఆత్మలలో టెన్షన్ కలిగేందుకు ఆధారము రెండు మాటలు. ఆ రెండు మాటలు ఏవి? "ఎందుకు? ఏమి?" ఏ విషయమైనా ఇది ఎందుకు జరిగింది? ఇది ఎలా జరిగింది? ఏమిటి? ఈ రెండు మాటలు బుద్ధిలోకి ఎప్పుడు వస్తాయో అప్పుడు ఏదో ఒక టెన్షన్ మొదలవుతుంది. కాని సంగమ యుగములో శ్రేష్ఠ పాత్ర చేసే ఆత్మలు ఎందుకు? ఏమి? అన్న టెన్షన్‌ను ఉంచుకోరు. ఎందుకంటే వారికంతా తెలుసు. "సాక్షి మరియు సాథీ" స్థితుల విశేషత ద్వారా డ్రామాలో ప్రతి పాత్రను అభినయిస్తూ ఎప్పుడూ టెన్షన్‌లోకి రాజాలరు. కనుక మీదైన ఈ విశేష కళ్యాణకారి సమయాన్ని అర్థము చేసుకొని ప్రతి సెకండు సంస్కారాల రికార్డును నంబర్‌వన్ స్థితిలో నింపుకుంటూ వెళ్లండి.



**14-05-1977**

**ప్రశ్న:-** ఎలాంటి భోజనము ఆత్మను శక్తిశాలిగా చేస్తుంది?

**సమా:-** సంతోషము. సంతోషము వంటి ఆహారము, ఔషధము లేదు అని అంటారు కదా(ఖుషీ జైసా ఖురాక్ నహీ). సంతోషంగా ఉండేవారు శక్తిశాలిగా ఉంటారు. డ్రామా ఢాలును కార్య వ్యవహారాలలో బాగా ఉపయోగిస్తే సదా సంతోషంగా ఉంటారు, వాడిపోరు(ఉదాసీనులుగా అవ్వరు). సదా డ్రామా గుర్తుంటే ఎప్పటికీ వాడిపోరు. సదా సంతోషము బుద్ధి వరకు ఉండాలి. జ్ఞాన రూపంలో కాదు. దృశ్యమేదైనా అందులో మీ కళ్యాణాన్ని వెతికి తీసుకోండి. అప్పుడు సంతోషంగా ఉంటారు.

**19-05-1977**

## దాదీగారితో డ్రామాను గురించి అవ్యక్త బాప్‌దాదా పలికిన మహావాక్యాలు

సాక్షిగా ఉండి ఆత్మలందరి పాత్రలను చూస్తూ ఎవరి పాత్రనైనా చూచి ఇలా ఎందుకు చేస్తున్నారు? అని అలజడి కలుగుతుందా? మహారథులకు, అశ్వారూఢులకు గల విశేషమైన తేడా ఇదే. అశ్వారూఢుల

(గుర్రపు సవారీల) గుర్తు ఏది? ప్రశ్నార్థకము. మహారథుల గుర్తు ఫుల్‌స్టాప్(బిందువు/పూర్తి విరామము). ఏ సైన్యములోనైనా ఫస్ట్ నెంబరు, సెకండు నెంబరు ఉంటారు. వారికి గుర్తులుంటాయి. వారికి మెడల్స్(పతకాలు) లభిస్తాయి. వాటి ద్వారా వీరు ఫస్ట్, వీరు సెకండ్ అని తెలిసిపోతుంది. అయితే అనాది డ్రామాలో **ఆత్మిక సైన్యములోని సేనానులకు ఏ మెడల్‌నూ ఇవ్వరు. కాని డ్రామానుసారము స్వతహాగా వారికి స్థితి అను మెడల్ ప్రాప్తి అవుతుంది. వారు ఏ మెడల్‌నూ ధరించరు - స్వతహాగా ధరించినట్లే ఉంటుంది. వినిపించాను కదా - మహావీరుల పతకం(మెడల్) - ఫుల్‌స్టాప్(బిందువు). స్టాప్ కాదు, ఫుల్‌స్టాప్.** సెకండు నంబరు అనగా అశ్వారూఢుల గుర్తు - అప్పుడప్పుడు స్టాప్, అప్పుడప్పుడు ప్రశ్నార్థకం. వీరి విశేషమైన గుర్తు - ప్రశ్నార్థకమే. ఆత్మలు ఏ స్థితిలో ఉన్నారో ఈ గుర్తులతోనే తెలుసుకోవచ్చు. ఈ గుర్తులే మెడల్స్(పతకాలు). అవి స్పష్టంగా కనిపిస్తాయి కదా. రోజురోజుకు ప్రతి ఆత్మ తనను తాను సాక్షాత్కారం చేయిస్తూ ఉంటుంది. కోరుకోకపోయినా ప్రతి ఒక్కరి స్టేజి అనుసారము వారి స్థితి కనిపిస్తూ ఉంటుంది. వారి ముందు ఎటువంటి పరిస్థితులు, సమస్యలు వస్తాయంటే వద్దనుకున్నా(బయటకు కనిపించవద్దనుకున్నా) స్వయాన్ని దాచిపెట్టుకోలేరు. ఎందుకంటే ఇప్పుడు సమయం సమీపానికి వచ్చే కొలది, సమయం చాలా దగ్గరగా ఉన్నందున స్వయం మాలయే వారిని సాక్షాత్కారం చేయిస్తుంది. స్థితి తమ నంబరును స్వతహాగా ప్రసిద్ధము చేస్తూ ఉంటుంది. ఇలాంటి అనుభవము అవుతూ ఉంది కదా? ఎవరైనా ముందుకు వెళ్లేది ఉంటే వారికి అటువంటి అవకాశమే లభిస్తుంది. ఎవరైనా వెనుక నంబరు వారైతే వారి ముందు సమస్యలు మరియు మాటలు అలాంటివే వస్తాయి. దీని వలన ముందుకు వెళ్లే కళ స్వతహాగా నిలబడే కళగా అయిపోతుంది. ఎంత ప్రయత్నించినా ముందుకు పోలేరు. అడ్డుగోడను దాటుకునే శక్తి ఉండదు. అందుకు మూల కారణమేమంటే మొదటి నుండి ప్రతి గుణాన్ని, ప్రతి శక్తినిచ్చే పాయింటును అనుభవము చేస్తూ నడవలేదు. చాలా కొద్దిమంది ఆత్మలకు మాత్రమే అనుభవం పునాదిగా ఉంటుంది. కాని చాలామంది ఆధారం - సంఘటనను చూడడం



లేక కేవలం సాత్విక జీవితము పై ప్రభావితులు కావడం, ఒక ఆధారంగా భావించి నడవడం లేక ఇతరుల ఉల్లాస-ఉత్సాహాల ద్వారా వారితో నడవడం, ఎవరైనా చెప్పినందున నడవడం, జ్ఞానం బాగుంది అని దాని ఆధారంతో నడవడం ఇలా నడిచేవారి అనుభవం అనే పునాది దృఢంగా లేనందున నడుస్తూ - నడుస్తూ చాలా సంశయంలోకి వచ్చేస్తారు. అయితే నంబరయితే తయారయ్యే తీరాలి. కొంతమంది ఇప్పటికీ ఎలా ఉన్నారంటే యోగము నేర్పిస్తారు కాని యోగానుభూతి లేదు. యోగం అని దేనినంటారో వర్ణన చేస్తారు, యోగంతో ఈ ప్రాప్తులు అవుతాయని చెప్తారు కాని యోగీ జీవితమని దేనినంటారో దాని అనుభవము చాలా అల్పకాలికంగా ఉంది. డ్రామా అని అంటారు. కాని డ్రామా రహస్యాన్ని తెలుసుకొని డ్రామా ఆధారంతో జీవితంలో అనుభవం చేయడం చాలా తక్కువగా ఉంది. ఇలా కనిపిస్తోంది కదా. అయినా తండ్రి అంటారు - ఇలాంటి ఆత్మలకు కూడా తోడునిస్తూ వారిని గమ్యం వరకు తీసుకొని వెళ్లాల్సిందే కదా. తండ్రి తమ వాగ్దానాన్ని నిభాయిస్తారు కదా. కాని సంగమ యుగము యొక్క శ్రేష్ఠ ప్రాప్తులు, శ్రేష్ఠ భాగ్యము ఏదైతే ఉందో వాటితో ఖాళీగా ఉండిపోతారు. సహయోగమనే లిఫ్టుతో నడుస్తూ ఉంటారు. కాని మొత్తం కల్పంలో లభించక, ఇప్పుడు ఏదైతే లభిస్తూ ఉందో దానితో వంచితులుగా ఉండిపోతారు. ఇలాంటి వారిని చూచి బాబాకు దయతో పాటు జాలి కూడా కలుగుతుంది. సాగరుని పిల్లలై ఉండి కూడా చెరువులో స్నానం చేసేందుకు అధికారులుగా అవుతారు. తమలోని చిన్న-చిన్న బలహీనతలకు సంబంధించిన విషయాలలోనే సమయాన్ని గడపడం అనగా చెరువులో స్నానం చేయడమే కదా!

**21-05-1977**

సదా హర్షితము, సదా సంతుష్టము - ఈ ప్రాప్తుల వరదానము సేవాధారులకు స్వతహాగా ప్రాప్తిస్తుంది. ఎందుకంటే ప్రతి ఆత్మ పాత్ర భిన్నంగా ఉంటుందని వారికి తెలుసు. పాత్రధారుల ఎటువంటి పాత్రను చూచినా అసంతుష్టమవ్వరాదు. ఇటువంటి సేవాధారులు మనసు ద్వారా సదా హర్షితంగా, సంతుష్టంగా ఉండు ఎలాంటి పాటలు పాడుతూ ఉంటారు?

"వాహ్ బాబా! వాహ్ నా పాత్ర! వాహ్ మధురమైన డ్రామా! " ఎప్పుడైతే వారు స్వయం మనసుతో ఈ పాటలు పాడుతూ ఉంటారో అప్పుడే సర్వాత్మలు ఇప్పుడే కాక మొత్తం కల్పములో వారిని "వాహ్! వాహ్!" అని పొగుడుతూ ఉంటారు.

**24-05-1977**

మొత్తం డ్రామాలో ఇతర ధర్మాలకు చెందిన ఆత్మలను, స్వయాన్ని చూచుకుంటే ఎంత గొప్ప తేడా ఉందో గమనించండి. మొదటి విషయము - మీరు డైరక్టు పిల్లలు. మాత - పితల సంబంధాన్ని లేక సర్వ సంబంధాల సుఖాన్ని అనుభవము చేసే డైరక్టు పిల్లలైనందున విశ్వరాజ్య వారసత్వము సహజంగా ప్రాప్తి అవుతుంది. సృష్టి ఆదికాలమైన సత్యయుగము అనగా స్వర్గములోని సతోప్రధానమైన సంపూర్ణ ప్రాప్తులు ఆత్మలైన మీకు మాత్రమే ప్రాప్తి అవుతాయి. ఇతర ఆత్మలు వచ్చేదే మధ్య కాలంలో. శ్రేష్ఠ ఆత్మలైన మీరు అనుభవించిన సుఖాన్ని లేక రాజ్యాన్ని రజోప్రధాన రూపములో ప్రాప్తి చేసుకుంటారు. ఉదాహరణానికి ఆత్మలైన మీకు ధర్మము మరియు రాజ్యము రెండూ ప్రాప్తిస్తాయి. కాని ఇతర ఆత్మలకు ధర్మముంటే రాజ్యముండదు, రాజ్యముంటే ధర్మముండదు. ఎందుకంటే ద్వాపర యుగము నుండి ధర్మము, రాజ్యము రెండు పురాలు వేరైపోతాయి. దీనికి గుర్తు మొత్తం కల్పములో డబల్ కిరీటధారులుగా కేవలం మీరు మాత్రమే ఉంటారు. ఇతరులనెవరినైనా చూశారా? ఇంకా అనేక విశేషతలున్నాయి. సంపూర్ణ ప్రాప్తి అనగా తనువు, మనసు, ధనము, సంబంధము మరియు ప్రకృతిలోని సర్వ సుఖాలు - వీటిలో అప్రాప్తిగా ఉండు ఏ వస్తువూ ఉండదు. దు:ఖానికి నామ-రూపాలు కూడా ఉండవు. ఇటువంటి శ్రేష్ఠ ప్రాప్తి ఇతర ఏ ఆత్మలకూ ప్రాప్తించదు. డైరక్టు పిల్లలైనందున అత్యంత ఉన్నతమైన తండ్రికి సంతానమైనందున పరమపూజ్య తండ్రికి పిల్లలైనందున ఆత్మలైన మీరు కూడా డబల్ రూపములో పూజింపబడ్తారు. ఒకటి - సాలిగ్రామ రూపములో, రెండవది - దేవీ దేవతల రూపములో పూజింపబడ్తారు. ఇటువంటి విధిపూర్వక పూజ్యులుగా, ధర్మపితలు(ధర్మస్థాపకులు) గాని లేక ఏ ఇతర పేరు ప్రతిష్ఠలు గల ఆత్మలు



గాని అవ్వలేరు. ఎందుకంటే మీరు డైరక్టు వంశావళి వారు. మీరు ఎంత భాగ్యశాలురో తెలిసిందా. స్వయం భగవంతుడే మీ భాగ్యాన్ని ప్రఖ్యాతము చేస్తారు. కనుక సదా మీ భాగ్యాన్ని స్మృతిలో ఉంచుకోండి. బలహీనతల పాటలు పాడకండి. భక్తులు బలహీనతల పాటలు పాడ్తారు, పిల్లలు తమ భాగ్యాన్ని గురించిన పాటలు పాడ్తారు. కనుక నేను భక్తుడినా, భగవంతుని బిడ్డనా ? అని మిమ్ములను మీరే ప్రశ్నించుకోండి. మీ శ్రేష్ఠ భాగ్యమెంత గొప్పదో అర్థమయ్యిందా?

**28-05-1977**

పరదాదీతో - డ్రామా మీకు కూడా సమీప పాత్ర చేసేందుకు నిమిత్తంగా చేస్తుంది. ఎలాగైతే కల్పక్రితము పాత్రను అభినయించారో ఇప్పుడు కూడా అలాగే అభినయిస్తారు. ఆలోచించడం ద్వారా ప్లాను తయారవ్వదు. కాని వద్దనుకున్నా డ్రామాలోని పాత్ర నిమిత్తంగా చేస్తుంది. ఇందులో కూడా గొప్ప రహస్యముంది. మీకు వరదానముంది. లౌకిక, అలౌకిక తండ్రి కులాన్ని ప్రసిద్ధము చేసేందుకు నిమిత్తమైన ఆత్మలు. మీకు ఈ విశేష వరదానము కూడా ఉంది. అందువలన మిమ్ములను చూస్తూనే ఇరువురూ గుర్తుకొచ్చేస్తారు. లౌకిక ఫీచర్స్ (బ్రహ్మబాబా మొఖము) కూడా గుర్తుకొస్తుంది, ఆ ఫీచర్స్ ద్వారా ఫ్యూచర్ అనగా భవిష్యత్తు(ఫరిస్తా) తయారవుతుందో అది కూడా గుర్తుకొస్తుంది. మీ ప్రతి అడుగులో " రెండు కులాల పేరును ప్రసిద్ధము చేయడం" అను వరదానము ఇమిడి ఉంది. అందువలన స్వయం డ్రామాయే సీటు వైపు లాగుతూ పోతూ ఉంది.

**31-05-1977**

ఇంకా ఏమంటారంటే బంధు-మిత్రులు వినరు లేక సాంగత్యము మంచిగా లేదు అందువలన శక్తిశాలిగా అవ్వలేకున్నామని అంటారు. ప్రతి ఆత్మకు తమ తమ పాత్రలు వేరు వేరుగా ఉంటాయని బాప్‌దాదా ఇంతకు ముందే వినిపించారు. కొందరు సతోగుణీ, కొందరు రజోగుణీ, కొందరు తమోగుణీ పాత్రలు అభినయిస్తారు. వెరైటీ ఆత్మలు, వెరైటీ డ్రామా అయినప్పుడు

ఆత్మలందరికీ ఒకే రకమైన పాత్ర ఉండజాలదు. ఒకవేళ ఏ ఆత్మలకైనా తమోగుణి అనగా అజ్ఞాన పాత్ర ఉంటే శుభ భావన ద్వారా, శుభ కామన ద్వారా ఆ ఆత్మలకు శాంతి మరియు శక్తులను దానమివ్వండి. కాని ఆ అజ్ఞాని పాత్రను చూచి మీ శ్రేష్ఠ స్థితి ద్వారా చేసిన అనుభవాన్ని ఎందుకు మర్చిపోతున్నారు? మీ స్థితిలో అలజడి ఎందుకు కలుగజేసుకుంటూ ఉన్నారు? సాక్షిగా ఉండి పాత్రను చూస్తూ ఏ శక్తిని దానమివ్వాలో ఆ శక్తిని ఇవ్వండి. గాభరా పడకండి. మీ సతోప్రధాన పాత్రలో స్థితమై ఉండండి. తమోగుణీ ఆత్మల సాంగత్య రంగు యొక్క ప్రభావము పడేందుకు కారణము - సదా శ్రేష్ఠమైన తండ్రి సాంగత్యములో ఉండరు. సదా శ్రేష్ఠ సాంగత్యములో ఉండు వారి పై వేరే ఏ ఇతర సాంగత్య రంగు తన ప్రభావము చూపలేదు. కనుక నివారణ గురించి ఆలోచించండి.

**07-06-1977**

బాప్‌దాదా మాస్టర్ త్రికాలదర్శిగా తయారు చేసి డ్రామాలోని అన్ని రహస్యాలను పిల్లల ముందు స్పష్టం చేశారు. తండ్రి డ్రామా రహస్యం అనుసారము పురుషార్థుల నంబరు లేక రాజధాని రహస్యాన్ని ఇలా వినిపిస్తారు - "డ్రామాలో రాజధానిలో అన్ని రకాల పదవులు పొందేవారు ఉంటారు లేక మాల నంబరువారుగా తయారవుతుంది." కనుక అందరూ మహారథులుగా అవ్వరు అనగా అందరూ విజయమాలలోకి రాలేరు. అందరూ మహారాజులుగా అయితే అవ్వలేరు కదా! అందువలన మన పాత్రనే ఇలా కనిపిస్తుంది. అడ్వాన్స్‌లోకి వెళ్లమని తండ్రి చెప్తారు. కాని పిల్లలు ముందుకు(అడ్వాన్స్) వెళ్లేందుకు బదులు ఉల్టా లాభం తీసుకుంటారు. అనగా తమ సోమరితనాన్ని, నిర్లక్ష్యాన్ని తొలగించుకోరు. కాని తండ్రి చెప్పిన మాటల భావాన్ని మార్చి ఆ మాటనే ఆధారంగా చేసుకుంటారు. మీరు ఇలా అన్నారని తండ్రికే మళ్లీ వినిపిస్తారు. ఈ విధంగా తమ భిన్న-భిన్న స్వభావాలకు వశమై యదార్థ మాటల భావాన్ని మార్చి ఆగిపోయే కళ యొక్క ఆటను చాలా బాగా చూపిస్తారు. సమయానికి స్వయం మాయాజీత్‌గా అయ్యే యుక్తులను కార్యంలో వినియోగించే అటెన్షన్



తక్కువగా ఉంచుతారు. కాని తమను తాము రక్షించుకునేందుకు సాధనంగా తండ్రి మాటలనే ఉపయోగిస్తారు. ఏమంటారంటే - మాయ చాలా బలమైనది, బ్రహ్మాబాబాను కూడా వదిలిపెట్టదు, మహారథుల పై కూడా మాయ దాడి చేస్తుందని మీరే చెప్పారు కదా అని తండ్రికే చెప్తారు. బ్రహ్మాబాబాను కూడా వదలదు, మహారథులను కూడా వదలదు కదా అలాగే మా దగ్గరకు వచ్చింది, మేము ఓడిపోయాము, ఇదేమంత పెద్ద విషయము? ఇవన్నీ జరగాల్సిందే, చివరి వరకు జరుగుతూనే ఉంటాయి! ఈ విధంగా పురుషార్థంలో ఆగిపోయే మాటలను ఆధారంగా చేసుకొని ఉన్నతమయ్యే కళలోకి వెళ్లకుండా వంచితులైపోతారు. మాయ వస్తుందని తండ్రి చెప్తారు కాని మాయాజీత్, జగత్‌జీత్‌లుగా అవుతారనే గాయనము ఎవరికుంది? ఒకవేళ మాయనే రాకపోతే శత్రువును ఎదుర్కోకనే ఎవరైనా విజయులని పిలిపించుకుంటారా? మాయ వస్తుంది కాని ఓడిపోండి అని తండ్రి అయితే చెప్పరు. మాయతో యుద్ధం చెయ్యాలి కాని ఓడిపోరాదని చెప్తారు. "కల్ప-కల్పము విజయీరత్నాలము, విజయులుగా అయ్యే చూపిస్తాము" - ఈ సమర్థ మాటలను మర్చిపోతారు. కాని తమ బలహీనత కారణంగా తండ్రి మాటలను కూడా బలహీనంగా చేసుకుంటారు. ఉదాహరణానికి బ్రహ్మాబాబా మాయాజీత్‌గా అయ్యి జగత్‌జీత్ పదవిని ప్రాప్తి చేసుకున్నారు. ఇది కల్ప-కల్పము నిశ్చితమై స్మృతిచిహ్న రూపంలో కూడా ఉంది. ఎలాగైతే బ్రహ్మాబాబా, మాయ ప్రబలమైనదైనా భయపడకుండా స్వయాన్ని బలవంతునిగా చేసుకున్నాడో అలా తండ్రిని ఫాలో చెయ్యండి (తండ్రి అడుగులో అడుగు వెయ్యండి).

సదా నిశ్చయబుద్ధి విజయీరత్నాలము అని స్మృతి ఉంటుందా? నిశ్చయానికి ఫలము "విజయము". ఏ కార్యం చేస్తున్నా కార్యం చేస్తున్నప్పుడు స్వయంలో, తండ్రిలో, డ్రామాలో నిశ్చయం ఉంటే అన్ని రకాలుగా నిశ్చయం ఉంటే ఎప్పుడూ విజయం లభించదు అనేది ఉండదు. ఒకవేళ ఓడిపోతున్నారు అంటే అందుకు కారణము, నిశ్చయంలో లోపము. ఒకవేళ స్వయంలోనే ఇది అవుతుందో అవ్వదో, సఫలత వస్తుందో లేదో అనే

సంశయం ఉంటే దానిని సంపూర్ణ నిశ్చయం అని అనరు. నిశ్చయబుద్ధి కల్గినవారి సంకల్పం దృఢంగా ఉంటుంది, బలహీనంగా ఉండదు. "ఎలా జరగాలని ఉంటే అదే చేస్తాము" అనేది కూడా సంశయంతో కూడిన సంకల్పమే. "ఏది ఉంటే అది కాదు, అయ్యే ఉంది" అనే నిశ్చయం ఉండాలి. కర్మ చేసేందుకు ముందు కూడా ఈ కార్యము జరిగే ఉంది అని నిశ్చయముండాలి. ఇలాంటి స్థితి ఉందా? ఎలాంటి మాయ వచ్చినా కదలరాదు. నిశ్చయబుద్ధి గలవారు ప్రతి తుఫానును లేక మాయ విఘ్నాన్ని "అసలు ఏమీ లేదు" అనే విధంగా దాటుకుంటారు. ఎలాగైతే సైన్సు సాధనాలుంటే వేడిగా ఉన్నా, వారికి వేడి లేనట్లుగా ఉంటుంది అలా నిశ్చయబుద్ధి కల్గినవారికి మాయా తుఫానులు వస్తాయి కాని వారికది పెద్ద విషయంగా ఉండదు. రక్షించుకునే సాధనం వారి దగ్గర ఉంది కనుక మాయాజీత్‌లుగా అయిపోతారు.

**10-06-1977**

బ్రహ్మాకుమారీలు ఏం చెప్తున్నారు? ఏం చేస్తున్నారు? అని అందరూ గమనిస్తారు. అందువలన ఏదైతే చెప్తున్నారో అది చేసేవారిగా అవ్వండి. భగవంతుడు లభించాడు, భగవంతుడు లభించాడు అనే నినాదాలైతే చేస్తున్నారు కాని భగవంతుడు లభించినట్లయితే వేరే వైపు బుద్ధి వెళ్ళేందుకు అక్కడ ఇంకా ఏమైనా మిగిలి ఉందా? కావున సర్వ ప్రాప్తుల అనుభవాన్ని అందరి ముందు చూపించండి. ఇప్పుడు మీ శక్తి స్వరూపాన్ని అందరూ చూడాలనుకుంటున్నారు. ఇప్పుడు మహారథులు ఏదో ఒక ప్లాను తయారుచేయాలి. విఘ్నవినాశకులుగా అయ్యే సాధనం ఏమిటి? డ్రామానుసారం ఏదైతే జరుగుతుందో దానిని డ్రామాలో నిశ్చితము అని భావించి ముందుకు వెళ్ళాలి. ఆత్మలకు అకళ్యాణం జరుగుతున్నట్లయితే దయాహృదయులైనందున వారికి అకళ్యాణం జరగకుండా ఉండేందుకు ఏం చేయాలి? అందుకు ఏదో ఒక యుక్తిని రచించాలి. వాతావరణాన్ని కూడా శక్తిశాలిగా చేసేందుకు ఇప్పుడు ఏదో ఒక ప్లాన్ కావాలి. ఇప్పుడు ఇదే వాతావరణం(అల) నడుస్తూ ఉంది. ఒకటేమో సామాన్య విఘ్నం,



రెండవది - అనేకమంది ఆత్మల అకళ్యాణమున్న విఘ్నము. ఈ రోజుల్లో ఏ అల అనగా వాతావరణం ఉందంటే చాలా మంది ఆత్మలు తమకు తామే తమ అకళ్యాణానికి నిమిత్తంగా అవుతున్నారు. అటువంటి వారి కోసం ప్లాన్ తయారుచెయ్యండి. మహారథులు సంకల్పం చెయ్యడం లేక ప్లాన్ తయారు చెయ్యడం ఇది కూడా వాతావరణంలో వ్యాపించింది. వాతావరణాన్ని మార్చాలి. ఈ రోజుల్లో ఈ విషయం అవసరంగా ఉంది. మీకు "విఘ్నవినాశకులు" అనే పేరు ఏదైతే ఉందో దానికి తగినట్లు మీ సంకల్పం, వాక్కు, కర్మలో కనిపించాలి.

ఉదాహరణానికి అగ్నిమాపక దళం వారు నిప్పు అంటుకుంటే దానిని ఆర్పకుండా ఉండలేరు. ఎంత కష్టమైనా ఏదైనా ప్లాను తయారుచేసి అగ్నిని ఆర్పేస్తారు. మీరు కూడా విఘ్నవినాశకులు. వాతావరణం ఎలా సమాప్తమవ్వాలి? సంకల్పం రచించినప్పుడే వాతావరణం పరివర్తనవుతుంది. ఇవన్నీ మొదటి నుండే వస్తూ ఉన్నాయి కదా! ఈ విఘ్నాలు వచ్చేవే, వృక్షం శిథిలం అవ్వనే అవ్వాలి అని తేలిక సంకల్పాలు చెయ్యకండి. విఘ్నాలు వస్తే వాటిని సమాప్తి చెయ్యండి. ఏదైనా స్థూల నష్టం జరుగుతుంటే చూస్తూ వదిలిపెట్టరు కదా! నష్టం అవ్వకుండా రక్షించేందుకు దూరం నుండే పరుగులు తీస్తారు, రక్షించాలి అనే సంకల్పం న్యాచురల్‌గా వస్తుంది. ఇవన్నీ జరుగుతూనే ఉంటాయిలే అని అనుకోరు కదా! ఇది డ్రామా. ప్రతి ఆత్మకు తమ తమ పాత్ర ఉంది. అలజడిలోకి రారు కాని మీరు రక్షించేవారు, దయ చూపించేవారు - ఈ భావనతో ఆలోచించండి. మీరు విఘ్నవినాశకులు - ఈ లక్ష్యం ఉంచుకోండి. ఏ లక్ష్యం ఉంచుకుంటారో అది నెమ్మది నెమ్మదిగా అయిపోతుంది. కేవలం లక్ష్యం మరియు అటెన్షన్ ఉండాలి. మహారథులు సర్వ విధులు, సర్వ శక్తులను కేవలం స్వయం పట్ల ఉపయోగించుకోరాదు. ఇప్పుడీ ఆలోచన నడుస్తుందా? లేదా? నడవాలి కదా! దీనిని దాటింపచేయకండి. దాటింపజేస్తే వ్యక్తిగత రాజులుగా అవుతారు, విశ్వమహారాజుగా అవ్వలేరు. విశ్వకళ్యాణకారి భావన ఉంచుకుంటే విశ్వమహారాజులుగా అవుతారు.

**14-06-1977**

సదా సాక్షి స్థితిలో స్థితమై ఉంటూ తమ ప్రతి పనిని, ఇతరుల పనులను చూస్తున్నారా? డ్రామాలో ఏ దృశ్యమునైనా సీటు పై స్థితమై చూస్తే మజా వస్తుంది. ఏ దృశ్యం అయినా సీటు లేకుండా చూడటం జరగదు. కనుక సాక్షి స్థితి అను సీటు పై సదా స్థితమై ఉంటున్నారా? ఇది అనంతమైన డ్రామా. సదా నడుస్తూనే ఉంటుంది. ఇది 2-3 గంటల డ్రామా కాదు. అవినాశి డ్రామా కనుక దీనిని చూచేందుకు సీటు కూడా సదా ఉండాలి. 2-3 గంటలు సీటు పై కూర్చున్నాం తర్వాత దిగిపోతాం అని కాదు. సదా సాక్షిగా ఉండి చూస్తే వారు ఓటమి-గెలుపుల దృశ్యాన్ని చూసి చలించరు. సదా ఏకరసంగా ఉంటారు. డ్రామా జ్ఞాపకం ఉంటే సదా ఏకరసంగా ఉంటారు. డ్రామాను మర్చిపోతే హెచ్చు-తగ్గులవుతూ ఉంటారు. ఒకవేళ డ్రామా అప్పుడప్పుడు జ్ఞాపకం ఉంటే రాజ్యం కూడా అప్పుడప్పుడు చేస్తారా? ఒకవేళ అప్పుడప్పుడు సాక్షిగా ఉంటే స్వర్గంలో కూడా అప్పుడప్పుడు మాత్రమే సాథీగా(తోడుగా) ఉంటారు. జ్ఞానవంతులు కదా? అన్నీ తెలుసు. కాని తెలిసి కూడా సాక్షి స్థితిలో లేనందుకు కారణం అటెన్షన్‌లో నిర్లక్ష్యం. స్వచింతనకు బదులు తమ వ్యర్థ విషయాలలో స్వ చింతనను పోగొట్టుకుంటారు. స్వ చింతనలో ఉండనివారు సాక్షిగా ఉండలేరు. పరచింతన సమాప్తి చేసేందుకు ఆధారం ఏమిటి? ప్రతి ఆత్మ పట్ల శుభ చింతన ఉంటే పరచింతన ఎప్పుడూ చెయ్యరు. కనుక సదా శుభ చింతన చేస్తూ శుభ చింతకులుగా ఉంటే సదా సాక్షిగా ఉంటారు. సాక్షి అనగా ఇప్పుడూ జతలోనే, భవిష్యత్తులో కూడా జతలోనే ఉంటారు.

**16-06-1977**

సదా తమను నిశ్చయబుద్ధి నిశ్చింత ఆత్మగా అనుభవం చేస్తున్నారా? ఎవరైతే నిశ్చయబుద్ధి గలవారిగా ఉంటారో వారు నిశ్చింతగా ఉంటారు. ఏ విధమైన చింతన లేక చింత ఉండదు. ఏమయింది? ఎందుకయింది? ఇలా జరగదు, ఇవన్నీ వ్యర్థ చింతనలు. నిశ్చయబుద్ధి గలవారు నిశ్చింతగా ఉంటారు. వ్యర్థ చింతన చెయ్యరు. సదా స్వచింతనలో ఉండేవారు



స్వస్థితిలో ఉన్నందున పరిస్థితి పై విజయం ప్రాప్తి చేసుకుంటారు. రెండవ వైపు నుండి వచ్చిన స్థితిని ఎందుకు స్వీకరిస్తారు? పరిస్థితిని దాటుకుంటే సదా స్వచింతనలో ఉంటారు. ఎవరైతే స్వ స్థితిలో స్థితమై ఉంటారో సదా సుఖసాగరంలో ఇమిడిపోయి ఉంటారు.

**22-06-1977**

ఎప్పుడు ఎలాంటి పేపరు వచ్చినా భయపడకండి. ఇది ఎందుకు వచ్చిందని ప్రశ్నార్థకంలోకి రాకండి. ఇలా ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేయకండి. ప్రశ్నార్థకాన్ని సమాప్తము చెయ్యండి. ఫుల్‌స్టాప్ పెట్టండి. అప్పుడు తరగతి బదిలీ అవుతుంది అనగా పరీక్షలో పాసవుతారు. ఫుల్‌స్టాప్ ఉంచువారు ఫుల్‌పాస్ అవుతారు. ఎందుకంటే ఫుల్‌స్టాప్ అనగా బిందు స్థితి.

**25-06-1977**

ఇప్పటి వాతావరణము(లహర్) ఎలా ఉంది? ప్రారంభములో మహారథుల మనసులో తమ తోటివారిని(హమ్‌జిన్స్‌ను) ఎలాగైనా అపవిత్రత నుండి పవిత్రతలోకి తీసుకు రావాల్సిందే అనే ఉత్సాహముండేది. అప్పటి ఆవేశము, ఉత్సాహము గుర్తుందా? ఎటువంటి పట్టుదల ఉండేది? అందరినీ విడిపించాలనే పట్టుదలతో పాటు, శక్తిని నింపాలనే పట్టుదల కూడా ఉండేది. ఆదిలో తోటివారిని విడిపించాలని, రక్షించాలనే ఆవేశము ఉండేది. ఇప్పుడలాంటి అల(లహర్) ఉందా? నడుస్తూ నడుస్తూ బలహీనమయ్యేవారుగా అవ్వవచ్చు. బంధనములో ఉన్న నూతన ఆత్మలు రావచ్చు. అటువంటి వారిని బంధనముక్తులుగా చెయ్యాలనే ఆవేశముందా? లేక డ్రామా అని వదిలేస్తారా? వర్తమాన సమయములో మీరు ఏ పాత్ర చేస్తున్నారు? వరదానీ పాత్రను, మహాదానీ పాత్రను, కళ్యాణకారి పాత్రను చేస్తున్నారు. డ్రామా ఏమో ఉంది కాని డ్రామాలో మీ పాత్ర ఏది? కనుక ఈ అల తప్పకుండా వ్యాపించాలి. ఎలాగైతే అగ్నిమాపక దళము వారు ఎక్కడైనా అగ్ని అంటుకుంటూ ఉంటే దానిని ఆర్పకుండా

ఉండలేరో అటువంటి లహర్ ఇప్పుడు కావాలి. మీ లహర్ ద్వారా వారు రక్షింపబడాలి. ఒకవేళ మీరు డ్రామాలో ఉంటే వస్తారులే అని వదిలేస్తే లేక రాజధాని స్థాపన అవుతూ ఉంది కదా అని ఆలోచిస్తే వారికి కళ్యాణమెలా జరుగుతుంది? జ్ఞాన స్వరూపులైనందున ఇది డ్రామా అనే జ్ఞానముంది. కాని డ్రామాలో మీ కర్తవ్యమేది ? కనుక మహారథుల లహర్ ఎలా ఉండాలి? ఏమి వింటున్నా శుభ చింతన నడుస్తూ ఉండాలి. పర చింతన చెయ్యరాదు. మీ శుభ చింతన వారి బుద్ధిని శీతలంగా చెయ్యగలదు. మీరు వదిలేస్తే వారేమో పోతారు. ఎందుకంటే ప్రాక్టికల్‌గా నిమిత్తమైన పాత్ర శక్తులది. తండ్రి ఏమో వెన్నముకగా, ఆధారంగా ఉన్నారు. శక్తులు ఏ స్థితిలో ఉండాలి? ఉదాహరణానికి దేవీల చిత్రములో రెండు విశేషతలు చూపిస్తారు - కనులలో మాతృ భావన, చేతులలో శస్త్రాలు అనగా అసురత్వమును సంహరించేవారు. మాతృభావన అనగా దయా భావన, సంహార భావన కూడా ఉండాలి. సంహరించుట అనగా వారి ఆసురీ సంస్కారాలను సమాప్తము చేసే ప్లాను కూడా ఉండాలి, దయ కూడా ఉండాలి. “లా(Law) మరియు లవ్(Love)” ల బ్యాలన్స్ ఉండాలి. రెండూ జత జతలో ఉండాలి. బలహీనత అనే లహర్ ఏదైతే ఉందో - వినాశము వలన ప్రత్యక్షమైపోయాయని కాదు, బలహీనతలు చాలా సమయము నుండి ఉంటాయి కాని ఇప్పుడు దాగి ఉండలేవు. మొదట లోలోపల గుప్తంగా బలహీనతలుంటాయి. ఇప్పుడు సమయము సమీపానికి వస్తోంది. అందువలన బలహీనతలు దాగి ఉండలేవు. రాజులుగా అయ్యేవారు, ప్రజలుగా అయ్యేవారు, తక్కువ పదవి పొందుకునేవారు, సేవాధారులుగా అయ్యేవారు - అందరూ ఇప్పుడు ప్రత్యక్షమైపోతారు. చివర్లో సాక్షాత్కారాలు జరుగుతాయని చెప్పాము కదా, అవి ఎలా జరుగుతాయి? వీరు సాక్షాత్కారం చేయిస్తున్నారు. అంతేకాని మొదట్లో బలహీనత లేదు ఇప్పుడొచ్చిందని కాదు. కాని ఇప్పుడు ప్రసిద్ధమయ్యేందుకు అవకాశము లభించింది. ఎలాగైతే సమాప్తి సమయములో జబ్బులన్నీ బయట పడ్తాయో అలా అంతిమ సమయమైనందున ప్రతి ఒక్కరి రకరకాల బలహీనతలన్నీ ప్రత్యక్షమవుతాయి.



ఇప్పుడైతే ఒక అల చూశారు. ఇంకా చాలా అలలు చూస్తారు. తప్పకుండా అతిలోకి వెళ్ళే తీరాలి. అతి అయితేనే అంతమవుతుంది. లోపల ఏ ఏ బలహీనతలున్నాయో అవి లోపల దాగి ఉండలేవు. ఏదో ఒక రూపములో ప్రత్యక్ష రూపములో వచ్చేస్తాయి. కానీ వారందరి కళ్యాణము కూడా జరగాలని మీ భావన ఉండాలి. మీరు వరదానులైనందున మీ ప్రతి సంకల్పము ప్రతి ఆత్మ పట్ల కళ్యాణకారిగా ఉండాలి. అలలైతే ఇంకా చాలా వస్తాయి. ఒకటి అయిపోతూనే మరొకటి వస్తుంది. ఇవన్నీ మనోరంజనము చేసే ఉపకథలు (బైప్లాట్స్). పదవి కూడా స్పష్టమౌతూ ఉంది. ఇవి జరుగుతూనే ఉంటాయి. దృశ్యాలు ఆశ్చర్యకరంగా ఉంటాయి. ఒకవైపు కొత్తవారు రేస్‌లో ముందుకు పోతూ కనిపిస్తారు, మరోవైపు అలసిపోయేవారు, ఆగిపోయేవారు కూడా కనిపిస్తారు. మూడవ వైపు చాలా కాలము నుండి బలహీనతలుండే వారు కూడా ప్రత్యక్షమైపోతారు. కొత్తదేమీ కాదు(నథింగ్ న్యూ) కాని దయా దృష్టి, దయా భావన రెండూ జతలో ఉండాలి.

**28-06-1977**

మీలాంటి పెద్ద పరివారము ఇంకెవరికుంది? కనుక ఆత్మలందరినీ ముందుంచుకొని స్వయాన్ని అనంతమైన సేవార్థము నిమిత్తముగా భావించి మీ సమయాన్ని, శక్తులను కార్యములో ఉపయోగిస్తున్నారా? మాస్టర్ రచయిత స్థితి స్మృతిలో ఉంటుందా? లేక సంపాదించిందంతా స్వయం మీ పట్లనే ఉపయోగించి తినేస్తున్నారా? లేక కొంత తిని, కొంత పోగొట్టుకుంటున్నారా? ఇలా నిర్లక్ష్యంగా నడవడం లేదు కదా? కనుక మీ సర్వ ఖజానాల బడ్జెట్‌ను తయారు చెయ్యండి. ఇంత గొప్ప బాధ్యతను స్వీకరించిన ఆత్మలైన మీ వద్ద జమ లేకుంటే పనిని ఎలా సఫలము చేస్తారు? డ్రామానుసారము జరగాల్సిందే - అనేది జ్ఞానము. కానీ డ్రామాలో నేను కూడా నిమిత్తమై సేవ ద్వారా శ్రేష్ఠ ప్రాప్తిని చేసుకోవాలనే లక్ష్యముంచుకొని ప్రతి ఖజానాకు బడ్జెట్ తయారు చెయ్యండి.

**30-06-1977**

(పిల్లలు) చాలా శ్రమ కూడా చేస్తారు, త్యాగం కూడా చేశారు.

చాలా సహిస్తున్నారని కూడా తెలుసు. కాని ఎవరితో స్నేహముంటుందో వారి చిన్న బలహీనతను కూడా చూడలేరు. సదా శ్రేష్ఠంగా తయారు చేసే శుభ భావన ఉంటుంది. అందువలన ఇవన్నీ చూస్తూ, వింటూ కూడా సంపన్నంగా అవ్వమని సూచననిస్తున్నారు. బాప్‌దాదా సదా పిల్లలతో కలిసి ప్రతి అడుగులో సహయోగిగా ఉన్నారు, చివరి వరకు ఉంటారు. తండ్రికి ఎవ్వరి పట్ల కోపము, ద్వేషము లేవు. అపకారి పై కూడా సదా శుభ చింతకులుగా ఉన్నారు. కావున సదా సహయోగాన్ని తీసుకొని నడుస్తూ ఉండండి. అమృతవేళ మహత్వాన్ని తెలుసుకొని తండ్రి ద్వారా వరదానాన్ని తీసుకుంటూ ఉండండి. సీజను సమాప్తి అయ్యింది అనగా సహయోగం సమాప్తి అయ్యిందని భావించకండి. ప్రతి పుత్రునితో సర్వ స్వరూపాలతో, సర్వ సంబంధాలతో బాప్‌దాదాల చేయి మరియు తోడు సదా ఉంది. డ్రామానుసారంగా ఇప్పుడు సమయం లభించింది. దీనిని మీ భాగ్యంగా భావించి సమయం ఇచ్చే లాభాన్ని పొందండి. వినాశనమనే గడియారానికి ముళ్ళు మీరే. మీరు సంపన్నంగా అవ్వడమే సమయం సంపన్నమవ్వడం(సమాప్తి అవ్వడం). కావున సదా స్వచింతన చేయండి, స్వదర్శన చక్రధారిగా అవ్వండి. మంచిది.

ఎంత వరకు వింటారు? ఈ సీజన్‌లో కూడా ఎంత విని ఉంటారు? ఇప్పుడు శబ్ధం నుండి అతీతంగా అవ్వాలని డ్రామా భావి(నిశ్చితమైన డ్రామా) వినిపిస్తోంది. ఈ శరీర అనారోగ్య పరిస్థితులు కూడా నిశ్చితమై శిక్షణ చాలా అయిపోయిందని వినిపిస్తున్నాయి. విన్న తర్వాత ఇముడ్చుకోవడం అనగా స్వరూపంగా అవ్వడం - ఇప్పుడు ఆ సీజన్ జరుగుతోంది. వినే సీజను ఎన్ని సంవత్సరాలు నడిచింది! సాకారం ద్వారా గాని, రివైజ్ కోర్సు ద్వారా గాని, వినే సీజను చాలా నడిచింది. కావున ఇప్పుడు స్వరూపం ద్వారా సేవ చేయాలి. ఇప్పుడు చివర్లో ఈ సీజనే మిగిలి ఉంది కదా! దీనిలోనే ప్రత్యక్షతా ఢంకా మ్రోగుతుంది. ఎప్పటి వరకు నోటి ద్వారా ఢంకా ఎక్కువగా ఉంటుందో అప్పటి వరకు ప్రత్యక్షత ఉండదు. ఎప్పుడు ప్రత్యక్షతా ఢంకా మ్రోగుతుందో అప్పుడు నోటి ద్వారా ఢంకా ఆగిపోతుంది. సైన్సు పైన



సైలెన్స్ విజయం అని మహిమ కూడా చేయబడింది. శబ్ధానికి మహిమ చేయబడలేదు. సమయం సమాప్తికి గుర్తులేవి? ఆటోమేటిక్‌గా (స్వతహాగా) శబ్ధంలోకి రావాలనిపించదు. ప్రోగ్రామ్ అనుసారంగా కాదు. నేచురల్ స్థితి అలా ఉంటుంది. ఉదాహరణానికి సాకార తండ్రిని చూసినప్పుడు సంపూర్ణతకు ఏ గుర్తులు కనిపించాయి? రెండు నిముషాలైనా, ఒక నిముషమైనా ఈ సైలెన్స్ స్థితి ద్వారానే తెలుస్తూ ఉండేది కదా! ఎక్కువగా శబ్ధంలోకి రావడం వలన ఆటోమేటిక్‌గా (స్వతహాగా) వైరాగ్యం వస్తుంది. ఎలాగైతే ఇప్పుడు వద్దనుకుంటున్నా అలవాటు మాటల్లోకి తీసుకొస్తోందో అలాగే వద్దనుకున్నా శబ్ధం నుండి అతీతంగా అయిపోతారు. ప్రోగ్రామ్‌ను తయారు చేసుకొని శబ్ధంలోకి వస్తారు. ఎప్పుడైతే ఈ పరివర్తన కనిపిస్తుందో అప్పుడు విజయ ఢంకా మ్రోగుతుందని భావించండి. ఈ రోజుల్లో నలువైపులా ఉన్నవారిని అడిగినట్లయితే అందరూ అధికంగా సుఖం కన్నా శాంతి ఎక్కువగా కావాలని అంటారు. వారు ఒక్క ఘడియ శాంతి అనుభవమైనా భగవంతుడు ప్రాప్తించినంత శ్రేష్ఠంగా విశ్వసిస్తారు. అయితే ఒక్క సెకండు అయినా శాంతిని అనుభవం చేయించేవారు, స్వయం శాంతి స్వరూపంలో స్థితులై ఉండాలి కదా! వినాశనం ఎప్పుడు జరుగుతుంది? దాని కోసం ఎవరు నిమిత్తంగా అవుతారు? గడియారపు ముళ్ళుగా ఏవి అవుతాయి? గంట మ్రోగడానికి నిమిత్తంగా ముల్లే అవుతుంది కదా? కావున వినాశనమనే గంటను మ్రోగించే ముల్లు ఎవరు?

**29-11-1978**

బాప్‌దాదా పిల్లలందరి వర్తమాన స్వరూపము ద్వారా ధారణా స్వరూపాన్ని గమనిస్తూ విశేషంగా ఒక విషయాన్ని చూస్తున్నారు. అది ఏమిటో తెలుసా? పిల్లలందరిలో సదా సంతుష్టమణులుగా ఎంతమంది ఉన్నారు? అన్నిటికంటే విశేషమైన గుణము - ముఖములో ప్రకాశిస్తూ కనిపించే గుణము సంతుష్టత(సంతృప్తి). మూడు విధాలైన సంతుష్టత కావాలి. మొదటిది తండ్రితో, రెండవది సదా స్వయంతో సంతుష్టత,

మూడవది సర్వ సంబంధాలు మరియు సంపర్కముతో సంతుష్టత. ఇందులో చైతన్యమైన ఆత్మలు, ప్రకృతి రెండూ వచ్చేస్తాయి. సంతుష్టతకు గుర్తు - ప్రత్యక్ష రూపములో ప్రసన్నత కనిపిస్తుంది. సదా ప్రసన్నచిత్తులుగా ఉంటారు. ఈ ప్రసన్నత ఆధారముతో ప్రత్యక్ష ఫలముగా ఇటువంటి ఆత్మకు సదా సర్వుల నుండి స్వతహాగా ప్రశంసలు లభిస్తాయి. సంతుష్టత అను విశేషతకు గుర్తు ప్రసన్నత, దానికి ప్రత్యక్ష ఫలము ప్రశంసలు. ఇప్పుడు మిమ్ములను మీరు చూసుకోండి. ప్రసన్నత ద్వారానే ప్రశంసలు ప్రాప్తి చేసుకోగలరు. ఎవరైతే సదా స్వయం సంతుష్టంగా లేక ప్రసన్నంగా ఉంటారో వారిని అందరూ తప్పకుండా  ప్రశంసిస్తారు. నడుస్తూ నడుస్తూ పురుషార్థ జీవితములో డ్రామానుసారము సమస్యలు, పరిస్థితులు రానే వస్తాయి. జన్మ తీసుకుంటూనే ముందుకు వెళ్లే లక్ష్యముంచుకోవడం అనగా పరీక్షలను, సమస్యలను ఆహ్వానించడమే. ఆహ్వానించింది మీరే అని మర్చిపోతున్నారు! మార్గంలో ప్రయాణించాలంటే దారిలో ప్రక్కన దృశ్యాలు ఏవీ లేకుండా ఉంటాయా? ఆ దృశ్యాలను చూస్తూ ఆగిపోతారు. అందువలన గమ్యము దూరంగా ఉందని అనుభవము చేస్తారు. దృశ్యాలను చూస్తూ దాటుకొని వెళ్లిపోవాలి. అంతేకాని దృశ్యాలను చూస్తూ ఇది ఎందుకు? ఇది ఏమిటి? ఇది ఇలా కాదు, ఇది అలా కాదు అని అంటూ ఆగిపోతున్నారు. ప్రతి దృశ్యాన్ని సరిదిద్దడంలో నిమగ్నమైపోతున్నారు. దాటుకునేందుకు బదులు కరెక్షన్ (సరిదిద్దడంలో) చేయడంలో బిజీగా అయిపోతారు. అందువలన తండ్రిని స్మృతి చేసే సంబంధాన్ని లూజ్(వదులు) చేసేస్తున్నారు. మనోరంజనాన్ని చూచేందుకు బదులు మనసును ఉదాసీనంగా, బలహీనంగా చేసుకుంటున్నారు. ఓహెూ ఓహెూ ఎంత బాగున్నాయి దృశ్యాలు! అనేందుకు బదులు ఆ!! ఆ!! అని చాలా అంటున్నారు. ఆ!! అనగా ఆశ్చర్యచకితులుగా అవ్వడం. అందువలన నడుస్తూ నడుస్తూ ఆగిపోతున్నారు. అలసిపోవడం వలన అప్పుడప్పుడు తండ్రితో మధురాతి మధురమైన ఆరోపణలు(ఫిర్యాదులు) చేస్తూ రాయల్ రూపములో తండ్రితో కూడా అసంతుష్టమైపోతారు. చాలామంది పిల్లలు ఇంతకు ముందే ఎందుకు చెప్పలేదు - సహజ



మార్గమన్నారు కానీ సహనము చేసే మార్గమని చెప్పలేదు అని అంటారు. సహజ మార్గానికి బదులు సహనము చేసే మార్గంగా అనుభవము చేస్తారు. కాని సహనము చేయడమే ముందుకు వెళ్లడం.  వాస్తవానికి అది సహించడం కాదు కాని మీ బలహీనత కారణంగా అది సహనంగా అనుభవమవుతుంది. ఉదాహరణానికి అగ్ని గుణం కాల్చడం. కాని ఆ గుణం గురించిన జ్ఞానము లేనందున దాని నుండి లాభము పొందేందుకు బదులు నష్టపోతారు. కనుక సుఖానికి బదులు సహించవలసి వస్తుంది. ఎందుకంటే వస్తువును కాల్చేందుకు బదులు స్వయాన్ని కాల్చుకుంటారు. గుణ జ్ఞానం లేనందున సుఖానికి బదులు సహించవలసి వస్తుంది. సమస్యలు లేక పరిస్థితులు వచ్చేందుకు కారణము, వాటి జ్ఞానము లేకుండుట. అందువలన ముందుకు వెళ్లే సుఖమును అనుభవము చేసేందుకు బదులు సహించేదిగా అనుభవము చేస్తారు.

**03-12-1978**

మీ మొదటి మాట(ప్రతిజ్ఞ) ఏమిటి? ఒక్క తండ్రి తప్ప వేరెవ్వరూ లేరు అనగా మరణించడం. పేరుకేమో మరణించడం కాని సర్వస్వమూ పొందడం. అన్న మాటను నిలబెట్టుకోవడం(నిభాయించడం) కష్టమనిపిస్తుందా? చాలా సులభము. కేవలం పరివర్తన చేయడం రావడం లేదు. భావము మరియు భావనలను పరివర్తన చెయ్యడం రావడం లేదు. ఓహెూ డ్రామా ఓహెూ! ఓహెూ అని అంటున్నారంటే ఇవన్నీ ఏమిటి? ప్రతీదీ "ఓహెూ ఓహెూ" నే కదా. అయ్యో అయ్యో అని అనడం సమాప్తం చేసెయ్యండి. అప్పుడు ఓహెూ ఓహెూ అనే మాట వచ్చేస్తుంది. ఓహెూ నా తండ్రి, ఓహెూ డ్రామా, ఓహెూ నా పాత్ర - ఈ స్మృతిలోనే ఉంటే విశ్వము ఓహెూ ఓహెూ అని అంటుంది.

**05-12-1978**

సదా మీ భాగ్యాన్ని తల్చుకుంటూ సంతోషంగా ఉంటున్నారా? ఓహెూ నా భాగ్యము! ఈ పాట సదా మనసులో మ్రోగుతూ ఉంటుందా? వాహ్

బాబా, వాహ్ డ్రామా, వాహ్ నా పాత్ర - సదా ఇదే స్మృతిలో ఏ కార్యము చేస్తున్నా కర్మ బంధనం నుండి ముక్తులుగా, సదా జీవన్ముక్తులుగా ఉన్నట్లు అనుభవమవుతుంది. సత్యయుగములో జీవన్ముక్తి వారసత్వము ఎలాగైనా ప్రాప్తిస్తుంది. కాని ఇప్పుడు జీవన బంధనము నుండి జీవన్ముక్త స్థితి యొక్క అనుభవము సత్యయుగ జీవన్ముక్త స్థితి కంటే చాలా గొప్పది. కనుక ఇప్పుడు కూడా జ్ఞాన-యోగముల శక్తి ద్వారా జీవన్ముక్త స్థితిని అనుభవము చేస్తున్నారా లేక ఇప్పుడు కూడా బంధనముందా? బంధనాలన్నీ సమాప్తమై జీవన్ముక్తులుగా అయిపోయారా? ఏమి జరిగినా జీవన్ముక్తులుగా ఉన్నందున అది ఒక ఆట వలె అనుభవం అవుతుంది, పరీక్షగా కాకుండా ఒక ఆట వలె ఉంటుంది. శరీరానికి రోగమొచ్చినా, అనేక ప్రకారాలుగా మాయ దాడి చేసినా ఒక ఆట వలె అనుభవమవ్వాలి. ఆటలో దు:ఖము రాదు. ఆటలు ఆడుకునేది మనోరంజనము కొరకే గాని దు:ఖము కొరకు కాదు. కనుక ఆటగా భావిస్తే జీవన్ముక్త స్థితిని అనుభవము చేస్తారు. జీవన్ముక్తులుగా ఉన్నారా లేక జీవన బంధనములో ఉన్నారా? శరీర బంధనము గాని, శరీర సంబంధాల బంధనము గాని ఏ బంధనాలూ ఉండరాదు. ఆట్లాడుకుంటూ కర్తవ్య పాలన చేస్తున్నారు. కర్తవ్యాన్ని కూడా ఒక ఆట వలె నిర్వర్తిస్తున్నారు. నిర్బంధన ఆత్మలు మాత్రమే ఉన్నత స్థితిని అనుభవము చేయగలరు. బంధనములో ఉన్నవారు క్రిందనే బంధింపబడి ఉంటారు. నిర్బంధన ఆత్మలు పైన ఎగురుతూ ఉంటారు.

స్థాపనా కార్యములో ఏ ఆత్మలైతే ప్రారంభము నుండి సహయోగులుగా ఉన్నారో వారికి డ్రామానుసారము ఏదో ఒక రూపములో విశేష సహయోగము తప్పకుండా ప్రాప్తి అవుతుంది. ఇది గ్యారంటీ. బాప్‌దాదా ఇక్కడిది ఇక్కడే రిటర్న్ కూడా చేస్తారు. భవిష్యత్తు కొరకు కూడా జమ అవుతుంది.

**07-12-1978**

టీచర్లకు స్పెషల్(విశేషమైన) లిఫ్ట్ ఉంది. ఎందుకంటే ఆత్మలందరికీ



దారి చూపడమే టీచర్ల కర్తవ్యము. కనుక రాత్రింబవళ్లు ఒకే లగ్నములో, ఒక్కరి స్మృతిలోనే, ఒకే కార్యములో ఉండువారు. దీని వలన ఏకరస స్థితి సహజంగా తయారైపోతుంది. ఒక్కరి లగ్నములోనే ఉండడం వలన గమ్యము సహజంగా అనుభవమవుతుంది. ఒక్కరే ఒక్కరైనందున మార్గము సహజమైపోయింది కదా. సెకండులో స్విచ్ ఆన్ చేస్తారు, గమ్యానికి చేరుకుంటారు. అనుకుంటూనే స్వరూపమైపోతారు. ఇదే లిఫ్ట్. టీచర్లు తమ భాగ్యాన్ని చూసుకుంటూ సదా తండ్రి గుణ గానము చేస్తూ ఉండాలి. వాహ్ బాబా, వాహ్ డ్రామా! - ఈ పాట సదా నడుస్తూ ఉండాలి. ఈ సంతోషముంటే శరీర బంధము గాని, మానసిక బంధము గాని ఏమియూ అనిపించదు. సదా బిజీగా ఉన్నందున మాయ ఏ విధంగానూ దాడి చెయ్యలేదు, మాయ ఓడిపోతుంది. యుద్ధము చెయ్యలేదు.

**10-12-1978**

మధువనములోని శక్తి సైన్యము అనగా విశేష ఆత్మల సైన్యము. ప్రతి ఒక్కరికి తమ విశేషతలేవో బాగా తెలుసు. విశేషతల కారణంగానే ఈ విశేష భూమిలో నివసించేవారిగా అయ్యామనే సంతోషము ఉందా? ప్రతి ఒక్కరికి తమ-తమ పాత ఖాతాలేమో ఉన్నాయి. అవి సమాప్తము కూడా అవుతూ ఉంటాయి, దానితో పాటు డ్రామానుసారము ఏదో ఒక విశేషత కూడా ఉంది. విశేషత కారణంగానే విశేషమైన పాత్ర లభించింది. సదా పుణ్య భూమిలో శ్రేష్ఠ ఆత్మల సాంగత్యములో విశేషమైన పాత్ర చేయడం తక్కువ భాగ్యము కాదు. మందిరాలలోని జడ చిత్రాల పూజారులు కూడా స్వయాన్ని ఎంత గొప్పవారిగా భావిస్తారు! పూజారులే అయినా వారికెంత నశా ఉంటుంది! ఎందుకంటే ఆ మూర్తులకు సమీప సంబంధము గలవారమని భావిస్తారు. జడచిత్రాల పూజారులు కూడా ఎంత నశా కలిగి ఉంటారు. ఇక్కడ పూజారి మాటే లేదు. ఇక్కడైతే సంపర్కములో ఉండే, సాంగత్యములో ఉండే సాక్షులైన మీకు ఎంత నశా, ఖుషీ ఉండాలి! ఈశ్వరీయ పరివారములోకి వచ్చిన ఆత్మలలో ఏదో ఒక విశేషత తప్పకుండా ఉంటుంది. విశేషత లేకుండా ఉండేందుకు వీలే లేదు.

కనుక మీ విశేషతను తెలుసుకొని దానిని కర్మలో ఉపయోగించండి. ఏ గుణము లేక విశేషత అయినా, కర్మలాచరించు గుణము గాని, మధురంగా మాట్లాడే గుణము గాని, స్నేహ గుణము గాని ఆ గుణాన్ని కార్యములో ఉపయోగించండి. ఎలాగైతే లోహము(ఇనుము) పరశువేదిని తగిలి బంగారుగా అయిపోతుందో అలా ఒక గుణము లేక విశేషతను సేవలో ఉపయోగించడం వలన సేవకు ఫలము ఒకటికి లక్షరెట్లు లభించడం వలన ఆ ఒక్క విశేషత అనేక సమయాలలో ఫలమునిచ్చేందుకు యోగ్యముగా అవుతుంది. ఎలాగైతే ఒక బీజము నాటితే అనేక ఫలాలు వస్తాయో, అలా ఒక్క విశేషతను కర్మలో ఉపయోగించడం అనగా భూమిలో విత్తనము నాటినట్లవుతుంది. కనుక ఎంత గొప్ప భాగ్యశాలురో అర్థమయ్యిందా. బ్రాహ్మణ పరివారములో జన్మించినారంటే జన్మతో పాటు ఏదో ఒక విశేషత అనే భాగ్యాన్ని వెంట తీసుకునే వచ్చారు. అయితే కేవలం ఆ విశేషతను కార్యములో ఉపయోగించడంలో తేడా వచ్చేస్తుంది. జన్మించడం భాగ్యమే కాని ఆ భాగ్యాన్ని కర్మలో లేక సేవలో ఉపయోగించడం వలన అనేక సమయాలలో ఈ భాగ్య ఫలాన్ని తీసుకోవడం, విత్తనము నాటే ఈ పద్ధతి రావాలి. ఫలితమేమో తప్పకుండా వస్తుంది. విత్తనము నాటడం అనగా విశేషత అనే బీజాన్ని సేవలో ఉపయోగించడం. ఇక్కడ అందరూ సదా భాగ్య సింహాసనానికి అధికారులే. ఆ భాగ్యము కొరకు కల్పక్రితపు స్మృతిచిహ్నానికి ఒక సెకండు సమీపంగా ఉండడం కూడా ఇంతవరకు గొప్పగా భావిస్తున్నారో దానిని ప్రత్యక్షంగా పొందు వారి సంతోషము, వారి భాగ్యము ఎంత శ్రేష్ఠమైనది! ఈ శ్రేష్ఠతను ముందుంచుకుంటే వ్యర్థ విషయాలు సమాప్తమైపోతాయి.

పాండవులు అనగా సదా విజయులు. పాండవుల పేరు వారి విజయము కారణంగానే ప్రసిద్ధముగా ఉంది. పాండవ సైన్యము కూడా విశేషంగా సముద్ర తీరములో శ్రేష్ఠ సాంగత్యములో ఉండేవారు. కనుక ఇటువంటి పాండవ సైన్యము సదా విజయులుగా ఉన్నారా? సదా విజయం పొందే ఆట నడుస్తోందా? లేక గెలుపు-ఓటముల ఆట నడుస్తూ ఉందా?



ఇప్పటి సమయము, సహయోగాలను బట్టి డ్రామానుసారము ఏ భాగ్యమైతే ప్రాప్తించిందో, దాని అనుసారమే సదా విజయము పొందే ఆట నడవాలి.

డ్రామానుసారము ఏ విశేషత అయితే ప్రాప్తి అయ్యిందో దానిని సదా కార్యములో ఉపయోగిస్తే ఇతరుల విశేషత కూడా కనిపిస్తుంది. విశేషతలు చూడకుండా విషయాలను చూస్తారు. అందువలన ఓడిపోతారు. ప్రతి ఒక్కరి విశేషతను స్మృతిలో ఉంచుకొని ఒకరికొకరు నమ్మకస్థులుగా ఉంటే, వారి మాటల భావము మారిపోతుంది. పరస్పరము ఇద్దరి మిత్రుల మధ్యకు ఒక మూడవ వ్యక్తి గ్లాని చేసేందుకు వస్తే వారు ఆ వ్యక్తి భావాన్ని మార్చేస్తారు. ఎవరైనా మీ వద్దకు వచ్చి బ్రహ్మాబాబాను, ఇదేమిటి ఇలా ఇతరులను తిడ్తున్నాడని అంటే మీరు వారికి అది తిట్టడం కాదు, స్పష్టము చేయడం అని వారికి నిశ్చయంతో అర్థము చేయిస్తారు. నిశ్చయమున్న చోట శబ్దాల భావము పరివర్తనై అది సాధారణ విషయమైపోతుంది. ప్రతి ఒక్కరి విశేషతను చూస్తే అనేకమంది ఉన్నా ఒక్కరే కనిపిస్తారు. ఏకమత సంఘటనగా అయిపోతుంది. ఎవరైనా ఎవరినైనా గ్లాని చేసే మాటలు వినిపిస్తే వాటిని బలపరచేందుకు బదులు వినిపించే వారి రూపాన్ని పరివర్తన చేసెయ్యండి. అర్థములో వారి భావాన్ని పరివర్తన చేసెయ్యండి. ఈ అభ్యాసముండాలి. లేకుంటే ఒకరి మాటలు రెండవ వారితో, వారి మాటలు మూడవ వారితో వింటే ఆ వ్యర్థ మాటలు వాతావరణములో వ్యాపిస్తూ ఉంటాయి. అందువలన శక్తిశాలి వాతావరణము తయారవ్వదు. సాక్షాత్కారమూర్తులుగా కూడా అవ్వలేరు. అందువలన సదా అందరి పట్ల శుభ భావన, కళ్యాణ భావన ఉండాలి. ఒకరినొకరు గ్లాని చేసుకొను విషయాలు వినడం అనగా సమయాన్ని వృథా చేసుకోవడం, సంపాదన నుండి వంచితులుగా అవ్వడం.

**14-12-1978**

ఇంకా ఏం చేస్తారు? తమ వ్యర్థ సంకల్పాల తుఫాన్లను స్వయమే రచించుకొని ఆ తుఫాన్లలో స్వయమే కదిలిపోతారు. తమ నిశ్చయం అనే పునాదిలో లేక తమకు లభించిన అనేక ప్రకారాల ప్రాప్తుల ఆధారములో

తామే కదిలిపోతారు. వినాశనమవుతుందో లేదో, భగవంతుడు చెప్పింది నిజమో కాదో, ప్రపంచానికి నిశ్చయంతో చెప్పవచ్చా లేక చెప్పరాదా, గుప్తంగా ఉండాలా లేక ప్రత్యక్షం అవ్వాలా? జమ చేసుకోవాలా లేక సేవలో ఉపయోగించాలా......... ప్రవృత్తిని సంభాళించాలా లేక సేవలో లగ్నమవ్వాలా? చివరికి ఏమి జరుగుతుంది? తండ్రి ఏమో నిరాకారులు మరియు ఆకారులైపోయారు......., సాకారంలో ఎదుర్కునేవారు మనమే కదా!........ ఇటువంటి వ్యర్థ సంకల్పాల తుఫాన్లను రచించి స్వయాన్ని విచలితము చేసుకుంటారు. తమ నిశ్చయం అను పునాదిని కదిలించుకుంటారు. ఎలాగైతే ఆ తుఫాన్లు ఎక్కడ ఉన్న వస్తువులను ఎక్కడి చేరుస్తాయో అలా ఈ వ్యర్థ సంకల్పాల తుఫాన్లు తీవ్ర పురుషార్థం నుండి సాధారణ పురుషార్థం వైపుకు తీసుకెళ్తాయి. ఇలాంటి తుఫాన్ల జోలికి వెళ్లకండి. బాప్‌దాదా ఇటువంటి పిల్లలను అడుగుతున్నారు - "ఇప్పుడు ట్రస్టీగా అయ్యారా లేక ఇంకా గృహస్థులుగానే ఉన్నారా? ట్రస్టీగా ఉంటే బాధ్యత ఎవరిది, మీదా, తండ్రిదా? బాధ్యత తండ్రిదైనప్పుడు అవుతుందా? కాదా? ఏమవుతుంది ? అని సంశయము ఎందుకు? బాధ్యత తండ్రిదా లేక మీదా? నిశ్చయబుద్ధి గలవారి మొదటి గుర్తు ఏది? నిశ్చయబుద్ధి అనగా సదా నిశ్చింతత. మీ చింతలన్నీ తండ్రి తీసుకున్నప్పుడు మీరెందుకు చింతిస్తున్నారు? వినాశనం అవుతుందా, లేదా? ఎప్పుడవుతుంది? అనే చింత బ్రాహ్మణ జీవితంలో ఎందుకు? ఈ వజ్ర తుల్యమైన బ్రాహ్మణ జీవితము, తండ్రితో మిలనము చేసే జీవితము, ఉన్నతి చెందే కళ యొక్క జీవితము, సర్వ ఖజానాలతో సంపన్నంగా అయ్యే జీవితము, సర్వ అనుభూతులతో సంపన్నమయ్యే జీవితము మంచిగా అనిపించడం లేదా? త్వరగా సమాప్తం చేయాలని అనుకుంటున్నారా? ఏవైనా కష్టాలు గాని, బాధలు గానీ ఉన్నాయా? భక్తిమార్గంలో అతీంద్రియ సుఖంతో జీవించే రోజులు ఒకటికి నాలుగు రెట్లు కావాలని పిలిచారు కదా, మరి ఇప్పుడు అలసిపోయారా! ఇటువంటి సంకల్పాలు చేసేవారిని చూచి బాప్‌దాదాకు నవ్వు వస్తుంది. ఇటువంటి సంకల్పాలు చేసేందుకు మీకు ప్రాప్తించనిదేముంది? కళ్యాణకారి తండ్రి,



కళ్యాణకారి జీవితమని చెప్తున్నారు. కనుక ఏదైతే భగవంతుడు చెప్పారో అందులో అనేక ప్రకారాల కళ్యాణం ఇమిడి ఉంది. ఎందుకు చెప్పాడు, ఎలా చెప్పాడు అని సంకల్పాలు చేసి నిశ్చయబుద్ధి పునాదిని ఎందుకు కదిలిస్తారు? ఒకవేళ ఇటువంటి చిన్న-చిన్న తుఫాన్లకే పునాది కదిలిపోతూ ఉంటే మహావినాశన సమయంలో వచ్చే మహాతుఫానులో ఎలా నిలువగల్గుతారు? ఇది కేవలం మీ వ్యర్థ సంకల్పాల తుఫాను మాత్రమే. కానీ మహావినాశ సమయంలో అనేక ప్రకారాలైన తుఫానులు నలువైపుల నుండి వస్తాయి. మరి అప్పుడేం చేస్తారు? ఇంత చిన్న విషయంలో అందులోనూ ఇంకా సమయం లభించింది, తోడు లభించింది, అనేక ప్రకారాలైన ఖజానాలు లభిస్తున్నాయి, ప్రాప్తి జరుగుతున్నా సమాప్తమవ్వాలనే ఉత్కంఠత(వేగిరపాటు) ఎందుకు? సుఖంగా గడిచిపోయే రోజులలో ఓర్పుతో శాంతిగా ఉండండి. ఎందుకు? ఏమి? అంటూ ఓర్పులేనితనంలోకి వెళ్లకండి. మీలో ఉత్పన్నమయ్యే వ్యర్థ సంకల్పాల తుఫానును సమాప్తం చెయ్యండి. సంపన్నవంతులుగా, సమర్థవంతులుగా అవ్వండి, సదా నిశ్చయబుద్ధి గలవారిగా అవ్వండి. కళ్యాణకారి తండ్రి మరియు కళ్యాణకారి సమయంలో ప్రతి సెకండు లాభము తీసుకోండి. మొత్తం కల్పంలో ఇటువంటి సంపన్నవంతులుగా, భాగ్యవంతులుగా ఉండు రోజులు, భాగ్యవిధాత సాంగత్యములో ఉండు రోజులు మళ్లీ కల్పము వరకు రావు. వినాశ సమయములో కూడా ఈ ప్రాప్తుల సమయాన్ని జ్ఞాపకం చేసుకుంటారు. అందువలన డ్రామానుసారము కళ్యాణార్థం ఏ దృశ్యమైతే నడుస్తూ ఉందో, దానిని త్రికాలదర్శులై ధైర్యము మరియు ఉల్లాసంతో కూడిన సమర్థ ఆత్మలై స్వయం కూడా సమర్థంగా ఉండండి, విశ్వాన్ని కూడా సమర్థవంతంగా చెయ్యండి. రాళ్లను పగులగొడ్తూ అలసిపోకండి. స్వయం మీరే సృష్టించుకున్న తుఫాన్లలో కదిలిపోకండి, అచంచలంగా అవ్వండి. అర్థమయ్యిందా.

**01-01-1979**

' వహ్వా డ్రామా ' - ఈ స్మృతిలో అనేకమందికి సేవ - అందరూ

ఎల్లప్పుడూ 'వాహ్ డ్రామా వాహ్' అను ఈ స్మృతిలో డ్రామాలోని ప్రతి దృశ్యాన్ని చూస్తూ నడుస్తున్నారా? ఏ దృశ్యాన్ని చూస్తున్నా భయపడడం లేదు కదా! డ్రామా జ్ఞానం లభించింది కనుక వర్తమాన సమయం కళ్యాణకారీ యుగము, ఏ దృశ్యం ఎదురుగా వచ్చినా అందులో కళ్యాణం ఇమిడి ఉంది. వర్తమాన సమయంలోని కళ్యాణం తెలుసుకోలేక పోయినా భవిష్యత్తులో ఇమిడి ఉన్న కళ్యాణం ప్రత్యక్షమవుతుంది. "వహ్వా డ్రామా వహ్వా" అని గుర్తుంటే సదా సంతోషంగా ఉంటారు. పురుషార్థంలో ఎప్పుడూ ఉదాసీనత రాదు. స్వతహాగానే మీ ద్వారా అనేకమందికి సేవ జరుగుతుంది.

**18-01-1979**

సదా కల్పక్రితం వలె స్వయాన్ని అంగదుని సమానం అచంచలంగా ఉన్నామని భావిస్తున్నారా? అంగదుని సమానమైన అచంచలత అనగా సదా నిశ్చయబుద్ధి విజయంతి. కొద్దిగానైనా అలజడిలోకి వచ్చినారంటే విజయులుగా అవ్వలేరు. మాయ విఘ్నాలైతే ఈ డ్రామాలో మహావీరులుగా తయారు చేసేందుకు పేపర్(పరీక్ష) రూపంలో వస్తాయి. పేపరు లేకుండా ఎప్పుడూ తరగతి మారదు. పరీక్ష రావడమంటే పై క్లాసుకు వెళ్లడం. అందువలన పరీక్ష వచ్చిందంటే సంతోషించాలి గాని ఆందోళన చెందరాదు. మాయతో కూడా పాఠం నేర్చుకోండి. మాయ ఎప్పుడూ అలజడిలోకి రాదు. స్థిరంగా ఉంటుంది. ఈ పాఠాన్ని మాయ ద్వారా నేర్చుకొని మాయాజీత్‌లుగా అయిపోండి.

**23-01-1979**

రెండవ విషయం - సౌభాగ్యముతో(అయిదవతనముతో) పాటు భాగ్యాన్ని కూడా చూశారు. లౌకికంలో కూడా భాగ్యానికి ఆధారం - శారీరిక ఆరోగ్యం, మానసిక సంతోషం, ధన సమృద్ధి, సంబంధాలలో సదా సంతుష్టత మరియు సంపర్కంలో సదా సఫలతా మూర్తులుగా ఉంటారు. ఈ అన్ని విషయాలతో భాగ్యాన్ని లేక అదృష్టాన్ని చూస్తారు. కనుక ఇప్పుడు సంగమ యుగములోని శ్రేష్ఠ భాగ్యాన్ని అనుభవము చేస్తున్నారు కదా. సంగమ



యుగములో అలౌకిక జీవితంలోని విశేషతలు మీకు తెలుసు కదా. సదా స్వస్థత(ఆరోగ్యము) అనగా స్వ(ఆత్మిక స్థితి)లో స్థితమై ఉండడం వలన శారీరిక కర్మ భోగము కూడా కర్మయోగము ద్వారా శూలం నుండి ముల్లుగా అయిపోతుంది. కర్మభోగమును కూడా అనంతమైన డ్రామాలో ఒక ఆటగా భావించి ఆడుకుంటారు. కనుక శారీరిక రోగం యోగంలోకి పరివర్తనైపోయింది. అందువలన సదా ఆరోగ్యంగా ఉన్నారు. జబ్బును జబ్బుగా భావించరు కానీ అనేక జన్మల భారము తేలికవుతూ పోతుంది. లెక్కాచారము చుక్తా(సమాప్తం) అవుతూ ఉంది అని భావించుట వలన సదా ఆరోగ్యంగా ఉన్నామని భావిస్తారు. ఇందుకు తోడుగా మానసిక సంతోషం సదా ప్రాప్తించే ఉంది. 'మన్మనాభవ' అవ్వడం అనగా సంతోషాల ఖజానాతో సంపన్నముగా అగుట.

**25-01-1979**

మూడవ విషయం - స్వయం పై గౌరవం(ఆత్మ గౌరవం) - ఇందులో కూడా తండ్రి ద్వారా లభించిన ఈ అలౌకిక శ్రేష్ఠ జీవితం లేక బ్రాహ్మణ జీవితము యొక్క టైటిల్స్ ఏవైతే ఉన్నాయో లేక అనేక గుణాలు మరియు కర్తవ్యం ఆధారం పై ఏ స్వరూపము లేక స్థితికి మహిమ ఉందో - ఉదాహరణానికి స్వదర్శన చక్రధారులు, జ్ఞాన స్వరూపులు, ప్రేమ స్వరూపులు, ఫరిస్తా స్థితి - తండ్రి జ్ఞానము ఆధారంతో ఏ టైటిల్స్ అయితే ఇచ్చారో అలా స్వయాన్ని అనుభవము చేయడం లేక అటువంటి స్థితిలో స్థితమై ఉండడం. నేను ఎవరినో అలా స్వయాన్ని భావించి, అర్థం చేసుకొని నడవడం. 'ఎవరిని' అనగా శ్రేష్ఠ ఆత్మను, డైరక్టు తండ్రి సంతానాన్ని, అనంతమైన ఆస్తికి అధికారిని, మాస్టర్ సర్వశక్తివంతుడను - ఇలా నేను ఎవరినో అలా భావించి నడుచుకోవడమే స్వయాన్ని గౌరవించుకోవడం అని అంటారు. నేను బలహీనుడను, నాకు ధైర్యము లేదు, తండ్రి చెప్తారు కానీ నేను తయారవ్వలేను, డ్రామాలో నా పాత్రయే వెనుకగా ఉంది. ఎంత ఉందో అదే మంచిది(చాలు) - ఇలా స్వయంతో వ్యాకులపడడం కూడా స్వయాన్ని అగౌరవపరచుకోవడమే. ఆత్మ గౌరవం యొక్క రికార్డు

ఎలా ఉందో చెక్ చేసుకోండి.

**30-01-1979**

ప్రతి కర్మను త్రికాలదర్శులై చేయడం వలన ఎప్పుడూ ఏ కర్మా వికర్మగా అవ్వదు, సదా సుకర్మగానే ఉంటుంది. ఇలాగే సాక్షి దృష్టలుగా ఉండి కర్మలు చేస్తూ ఉంటే ఏ కర్మ బంధనములోనూ బంధింపబడి కర్మబంధన ఆత్మగా అవ్వరు.

**07-12-1979**

డ్రామానుసారం కలియుగ ప్రపంచంలోని దు:ఖము, అశాంతి దృశ్యాలను చూస్తూ అనంతమైన వైరాగులుగా అవుతూ ఉంటారు. ఏమి జరిగినా మీరు సదా ఉన్నతమయ్యే కళలోనే ఉండాలి. ప్రపంచములోని వారికి హాహాకారాలు కానీ మీకు జయ జయ ధ్వనులు. ఈ ప్రపంచములో హాహాకారాలు జరుగుతాయని మీకు తెలుసు. హాహాకారాలు జరగడం అనగా వెళ్లిపోవడం. ఏ పరిస్థితిలోనూ భయపడరాదు. మన కొరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాక్షిగా ఉంటూ అన్ని ప్రకారాలైన ఆటలను చూడండి. కొందరు ఏడుస్తారు, కొందరు బాధతో అరుస్తారు. అన్నిటినీ సాక్షిగా ఉండి చూస్తే మజా(ఆనందం)గా ఉంటుంది. ఏమి జరుగుతుంది? అనే ప్రశ్న కూడా రాదు. ఇది జరిగేదే అని భావిస్తారు. ఇలా స్థిరంగా ఉన్నారు కదా? ఏమి జరుగుతుందో అనే ప్రశ్న రాదు. అనేకసార్లు ఈ అలజడి చూశారు, ఇప్పుడు కూడా చూస్తున్నారు. ప్రపంచములో ఏమి జరిగినా సదా స్మృతి భట్టీలో ఉండేవారు సదా సురక్షితంగా ఉంటారు.

**12-11-1979**

మాయ విసిగిస్తూ ఉందా? ఇప్పుడది నమస్కరించే సమయము. యుద్ధం చేసే సమయము కాదు. ఇంకా ఇప్పటి వరకు మాయ యుద్ధము చేస్తూ ఉందా? సమయ ప్రతి సమయం మీ స్థితి ముందుకు పోతూ ఉంది. కనుక ఇప్పుడు మాయ మీతో యుద్ధం చేయరాదు. ఒకవేళ మాయ వచ్చినా దానిని ఆటగా భావించి చూడండి. సాక్షిగా ఉండి హద్దు డ్రామాను



చూసినట్లు అనుభవమవ్వాలి. ఇలా డ్రామాలో మాయ ఆటను చూస్తే చాలా మజాగా ఉంటుంది. తర్వాత భయపడరు. కనుక ఇప్పుడు ఇలాంటి స్థితి ఉండాలి. మాయ ఎంత భయంకర రూపంలో వచ్చినా దానిని మీరు ఒక ఆట బొమ్మగా భావిస్తే అది ఆట అయిపోతుంది. ఉదాహరణానికి వేటగాడు వేటాడినప్పుడు అందులో కూడా యుద్ధం ఉంటుంది. కానీ వేటగా భావించడం వలన వేటగాడు భయపడడు. వేటలో సంతోషం కలుగుతుంది. మీరు కూడా మాయను వేటాడేవారు. వేటగాడు ఎప్పుడూ భయపడడు, సంతోషంగా ఉంటాడు. ఈసారి సదా ఆటగాడినై ఆటను చూస్తానని దృఢ సంకల్పము చేసి మధువనం నుండి మీ స్థానాలకు వెళ్లండి. తద్వారా విదేశీయులతో మాయ యుద్ధము చేసేందుకు బదులు నమస్కరించేందుకు ప్రారంభిస్తుంది. ఇలా విదేశీయులు సంకల్పము చేస్తున్నారా? ఇప్పుడిక అన్ని వైపుల నుండి మాయ యుద్ధము చేయడం సమాప్తమైపోతుంది.

**05-12-1979**

డ్రామాలో ఏ దృశ్యాన్ని చూచినా - అది అలజడి కలిగించే దృశ్యం కావచ్చు లేక అచంచలంగా ఉన్న దృశ్యం కావచ్చు. రెండిటిలోనూ నిశ్చయం ఉండాలి. అలజడి కలిగించే దృశ్యంలో కూడా కళ్యాణం అనుభవమవ్వాలి. ఇలాంటి నిశ్చయబుద్ధి గలవారిగా అవ్వండి. వాతావరణం కదిలించేదిగా ఉండవచ్చు, సమస్య భయంకరమైనది కావచ్చు కానీ సదా నిశ్చయబుద్ధి గలవారై ఉండాలి. అటువంటి వారినే విజయులు అని అంటారు. నిశ్చయం ఆధారంతో భయంకరమైన సమస్య కూడా శీతలమైపోతుంది.

డ్రామా జ్ఞానం ద్వారా ఎందుకు? ఏమి? అను ప్రశ్నలను సమాప్తం చేయువారే ప్రకృతిజీతులుగా, మాయాజీతులుగా అవుతారు. అందరూ ప్రకృతిజీత్‌లు లేక మాయాజీత్‌లుగా అయ్యారా? ఈ పంచ తత్వాలు కూడా మిమ్ములను తమవైపు ఆకర్షించరాదు, పంచ వికారాలు కూడా యుద్ధం చేయరాదు. ఇలాంటి మాయాజీతులు, ప్రకృతిజీత్‌లు రెండు పేపర్లలోనూ పాసవ్వాలి. ఒకవేళ ప్రకృతి ద్వారా ఏదైనా పేపరు(పరీక్ష) వస్తే పాసయ్యే

శక్తి ధారణ అయ్యిందా? అలజడి చెందరు కదా? కొద్దిగా అలజడిలోకి వచ్చినా ఫెయిలయినట్లే. ఇదేమిటి? ఇది ఎందుకు? ఈ ప్రశ్నలు ఉత్పన్నమైనా ఫలితము ఏమవుతుంది? ఒకవేళ ఏదైనా ప్రకృతి సమస్య (దేహము) కొద్దిగానైనా యుద్ధము చేసేదిగా అయినా ఫెయిల్ అయిపోతారు. ఏమి జరిగినా లోపల నుండి సదా "ఓహో మధురమైన డ్రామా" అను శబ్దమే రావాలి. డ్రామా జ్ఞానాన్ని ఇంత పక్కాగా చేసుకున్నారా? లేక మంచి మాటలైతే డ్రామా అని, అలజడి కలిగించేవిగా ఉంటే అయ్యో, అయ్యో అని అంటారా? అయ్యో ఇలా జరిగిందే అని సంకల్పంలో కూడా రాకూడదు. ఇంత దృఢంగా ఉన్నారా? ఎందుకంటే పోను పోను ప్రకృతి ద్వారా కూడా ఇలాంటి సమస్యలు రానున్నాయి. ప్రకృతి ఆపదలైతే రోజురోజుకు పెరుగుతున్నాయి కదా. కనుక సంకల్పంలో కూడా అలజడి రాని విధంగా మీ స్థితి ఉండాలి. ఇలా అచంచలంగా, స్థిరంగా అయ్యారా? ఒకవేళ చాలా సమయం నుండి మాయాజీత్, ప్రకృతిజీత్‌లుగా ఉండే అభ్యాసం లేకపోతే ఫలితం(రిజల్టు) ఏమవుతుంది? ఒక్క సెకండు పేపరు(పరీక్ష) రానున్నది. ఆ సమయంలో ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమవుతే మీరు తయారయ్యే లోపలే రిజల్టు వచ్చేస్తుంది. ఒక్క సెకండులో పాసయ్యే అభ్యాసం ఉండాలి. ఇప్పుడు యోగం చెయ్యాలి అని ఆలోచిస్తూ స్మృతిలో కూర్చున్నా ఆ సెకండు గడిచిపోతుంది. యుద్ధం చేస్తూ చేస్తూనే శరీరాన్ని వదిలేస్తారు. పురుషార్థ జీవితంలో యుద్ధం చేస్తూ చేస్తూ శరీరం వదిలేస్తే రిజల్టు ఏమవుతుంది? చంద్ర వంశీయులుగా అయిపోతారు. అందువలన ప్రతి ఒక్కరు సదా 108 మాలలో వచ్చే లక్ష్యం ఉంచుకోండి. లక్ష్యం శ్రేష్ఠంగా ఉంటే లక్షణాలు స్వతహాగానే వచ్చేస్తాయి. 16 వేలలోకి రావాలనే లక్ష్యం ఎప్పుడూ ఉంచుకోకండి. నెంబరువన్‌లోకి వచ్చే పురుషార్థం చెయ్యండి. నెంబరువన్‌గా అవ్వాలనే లక్ష్యం ఉండాలి.

**07-12-1979**

డ్రామానుసారంగా కలియుగ ప్రపంచంలోని దు:ఖం మరియు అశాంతి దృశ్యాలను చూసి అనంతమైన విరాగులుగా అవుతూ ఉంటారు.



ఏమి జరిగినా ఎక్కేకళలో ఉండాలి. ప్రపంచం కొరకు హాహాకారాలు అవుతాయని మీకు తెలుసు. హాహాకారాలు జరగడం అనగా వెళ్ళిపోవడం. ఎలాంటి పరిస్థితిలోనూ గాభరా పడరాదు. మన కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాక్షిగా అయ్యి అన్ని ప్రకారాల ఆటను చూడండి. కొంతమంది ఏడుస్తారు, బాధతో అరుస్తారు...... అన్నీ సాక్షిగా ఉండి చూచుట వలన మజా వస్తుంది. ఏమవుతుంది? అన్న ప్రశ్న తలెత్తదు. ఇది జరగవలసిందే అని నిశ్చలంగా ఉన్నారు కదా? ఏమవుతుంది? అన్న ప్రశ్న అయితే ఉత్పన్నమవ్వడం లేదు కదా? అనేకసార్లు ఈ అలజడులన్నీ చూశారు, ఇప్పుడు కూడా చూస్తున్నారు. ప్రపంచంలో ఏమి జరిగినా స్మృతి భట్టీలో ఉండేవారు సదా సురక్షితంగా ఉంటారు.

**19-05-1979**

## ఆకు ఆకును భగవంతుడు కదిలిస్తాడు - ఈ గాయనము(మహిమ) యొక్క రహస్యము

భక్తిమార్గములో భక్తులకు జ్ఞానము లేకున్నా ఒక సామెత ఉంది - " భగవంతుని ఆజ్ఞ లేకుండా ఆకైనా కదలదు. " ఒక ఆకు కదులుతూ ఉందంటే దానిని కదిలించేవాడు కూడా భగవంతుడే కాని దీని రహస్యము " ఏ ఆకునూ భగవంతుడు కదిలించడని, ఇదంతా డ్రామానుసారము జరుగుతూ ఉందని" మీకు తెలుసు. ఈ మహిమ స్థూల ఆకులకు వర్తించదు. కాని కల్పవృక్షములో మీరు మొదట వచ్చే ఆకులు. సంగమ యుగములో ఉన్న మీరంతా బంగారు యుగములో వచ్చే ఆకులు. మీరిప్పుడు తండ్రి ద్వారా ఇనుము నుండి బంగారుగా అయ్యారు. ఈ చైతన్య ఆకులను ఈ సమయంలో డైరుక్టు తండ్రే నడిపిస్తున్నారు.

**26-12-1979**

మూడు స్మృతులుండాలి - మొదటిది స్వ స్మృతి, రెండవది తండ్రి స్మృతి, మూడవది డ్రామా జ్ఞాన స్మృతి. ఈ మూడు విశేష స్మృతులలో జ్ఞాన విస్తారమంతా ఇమిడి ఉంది. జ్ఞాన వృక్షములో ఈ మూడు స్మృతులు

ముఖ్యమైనవి. ఎలాగైతే ఏదైనా వృక్షానికి మొదట బీజముంటుంది. దాని నుండి మొదట రెండు ఆకులు వస్తాయి, తర్వాత వృక్షము విస్తారమవుతుందో అలా ముఖ్యమైన బీజము తండ్రి స్మృతి. తర్వాత రెండు ఆకులు అనగా ముఖ్యమైన స్మృతులు - మొత్తం ఆత్మను గురించిన జ్ఞానము, డ్రామాను గురించిన స్పష్టమైన జ్ఞానము. ఈ మూడు స్మృతులను ధారణ చేయు వారు 'స్మృతి భవ' అను వరదానులుగా అవుతారు. ఈ మూడు స్మృతుల ఆధారముతో మాయాజీతులు, జగత్‌జీతులుగా అవుతారు. ఈ సంగమ యుగములో ఈ మూడు స్మృతులు విశేషమైనవి. అందువలన రాజయోగీ తిలకము మూడు స్మృతులది అనగా మూడు బిందువుల రూపములో ప్రతి ఒక్కరి మస్తకము పై ప్రకాశిస్తూ ఉంటుంది. ఎలాగైతే త్రిశూలములో ఒక భాగము లేకుంటే యథార్థమైన శస్త్రమని అనబడదో అలా ఒక బిందువు కూడా లోపించరాదు.

**04-02-1980**

సూక్ష్మవతనములో చెక్ చేయుటకు కష్టపడే పని ఉండదు. సంకల్పమనే స్విచ్ ఆన్ చేస్తూనే ప్రతి ఒక్కరి మొత్తం అన్ని ప్రకారాల సమాచారమంతా ఎమర్జ్ అవుతుంది. సాకార ప్రపంచములో వలె శ్రమ చేసే పని ఉండదు. ఇప్పుడు ఏవైతే సైన్సు సాధనాలు వస్తున్నాయో వాటి రిఫైన్ రూపాలు అక్కడ ముందు నుండే ఉన్నాయి. ఈ టి.వి ఇక్కడైతే ఇప్పుడిప్పుడే కనుగొన్నారు. కానీ పిల్లలైన మీకు స్థాపన ఆదిలోనే స్థూల వతనంలోని దృశ్యాలను సూక్ష్మ వతనంలో చూపించి అనుభవము చేయించబడింది. సైన్సువారు శ్రమ చేసే పిల్లలు, ఇప్పుడు నక్షత్రాల వరకు వెళ్లేందుకు శ్రమిస్తున్నారు. చంద్రునిలో ఏమీ లభించకుంటే నక్షత్రాలలో ప్రయత్నిస్తున్నారు. కాని పిల్లలైన మీరు సైలెన్స్ శక్తి ద్వారా నక్షత్రాల కంటే ఇంకా దూరంగా ఉన్న పరంధామాన్ని ఆది నుండి అనుభవం చేస్తూనే ఉన్నారు. అయినా ప్రతి పుత్రునికి వారు చేసిన శ్రమకు ఫలితము తప్పకుండా లభిస్తుంది. వారికి కూడా విశ్వములో పేరు, ప్రతిష్ఠలు మరియు సఫలతకు అల్పకాలపు సంతోషము ప్రాప్తిస్తాయి. వారు కూడా డ్రామాలో



పరవశులుగా ఉన్నారు అనగా వారి పాత్రకు వశమై ఉన్నారు. దేవతల ముందుకు ప్రకృతి(భూమి) - రత్నాలు, వజ్రాలతో పళ్లెములు నింపుకొని వచ్చిందని గాయనముంది కదా. పృథ్వి మరియు సాగరము మీ కొరకు నలువైపులా వ్యాపించి ఉన్న బంగారు, వజ్రాలు, ముత్యాలు మొదలైన వాటిని ఒకే స్థానములోకి చేర్చేందుకు నిమిత్తమవుతాయి. దీనినే పళ్లెములు నింపుకొని రావడం అని అంటారు. పళ్లెములో చెదిరి పోయిన వస్తువులన్నీ ఒకే చేరుతాయి కదా. ఇప్పుడు ఈ భారతదేశము మరియు దీనికి సమీపంగా గల ప్రదేశము పళ్లెముగా అవుతుంది. ప్రకృతి తత్వాలు సేవకులై విశ్వాధికారుల కొరకు అన్ని ఏర్పాట్లు చేసి మీ ముందు ఉంచుతాయి. అలాగే దేవతల కొరకు క్షుద్ర(సైన్సు) శక్తులు కూడా సేవాధారులుగా అవుతాయి. భిన్న-భిన్న ప్రకారాలైన సాధనాల ద్వారా వారు ఏ సఫలతను అనగా సిద్ధులను ప్రాప్తి చేసుకుంటారో, ఆ సిద్ధులన్నీ అనగా సైన్సు యొక్క రిఫైన్ రూపము, సఫలతా రూపము, సిద్ధి రూపములో మీ సేవాధారులుగా అవుతాయి. ఇప్పుడైతే ప్రమాదాలూ ఉన్నాయి, ప్రాప్తులూ ఉన్నాయి. కాని రిఫైన్ సిద్ధి రూపములో దు:ఖ కారణము సమాప్తమై సదా సుఖము మరియు సఫలతా రూపమైపోతాయి. ఇప్పుడున్న వివిధ డిపార్ట్‌మెంట్ల వారు తమ తమ జ్ఞాన ఫలితాన్ని, అన్వేషణల ఫలితాన్ని మీ సేవకు ఉపయోగిస్తారు. దీనినే ప్రకృతి కూడా దాసి అంతేకాక సర్వ సిద్ధులు ప్రాప్తి అవ్వడం అని అంటారు. ఆజ్ఞాపిస్తూనే కార్యము జరిగిపోతుంది. దీనినే సిద్ధి స్వరూపమని అంటారు.

**07-02-1980**

**సేవాధారీ సోదరీ-సోదరులతో:-** సేవాధారులనగా తండ్రి సమానులు. తండ్రి కూడా సేవాధారిగా అయ్యి వస్తారు. సేవాధారిగా అవ్వడం అనగా తండ్రి సమానంగా అవ్వడం. కనుక డ్రామా లాటరీలో మీ పేరు తగిలిందని భావించండి. సేవ చేసేందుకు అవకాశము లభించడం అనగా లాటరీలో మీ పేరు రావడం(లాటరీ తగలడం). సదా సేవకు అవకాశము తీసుకుంటూ ఉండాలి. అందరి రిజల్టు బాగుంది, శుభాకాంక్షలు.

20-01-1981

దాదీగారితో :- సమయం సమీపానికి వస్తూ ఉందా? లేక మీరు సమయానికి సమీపంగా వస్తున్నారా? స్వయాన్ని తెచ్చుకుంటున్నారా? లేక సమయము స్వయాన్ని(మిమ్ములను) లాక్కుంటూ ఉందా? డ్రామా మిమ్ములను నడిపిస్తోందా లేక మీరు డ్రామాను నడిపిస్తున్నారా? మాస్టర్ మీరా లేక డ్రామానా? రచయిత డ్రామానా లేక మీరా?

ఇప్పుడు చాలాసార్లు డ్రామాలో ఎలా ఉంటుందో అదే జరుగుతుంది అని వాణిలో వస్తూ ఉంటుంది. కాని పోను పోను డ్రామాలో ఏది జరగాలో అది ఎంత స్పష్టంగా టచ్ అవుతుందంటే అప్పుడు ఏది జరగాలో అదే జరుగుతుంది అని అనరు. అథారిటీతో డ్రామాలో ఇదే జరుగుతుంది అని అంటారు. అదే జరుగుతుంది కూడా. ఎలాగైతే భవిష్య ప్రాలబ్ధము స్పష్టంగా ఉందో, అలా డ్రామాలో ఏది జరగాలో అది స్పష్టమౌతుంది(తెలుస్తుంది). ఇలా జరగదని, అవుతారో కాదో ఎవరికి తెలుసు? అని ఎవరెంత చెప్పినా అంగీకరిస్తారా? లేదు. ఎలాగైతే ఈ విషయంలో జ్ఞానము ఆధారముతో మాస్టరై తప్పకుండా జరుగుతుందని చెప్తారు. రేపు జరుగుతుందో లేక ఒక సెకండు తర్వాత జరుగుతుందో అది కూడా ఇంత అథారిటీతో, జ్ఞాన శక్తితో, స్పష్టతా శక్తితో ఇది జరగనే జరుగుతుంది అని చెప్తారు. జరగబోయేది చూస్తామని కూడా అనరు. ఇంతకు ముందు చూశాము, ఇప్పుడదే జరుగుతుంది అని చెప్తారు. ఇంత అథారిటీ గలవారిగా అవుతూ ఉంటారు. ఇది కూడా ఒక అథారిటీ కదా. అయ్యే తీరాలి, మా రాజ్యము రానే వస్తుంది అని చెప్తారు. కదిలించేందుకు ఎవరు ఎంత ప్రయత్నించినా ఈ పాయింటుకు అథారిటీ అయినట్లు అది స్పష్టముగా ఉంటుంది. అయితే కొంచెం ఏకాంతవాసులుగా అయినప్పుడు ఇది జరుగుతుంది. ఎంత ఏకాంత వాసులుగా అవుతారో అంత బాగా టచింగ్ వస్తుంది. వర్తమాన సమయము ఎంత స్పష్టంగా తెలుస్తుందో భవిష్యత్తు అంత స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పుడు సమయము తక్కువగా లభిస్తోంది. డ్రామాలో ఈ దృశ్యము పర్దా లోపల ఉంది. ఇది కూడా అనుభవమవుతుంది. అందుకే



ఈ సంవత్సరము సేవలో ఎంత హల్‌చల్‌గా ఉంటారో అంత పూర్తి అండర్‌గ్రౌండ్(సైలెన్స్)లోకి వెళ్లిపోండి. ఏదైనా ఎంత కొత్త శక్తిశాలి అన్వేషణ(ఇన్వెన్షన్) చేస్తారో దానిని అంత అండర్‌గ్రౌండ్‌లో చేస్తారు. ఇక్కడ ఏకాంతవాసులుగా అవ్వడమే అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లడం. ఒకేసారి గంట, అర్ధగంట సమయము లభించదు కనుక ఎంత సమయము లభిస్తే అంత సమయము ఏకాంతవాసులుగా అవ్వండి. ఇది కూడా అభ్యాసమైపోతుంది. మాట్లాడుతూ ఉంటారు, 5 నిముషాలు సమయం లభించినా సాగరం లోతుల్లోకి వెళ్లిపోతారు. మీ వద్దకు వచ్చేవారు కూడా వీరు ఎక్కడో వేరే స్థానము(ఆలోచన)లో ఉన్నారు, ఇక్కడ లేరని అర్థము చేసుకుంటారు. వారి సంకల్పాలకు కూడా బ్రేక్ పడ్తుంది. మాట్లాడాలనుకున్నా మాట్లాడలేరు. సైలెన్స్ ద్వారా ఎంత స్పష్టమైన జవాబు లభిస్తుందంటే వాచా ద్వారా కూడా అంత స్పష్టంగా ఉండదు. సాకారములో కార్యవ్యవహారాలు చేస్తున్నా మధ్య మధ్యలో అదృశ్య అవస్థ అనుభవమవుతూ ఉండడం మీరు చూశారు కదా. వింటూ, వినిపిస్తూ, ఆదేశాలనిస్తూ, ఇస్తూ అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయేవారు. కనుక ఇప్పుడీ అభ్యాసము చేసే లహర్(అల) అవసరము. నడుస్తూ నడుస్తూ అదృశ్యమైపోయినట్లు కనిపించాలి. చూసేవారికి మీరు ఈ ప్రపంచములో లేనట్లు అనుభవమవ్వాలి. ఈ ఫరిస్తా, ఈ దేహ ప్రపంచము, దేహ భావము నుండి అతీతమైపోయినట్లు అనిపించాలి. దీనినే అందరూ సాక్షాత్కారమని అంటారు. ఎవరు మీ ముందుకు వచ్చినా వారు మిమ్ములను ఈ స్టేజిలోనే సాక్షాత్కారమును అనుభవము చేస్తారు. ప్రారంభములో సాక్షాత్కారాల అలను చూచారు కదా. సాక్షాత్కారాల ద్వారానే కదా శబ్దము వ్యాపించింది. ఇంద్రజాలంగా లేక ఎలా భావించినా శబ్దమైతే దీని ద్వారానే వ్యాపించింది కదా! ఈ స్థితిలో అనుభూతి సమానమైన సాక్షాత్కారమౌతే ప్రత్యక్షత జరుగుతుంది, పేరు ప్రఖ్యాతమౌతుంది, సాక్షాత్కారమౌతుంది, ప్రత్యక్షఫలము అనుభవమవుతుంది. ఈ ప్రత్యక్ష ఫలము యొక్క సీజనులో ప్రత్యక్షత జరుగుతుంది. దీనినే వరదానీ రూపమని అంటారు. ఎవరు వచ్చినా

అనుభవము చేసి వెళ్తారు. మాట్లాడుతూ మాట్లాడుతూ స్వయం అదృశ్యమై, ఇతరులను కూడా అదృశ్యము చేసేస్తారు. ఇది కూడా జరుగుతుంది. వాచా ద్వారా పనులు చేసుకోవడం చూస్తున్నారు కాని అనుభవం చేసి చేయించే ఈ స్థితి ద్వారా ఒక్క సెకండులో సమస్యలను అధిగమిస్తారు. తక్కువ సమయములో ఎక్కువ సఫలత లభిస్తుంది. ఈ రోజులలో ఎవరికైనా దేనినైనా మాటల ద్వారా చెప్తే ఏమంటారు? ఇదంతా మాకు ముందే తెలుసని అంటారు. అందరూ నాలెడ్జిఫుల్‌గా అయ్యారు. ఒక్క సెకండులో ఇదంతా మాకు తెలుసని అంటారు. అందరూ ఇలాగే అంటారు. ఫలానా తప్పు చేస్తే ఏ శిక్ష లభిస్తుందో కూడా అందరూ అర్థం చేసుకున్నారు. కనుక ఇప్పుడు కొత్త పద్ధతి కావాలి. ఆ పద్ధతి ఇదే. అనుభూతి తక్కువగా ఉంది, పాయింట్లు ఎక్కువగా ఉన్నాయి. ఎవరికైనా శక్తి రూపాన్ని, శాంతి రూపాన్ని ఒక్క సెకండు అనుభవము చేయించినా వారు ఏమీ మాట్లాడరు.

**07-03-1981**

డ్రామాలో ఏమి జరిగినా అందులో కళ్యాణమే నిండి ఉంది అన్న స్మృతిలో సదా ఉన్నట్లయితే సంపాదన జమ అవుతూ ఉంటుంది. వివేకవంతులైన పిల్లలు, ఏది జరిగినా అది కళ్యాణకారి అనే ఆలోచిస్తారు. ఎందుకు? ఏమిటి? అన్న ప్రశ్నలు వివేకవంతులలో తలెత్తవు. ఒకవేళ ఇది సంగమయుగ కళ్యాణకారి యుగమని, తండ్రి కూడా కళ్యాణకారి అని గుర్తు ఉంటే శ్రేష్ఠ స్థితి తయారవుతూ ఉంటుంది. బయట నుండి నష్టం కనిపించినా ఆ నష్టంలో కూడా కళ్యాణం ఇమిడిపోయి ఉందనే నిశ్చయం ఉండాలి. తండ్రి తోడు మరియు చేయి(సహాయం) ఉన్నట్లయితే అకళ్యాణం జరగనే జరగజాలదు. ఇప్పుడు చాలా పరీక్షలు వస్తాయి. వాటిలో ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్నలు తలెత్తరాదు. ఏమి జరిగినా జరగనివ్వండి. తండ్రి మన వారు, మనం తండ్రి వారమన్నప్పుడు ఏ అకళ్యాణమూ జరగదు. దీనినే నిశ్చయబుద్ధి అని అంటారు. విషయం మారిపోయినా మీరు మారరాదు. నిశ్చయమంటే ఇదే. ఎప్పుడూ మాయతో ఆందోళన చెందడం లేదు కదా? ఒకసారి వాతావరణంతో, ఒకసారి ఇంటి వారితో, ఒకసారి బ్రాహ్మణులతో



పరేశాన్ అవ్వడం లేదు కదా? ఒకవేళ మీ శాన్ (స్వాభిమానం) నుండి దూరమైపోయినట్లయితే పరేశాన్ అవుతారు (ఆందోళన చెందుతారు). శాన్ అనే సీటు పై ఉండండి. సాక్షీతనపు సీటుయే స్వాభిమానపు సీటు. దీని నుండి దూరమైపోకుండా ఉంటే పరేశాన్ (ఆందోళన) సమాప్తమైపోతుంది. ఎప్పుడూ ఏ విషయంలోనూ ఆందోళన చెందము, ఆందోళన చేయము అని ప్రతిజ్ఞ చేయండి. జ్ఞాన సాగరుడైన తండ్రికి పిల్లలుగా అయినప్పుడు, త్రికాలదర్శిగా అయిపోయినప్పుడు ఎలా పరేశాన్ అవ్వగలరు? సంకల్పంలో కూడా ఆందోళన ఉండరాదు. 'ఎందుకు' అన్న శబ్ధాన్ని సమాప్తం చేయండి. 'ఎందుకు' అన్న శబ్ధం వెనకాల పెద్ద క్యూ ఉంది.

**వీడ్కోలు సమయంలో దీదీతో** – మేళాను చూసి సంతోషిస్తున్నారు కదా? ఇది కూడా డ్రామాలో ఏదైతే జరుగుతుందో, అది చాలా మంచిదే అవుతుంది. ఇప్పుడైతే చాలామంది వస్తారు. ఇదైతే ఏమీ లేదు. ఏర్పాట్లను పెంచుకుంటూ ఉంటారు, పెరిగేవారు పెరుగుతూ ఉంటారు. మధువనంలో ఎప్పుడైతే గుంపులు, గుంపులు వస్తారో అప్పుడు భక్తిలో స్మృతిచిహ్నం తయారవుతుంది. ఎంతగా తయారుచేస్తూ ఉంటారో అంతగా పెరుగుతూనే ఉంటారు. ఈ వరదానం కూడా మీకు లభించింది. దీనినే స్మృతిచిహ్నంలో కథలను తయారుచేసి " సాగరం వరకు చేరుకున్నారు, అయినా చిన్నదిగా అయిపోయిందని" చూపిస్తారు. ఇప్పుడు ఆబూ రోడ్ వరకైతే చేరుకోండి అప్పుడే గాయనం జరుగుతుంది. ఆబూరోడ్ నుండి మౌంట్ ఆబూ వరకు కూర్చున్నప్పుడే ప్రత్యక్షత జరుగుతుంది. ఇక్కడ ఏమి జరుగుతోందని ఆలోచిస్తారు. బ్రహ్మకుమారీలు ఎంతవరకు చేరుకున్నారనే అటెన్షన్ అయితే వెళ్తుంది కదా! ఇప్పుడు ఇదైతే పిల్లల మేళా. కాని పిల్లలు, భక్తులు కలిసిపోయినప్పుడు ఏమవుతుంది? ఇప్పుడైతే చాలా ఏర్పాట్లు చేయవలసి ఉంది. తండ్రి రావాలనుకుంటే పిల్లలు కూడా పెరగాలి. వృద్ధి అవ్వకపోతే సేవ ఎక్కడుంది? సేవ అంటే అర్థమే వృద్ధి.

**11-03-1981**

అలాగే సేవలో లేక స్వయం ఎక్కేకళలో సఫలతకు ముఖ్య ఆధారం - ఒక్క తండ్రితో ఎడతెగని ప్రేమ. తండ్రి తప్ప ఇంకేమీ కనిపించరాదు. సంకల్పంలో కూడా బాబా, మాటల్లో కూడా బాబా, కర్మలలో కూడా తండ్రి తోడు. అలాంటి లవలీన ఆత్మ ఒక్క మాట మాట్లాడినా వారి స్నేహంతో కూడిన మాటలు ఇతర ఆత్మలను కూడా స్నేహంలో బంధించేస్తుంది. అలాంటి లవలీన ఆత్మల ఒక్క 'బాబా' అన్న శబ్దమే ఇంద్రజాల వస్తువు వలె పని చేస్తుంది. లవలీన ఆత్మ ఆత్మిక ఇంద్రజాలికునిగా అయిపోతుంది. ఒక్క తండ్రితో ప్రేమ అనగా లవలీన ఆత్మ. రెండవది సఫలతకు ఆధారం - ప్రతి జ్ఞాన పాయింటును అనుభవం చేసి అనుభవీ మూర్తిగా అవ్వడం. ఎలాగైతే డ్రామా పాయింట్ ఇచ్చినట్లయితే, ఒకటేమో జ్ఞానం ఆధారంగా పాయింట్ ఇవ్వడం, రెండవది - అనుభవీమూర్తిగా అయ్యి పాయింట్ ఇవ్వడం. డ్రామా పాయింట్ అనుభవజ్ఞులుగా ఎవరైతే ఉంటారో, వారు సదా సాక్షీతనపు స్టేజ్ పై స్థితులై ఉంటారు. ఏకరసంగా, అచంచలంగా, స్థిరంగా ఉంటారు. అలాంటి స్థితిలో స్థితులైన వారిని అనుభవీమూర్తులని అంటారు. రిజల్టులో బయట రూపంలో భలే మంచిగా ఉన్నా, చెడుగా ఉన్నా డ్రామా పాయింట్ యొక్క అనుభవీ ఆత్మ ఎప్పుడూ చెడులో కూడా చెడును చూడకుండా మంచినే చూస్తుంది. అనగా స్వ కళ్యాణానికి మార్గం కనిపిస్తుంది. అకళ్యాణ ఖాతా సమాప్తమయ్యింది. కళ్యాణకారి తండ్రికి పిల్లలుగా అయిన కారణంగా, కళ్యాణకారి యుగమైన కారణంగా, ఇప్పుడు కళ్యాణ ఖాతా ప్రారంభమయ్యింది. ఈ జ్ఞానం మరియు అనుభవాల అథారిటీతో సదా అచలంగా ఉంటారు.

**13-03-1981**

టీచర్లతో - టీచర్లంటే సదా పరిపూర్ణ(నిండుగా ఉన్న) ఆత్మలు. డ్రామానుసారంగా నిమిత్తంగా అయ్యారు. బాగా శ్రమ చేస్తున్నారు, ఇక ముందు కూడా చేస్తూనే ఉంటారు. ఫలితం బాగుంది. ఇంకా మంచిగానే ఉంటుంది. సమయం సమీపంగా వచ్చిన కారణంగా త్వర త్వరగా సేవ



విస్తారం పెరుగుతూనే ఉంటుంది. ఎందుకంటే సంగమ యుగంలోనే త్రేతాయుగ అంతిమం వరకు గల ప్రజలు, రాయల్ ఫ్యామిలీ మరియు దీనికి తోడు కలియుగ అంతిమం వరకు తమ ధర్మాత్మలను తయారు చేసుకోవాలి. విదేశాలలోని స్థానాలన్నీ పిక్‌నిక్ స్థానాలుగా అవుతాయి. కాని బ్రాహ్మణ ఆత్మలైతే రాజ్యవంశంలోకి వస్తాయి. అక్కడ రాజ్యపాలన చేయరు, ఇక్కడ చేస్తారు. అందరూ బాగా సేవ చేస్తున్నారు. కాని ఇప్పుడు ఇతర సేవలు చేస్తూ మనసా సేవ శక్తిశాలిగా ఎలా జరగాలి? ఇందుకు విశేష ప్లాన్ తయారుచేయండి. వాచాకు తోడు తోడుగా మనసా సేవ కూడా చాలా దూరం వరకు కార్యం చేయగలదని అనుభవమవుతుంది. ఎలాగైతే ఈ రోజుల్లో ఫ్లయింగ్ సాసర్‌ను(ఎగిరే పళ్లెం) చూస్తారో అలా మీ అందరి ఫరిస్తా స్వరూపాలు నలువైపులా కనిపిస్తాయి. తిరుగుతున్న వీరెవరు అన్న శబ్దం వెలువడ్తుంది. దీని పై కూడా పరిశోధన చేస్తారు. కాని మీ అందరి సాక్షాత్కారం పై నుండి క్రిందకు రాగానే జరిగిపోతుంది. ఫరిస్తా రూపంలో సాక్షాత్కారాలు చేయిస్తున్న బ్రహ్మకుమారీ కుమారులు వీరే అని భావిస్తారు. ఇప్పుడు ఆ హంగామాను(కోలాహలాన్ని) చేయండి. అంత: వాహక శరీరంతో తిరిగే అభ్యాసం చేయండి. ప్లేన్(విమానం) కూడా లభించని సమయం వస్తుంది. ఇలాంటి నాజూకు సమయం వచ్చినప్పుడు మీరు ముందే చేరుకుంటారు. అంత: వాహక శరీరం ద్వారా తిరిగే అభ్యాసం అవసరము. ప్రాక్టికల్‌గా అందరినీ చూసి, వారిని కలిసి వచ్చినట్లుగా అలాంటి అభ్యాసాన్ని చేయండి. అవును, మా వద్దకు అదే ఫరిస్తా వచ్చారని ఇతరులు కూడా అనుభవం చేయాలి. తర్వాత మళ్లీ ఫరిస్తాలను వెతికేందుకు బయలుదేర్తారు. ఒకవేళ ఇంతమంది ఫరిస్తాలు తిరుగుతూ ఉంటే ఏమవుతుంది? ఆటోమేటిక్‌గా(స్వతహాగా) అందరి అటెన్షన్ అటువైపు వెళ్తుంది. కావున ఇప్పుడు సాకారంతో పాటు ఆకారీ సేవ కూడా తప్పకుండా ఉండాలి. మంచిది. ఇప్పుడు అమృతవేళ సమయంలో శరీరం నుండి అతీతంగా అయ్యి తిరగండి.

17-03-1981

" ఆప్ ఔర్ బాప్ (మీరు మరియు బాబా)" ఈ రెండు శబ్ధాలలో జ్ఞాన యోగాలు రెండూ వచ్చేస్తాయి. అందుకే సహజ రాజయోగి అన్న టైటిలే ఉంది. సహజంగా ఉన్నా కష్టమనిపించేందుకు కారణం మీ బలహీనతయే. సహజమైన దారి మధ్యలో ఏదో ఒక పాత సంస్కారం బంధనమై ఆటంకం కలిగిస్తుంది. శక్తి లేనందున రాతిని పగులగొట్టడంలో మునిగిపోతారు. అలా పగులగొడ్తూ పగులగొడ్తూ వ్యాకులతతో నిరుత్సాహంగా అయిపోతారు. అయితే సహజ విధానం ఏది? రాతిని పగులగొట్టడం కాదు, దానిని జంప్ చేసి ఎగిరి దాటిపోవడం. ఇదెందుకు జరిగింది? ఇది జరగరాదు, చివరికి ఇది ఎంత వరకు అవుతుంది? ఇది చాలా కష్టము, ఇలా ఎందుకు?....... ఇటువంటి వ్యర్థ సంకల్పాలు చేయడమే రాతిని పగులగొట్టడం. కాని 'డ్రామా' అనే ఒక్క శబ్ధం గుర్తుకు వస్తే ఈ శబ్ధం ఆధారంతో హైజంప్ చేసి దాటేస్తారు. అందులో (రాతిని పగులపొట్టడంలో) రోజులు లేక కొన్ని నెలలు పడ్తుంది, ఇందులో ఒక్క సెకండు చాలు. కనుక ఇది జ్ఞానములో మీ బలహీనతే కదా?

18-03-1981

ఆత్మలకు ఏ కష్టము వచ్చినా ఎవరి వద్దకు వెళ్తారు? తండ్రి వద్దకు లేక దేవాత్మలైన మీ వద్దకు వస్తారు. ఎవరైతే ఇతరుల కష్టాలను పోగొట్టారో స్వయం వారే కష్టమని ఎలా అనుభవం చేస్తారు? కష్టాన్ని అనుభవించేటప్పుడు కష్టపెట్టే ఏ విషయము విశేషంగా బుద్ధిలోకి వస్తుంది. చాలా అనుభవముంది కదా? ఆ కష్టంలో తండ్రిని చూచేందుకు బదులు మాటలను పరిస్థితులను చూస్తూ ఉంటారు. అందువలన మళ్లీ చాలా ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఒకవేళ తండ్రిని చూస్తే, తండ్రి ఎలాగైతే బిందువో అలా ప్రతి మాటకు బిందువు పెట్టేయండి. విషయాలు వృక్షము వంటివి, తండ్రి బీజము వంటివారు. మీరు విస్తారంగా ఉండే వృక్షాన్ని చేతికి తీసుకోవాలనుకుంటారు. కనుక తండ్రీ చేతికి దొరకడు, వృక్షము కూడా చేతికి దొరకదు. తండ్రిని కూడా పక్కన పెట్టేస్తారు, వృక్షము యొక్క విస్తారాన్ని



కూడా మీ బుద్ధిలో ఇముడ్చుకోలేరు. కనుక ఏ కోరికనైతే ఉంచుకున్నారో అది పూర్తి కానందున వ్యాకులపడ్తారు. వ్యాకులతతో ఉన్నవారికి ఎంత చిన్న కార్యమైనా కష్టమనిపిస్తుంది. వ్యాకులతకు ముఖ్యమైన గుర్తు - వారు పదే పదే ఏదో ఒక దానికి పరిస్థితి పై కావచ్చు, వ్యక్తి పై కావచ్చు, ఫిర్యాదులే చేస్తూ ఉంటారు. ఎంతగా ఫిర్యాదులు చేస్తూ ఉంటారో అంతగా వారే స్వయంగా చిక్కుకుపోతారు. ఎందుకంటే ఈ విస్తారము ఒక వలగా తయారవుతుంది. దాని నుండి బయట పడేందుకు ఎంత ప్రయత్నిస్తారో అంత ఎక్కువగా చిక్కుకుపోతారు. మాటలైనా(బాతే) ఉంటాయి లేక తండ్రి అయినా ఉంటాడు. మాటలు వినడం, వినిపించడం అర్ధకల్పము నుండి చేస్తూనే వచ్చారు. భక్తిమార్గములోని రామాయణము, భాగవతము అంటే ఏమి? ఎంత విస్తారమైన విషయాలు! అవి ఉన్నప్పుడు తండ్రి లేడు. ఇప్పుడు కూడా విషయాలలోకి(మాటలలోకి) వెళ్తే తండ్రిని పోగొట్టుకుంటారు. అప్పుడు ఏ ఆట ఆడ్తారు?(దాగుడుమూతలాట). మూడవ నేత్రానికి పట్టీ కట్టుకొని వెతుకుతూ ఉంటారు. తండ్రి పిలుస్తూ ఉంటారు, మీరు వెతుకుతూ ఉంటారు. చివరికి ఏమవుతుంది? తండ్రీ, మీరే స్వయంగా వచ్చి మీ చేతినివ్వండి అని అంటారు. ఇటువంటి ఆట ఎందుకు ఆడ్తారు? ఎందుకంటే విషయాలను(మాటలను) విస్తారము చేస్తే రంగు రంగుల విషయాలుంటాయి. అవి మిమ్మలను వాటి వైపు ఆకర్షించుకుంటాయి. దాని నుండి దూరమైతే సదా సహజయోగులుగా అవుతారు.

21-03-1981

భారతవాసీ పిల్లలను చూచి బాప్‌దాదా అంటున్నారు - విదేశీయుల భాగ్యము విదేశీయులది, భారతదేశము వారి భాగ్యము భారతదేశము వారిది. భారతదేశము వారు భాగ్యశాలురుగా అవ్వకుంటే విదేశీయులు ఎలా వస్తారు? విదేశీయుల మహిమ - లాస్ట్‌లో వచ్చినా ఫాస్ట్‌గా పోయే లెక్క ప్రకారముంటుంది. కాని ఆది నుండి ఉండేవారు ఆదిలోనే ఉంటారు. భారతీయులు భగవంతుని తమవారిగా చేసుకున్నారు. అంతేకాక వారికి భగవంతుడు రెడీమేడ్‌గా లభించాడు. భారతీయులు భగవంతుని

గుర్తించకుండా ఉంటే వారికి (విదేశీయులకు) భగవంతుని పరిచయాన్ని ఎవరిస్తారు? తండ్రిని ప్రత్యక్షము చేసేందుకు నిమిత్తులు మొదట భారతీయులే. గుప్తముగా ఉన్న తండ్రిని ముందు భారతీయులే ప్రత్యక్షము చేశారు, తర్వాత వారు అంగీకరించారు. ఉదాహరణానికి ఏదైనా దుకాణము తెరచినప్పుడు మొదట తోపుడు బండి పైన లేక ఫుట్‌పాత్ పైన తెరుస్తారు. తర్వాత వృద్ధి చెందుతూ చెందుతూ పెద్ద దుకాణమైపోతుంది. అలా భారతీయులు మొదట చాలా శ్రమించి దుకాణము తెరిచారు. అప్పుడే కదా మీరు(విదేశీయులు) వచ్చారు. భారతీయులు ఎంత సహించారో అంత విదేశీయులెక్కడ సహించారు? అందువలన ఇందులో భారతవాసీ పిల్లలు నంబరువన్‌గా ఉన్నారు. ఎవరైతే సహించడంలో నంబరువన్‌గా ఉంటారో వారికి వారసత్వము కూడా అదే లెక్కతో అనగా నంబరువన్‌గానే లభిస్తుంది. పిల్లలైన మీరు ప్రాక్టికల్‌గా చెప్పేవారు, వారు వినేవారు. బ్రహ్మాబాబాలో మేము శివబాబాను కళ్లతో చూశామని మీరు చెప్తారు. ఇదే మీ విశేషత. వాస్తవానికి అందరూ ఒకరి కంటే ఒకరు ముందున్నారు. ఎందుకంటే సంగమ యుగానికి ఎటువంటి వరదానముందంటే ప్రతి ఒక్కరిలో ఏదో ఒక విశేషత విశేషంగా ఉంది. ఇప్పుడు “భోలీ”(దాది) విశేషతను చూడండి, ‘భోలీ’ లేకుంటే ఉపన్యసించేవారి పని జరగదు. అచ్ఛా - వీరు కూడా హోలీ ఆట ఆడుతున్నారు. ఈ రోజు ఆచరించుట. వీరు కూడా పిచకారి చేస్తున్నారు.

**29-03-19810**

మాయ బాబాతో ఉన్న మీ కనెక్షన్‌నే ఢీలా చేస్తుంది. అలా ఢీలా అవ్వకుండా కేవలం సంభాళించండి. కనెక్షన్ ఎక్కడ లూజ్‌గా అయ్యిందో అర్థం చేసుకోండి. లూజ్ అయినందు వల్లనే నిర్బలత వస్తుంది. ఎందుకయ్యింది? ఏమయ్యింది? అని ఆలోచించకండి. ఎందుకు? ఏమి? అని ఆలోచించేందుకు బదులు కనెక్షన్‌ను సరి చేసుకుంటే సమస్య సమాప్తమైపోతుంది. సహయోగము కొరకు సమయాన్ని భలే తీసుకోండి. వాయుమండలాన్ని యోగయుక్తంగా వైబ్రేషన్లను బాగు చేసుకునేందుకు



భలే సహయోగాన్ని తీసుకోండి. కాని వ్యర్థంగా మాట్లాడేందుకు లేక విస్తారములోకి వెళ్లేందుకు ఎవరినీ తోడు చేసుకోకండి. అప్పుడు మీరు శుభ చింతకులుగా అవుతారు. లేకుంటే పరచింతన జరుగుతుంది. అన్ని సమస్యలకు మూల కారణము కనెక్షన్ లూజ్ అవ్వడమే. ముఖ్యమైన విషయమిదొక్కటే. నాకు డ్రామాలో పాత్ర లేదు, నాకు సహయోగము లభించలేదు, నాకు స్థానము లభించలేదు మొదలైనవన్నీ వ్యర్థ మాటలు. కేవలం కనెక్షన్ సరి చేసుకుంటే అన్నీ లభిస్తాయి. సర్వశక్తులు మీ చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఎక్కడకూ వెళ్లేందుకు పుర్సత్తు కూడా ఉండదు. వెళ్లి బాప్‌దాదా ముందు కూర్చుంటే కనెక్షన్ జోడించేందుకు బాప్‌దాదాయే మీకు సహయోగిగా అవుతారు. ఒకటి రెండు సెకండ్లు అనుభవము అవ్వకపోయినా కన్‌ఫ్యూజ్ అవ్వకండి. కొంచెం తెగిపోయిన కనెక్షన్‌ను జోడించేందుకు ఒక సెకండో, ఒక నిముషమో పట్టినా ధైర్యము విడనాడకండి. నిశ్చయమనే పునాదిని కదిలించకండి. నిశ్చయాన్ని ఇంకా పక్కా చేసుకోండి. “బాబా నా వారు, నేను బాబా దానిని”(బాబా మేరా, మై బాబా కా) ఈ ఆధారముతో నిశ్చయమనే పునాదిని ఇంకా పక్కా చేసుకోండి. మీ నిశ్చయమనే బంధనములో తండ్రిని కూడా బంధించగలరు. తండ్రి కూడా మిమ్ముల్ని విడిచి వెళ్లలేరు. ఈ సమయంలో పిల్లలైన మీకు ఇంత అథారిటీ లభించింది. అథారిటీని, జ్ఞానాన్ని ఉపయోగించండి. పరివారము వారి సహయోగాన్ని ఉపయోగించండి. ఫిర్యాదు చేయకండి. సహయోగము కొరకు కూడా వేడుకోకండి. ప్రోగ్రాము సెట్ చేసుకోండి. బలహీనమై వెళ్లకండి. ఏమి చేసేది, ఎలా చేసేది అని భయపడకండి. సంబంధము ఆధారముతో, సహయోగము ఆధారముతో వెళ్లండి.

దీదీతో – వెరైటీని చూచి సంతోషము కలుగుతుంది కదా. మంచి ధైర్యము కలిగినవారు. తమదంతా పరివర్తన చేసుకొని వేరే దానిని తమదిగా చేసుకోవడం కూడా వీరి ధైర్యము. ఎంత మారిపోయారంటే మన పరివారము వారే అని అనిపిస్తోంది. ఇది కూడా డ్రామాలో వీరి విశేషమైన

పాత్ర. 'మా వారు' అను భావముతోనే వీరు ముందుకు వెళ్తున్నారు. ఒక్కొక్కరిని చూస్తూ ఉంటే సంతోషంగా ఉంది. ఇంతకుముందు ఒక భారతదేశపు అనేక కొమ్మల వృక్షముగా ఉండేది. కాని ఇప్పుడు విశ్వములో నలుమూలల నుండి అనేక సంస్కారాలు, అనేక భాషలు, అనేక ఆహారపుటలవాట్లు కల్గిన ఆత్మలందరూ కలిసి ఒకే వృక్షంగా అయిపోయారు. ఇది కూడా ఒక అద్భుతమే. అందరూ ఒకటిగా ఉండేవారు, ఇప్పుడున్నారు, ఇక పై ఉంటారు. ఇలాగే అనుభవం చేస్తారు. విశేషంగా అందరి స్నేహం ప్రాప్తి అవ్వనే అవుతుంది.

**13-04-1981**

అందరూ స్వయాన్ని గొప్ప భాగ్యశాలురుగా భావిస్తున్నారు కదా? ఎంత గొప్ప భాగ్యమో చూడండి. వరదాన భూమి నుండి జోలెను వరదానాలతో నింపుకునేందుకు వచ్చేశారు. ఇటువంటి భాగ్యము విశ్వములో ఎంతమంది ఆత్మలకు ఉంది! కోట్లలో కొంతమందికి. ఆ కొంతమందిలో కూడా కొంతమందికే. కనుక కోట్లలో కొంతమంది. ఆ కొంతమందిలో కూడా ఏ కొంతమందో అని ఏదైతే వింటూ వచ్చారో, వర్ణన చేస్తూ వచ్చారో ఆ కొంతమందిమి మేమే అన్న సంతోషాన్ని సదా ఉంచుకోండి. అంత సంతోషముందా? సదా "వాహ్ నా భాగ్యము" అనే సంతోషములో నాట్యము చేస్తూ ఉండండి. ఇదే పాట పాడుతూ ఉండండి. ఈ పాట పాడుతూ సంతోషంగా నాట్యము చేస్తూ ఉండండి. "వాహ్ నా భాగ్యము, వాహ్ నా బాబా, వాహ్ డ్రామా వాహ్" అనే పాట పాడడం వస్తుంది కదా. ఈ పాట సదా పాడుతూ ఉండండి. మీరు చాలా అదృష్టవంతులు. తండ్రి ఏమో సదా ప్రతి పుత్రుని "లవ్‌లీ బచ్చా" అనే అంటారు. కనుక లవ్‌లీ కూడా అయ్యారు, లక్కీయెస్ట్ కూడా అయ్యారు. స్వయాన్ని ఎప్పుడూ సాధారణమని భావించకండి. మీరు చాలా శ్రేష్ఠమైనవారు. భగవంతుడే మీవాడై పోయాడు. ఇంకేమి కావాలి! బీజమునే మీ వారిగా చేసుకున్నపుడు వృక్షమంతా వచ్చేసినట్లే కదా. కనుక సదా ఇదే సంతోషములో ఉండండి. మీ సంతోషాన్ని చూచి ఇతరులు కూడా సంతోషంగా నాట్యము చేస్తూ ఉంటారు.



**15-04-1981**

అందరూ సదా సాక్షి స్థితిలో స్థితమై మీ మీ పాత్రలు అభినయిస్తున్నారా? సాక్షీ స్థితి స్థిరంగా ఉంటుందా? ఎప్పుడైనా పాత్ర చేస్తూ చేస్తూ సాక్షీ స్థితిని మర్చిపోవడం లేదు కదా? ఎవరైతే సాక్షీ స్థితిలో ఉంటారో వారు ఎప్పుడూ ఏ పాత్రలోనూ చంచలంగా ఉండరు. న్యారా(అతీతం)గా ఉంటారు, ప్యారాగా కూడా ఉంటారు. మంచివారిలో మంచిగా, చెడ్డవారిలో చెడ్డవారిగా ఉండరు. సాక్షీ అనగా సదా ఏ కార్యము చేస్తున్నా కళ్యాణ వృత్తిని (భావము/ Attitude) కలిగి ఉండేవారు. ఏమి జరుగుతున్నా అందులో కళ్యాణము ఇమిడి ఉంది. మాయ ద్వారా ఏదైనా విఘ్నము వచ్చినా, అందులో కూడా లాభము తీసుకొని శిక్షణ(ట్రైనింగ్) పొంది ముందుకు వెళ్తారు, ఆగిపోరు. మీరు అలా ఉన్నారా? సీటు పై కూర్చొని ఆట చూస్తూ ఉండండి. సీటు అనగా సాక్షీ స్థితి. ఈ సీటు పై కూర్చొని డ్రామాను చూస్తూ ఉంటే చాలా మజాగా ఉంటుంది. సదా స్వయాన్ని సాక్షీ సీటు పై స్థితమై ఉంచుకుంటే "వాహ్ డ్రామా! వాహ్!" అని పాట పాడుతూ ఉంటారు (డ్రామాను మహిమ చేస్తూ ఉంటారు).

**12-10-1981**

(మధురమైన దాదీ గారు అంబాలా మేళాకు వెళ్లేందుకు బాప్‌దాదా నుండి శెలవు తీసుకుంటున్నారు).

అనేకమంది పిల్లలు సంతోషంగా ఉండడం చూచి బాప్‌దాదా సంతోషిస్తున్నారు. సేవ చేసేందుకు ఎక్కడకెళ్లినా అనేక ఖజానాలు అనేకమందికి లభిస్తాయి. అందువలన డ్రామాలో ఇప్పటి వరకు జరగవలసి ఉంది కనుక జరుగుతూ ఉంది, నిల్చిపోయిందంటే ఒక సెకండులో అంతా జరిగిపోతుంది. ఉదాహరణానికి సాకారములో చూచారు కదా, పాత్ర సమాప్తమై రెడీగా ఉండినా, పోలేకపోయారు. అలాగే ఈ డ్రామా కూడా సమాప్తమవ్వాల్సి ఉంటే ఒక్క సెకండులో అకస్మాత్తుగా సమాప్తమైపోతుంది.

14-10-1981

ఈ రోజు భాగ్యవిధాత అయిన తండ్రి తన భాగ్యశాలి పిల్లలను చూస్తున్నారు. భాగ్యశాలురుగా ఏమో అందరూ అయ్యారు. కాని భాగ్యశాలి శబ్ధానికి ముందు ఒక్కొక్క చోట సౌభాగ్యశాలి, అక్కడక్కడ పదమాపదమ్ భాగ్యశాలి అనే పదాలుంటాయి. అయితే ఇరువురికీ భాగ్యశాలి అనే శబ్ధముంటుంది. నూరు ఎక్కడ? పదమ్ ఎక్కడ? తేడా ఉంది కదా. భాగ్యవిధాత ఏమో ఒక్కరే, విధాత భాగ్యమునిచ్చే విధానము కూడా ఒక్కటే, సమయము మరియు వేళ కూడా ఒక్కటే. అయినా నంబరువారుగా అయిపోయారు. విధాత ఇచ్చే విధానము ఎంత శ్రేష్ఠమైనది! ఎంత సహజమైనది! లౌకిక పద్ధతి ప్రకారము ఈవేళ, రేపు ఎవరి పైన అయినా గ్రహచారము వలన అదృష్టము మారిపోయిందంటే ఆ గ్రహచారాన్ని తొలగించుకొని శ్రేష్ఠ భాగ్యాన్ని తయారు చేసుకునేందుకు ఎన్ని పద్ధతులు అనుసరిస్తారు! ఎంత సమయము, ఎంత శక్తి, ఎంత సంపదను ఖర్చు చేస్తారు! అయినా అల్పకాలానికి మాత్రమే వారి భాగ్యము తయారవుతుంది. ఒక్క జన్మకు కూడా గ్యారంటీ ఉండదు. ఎందుకంటే వారు విధాత ద్వారా అదృష్టాన్ని మార్చుకోరు. అల్పజ్ఞులు, అల్పసిద్ధులు ప్రాప్తి చేసుకున్న వ్యక్తుల ద్వారా అల్పకాలానికి ప్రాప్తి చేసుకుంటారు. అక్కడున్న వారు అల్పజ్ఞ వ్యక్తులు, ఇక్కడ స్వయం విధాతయే ఉన్నారు. విధాత ద్వారా అవినాశి భాగ్యరేఖను గీయించుకోవచ్చు. ఎందుకంటే భాగ్యవిధాతలైన ఇరువురు తండ్రులూ ఈ సమయములో పిల్లల కొరకు వారి ఎదుటనే ఉన్నారు(హాజిర్ నాజిర్‌గా ఉన్నారు). కనుక ఇప్పుడు భాగ్యవిధాత నుండి ఎంత భాగ్యము తీసుకోవాలనుకుంటే అంత తీసుకోవచ్చు. ఈ సమయములోనే భాగ్య-దాత భాగ్యాన్ని పంచేందుకు వచ్చారు. ఈ సమయానికి డ్రామానుసారము వరదానముంది. నిండుగా ఉన్న భాగ్య భండారాలు పూర్తిగా తెరవబడి ఉన్నాయి. శారీరిక భండారము, మానసిక భండారము, ధన భండారము, రాజ్య భండారము, ప్రకృతి దాసిగా అయ్యే భండారము, భక్తులను తయారు చేసుకునే భండారము - ఈ భండారాలన్నీ తెరవబడి ఉన్నాయి. విధాత



ద్వారా ఎవ్వరికీ స్పెషల్ ప్రాప్తికి ఛాన్స్ లభించదు. అందరికీ ఒకే విధమైన ఛాన్స్ ఉంది. భాగ్యము తీసుకునేందుకు ఏ బంధనమూ లేదు, ఏదీ అడ్డుపడదు. ఆలస్యంగా(వెనుక) వచ్చినా, ప్రవృత్తిలో ఉండినా, శారీరిక వ్యాధుల వలన గాని, వయసు వలన గాని, స్థూల డిగ్రీలు లేక స్థూల చదువుల వలన గాని, ఏ కారణంగా అయినా భండారానికి తాళం వేయబడి లేదు. రాత్రి, పగలు నిండుగా ఉన్న భాగ్యవిధాత భండారాలు తెరవబడే ఉన్నాయి. కాపలాదారుడెవరైనా ఉన్నారా? కాపలాదారుడెవ్వరూ లేరు, అయినా తీసుకోవడంలో నంబరువారుగా అవుతున్నారు. భాగ్యవిధాత నంబరువారిగా ఇవ్వరు. ఇక్కడ భాగ్యాన్ని తీసుకునేందుకు 'క్యూ' లో కూడా నిలబెట్టరు. భాగ్య భండారాలు ఎంతో పెద్దవి. ఎప్పుడు కావాలంటే, ఏ భాగ్యం కావాలంటే ఆ భాగ్యానికి అధికారులుగా అవుతారు. ఇలా ఉంది కదా? ఏ కిరీటానికైనా వేరే 'క్యూ' లు ఏవీ లేదు కదా? అమృతవేళలో చూడండి - భాగ్యవిధాతను కలుసుకునేందుకు దేశ-విదేశాలలోని పిల్లలందరూ ఒకే సమయములో వస్తారు. కనుక తప్పకుండా మిలనము చేయనే చేస్తారు. మిలనము చేయడమే కలుసుకోవడం. వేడుకోరు కాని అత్యంత గొప్ప తండ్రితో కలవడం అంటేనే భాగ్యాన్ని ప్రాప్తి చేసుకోవడం. 'మిల్‌నా' అనగా ఒకటేమో తండ్రి పిల్లలతో కలవడం, రెండవది ఏదైనా వస్తువు లభించడం. కనుక మిలనమూ జరుగుతుంది, భాగ్యము లభించడం కూడా జరుగుతుంది. ఎందుకంటే గొప్పవారెవ్వరూ తమ వద్దకు వచ్చినవారెవ్వరినీ ఎప్పుడూ ఖాళీగా పంపరు. ఇక్కడ తండ్రి అంటేనే విధాత, వరదాత. నిండుగా ఉన్న భండారాలు. అటువంటి తండ్రి ఎవరినైనా ఖాళీగా ఎలా పంపుతారు? అయినా పిల్లలు భాగ్యశాలి, సౌభాగ్యశాలి, పదమ్ భాగ్యశాలి, పదమాపదమ్ భాగ్యశాలి - ఇన్ని రకాలుగా ఎలా అవుతున్నారు? ఇచ్చేవారూ ఉన్నారు, భాగ్య ఖజానాలు కూడా నిండుగా ఉన్నాయి. సమయానికి కూడా వరదానముంది. ఈ విషయాలన్నిటిని గురించిన జ్ఞానము అనగా తెలివి కూడా ఉంది. తెలియనిదేమీ లేదు. అయినా తేడా ఎందుకు? (డ్రామానుసారము). ఇప్పుడు డ్రామాకు కూడా వరదానముంది.

అందువలన డ్రామా అని అనలేరు.

**17-10-1981**

సదా స్వయాన్ని ఈ సృష్టి డ్రామాలో హీరో పాత్రధారిని అని భావించి నడుస్తున్నారా? ఎవరైతే హీరో పాత్రధారులుగా ఉంటారో వారికి స్వయం పై ప్రతి అడుగులో అటెన్షన్ ఉంటుంది. వారి ప్రతి అడుగు సదా "భేష్ భేష్, చాలా బాగుంది, ఒన్స్‌మోర్(Once More)" అనే విధంగా ఉంటుంది. ఒకవేళ హీరో పాత్రధారుల ఒక అడుగు హెచ్చుతగ్గులైనా వారు హీరో అని పిలిపించుకోలేరు. కనుక మీరందరూ డబల్ హీరోలు. మీరు విశేషంగా హీరో పాత్రధారులే కాక హీరో సమానమైన జీవితాన్ని తయారు చేసుకునేవారు కూడా. కనుక ఇటువంటి స్వమానాన్ని అనుభవము చేస్తున్నారా? ఒకటేమో తెలుసుకోవడం, రెండవది తెలుసుకొని అనుసరించడం. కనుక మీరు తెలిసినవారా లేక తెలుసుకొని నడిచేవారా? మీ హీరో పాత్రను చూస్తూ "వాహ్ డ్రామా వాహ్ నా పాత్ర " అంటూ సదా హర్షితంగా ఉండండి. ఒకవేళ ఏ కొద్దిగానైనా మీ కర్మలు సాధారణంగా ఉంటే మిమ్ములను హీరో అని అనరు. ఎలాగైతే తండ్రి హీరో పాత్రధారి కనుక వారి ప్రతి కర్మ గాయనము చేయబడ్తూ, పూజింపబడ్తూ ఉందో అలా తండ్రికి ఎవరైతే సహయోగులుగా ఉన్నారో, వారి పాత్రలు కూడా హీరో పాత్రలే అయినందున వారి ప్రతి కర్మ గాయన యోగ్యంగా, పూజకు యోగ్యంగా అయిపోతుంది. ఇప్పుడు మీకు ఇంత నషా ఉందా? లేక మర్చిపోతారా? అర్ధకల్పమంతా మర్చిపోయారు. ఇంకా ఇప్పుడు కూడా మర్చిపోతారా? ఇప్పుడు స్మృతి స్వరూపులుగా అయిపోండి. స్వరూపమైపోయిన తర్వాత ఎప్పుడూ మర్చిపోలేరు.

**11-11-1981**

బాప్‌దాదా పిల్లల స్నేహ శక్తిని చూస్తున్నారు. స్నేహ శక్తి ఆధారముతో సెకండులో ఎంత దూరము నుండి అయినా సమీపానికి చేరుకుంటారు. స్నేహశక్తి ఎంత ఎక్కువగా(మహాన్‌గా) ఉంటుందో, అంత సన్ముఖానికి చేరుకునే స్పీడు ఎక్కువగా(మహాన్‌గా) ఉంటుంది. ఎంత అమూల్యమైన



రత్నాలు ముందుకు(సమీపానికి) వస్తున్నారు. ఒక్కొక్క రత్నము మహిమ చాలా మహోన్నతమైనది. ఏ ఏ మహారథుల మహిమను వర్ణించను! దీపము పైకి దీపపు పురుగులు వస్తున్నారు. పిల్లలందరికీ బాప్‌దాదా "సదా సహజయోగీ భవ" అను వరదానమునిస్తున్నారు. కేవలం ఒక్క బిందువునే స్మృతి చేయండి. అన్నిటికంటే సరళమైన గుర్తు బిందువే. కనుక బాప్‌దాదా కేవలం బిందువు లెక్క మాత్రమే తెలుపుతున్నారు. స్వయం మీరు కూడా బిందు రూపమైపోండి. బిందువునే స్మృతి చేయండి. డ్రామాలోని ప్రతి దృశ్యాన్ని తెలుసుకోండి. పని చేసిన తర్వాత బిందువు పెట్టేయండి. ఒక్క బిందువులోనే మీరు, తండ్రి మరియు రచన అన్నీ వచ్చేస్తాయి. కనుక దేనిని గురించి తెలుసుకోవాలి - 'బిందువు'. చేయాల్సింది కూడా ఏమి చేయాలి - 'బిందువును స్మృతి చేయాలి'. ఈ బిందువు గుర్తు మహత్యాన్ని తెలుసుకుంటే సదా సహజ యోగులుగా అవ్వగలరు. ఎంత పెద్ద విస్తారంగా ఉన్నా అంతా బిందువులోనే ఇమిడి ఉంటుంది. బీజము బిందువు. అందులోనే మొత్తం వృక్షమంతా ఇమిడి ఉంది. ఆత్మ ఒక బిందువు. అందులోనే 84 జన్మల సంస్కారము ఇమిడి ఉంది. 5000 సంవత్సరాల డ్రామాను ఇప్పుడు ఈ సంగమ యుగము అంతములో సమాప్తము చేస్తున్నారు. ఇప్పుడు డ్రామా చక్రము పూర్తయ్యింది. అనగా ఏ చక్రమైతే జరిగిపోయిందో దానికి ఫుల్‌స్టాప్ అనగా బిందువు పెట్టేయండి. బిందువై ఇప్పుడు ఇంటికి వెళ్లాలి. బిందువు జతలో బిందువై వెళ్లాలి. ఆ ఇల్లు కూడా అన్ని బిందువుల ఇల్లు. సంకల్పాలు, కర్మలు, సంస్కారాలు అన్నీ మర్జ్ అవుతాయి. అనగా బిందువులో ఇమిడిపోతాయి. సమాప్తికి గుర్తు కూడా బిందువే. సర్వ గుణాలకు, సర్వ జ్ఞాన ఖజానాలకు సాగరము........ అయినా ఆ సాగరము కూడా బిందువే. సంబంధ - సంపర్కాలలోకి వచ్చినా అందరి మస్తకాలలో ఏమి ప్రకాశిస్తూ ఉంటుంది - బిందువు. అన్ని కార్యాలు చేసేది అనగా కర్త ఎవరు? బిందువే కదా. భూమి పై నుండి చంద్రుని వరకు చేరినా, చేరింది ఎవరు? బిందువే. మీరు సైలెన్స్ శక్తి ద్వారా మూడు లోకాలు తిరిగినా, తిరిగేది ఎవరు? బిందువు. సైన్స్ శక్తి లేక సైలెన్స్ శక్తి,

నిర్మాణము చేయు శక్తి లేక నిర్వాణములోకి (పరంధామానికి) వెళ్లే శక్తి కూడా బిందువే కదా. బీజము నుండి ఎంతో పెద్ద వృక్షము విస్తరించి, విస్తారము తర్వాత ఎందులో ఇమిడిపోతుంది - బీజము అనగా బిందువులోనే. కనుక బిందువు అనాది, అవినాశి. మీరు కూడా మూడు కాలాల జ్ఞానాన్ని, మూడు లోకాల జ్ఞానాన్ని ప్రాప్తి చేసుకుంటారు. కాని ప్రాప్తి చేసుకునేవారు ఎవరు? బిందువు. ఆది నుండి అంతము వరకు రకరకాల పాత్రలు అభినయించారు. ఆ పాత్రలు అభినయించిందెవరు? బిందువు. కనుక గొప్పదనమంతా బిందువుదే. బిందువును తెలుసుకుంటే సర్వమూ తెలుసుకున్నట్లే అంతా పొందినట్లే. బిందు రూపములో స్థితమై ఏ సంకల్పము చేసినా, ఏ భావన ఉంచినా, ఏ మాట మాట్లాడినా, ఏ పని చేసినా, బిందువు ఎలాగైతే గొప్పదో, అలా అన్ని విషయాలు మహోన్నతమైపోతాయి అనగా స్వతహాగా శ్రేష్ఠమైపోతాయి.

**04-01-1982**

ఇప్పుడు ఏ రకమైన విఘ్నము వచ్చినా, సమస్య వచ్చినా అది మీకు ఒక ఆటగా అనుభవమవ్వాలి. యుద్ధముగా కాదు, ఒక ఆట! ఆటగా భావించడం వలన సంతోషంగా దాటుకుంటారు. యుద్ధమని అనుకుంటే భయపడ్తారు, ఆందోళన పడ్తారు. డ్రామాలో పాత్రధారులైనందున ఏ అంకము (సీన్) వచ్చినా డ్రామా లెక్కతో ఇదంతా ఒక ఆటే అను స్మృతిలో ఉంటే ఏకరసంగా ఉంటారు, ఆందోళన చెందరు. కనుక ఇప్పటి నుండే ఇలా పరివర్తన చేసుకొని వెళ్లండి. ఆందోళన ఇక్కడే సమాప్తి చేసుకొని వెళ్లండి. సదా మీ మస్తకములో విజయ తిలకము దిద్దబడి ఉన్నట్లు అనుభవము చేస్తే ఆందోళన సమాప్తమైపోతుంది. అమెరికా ప్రపంచములో ఉన్నతమైన స్థితిలో ఉంది, అందులో బ్రాహ్మణులు ఇంకెంత ఉన్నతంగా ఉంటారు? దేశము మహిమ కంటే బ్రాహ్మణాత్మల మహిమ అంతకంటే ఎక్కువగా ఉంటుంది. కనుక మీరు సేవలో ఫస్టు నంబరు తీసుకోవాలి. తండ్రిని ప్రత్యక్షము చేసేందుకు అందరూ లైట్‌హౌస్‌లుగా అయితే వైట్‌హౌస్ లైట్‌హౌస్‌గా అయిపోతుంది. అది వినాశకారి, ఇది స్థాపన చేసేది. ఇప్పుడు అద్భుతము



చేసి చూపించండి. విశేష ఆత్మలను నిమిత్తంగా అయితే చేశారు. ఇప్పుడు సంపర్కము నుండి సంబంధములోకి తీసుకు రావాలి. ఎంత సమీప సంబంధములోకి తీసుకురావాలంటే వారి నోటి ద్వారా తండ్రి మహిమ వెలువడి మొత్తం ప్రపంచమంతా వ్యాపించాలి. బాప్‌దాదా ఇతర ధర్మాలలో మిక్స్ అయిపోయిన వారిని కూడా వెతికి వెలికి తీశారు. కనుక మీరు విశేషమైన భాగ్యశాలురుగా అయ్యారు కదా! మీరు తండ్రిని వెతకలేదు, తండ్రే మిమ్ములను వెతికారు. మీరు వెతికినా లభించేవారు కాదు ఎందుకంటే పరిచయమే లేదు కదా. అందువలన తండ్రే ఆత్మలైన మిమ్ములను వెతికి తన తోటలోని పుష్పాలుగా తయారుచేశారు. అందువలన ఇప్పుడు మీరంతా భగవంతుని తోటలోని(అల్లా కే బగీచా) ఆత్మిక గులాబి పుష్పాలు. మీరిప్పుడు స్వయాన్ని ఇటువంటి భాగ్యశాలురమని భావిస్తున్నారు కదా?

**08-01-1982**

కేవలం ఒక చిన్నమాట - "చిన్న మాటను పెద్దదిగా చేయకండి", పెద్దదానిని చిన్నదిగా చేయండి. ఇలా కూడా జరుగుతుందా? అని ప్రశ్నించకండి. ఇదెందుకు జరిగింది? ఇలా కూడా జరుగుతుందా? అని ప్రశ్నించేందుకు బదులు జరిగేదంతా కళ్యాణమే జరుగుతుంది, జరిగింది. ప్రశ్నలు సమాప్తమైపోవాలి. ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఈ ప్రశ్నలలో బుద్ధిని ఎక్కువగా వాడకండి. లేకుంటే శక్తి వృథాగా ఖర్చయిపోతుంది. స్వయాన్ని శక్తిశాలిగా అనుభవం చెయ్యరు. ప్రశ్నలు చాలా వస్తూ ఉంటే ఇప్పుడు మధువన వరదాన భూమిలో ప్రశ్నార్థకాలను సమాప్తము చేసి ఫుల్‌స్టాప్ పెట్టి వెళ్లండి. ప్రశ్నార్థకము పెట్టడం కష్టము, ఫుల్‌స్టాప్ పెట్టడం సులభము. కనుక సులభమైన దానిని వదిలేసి కష్టమైన దానినెందుకు తీసుకుంటారు? అందులో శక్తి వృథా అవుతుంది. కనుక ఏం చేయాలి? ఇప్పుడు వృథా చేయకండి. ప్రతి సెకండు, ప్రతి సంకల్పము బెస్ట్‌గా ఉండాలి.

14-01-1982

**స్టీవ్ నారాయణ (గయానా ఉప రాష్ట్రపతి) మరియు వారి పరివారానికి యాద్‌ప్యార్ తెలుపుతూ –** వారికి చాలా చాలా జిగరీ(ప్రియమైన) స్మృతులు తెలపండి. తనువు-మనసు-ధనాలతో చాలా మంచి సహయోగీ పిల్లలు, నిశ్చయబుద్ధి గల నెంబరువన్ పిల్లలు. ఆ బడ్జెట్ కారణంగా రాలేకపోయారు. కాని పాండవ గవర్నమెంటు బడ్జెట్‌లో బుద్ధి ద్వారా ఇక్కడకు చేరుకున్నారు. చాలా నమ్రచిత్తులు. డ్రామానుసారము పరివారమంతా సేవాధారులే. మంచి ధైర్యము కూడా ఉంది. మొత్తం పరివారమంతా స్నేహీ పరివారము. గుడ్డి నమ్మకముతో కాదు, జ్ఞానము ఆధారంతో స్నేహీలుగా ఉన్నారు. వీరి సంపర్కము ద్వారానే అమెరికాలోకి చేరుకున్నాము. బేహద్ సేవ చేసేందుకు, విశేషాత్మల సేవకు వీరు నిమిత్తమైనారు - దీనినే ఒక్కరి జ్ఞానము ద్వారా అనేకమంది పై ప్రభావము అని అంటారు. ఇతడు చాలా పెద్ద మైకు. ఇతడిని చూచి అక్కడి ప్రభుత్వము పై కూడా మంచి ప్రభావము పడింది. జ్ఞాన-యోగాల ప్రభావము చాలా బాగుంది. మంచి సేవాధారి.

12-03-1982

డబల్ విదేశీ పిల్లలు ఒక ప్రశ్న అడుగుతారు. మమ్మల్ని డబల్ సేవ(ఈశ్వరీయ సేవతో పాటు లౌకిక ఉద్యోగము) ఎందుకు చేయమంటారు. ఈ ప్రశ్నకు జవాబిస్తూ బాప్‌దాదా ఇలా చెప్పారు -

సమయం తక్కువగా ఉంది. ప్రాప్తి అందరికంటే ఎక్కువగా కావాలని కోరుకుంటున్నారు. అందువలన శరీరము, మనసుతో పాటు ధనము కూడా సేవలో ఉపయోగించాలి. అందువలన 3 రకాల సేవలు చేయవలసి పడ్తుంది. కొద్ది సమయములోనే మీకు 3 విధాలుగా లాభము జమ అవుతుంది. ఎందుకంటే ధనానికి కూడా మార్కులున్నాయి. ఆ మార్కులు జమ అయినందున ముందు నంబరు తీసుకుంటారు. అందువలన మీ లాభము కొరకు మీ ధనాన్ని ఉపయోగించండని చెప్పడం జరుగుతుంది. ధనము సబ్జక్టులో కూడా ఒకటికి పదమ్ లభిస్తుంది. ఒకే



సమయములో అన్ని వైపుల నుండి లాభము కలుగుతూ ఉంటే ఎందుకు చేయరాదు. పోతే నిమిత్తంగా ఉన్న ఆత్మలు వీరికి సమయమే లేదు, వీరికి ఫుర్సత్తే లేదు, భోజనానికి కూడా సమయము లభించదు, ఇంత బిజీగా అయినారని గమనిస్తే ఆటోమేటిక్‌గా ఆ నౌకరీ నుండి విడుదల చేయిస్తారు. కాని అంత బిజీ అయినంత వరకు ఇది(నౌకరీ) అవసరము. ఇది వ్యర్థంగా పోదు, దీనికి కూడా మార్కులు జమ అవుతున్నాయి. బిజీగా అయినారంటే డ్రామాయే మిమ్ములను ఆ ఉద్యోగము చెయ్యనివ్వదు. ఏదో ఒక కారణము వలన మీరు ఉద్యోగము చెయ్యాలనుకున్నా చెయ్యలేరు. అందువలన ఇప్పుడెలా నడుస్తున్నారో అందులోనే కళ్యాణముంది. మేము సమర్పణ అవ్వలేదే అని అనుకోకండి. మీరు సమర్పణ అయిన వారే. ఆదేశానుసారము చేస్తున్నారు. మీ ఇష్టప్రకారము చేస్తూ ఉంటే సరెండరు కాదు. ఇందులో మీ మతాన్ని అనుసరించినట్లా కాదా? నేను చెయ్యను అని అంటే అది ఇంకా ఎక్కువగా మీ మతమైపోతుంది. అందువలన సదా స్వయాన్ని తేలికగా ఉంచుకోండి. నిమిత్తంగా ఉన్న ఆత్మలు చెప్తున్నారంటే ఇందులో నా కళ్యాణముందని భావించండి. ఇందులో మీరు నిశ్చింతులుగా ఉండండి. ఇందులో మీరు "బహుశా నాకు పాత్ర లేదేమో, ఉద్యోగం వదలమని నాకెందుకు చెప్పడం లేదని" ఎక్కువగా ఆలోచించారంటే అది వ్యర్థమైపోతుంది. అర్థమయిందా?

24-03-1982

(దీదీగారు ఢిల్లీలో మేళాను ప్రారంభము చేసేందుకు వెళ్లు సమయంలో అనుమతి తీసుకుంటున్నారు)

అందరినీ ఎగిరించేందుకు వెళ్తున్నావు కదా. స్మృతిలో, స్నేహములో, సహయోగములో అన్నిటిలో ఎగిరించేందుకు వెళ్తున్నావు. ఇది కూడా డ్రామాలో ఒక బైప్లాటుగా ఉంచబడింది. కనుక వెళ్లిరా. త్వరగా వెళ్లాలి, త్వరగా రావాలి. ఎలాగైతే విమానంలో పోయి-రావడం కష్టము కాదో, అలా ఆత్మనే ఎగిరే పక్షిగా అయిపోయింది. కనుక పోయి రావడం సులభంగా

ఉంటుంది. ఇది కూడా డ్రామాలో హీరో పాత్ర, కొద్ది సమయంలోనే అధికంగా అనుభవం చేయించే పాత్ర. కనుక ఈ హీరో పాత్ర చేసేందుకు వెళ్తున్నావు. మంచిది. అందరికీ స్మృతులు తెలపండి. సదా "సఫలతా స్వరూపమును" అని శుభ సంకల్పము చేస్తూ ముందుకు వెళ్లండి. ఇదే స్మృతి స్వరూపంగా తయారు చేసి రావాలి. నీవు వెళ్లేది ఢిల్లీ, ఢిల్లీని పవిత్ర స్థానంగా చేసే తీరాలి. ఎందుకంటే ఢిల్లీ నుండే శబ్దము వ్యాపిస్తుంది. అందరికీ మైకు ఢిల్లీ నుండే చేరుతుంది. గవర్నమెంటు నుండి శబ్దము వెలువడినప్పుడు సమాప్తమైపోతుంది. అప్పుడు భారతదేశములోని రాజకీయ నాయకులు కూడా మేలుకుంటారు. అది తయారు చేసేందుకు వెళ్తున్నావు కదా?

**29-03-1982**

ఈ రోజు బాప్‌దాదా మాలను తయారు చేస్తున్నారు. ఎవరి మాల? ప్రతి శ్రేష్ఠ ఆత్మలో గల శ్రేష్ఠ గుణాల మాలను తయారు చేస్తున్నారు. ఎందుకంటే బాప్‌దాదాకు తెలుసు - శ్రేష్ఠమైన తండ్రి పిల్లలైన ప్రతి శ్రేష్ఠమైన పుత్రునికి తమ తమ విశేషతలు ఉన్నాయి. తమ తమ గుణాల ఆధారంతో సంగమ యుగములో శ్రేష్ఠ ప్రాలబ్ధాన్ని పొందుతున్నారు. బాప్‌దాదా ఈ రోజు విశేషంగా కాల్బలం(కాలినడకవారు, ప్యాదే) వారి గుణాలను చూస్తున్నారు. పురుషార్థంలో లాస్ట్ గ్రూప్ అయినా వారిలో కూడా విశేష గుణాలు తప్పకుండా ఉన్నాయి. ఆ విశేష గుణాలు ఆ ఆత్మలను బాబా వారిగా తయారు చేసేందుకు విశేష ఆధారం. కాబట్టి బాప్‌దాదా ఫస్ట్ నంబరు నుండి లాస్ట్ నంబరు వరకు కాక లాస్ట్ నుండి ఫస్ట్ వరకు గుణాలను చూశారు. పూర్తి లాస్ట్ నంబరు వారు కూడా గుణవంతులే. పరమాత్మ సంతానం ఏ గుణాలు లేకుండా ఉండటం అనేది ఉండజాలదు. ఆ గుణాల ఆధారంతోనే బ్రాహ్మణ జన్మలో జీవిస్తున్నారు అనగా జీవించి ఉన్నారు. డ్రామానుసారంగా ఆ గుణాలే ఉన్నతోన్నతమైన తండ్రికి పిల్లలుగా తయారు చేశాయి. ఇప్పుడు ఆ గుణాల కారణంగానే ప్రభువుకు ఇష్టంగా తయారయ్యారు. అందువల్లనే గుణాల మాలను తయారు చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి బ్రాహ్మణ ఆత్మలో గుణాలను చూడడం వలన శ్రేష్ఠ ఆత్మననే భావం సహజంగా, స్వతహాగానే ఉంటుంది.



ఎందుకంటే గుణాలకు ఆధారమే శ్రేష్ఠ ఆత్మ. చాలా మంది ఆత్మలు గుణాలు తెలుసుకున్నా జన్మ-జన్మలుగా మురికిని చూసే అభ్యాసం ఉన్న కారణంగా గుణాలను చూడకుండా అవగుణాలనే చూస్తారు. అవగుణాలను చూడడం, అవగుణాలను ధారణ చేయడం ఎలాంటి పొరపాటంటే స్థూలంగా అశుద్ధ ఆహారం తినడం వంటిది. స్థూల ఆహారంలో ఏదైనా అశుద్ధ భోజనం స్వీకరించినట్లయితే పొరపాటు అనుభవం అవుతుంది కదా. " బాబా, ఆహార పానీయాల ధారణలో బలహీనంగా ఉన్నాను" అని వ్రాస్తుంటారు కూడా. అంటే పొరపాటు అర్థము చేసుకున్నారు కదా. అదే విధంగా ఎవరి అవగుణాలను గాని, బలహీనతలను గాని స్వయంలో ధారణ చేసినట్లయితే అశుద్ధ భోజనం తినేవారని అనుకోండి. సత్యమైన వైష్ణవులు కాదు, విష్ణు వంశీయులు కాదు కానీ రాముని సైన్యంగా అయిపోతారు. అందువలన సదా గుణాలను గ్రహించే "గుణమూర్తులుగా" అవ్వండి.

**13-06-1982**

(నిర్వైర్ భాయి విదేశీ సేవ కొరకు శెలవు తీసుకుంటున్నారు). ఇతను కూడా వెళ్తున్నారు. ఎవరెడీగా అయ్యాడు కదా! దీనినే మధురమైన డ్రామా అని అంటారు. మూడు బిందువుల తిలకము బహుమతిగా లభించింది. సంకల్పం చేసినప్పటి నుండి డ్రామానుసారము మళ్లీ మూడు బిందువుల తిలకము లభించింది. పెట్టబడే ఉంది, ఇప్పుడు మళ్లీ పెట్టబడింది. ఈ అవినాశి తిలకం సదా మస్తకము పై దిద్దబడే ఉంది కదా! మూడు బిందువులు జత జతలో ఉన్నాయి. బాప్‌దాదా ఈ తిలకంతో వతనంలోకి స్వాగతం పలికారు. బాగుంది కదా! విశేషంగా ఏ స్వరూపం ద్వారా సందేశం ఇచ్చేందుకు వెళ్తున్నావు? విశేషంగా ఏ పాఠాన్ని స్మృతినిప్పిస్తావు?

"సదా ఉల్లాస-ఉత్సాహాలతో ఎగురుతూ ఉండండి" - ఈ విశేష పాఠాన్ని అందరికీ అనుభవం ద్వారా చదివించాలి. అనుభవం ద్వారా చదివిస్తే అది అవినాశి పాఠం అయిపోతుంది. ఇదే విశేషమైన నవీనత - అనుభవంలో ఉంటూ, అనుభవం చేయించాలి. నోటి ద్వారా చదివించడం అయితే చాలా సమయం నడిచింది. ఇప్పుడు అందరికీ ఈ చదువు

ఆవశ్యకత చాలా ఉంది. ఈ పద్ధతి ద్వారా అందరినీ ఎగిరేకళలోకి తీసుకెళ్లాలి. ఎందుకంటే అనుభవం అన్నిటికంటే గొప్ప అథారిటీ. ఎవరి వద్ద అనుభవాల అథారిటీ ఉందో, వారితో ఇక ఏ అథారిటీ యుద్ధం చెయ్యలేదు. మాయ అథారిటీ నడవదు. విశేషంగా ఈ పద్ధతిని ధ్యాసలో ఉంచుకొని అన్ని వైపులా తిరగండి. ఇదే నవీనత. ఎందుకంటే ఎప్పుడు ఎవరు వెళ్లినా ఏదో ఒక నవీనత లభించాలని అందరూ కోరుకుంటారు. మాట్లాడడం స్వరూపంగా అయ్యి, స్వరూపులుగా చేయాలి. ఇది జత జతలో ఉండాలి. మీ ఇష్టం కూడా అదే కదా! డ్రామా అనుసారంగా సమయం ఏదైతే ఫిక్స్ అయ్యిందో అదే సేవ కోసం యోగ్యమైనదిగా భావించండి. సంకల్పమైతే పూర్తి అయ్యింది కదా? ఎవరెడీగా అయ్యి అన్ని ఏర్పాట్లు కూడా సెకండులో అయిపోయాయి కదా! స్థూల సాధనాలైతే అక్కడ అన్నీ ఉన్నాయి. రెడీగా తయారైన సాధనాలున్నాయి. ఏదైనా వస్తువు లేకున్నా అదేమంత పెద్ద విషయమేమీ కాదు. ఇక్కడ నుండి రెండు డ్రస్సులు తీసుకెళ్లినా చాలు. ఏమీ ఫర్వాలేదు. అక్కడ రెడీమేడ్ డ్రస్సులు లభిస్తాయి. సూక్ష్మ ఏర్పాట్లు అయితే అయిపోయాయి కదా! స్థూల ఏర్పాట్లు పెద్ద విషయమేమీ కాదు.

బిందువు పెట్టడం వస్తుందా? లేక బిందువు పై మళ్లీ ప్రశ్న వస్తుందా? ఇక్కడ పెట్టవలసింది బిందువు. ఈనాటి ప్రపంచంలో బిందువంత తుపాకి మందు(దీపావళిలో) చాలా పెద్ద పాముగా తయారైపోతుంది. ఇక్కడ కూడా బిందువే పెట్టాలి. బిందువులో అన్నీ ఇమిడిపోతాయి. ఒకవేళ సంకల్పమనే అగ్గిపుల్ల గీచి అంటిస్తే అది పాములాగా అయిపోతుంది. అగ్గిపుల్ల అంటించకండి, పాములాగా కానివ్వకండి. బాప్‌దాదా పిల్లలాడే ఈ ఆటను చూస్తూ ఉంటారు. ఏది జరిగినా అందులో కళ్యాణమే ఇమిడి ఉంది. ఇలా ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించకండి. ఏదైతే అనుభవం చేయాలో అది చేశారు. పరివర్తన చేసుకున్నారు. ఇక ముందుకు వెళ్లండి. ఇదే బిందువు పెట్టడం. విదేశీయులందరికి కూడా ఈ ఆటను తెలపండి. వారికి ఇలాంటి మాటలు మంచిగా అనిపిస్తాయి.



**28-12-1982**

స్వీడన్ పార్టీతో - "సదా నిశ్చయబుద్ధి విజయీ రత్నాలుగా ఉన్నారా?" ఇదే నశాలో ఉండండి. నిశ్చయం అనే ఫౌండేషన్ సదా పక్కాగా ఉందా! మీ పై మీకు నిశ్చయం, తండ్రి పై నిశ్చయం, డ్రామాలో ప్రతి దృశ్యాన్ని చూస్తూ అందులో కూడా పూర్తి నిశ్చయం. సదా ఈ నిశ్చయ ఆధారం పైననే ముందుకు వెళ్తూ ఉండండి. మీలోని విశేషతలను ముందుంచుకోండి, బలహీనతలను కాదు. అప్పుడు మీ పైన మీకు నమ్మకం ఉంటుంది. బలహీన విషయాల గురించి ఎక్కువగా ఆలోచించకండి. అప్పుడు సంతోషంగా ముందుకు వెళ్తూ పోతారు. తండ్రి చేయి పట్టుకున్నారు. తండ్రి చేయి పట్టుకున్నవారు సదా ముందుకే వెళ్తారు. ఈ నిశ్చయం పెట్టుకోండి. తండ్రి సర్వశక్తివంతుడైతే కనుక వారి చేయి పట్టుకున్నవారు తప్పకుండా తీరానికి చేర్తారు. స్వయం బలహీనంగా ఉన్నా మీకు తోడుగా ఉన్నవారు శక్తివంతులు కదా. అందువలన తప్పకుండా తీరానికి చేరిపోతారు. సదా "నిశ్చయబుద్ధి విజయీ రత్నాన్ని" - ఈ స్మృతిలో ఉండండి. జరిగిపోయిందేదో జరిగి పోయింది, బిందువు పెట్టి ముందుకు వెళ్లండి.

**31-12-1982**

బాప్‌దాదా ప్రతి పుత్రుని భాగ్యాన్ని చూచి సంతోషిస్తున్నారు. ప్రతి పుత్రుడు తన భాగ్యాన్ని తీసుకుంటున్నాడు. సంగమయుగంలో ప్రతి ఆత్మ భాగ్యము ఎవరిది వారిదే. ప్రతి ఒక్కరి భాగ్యము శ్రేష్ఠమైనదే. ఎందుకు? ఎందుకంటే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన తండ్రికి పిల్లలుగా అయ్యారంటే శ్రేష్ఠ భాగ్యం లభించింది కదా. వీరి కంటే శ్రేష్ఠమైన తండ్రీ లేరు, ఇంతకంటే శ్రేష్ఠమైన భాగ్యమూ లేదు. ఉన్నతోన్నతమైన తండ్రి. ఇది జ్ఞాపకం ఉంటుంది కదా! భాగ్యవిధాతయే నా తండ్రి. దీనికంటే గొప్ప నషా ఇంకేదైనా ఉంటుందా! లౌకికంలో పిల్లలకు మా తండ్రి ఇంజనీయర్, డాక్టర్, జడ్జి లేక ప్రధానమంత్రి అని నషా ఉంటుంది కదా. కాని మీకు మా తండ్రి భాగ్యవిధాత, ఉన్నతోన్నతమైన భగవంతుడు అనే నషా ఉంది. ఈ నషా సదా ఉంటుందా? లేక అప్పుడప్పుడు మర్చిపోతున్నారా? భాగ్యాన్ని మర్చిపోతే ఏమవుతుంది?

మళ్లీ భాగ్యాన్ని పొందే ప్రయత్నం చేయవలసి వస్తుంది. పోగొట్టుకున్న వస్తువును పొందేందుకు శ్రమ చేయాల్సి ఉంటుంది. బాబా వచ్చి శ్రమ నుండి రక్షించారు. అర్ధకల్పం శ్రమ చేశారు. వ్యవహారంలో కూడా శ్రమ, భక్తిలో, ధర్మ క్షేత్రంలో అన్నిటిలోనూ కష్టపడ్డారు. ఇప్పుడు అన్ని కష్టాల నుండి ముక్తులైపోయారు. ఇప్పుడు వ్యవహారం కూడా పరమార్థం ఆధారం పై సహజమైపోతుంది. నిమిత్త మాత్రంగా చేస్తున్నారు. నిమిత్తమాత్రంగా చేసేవారికి సదా సహజంగా అనుభవమవుతుంది. వ్యవహారం కాదు, ఆటగా అనుభవమవుతుంది. మాయ తుఫానుగా కాదు, ఇది డ్రామానుసారంగా ముందుకు వెళ్లేందుకు బహుమతిగా(తోఫాగా) అనుభవమవుతుంది. కనుక శ్రమ తొలగిపోయింది కదా! తోఫా అనగా బహుమతి తీసుకోవడం శ్రమ అనిపించదు కదా. ఇటువంటి శ్రమ నుండి స్వయాన్ని రక్షించుకునేవారు, సదా భాగ్యవిధాతతో పాటు మాస్టర్ భాగ్యవిధాతలుగా ఉండేవారు - ఇటువంటి వారిని శ్రేష్ఠ ఆత్మలని అంటారు.

**21-02-1983**

ఇంతకుముందు విదేశీ టీచర్లు వి.ఐ.పి లను తీసుకురావడం చాలా కష్టం అని అనేవారు. అలా ఏమీ కనిపించడం లేదు. ఇప్పుడు కనిపించింది కదా. విఘ్నాలు వచ్చినా పర్వాలేదు. బ్రాహ్మణుల కార్యంలో విఘ్నాలు లేకుంటే లగ్నము కూడా ఉండదు. విఘ్నాలు లేకుంటే నిర్లక్ష్యంగా, సోమరులుగా అయిపోతారు. అందువలన డ్రామానుసారంగా లగ్నాన్ని(పట్టుదలను) పెంచేందుకు విఘ్నాలు వస్తాయి. ఇప్పుడు ఒక్కొక్కరి ద్వారా శబ్ధము విని అనేకమందిలో ఉత్సాహము వస్తుంది.

పిల్లలు మంచి అద్భుతం చేశారు. సేవలో ఋజువును బాగా చూపించారు. సేవకు ఛాన్సు ఇప్పించేందుకు నిమిత్తమయ్యారు కదా. ఒకరి ద్వారా అనేకమంది వరకు శబ్ధమైతే వ్యాపించింది కదా. అమెరికా వారు బాగా శ్రమ చేశారు. ధైర్యం చేశారు. ఎక్కువమందికి శబ్ధము వ్యాపింపజేసేందుకు నిమిత్తులైన ఆత్మలను డ్రామానుసారంగా విదేశీయులే తీసుకొచ్చారు. భారతవాసీ పిల్లలు కూడా చాలా మంచి శ్రమ చేశారు. ఆ



శ్రమకు ఫలితంగా చాలామంది వచ్చారు. ఇప్పుడు భారతదేశంలోని విశేష ఆత్మలు కూడా వస్తారు.

**27-03-1983**

పరతంత్రతా బంధన అనగా తమ స్వంత మనసు చేసే వ్యర్థ, బలహీన సంకల్పాల వల. మీ మనసు రచించిన వలలో స్వయాన్ని పరతంత్రముగా చేసుకోవడం లేదు కదా? అది ప్రశ్నల వల. ఏ వలనైతే రచిస్తారో, దాని చిత్రము తీస్తే అది మళ్లీ ప్రశ్న రూపంగానే ఉంటుంది. ఎలాంటి ప్రశ్నలు వస్తాయో అనుభవముంది కదా. ఏమవుతుందో? ఎలా అవుతుందో? ఇలా అయితే కాదు కదా ?- ఇదే వల. ఇంతకు ముందు కూడా వినిపించాను. సంగమయుగీ బ్రాహ్మణులది సదా ఒకే సమర్థ సంకల్పం - ఏమి జరిగినా అది కళ్యాణకారిగానే ఉంటుంది. ఏమి జరుగుతుందో అది శ్రేష్ఠముగానే ఉంటుంది. అది మంచి కంటే మంచిగానే ఉంటుంది. ఈ సంకల్పము వలను సమాప్తము చేసే సంకల్పము. చెడ్డ రోజులు, అకళ్యాణకారి రోజులు సమాప్తమైపోయాయి. సంగమ యుగములోని ప్రతిరోజూ ఒక గొప్ప రోజు, చెడ్డ రోజు కాదు. ప్రతిరోజూ మీకు పండుగే కదా. ప్రతిరోజూ జరుపుకునే రోజే. ఈ సమర్థ సంకల్పంతో వ్యర్థ సంకల్పాల వలను సమాప్తం చెయ్యండి.

**14-04-1983**

సదా సాక్షి స్థితిలో స్థితులై ఉండి డ్రామాలో ప్రతి దృశ్యాన్ని చూస్తున్నారా? సాక్షి స్థితి డ్రామాలో సదా హీరో పాత్రను అభినయించడంలో సహయోగిగా అవుతుంది. ఒకవేళ సాక్షి స్థితి లేకుంటే హీరో పాత్రను అభినయించలేరు. హీరో పాత్రధారి నుండి సాధారణ పాత్రధారిగా అయిపోతారు. సాక్షి స్థితి సదా డబల్ హీరోగా చేస్తుంది. ఒకటి హీరే సమానంగా(వజ్ర సమానంగా) చేస్తుంది, రెండవది హీరో పాత్రధారిగా చేస్తుంది. సాక్షీ స్థితి అనగా దేహానికి అతీతంగా ఆత్మ యజమాని అన్న స్థితిలో ఉండాలి. దేహం నుండి కూడా సాక్షి, యజమాని. ఈ దేహంతో కర్మ చేయించేవారు, చేసేవారు కాదు. అలాంటి సాక్షీ స్థితి సదా ఉంటుందా? సాక్షీ స్థితి సహజ పురుషార్థాన్ని అనుభవం చేయిస్తుంది. ఎందుకంటే సాక్షీ

స్థితిలో ఎలాంటి విఘ్నాలు, సమస్యలు రాజాలవు. ఇదే ముఖ్యమైన అభ్యాసము. సాక్షీ స్థితికి ఇదే మొదటి పాఠము, ఇదే చివరి పాఠము. ఎందుకంటే అంతిమ సమయంలో నలువైపులా అలజడి ఉంటుంది. ఆ సమయంలో సాక్షీ స్థితి ద్వారానే విజయులుగా అవుతారు. కనుక ఈ పాఠాన్ని పక్కా చేసుకోండి.

**19-04-1983**

సదా నిశ్చయబుద్ధి గలవారు అన్ని విషయాలలో నిశ్చింతులుగా ఉంటారు. నిశ్చయానికి గుర్తు నిశ్చింతత. జ్ఞాన శక్తి ద్వారా అన్నీ తెలుసుకున్నారు. జ్ఞానమనగా ఏది జరిగినా అది మంచి కంటే మంచిగా ఉంటుంది. కనుక సదా శుభ చింతకులుగా, సదా చింతల నుండి అతీతంగా నిశ్చయబుద్ధి, నిశ్చింత ఆత్మలు. జీవితమంటే ఇదే కదా. అందరూ కోరుకునేది ఇదే కదా.

**16-05-1983**

మీ జడచిత్రాల ముందు భక్తులు జాగరణ చేస్తారు. ఒకప్పుడు మీరు కూడా చేశారు, అందుకే భక్తులు కాపీ చేస్తారు. ఈ జాగరణ డబల్ సంపాదన చేయించే జాగరణ. వర్తమానంలోనూ సంపాదన జరుగుతుంది. అంతేకాక దీని ఆధారంతో భవిష్యత్తు కూడా శ్రేష్ఠంగా ఉంటుంది. తండ్రి తమ సమానంగా చేసేవారు. తండ్రి కళ్యాణకారి కనుక పిల్లలు కూడా కళ్యాణకారులే. తండ్రి పిల్లలను తనకంటే ముందు పెడ్తారు. మీకు డబల్ పూజ జరుగుతుంది. డబల్ రాజ్యం కూడా మీరే చేస్తారు. ఇంత నషా, ఇంత సంతోషము సదా ఉండాలి. ఓహో నేను శ్రేష్ఠమైన ఆత్మను, ఓహో నేను పుణ్య ఆత్మను, ఓహో నేను శివశక్తిని - సదా ఈ స్మృతిలో ఉండండి.

**30-07-1983**

(మన్మోహినీ దీదీ 27-07-83 తేదీన శరీరము వదిలిన తర్వాత)

ఈ రోజు స్థిరమైన రాజ్యాధికారులు, స్థిరమైన అచంచల స్థితిలో ఉండే విజయీ పిల్లలను చూస్తున్నారు. ఇప్పటి స్థిరమైన సంస్కారాల



ఆధారం పై స్థిరమైన రాజ్య ప్రాలబ్ధాన్ని పొందేందుకు ముందు కల్ప-కల్పము పురుషార్థంలో స్థిరంగా అయ్యారు. డ్రామాలోని ప్రతి దృశ్యాన్ని డ్రామా చక్రంలో సంగమ యుగంలో టాప్ పాయింట్ పై స్థితులై ఏమి చూసినా స్వతహాగానే స్థిరంగా, అచంచలంగా ఉంటారు. టాప్ పాయింటు నుండి క్రిందకు వచ్చారంటే వెంటనే అలజడిలోకి వచ్చేస్తారు. శ్రేష్ఠ బ్రాహ్మణ ఆత్మలందరూ సదా ఎక్కడ ఉంటారు? చక్రంలో సంగమ యుగ స్థానము ఉన్నతమైనది. చిత్రం లెక్కతో కూడా సంగమ యుగము ఉన్నత స్థానంలో ఉంది. ఇతర యుగాల లెక్కతో ఇది చిన్న యుగము. కనుక దీనిని పాయింట్ అనే అంటారు. ఈ ఉన్నతమైన పాయింట్ పైన ఉన్నతమైన స్థానం పై, ఉన్నతమైన స్థితిలో, ఉన్నతమైన జ్ఞానంతో, ఉన్నతమైన తండ్రి స్మృతిలో, ఉన్నతోన్నతమైన సేవ స్మృతి స్వరూపంగా అయినారంటే సదా సమర్థంగా అవుతారు. ఎక్కడ సమర్థత ఉంటుందో, అక్కడ వ్యర్థం సదా కోసం సమాప్తమవుతుంది. ప్రతి బ్రాహ్మణాత్మ వ్యర్థాన్ని సమాప్తం చేసుకునేందుకే పురుషార్థం చేస్తున్నారు. వ్యర్థ ఖాతా లేక వ్యర్థ లెక్కాచారము సమాప్తమయ్యింది కదా లేక ఇంకా పాత వ్యర్థ ఖాతా ఏమైనా మిగిలి ఉందా? బ్రాహ్మణ జన్మ తీసుకుంటూనే తనువు, మనసు, ధనము అన్నీ మీవే అని ప్రతిజ్ఞ చేశారు. కనుక వ్యర్థ సంకల్పాలు సమాప్తమయ్యాయి. ఎందుకంటే మనసును సమర్థుడైన తండ్రికి ఇచ్చేశారు.

మీరే ఆలోచిస్తూ ఉంటారు, అంతేకాక మాటిమాటికీ అడుగుతూ ఉంటారు - అడ్వాన్స్ పార్టీలోని విశేష ఆత్మలు ఇంకా గుప్తంగా ఎందుకున్నారు? అనగా వారిని ప్రత్యక్షం చేయాలని కోరుకుంటున్నారు కదా. సమయ ప్రమాణంగా కొంతమంది అడ్వాన్స్ పార్టీలోని ఆత్మలు శ్రేష్ఠ యోగబలం అనే శ్రేష్ఠ విధానాన్ని ప్రారంభం చేసే శ్రేష్ఠ ఆత్మలను ఆహ్వానిస్తున్నారు. ఇటువంటి ఆది పరివర్తన విశేష కార్యం కొరకు ఆదికాలంలోని ఆదిరత్నాలు కావాలి. విశేషమైన యోగీ ఆత్మలు కావాలి. వారు తమ యోగబలాన్ని ప్రయోగించగలిగి ఉండాలి. భాగ్యవిధాత అయిన తండ్రికి భాగస్థులైన ఆత్మలుగా ఉండాలి. భాగ్యవిధాత అని బ్రహ్మను కూడా

అంటారు. ఎందుకు పిల్చుకున్నానో ఇప్పుడు అర్థమయ్యిందా ? అయితే మీరు ఇక్కడ ఏమవుతుంది? ఎలా జరుగుతుంది ? అని ఆలోచిస్తారు. బ్రహ్మాబాబా అవ్యక్తమైనారు. అయితే ఏమయ్యిందో, ఎలా అయ్యిందో చూశారు కదా. దాదీని ఒంటరిగా భావిస్తున్నారా? కానీ దాదీ అలా అనుకోవడం లేదు. మీరనుకుంటున్నారు. అంతే కదా.(దాదీ వైపు చూస్తూ) మీది డివైన్ యూనిటీ(ఐకమత్యం) కదా? మరి మీరు డివైన్ యూనిటీ భుజాలు కారా? డివైన్ యూనిటీ కదా? ఈ గ్రూపును ఎందుకు తయారు చేశారు? సదా పరస్పరము సహయోగులుగా అయ్యేందుకు కదా. ఎవరికి ఎప్పుడు కావాలన్నా అందరూ సేవ కొరకు జీ హాజిర్‌గా ఉన్నారు. ఈ దాదీలకు పరస్పరం ఒకరి పైన ఒకరికి అమితమైన ప్రేమ ఉంది. మీకు ఈ విషయము తెలియనందున ఇప్పుడేమవుతుందో తెలియదని అనుకుంటున్నారు. ఆది రత్నాలైన మేమంతా ఒక్కటే అని ఒక దీదీ ఋజువు చేసి చూపించారు. చూపించారు కదా. బ్రహ్మాబాబా తర్వాత సాకార రూపంలో పూజ్య ఆత్మలైన నవరత్నాలు సేవా స్టేజి పై ప్రత్యక్షమయ్యారు. కనుక నవరత్నాలు లేక అష్టరత్నాల మాల సదా ఒకరికొకరు సహయోగులుగా ఉన్నారు. అష్టరత్నాల మాల ఎవరు? ఎవరు సేవలో ముందుంటారో వారే అర్జునుడు. అనగా అష్ట మాలలో వస్తారు. కనుక సేవ స్టేజి పైన అష్టరత్నాలు, నవరత్నాలు తమ పాత్రను తాము అభినయిస్తున్నారు. పాత్ర చేయడమే తమ పాత్రను లేక తన నంబరును ప్రత్యక్షం చేయడం. నంబరు బాప్‌దాదా ఇవ్వరు. కాని వారి పాత్రనే ప్రత్యక్షము చేస్తూ ఉంది. కనుక అష్టరత్నాలు పరస్పరము సదా స్నేహీలు మరియు సదా సహయోగులు. అందువలన సదా ఆది నుండి సేవలో సహయోగీ ఆత్మలు సదా సహయోగ పాత్రను చేస్తూనే ఉంటారు. అర్థమయ్యిందా. ఇంకా ఏమైనా ప్రశ్నలున్నాయా? ముందే ఎందుకు తెలపలేదు అని ప్రశ్నిస్తారు. తెలిపితే దీదీ యోగులుగా అయిపోయేవారు. డ్రామాలో పాత్ర విచిత్రమైనది. ఆ చిత్రము ముందే గీయబడదు. ఆందోళన కలిగించే పేపరు అకస్మాత్తుగా వస్తుంది. ఇప్పుడు కూడా ఈ విశేష ఆత్మ యొక్క



పాత్ర, ఇంతవరకు ఏ ఆత్మలైతే పాత్ర చేసి వెళ్లిపోయారో, వారి పాత్రల కంటే భిన్నమైనది, ప్రియమైనది. ప్రతి క్షేత్రములో ఈ శ్రేష్ఠ ఆత్మ తోడును, సహయోగాన్ని అనుభవం చేస్తూ ఉంటారు. బ్రహ్మాబాబాకు తన పాత్ర ఉంది. వారి వంటి పాత్ర ఎవ్వరికీ ఉండదు. కాని ఈ ఆత్మ సేవలో ఉమంగ-ఉత్సాహాలను ఇప్పించడంలో, యోగులుగా, సహయోగులుగా, ప్రయోగీలుగా చేయడంలో సదా విశేషంగా ఉండేది. అందువలన ఈ ఆత్మలోని ఈ విశేష సంస్కారము సమయానుసారము మీ అందరికీ సహయోగిగా ఉండే అనుభవము చేయిస్తూ ఉంటుంది. ఒక్కొక్క ఆత్మకు ఒక్కొక్క విచిత్రమైన పాత్ర ఉంది.

ఈ రోజు సంఘటనలో కమల్ బచ్చీ(దీదీగారి లౌకిక వదిన) కూడా జ్ఞాపకమొచ్చింది. ఆమె కూడా గుర్తు చేసుకుంటూ ఉంది. అంతేకాక ఇంకా ఎవరైనా ఈ స్నేహీ శ్రేష్ఠ ఆత్మకు తమ సహయోగమునిచ్చారో ఆ అథక్ పిల్లలందరికీ వారిక్కడ కూర్చుని ఉన్నా, లేకున్నా వారందరూ శుభ భావన శుభ కామనలు మరియు ఒకే లగ్నముతో తమ స్నేహాన్ని చూపించారు. చాలా శ్రేష్ఠంగా ఉండినారు. అందువలన విశేషంగా బాప్‌దాదాతో దీదీ - “ బాబా, నా వైపు నుండి ఆ స్నేహీ, సేవాధారుల పరివారానికి నా స్మృతులు మరియు థాంక్స్ తెలపండి” అని చెప్పింది. కనుక ఈరోజు దీదీ పనిని బాప్‌దాదా చేస్తున్నారు. ఈ రోజు బాప్‌దాదా సందేశిగా అయ్యి సందేశమునిస్తున్నారు. ఇప్పుడు ఏదైతే జరిగిందో, అది చాలా చాలా రహస్యాలతో కూడిన డ్రామా. మీ అందరికీ దీదీ చాలా ప్రియమైనవారు. దీదీకి సేవ అంటే చాలా ప్రేమ. అందువలన దీదీని సేవ తనవైపు లాక్కుంది. ఇప్పుడు ఏదైతే జరిగిందో చాలా పరివర్తన పర్దాలను తెరిచేందుకు చాలా బాగా జరిగింది. డాక్టర్ భగవతీ దోషమూ లేదు, భగవంతుని దోషమూ లేదు. ఇది డ్రామా రహస్యము. ఇందులో భగవతీ ఏమీ చేయలేదు, భగవంతుడూ ఏమీ చేయలేడు. కనుక ఎప్పుడూ డాక్టర్ ఆపరేషన్ బాగా చేయలేదు, అలా చేశాడు, ఇలా చేశాడని ఆలోచించకండి. చివరి వరకు డాక్టరు దీదీని తల్లి వలె చూసుకున్నాడు. కనుక డాక్టరు తనవైపు నుండి

ఏ లోపమూ చేయలేదు. ఇది డ్రామాలో జరిగిన ఆట. అర్థమయ్యిందా. కనుక ఎవ్వరూ ఎలాంటి సంకల్పమూ చేయకండి.

**01-12-1983**

ఈ రోజు బాప్‌దాదా అతి స్నేహీలైన అపురూప పిల్లలను చూస్తున్నారు. ప్రతి పుత్రుడు అత్యంత స్నేహముతో మిలనము చేసేందుకు తమ ఇంటికి చేరుకున్నాడు. ఈ భూమిని మీ ఇల్లని, దాత ఇంటి గడప అని అంటారు. ఈ మహిమ ఈ మధురమైన ఇంటిదే. మధురమైన ఇంటిలో మధురమైన పిల్లలతో అత్యంత మధురమైన తండ్రి కలుసుకుంటున్నారు. ఈరోజు బాప్‌దాదా ప్రతి పుత్రుని మస్తకములో విశేషంగా మూడు అధికార రేఖలను చూస్తున్నారు. ప్రతి ఒక్కరి మస్తకములో మూడు రేఖలేమో ఉన్నాయి, ఎందుకంటే అందరూ పిల్లలే కదా. పిల్లలైనందున అందరూ అధికారులే కాని నంబరువారుగా ఉన్నారు. కొంతమంది పిల్లల మస్తకంలో సుఖాన్ని అనుభవించే భాగ్యరేఖ చాలా స్పష్టంగా, గాఢంగా కనిపిస్తూ ఉంది. ఎన్ని పరిస్థితులు వచ్చినా దు:ఖపు అలలను ఉత్పత్తి చేసే అలలైనా దు:ఖమనే మాటే తెలియనివారు. సుఖసాగరము నుండి ప్రాప్తించిన అధికారము ద్వారా దు:ఖము కలిగించే పరిస్థితులలో కూడా " వాహ్ మధురమైన డ్రామా! వాహ్! ప్రతి ఒక్క పాత్రధారి యొక్క పాత్ర" ఈ జ్ఞాన ప్రకాశం ద్వారా అధికారపు సంతోషము ద్వారా దు:ఖాన్ని సుఖములోకి పరివర్తన చేసుకుంటారు. అధికారముతో దు:ఖమనే అంధకారాన్ని పరివర్తన చేసి మాస్టర్ సుఖదాతలుగా అయ్యి స్వయం సుఖమనే ఊయలలో ఊగుతూ ఇతరులకు కూడా సుఖమును కలిగించే వైబ్రేషన్లను ఇచ్చేందుకు నిమిత్తులుగా అవుతారు. ఇటువంటి సుఖమునిచ్చే అధికారపు(భాగ్య) రేఖ స్పష్టంగా, గాఢంగా ఉంది. ఈ రేఖను ఎవ్వరూ చెడిపేయలేరు. చెరిపేసేవారు మారిపోయినా వారు మారరు. మాస్టర్ సుఖదాతల నుండి సుఖపు దోసిలిని తీసుకుంటారు. ఇటువంటి రేఖలు గలవారిని కూడా చూశారు. ఇటువంటి వారిని - నంబరువన్ భాగ్యశాలురని అంటారు. "వన్‌లో వచ్చేవారి గుర్తు విన్(విజయము)"



అని వినిపించాను కదా.

**12-12-1983**

"సదా ఒకే బలము, ఒకే నమ్మకము" - ఈ స్థితిలో ఉంటున్నారా? ఒక్కరిలో నమ్మకముంచడం అనగా బలము ప్రాప్తించడం. ఇలా అనుభవం చేస్తున్నారా? " నిశ్చయబుద్ధి విజయంతి " - దీనినే మరో విధంగా "ఒకే బలము, ఒకే నమ్మకము" అని అంటారు. నిశ్చయబుద్ధి గలవారికి విజయము లభించకుండా ఉండేందుకు వీలు లేదు(అసాధ్యము). మీలో ఏ మాత్రము సంకల్పములోనైనా ఈ పని జరుగుతుందా? లేదా? అని సంశయము వచ్చిందంటే విజయము లభించదు. మీ పై, తండ్రి పై, డ్రామా పై సంపూర్ణ నిశ్చయముంటే విజయం లభించకుండా ఎప్పుడూ ఉండదు. ఒకవేళ విజయం లభించలేదంటే ఏదో ఒక పాయింటులో నిశ్చయ లోపముందని అర్థము. తండ్రిలో నిశ్చయముంటే స్వయంలో కూడా నిశ్చయముంటుంది. మాస్టర్ కదా. మాస్టర్ సర్వశక్తివంతులుగా ఉంటే డ్రామాలోని ప్రతి విషయాన్ని నిశ్చయబుద్ధి గలవారై చూస్తారు. ఇటువంటి నిశ్చయబుద్ధి గల పిల్లలలో సదా "నాకు విజయం తథ్యము" అనే ఉమంగ-ఉత్సాహాలుంటాయి. ఇటువంటి విజయీ ఆత్మలే విజయమాలలోని మణిపూసలుగా అవుతారు. విజయం వారి వారసత్వము. ఆ వారసత్వము వారికి జన్మ సిద్ధ అధికారంగా ప్రాప్తిస్తుంది.

**14-01-1984**

అడుగులలో(అడుగడుగునా) పదమాల సేవ ఇమిడి ఉంది. చక్రవర్తులై చక్రములో తిరిగి తమ స్మృతిచిహ్న స్థానాలు తయారు చేసుకున్నారు. ఎన్ని తీర్థస్థానాలు తయారయ్యాయి! మహావీర పిల్లలు తిరిగి రావడం అనగా ఆ స్థానాలు స్మృతిచిహ్నాలుగా అవ్వడం. ప్రతి చక్రములో తమ-తమ విశేషతలుంటాయి. ఈ చక్రములో కూడా అనేక ఆత్మల హృదయాలలోని ఆశలు పూర్తి చేసే విశేషత ఉంది. ఇలా వారి హృదయాలలోని ఆశలు పూర్తి చేయడం అనగా వరదానులుగా అవ్వడం.

కనుక వరదానిగానూ అయ్యావు, మహాదానిగా కూడా అయ్యావు. డ్రామానుసారము ఏ ప్రోగ్రామ్ తయారైనా అందులో చాలా రహస్యాలు ఇమిడి ఉంటాయి. మీరు రాజ్యము తీసుకునేస్తారు.

**28-02-1984**

పూజలో, చిత్రాలలో విశేషంగా రెండు విశేషతలున్నాయి. ఒకటేమో బిందువుకు గల విశేషత. రెండవది చుక్క-చుక్క(బొట్టు, బొట్టు)కు గల విశేషత. పూజా విధానములో ఒక్కొక్క చుక్కకు(నీటి బిందువుకు) మహత్యముంది. ఈ సమయంలో పిల్లలైన మీరు 'బిందు' స్థితిలో(బిందు రహస్యములో) స్థితమౌతారు. విశేషంగా మొత్తం జ్ఞాన సారమంతా ఒక్క 'బిందువు' శబ్ధములో ఇమిడి ఉంది. తండ్రీ బిందువే, ఆత్మలైన మీరు కూడా బిందువులే. అంతేకాక డ్రామా జ్ఞానాన్ని ధారణ చేసేందుకు జరిగిపోయినదంతా - ఫినిష్(సమాప్తమైపోయింది) అనగా ఫుల్‌స్టాప్(బిందువు). బిందువు పెట్టేస్తారు. ఆత్మ, పరమాత్మ మరియు ఈ ప్రకృతులు నటించే ఈ ఆట అనగా డ్రామా, మూడింటి జ్ఞానాన్ని ప్రాక్టికల్ జీవితములో 'బిందువు' గానే అనుభవం చేస్తున్నారు కదా. అందువలన భక్తిమార్గములో కూడా శివలింగ ప్రతిమకు మధ్యలో ఉంచే బిందువుకు మహత్యముంది. ఇక రెండవది - నీటి బొట్టుకు గల మహత్యము (శివలింగము పై అమర్చిన ధారాపాత్ర నుండి నీరు చుక్క చుక్కగా పడ్తూ ఉంటుంది). మీరు స్మృతిలో కూర్చున్నపుడు లేక ఎవరైనా స్మృతిలో కూర్చోబెట్టినప్పుడు ఏ విధానము ద్వారా స్మృతి చేయిస్తారు. సంకల్పాల బిందువుల ద్వారా - నేను ఆత్మను, ఒక చుక్క(నీటి బొట్టు) వేస్తారు, తండ్రి సంతానాన్ని - ఇది రెండవ నీటి బిందువు. ఈ విధంగా శుద్ధ సంకల్పాలనే బిందువుల(నీటిబొట్ల) ద్వారా తండ్రితో మిలనము చేయడాన్ని అనుభవము చేస్తున్నారు కదా. కనుక ఒకటేమో శుద్ధ సంకల్పాల స్మృతి అనే బిందువు(నీటిబొట్టు), రెండవది తండ్రితో ఆత్మిక సంభాషణ చేయునప్పుడు కూడా తండ్రి పై వారి ఒక్కొక్క మహిమ మరియు ప్రాప్తుల శుద్ధ సంకల్పాల బిందువులు వేస్తారు కదా. మీరు ఇలా ఉన్నారు, మీలో ఈ విశేషత ఉంది,



మీరు మమ్ములను ఇలా తయారుచేశారు............. ఈ మధురాతి మధురమైన శీతల బిందువులు తండ్రి పై చల్లుతారు అనగా తండ్రితో ఆత్మిక సంభాషణ చేస్తారు. ఒక్కొక్క మాట మాట్లాడుతూ ఆలోచిస్తారు కదా. అన్నీ కలిపి ఒకేసారి ఆలోచించరు. మూడవది - పిల్లలందరూ తమ తమ తనువు, మనసు, ధనముల సహయోగాల నీటిని బొట్టు-బొట్టుగా వేస్తారు. అందుకే మీరు విశేషంగా - ఒక్కొక్క నీటిబొట్టు కలుస్తే చెరువు(సరోవరము) తయారవుతుందని అంటారు. ఇంత పెద్ద విశ్వపరివర్తనా కార్యము, సర్వశక్తివంతుని అనంతమైన విశాల కార్యములో మీలో ప్రతి ఒక్కరు ఏ ఏ సహయోగము చేస్తారో అది ఒక్కొక్క నీటిబొట్టుతో సమానమైన సహయోగమే కదా. కానీ అందరి చుక్క-చుక్క సహయోగము ద్వారా సహయోగమనే విశాలసాగరం తయారవుతుంది. అందుకే పూజా విధానములో కూడా నీటిబొట్టుకు మహత్యము చూపించారు.

**17-04-1984**

ఇప్పుడు అందరూ స్వయాన్ని ఈ సృష్టి రూపీ నాటకములో విశేష పాత్రధారులమని భావిస్తున్నారా? కల్పక్రితము వారు తమ చిత్రాలను ఇప్పుడు చూస్తున్నారు! ఇదే కదా బ్రాహ్మణ జీవితములోని అద్భుతము! సదా ఈ విశేషతను స్మృతి చేస్తూ ఉండండి - "మేము ఎలా ఉండేవారము, ఇప్పుడెలా తయారయ్యాము! గవ్వ సమానంగా ఉండే మనమిప్పుడు వజ్ర సమానంగా అయ్యాము. దు:ఖ ప్రపంచము నుండి సుఖ ప్రపంచములోకి వచ్చేశాము. మీరంతా ఈ డ్రామాలో హీరో-హీరోయిన్ పాత్రధారులు. ఒక్కొక్క బ్రహ్మకుమారి - బ్రహ్మకుమార్ తండ్రి సందేశాన్ని వినిపించే సందేశకులు. భగవంతుని సందేశాన్ని వినిపించే సందేశకులు ఎంత శ్రేష్ఠమైనవారు! కనుక మీరు సదా ఈ కార్యానికి నిమిత్తంగా అవతరించిన ఆత్మలు. ఈ సందేశమునిచ్చేందుకు పై నుండి కిందికి దిగి వచ్చామనే స్మృతి చాలా సంతోషమునిప్పిస్తుంది. ఇదే మీ కర్తవ్యము. సదా మేము సంతోషాల నిధికి యజమానులమని గుర్తుంచుకోండి. ఇదే మీ టైటిల్.

ఈ రోజు ఉదయము(18-04-1984) అమృతవేళలో

భువనేశ్వర్‌కు చెందిన ఒక సోదరుడు గుండె ఆగిపోయినందున తన పాత శరీరాన్ని మధువనములో వదిలేశాడు. ఆ సమయంలో అవ్యక్త బాప్‌దాదా ఉచ్ఛరించిన మహావాక్యాలు -

అందరూ డ్రామాలోని ప్రతీ దృశ్యాన్ని సాక్షిగా చూచే శ్రేష్ఠ ఆత్మలే కదా. డ్రామాలో ఏ అంకము జరుగుతున్నా దానిని కళ్యాణకారే అని అంటారు. నథింగ్ న్యూ అనగా కొత్తదేమీ కాదు. (ఆ సోదరుని లౌకిక వదినగారితో) ఏమాలోచిస్తున్నావు? సాక్షీ స్థితి అను సీటు పై కూర్చుని జరుగుచున్న దృశ్యాలన్నీ చూస్తూ ఉంటే మీకూ కళ్యాణమే, ఆ ఆత్మకూ కళ్యాణమే జరుగుతుంది. ఇది అర్థము చేసుకుంటున్నావు కదా. స్మృతిలో శక్తి రూపానివి కదా. శక్తులు సదా విజయులుగా ఉంటారు. విజయులంటే శక్తిరూపులై మొత్తం పాత్రనంతా అభినయించేవారు. పాత్ర చేస్తున్నప్పుడు ఏ ఇతర సంకల్పమూ చేయరాదు. ప్రతీ ఆత్మకు తనదైన పాత్ర వేరు వేరుగా ఉంటుంది. ఇప్పుడా ఆత్మకు శాంతి మరియు శక్తుల సహయోగమివ్వండి. ఇంతమంది దైవీ పరివారము వారి సహయోగము ప్రాప్తిస్తూ ఉంది. అందువలన ఆలోచించే విషయమేదీ లేదు. ఇది మహా గొప్ప తీర్థ స్థానము కదా. మహాన్ ఆత్మ, మహాన్ తీర్థ స్థానము. సదా మహోన్నతంగానే ఆలోచించు. అందరూ స్మృతిలో కూర్చొని ఉన్నారు కదా. ఒక అతిప్రియమైన పుత్రుడు తన పాత శరీరము ద్వారా లెక్కాచారాన్ని పూర్తి చేసుకొని నూతన శరీరాన్ని తయారు చేసుకునేందుకు వెళ్ళిపోయాడు. అందువలన ఇప్పుడందరూ ఆ భాగ్యశాలి ఆత్మకు శాంతి, శక్తుల సహయోగమివ్వండి. ఇదే విశేషమైన సేవ. ఎందుకిలా జరిగిందని ఆలోచించకండి. మీరు కూడా శక్తి స్వరూపులై విశ్వములో శాంతి కిరణాలను వ్యాపింపజేయండి. శ్రేష్ఠమైన ఆత్మ, సంపాదించుకునే ఆత్మ. కనుక ఎందుకు జరిగింది? అని ఆలోచించే పనే లేదు. అర్థమయ్యిందా?

**26-04-1984**

సదా స్మృతిలో ఉంటూ సంతోషంగా ఉన్నారు కదా. సంతోషమే అన్నిటికంటే అతి గొప్ప ఆశీర్వాదము(దువా) మరియు ఔషధము(దవా). సదా ఈ సంతోషమనే దవా మరియు దువా తీసుకుంటూ ఉంటే సదా సంతోషంగా ఉన్నందున శరీర లెక్కాచారము కూడా తనవైపు ఆకర్షించదు. న్యారా, ప్యారాగా ఉంటూ శరీర లెక్కాచారాన్ని పూర్తి చేసుకుంటారు. ఎంత కఠినమైన కర్మభోగమైనా శూలము నుండి చిన్న ముల్లుగా అయిపోతుంది. ఏదీ పెద్దదిగా అనిపించదు. ఇది లెక్కాచారమనే జ్ఞానము లభించినందున సంతోషంగా ఆ లెక్కాచారాన్ని చుక్తా చేసుకునేవారికి అన్నీ సహజమైపోతాయి. అజ్ఞానులు హాయ్ హాయ్(అయ్యో అయ్యో) అని వాపోతారు. జ్ఞానులు సదా వాహ్ మీఠా బాబా! వాహ్ డ్రామా! అంటూ స్మృతిలో ఉంటారు. సదా సంతోషము కలిగించే పాటలు పాడండి. “జీవితంలో పొందుకోవలసినదంతా పొందుకున్నాను, ఏ ఏ ప్రాప్తులు కావాలో అవన్నీ ప్రాప్తించాయి”. సర్వ ప్రాప్తుల భండారము నిండుగా ఉంది. ఎక్కడైతే భండారము నిండుగా ఉంటుందో అక్కడ దు:ఖాలు, బాధలు అన్నీ సమాప్తమైపోతాయి. సదా తమ భాగ్యాన్ని చూస్తూ హర్షితంగా ఉండండి. “వాహ్ నా భాగ్యము” - అని సదా మనసులో పాడుతూ ఉండండి. మీ భాగ్యమెంత గొప్పది! ప్రపంచములోని వారికైతే భాగ్యంగా సంతానము లభిస్తుంది, ధనము లభిస్తుంది, సంపద లభిస్తుంది. కాని ఇక్కడ మీకేం లభిస్తుంది? స్వయం భాగ్యవిధాతయే లభిస్తారు! భాగ్యవిధాతయే మీ వాడైనప్పుడు ఇక కావాల్సింది ఏముంది?

**07-05-1984**

సంగమ యుగంలో పట్టాభిషేక దినమునేదైతే జరుపుకున్నారో దాని స్మృతిచిహ్నమే అవినాశిగా నడుస్తూ ఉంటుంది. స్వయం తండ్రి సాకార వతనం నుండి వానప్రస్థులుగా అయ్యారు కదా. అవ్యక్త వతనంలో సేవాధారిగా ఉన్నారు. కాని సాకార వతనము నుండి అయితే వానప్రస్థులుగా అయ్యారు. సాకార వతనం నుండి వానప్రస్థులుగా అయ్యి పిల్లలకు కిరీటం, సింహాసనాలను ఇచ్చి స్వయం అవ్యక్త వతనంలోకి వెళ్ళారు. కావున అది పట్టాభిషేక దినమైపోయింది కదా! ఈ డ్రామా విచిత్రమైనది కదా! ఒకవేళ వెళ్ళేందుకు ముందే చెప్పినట్లయితే డ్రామా అద్భుతంగా

ఉండదు. డ్రామా ఎలాంటి విచిత్రమైనదంటే దీని చిత్రాన్ని ఫోటో తీయలేము. ఇందులో విచిత్రుడైన తండ్రికి విచిత్రమైన పాత్ర ఉంది. ఎవరి చిత్రాన్నైతే బుద్ధిలో సంకల్పం ద్వారా కూడా గీయలేమో వారిని విచిత్రుడని అంటారు. కావున ఇది విచిత్రమైన పట్టాభిషేకమయ్యింది. బాప్‌దాదా, సదా మహావీరులైన పిల్లలను పట్టాభిషేకం చేసుకునే కిరీటధారీ స్వరూపంలో చూస్తారు. బాప్‌దాదా సహాయమివ్వడంలో దాగి లేరు కాని సాకార ప్రపంచం నుండి గుప్తమై అవ్యక్త ప్రపంచంలో ఉదయించారు. తోడుగా ఉంటారు, తోడుగా నడుస్తారు అనే ఈ ప్రతిజ్ఞ అయితే ఉండనే ఉంది. ఈ ప్రతిజ్ఞ ఎప్పుడూ తొలగజాలదు. అందుకే బ్రహ్మాబాబా ఎదురు చూస్తున్నారు. లేకపోతే కర్మాతీతంగా అయిపోయాక వెళ్ళిపోవచ్చు కదా! బంధనమైతే లేదు కదా! కాని స్నేహ బంధనముంది. స్నేహ బంధనం కారణంగా, తోడుగా వెళ్ళే ప్రతిజ్ఞను నిభాయిస్తున్న కారణంగా తండ్రి ఎదురు చూడవలసిందే. తోడు నిభాయించాలి మరియు వెంట నడవాలి. అలాంటి అనుభవమే ఉంది కదా! మంచిది. ప్రతి ఒక్కరూ విశేషమైనవారే. ఒక్కొక్కరి విశేషతను వర్ణన చేసినట్లయితే ఎంత అవుతుంది? మాలగా అయిపోతుంది. కావున హృదయంలోనే ఉంచుకుంటారు. వర్ణన చేయరు.

**19-11-1984**

ఇప్పుడు ఏమవుతుంది? అన్న ప్రశ్న కూడా చాలా మందికి తలెత్తింది. కాని ప్రశ్న విని ఫుల్‌స్టాప్ రూపంలో పరివర్తన చేయండి. అనగా తమను అన్ని సబ్జక్టులలో నిండుగా చేసుకోండి. ఇదే ఫుల్‌స్టాప్. ఇటువంటి సమయంలో ఏమవుతుంది? అన్న ప్రశ్న తలెత్తదు. కాని ఏమి చేయాలి, ఇటువంటి సమయంలో నా కర్తవ్యమేమిటి అనే సేవలో నిమగ్నమైపోండి. ఎలాగైతే అగ్నిని ఆర్పేవారు(అగ్నిమాపక దళం వారు) అగ్నిని ఆర్పడంలో నిమగ్నమైపోయారో, ఇది ఎలా జరిగింది అని ప్రశ్నించకుండా తమ సేవలో నిమగ్నమైపోయారో అలా ఆత్మిక సేవాధారుల కర్తవ్యం - తమ ఆత్మిక సేవలో నిమగ్నమైపోవడం. ప్రపంచం వారికి కూడా అతీతత్వం అనుభవమవ్వాలి. అర్థమయ్యిందా! అయినా సమయ ప్రమాణంగా అయితే చేరుకున్నారు



కదా! పరిస్థితి ఎలా ఉన్నా డ్రామా మళ్లీ మిలన మేళా జరుపుతుంది. మీరు ఇంకా లక్కీగా అయిపోయారు కదా! మా భాగ్యంలో ఉంది కనుక మేము చేరుకున్నామని సంతోషిస్తున్నారు కదా! భలే వచ్చారు. మధువనానికి శోభ పిల్లలైన మీరే. మధువన శృంగారం మధువనానికి చేరుకున్నారు. కేవలం బాబా ఒక్కరే మధువనం వారు కాదు. పిల్లలు కూడా మధువనం వారే.

**కాన్పూరులో సెంటరు కాలిపోయింది - గంగే దాదీతో కలయిక (26-11-84)**

బాప్‌దాదా పిల్లలను సదా సురక్షితంగా ఉంచుతారు. రక్షక సాధనాలు సదా బాప్‌దాదా ద్వారా లభించాయి. పిల్లలకు సదా తండ్రి స్నేహమనే చేయి, వారి తోడు ఉంది. "నథింగ్ న్యూ (కొత్తదేమీ కాదు)" ను అభ్యసించేవారిగా అయ్యారు. అందువలన గతించి పోయినదంతా నథింగ్ న్యూ(Nothing New). ఇప్పుడేదైతే జరుగుతూ ఉందో అది కూడా నథింగ్ న్యూ(Nothing New). ఇప్పుడు రిహార్సల్ జరుగుతూ ఉంది. ఫైనల్‌లో హాహాకారాల మధ్య జయ జయ ధ్వనులు జరుగుతాయి. అతి తర్వాత అంతము జరిగి నూతన యుగము ప్రారంభమైపోతుంది. అటువంటి సమయములో వద్దనుకున్నా అందరి మనసులో ప్రత్యక్షతా ఢంకాలు మ్రోగుతాయి. అందువలన రిహార్సలు నుండి దూరమైపోయారు. చింతలేని చక్రవర్తిగా అయ్యి పాత్ర చేశాడు, చాలా బాగా చేశాడు. ఏ ఆలోచనలు లేకుండా అసోచతగా ఉండనే ఉండినాడు. ఏది జరిగినా "వాహ్ వాహ్". దీని ద్వారా కూడా కొంతమందికి కళ్యాణమే జరుగుతుంది. అందువలన కాలిపోవుటలో కూడా కళ్యాణమే, రక్షింపబడుటలో కూడా కళ్యాణమే ఉంది. అయ్యో! కాలిపోయిందే అని అనరు. రక్షింపబడినప్పుడు ఎలాగైతే వాహ్! వాహ్! అని అంటారో, అలా కాలిపోయినప్పుడు కూడా వాహ్ వాహ్! అనే అనాలి. దీనినే 'ఏకరస స్థితి' అని అంటారు. రక్షించడం మీ కర్తవ్యము. అయితే కాలిపోవాల్సిన వస్తువు కాలిపోవాల్సిందే. అందులో కూడా ఏదో లెక్కాచారముంటుంది. మీరేమో చింతలేని చక్రవర్తులు. **ఒకటి పోయిందంటే లక్ష వస్తుంది - ఇది బ్రాహ్మణుల స్లోగన్.** పోలేదు కానీ పొందుకున్నాము. అందువలన నిశ్చింతగా ఉంటారు. ఏదో ఒకటి మంచిదే లభిస్తుంది.

అందువలన కాలిపోవడమూ ఆటే, రక్షింపబడుట కూడా ఆటే. కాలిపోతున్నా మీరు ఎంత నిశ్చింత చక్రవర్తులుగా ఉన్నారని మిమ్ములను ప్రజలు గమనిస్తారు. ఎందుకంటే మీరు ఛత్రఛాయలో ఉన్నారు, వారు ఏమవుతుందో, ఎలా జరుగుతుందో, భోజనమెలా వస్తుంది, ఎలా నడుస్తుంది అని చింతిస్తూ ఉంటారు. కాని పిల్లలైన మీకు ఏ చింతా లేదు.

**05-12-1984**

కొంతమంది పిల్లలు చాలా చతురులుగా ఉన్నారు. చతురసుజానులైన తండ్రి వద్ద కూడా చతురత ప్రదర్శిస్తారు. హద్దు కోరిక ఉంటుంది కానీ అది శుభమైన కోరిక అని, సేవ కొరక అని అంటూ ఉంటారు. వారి కోరికగా ఉంటుంది కాని బాహ్య రూపమును సేవ కొరకని మార్చేస్తారు. అందువలన బాప్‌దాదా వారిని చూచి నవ్వుతూ ఉంటారు. తెలిసినా, చూస్తూ ఉన్నా, వారి చతురత అర్థమౌతున్నా బాప్‌దాదా కొంతమంది పిల్లలకు బాహాటంగా సూచననివ్వరు. కాని డ్రామానుసారము సూచన తప్పకుండా లభిస్తుంది. అదెలా లభిస్తుంది? హద్దు కోరికలు పూర్తి అయ్యే రూపము ప్రాప్తిగా కనిపిస్తుంది. కాని లోపల కోరిక ఇతర కోరికలకు జన్మనిస్తూ ఉంటుంది. అందువలన మానసిక చిక్కుల రూపములో సూచన లభిస్తూ ఉంటుంది. హద్దు ప్రాప్తులలో బాహ్యానికి ఎంత బాగా తింటూ, తాగుతూ, పాడుతూ ఉండినా మానసిక చిక్కులను(ఆందోళనను) దాచేందుకు సాధనాలు తయారు చేసుకుంటూ ఉంటారు. లోపల మనసు తృప్తి చెందదు. అల్పకాలానికి తృప్తి చెందుతుంది. కాని సదా కాలానికి తృప్తి స్థితి లేక "తండ్రి లభించారు, ప్రపంచమే లభించింది" అనే పాట హృదయపూర్వకంగా పాడలేరు. వారు తండ్రికి కూడా - "మీరేమో లభించారు కాని ఇది కూడా తప్పక కావాలి" అని చెప్తూ ఉంటారు. కావాలి, కావాలి అనే కోరిక తీరదు. సమయానుసారమిప్పుడు అందరి నుండి "ఇచ్ఛా మాత్రం అవిద్యా(కోరికంటే ఏమిటో తెలియదు)" అనే శబ్ధము రావాలి. అప్పుడు మీరు ఇతరుల కోరికలను పూర్తి చేయగలరు. ఇప్పుడిక కొంత సమయము తర్వాత ఒక్కొక్క శ్రేష్ఠ ఆత్మ విశ్వ చైతన్య భండారమును



అనుభవం చేస్తారు. మీ వద్దకు అనేకమంది భికారులై వస్తారు. "మీరే నిండుగా ఉన్న ఖజానాలు" అనే శబ్ధము అందరి నోటా వస్తుంది. ఎవరో ఉన్నారు, ఎవరో ఉన్నారని ఇంకా వెతుకుతూనే ఉన్నారు. కాని వారెవరో, ఎక్కడున్నారో స్పష్టంగా తెలుసుకోలేకున్నారు. ఇప్పుడు సమయానికి యారో(Arrow) మార్కు పడ్తుంది. దారి చూపేందుకు గుర్తులుంటాయి కదా. ఇలా పోండి అని యారో గుర్తు చూపిస్తుంది కదా. అలా ఇక్కడకు వెళ్లండి అని అందరికి అనుభూతి అవుతుంది. ఇటువంటి నిండుగా ఉండే భండారంగా మీరు అయ్యారా? సమయం కూడా మీకు సహయోగిగా అవుతుంది. శిక్షకునిగా కాదు, సహయోగిగా అవుతుంది. బాప్‌దాదా సమయానికి ముందే తన పిల్లలందరినీ సంపన్న స్వరూపములో నిండుగా ఉన్న ఖజానా రూపంలో "ఇచ్ఛా మాత్రం అవిద్యా" అను తృప్త స్వరూపంలో చూడాలని ఆశిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటి నుండే ఆ సంస్కారము నింపుకోకుంటే చివర్లో సంస్కారము నింపుకునేవారు చాలాకాలపు ప్రాప్తికి అధికారులుగా కాలేరు. అందువలన విశ్వానికి విశ్వ ఆధారమూర్తులుగా కండి. విశ్వము ముందు కంటిపాపలుగా కండి. ప్రపంచానికి కులదీపకులుగా కండి. ఏ ఏ శ్రేష్ఠ మహిమలున్నాయో వాటిలో సర్వ శ్రేష్ఠ మహిమకు అధికారి ఆత్మలైన మీరిప్పుడు విశ్వము ఎదుట మీ సంపన్న రూపములో ప్రత్యక్షమై చూపండి. అర్థమయ్యిందా!

**14-01-1985**

అందరూ పుణ్యాత్మలుగా అయ్యారా? అన్నిటికంటే గొప్ప పుణ్యము - ఇతరులకు శక్తినిచ్చుట. కనుక సర్వ ఆత్మల పట్ల పుణ్యాత్మలుగా అనగా మీకు లభించిన ఖజానాల మహాదానులుగా కండి. ఇలా దానము చేయువారికి, వారు ఇతరులకు ఎంత ఇస్తారో అంతకు పదమారెట్ల ఖజానాలు వృద్ధి చెందుతూ ఉంటాయి. కనుక వారికి ఇవ్వడం అనగా తీసుకోవడంగా అవుతుంది. ఇటువంటి ఉత్సాహముందా? ఈ ఉత్సాహానికి ప్రాక్టికల్ స్వరూపము - సేవలో సదా ముందుకు వెళ్తూ ఉండండి. మీ తనువు, మనసు, ధనాలను ఎంతగా సేవలో ఉపయోగిస్తారో అంత

మహాదానీ పుణ్యాత్ములుగా వర్తమానములోనూ అవుతారు, భవిష్యత్తుకు కూడా సదా కాలానికి జమ చేసుకుంటారు. మీ సర్వస్వము జమ చేసుకునే అవకాశము లభించుట కూడా డ్రామాలోని భాగ్యమే. కనుక మీరు ఈ సువర్ణావకాశము తీసుకునేవారు కదా. ఆలోచించి చేస్తే రజిత(వెండి) ఛాన్స్. విశాల హృదయముతో చేస్తే సువర్ణావకాశము. కనుక అందరూ నంబరువన్ ఛాన్స్‌లర్లుగా కండి.

ఈ రోజు బాప్‌దాదా విశేషంగా ఏం చేశారు ? (27-02-1985)

ఈ మొత్తం సంఘటనంతా చూసి బాప్‌దాదా, భాగ్యశాలీ పిల్లలు తమ భాగ్యాన్ని తయారు చేసుకునే విధిని మహిమ చేస్తున్నారు. దూరంగా ఉండేవారు దగ్గరకొచ్చేశారు. దగ్గరగా ఆబూలో ఉండేవారు ఎంత దూరమైపోయారు! దగ్గరకొచ్చేశారు. వారు చూచేవారు. మీరు హృదయ సింహాసనము పై సదా ఉండేవారు. మధువనానికి వచ్చేందుకు ఎంత స్నేహంతో సాధనాలను తయారు చేసుకుంటారు! ప్రతి నెలా తండ్రిని కలుసుకోవాలి. మధువనానికి వెళ్లాలి, జమ చేసుకోవాలి అనే పాట పాడుతూ ఉంటారు. ఈ లగ్నము కూడా మాయాజీతులుగా అయ్యేందుకు సాధనమవుతుంది. టికెట్ సులభంగా లభిస్తే ఇంత లగ్నముండదు, లగ్నములో విఘ్నాలు ఎక్కువగా పడ్తాయి. అయితే ఒక్కొక్క నీటి చుక్క కలుస్తే సరోవరము తయారవుతుంది. ఒక్కొక్క చుక్కను జమ చేసుకోవడంలో తండ్రి స్మృతి ఇమిడి ఉంటుంది. అందువలన డ్రామాలో ఏది జరుగుతూ ఉందో అదంతా ఇది కూడా కళ్యాణకారే. ఒకవేళ ధనం ఎక్కువగా లభిస్తే మాయ వచ్చేస్తుంది, సేవ మర్చిపోతారు. అందువలన ధనవంతులు తండ్రి వారసత్వానికి అధికారి పిల్లలుగా కాలేరు.

అర్జెంటీనా నుండి వచ్చిన ఆత్మలందరూ 'అర్జునిని' సమానంగా దాహముతో ఉన్న ఆత్మలు. రాత్రింబవళ్లు మధువన నివాసులుగా అయ్యే ఘడియ ఎప్పుడొస్తుందా అని గడియారాన్ని(తేది) చూస్తూ ఉంటారు. బాప్‌దాదా పిల్లలలోని ఈ లగ్నాన్ని చూస్తున్నారు. అందరూ అర్జునిని



సమానమైన ఆత్మలని తెలుసు. విశేషంగా తండ్రి అర్జునిని కొరకే ఒకప్పుడు వచ్చారని, ఇప్పుడు కూడా అందుకే వచ్చారని వారికి చెప్పండి. అందువలన దూరంగా ఉన్నా మీరు అపురూపమైన పిల్లలు, దూరంగా ఉండే పిల్లల నంబరు సదా హృదయసింహాసనము పై ఉంటుంది. పిల్లలందరి ఉత్తరాలు బాప్‌దాదా వద్దకు ముందే చేరాయి. బాప్‌దాదా అంటున్నారు - "దూరంగా ఉన్నందున వంచితంగా ఉండిపోయే భాగ్యము డ్రామాలో ఎవ్వరికీ ఉండదు. అనగా వంచితులుగా కారు." డ్రామాలో అందరికీ అధికారము లభించాల్సిందే.

**21-03-1985**

డ్రామా పాయింట్లను తీయండి. విజయాన్ని ప్రాప్తి చేసుకునేందుకు ఇది చాలా గొప్ప శక్తిశాలి శస్త్రం. ఎవరికైతే డ్రామా జ్ఞాన శక్తి ప్రాక్టికల్ జీవితంలో ధారణ అయ్యి ఉంటుందో వారు ఎప్పుడూ అలజడిలోకి రాజాలరు. ఈ డ్రామా పాయింటు, సదా ఏకరసంగా, అచంచలంగా, స్థిరంగా అయ్యే మరియు తయారు చేసేందుకు విశేషమైన శక్తి. దీనిని శక్తి రూపంలో ధారణ చేసేవారు ఎప్పుడూ ఓటమి చవిచూడరు. కాని ఎవరైతే కేవలం పాయింట్ రూపంలో ధారణ చేస్తారో వారు ఏం చేస్తారు? డ్రామా పాయింటును వర్ణన కూడా చేస్తారు. అలజడిలోకి కూడా వస్తున్నారు మరియు డ్రామా పాయింటును చెప్తున్నారు కూడా. అప్పుడప్పుడు కనుల నుండి కన్నీరు కూడా కారుస్తున్నారు. ఏమయ్యిందో తెలియదు, ఇదేమిటో తెలియదు అని అంటూ ఇంకా డ్రామా పాయింటును కూడా చెప్తూ ఉంటారు. అవును, విజయులుగా అయితే అవ్వవలసిందే. నేను విజయీ రత్నంగానే ఉన్నాను. డ్రామా గుర్తుంది కాని ఏమైపోయ్యిందో తెలియదు అని అంటారు.

**30-03-1985**

దాదీతో - బాల్యము నుండే తండ్రి నిన్ను కిరీటధారిగా చేసేశారు(యజ్ఞములోకి) వస్తూనే సేవ యొక్క బాధ్యతా కిరీటాన్ని

ధరింపజేశారు. సమయమనుసారము, యజ్ఞములో భికారి పాత్ర(బెగ్గరీ పాత్ర) నడిచినా, సంతోషాల(మజాల) పాత్ర నడిచినా, అన్ని పాత్రలలో, డ్రామానుసారము బాధ్యతా కిరీటాన్ని ధరిస్తూ వచ్చావు. అందువలన అవ్యక్త పాత్రలో కూడా నిమిత్త కిరీటధారిగా అయ్యావు. కనుక నీ పాత్ర విశేషంగా ఆది నుండి ఈ పాత్ర అనగా బాధ్యతను నిభాయించే పాత్ర, ఎలాగైతే బాధ్యత తండ్రిది కనుక బాధ్యతా కిరీటధారులుగా అయ్యే విశేషమైన పాత్ర ఉందో అలా మీది కూడా విశేషమైన పాత్ర. అందుకే చివర్లో కూడా దృష్టి ద్వారా కిరీటము, తిలకము అన్నీ ఇచ్చి వెళ్లిపోయారు. అందువలన మీ స్మృతిచిహ్నంలో కిరీటము తప్పక ఉంటుంది. ఉదాహరణానికి కృష్ణునికి బాల్యము నుండే కిరీటాన్ని చూపిస్తారు. అందుకే స్మృతి చిహ్నములో కూడా బాల్యము నుండే కిరీటధారి రూపంలో పూజిస్తారు. మిగిలిన వారంతా కేవలం సాథీలే కానీ మీరు కిరీటధారులు. అందరూ తోడునేమో నిభాయిస్తారు. కానీ సమాన రూపంలో తోడు నిభాయించాలి. రెండింటికి తేడా ఉంది కదా.

**13-11-1985**

డ్రామాలో ఏ సేవ పాత్ర లభించినా అందులో విశేషత నిండి ఉంది. ధైర్యముంచి సహాయాన్ని అనుభవం చేశావు! అచ్ఛా! స్వయం ద్వారా తండ్రిని ప్రత్యక్షం చేసే సంకల్పముండేది. ఎందుకంటే ఎప్పుడైతే తండ్రిని ప్రత్యక్షం చేస్తారో అప్పుడే పాత ప్రపంచము సమాప్తమై మీ రాజ్యం వచ్చేస్తుంది. తండ్రిని ప్రత్యక్షం చేయడం అనగా మీ రాజ్యాన్ని తీసుకు రావడం. మీ రాజ్యాన్ని తీసుకురావాలనే ఉమంగ-ఉత్సాహాలు సదా ఉంటాయి కదా! ఎలాగైతే విశేష ప్రోగ్రాంలో ఉమంగ-ఉత్సాహాలుండినాయో అలా సదా ఈ సంకల్పం అనగా రాజ్యాన్ని తీసుకు రావాలన్న ఉమంగ - ఉత్సాహాలుండాలి. అర్థమయ్యిందా.

**19-12-1985**

ఈ రోజు శరీరాన్ని కూడా సంభాళించాలి. లోన్‌గా



తీసుకున్నప్పుడు శరీరాన్ని, స్థానాన్ని శక్త్యానుసారము కార్యములో ఉపయోగించువారే మంచి యజమానులు. ఈ రథాన్ని నడిపేందుకు బాప్‌దాదా ఇరువురి శక్తిశాలీ పాత్ర నిమిత్తమయ్యింది. ఇది కూడా డ్రామాలో విశేష వరదానానికి ఆధారము. కొంతమంది పిల్లలకు ఈ రథమే ఎందుకు నిమిత్తంగా అయ్యింది అనే ప్రశ్న తలెత్తుతుంది. ఇతరులకే కాదు ఈ రథానికి(గుల్జార్ బహన్‌కు) కూడా ఈ ప్రశ్న వస్తుంది. కానీ ఎలాగైతే బ్రహ్మకు కూడా తన జన్మల గురించి తెలియదో, అలా ఈమె కూడా తన వరదానాన్ని మర్చిపోయింది. ఈ వరదానము ఈ పుత్రికకు విశేషంగా సాకార బ్రహ్మకు ప్రారంభంలోని సాక్షాత్కార పాత్ర సమయంలో లభించిన వరదానం. ఆది సమయంలో బ్రహ్మాబాబా ఏకాంతముగా తపస్సు చేసిన స్థానములో ఈ ఆత్మ యొక్క విశేష సాక్షాత్కార పాత్రను చూచి, బ్రహ్మాబాబా ఈ పుత్రిక యొక్క సరళ స్వభావాన్ని అమాయక(ఇన్నోసెంట్) జీవితము యొక్క విశేషతను చూచి ఈ వరదానాన్ని ఇచ్చారు - ఎలాగైతే ప్రారంభములో ఈ పాత్రలో బ్రహ్మాబాబా జతలో ఉంటూ సహయోగిగా(సాథీగా) కూడా అయ్యిందో, అలా భవిష్యత్తులో తండ్రికి సాథీగా అయ్యేందుకు తండ్రి సమానంగా అయ్యే డ్యూటీ కూడా నిర్వర్తిస్తుంది. సేవలో బ్రహ్మాబాబా సమానమైన పాత్ర చేస్తుంది. అందువలన ఈ వరదానమే భాగ్యరేఖగా తయారయ్యింది, బ్రహ్మాబాబా సమానం రథంగా అయ్యే పాత్ర చేస్తుందని నిర్ణయింపబడింది. అయినా రథముగా పాత్ర చేస్తున్నందుకు ఈ పుత్రికను బాప్‌దాదా అభినందనలు తెలుపుతున్నారు. ఇంత సమయము ఇంత గొప్ప శక్తిని సంభాళించుకోవడం చిన్న విషయం కాదు. ఈ విశేష లిఫ్ట్ కారణంగా అదనపు కానుక ఉంది. అయినా బాప్‌దాదా శరీర ఆరోగ్యన్నంతా చూడవలసి వస్తుంది. శరీరము(బాజా/వాయిద్యము) పాతది. నడిపించేవారేమో శక్తిశాలురు. అయినా హాజీ హాజీ(సరే అలాగే) అను పాఠము కారణంగా బాగా నడుస్తూ ఉంది. బాప్‌దాదా కూడా యుక్తిగా, విధి పూర్వకంగా పని నడిపిస్తున్నారు. కలుస్తామనే వాగ్దానమైతే ఉంది కానీ సమయ ప్రమాణంగా విధి పరివర్తనవుతూ ఉంటుంది. ఇప్పుడిక 18వ సంవత్సరంలో అన్ని

విషయాలు వినిపిస్తాను(1969-1985). 17 సంవత్సరాలు పూర్తి చేయాల్సిందే(జనవరి 86కు 17 సంవత్సరాలు పూర్తి అవుతాయి).

**13-01-1986**

ప్రవృత్తిలో ఉంటూ సదా న్యారాగా, తండ్రికి ప్రియంగా ఉన్నారు కదా. ఎప్పుడూ ప్రవృత్తి పై ఆకర్షణ కలగడం లేదు కదా. ఒకవేళ ఎక్కడైనా, ఎవరి పై అయినా అటాచ్‌మెంట్(మోహము) ఉంటే అది సదా కొరకు మీ జీవితములో విఘ్నముగా తయారవుతుంది. అందువలన సదా నిర్విఘ్నులై ముందుకు సాగుతూ పోండి. కల్పక్రితము వలె 'అంగదులై' స్థిరంగా, అచంచలంగా ఉండండి. అంగదునికి ఏ విశేషత చూపించారు? ఎంత నిశ్చయబుద్ధి గలవాడంటే అంగదుని కాలు కూడా ఎవ్వరూ కదిలించలేకపోయారు. నిశ్చయమనే కాలిని కదిలించుటకు మాయ రకరకాలుగా వస్తుంది. కానీ మాయ కదిలిపోవాలి గాని మీ నిశ్చయమనే కాలు కదలరాదు. స్వయం మాయనే మీకు సరెండర్ అయిపోతుంది. మీరు మాయకు సరెండర్ కారు కదా. తండ్రి ముందు సరెండర్ కండి, మాయ ముందు కాకండి. ఇటువంటి నిశ్చయబుద్ధి గలవారు సదా నిశ్చింతులుగా ఉంటారు. ఒకవేళ ఏదైనా కాస్త అయినా చింత ఉందంటే నిశ్చయములో లోపమున్నట్లే. ఎప్పుడైనా, ఏ విషయంలోనైనా, ఏ కాస్తయినా చింత ఏర్పడిందంటే అందుకు కారణం - తప్పక ఏదో ఒక విషయంలో నిశ్చయ లోపం. డ్రామాలో గాని, స్వయంలో గాని, తండ్రిలో గాని నిశ్చయం తక్కువగా ఉంటుంది. మూడు ప్రకారాల నిశ్చయాలలో ఏ కొంచెం తక్కువగా ఉండినా నిశ్చింతగా ఉండలేరు. అన్నిటికంటే పెద్ద జబ్బు - చింత. చింత అనే జబ్బుకు మందు డాక్టర్ల వద్ద కూడా లేదు. తాత్కాలికంగా నిద్రపోయేందుకు మందు ఇస్తారు కాని సదా కొరకు చింతను నిర్మూలించలేరు. చింత ఉండేవారు ప్రాప్తి వెనుక ఎంతగా పరుగెత్తినా అది అందకుండా ఇంకా వేగంగా ముందు పరుగెత్తుతూ ఉంటుంది. అందువలన సదా నిశ్చయమనే పాదము అచలంగా ఉండాలి. "సదా ఒకే బలము, ఒకే నమ్మకము" - పాదమంటే ఇదే. నిశ్చయమనండి,



నమ్మకమనండి ఒక్కటే. ఇటువంటి నిశ్చయబుద్ధి గల పిల్లల విజయము తథ్యము.

**18-01-1986**

అచ్ఛా దీదీ ఏమన్నారు? దీదీ చాలా బాగా ఆత్మిక సంభాషణ చేస్తూ నన్ను "మీరు సూచన ఇవ్వకుండానే అందరినీ ఎందుకు పిలిపించుకున్నారు, అందరి వద్ద శెలవు తీసుకొని తయారయ్యేదానిని కదా? " అని అడిగింది. మీకు ముందు చెప్తే మీరు దీదీని వెళ్లనిచ్చేవారా? బాప్‌దాదా పిల్లలతో ఆత్మిక సంభాషణ చేస్తూ - దేహ సహితం దేహ సంబంధాలు, దేహ సంస్కారాలు, అందరి సంబంధాలు, లౌకిక సంబంధాలు లేకుంటే అలౌకిక సంబంధాలైతే ఉన్నాయి కదా. అలౌకిక సంబంధంలో, దేహములో, సంస్కారాలలో నిర్మోహులుగా అయ్యేందుకు ఈ విధానమే డ్రామాలో రచింపబడింది. అందువలన చివర్లో అందరి నుండి నిర్మోహిగా అయ్యి తన కర్తవ్యము చేయుటకు వచ్చేసింది. విశ్వకిశోర్‌కు మాత్రం ముందు కొద్దిగా తెలుసు(ఇక పోవాలని) కానీ పొయ్యే సమయంలో అది కూడా మర్చిపోయాడు. నిర్మోహులుగా అగుటకు డ్రామాలో ఇది కూడా ఒక విధానంగా రచింపబడింది, అది మరలా రిపీట్ అయ్యింది. ఎందుకంటే కొంత భాగము తమ పురుషార్థము(శ్రమ), కొంత డ్రామానుసారము కర్మ బంధన ముక్తులుగా అగుటలో తండ్రి సహయోగము కూడా ఇస్తారు. ఎవరైతే చాలాకాలపు సహయోగీ పిల్లలుగా ఉండినారో "ఒక్క తండ్రి తప్ప వేరెవ్వరూ లేరు" ఈ ముఖ్యమైన సబ్జెక్టులో ఎవరైతే పాసై ఉంటారో, ఇలా నాకు తండ్రి ఒక్కరే అని అనుభవం చేయువారికి తండ్రి విశేషంగా ఇటువంటి సమయంలో తప్పక సహయోగమిస్తారు. కొంతమంది వీరంతా కర్మాతీతమైపోయారా, కర్మాతీత స్థితి అంటే ఇదేనా అని అనుకుంటారు కానీ ప్రారంభము నుండి సహయోగులుగా ఉండే పిల్లలకు అదనపు సహయోగము లభిస్తుంది. అందువలన పురుషార్థము(శ్రమ) కొంత తక్కువగా కనిపించినా తండ్రి సహయోగము చేస్తారు. చివర్లో అదనపు మార్కులిచ్చి గౌరవపూర్వకంగా పాస్ చేసేస్తారు. అది గుప్తముగా

ఉంటుంది. అందువలన ఇదెలా జరిగింది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. అయితే ఇది సహయోగానికి రిటర్న్. రాబోయే సమయంలో పనికి వస్తుందని అంటారు కదా. అందువలన ఎవరైతే హృదయపూర్వక సహయోగులుగా ఉంటారో వారికి ఇటువంటి సమయంలో అదనపు మార్కులు రిటర్న్ రూపములో ప్రాప్తి అవుతాయి. ఇప్పుడీ రహస్యం అర్థమయ్యిందా? అందువలన నిర్మోహులుగా అయ్యే విధానము ద్వారా అదనపు మార్కులనే కానుక (గిఫ్ట్) ద్వారా వారు సఫలత ప్రాప్తి చేసుకున్నారు. చివర్లో ఏమి జరిగింది అని అడుగుతూ ఉంటావు కదా? ఇప్పుడలా ఎందుకయ్యిందో అర్థమయిందా? కనుక ఈ రోజు ఆత్మిక సంభాషణ వినిపిస్తున్నారు. అచ్ఛా, దీదీ ఏమన్నారు? దీదీ అనుభవము అందరికీ తెలుసు కూడా. ఆమె ఎప్పుడూ ఇలా అనేది - " సదా బాప్‌దాదా వేలు పట్టుకో లేక నీ వేలిని వారికివ్వు. పుత్రునిగా చేసుకొని వారి వేలునైనా పట్టకో లేక వారిని తండ్రిగా చేసుకొని నీ వేలిని వారికిచ్చేయ్. రెండు రూపాలలోనూ ప్రతి అడుగులో వేలు పట్టుకొని వారి తోడును అనుభవం చేస్తూ నడవండి, ఇదే నా సఫలతకు ఆధారము." విశేషంగా ఈ ఆత్మిక సంభాషణ జరిగింది. ఆదిరత్నాల సంఘటనలో ఆమె ఎలా మిస్ అవుతుంది. అందుకే ఆమె(దీదీ) కూడా ఎమర్జ్ అయ్యింది. అచ్ఛా, ఇది అడ్వాన్స్ పార్టీ వారి సంభాషణ. ఇప్పుడు మీరేం చేస్తారు?

శక్తులు చాలామంది ఉన్నారు. ఆదిలో ఎక్కువగా శక్తులే నిమిత్తమయ్యారు. గోల్డన్‌జూబిలీలో కూడా ఎక్కువ మంది శక్తులే, పాండవులు సులభంగా లెక్కించగలిగినంత మందే అనగా కొంతమందే ఉండినారు. అయినా పాండవులున్నారు, బాగుంది. ధైర్యము చేసి ఆదిలో సహనము చేసినందుకు ఋజువు ఈ ఆదిరత్నాలే కదా. విఘ్నవినాశకులై, నిమిత్తమై, నిమిత్తంగా చేయు కార్యములో అమరంగా(పారిపోకుండా) ఉండినారు. అందువలన బాప్‌దాదాకు కూడా అవినాశి, అమరభవ అను వరదానము పొందిన పిల్లలు సదా ప్రియంగా ఉంటారు. ఈ ఆదిరత్నాలు(అడ్వాన్స్ పార్టీవారు) స్థాపనకు నిమిత్తమైనవారు అవసరమైనప్పుడు సహయోగులుగా ఉంటారు. అందువలన ఇలా



నిమిత్తమయ్యే ఆత్మలకు, సమయానికి సహయోగులుగా అయ్యే ఆత్మలకు ఎప్పుడైనా ఏదైనా కష్ట సమయం వచ్చిందంటే బాప్‌దాదా వారికి అందుకు రిటర్న్ ఇస్తారు. అందువలన మీరంతా ఎవరైతే ఇటువంటి సమయంలో నిమిత్తమైనారో వారికి ఈ అదనపు బహుమతి డ్రామాలో ఫిక్స్ అయ్యి ఉంది. అందువలన మీరు అదనపు గిఫ్ట్‌కు అధికారులు. అర్థమయిందా. మాతల బిందువు బిందువు - ఈ బిందువుల చిన్న కొలనుతో స్థాపనా కార్యము ప్రారంభమయ్యింది. ఇప్పుడు సఫలతకు సమీపానికి చేరుకున్నారు. మాతలది హృదయ పూర్వక సంపాదన. వ్యాపారము ద్వారా చేసిన సంపాదన కాదు. హృదయ పూర్వక సంపాదన ఒకటి, ఒక వెయ్యికి సమానము. స్నేహమనే బీజాన్ని వేశారు. అందువలన స్నేహ బీజము యొక్క ఫలము ఫలీభూతమవుతూ ఉంది. పాండవులు కూడా జతలో ఉన్నారు. పాండవులు లేకుంటే పని కూడా జరగదు. కానీ అధిక సంఖ్య శక్తులదే అందుకే పంచ పాండవులని వ్రాసేశారు. అయినా ప్రవృత్తిని నిభాయిస్తూ న్యారాగా, తండ్రికి ప్రియంగా తయారై ధైర్యంగా, ఉత్సాహంతో ఋజువునిచ్చారు. అందువలన పాండవులు కూడా తక్కువేమీ కాదు. శక్తుల సర్వశక్తివంతుడని గాయనం చేయబడింది. అలాగే పాండవుల పాండవ పతి అని కూడా గాయనముంది. అందువలన ఎలా నిమిత్తమైనారో, ఇలా నిమిత్తమైనారో అదంతా సదా స్మృతిలో ఉంచుకొని ముందుకు సాగుతూ వెళ్లండి.

**20-02-1986**

మీ ఎగిరేకళ ఆత్మలందరిని భికారితనము నుండి విడిపించి తండ్రి వారసత్వానికి అధికారులుగా చేస్తుంది. ఆత్మలైన మా అందరి ఇష్ట దేవీ-దేవతలు లేక నిమిత్తమైన అనేకమంది దేవతలందరూ ఈ భూమి పై అవతరించారని ఆత్మలంతా అనుభవము చేస్తారు. సత్యయుగములో అయితే అందరూ సద్గతిలో ఉంటారు కాని ఈ సమయంలో ఉన్న ఆత్మలందరికీ మీరు సద్గతినిచ్చేవారు. ఎలాగైతే ఏదైనా డ్రామా సమాప్తమైనప్పుడు చివర్లో అందులోని పాత్రధారులందరూ స్టేజి

పైకి ప్రేక్షకుల ముందుకు వస్తారో అలా ఇప్పుడీ కల్పంలో డ్రామా సమాప్తము కానుంది. కనుక మొత్తం విశ్వంలోని ఆత్మలకు స్వప్నములో కానీ, ఒక్క సెకండు దర్శనము ద్వారా గాని, ప్రత్యక్షత వలన గాని, నలువైపులా వినిపించే ధ్వని ద్వారా గాని, ఈ డ్రామాలోని హీరో పాత్రధారులు స్టేజి పై ప్రత్యక్షమయ్యారని తప్పక సాక్షాత్కారమవుతుంది. భూమికి చెందిన నక్షత్రాలు భూమి పై ప్రత్యక్షమైపోయారని అనుభవం చేస్తారు. అందరూ తమ-తమ ఇష్ట దేవతలను ప్రాప్తి చేసుకొని చాలా సంతోషిస్తారు. వారికి ఆధారము లభిస్తుంది.

**అందరూ తమ తమ సంఖ్యను వినిపించారు -** అనగా వృద్ధిని ప్రాప్తి చేసుకుంటున్నారు. ఇప్పుడింకా ఏదైనా విశేష స్థానము మిగిలి ఉందా?(చాలా ఉన్నాయి). అచ్ఛా. అందుకు ప్లాను కూడా తయారు చేస్తున్నారు కదా? విదేశీయులకు చాలా సులభంగా సెంటర్లు తెరిచే లిఫ్ట్ ఉంది. లౌకిక సేవ కూడా చేయగలరు, అలౌకిక సేవకు కూడా నిమిత్తంగా కాగలరు. భారతదేశములో ఆహ్వానం పై సెంటరు స్థాపనయ్యే విశేషత ఉంది. కానీ విదేశాలలో స్వయం వారంతకువారే ఆహ్వానించుకుంటారు. ఆహ్వానించువారూ వారే, వచ్చేవారు కూడా వారే. కనుక ఇది కూడా సేవలో సహజంగా వృద్ధి జరుగుటకు ఒక లిఫ్ట్‌గా లభించింది. ఎక్కడకు వెళ్లినా ఇద్దరు, ముగ్గురు కలిసి అక్కడ స్థాపనకు నిమిత్తం కాగలరు, అలా అవుతూ ఉంటారు. డ్రామానుసారంగా దీనిని లిఫ్ట్ అనండి, గిఫ్ట్ అనండి మీకు లభించింది. ఎందుకంటే కొంత సమయంలో సేవను సమాప్తము చేయాలంటే తీవ్ర వేగముండాలి. అప్పుడే సమయానికి సమాప్తమవుతుంది. భారతదేశములో పద్ధతికి, విదేశాలలోని పద్ధతికి వ్యత్యాసముంది. అందువలన విదేశాలలో త్వరగా వృద్ధి చెందుతూ ఉంది. ఇంకా జరుగుతూ ఉంటుంది. ఒకే రోజులో చాలా సెంటర్లు తెరవవచ్చు. విదేశాలలో నలువైపులా నిమిత్తంగా ఉండే విదేశీయులకు సేవ చేసే ఛాన్స్ సులభంగా లభిస్తుంది. భారతీయులకైతే వీసా కూడా కష్టంగా లభిస్తుంది. కనుక ఇది ఒక ఛాన్స్. అక్కడ ఉండేవారే అక్కడి సేవకు నిమిత్తులౌతారు. అందువలన సేవకు



అవకాశముంది. ఎలాగైతే లాస్ట్ నుండి ఫాస్ట్‌గా వెళ్లే అవకాశముందో అలా సేవకు కూడా ఫాస్ట్‌గా అవకాశము లభించింది. అందువలన మేము వెనుక వచ్చామనే ఫిర్యాదు ఉండదు. వెనుక వచ్చేవారికి ఫాస్ట్‌గా వెళ్లే విశేష అవకాశము కూడా ఉంది. అందువలన అందరూ సేవాధారులే. అందరూ సేవాధారులేనా? లేక సెంటర్లలో ఉండేవారు మాత్రమే సేవాధారులా? ఎక్కడున్నా సేవ లేకుంటే శాంతి, సుఖము ఉండవు. సేవయే విశ్రాంతినిచ్చే నిద్ర. శాంతిగా నిదురించుటే జీవితము అంటారు. సేవయే సుఖ నిద్ర అనండి, బంగారమనండి. సేవ లేకుంటే సుఖమైన నిద్ర ఉండదు. వినిపించాము కదా. సేవ అంటే కేవలం వాచా సేవ కాదు, ప్రతి సెకండూ సేవ ఉంది, ప్రతి సంకల్పంలో సేవ ఉంది. భారతీయులు గానీ, విదేశాలలో ఉండువారు గానీ ఏ బ్రాహ్మణులైనా సేవకు ఛాన్స్ లేదని అనలేరు. జబ్బుగా ఉండినా మనసా సేవ, వాయుమండలాన్ని తయారుచేయు సేవ, వైబ్రేషన్లు వ్యాపింపజేసే సేవ ఇవన్నీ చేయవచ్చు. ఏ విధమైన సేవ చేసినా, సేవలోనే ఉండాలి. సేవయే జీవితము. బ్రాహ్మణులనగా అర్థమే సేవాధారులు.

**10-03-1986**

ఈ రోజు యూరోప్ వారి టర్న్. యూరోప్ వారు మంచిగా విస్తరింపజేశారు. యూరోప్ వారు తమ ఇరుగు-పొరుగు దేశాలకు కళ్యాణము చేయు ప్లాను చాలా బాగా తయారుచేశారు. ఎలాగైతే తండ్రి సదా కళ్యాణకారులో, అలా పిల్లలు కూడా తండ్రి సమానంగా కళ్యాణ భావనను ఉంచేవారు. ఇప్పుడు ఎవ్వరిని చూచినా వీరు కూడా తండ్రివారిగా అవ్వాలని వారి పై దయ కలుగుతుంది కదా. బాప్‌దాదా స్థాపన సమయము నుండి విదేశాలలోని పిల్లలందరినీ ఏదో ఒక రూపములో స్మృతి చేస్తూ వచ్చారు. సమయానికి బాప్‌దాదా స్మృతి ద్వారా నలువైపులా ఉన్న పిల్లలు చేరుకున్నారు. కానీ బాప్‌దాదా చాలా సమయము నుండి ఆహ్వానిస్తూ వచ్చారు. ఆహ్వానం కారణంగా మీరు కూడా అయస్కాంతము వలె ఆకర్షితులై వచ్చేశారు. తండ్రివారిగా ఎలా అయ్యామో తెలియదనిపిస్తుంది కదా. అయిపోయారు, ఇదైతే బాగుందనిపిస్తుంది, కాని

ఏమయ్యింది, ఎలా జరిగింది అని ఎప్పుడైనా కూర్చొని ఆలోచించండి. ఎక్కడ నుండి ఎక్కడకు వచ్చి చేరుకున్నాము అని ఆలోచిస్తే విచిత్రమని కూడా అనిపిస్తుంది కదా! డ్రామాలో నిశ్చయింపబడింది. డ్రామాలోని నిశ్చితము అందరినీ మూలమూలల నుండి తీసుకొచ్చి ఒక పరివారములోకి చేర్చింది. ఇప్పుడీ పరివారము మాది అనిపించుట వలన ప్రియంగా అనిపిస్తుంది. తండ్రి ప్రియాతి ప్రియమైనవారు అందువలన మీరంతా కూడా ప్రియమైనవారిగా అయ్యారు. మీరు కూడా తక్కువ ప్రియమైనవారు కాదు. మీరందరూ బాప్‌దాదా సాంగత్య రంగులో అతిప్రియమైనవారుగా అయ్యారు. ఎవ్వరిని చూచినా ప్రతి ఒక్కరూ ఒకరికంటే ఒకరు ప్రియమనిపిస్తారు. ప్రతి ఒక్కరి ముఖము పై ఆత్మీయతా ప్రభావము కనిపిస్తుంది.

**25-03-1986**

తండ్రితో హోలీ జరుపుకొనుట(ఆడుకొనుట) అనగా ఆత్మిక రంగులో తండ్రి సమానంగా అగుట. ప్రపంచములోనివారు ఉదాసీనులుగా ఉంటారు. అందువలన వారు సంతోషంగా గడిపేందుకు ప్రత్యేకంగా ఈ రోజును ఎంచుకున్నారు. కానీ మీరు సదా సంతోషంగా నృత్యము చేస్తూ, పాడుతూ, ఆనందంగా గడుపుతూ ఉంటారు. ఎవరైతే ఎక్కువగా ఏమి జరిగింది? ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? అని తికమకపడుతూ ఉంటారో, వారు సంతోషంగా ఉండలేరు. మీరు త్రికాలదర్శులుగా అయ్యారు కనుక ఏమి? ఎందుకు? ఎలా? అనే సంకల్పాలే రాకూడదు(రావు). ఎందుకంటే మీకు మూడు కాలాలు తెలుసు. ఎందుకు జరిగిందో తెలుసు. పేపరు(పరీక్ష) ముందుకు వెళ్ళేందుకే వస్తుంది. ఏం జరిగింది? కొత్తదేమీ జరగలేదు(నథింగ్ న్యూ). కనుక ఏం జరిగింది అనే ప్రశ్నే రాదు. ఎందుకు వచ్చింది? ఇంకా గట్టి పడేందుకే, దృఢంగా అయ్యేందుకే మాయ వచ్చింది, పోయింది. కనుక త్రికాలదర్శి స్థితిలో ఉన్నవారు తికమక చెందరు. ప్రశ్నతో పాటు జవాబు కూడా వచ్చేస్తుంది. ఎందుకంటే మీరు త్రికాలదర్శులు. పేరేమో త్రికాలదర్శులు కానీ వర్తమానాన్ని కూడా తెలుసుకోలేకుంటే, ఎందుకు



జరిగింది? ఎలా జరిగింది? అని ప్రశ్నిస్తూ ఉంటే వారిని త్రికాలదర్శులని అంటారా? అనేకసార్లు విజయులుగా అయ్యారు, ఇక మీదట కూడా అవుతారు. బ్రాహ్మణుల నుండి ఫరిస్తాలుగా, ఫరిస్తాల నుండి దేవతలుగా అయ్యేవారమని తెలుసు. ఇది ఈ రోజు, రేపటి విషయమే. ప్రశ్నలు సమాప్తమై ఫుల్‌స్టాప్ వచ్చేస్తుంది. 'హోలీ' అర్థము కూడా ఏమి? "హో - లీ" జరిగిపోయింది, గతం గత: ఇలా బిందువు(ఫుల్‌స్టాప్) పెట్టడం తెలుసు కదా? హోలీ అంటే ఈ అర్థము కూడా ఉంది.

**07-04-1986**

బాప్‌దాదా పిల్లలందరి ఉమంగ-ఉత్సాహాలను చూస్తున్నారు. ప్రతి ఒక్కరి మనసులో స్నేహసాగరుని అలలు పొంగుతూ ఉన్నాయి. పిల్లల లగ్నము(పట్టుదల) విఘ్నవినాశకులుగా చేసి మధువన నివాసులుగా చేసిందని బాప్‌దాదాకు ముందే తెలుసు. ఇప్పుడు చూస్తూ కూడా ఉన్నారు. స్నేహములో అన్ని విషయాలు సమాప్తమైపోయాయి. ఎవర్-రెడీగా ఉండుటకు రిహార్సల్ చేసి చూపించారు. ఎవర్-రెడీగా అయిపోయారు కదా. మధురమైన డ్రామాలోని ఈ మధురమైన పాత్రను చూచి బాప్‌దాదా మరియు బ్రాహ్మణ పిల్లలు సంతోషిస్తున్నారు. స్నేహములో అన్ని విషయాలు సహజంగా, ప్రియంగా అనిపిస్తాయి. డ్రామాలో ఏమి జరిగినా "వాహ్ డ్రామా వాహ్!" ఎన్నిసార్లు ఈ విధంగా పరిగెత్తుతూ వచ్చారు! రైలులో వచ్చారా లేక రెక్కలతో ఎగురుతూ వచ్చారా! దీనినే మనసుంటే అసంభవము కూడా సంభవమైపోతుందని (మనసుంటే మార్గము ఉంటుందని) అంటారు. స్నేహ స్వరూపమునేమో చూపించారు అయితే ఇక ముందు ఏమి చేయాలి ? ఇంతవరకు అంతా శ్రేష్ఠంగానే జరిగింది, శ్రేష్ఠంగానే ఉంటుంది.

ఎలాగైతే మధువనానికి పరిగెత్తుతూ వచ్చారో, అలా తపస్వీ స్థితి అను గమ్యము వైపు పరుగు తీయండి. భలే మధువనానికి వచ్చేశారు. ఇప్పుడే వినాశనము జరగనున్నట్లు అందరూ పరుగెత్తుకొని వచ్చేశారు. ఏమి చేశారో, ఏమి జరిగిందో అదంతా బాప్‌దాదాకు ప్రియమైనదే ఎందుకంటే

పిల్లలంతా ప్రియమైనవారే. ప్రతి ఒక్కరు మేము వెళ్తున్నామనే అనుకున్నారు. కానీ ఇతరులు కూడా వస్తున్నారని ఆలోచించలేదు. ఇక్కడ సత్యమైన కుంభమేళా జరుగుతూ ఉంది. అందరూ చివరి మిలనము, అంతిమ మునక వేసేందుకు వచ్చారు. ఇంతమంది వెళ్తున్నాము, మిలనము చేసే విధానమెలా ఉంటుందో ఆలోచించారా? ఈ ఆలోచన కూడా రాలేదు. స్థానాన్ని చూడలేదు, రిజర్వేషన్‌నూ చూడలేదు. కనుక ఇంకెప్పుడూ రిజర్వేషన్ దొరకలేదనే సాకు(నెపము) చెప్పలేరు. డ్రామాలో ఇది కూడా ఒక రిహార్సల్ అయిపోయింది. సంగమ యుగములో మీ రాజ్యము లేదు. స్వరాజ్యముంది కానీ భూతలము పై రాజ్యము లేదు కదా, అలాగే బాప్‌దాదాకు తమ స్వంత రథము కూడా లేదు. అందువలన సమయానుసారము నూతన విధానమును ప్రారంభించేందుకు ఇది సీజనైపోయింది. ఇక్కడ నీటిని గురించి కూడా ఆలోచిస్తూ ఉంటారు. అక్కడ సెలయేర్లలో, నీటి ప్రవాహాలలో స్నానము చేస్తారు. ఎవరు వచ్చినా, ఎంతమంది వచ్చినా బాప్‌దాదా స్నేహానికి బదులు స్నేహముతో ఆహ్వానిస్తారు.

**09-04-1986**

సదా స్వయాన్ని అచల్-అడోల్(స్థిరంగా-చలించని) ఆత్మలమని అనుభవం చేస్తున్నారా? ఎలాంటి ఆందోళనలోనైనా చలించకుండా ఉండుటే శ్రేష్ఠ బ్రాహ్మణాత్మల గుర్తు. ప్రపంచమంతా ఆందోళనకరంగా ఉండినా శ్రేష్ఠ ఆత్మలైన మీరు ఆందోళన చెందరాదు. ఎందుకు? మీకు డ్రామాలోని ప్రతి దృశ్యము తెలుసు. మీరు జ్ఞాన స్వరూపులు(నాలెడ్జ్‌ఫుల్ ఆత్మలు). ఎవరు నాలెడ్జ్‌ఫుల్‌గా ఉంటారో వారు పవర్‌ఫుల్‌గా కూడా ఉంటారు. కనుక నాలెడ్జ్‌ఫుల్ ఆత్మలు, పవర్‌ఫుల్ ఆత్మలు సదా స్వతహాగానే అచలంగా(స్థిరంగా) ఉంటారు. కనుక ఎప్పుడూ వాయుమండలం ద్వారా భయపడడం లేదు కదా! నిర్భయంగా ఉన్నారా? శక్తులు నిర్భయంగా ఉన్నారా? లేక కొంచెం భయం-భయంగా ఉందా? ఎందుకంటే జరగాల్సిందేనని తెలుసు. ఈ విషయం ప్రారంభ సమయంలోని చిత్రాలలోనే మీకు చూపించడం జరిగింది. ఏదైతే చూపించారో అది జరగాల్సిందే



కదా! భారతదేశం పాత్రయే సివిల్‌వార్ ద్వారా. అందువలన నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు). కనుక నథింగ్ న్యూ అని భావిస్తున్నారా లేక భయపడ్తున్నారా - ఏమి జరిగింది, ఎలా జరిగింది, ఇది జరిగింది............. వార్తలు వింటున్నా, చూస్తున్నా డ్రామాలో తయారైన భావీని(జరగబోవు దానిని) శక్తిశాలులై చూడడం, ఇతరులకు కూడా శక్తినివ్వడం - మీ అందరి కర్తవ్యమిదే కదా. ప్రపంచములోనివారు భయపడ్తూ ఉంటారు, మీరు ఆ ఆత్మలలో శక్తి నింపుతారు. మీ సంపర్కములోకి ఎవరు వచ్చినా వారికి శక్తులను, శాంతిని దానమిస్తూ పోండి.

**11-04-1986**

కొత్తదేమైనా చేస్తున్నారా? ఎన్నోసార్లు చేసిన దానిని, కేవలం గీత పైన గీత గీస్తున్నారు! డ్రామా అనే గీత ముందే గీయబడి ఉంది. ఈ గీత చక్కగా(సరిగ్గా) ఉంటుందో, లేదో తెలియదని ఆలోచించే పని కూడా లేదు. కల్ప-కల్పము తయారైన ప్రాలబ్ధాన్ని మళ్లీ తయారు చేసుకుంటారు. ఎందుకంటే ఇది కర్మ ఫలాల లెక్కాచారము. ఇక కొత్తదేముంది! ఇది చాలా పాతది. ఇది అయ్యే ఉంది, జరిగే ఉంది, తప్పక జరుగుతుంది. ఇదే స్థిరమైన నిశ్చయము. దీనిని దృఢత అని అంటారు. ఇటువంటి నిశ్చయము కలిగిన వారిని తపస్వీమూర్తులని అంటారు. ప్రతి సంకల్పములో దృఢత అనగా తపస్సు.

**21-01-1987**

ఈ మేళా కూడా డ్రామాలో రచింపబడింది. "వాహ్ డ్రామా! అని అంటున్నారు కదా". ప్రపంచములోని వారు ఒక్కోసారి 'వాహ్ డ్రామా!' అని సంతోషిస్తారు ఒక్కోసారి అయ్యో డ్రామా! ఇలా జరిగిందే అని దు:ఖిస్తారు. కానీ మీరు సదా ఏమంటారు? " వాహ్ డ్రామా వాహ్!" అని అంటారు. ప్రాప్తి పొందినప్పుడు ఏదీ కష్టమనిపించదు. అలాగే ఇంత శ్రేష్ఠమైన పరివారముతో కలిసే ప్రాప్తి జరుగుతూ ఉంటే ఎలాంటి కష్టమైనా కష్టమనిపించదు. కష్టమనిపిస్తుందా? భోజనానికి కాచుకోవలసి వస్తున్నదా? తింటున్నా ప్రభువు గుణాలు గానము చేయండి. క్యూలో

నిల్చున్నప్పుడు కూడా ప్రభువు గుణాలను గానము చేయండి. ఈ పనే కదా చేయాల్సింది? ఈ రిహార్సలు కూడా జరుగుతూ ఉంది. ఇప్పుడు ఈ సంఖ్య ఏమంత పెద్దదేమీ కాదు. పోను పోను ఇంకా వృద్ధి చెందుతుంది. మిమ్ములను మీరు మల్చుకునే అలవాటు చేసుకోండి. సమయానుసారము స్వయాన్ని నడిపించుకోగలగాలి. ఇప్పుడు క్రింద పడుకునే(మంచాలు లేకుండా) అలవాటయ్యింది కదా. మంచాలు లభించనందున నిద్ర రాకుండా మేల్కొని ఉండడం లేదు కదా? టెంటులో ఉండేందుకు కూడా అలవాటు పడ్డారు కదా. బాగుందా? చలి అనిపించడం లేదు కదా? ఇప్పుడు ఆబూ అంతటా టెంట్లు వేస్తామా? టెంటులో నిదురించడం బాగుందనిపించిందా లేక గదులు కావాలా? మొట్టమొదట పాకిస్తాన్‌లో ఉన్నప్పుడు మహారథులకు కూడా పడుకునేందుకు మంచాలు లేవు. క్రిందనే నిదురించేవారు, గుర్తుందా? బాగా ప్రఖ్యాతి చెందిన మహారథులు కూడా హాలులో నేల పై మూడడుగుల స్థలములో పడుకునేవారు. తర్వాత బ్రాహ్మణ పరివారము వృద్ధి చెందినప్పుడు కూడా ఎలా మొదలయ్యింది? టెంటు నుండే ప్రారంభమయ్యింది కదా. మొట్టమొదట ఎవరైతే వచ్చారో వారు కూడా టెంటులోనే ఉండినారు. టెంటులో ఉండేవారు మహాత్ములైపోయారు. సాకార పాత్రకు చెందినవారుగా ఉండినా టెంటులోనే ఉండేవారు. కనుక మీరు కూడా అలా అనుభవం చేస్తారు కదా. కనుక అందరూ అన్ని విధాలా సంతోషంగా ఉన్నారా? మంచిది. ఇప్పుడింకా 10,000 టెంట్లు తెప్పించి ఏర్పాట్లు చేస్తాము. అందరూ స్నానమెలా చేయాలని ఆలోచిస్తున్నారా? అది కూడా జరిగిపోతుంది. ఈ హాలు తయారైనప్పుడు అందరూ ఏమన్నారో గుర్తుందా? స్నానము చేసేందుకు ఇంత జాగా ఏం చేస్తాము? అని అన్నారు. ఈ లక్ష్యముతోనే ఇది నిర్మించబడింది. ఇప్పుడది చిన్నదైపోయింది కదా. ఎంత పెద్దది కట్టినా అంత చిన్నదిగా అవ్వాల్సిందే ఎందుకంటే చివరికి బేహద్‌లోకి వెళ్లాల్సిందే.

**23-01-1987**

సఫలతా నక్షత్రాల విశేష గుర్తు - వారెప్పుడూ వారి స్వంత సఫలతను



గురించిన అభిమానులుగా ఉండరు. వారి సఫలతను గురించి వర్ణించరు. స్వయాన్ని మహిమ చేసుకోరు. ఎంత సఫలత ఉంటుందో అంత నమ్రచిత్తులుగా, నిరహంకారులుగా, నిర్మల స్వభావము కలిగినవారిగా ఉంటారు. ఇతరులు వారిని మహిమ చేస్తారు కానీ వారు సదా తండ్రి గుణాలను మహిమ చేస్తూ ఉంటారు. సఫలతా నక్షత్రాలు ఎప్పుడూ ప్రశ్నించరు. ప్రశ్నార్థకంగా అవ్వరు. సదా బిందు రూపములో స్థితమై ప్రతి కార్యములో ఇతరులకు కూడా "డ్రామా బిందువు" అనే స్మృతినిప్పించి వారిని విఘ్నవినాశకులుగా, సమర్థులుగా తయారు చేసి సఫలతా గమ్యానికి సమీపంగా తీసుకొస్తూ ఉంటారు.

డ్రామాలోని నిర్ణయానుసారము కొత్త పిల్లలు కొత్త ఉమంగ-ఉత్సాహాలతో మిలనము చేయడం పూర్తయ్యింది. చాలా ఉమంగము ఉండినది కదా. ఎప్పుడెప్పుడు వెళ్తామా......... అని ఎంత ఉమంగముండినదంటే, డైరక్షన్లు కూడా వినలేదు. మిలనం చేయాలనే మస్తీలో మస్త్ అయ్యి ఉండినారు కదా. తక్కువగా రండి, తక్కువగా రండి అని ఎంత చెప్పినా ఎవరైనా విన్నారా? బాప్‌దాదా డ్రామాలోని ప్రతి దృశ్యాన్ని చూచి సంతోషిస్తున్నారు. ఎందుకంటే ఇంతమంది పిల్లలు డ్రామాలో రావాల్సే ఉండినది. అందుకే వచ్చారు. అన్నీ సులభంగా లభిస్తున్నాయి కదా. కష్టమేమీ లేదు కదా. ఇది కూడా డ్రామానుసారము, సమయ ప్రమాణంగా రిహార్సల్ జరుగుతూ ఉంది. అందరూ సంతోషంగా ఉన్నారు కదా. కష్టాన్ని సులభంగా చేసుకునేవారు కదా. ప్రతి పనిలో సహయోగమివ్వడం, ఏ డైరెక్షన్ లభిస్తుందో అందులో సహయోగులుగా అవ్వడం అనగా సహజంగా చేసుకోవడం. ఒకవేళ సహయోగులుగా అవుతే 5000 మంది కూడా హాలులో ఇమిడిపోతారు. సహయోగులుగా లేకుంటే 500 మంది పట్టడం కూడా కష్టమైపోతుంది. అందువలన దాదీలకు మీ రికార్డును ఎలా చూపించి వెళ్లాలంటే అందరి హృదయాల నుండి 5000 మంది ఉన్నా 500 మంది వలె ఇమిడిపోయారని వెలువడాలి. దీనినే కష్టాన్ని సులభంగా చేసుకోవడమని అంటారు. ఇప్పుడు అందరూ మీ రికార్డును ఫస్టుక్లాస్‌గా

నింపుకున్నారు కదా? మంచి సర్టిఫికెట్ లభించింది. సదా ఇలాగే సంతోషంగా ఉండాలి, అందరినీ సంతోషపరచాలి. అప్పుడు సదా చప్పట్లు మ్రోగుతూ ఉంటాయి. రికార్డు బాగుంది. అందుకే చూడండి, డ్రామానుసారంగా రెండుసార్లు కలుసుకోవడం జరిగింది. ఇలా డ్రామానుసారము కొత్తవారిని గౌరవించడం జరిగింది. అచ్ఛా.

ఏమి జరిగినా, ఏమి వింటున్నా, చూస్తున్నా కొంచెము కూడా ఆందోళనలోకైతే రారు కదా? కొత్తదేమీ లేనప్పుడు(నథింగ్ న్యూ/Nothing New) ఆందోళనలోకి ఎందుకు వస్తారు? ఏదైనా కొత్త విషయమైతే ఆందోళన చెందాలి. ఏమి? ఎందుకు? అనే ప్రశ్నలు అనేక కల్పాల నుండి వస్తూనే ఉన్నాయి - ఇలా ఉండుటనే 'డ్రామా పై నిశ్చయబుద్ధి' అని అంటారు. సర్వ శక్తివంతుల సాథీలు, అందువలన మీరు చింతలేని చక్రవర్తులు. మీ చింతలన్నీ తండ్రికి ఇచ్చేస్తే స్వయం సదా చింతలేని చక్రవర్తులుగా, సదా ఆత్మిక సుగంధాన్ని వ్యాపిస్తూ ఉంటే విఘ్నాలన్నీ సమాప్తమైపోతాయి.

**20-02-1987**

మూడవ రేఖ - సత్యమైన సేవాధారుల రేఖ. ఈ సేవాధారుల రేఖ కూడా అందరి మస్తకము పై ఉంది. సేవ లేకుండా కూడా ఉండలేరు. సేవ బ్రాహ్మణ జీవితాన్ని సదా నిర్విఘ్నంగా చేయు సాధనము కూడా. సేవలోనే విఘ్నాల పేపర్లు కూడా ఎక్కువగా వస్తాయి. నిర్విఘ్న సేవాధారులను సత్యమైన సేవాధారులని అంటారు. విఘ్నాలు రావడం కూడా డ్రామాలో రచింపబడి ఉంది. విఘ్నాలు రావాల్సిందే, వస్తూనే ఉంటాయి ఎందుకంటే ఈ విఘ్నాలు లేక పేపర్లు(పరీక్షలు) అనుభవీలుగా చేస్తాయి. వీటిని విఘ్నాలుగా భావించక అనుభవాల ఉన్నతి జరుగుతూ ఉందనే భావముతో చూస్తే అవి ఉన్నతి జరిగే మెట్లుగా అనుభవమవుతాయి. తద్వారా ఇంకా ముందుకు వెళ్తారు. ఎందుకంటే సేవ అనగా సంఘటన ద్వారా, సర్వాత్మల ద్వారా ఆశీర్వాదాలను అనుభవం చేయుట. అందరి ఆశీర్వాదాలు లభించే సాధనము - సేవ. ఈ విధి ద్వారా, ఈ వృత్తితో చూస్తే అనుభవాల అథారిటీ ఇంకా పెరుగుతూ ఉందని సదా అనుభవం చేస్తారు. విఘ్నాలను విఘ్నాలుగా



భావించకండి. విఘ్నాలు కలిగించేందుకు నిమిత్తమైన ఆత్మలను విఘ్నకారీ ఆత్మలుగా భావించకండి, అనుభవీలుగా చేసే శిక్షకులుగా భావించండి. నిందించేవారు మిత్రులని అంటారు కదా. కనుక మీరు విఘ్నాలను దాటించే అనుభవీలుగా చేసే శిక్షకులవుతారు కదా. ఎందుకంటే పాఠాలు చదివించారు కదా. ఉదాహరణానికి ఈ రోజులలో వ్యాధులను దూరము చేసే డాక్టర్లు ఎక్సర్‌సైజు(వ్యాయామము) చేయిస్తారు. అందులో మొదట శరీరమంతటా నొప్పులు వస్తాయి. కానీ ఆ నొప్పులు సదా కొరకు నొప్పులు లేకుండా చేసేందుకు నిమిత్తమవుతాయి. ఈ విషయం అర్థం కానివారు ఈ డాక్టరు నా నొప్పులను ఇంకా ఎక్కువ చేసేశాడని బాధతో అరుస్తారు. కానీ ఈ నొప్పిలో మందు దాగి ఉంది. అదే విధంగా రూపము భలే విఘ్నానిదే, మీకు వారు విఘ్నాలు కలిగించే ఆత్మలుగా కనిపిస్తారు కానీ సదా కొరకు విఘ్నాలను దాటించేందుకు, అచలంగా చేసేందుకు వారే నిమిత్తంగా అవుతారు. అందువలన సదా నిర్విఘ్న సేవాధారులను సత్యమైన సేవాధారులని అంటారు. ఇటువంటి శ్రేష్ఠమైన రేఖ గలవారిని సత్యమైన సేవాధారులని అంటారు.

**05-10-1987**

సంతుష్టంగా(తృప్తిగా) ఉండేవారి గుర్తు - వారు వారి మనసుతో, హృదయముతో, అందరితో, తండ్రితో, డ్రామాతో సంతుష్టంగా ఉంటారు. వారి మనసులో, శరీరంలో సదా ప్రసన్నతా అలలు కనిపిస్తూ ఉంటాయి. ఎటువంటి పరిస్థితులు వచ్చినా, లెక్కాచారాలు చుక్తా చేసుకునేందుకు వారిని ఎదిరించే ఆత్మలు వచ్చినా, శారీరిక కర్మభోగం అనుభవించవలసి వచ్చినా, వారు హద్దు కోరికల నుండి ముక్తముగా ఉండు ఆత్మలైనందున సంతుష్టత కారణంగా సదా ప్రసన్నతా మెరుపుతో మెరుస్తూ ఉన్న నక్షత్రాల వలె కనిపిస్తారు. ప్రసన్నచిత్తులు ఎప్పుడూ, ఏ విషయంలోనూ ప్రశ్నచిత్తులుగా కారు. ప్రశ్నలుంటే ప్రసన్నంగా ఉండరు. ప్రసన్నచిత్తుల గుర్తు - వారు సదా నిస్వార్థులుగా, సదా అందరినీ నిర్దోషులుగా అనుభవం చేస్తారు. ఇతరుల పై దోషమును ఆపాదించరు. నా భాగ్యాన్ని ఇలా తయారు చేశాడని

భాగ్యవిధాత పై గానీ, డ్రామాలో నా పాత్ర ఇలా ఉందని డ్రామా పై గానీ, ఈ వ్యక్తి స్వభావ సంస్కారం ఇలాంటిదని వ్యక్తుల పై గానీ, వాయుమండలం ఇలా ఉందని ప్రకృతి పై గానీ, నా శరీరమే ఇలా ఉందని శరీర లెక్కాచారం పై గానీ దోషమును ఆపాదించరు. ప్రసన్నచిత్తులనగా సదా నిస్వార్థ, నిర్దోష వృత్తి దృష్టి గలవారు. కనుక సంగమ యుగంలోని విశేషత సంతుష్టత. సంతుష్టతకు గుర్తు - ప్రసన్నత. ఇదే బ్రాహ్మణ జీవితంలోని విశేష ప్రాప్తి. సంతుష్టత లేదంటే ప్రసన్నత ఉండదు. అనగా బ్రాహ్మణులుగా అయినందుకు లాభము తీసుకోలేదని అర్థమవుతుంది. బ్రాహ్మణ జీవితంలోని సుఖమే సంతుష్టత, ప్రసన్నత. బ్రాహ్మణ జీవితమై ఉండి దాని సుఖము తీసుకోకుంటే కేవలం పేరుకు మాత్రమే బ్రాహ్మణులవుతారా లేక ప్రాప్తి స్వరూపులుగా అవుతారా? కనుక బాప్‌దాదా బ్రాహ్మణ పిల్లలందరికి ఇదే స్మృతినిప్పిస్తున్నారు - బ్రాహ్మణులుగా అయ్యారు, మీది ఎంతో గొప్ప భాగ్యము! అయితే బ్రాహ్మణ జీవిత వారసత్వము, ఆస్తి - సంతుష్టత. బ్రాహ్మణ జీవితపు పర్సనాలిటి - ప్రసన్నత. ఈ అనుభవంతో ఎప్పుడూ వంచితంగా ఉండకండి. మీరు అధికారులు. దాత, వరదాత అయిన తండ్రి విశాల హృదయంతో ప్రాప్తుల ఖజానాను ఇస్తున్నారు, ఇచ్చేశారు కనుక మీ ఆస్తిని, పర్సనాలిటీని బాగా అనుభవంలోకి తీసుకు రండి. ఇతరులను కూడా అనుభవీలుగా చేయండి, అర్థమయ్యిందా. ప్రతి ఒక్కరు స్వయాన్ని నేను ఏ నంబర్ మాలలో ఉన్నాను అని ప్రశ్నించుకోండి. మాలలో అయితే ఉన్నారు కానీ ఏ నంబరు మాలలో ఉన్నారు.(8, 108, 16,108)

**22-11-1987**

కొంతమంది పిల్లలు సహాయానికి పాత్రులైనప్పటికీ సహాయం పొందుట నుండి వంచితులుగా ఎందుకవుతున్నారని బాప్‌దాదా పిల్లలను చూస్తున్నారు. అందుకు కారణాన్ని ముందే వినిపించారు - ధైర్యము చేసి సహాయాన్ని పొందే విధానాన్ని మర్చిపోవుట వలన. అభిమానము అనగా నిర్లక్ష్యము కారణంగా, స్వయం పై అటెన్షన్ తక్కువగా ఉన్న కారణంగా వంచితులవుతున్నారు. విధానము(విధి) లేకుంటే వరదానంతో



వంచితులుగా ఉండిపోతారు. సాగరుని పిల్లలై ఉండి కూడా చిన్న-చిన్న చెరువులుగా అయిపోతారు. ఎలాగైతే చెరువులోని నీరు ప్రవహించకుండా నిలకడగా ఉండిపోతుందో అలా పురుషార్థం చేస్తూ చేస్తూ మధ్యలో నిలబడిపోతారు. అందువలన అప్పుడప్పుడు కష్టపడుతూ, అప్పుడప్పుడు ఆనందంలో ఉంటారు. ఈ రోజు చాలా ఆనందంగా ఉంటారు, రేపు చిన్న ఆటంకం వస్తే దానిని తొలగించేందుకు కష్టపడుతూ ఉంటారు. పెద్ద కొండగా కూడా ఉండదు, చిన్న రాయి వంటిదే. పేరుకేమో మహావీరులైన పాండవ సైన్యము కానీ చిన్న కంకర రాయి వచ్చినా వారికి కొండ వలె అయిపోతుంది. దానిని తొలగించుకునే శ్రమలో మునిగిపోతారు. చాలా నవ్వు తెప్పిస్తారు. ఎవరైనా ఇది చాలా చిన్న కంకర రాయే అని చెప్పినా, వారు నవ్వు తెప్పించే మాట ఏమంటారో తెలుసా? మీకేం తెలుసు, మీకు ఇటువంటి ఆటంకం వస్తే తెలుస్తుంది అని అంటారు. తండ్రితో కూడా బాబా, మీరేమో నిరాకారులు. మీకు మా కష్టం గురించి ఏం తెలుసు అని అంటారు. బ్రహ్మాబాబాతో కూడా - మీకైతే తండ్రి లిఫ్ట్ ఉంది, మా కష్టం మీకేం తెలుసు అని అంటారు. చాలా మంచి మంచి మాటలు మాట్లాడ్తారు. అయితే ఇందుకు కారణం చాలా చిన్న తప్పే - హిమ్మతే బచ్చే, మదదే ఖుదా(పిల్లలు ధైర్యం చేస్తే, తండ్రి సహాయం చేస్తారు) - ఈ రహస్యాన్ని మర్చిపోతారు. ఇది డ్రామాలోని గుహ్య కర్మల గతి. హిమ్మతే బచ్చే, మదదే ఖుదా - ఈ విధి, విధానంలో(డ్రామాలో) లేకుంటే అందరూ విశ్వానికి రాజులుగా అయిపోయేవారు. అయితే ఒకేసారి అందరూ సింహాసనం పై కూర్చోగలరా? ఈ విధి కారణంగానే నంబరువారుగా అయ్యే విధానం ఏర్పడింది. లేకుంటే అందరూ బ్రహ్మనే ఎందుకు మొదటి నంబరుగా తయారుచేశారు, మమ్ములను చేసి ఉండకూడదా అని ఫిర్యాదు చేసేవారు. అందువలన డ్రామానుసారంగా ఈశ్వరీయ విధానం తయారై ఉంది. ఒక్క అడుగు ధైర్యంగా వేస్తే పదమా అడుగుల సహాయం లభిస్తుందనే విధానం డ్రామాలో నిమిత్తమాత్రంగా రచింపబడింది. తండ్రి సహాయం చేసే సాగరుడైనా ఈ విధానము డ్రామానుసారం రచింపబడింది. కనుక ఎంత కావాలంటే అంత ధైర్యం

చేయండి, అంత సహాయం తీసుకోండి. కానీ ధైర్యం చేయరు. ఒక్క సంవత్సరం పుత్రుడు కావచ్చు, 50 సంవత్సరాల పుత్రుడు కావచ్చు, సరెండర్ అయినవారు కావచ్చు, ప్రవృత్తిలోని వారు కావచ్చు అందరికీ సమాన అధికారం ఉంది. అయితే విధానం ద్వారా ప్రాప్తి జరుగుతుంది. కనుక ఈశ్వరీయ విధానం ఏదో అర్థమయ్యిందా.

సదా వాహ్ వాహ్ అనే పాట పాడేవారే కదా. హాయ్ హాయ్(అయ్యో! అయ్యో!) అనే పాట సమాప్తమైపోయింది. ఇప్పుడు వాహ్! వాహ్! అనే పాట సదా మనసుతో పాడుతూ ఉంటారు. ఏవైనా శ్రేష్ఠ కర్మలు చేసినప్పుడు మనసులో ఏమనిపిస్తుంది? వాహ్ నా శ్రేష్ఠమైన కర్మలు! లేక వాహ్ శ్రేష్ఠమైన కర్మలు నేర్పించే బాబా! లేక వాహ్ శ్రేష్ఠమైన సమయం, శ్రేష్ఠ కర్మలు చేయించే బాబా! కనుక సదా వాహ్ వాహ్! అనే పాట పాడే ఆత్మలు కదా. ఎప్పుడూ పొరపాటున కూడా అయ్యో! అనే శబ్ధం రాదు కదా? అయ్యో ఎందుకిలా జరిగింది, ఏమిటిలా జరిగింది అని అనరాదు. ఏదైనా దు:ఖము కలిగించే దృశ్యాన్ని చూసినా కూడా అయ్యో అనే శబ్ధం రాకూడదు. నిన్నటి వరకు హాయ్ హాయ్ అనే పాట పాడేవారు ఈ రోజు వాహ్ వాహ్ అనే పాట పాడుతున్నారు. ఎంత తేడా వచ్చేసింది! అయితే ఇది ఎవరి శక్తి ? తండ్రిదా లేక డ్రామాదా?(తండ్రి శక్తి). తండ్రి కూడా డ్రామా కారణంగానే వచ్చారు కదా. కనుక డ్రామా కూడా శక్తివంతమైనది. డ్రామాలో పాత్ర లేకుంటే తండ్రి కూడా ఏమి చేసేవారు. తండ్రి కూడా శక్తివంతమైనవారే, డ్రామా కూడా శక్తివంతమైనదే. కనుక వాహ్ డ్రామా వాహ్! అని ఇరువురి పాట పాడుతూ ఉండండి. స్వప్నంలో కూడా అనుకోనిది సాకారంలో జరిగిపోయింది. ఇంటిలో కూర్చునే అన్నీ లభించాయి. ఇంట్లో కూర్చునే ఇంత భాగ్యము లభించుటను డైమండ్ లాటరీ అని అంటారు.

**06-12-1987**

ఈ విశాలమైన డ్రామాలో అందరూ హీరో పాత్రధారులమని అనుభవం చేస్తున్నారా? మీ అందరిదీ హీరో పాత్రయే. హీరో పాత్రధారులుగా ఎందుకయ్యారు? ఎందుకంటే మీరు అత్యంత ఉన్నతమైన తండ్రి ఎవరైతే



జీరోగా ఉన్నారో వారి జతలో పాత్రను అభినయించేవారు. మీరు కూడా జీరోలే అనగా బిందువులు. అయితే మీరు శరీరధారులుగా అవుతారు కానీ తండ్రి సదా జీరోగానే ఉంటారు. కనుక మీరు జీరోతో పాటు హీరో పాత్రను అభినయించే పాత్రధారులు. ఈ స్మృతి ఉంటే సదా యదార్థమైన పాత్ర చేస్తారు. స్వతహాగా అటెన్షన్ ఉంటుంది. ఎలాగైతే హద్దు డ్రామాలో పాత్ర చేసే హీరో పాత్రధారులకు ఎంత అటెన్షన్ ఉంటుంది. అందరికంటే అత్యంత గొప్ప హీరో పాత్ర మీరు అభినయిస్తున్నారు. మీరందరూ అభినయిస్తున్నారు. సదా వాహ్ నా హీరో పాత్ర! అని నషాలో, ఖుషీలో ఉండండి. మీ పాత్రను చూసి విశ్వంలోని ఆత్మలు పదే పదే హియర్ - హియర్ అని అంటారు. ద్వాపర యుగం నుండి మిమ్ములను ఏదైతే కీర్తన చేస్తున్నారో అది మీరు ఈ సమయంలో చేసే హీరో పాత్రకు స్మృతిచిహ్నం. ఎంత మంచి స్మృతిచిహ్నము తయారు చేయబడింది! మీరు స్వయంగా హీరోలుగా అయ్యారు. అందుకే ఇంతవరకు మీకు గాయనం జరుగుతూ వస్తున్నది. అంతిమ జన్మలో కూడా మీరు మీ మహిమను వింటున్నారు. గోపీవల్లభునికి కూడా మహిమ ఉంది, గోప-గోపికలకు కూడా గాయనముంది. తండ్రికి శివుని రూపంలో గాయనముంది, పిల్లలకు శక్తుల రూపంలో గాయనముంది. కనుక సదా హీరో పాత్రను అభినయించే శ్రేష్ఠ ఆత్మలము - ఈ స్మృతితో సంతోషంగా ముందుకు సాగుతూ పోండి.

**18-12-1987**

చిన్న విషయాన్ని పెద్దదిగా చేయడం, పెద్ద విషయాన్ని చిన్నదిగా చేయడం - ఇది మీ స్థితి పై ఆధారపడి ఉంటుంది. పరేశాన్ అగుట(వ్యాకుల పడుట) లేక మీ అధికారతనపు శాన్‌లో(గౌరవంలో) ఉండడం - ఇది కూడా మీ పైనే ఉంటుంది. ఏమిలా జరిగింది? లేక ఏమి జరిగిందో అంతా మంచిదే జరిగింది. ఇలా అనుకోవడం కూడా మీ పైనే ఆధారపడి ఉంది. ఈ నిశ్చయం చెడును కూడా మంచిగా మార్చగలదు. ఎందుకనగా లెక్కాచారము చుక్త అయ్యేందుకు లేక సమయ ప్రతి సమయం డ్రామానుసారము ప్రాక్టికల్ పరీక్షలు వస్తూనే ఉంటాయి. కొన్ని

మంచి రూపంలో వస్తాయి, కొన్నిసార్లు రూపము మంచిగా ఉండినా, బాహ్య రూపము నష్టము కలిగించేదిగా ఉంటుంది లేక దానిని మీరు ఈ రూపములో మంచిగా జరగలేదని అంటారు. కానీ నష్టమనే పర్దాలో లాభము దాగి ఉంటుంది. బయటి పర్దా నష్టకారకంగా కనిపిస్తుంది. కానీ కొద్ది సమయము ధైర్యంగా, సహనశీల స్థితిలో ఉండి అంతర్ముఖులై చూస్తే బయటికి కనిపించే పర్దా లోపల ఏది దాగి ఉందో అది కనిపిస్తుంది. అప్పుడు పైకి కనిపించే దానిని చూస్తున్నా చూడరు. మీరు హోలీ హంసలు కదా? ఆ హంసలు రాళ్ళను రత్నాలను వేరు చేయగలిగినప్పుడు హోలీ హంసలైన మీరు దాగి ఉన్న మీ లాభాన్ని తీసుకోలేరా? నష్టములో దాగి ఉన్న లాభాన్ని వెతుక్కోలేరా? అర్థమయ్యిందా. వెంటనే గాభరాపడి(భయపడి) నందున ఏమవుతుంది? ఏదైతే మంచిదని అనుకుంటారో అది కూడా గాభరాపడుట వలన మారిపోతుంది. కనుక గాభరా పడకండి, భయపడకండి. కర్మలు చూసి కర్మ బంధనంలో ఇరుక్కోకండి. ఏమైపోయింది? ఎలా జరిగింది? ఇలా జరిగి ఉండరాదు, నాకే ఎందుకిలా జరుగుతుంది? బహుశా నా భాగ్యమే ఇలాంటిదేమో - అను దారాలలో బంధిస్తూపోతారు. ఈ సంకల్పాలే దారాలు లేక తాళ్ళు. అందువలన కర్మ బంధనాలలోకి వచ్చేస్తారు. వ్యర్థ సంకల్పాలే కర్మ బంధనాలనే సూక్ష్మమైన దారాలు. కర్మాతీత ఆత్మలు - జరిగేదంతా మంచిదే, నేనూ మంచి ఆత్మనే, నా తండ్రి కూడా మంచివారే, డ్రామా కూడా మంచిదే అని భావిస్తారు. ఈ భావము బంధనాలను కత్తెరతో కత్తిరించే పని చేస్తుంది. బంధనాలు తెగిపోయాయంటే కర్మాతీతులై పోయారు కదా. కళ్యాణకారీ తండ్రి సంతానమైనందున సంగమ యుగములో ప్రతి సెకండు కళ్యాణకారే. మీ వ్యాపారమే ప్రతి సెకండు కళ్యాణము చేయడం, సేవ చేయడమే కళ్యాణము చేయడం. బ్రాహ్మణుల కర్తవ్యమే - విశ్వ పరివర్తన, విశ్వ కళ్యాణము. ఇటువంటి నిశ్చయబుద్ధి గల ఆత్మకు ప్రతి ఘడియ నిశ్చయంగా కళ్యాణకారిగానే ఉంటుంది.



**31-12-1987**

ఎవరైతే సదా తండ్రి హృదయములో ఉంటారో, వారు సదా ఏది మాట్లాడతారో, ఏది చేస్తారో అది స్వత:గానే తండ్రి సమానంగా ఉంటుంది. తండ్రి సమానంగా అవ్వడం కష్టమేమీ కాదు కదా? కేవలం డాట్(బిందువును) గుర్తుంచుకున్నారంటే కష్టము నోటుగా(కరెన్సీనోటు) అయిపోతుంది. బిందువును(డాట్‌ను) మర్చిపోయారంటే నోట్‌గా అవ్వరు. బిందువుగా అవ్వడం, బిందువు ఉంచడం ఎంత సులభము! మొత్తం జ్ఞానమంతా ఈ ఒక్క డాట్(బిందువు) అనే శబ్ధములోనే ఇమిడి ఉంది. మీరూ బిందువే, తండ్రి కూడా బిందువే. అంతేకాక గడిచిపోయిన దానికంతా బిందువు పెట్టేయాలి. చాలు, చిన్న పిల్లలు కూడా వ్రాయుట ప్రారంభించినప్పుడు పెన్సిల్, కాగితము పై పెట్టూనే తయారయ్యేది బిందువే కదా? కనుక ఇది కూడా పిల్లలు ఆడుకునే ఒక ఆటే. ఈ జ్ఞాన చదువంతా ఆట్లాడుకున్నట్లే ఉంటుంది. కష్టమైన పనేదీ ఇవ్వలేదు. కనుక పని కూడా సహజమైనదే, మీరు కూడా సహజ యోగులే.

**14-01-1988**

డ్రామాలో ఏ ఏ దృశ్యాలు జరుగుతూ ఉంటాయో అవన్నీ సమయానుసారము చాలా రహస్యయుక్తముగా ఉంటాయి. ఎవరెవరు అనన్యమైన స్నేహీ ఆత్మలు వెళ్లిపోతారో, అందులో ఒక్కొక్క ఆత్మ వెళ్లిపోవుటలో కూడా భిన్న-భిన్న రహస్యాలు దాగి ఉంటాయి. అనన్య ఆత్మలు ఎక్కడకు వెళ్లినా సేవ చేసేందుకే నిమిత్తమై వెళ్తారు. ఎలాగైతే సంగమ యుగంలో బ్రాహ్మణ జీవితములో సంఘటన ద్వారా సేవ సఫలమౌతూపోతూ ఉందో అలా నూతన ప్రపంచాన్ని స్థాపన చేయుటలో కూడా సంఘటన ద్వారా కార్యము వృద్ధి చెంది సఫలతను ప్రాప్తి చేసుకుంటూ ఉంది. కనుక స్థాపన చేసే పాత్రలో ఏ ఏ ఆత్మలకు, ఏ ఏ సమయంలో, ఏ ఏ పాత్ర ఉందో డ్రామానుసారము ఆయా సమయంలో వెళ్లి ఆ కార్యానికి నిమత్తమవుతారు. ఈ రహస్య కార్యము కొంతకాలము నుండి జరుగుతూ ఉంది. ఇక పై కూడా జరుగుతూనే ఉంటుంది. అందువలన అనన్య ఆత్మలు వెళ్లిపోవడం

ఎలాంటిదంటే సేవా పాత్ర మారిపోవడం లాంటిది లేక సేవ అనే పాత్ర అనుసారము శరీరమనే వస్త్రాన్ని మార్చుకోవడం వంటిది. ఎటువంటి పాత్ర చేయాలో అటువంటి వస్త్రము, అటువంటి సంబంధాలు, అటువంటి స్థానము కావాలి కదా. కనుక సేవ చేసే పాత్రను బట్టి రావడం, పోవడం జరుగుతూనే ఉంటుంది. ఈ ఆత్మకు కూడా సేవ చేసే పాత్ర ఉంది. ఈ శరీరముతో లెక్కాచారము పూర్తి అయ్యే సమయము వచ్చింది. అందువలన ఇలా సంపాదన చేసుకొని వెళ్ళిపోయే ఆత్మల కొరకు ఏ ఆత్మలూ చింతించే అవసరమే లేదు. సేవ కోసము వెళ్తున్నారంటే సంతోషమే కదా. ఎందుకంటే పాత శరీరముతో ఎక్కువ సేవ చేయలేరు. కనుక కొత్త పాత్ర చేస్తారు. అంతేకాక అందరూ వెళ్ళాల్సిందే, కేవలం సమయం వేరు వేరుగా ఉంటుంది. అందువలన ఎలాగైతే ఈ ఆత్మ సదా సంతోషంగా ఉండేదో అలా అందరూ లౌకిక బంధు-మిత్రులు కావచ్చు, అలౌకికము వారు కావచ్చు అందరూ ఈ ఆత్మ విశేషత అయిన సంతోషమును సదా గుర్తుంచుకోండి. ఎలాగైతే స్వయం ఈ ఆత్మ తేలికగా ఉండేదో, వెళ్ళునపుడు కూడా తేలికగా ఉంది కదా. ఇక్కడున్న సమయంలో కూడా తేలికగా ఉండినదో, అలా అందరూ వారి విశేషత పై స్నేహముంచడమే ఆత్మతో స్నేహము కలిగి ఉండుట. ఈ ఆత్మ చాలా మంచి పాత్ర చేసి వెళ్ళిపోయింది. ఇక ముందు కూడా చాలా మంచి పాత్ర చేస్తుంది.

అందువలన ప్రతి ఆత్మ విశేషతను గుర్తుంచుకోండి, వారి విశేష పాత్రను గుర్తుంచుకోండి. తద్వారా స్వయంలో, వాతావరణంలో సదా శాంతి మరియు శక్తి నిండి ఉంటుంది. ఈ ఆత్మ ఎటువంటిదంటే ఎవరైనా విశేషమైన బలమునిచ్చినప్పుడే సంతోషంగా ఉండే ఆత్మ కాదు, ఎప్పుడూ సంతోషంగానే ఉండే ఆత్మ. అయితే స్నేహ పద్ధతి ప్రకారము స్మృతియాత్ర ద్వారా స్నేహములో సహయోగమిచ్చుట బ్రాహ్మణ జీవితములోని పద్ధతి-ఆచారము. అంతేగానీ శక్తినిస్తేనే శక్తివంతముగా ఉండే ఆత్మ కాదు. ఇప్పుడు కూడా శక్తిశాలిగానే ఉంది. తండ్రితో సంబంధమున్న కారణంగా తండ్రి వద్దనే శక్తి స్వరూపమై అనుభవం చేస్తూ ఉంది. అందువలన డ్రామాలో



ఏమి జరిగిందో అది మంచిదే అని అంటారు. ప్రపంచములోనివారైతే, "అప్పుడే వెళ్ళిపోయిందే" అని అంటారు. కానీ మీరేమంటారు? సేవ చేసేందుకు వెళ్ళిందని అంటారు. వెళ్ళిపోయిందని అనరు, సేవ చేసేందుకు వెళ్ళిందని అంటారు. సేవ చేసేందుకు ఎవరైనా వెళ్ళినపుడేం చేస్తారు? సంతోషిస్తారా? లేక ఏడుస్తారా? కనుక ఈ ఆత్మ కూడా సేవ చేసేందుకు వెళ్ళింది. ఈ ఆత్మ సదా హర్షితంగా ఉండేది. సదా హర్షితంగానే ఉంటుంది. అచ్ఛా. ప్రపంచము లెక్కలో కూడా తన పాత్రనేమో పూర్తి చేసింది. ఆ లెక్కతో కూడా ఇదేమంత పెద్ద విషయమేమీ కాదు. ఇక్కడ ఎవరైనా యువకుడు వెళ్ళిపోతే ఏడుస్తారా? అక్కడ ఎవరైనా ముసలివారు వెళ్ళిపోతే లడ్డూలు పంచుతారు. ఇక్కడ ఎవరైనా యువకుడు వెళ్ళిపోయినా హల్వాభోగ్‌ను మీరూ తింటారు. ఆ ఆత్మకూ తినిపిస్తారు. ఏమి చేస్తారు? అగ్ని సంస్కారము చేసి వచ్చినప్పుడు ఏం చేస్తారు? హల్వా తింటారు కదా. ఎందుకంటే జ్ఞానము తెలిసిన ఆత్మ కదా. అందువలన నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు/Nothing New) అచ్ఛా. అందరికీ చాలా చాలా స్మృతులు. బాప్‌దాదా అందరికీ సదా స్నేహ శక్తినిస్తూనే ఉంటారు. ఇప్పుడు కూడా ఇస్తూనే ఉన్నారు.

**22-01-1988**

బ్రహ్మలో ఉండిన అద్భుతమైన విశేషత ఏమంటే మీ అందరి ముందు సాకార రూపంలో బ్రహ్మాబాబా ఉదాహరణంగా నిలిచారు. కానీ బ్రహ్మ ముందు ఏ సాకారమైన ఉదాహరణ లేదు. కేవలం స్థిరమైన నిశ్చయము, తండ్రి ఇచ్చిన శ్రీమతం మాత్రమే ఆధారంగా ఉండినది. మీకైతే చాలా సులభము. ఇంకా ఆలస్యంగా వచ్చేవారికి ఇంకా సులభంగా ఉంటుంది. ఎందుకంటే అనేకమంది ఆత్మలు పరివర్తన చెందిన శ్రేష్ఠ జీవితము మీ ముందు ఉదాహరణంగా ఉంది. ఈ పని చేయాలి, ఇలా తయారవ్వాలి అనే విషయం స్పష్టంగా ఉంది. అందువలన మీకు ఎందుకు, ఏమి అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశమే లేదు. అందరూ చూస్తున్నారు కానీ బ్రహ్మ ముందు ఈ ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశముండేది. ఏమి

చేయాలి, ఏమి జరగబోతుంది, నేను రైటు చేస్తున్నానా, తప్పు చేస్తున్నానా అనే సంకల్పాలు ఉత్పన్నమగుట సంభవము. కానీ సంభవాన్ని అసంభవంగా చేశారు. ఒకే బలము, ఒకే నమ్మకము - ఈ ఆధారంతో నిశ్చయబుద్ధి కలిగి నంబరువన్ విజయీగా అయ్యారు. ఈ సమర్పణత కారణంగా బుద్ధి సదా తేలికగా ఉండేది, బుద్ధి పై ఎలాంటి భారముండేది కాదు. మనసు నిశ్చలంగా, నిశ్చింతగా ఉండినది. ముఖము పై సదా చింతలేని చక్రవర్తి చిహ్నాలు స్పష్టంగా చూశారు. 350 మంది పిల్లలుండినారు, తినేందుకు భండారంలో ఏమీ లేదు కానీ సమయానికి పిల్లలకు భోజనము తినిపించాలి! ఇటువంటి పరిస్థితిలో ఎవరైనా ఎలాంటి చింతా లేకుండా ఉండగలరేమో ఆలోచించండి. ఒంటి గంటకు భోజనం గంట కొట్టాలి. కానీ 11 గంటల వరకు గోధుమపిండి లేదు, ఇటువంటి పరిస్థితిలో ఎవరైనా ఏ చింతా లేకుండా ఉండగలరా? ఇటువంటి పరిస్థితిలో కూడా బ్రహ్మా హర్షితంగా, స్థిరంగా ఉండినారు. ఈ బాధ్యత తండ్రిది, నాది కాదు, నేను తండ్రి వాడిని, పిల్లలు కూడా తండ్రి వారే, నేను కేవలం నిమిత్తంగా ఉన్నానని ఇంత నిశ్చయంగా, నిశ్చింతగా ఎవరైనా ఉండగలరా? మనసు, బుద్ధి ద్వారా సమర్పితమైన ఆత్మ. ఒకవేళ ఏమౌతుందో తెలియదు, అందరూ ఆకలితో ఉండిపోరు కదా, ఇలా జరగదు కదా, అలా జరగదు కదా,.......... ఇటువంటి వ్యర్థ సంకల్పాలకు లేక సంశయానికి అవకాశముండినా సదా రక్షకుడైన తండ్రి ఉన్నారు, తండ్రి కళ్యాణకారి అని సమర్థ సంకల్పాలే చేశారు. ఇది సమర్పణతకు గల విశేషత. కనుక ఎలాగైతే బ్రహ్మాబాబా సమర్పణగుటకు ముందు ధైర్యంగా ఒక అడుగు వేశారో అలా మీరు కూడా తండ్రిని అనుసరించండి. నిశ్చయముంటే విజయం తప్పక లభిస్తుంది. నిశ్చయమున్నందున సమయానికి పిండి కూడా వచ్చేసింది, గంట కూడా కొట్టారు, పాస్ అయిపోయారు. దీనినే ప్రశ్నార్థకము అనగా వంకర మార్గము తీసుకోకుండా సదా కళ్యాణ బిందువును ఉంచడమని అంటారు. బిందువు అనగా ఫుల్‌స్టాప్. ఈ విధానము ద్వారానే పనులు సులభంగా కూడా అవుతాయి, సిద్ధి కూడా ప్రాప్తిస్తుంది. కనుక ఇది కూడా బ్రహ్మాబాబాలో గల



అద్భుతమైన విశేషత. ఈ రోజు మొదటి అడుగును వినిపించాను. చింత అనే భారము నుండి కూడా నిశ్చింతగా అయిపోండి. దీనినే స్నేహానికి రిటర్న్ ఇవ్వడమని అంటారు.

**03-02-1988**

ఇప్పుడు మెల్ల మెల్లగా అన్ని ధర్మాల వారు వారి మాటలను మోల్డ్ చేసుకుంటున్నారు(మార్చుకుంటున్నారు). ఇంతకుముందు తమ మాటల పై, నమ్మకాల పై చాలా మొండిగా ఉండేవారు. ఇప్పుడు మెల్లగా మోల్డ్ అవుతూ ఉన్నారు. క్రైస్తవులు కావచ్చు, ముస్లింలు కావచ్చు, భారతదేశంలోని ఫిలాసఫీ అంటే ఆంతరికంలో గౌరవిస్తారు. ఎందుకంటే భారతదేశపు ఫిలాసఫీలో అన్ని ప్రకారాలైన రమణీకత ఉంది. ఈ విధమైన రమణీకత ఇతర ధార్మాలలో లేదు. కథల అనుసారము, డ్రామా అనుసారము ఏవైతే భారతదేశపు ఫిలాసఫీని ప్రసిద్ధము చేస్తాయో అలా ఇతర ధర్మాలలో ఎక్కడా లేదు. అందువలన చాలా మొండిగా ఉండేవారు ఇప్పుడు ఆంతరికంలో భారతదేశ ఫిలాసఫీ అందులోనూ ఆది సనాతన ఫిలాసఫీ తక్కువైనది కాదని భావిస్తారు. ఫిలాసఫీ అంటే ఆదిసనాతన ధర్మపు ఫిలాసఫీనే అని అందరూ అనే రోజు కూడా వస్తుంది. హిందువు అనే శబ్ధమంటే కోప్పడ్తారు కానీ ఆది సనాతన ధర్మమంటే గౌరవిస్తారు. ఒకే భగవంతుడు, ఒకే ధర్మము, మనందరి ధర్మము ఒక్కటే అనే విషయము ద్వారా నెమ్మది నెమ్మదిగా వారు ఆత్మ ధర్మం వైపు ఆకర్షితమవుతూ పోతారు.

**20-02-1988**

ఈ రోజు డబల్ విదేశీయులతో వ్యక్తగతంగా ఆత్మిక సంభాషణ చేస్తున్నారు. ఇంతవరకు చాలా బాగా సేవ చేశారు, ఇలాగే చేస్తూనే ఉండాలి. సేవ పెరగడం డ్రామాలో తయారయ్యే ఉంది. ఇప్పుడు సేవ చాలా జరిగిందని మీరు ఎంతగా ఆలోచించినా డ్రామాలో ఇదంతా నిశ్చయింపబడే ఉంది. అందువలన సేవ కొరకు ప్రణాళికలు వెలువడాల్సిందే. అంతేకాక మీరందరూ నిమిత్తమై సేవ చేయాల్సిందే. దీనిని ఎవ్వరూ మార్చలేరు. తండ్రి ఒక్క సంవత్సరం సేవ నుండి మీకు విశ్రాంతినిచ్చినా,

"భావిని" మార్చలేడు. సేవ చేయకుండా ఫ్రీగా కూర్చోగలరా? ఎలాగైతే బ్రాహ్మణ జీవితానికి "స్మృతి" ఆహారంగా ఉందో, అలా సేవ కూడా బ్రాహ్మణ జీవితానికి మంచి ఆహారమే. ఆహారం లేకుండా ఎవరైనా ఉండగలరా? కానీ బ్యాలన్స్ తప్పక ఉండాలి. బుద్ధికి భారము కలిగేటంత ఎక్కువ సేవ కూడా చేయకండి, నిర్లక్ష్యంగా, సోమరిగా అయ్యేటంత తేలికగా కూడా చెయ్యకండి. భారమూ ఉండరాదు, నిర్లక్ష్యమూ ఉండరాదు. దీనినే బ్యాలన్స్ అని అంటారు.

**27-03-1988**

సదా స్వయాన్ని ప్రతీ ఆత్మకు సుఖమునిచ్చే సుఖదాత తండ్రి పిల్లలము అని అనుభవం చేస్తున్నారా? అందరికీ సుఖమునిచ్చే విశేషత మీలో ఉంది కదా. డ్రామానుసారంగా ఈ విశేషత కూడా మీకు లభించింది. ఈ విశేషత అందరికీ ఉండదు. ఎవరైతే అందరికీ సుఖమునిస్తారో వారికి అందరి ఆశీర్వాదాలు లభిస్తాయి. అందువలన స్వయం కూడా సదా సుఖంగా అనుభవం చేస్తారు. ఈ విశేషత ద్వారా వర్తమాన సమయంలోనూ బాగుంటారు, భవిష్యత్తులో కూడా బాగుంటారు. మీది ఎంత మంచి పాత్ర! - అందరి ప్రేమ కూడా లభిస్తుంది, అందరి ఆశీర్వాదాలు కూడా లభిస్తాయి. దీనినే "ఒకటి ఇచ్చి వెయ్యి పొందుట" అని అంటారు. మీరు అందరికీ సేవ చేసి అందరికీ సుఖమునిస్తారు, అందువలన మీకు అందరి ప్రేమ లభిస్తుంది. ఈ విశేషతను సదా స్థిరంగా ఉంచుకోవాలి.

**31-03-1988**

ఈ సంవత్సరం బాప్‌దాదా 6 మాసాలలో జరిగిన సేవా ఫలితాన్ని చూడాలనుకుంటున్నారు. సేవ కొరకు ఏ ఏ ప్లాన్లు తయారుచేస్తారో, వాటిని తీసుకొని ఒకరికొకరు సహయోగులై నలువైపులా బాగా తిరగండి. చిన్న పెద్ద అందరికీ ఉమంగ-ఉత్సాహాలను కలిగించి 3 విధాలైన సేవలో ముందుకు తీసుకెళ్లండి. అందువలన బాప్‌దాదా ఈ సంవత్సరంలో రాత్రిని కూడా పగలుగా చేసేటంత సేవ ఇచ్చారు. ఈ సంవత్సరం 3 ప్రకారాల సేవకు ఫలమును భుజించే సంవత్సరం. వచ్చే సంవత్సరం కాదు, ఫలము తినే సంవత్సరం. ఈ సంవత్సరము బాబా వచ్చే ప్రోగ్రామ్ లేదు. అవ్యక్త



బాప్‌దాదా సకాశ్ ఇస్తూనే ఉంటారు, తండ్రి సదా జతలోనే ఉంటారు. డ్రామాలో ఏదైతే నిర్ణయించబడిందో అది తెలిపించాను. డ్రామాకు ఏది అంగీకారమో దానిని అంగీకరించవలసే వస్తుంది.

ఇప్పుడు కలుసుకునే కోటా పూర్తి అయ్యింది. రథానికి కూడా అదనపు సకాశమునిచ్చి నడిపిస్తున్నామని వినిపించాము కదా. లేకుంటే ఇదేమీ సాధారణ విషయము కాదు(భగవంతుడు ప్రవేశించడం). అన్ని విషయాలు చూడాల్సి వస్తుంది కదా. అయినా అన్ని శక్తుల శక్తి జమ అయ్యి ఉంది. అందువలన రథము కూడా ఇంత సహయోగమిస్తూ ఉంది. శక్తులు జమ లేకుంటే ఇంత సేవ జరగడం కష్టమైపోయేది. శ్రేష్ఠ కర్మల ఫలితము ఏదైతే జమ అయ్యి ఉందో అది సమయానికి పనికొస్తుంది. ఇలా పనికిరావడం కూడా డ్రామాలో నిర్ణయించబడి ఉంది. ఇంతమంది ఆత్మల ఆశీర్వాదాలు లభిస్తాయి కదా, అది కూడా జమ అవుతుంది. ఏదో ఒక రకంగా విశేషమైన పుణ్యము జమ అయినందున ఈ రథానికి విశేషమైన పాత్ర లభించింది. నిర్విఘ్నంగా రథము నడవడం కూడా డ్రామాలో నిర్ణయించబడిన పాత్రే. 6 మాసాలు తక్కువ సమయమేమీ కాదు. అచ్ఛా, అందరినీ సంతోషపరుస్తాము.

**19-11-1989**

భాగ్యశాలీ ఆత్మల గుర్తులు - మిగిలి ఉన్న అన్ని లెక్కాచారాలను సహజంగా సమాప్తము చేసుకుంటూ ఉంటారు అంతేకాక 95 శాతము ఆత్మల ద్వారా సదా స్నేహ సహయోగాలను అనుభూతి చేస్తూ ఉంటారు. ఈ భాగ్యశాలీ ఆత్మలు జనుల సంబంధ-సంపర్కములోకి వస్తూ సదా ప్రసన్నంగా ఉంటారు, ప్రశ్నచిత్తులుగా ఉండరు. వీరు ఇలా ఎందుకు చేస్తున్నారు, ఎందుకిలా అంటున్నారు, ఇది ఇలా ఉండరాదు, ఇలా ఉండాలి....... అని ప్రశ్నించకుండా సదా ప్రసన్నచిత్తులుగా ఉంటారు. ఇటువంటి ప్రశ్నలు మనసులో వచ్చేవారిని ప్రశ్నచిత్తులని అంటారు. ప్రశ్నచిత్తులు ఎప్పుడూ సదా ప్రసన్నంగా ఉండలేరు. వారి మనసులో సదా ఎందుకు, ఏమి అనే ప్రశ్నల క్యూ వస్తూనే ఉంటుంది. అందువలన ఈ ప్రశ్నల క్యూను సమాప్తము

చేయుటలోనే సమయం గడిచిపోతుంది. ఈ ప్రశ్నల క్యూ ఎలా ఉంటుందంటే మీరు వదలాలనుకున్నా వదలలేరు. ఈ ప్రశ్నల కొరకు తప్పకుండా సమయము ఇవ్వాల్సి పడ్తుంది. ఎందుకంటే ఈ ప్రశ్నలను రచించింది మీరే కనుక వాటిని మీరే పాలన చేయాల్సి వస్తుంది. పాలన చెయ్యకుండా తప్పించుకోలేరు. ఎంత వద్దనుకున్నా మీ సమయాన్ని, శక్తిని ఖర్చు పెట్టవలసే వస్తుంది. అందువలన ఈ వ్యర్థ రచనను అదుపు చేయండి. ఈ బర్త్ కంట్రోల్ చేయండి. అర్థమయిందా! ఇలా చేసేందుకు ధైర్యముందా? ఎలాగైతే జనులు ఈ పిల్లలంతా ఈశ్వరుడిచ్చిన సంతానమే, ఇందులో మా తప్పేమీ లేదు అని అంటారో అలా బ్రాహ్మణాత్మలు ఇదంతా డ్రామాలో నిర్ణయించబడింది, మా తప్పేమీ లేదని అంటారు కానీ డ్రామాను రచించే మాస్టర్ క్రియేటర్‌గా, మాస్టర్ నాలెడ్జ్‌ఫుల్‌గా అయ్యి ప్రతీ కర్మను శ్రేష్ఠంగా చేసుకుంటూ వెళ్లండి.

**01-12-1989**

మీ హృదయము హృదయాభిరాముని కొరకే. మీకు ఒకే పని లభించింది - తండ్రిని స్మృతి చేయండి, ఇది చేస్తే చాలు. ఎవరి హృదయంలో తండ్రి ఉంటారో వారు సదా "వాహ్ వాహ్ " అనే పాట పాడుతూ ఉంటారు. హృదయంలో తండ్రి లేకుంటే "హాయ్ హాయ్(అయ్యో అయ్యో)" అనే పాట పాడుతూ ఉంటారు(దు:ఖపడ్తూ ఉంటారు). ప్రపంచములోని వారు "హాయ్ హాయ్" అంటారు, మీరు "వాహ్ వాహ్(భేష్ భేష్)" అంటూ ఉంటారు. స్వయం మీరు కూడా వాహ్-వాహ్(వహ్వా, వహ్వా)గా అయ్యారు, తండ్రి కూడా వాహ్ వాహ్, అంతేకాక డ్రామాలో ఏదైతే నడుస్తూ ఉందో అదంతా వాహ్ వాహ్!. కనుక సదా వాహ్ వాహ్ అనే పాట పాడేవారా లేక ఎప్పుడైనా హాయ్ హాయ్ అని కూడా అంటూ ఉంటారా. మనసులో గానీ, స్వప్నంలో గానీ హాయ్(అయ్యో) అనే మాట వెలువడరాదు. అయ్యో, ఏమిలా జరిగిందే! అని ఎప్పుడైనా అంటూ ఉంటారా? జరిగిపోయిందీ మంచిదే(వాహ్), ఇప్పుడు జరుగుతూ ఉండేదీ మంచిదే(వాహ్), జరగబోయేది కూడా మంచిదే(వాహ్). మూడు కాలాలు కూడా వాహ్ వాహ్!. ఒక కాలము



కూడా చెడ్డది ఉండజాలదు. ఎందుకంటే తండ్రి కూడా అత్యంత మంచివారే, సంగమ యుగము కూడా అన్ని యుగాల కంటే మంచిదే అంతేకాక ఏది ప్రాప్తిస్తూ ఉందో అది కూడా అత్యంత మంచిదే. భవిష్యత్తులో ఏది ప్రాప్తి కానున్నదో అది కూడా అత్యంత మంచిదే. అన్నీ మంచివే జరుగుతాయి కనుక వాహ్ వాహ్! అనే పాట పాడుతూ ఉండండి. ఎక్కడైతే అన్నీ మంచిగా అనిపిస్తాయో, అక్కడ కోరికలేవీ ఉండవు. ఒకవేళ కోరికలున్నాయంటే అది మంచిగా ఉండదు. ఒకవేళ బాగుంటే కోరికలుండవు. ఎందుకంటే అన్నీ ప్రాప్తి అయినప్పుడే అంతా బాగుంది అని అంటారు. ఏదైనా అప్రాప్తి ఉందంటే అక్కడ కోరికలుంటాయి కనుక మీకు ఏదైనా అప్రాప్తి ఉందా? మాతలకు నగలేమైనా కావాలా? బంగారు కావాలా? పాండవులకు లక్షలు, కోట్లు, పదమాలు ఏమైనా కావాలా? ఇవేవీ వద్దా? ఎందుకంటే ఇప్పుడు కోటీశ్వరునిగా అవ్వడమనగా సదా కొరకు కోట్లు పోగొట్టుకోవడం అవుతుంది. ఇప్పుడేం చేస్తారు? ఇది అసత్యపు మాయ, అసత్య శరీరము,........ ఈ అసత్యాలన్నీ ఏం చేసుకుంటారు? శరీర నిర్వహణ కొరకు రొట్టె, పప్పు కోసమైతే చాలా లభిస్తూ ఉంది. ఇక మీదట కూడా లభిస్తూ ఉంటుంది. ఇక ఏం కావాలి? లాటరీ మొదలైనవి ఏమైనా కావాలా? చాలామంది పిల్లలు లాటరీ తగిలితే యజ్ఞంలో ఉపయోగిస్తామని భావిస్తారు. కానీ ఇటువంటి ధనాన్ని యజ్ఞంలో ఉపయోగించకండి. నిజానికి ధనం పై మీకు ఆశ ఉంటుంది కానీ లాటరీ తగిలితే సేవ చేస్తామని అంటారు. ఇప్పుడు మీరు సత్యమైన సంపాదన జమ చేసుకోండి. అలా చేసుకోవాలంటే కోరిక లేనివారిగా(ఇచ్ఛా మాత్రం అవిద్యగా) తయారవ్వండి. ఎందుకంటే కోరికల్లోకి వెళ్లారంటే ఆ కోరికల వెనుక పరిగెడ్తూ ఉంటారు. ఇది ఎటువంటిదంటే ఎండమావుల వంటిది. అందువలన కోరికలు సమాప్తం చేసుకోండి, మంచివారిగా అవుతారు. స్వయం రచయితే మీ వారిగా అయినప్పుడు రచనను పట్టుకొని ఏం చేస్తారు? అనంతమైన దాని ఎదుట పరిమితమైనది ఎలా అనిపిస్తుంది? లెక్కలోకే రాదు. పరిమితిలో చిక్కుకున్నారంటే అనంతమైనది పోయినట్లే(లభించదు).

05-12-1989

చాలామంది పిల్లలు స్వయంతో కూడా అప్రసన్నంగా ఉండడం బాప్‌దాదా గమనించారు. చిన్న-చిన్న విషయాలలో కూడా అప్రసన్నమవుతూ ఉంటారు. మొట్టమొదటి పాఠమైన "నేను ఎవరు" అనేది తెలిసి కూడా మర్చిపోతూ ఉంటారు. తండ్రి ఏదైతే ఇచ్చారో, ఎలా తయారుచేశారో దానిని మర్చిపోతారు. తండ్రి ప్రతీ పుత్రుని తన పూర్తి వారసత్వానికి అధికారులుగా చేశారు. కొంతమందికి పూర్తి వారసత్వము, కొంతమందికి అర్ధం ఇవ్వలేదు. ఎవరికైనా అర్ధ భాగము, నాల్గవ భాగము లభించిందా? అర్ధమే లభించిందా లేక అర్ధమే తీసుకున్నారా? తండ్రి ఏమో అందరికీ మాస్టర్ సర్వశక్తివాన్ అనే వరదానాన్ని లేక వారసత్వాన్ని ఇచ్చారు. అంతేగానీ పిల్లలకు కొన్ని శక్తులను మాత్రమే ఇచ్చి కొన్ని శక్తులు ఇవ్వలేదని కాదు. తన సొంతం కొరకు ఏ శక్తులనూ పెట్టుకోలేదు. సర్వ గుణసంపన్నులుగా చేసారు, సర్వ ప్రాప్తి స్వరూపులుగా చేసారు. అయితే తండ్రి ద్వారా ఏ ప్రాప్తులైతే లభించాయో వాటిని స్వయంలో ఇముడ్చుకోలేకున్నారు. ఎలాగైతే స్థూల ధనము, సాధనాలు ప్రాప్తించినా ఖర్చు చేయడం రాకుంటే లేక సాధనాలను ఉపయోగించడం రాకుంటే ప్రాప్తించినా వాటి నుండి వంచితులుగా ఉండిపోతారో అలా అన్ని ప్రాప్తులు లేక ఖజానాలు అందరి వద్ద ఉన్నాయి. కాని వాటిని కార్యంలో ఉపయోగించే విధానము, సమయానికి ఉపయోగించే విధానము రావడం లేదు. అటువంటి సమయంలో ఈ పని చేయాలి, ఈ పని చేయరాదు అని తెలిసినా మర్చిపోయామని, అలా చేసి ఉండరాదని, ఇప్పుడు నాకు అర్థమయిందని అంటూ ఉంటారు. ఆ సమయము ఒక్క సెకండు గడిచినా సఫలత అనే గమ్యానికి చేరుకోలేరు. ఎందుకంటే సమయమనే రైలు వెళ్లిపోయింది. ఒక సెకండు లేటైనా, ఒక గంట లేటైనా సమయమేమో గడిచిపోయింది కదా. ఎప్పుడైతే సమయమనే రైలు వెళ్లిపోయిందో అప్పుడు స్వయం నిరుత్సాహపడ్తారు. అప్రసన్నతా సంస్కారం ఎమర్జ్ అవుతుంది. అప్పుడు నా భాగ్యమే ఇట్లుంది, డ్రామాలో నా పాత్రనే ఇలా ఉంది అని



అంటూ ఉంటారు. స్వయంతో అప్రసన్నంగా ఉండేందుకు ముఖ్యంగా రెండు కారణాలున్నాయని ఇంతకుముందు కూడా వినిపించాము. మొదటిది - వ్యాకుల పడడం, రెండవది - ఇతరుల విశేషతను లేక భాగ్యాన్ని లేక పాత్రను చూసి ఈర్ష్య చెందడం. ధైర్యము తగ్గిపోతుంది, ఈర్ష్య ఎక్కువవుతుంది. నిరుత్సాహ పడువారు కూడా ఎప్పుడూ ప్రసన్నంగా ఉండలేరు. అదే విధంగా ఈర్ష్య పడువారు కూడా ఎప్పుడూ ప్రసన్నంగా ఉండలేరు. ఎందుకంటే ఈ రెండు రకాల ఆత్మల కోరికలు ఎప్పుడూ పూర్తి కావు. కోరికలుంటే(ఇచ్ఛా) అవి మంచిగా(అచ్ఛా) తయారు కానివ్వవు. అందువలన వారు ప్రసన్నంగా ఉండరు. ప్రసన్నంగా ఉండేందుకు సదా ఒక విషయాన్ని బుద్ధిలో ఉంచుకోండి. డ్రామా నియమానుసారం సంగమ యుగంలో ప్రతీ బ్రాహ్మణాత్మకు ఏదో ఒక విశేషత లభించే ఉంది. మాలలో చివరి 16 వేల నంబరులోని పూసైనా వారికి కూడా ఏదో ఒక విశేషత తప్పక లభించే ఉంది. ఇంకా ముందుకు వెళ్తే 9 లక్షలని గాయనమేదైతే ఉందో వారికి కూడా ఏదో ఒక విశేషత తప్పక లభించే ఉంది. మొదట మీ విశేషతను మీరు గుర్తించండి. ఇప్పుడింకా 9 లక్షల వరకు రాలేదు. కనుక బ్రాహ్మణ జన్మ లభించిన వారి భాగ్యానికి గల విశేషతను గుర్తించండి. ఆ విశేషతను గుర్తించి కార్యంలో ఉపయోగించండి. కేవలం ఇతరుల విశేషతలను చూసి ఈర్ష్య చెందకండి, వ్యాకుల పడకండి కాని మీ విశేషతలను కార్యంలో ఉపయోగిస్తే ఒక్క విశేషత, ఇతర విశేషతలను కూడా తీసుకొస్తుంది. ఒకటి ముందు బిందువులు(సున్నాలు) ఉంచుతూ పోతే విలువ ఎంత పెరుగుతూ పోతుంది? ఒకటి పక్కను ఒక సున్న పెడ్తే పది, మరో సున్న పెడ్తే వంద అయిపోతుంది అలాగే మూడవది ఉంచితే.......... ఈ లెక్క తెలుసు కదా. కార్యంలో ఉపయోగించడమనగా వృద్ధి చేయడం. ఇతరులను చూడకండి, మీ విశేషతలను కార్యంలో ఉపయోగించండి. ఉదాహరణానికి బాప్‌దాదా సదా భోలీ దాదీని(భోలీ భండారి) గురించి చెప్తూ ఉంటారు కదా. మహారథుల పేర్లు ఎప్పుడో ఒకసారి వస్తాయి కాని భోలీ దాదీ పేరు ఎప్పుడూ చెప్తూ ఉంటారు. ఆమెలో ఏ విశేషత ఉండేదో దానిని కార్యంలో

ఉపయోగించింది. వంట ఇంటిని సంభాళించడం చిన్నదిగా కనిపించినా ఆమెలోని విశేషతను కార్యంలో ఉపయోగించినందున విశేష ఆత్మల వలె మహిమ చేయబడింది. మధువనాన్ని వర్ణించినప్పుడు, దాదీల విషయము వినిపించునపుడు భోలీ దాదీ విషయము కూడా వినిపిస్తారు. ఎక్కడా ఉపన్యసించకపోయినా విశేషతను కార్యంలో ఉపయోగించినందున స్వయం ఆమె కూడా విశేష ఆత్మగా అయ్యింది. ఇతరులు కూడా విశేషమైన దృష్టితోనే చూస్తారు. కనుక ప్రసన్నంగా ఉండేందుకు ఏమి చేస్తారు? మీకు గల విశేషతలను కార్యంలో ఉపయోగించండి. అలా ఉపయోగిస్తే వృద్ధి చెందుతాయి. ఎప్పుడైతే అన్నీ వచ్చేస్తాయో అప్పుడు సంపన్నమైపోతారు. ప్రసన్నతకు ఆధారం సంపన్నత. ఎవరైతే స్వయంతో ప్రసన్నంగా ఉంటారో వారు ఇతరులతో కూడా ప్రసన్నంగా ఉంటారు. సేవతో కూడా ప్రసన్నంగా ఉంటారు. ఏ సేవ లభించినా అందులో ఇతరులను ప్రసన్నంగా చేసి సేవలో ముందు నంబరు తీసుకుంటారు. మీరు ప్రసన్నంగా ఉంటే ప్రసన్నంగా కనిపించు మీ మూర్తియే అన్నిటికంటే పెద్ద సేవ చేస్తుంది. కనుక చార్టులో ఏమి చూశారో విన్నారా?

బాల్యము నుండే శ్రేష్ఠ సాంగత్యము లభించిన కుమారీలు డ్రామాలో చాలా అదృష్టవంతులు. ధైర్యము చేశారు కనుక ధైర్యము చేసిన వారికి ఫలము కూడా లభిస్తుంది. మాతలు కూడా కుమారీలను చూసి సంతోషిస్తారు కదా. మేము కూడా ఈ జీవితంలోకి వచ్చి ఉంటే బాగుండేదని మాతలు అనుకుంటారు. కాని అందరి పాత్ర ఒకే విధంగా ఉండదు. వెరైటీ కావాలి కదా. వారు అందరికీ తండ్రి కనుక కుమారులు కూడా కావాలి, కుమారీలు కూడా కావాలి, అధర్ కుమారులు - అధర్ కుమారీలు కూడా కావాలి, అన్ని రకాల వారు కావాలి. కుమారీలుగా అయ్యి ఉంటే టీచర్లుగా అయ్యేవారం, సెంటర్లు లభించేవని పాండవులు అనుకోవడం లేదు కదా. ప్రతి ఒక్కరికి తమ-తమ విశేషత ఉంది. ప్రతి ఒక్కరి విశేషత వేరుగా ఉంది, ఉన్నతంగా ఉంది. ఒకరి పాత్రను ఒకరు చూచి సంతోషంగా ఉండండి. మీ పాత్రను తక్కువైనదిగా భావించకండి. అన్ని పాత్రలు మంచివే.



**13-12-1989**

సదా స్వయాన్ని సంతుష్ట ఆత్మగా అనుభవం చేస్తున్నారా? ఎందుకనగా జ్ఞానీ - యోగీ ఆత్మల గుర్తు - సంతుష్టత. ఎక్కడ సంతుష్టత ఉంటుందో, అక్కడ సర్వ గుణాలు, సర్వ శక్తులు ఉంటాయి. ఏదైనా గుణము లేక శక్తి అప్రాప్తిగా ఉంటే దానికి గుర్తు - అసంతుష్టత. ప్రాప్తులకు గుర్తు - సంతుష్టత. సంతుష్ట ఆత్మ డ్రామాలో ఏ దృశ్యాన్ని చూసినా "వాహ్ - డ్రామా - వాహ్!" అని అంటూ ఉంటుంది. సదా సంతుష్టంగా లేని ఆత్మ అప్పుడప్పుడు వాహ్ వాహ్! అని అంటుంది, అప్పుడప్పుడు అయ్యో అయ్యో!!! అని అంటుంది. ఇదేమిలా జరిగిపోయిందే, ఇదేమిలా అయిందే! ఇలా జరిగి ఉండరాదు అయినా జరిగిపోయింది.......... అని అంటూ ఉంటుంది. కనుక సంతుష్టత ఒక గని వంటిది. అది కూడా అఖండమైన గని, ఖాళీ అయ్యేదేమీ కాదు. ఎంతెంత ఇస్తూ పోతారో అంత వృద్ధి చెందుతూ ఉంటుంది. మీరంతా సంతుష్ట ఆత్మలే కదా. సంతుష్టంగా ఉండేందుకే మరుజీవాగా అయ్యారు. ఇచ్ఛా మాత్రం అవిద్య అనే గాయనం ఎవరిది? దేవతలదా లేక బ్రాహ్మణులదా? దేవతల జీవితంలో కోరిక ఉండడం, కోరిక లేకపోవడం అనే ప్రశ్నే ఉండదు. ఇక్కడ కోరిక ఉండడం, కోరిక లేకపోవడం అంటే ఏమిటో తెలిపే జ్ఞానముంది. జ్ఞాన సహితంగా ఇచ్ఛా మాత్రం అవిద్యగా ఉండుటనే బ్రాహ్మణ జీవితమని అంటారు. ఏ కోరికలు? రచయిత మీ వారైనప్పుడు రచన ఎక్కడికి పోతుంది? రచయితను మీ వారిగా చేసుకున్నారు కదా. మంచిరీతిగా చేసుకున్నారా? ఢీలా ఢీలాగా చేసుకోలేదు కదా? భగవంతుని కూడా త్రాడుతో కట్టేశారని మాతలకు గాయనముంది. కనుక బాగా కట్టేశారా? ఇక్కడ త్రాడు అనగా స్నేహము లేక ప్రేమ అనే త్రాడు. మరి స్నేహమనే త్రాడు గట్టిగా ఉంది కదా. ఇది ఎప్పుడూ తెగిపోరాదు. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఎక్కడ తండ్రి ఉన్నారో, అక్కడ అన్నీ ఉంటాయి. అందుకే తండ్రి లభించారంటే అన్నీ లభించినట్లే అని పాడ్తారు. ఎంత లభించిందంటే అన్ని కోరికలను ప్రోగు చేసినా దాని కంటే పదమారెట్లు ఎక్కువగా లభించింది. ఆ ప్రాప్తి ముందు కోరిక ఏ పాటిది? సూర్యుని

ముందు వెలిగించిన దీపం వంటిది. సర్వ ప్రాప్తుల ముందు ఎంత మంచి కోరికైనా అది దీపానికి సమానమైనదే. అందువలన సదా సంతుష్టంగా ఉంటారు. కోరికనే ప్రశ్నే ఉండదు. కోరిక కలగడం పక్క నుంచి కోరిక ఏమైనా ఉందా అనే ప్రశ్న కూడా రాదు. కోరికకు నామ-రూపాలే లేకుండా సమాప్తమైపోతుంది. ఎందుకంటే అంశ మాత్రం కోరికుండినా అంశం నుండి వంశం జన్మిస్తుంది. కనుక అంశమాత్రం కూడా ఉండరాదు. అందుకే రావణుని ముందు సంహరించి తర్వాత కాలుస్తారు. కాల్చిన తర్వాత సమాప్తం చేసేస్తారు. అంశమాత్రం కూడా ఉండనివ్వరు. కనుక అంశమాత్రం కూడా లేదు కదా? స్థూల రూపంలో రావణుని తలలేవో సమాప్తమైపోయాయి. కానీ సూక్ష్మంలో ఏమైనా ఉన్నాయా? ఏమీ లేవు కదా? కొంతమంది కోరిక లేదు గానీ బాగుందని అంటారని వినిపించాను కదా. స్థూలంగా లేక మాటల్లో కోరిక లేదు అని అంటారు దానినే సూక్ష్మ రూపంలో బాగుందని అంటారు. కనుక బాగుందని అనిపించిందంటే బుద్ధి ఆకర్షింపబడినట్లే కదా. బాగుంది అని అన్నారంటే కోరిక కలుగుతుంది. బాగుంది అని అంటే అన్నీ బాగుండాలి. కానీ ఒక వస్తువే ఎందకు బాగుండాలి లేక ఒక్క వ్యక్తే ఎందుకు బాగున్నారని అనిపించాలి లేక ఒక్క పనే ఎందుకు బాగుండాలి? అన్నీ బాగుండాలి, అందరూ బాగుండాలి. మరి కొంతమంది - ఈ ఆత్మ యోగం బాగా చేస్తుంది, ఈ ఆత్మ బాగా ఉపన్యసిస్తుంది అని అంటారు. కానీ కొన్ని బాగుండడం, కొన్ని బాగా లేకపోవడం ఇది కూడా మంచిది కాదు. ఒకవేళ బాగున్నాయని అనిపిస్తే అవన్నీ తండ్రికి చెందినవే కదా. తండ్రి బాగున్నారని అనిపించాలి కదా. ఒకవేళ ఎవరైనా వ్యక్తి బాగున్నారని అనిపిస్తే కోరికల క్యూ ఏర్పడుతుంది. తండ్రి బాగున్నారని అనిపిస్తే అంశమాత్రం కూడా మాయ రాలేదు. ఒకవేళ ఎవరి గుణాలైనా బాగున్నాయంటే ఆ గుణాలు కూడా తండ్రి ఇచ్చినవే కదా అందువలన తండ్రి ఒక్కరే మంచివారని అనిపించాలి. అలా అనిపిస్తే సదా సంతుష్టంగా ఉంటారు. సూక్ష్మరూపంలో ఉన్న పిల్లా పాపలను లోపల ఉంచుకోరాదు. ఒకవేళ ఈ పిల్లాపాపలు దాగి ఉన్నా సదా సంతుష్టంగా



ఉండలేరు. అనంతమైన సేవ చేసే విషయం వేరు. కానీ స్వయానికి ఇది ఉండాలి, ఇది కావాలి అనే హద్దు విషయాలు అసంతుష్టంగా చేస్తాయి. అనంతము కొరకు ఎంత కావాలంటే అంత ఆలోచించండి కానీ స్వయం పట్ల హద్దులోని విషయాలు కావాలని ఆలోచించకండి. ఇప్పుడు అందరూ సంతుష్ట మణులుగా ఉన్నారా? సంతుష్టమణి అనగా సదా ఆత్మీయతతో ప్రకాశించేవారు.

**21-12-1989**

సదా స్వయాన్ని నిశ్చయబుద్ధి విజయీ ఆత్మనని అనుభవం చేస్తున్నారా? నిశ్చయానికి గుర్తు - విజయం. ఒకవేళ స్వయంలో లేక తండ్రిలో నిశ్చయముంటే విజయం లభించదు అనే మాట అసంభవం. అర్ధ భాగమే విజయం లభించి పూర్తిగా లభించకుంటే అందుకు కారణం నిశ్చయంలో లోపం. నిశ్చయము మరియు విజయము ఇవి రెండూ పక్కా సాథీలు. ఎక్కడ నిశ్చయముంటుందో అక్కడ విజయం తప్పకుండా ఉంటుంది. ఎందుకంటే తండ్రి సర్వశక్తివంతులు అనేది నిశ్చయం. కనుక సర్వశక్తివంతులైన తండ్రి అనే నిశ్చయముంటే విజయం లభించకుండా ఎలా ఉంటుంది? అంతేకాక స్వయంలో కూడా నేను మాస్టర్ సర్వశక్తివాన్ ఆత్మను అని నిశ్చయముంటే విజయమెక్కడకు పోతుంది? నిశ్చయబుద్ధి గలవారు ఎప్పుడూ ఓడిపోరు. నిశ్చయబుద్ధి గలవారు ఇతరులను ఓటమి నుండి విడుదల చేయిస్తారు అటువంటప్పుడు స్వయం ఎలా ఓడిపోతారు? కనుక విజయులుగా అయ్యేందుకు పునాది నిశ్చయం. పునాది పక్కాగా ఉంటే బిల్డింగు కదలదు, నిశ్చింతులుగా ఉంటారు. ఒకవేళ పునాది కచ్చాగా ఉంటే కొద్దిగా తుఫాను వచ్చినా, కొద్దిగా భూమి కంపించినా మా బిల్డింగు పడిపోతుందేమో, చీలికలలొస్తుందేమో(Crack) అని భయముంటుంది. కానీ పునాది పక్కాగా ఉంటే నిర్భయంగా ఉంటారు. అలాగే నిశ్చయమనే పునాది పక్కాగా ఉంటే ఎటువంటి తుఫానైనా కదిలించలేదు. కనుక ఇటువంటి విజయులుగా ఉన్నారా లేక అప్పుడప్పుడు నిశ్చయంలో చీలికలొస్తున్నాయా(Crack) లేక అప్పుడప్పుడు కిటికీలకు, తలుపులకు వేసిన

అద్దాలేమైనా కదులుతున్నాయా? తుఫాను వచ్చినా లేక భూమి కంపించినా ఏమి జరుగుతుంది? ఆందోళన చెందడం లేదు కదా? ఆందోళనలో స్థిరంగా ఉండు వారినే నిశ్చయబుద్ధి విజయీరత్నాలని అంటారు. కేవలం తండ్రిలో నిశ్చయముండుటయే కాక స్వయంలోనూ నిశ్చయముండాలి, డ్రామాలో కూడా నిశ్చయముండాలి. వాహ్ డ్రామా వాహ్! అని డ్రామాలోని దృశ్యాలను చూస్తూ ఉండాలి. డ్రామాలో నిశ్చయముంటే అకళ్యాణకరమైన విషయాలు కూడా కళ్యాణంగా మారిపోతాయి. నిశ్చయంలో ఇంత గొప్ప శక్తి ఉంది. అకళ్యాణకర విషయంగా కనిపిస్తుంది కానీ అందులో కూడా కళ్యాణం దాగి ఉంటుంది. మొదట నిశ్చయాన్ని కదిలించేందుకు ఇటువంటి రూపం వస్తుంది. అయినా మిమ్ములను కదిలించరాదు. ఇంత పక్కాగా ఉన్నారా లేక కొద్ది కొద్దిగా కదుల్తారా? సంకల్పంలో లేక స్వప్నంలో కూడా కదలడం లేదు కదా? ఎందుకనగా సంకల్పంలోనైనా కొద్దిగా బలహీనత వచ్చిందంటే దాని ప్రభావం వాచా పైన పడ్తుంది తర్వాత ఈ ప్రభావం కర్మ పై పడ్తుంది. అందువలన తండ్రి మొదట సంకల్పాన్నే పరివర్తన చేసేశారు. నేను శరీరము కాదు, ఆత్మను అని సంకల్పము చేస్తారు. ఇది శుద్ధమైన సంకల్పము. ఈ సంకల్పముతో జీవితమే పరివర్తనైపోయింది. ఒకవేళ సంకల్పమే బలహీనంగా ఉంటే జీవితమే బలహీనమైపోతుంది.

మూడు నిశ్చయాలు జత జతలో ఉండాలి - తండ్రి, మీరు, డ్రామా. ఎప్పుడూ సంకల్పంలో కూడా మిమ్ములను ఎవ్వరూ కదిలించరాదు. అంగదుని వలె అయిపోండి. మీ కాలి గోటిని కూడా కదిలించరాదు. కాలిని కాదు కదా కాలి గోటిని కూడా మాయ కదిలించరాదు. ఇలా అంగదుని వలె అయిపోండి.

**02-01-1990**

ఈ ఈశ్వరీయ పరివారం ఎంత ప్రియమైనది. సేవ కొరకు ప్రపంచములోని ఆత్మలతో కలిసి ఉంటారు కానీ మనసు సదా అలౌకిక ప్రపంచంలో ఉంటుంది. దీనినే స్మృతి స్వరూపమని అంటారు. ఎటువంటి పరిస్థితి వచ్చినా స్మృతి స్వరూప ఆత్మ సమర్థంగా ఉన్నందున పరిస్థితిని



ఏమని భావిస్తుంది? ఒక ఆటగా భావిస్తుంది. ఎప్పుడూ భయపడదు. ఎంత పెద్ద పరిస్థితి వచ్చినా, సమర్థ ఆత్మలకది గమ్యానికి చేరుకునే దారిలో కనిపించు ప్రక్క దృశ్యాల వంటివి. దారి పక్కన కనిపించే దృశ్యాలు బాగుంటాయి కదా. అటువంటి దృశ్యాలు చూచేందుకు ఎంతో ధనము ఖర్చు చేసి వెళ్లి చూస్తూ ఉంటారు. ఇప్పుడు ఈ రోజులలో ఇక్కడ కూడా ఆబూను దర్శించుటకు వెళ్తున్నారు కదా. ఒకవేళ దారిలో ప్రక్క దృశ్యాలు లేకుంటే ఆ దారి బాగుందనిపిస్తుందా? విసిగిపోతారు. అదే విధంగా స్మృతి స్వరూప సమర్థ స్వరూప ఆత్మ కొరకు పరిస్థితులనండి, పరీక్షలనండి, విఘ్నాలనండి, సమస్యలనండి ఇవన్నీ కేవలం ప్రక్క దృశ్యాలే. గమ్యానికి వెళ్లే దారిలో ఈ ప్రక్క దృశ్యాలను లెక్కలేనన్ని సార్లు దాటుకున్నాను అని స్మృతిలో ఉంటుంది. నథింగ్ న్యూ(క్రొత్తదేమీ కాదు). దీనికి కూడా పునాది ఏమయ్యింది? "స్మృతి". ఒకవేళ ఈ స్మృతిని మర్చిపోయారంటే అనగా పునాది కదిలిందంటే జీవితమనే భవనమంతా కదలడం ప్రారంభిస్తుంది. మీరైతే స్థిరంగా ఉన్నారు కదా.

**06-01-1990**

నాల్గవ విషయం - సంబంధంలో స్వచ్ఛత. సార రూపంలో విశేషంగా ఇది చెక్ చేసుకోండి - సంతుష్టత అనే స్వచ్ఛత ఎంత శాతంలో ఉంది. మొత్తం రోజులో రకరకాల ఆత్మలతో సంబంధం ఏర్పడుతూ ఉంటుంది. మూడు ప్రకారాల ఆత్మలతో సంబంధంలోకి వస్తారు. 1. బ్రాహ్మణ పరివారంలోని ఆత్మలు 2. మీ వద్దకు వచ్చే జిజ్ఞాసు ఆత్మలు 3. లౌకిక పరివారంలోని ఆత్మలు. ఈ మూడు రకాల ఆత్మల సంబంధంలోకి వచ్చినప్పుడు మొత్తం రోజులో స్వయంలో సంతుష్టతా శాతం ఎంత ఉంది, మీ సంబంధంలోకి వచ్చే ఇతర ఆత్మల సంతుష్టత ఎంత శాతంలో ఉంది. సంతుష్టతకు(తృప్తి) గుర్తు - స్వయం మీ మనసు తేలికగా, సంతోషంగా ఉంటుంది, ఇతరుల మనసు కూడా సంతోషంగా ఉంటుంది. అసంతుష్టతకు గుర్తు - స్వయం మీ మనసు కూడా భారంగా ఉంటుంది. సత్యమైన పురుషార్థులుగా ఉంటే వద్దనుకున్నా మాటిమాటికి ఇలా మాట్లాడకుండా

ఉంటే, ఇలా చేయకుండా ఉంటే బాగుండేది అనే సంకల్పం వస్తూ ఉంటుంది. ఇలా మాట్లాడాల్సింది, ఇలా చేయాల్సింది అనే సంకల్పం వస్తూ ఉంటుంది. నిర్లక్ష్యంగా పురుషార్థం చేసేవారికి ఈ సంకల్పం కూడా రాదు. కనుక ఈ భారం సంతోషంగా ఉండనీయదు, తేలికగా ఉండనీయదు. **సంబంధంలో స్వచ్ఛత అనగా సంతుష్టత. ఇదే సంబంధంలో సత్యత మరియు శుభ్రత. అందుకే మీరు సత్యంగా ఉంటే నాట్యం చేస్తూ ఉంటారు (సచ్ తో బిటో నచ్) అనగా సత్యంగా ఉండేవారు సదా సంతోషంగా నాట్యం చేస్తూ ఉంటారు.** కనుక హోలీహంసల నిర్వచనం విన్నారా? ఒకవేళ సత్యత, స్వచ్ఛత లేకుంటే హంసలుగా ఉన్నా హోలీహంసలుగా ఉండరు. కనుక చెక్ చేసుకోండి - సంపన్నము మరియు సంపూర్ణము అని దేనినంటారో అలా ఎంతవరకు తయారయ్యారు. ఒకవేళ డ్రామానుసారం ఈ రోజే ఈ శరీరంతో లెక్కాచారం సమాప్తమైతే ఎంత శాతం మార్కులతో పాసవుతారు లేక డ్రామాతో ఇంకా కొంత సమయం ఉండు అని అంటారా? ఇంకా మేము చిన్నవారమే, ఇప్పుడే వెళ్లేవారము కాదు అని ఆలోచించడం లేదు కదా. ఎవర్‌రెడీ అంటే అర్థమేమి? ఇంకా 10-11 సంవత్సరాలు సమయముంది అని సమయం కొరకు ఎదురు చూడడం లేదు కదా? చాలామంది 2000 సంవత్సరానికి అయిపోతుందనే లెక్కతో ఆలోచిస్తున్నారు కానీ సృష్టి వినాశనమయ్యే విషయం వేరే, మిమ్మలను మీరు ఎవర్‌రెడీగా ఉంచుకునే విషయం వేరే. అందువలన ఈ రెండూ కలిపేయకండి. రకరకాల ఆత్మలకు రకరకాల పాత్రలున్నాయి. అందువలన నాకు అడ్వాన్స్ పార్టీలో పాత్ర లేదని గానీ, వినాశనం తర్వాత నాకు పాత్ర ఉంది అని గానీ ఆలోచించకండి. ఈ పాత్రలు వేరే ఏ ఆత్మలకున్నా నేను ఎవర్‌రెడీగా ఉండాలి అని భావించండి. లేకుంటే నిర్లక్ష్యము, సోమరితనాల అంశము ప్రత్యక్షమైపోతుంది. ఎవర్‌రెడీగా ఉండండి. అప్పుడు కావాలంటే ఇంకా 20 సంవత్సరాలు జీవించి ఉండండి పర్వాలేదు కానీ ఇటువంటి ఆధారం పై ఉండకండి. ఇలా ఎవర్‌రెడీగా ఉన్నవారిని హోలీహంసలని అంటారు. జ్ఞానసాగరుని తీరంలోకి వచ్చారు కదా. కనుక ఈ రోజు హోలీహంసల స్వచ్ఛతను గురించి



వినిపించాము. తర్వాత హోలీహంసల విశేషతలు వినిపిస్తాము.

**10-01-1990**

బొంబాయి సాయన్ సెంటరు టీచర్లు మరియు సోదరులను చూచి బాప్‌దాదా ఇలా అంటున్నారు -(బ్రిజేంద్ర దాదీ శరీరం వదిలినప్పుడు) - మీరంతా కార్యాన్ని సమాప్తం చేసుకొని వచ్చారు. పాసై వచ్చారా లేక పాస్ విత్ ఆనర్ అయ్యి వచ్చారా? మంచి పాత్రను అభినయించారు. ఆ ఆత్మకు స్నేహానికి రిటర్న్ తప్పక ప్రాప్తి అవుతుంది. ఎవరికైతే స్నేహం లభించిందో, వారు ఆ స్నేహానికి రిటర్న్ సమయానికి తప్పక చేస్తారు. చాలామంది ఆత్మలు ఈ సమయంలో కూడా పాత్రను అభినయించే అవసరముంది, కొత్త ప్రపంచం ఆదిలో కూడా వారి పాత్ర ఉంది. కనుక ఏమి చేస్తారు? డ్రామా అయితే నడుస్తూనే ఉంటుంది కదా. కనుక ఇంతవరకు వెళ్లిన ఆత్మలు గానీ లేక ఇప్పుడు వెళ్తూ ఉన్న ఆత్మలు గానీ వారు విశేష ఆత్మలుగా ఉంటే సత్యయుగం ఆదిలో కూడా వారి అవసరముంది. కొత్త ఛాప్టరు ప్రారంభిస్తారు. యోగబలముతో జన్మలు అనే కొత్త ఛాప్టరును ప్రారంభం చేసేందుకు ఎటువంటి ఆత్మలు అవసరము? యోగీ ఆత్మలు కావాలి కదా. వారు వెళ్లేందుకు నెపము ఏదైనా కావచ్చు కానీ లెక్కాచారం చుక్తా కూడా అవ్వాలి, సేవ కూడా జరగాలి. కృష్ణునికి జన్మను ఇచ్చేదెవరు? రాధకు జన్మనిచ్చేదెవరు? అనే ఆలోచనలు ఇప్పుడే చేయకండి. ఈ విస్తారంలోకి వెళ్లకండి. ఇది ఇప్పుడు ఆలోచించే టాపిక్ కాదు. అందుకే కర్మల లీల వాహ్! వాహ్! అని అన్నారు. అంతేకానీ వారికి జన్మ ఎవరిస్తారు అనే విషయంలోకి వెళ్లకండి. మీరు వెళ్లేదానిని గురించి ఆలోచించండి. మంచిది.

సదా ఒక్క బాప్‌దాదా శ్రేష్ఠమైన మతాన్ని గుర్తుంచుకోండి - తండ్రి ఎవరినైతే నిమిత్తంగా చేశారో, ఆ నిమిత్తమైన ఆత్మలు ఏ ఆదేశాన్నిస్తారో దానికి మహత్యమివ్వాలి, దానిని పాటించాలి. అంతేకానీ ఆ సమయంలో నిమిత్తంగా ఉన్న వీరు బహుశా ఎవరైనా చెప్పిన దాని వల్ల నాకిలా చెప్తున్నారని ఆలోచించకండి. అలా అనుకుంటే మోసపోతారు. నిమిత్తంగా

ఉన్న శ్రేష్ఠ ఆత్మల ద్వారా ఏ శిక్షణలు లేక ఆదేశాలు లభిస్తాయో, వాటికి ఆ సమయంలో మహత్వమిచ్చినందు వల్ల ఒకవేళ ఏదైనా దాని వల్ల చెడు జరిగినా అందుకు మీరు బాధ్యులు కారు. బ్రహ్మాబాబా విషయంలో కూడా బ్రహ్మా ద్వారా ఏదైనా తప్పు జరిగితే అది మీకు మంచిదిగానే మారిపోతుందని సదా చెప్తారు కదా. కనుక అదే విధంగా నిమిత్తంగా అయిన ఆత్మల పట్ల ఎప్పుడూ వ్యర్థ సంకల్పాలు చేయకండి. మీ మనసుకు నచ్చని ఏదైనా ఒక నిర్ణయాన్ని తీసుకున్నారనుకోండి, అందులో మీకు ఏ బాధ్యతా లేదు. మీకు ఏ పాపమూ అంటదు. మీ పని సరిగ్గా జరిగిపోతుంది. ఎందుకంటే తండ్రి కూర్చుని ఉన్నారు. తండ్రి పాపాన్ని మంచిగా మార్చేస్తారు. ఇది నిగూఢమైన రహస్యము. గుప్త మెషినరీ. అందువలన నిమిత్తంగా ఉన్న శ్రేష్ఠ ఆత్మల శ్రేష్ఠ ఆదేశాలను గౌరవించి కార్యంలో ఉపయోగించండి. ఇందులో మీకు లాభముంది, నష్టము కూడా పరివర్తన చెంది లాభదాయకమౌతుంది. ఇది తండ్రి ఇచ్చే గ్యారెంటీ. అర్థమయిందా? అందువలన కర్మల లీల చాలా విచిత్రమని వినిపించాము. బాధ్యతంతా తండ్రిదే. ఎవరిని నిమిత్తంగా చేశారో, వారి బాధ్యత కూడా తండ్రిదే. మీ పాపాన్ని మార్పు చేసే బాధ్యత కూడా వారిదే. ఊరికే మిమ్ములను నిమిత్తంగా చేయలేదు. ఆలోచించి, అర్థం చేసుకొని డ్రామా నియమానుసారం నిమిత్తంగా చేయబడ్డారు. ఇందులో లాభముంది. భారం తేలికైపోతుంది. ఏమి జరిగినా, ఏ మాట వచ్చినా నిమిత్తంగా ఉన్న పెద్దలకు తెలుసు అని అంటారు. కనుక తేలికైపోయారు కదా. కానీ కేవలం అనడం వరకే కాదు, స్నేహంతో అర్థం చేసుకుని, స్వమానంలో ఉండాలి. ఈ గుహ్యమైన విషయాలు తండ్రికి తెలుసు, వారి వివేకవంతులైన పిల్లలకు తెలుసు. నిమిత్తంగా ఉన్న ఆత్మలను ఏమైనా అంటే, అది తండ్రిని అన్నట్లే అవుతుంది. నిమిత్తంగా చేసింది తండ్రే కదా. మీలో తండ్రి కన్నా ఎక్కువ పరిశీలనా శక్తి ఉందా?

**18-01-1990**

ఈ రోజు మాత - పితలు తమ పిల్లల శ్రేష్ఠ భాగ్యాన్ని మహిమ చేస్తున్నారు. ఎందుకంటే ఈ రోజు విశేషంగా సూర్యుడు చంద్రునికి



వెన్నెముకగా అయ్యి నక్షత్రాలను విశ్వమనే ఆకాశంలో ప్రత్యక్షం చేసే రోజు. ఎలాగైతే యజ్ఞ స్థాపన జరిగిన ఆది సమయంలో బ్రహ్మాబాబా పిల్లల ముందు తమ సర్వస్వాన్ని సమర్పణ చేశారో అనగా వీలునామా వ్రాశారో, అలా ఈ రోజు బ్రహ్మాబాబా తన పిల్లలకు సర్వశక్తులను విల్లు చేసి ఇచ్చారు అనగా విల్‌పవర్ ఇచ్చేశారు. ఈ రోజు కనుల ద్వారా, సంకల్పం ద్వారా తండ్రి పిల్లలకు విశేషంగా సన్ షోస్ ఫాదర్(కొడుకు తండ్రిని ప్రత్యక్షం చేస్తాడు) అనే విశేష కానుకను ఇచ్చారు. ఈ రోజు ప్రత్యక్ష సాకార రూపంలో తండ్రి కరావన్‌హార్(చేయించే) పాత్రను అభినయించే ప్రత్యక్ష రూపాన్ని చూపించారు. బ్రహ్మాబాబా కూడా ఈ రోజు ప్రత్యక్ష రూపంలో చేయించే తండ్రికి సాక్షిగా అయ్యారు. చేసేందుకు పిల్లలను నిమిత్తంగా చేసి, వారిని కరన్‌హార్(చేసేవారిగా) చేశారు. చేయించే తండ్రికి సాక్షిగా అయ్యారు. ఈ రోజు బ్రహ్మాబాబా తాను సేవ చేసే రీతిని, గతిని పరివర్తన చేశారు. ఈ రోజు విశేషంగా బ్రహ్మాబాబా స్థూల దేహాన్ని వదిలి సూక్ష్మ ఫరిస్తా స్వరూపాన్ని ధరించి పైనున్న సూక్ష్మవతన నివాసిగా అయ్యారు. ఎందుకు? పిల్లలను తీవ్ర వేగంతో ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు, పిల్లలను ఫరిస్తా రూపము ద్వారా ఎగిరించేందుకు. అందుకే ఈ రోజుకు ఇంత శ్రేష్ఠమైన మహత్వముంది. కేవలం స్నేహపూర్వక దినమే కాదు, విశ్వములోని ఆత్మలు, బ్రాహ్మణాత్మలు, సేవా వేగము పరివర్తనగుట డ్రామాలో నిశ్చితమై ఉంది. అది పిల్లలు కూడా చూస్తున్నారు. విశ్వములోని ఆత్మల పట్ల బుద్ధివంతుల బుద్ధిగా అయ్యారు. బుద్ధి పరివర్తనవుతుంది. సంపర్కములోకి వస్తారు, సహయోగములోకి వస్తారు. బ్రాహ్మణాత్మలలో శ్రేష్ఠ సంకల్పం ద్వారా తీవ్ర వేగంతో వృద్ధి జరిగింది. సేవ పట్ల "సన్ షోస్ ఫాదర్" అనే కానుక ద్వారా విహంగమార్గ సేవను ప్రారంభము చేశారు. ఈ కానుక సేవలో ఒక లిఫ్ట్‌గా అయ్యింది. పరివర్తన జరిగింది కదా. ఇప్పుడింకా పోను పోను సేవలో పరివర్తన చూస్తారు.

ఇంతవరకు బ్రాహ్మణాత్మలైన మీరు మీ తనువు, మనసుల శ్రమ ద్వారా ప్రోగ్రామ్‌లు చేస్తున్నారు. ఆహ్వానాల కార్డులు ప్రింట్ చేయిస్తున్నారు.

ఎవరైనా వి.ఐ.పిలను పిలుస్తున్నారు. రేడియో, టి.వీ వారిని సహయోగులుగా చేసుకుంటున్నారు. ధనము కూడా ఖర్చు చేస్తున్నారు. అయితే పోను పోను స్వయం మీరే వి.ఐ.పి లుగా అవుతారు. మీ కంటే గొప్ప వారెవ్వరూ ఉండరు, కనిపించరు. రెడీగా తయారు చేసిన స్టేజి పైకి ఇతరులు మిమ్ములను ఆహ్వానిస్తారు. తమ తనువు-మనసు-ధనాలతో సేవ చేసి వారంతకు వారే మిమ్ములను రమ్మని ఆఫర్ చేస్తారు. మిమ్ములను ప్రార్థిస్తారు. మీరు కష్టపడరు. మీరు మా వద్దకు రండి అని వారే ప్రాధేయపడ్తారు. అప్పుడే ప్రత్యక్షతా శబ్ధము పెద్దగా వ్యాపిస్తుంది. అందరి అటెన్షన్ పిల్లలైన మీ ద్వారా తండ్రి వైపుకు వెళ్తుంది. ఇది చాలా సమయం జరగదు. అందరి దృష్టి తండ్రి వైపు వెళ్లడం అనగా ప్రత్యక్షమవ్వడం. నలువైపులా జయ జయ ధ్వనుల గంటలు మ్రోగుతాయి. ఈ సూక్ష్మ రహస్యం డ్రామాలో తయారై ఉంది. ప్రత్యక్షత తర్వాత అనేకమంది ఆత్మలు పశ్చాత్తాపపడ్తారు. అయితే పిల్లల పశ్చాత్తాపము, దు:ఖము తండ్రి చూడలేరు. అందువలన త్వరగా పరివర్తనైపోతుంది. ఇప్పుడు బ్రాహ్మణాత్మలైన మీ ఉన్నత స్థితి సదా కాలానికి తయారవుతూ ఉంది. మీ ఉన్నతమైన స్థితి సేవ చేసే స్టేజి పైకి ఆహ్వానమును ఇప్పిస్తుంది. అనంతమైన స్టేజి పై జయ జయ ధ్వనుల పాత్ర చేస్తారు. సేవ ఎలా పరివర్తనవుతుందో విన్నారా?

తండ్రి అవ్యక్తమగుట డ్రామాలో ఇమిడి ఉన్న గుప్తమైన రహస్యము. చాలామంది పిల్లలు బ్రహ్మాబాబా కనీసం చెప్పి వెళ్లి ఉండవచ్చు కదా(శెలవు తీసుకొని వెళ్లి ఉండవచ్చు కదా) అని అనుకుంటారు. అప్పుడు మీరు వెళ్లనిచ్చేవారా (శెలవు ఇచ్చేవారా)? వెళ్లనివ్వరు, శెలవు ఇవ్వరు కదా. కనుక శక్తివంతులెవరు? మీ వద్ద శెలవు తీసుకుని ఉంటే కర్మాతీతులుగా అవ్వలేరు. ఎందుకంటే రక్త సంబంధము కంటే ఆత్మిక సంబంధము పదమారెట్లు గాఢమయ్యింది. బ్రహ్మ కర్మాతీతముగా అవ్వాల్సి ఉంది లేక స్నేహ బంధనములోకి వెళ్లాలా? బ్రహ్మాబాబాను కూడా - డ్రామా కర్మాతీతులుగా చేయు బంధనములో బంధించింది. అది కూడా ఎంత సమయంలో బంధించింది! సమయముంటే పాత్ర వేరే విధంగా ఉండేది. అందువలన



ఒక ఘడియలో ఆట అయిపోయింది. పిల్లలను కూడా అమాయకంగా చేసేసింది, తండ్రిని కూడా అమాయకంగా చేసేసింది. దీనినే "వాహ్ డ్రామా వాహ్!" అని అంటారు. అంతేకదా. "వాహ్ డ్రామా వాహ్!" అని అనుకుంటే ఏ సంకల్పమూ రాదు. ఫుల్‌స్టాప్ పెట్టేశారు కదా. లేకుంటే పిల్లలు ఏం జరుగుతూ ఉందని అడగవచ్చు కదా. కానీ తండ్రి కూడా మౌనమే, పిల్లలు కూడా మౌనమే, ఎవ్వరూ ఏమీ మాట్లాడలేకపోయారు. దీనినే డ్రామా యొక్క ఫుల్‌స్టాప్ అని అంటారు. ఆ సమయంలో ఫుల్‌స్టాప్ పెట్టబడింది కదా. జరిగిపోయిన తర్వాత ప్రశ్నలు భలే ఎన్నైనా వచ్చి ఉండవచ్చు కానీ ఆ ఘడియలో ఏ ప్రశ్నలూ రాలేదు. అందుకే "వాహ్ డ్రామా వాహ్!" అని అంటారు కదా. బాబా అని తర్వాత పిలిచారు, ముందు పిలవలేదు. ఈ విచిత్రము డ్రామాలోని నిశ్చితము. జరగాల్సే ఉండినది. జరిగే తీరాలి. పరివర్తనశీలి అయిన డ్రామా పాత్రను కూడా పరివర్తన చేసేస్తుంది.

**22-02-1990**

ఈ రోజు శివబాబా ప్రతీ పుత్రుని మస్తకము పై మూడు తిలకాలు చూస్తున్నారు. పిల్లలందరూ హృదయపూర్వక ఉమంగ-ఉత్సాహాలతో త్రిమూర్తి శివజయంతిని ఆచరించుటకు వచ్చారు. కనుక త్రిమూర్తి శివబాబా అనగా జ్యోతిర్బిందువైన తండ్రి పిల్లల మస్తకము పై మూడు బిందువుల తిలకాన్ని చూసి హర్షిస్తున్నారు. మొత్తం జ్ఞాన సారమంతా ఈ తిలకమే. మూడు బిందువులలో మొత్తం జ్ఞాన సారమంతా ఇమిడి ఉంది. మొత్తం జ్ఞాన సారమంతా మూడు మాటలలోనే ఉంది - పరమాత్మ, ఆత్మ మరియు డ్రామా అనగా రచన. ఈ స్మృతి-చిహ్న దినము కూడా శివునిదే అనగా బిందువుదే. తండ్రి బిందువే, మీరు కూడా బిందువే, రచన అనగా డ్రామా కూడా బిందువే. కనుక బిందువులైన మీరంతా బిందు జయంతిని జరుపుకుంటున్నారు. బిందువుగా తయారై జరుపుకుంటున్నారు కదా! మొత్తం ప్రకృతి ఆట కూడా రెండు మాటలదే - ఒకటి బిందువుది, రెండవది లైట్ అనగా జ్యోతిది. తండ్రిని కేవలం బిందువు అని అనరు, జ్యోతిర్బిందువు అని అంటారు. రచయిత కూడా జ్యోతిర్బిందువే, హీరో పాత్రధారులైన మీరు

కూడా జ్యోతిర్బిందువులే, కేవలం బిందువు కాదు. మొత్తం ఆట కూడా గమనించండి - ఏ పని చేసినా అందుకు ఆధారము లైటే. ఈ రోజు ప్రపంచంలో లైట్ ఫెయిలైపోతే ఒక సెకండులో ప్రపంచము, ప్రపంచముగా అనిపించదు. సుఖ సాధనాలన్నింటికీ ఆధారమేది ? లైటు. స్వయం రచయిత కూడా లైటే. ఆత్మ, పరమాత్మల లైటు అవినాశి. ప్రకృతికి ఆధారము కూడా లైటే కాని ప్రకృతి యొక్క లైటు అవినాశి కాదు. కనుక మొత్తం ఆట అంతా బిందువు మరియు లైటు పైననే ఉంది.

**01-03-1990**

సదా మీ మనసులో తండ్రి గుణాలను గానము చేస్తూ ఉంటారు కదా. ఈ పాట పాడడం అందరికీ వచ్చు కదా? బ్రాహ్మణులుగా అయ్యారంటే ఈ పాట స్వతహాగా మ్రోగుతూ ఉంటుంది. ఇది ఎంత మధురమైన పాట! సంతోషంగా పాడే పాట, దు:ఖము లేక వియోగముతో పాడే పాట కాదు. ఇది యోగయుక్తంగా అయ్యే పాట. ఈ పాట యోగయుక్త ఆత్మలే పాడగలరు. దు:ఖములో ఉన్న ఆత్మలు పాడలేరు. ఆ పాట ఏది? - "వాహ్ బాబా వాహ్", "వాహ్ నేను శ్రేష్ఠమైన ఆత్మా వాహ్", "వాహ్ డ్రామా వాహ్" కనుక వాహ్ వాహ్ అనే పాట పాడండి. అయ్యో, అయ్యో(హాయ్ హాయ్) అనే పాట కాదు. ఇంతకుముందు అయ్యో - అయ్యో అనే పాట పాడేవారు. ఇప్పుడు వాహ్ వాహ్ అనే పాట పాడుతున్నారు. ఏమి జరిగినా మీ మనసు ద్వారా వాహ్ అనే పాట వెలువడుతుంది. హాయ్ అనే పాట వెలువడదు. ప్రపంచము ఏ విషయానికైతే హాయ్ హాయ్ అని అంటుందో, అదే విషయము మీకు వాహ్ వాహ్‌గా ఉంటుంది. కనుక మీరంతా ఈ పాట పాడుతున్నారు కదా! ఇది మనసు పాడే పాట, నోటితో పాడే పాట కాదు. ఏదైనా జరిగితే మీకు 'నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు)', ఈ దృశ్యము అనేకసార్లు రిపీట్ చేశాము అనే జ్ఞానముంది. నథింగ్ న్యూ అనే స్మృతి ద్వారా ఎప్పుడూ ఆందోళన చెందరు, సదా అచలంగా, స్థిరంగా ఉంటారు. ఏదైనా కొత్త విషయమైతే ఆశ్చర్యంగా ఇదేమిటి? ఇలా జరుగుతుందా? అనే మాటలు వెలువడతాయి. కానీ నథింగ్ న్యూ అయితే ఎందుకు? ఏమి? అనే ప్రశ్నలే ఉండవు. ఫుల్‌స్టాప్



వచ్చేస్తుంది. కనుక మీరు ఫుల్‌స్టాప్ పెట్టేవారా లేక ప్రశ్నలు వేసేవారా లేక ప్రశ్నార్థకముంచేవారా? అన్నిటికంటే సులభమైనది బిందువు. చిన్నపిల్లలు కూడా, వారి చేతికి పెన్సిల్ ఇస్తే మొదట బిందువు పెట్టేస్తారు. కనుక ఫుల్‌స్టాప్ పెట్టేయండి. ఫుల్‌స్టాప్ అనగా బిందువు. ప్రశ్నార్థకము పెట్టడం కష్టము. ఫుల్‌స్టాప్ పెట్టడం వచ్చినవారు ఫుల్ పాస్ అవుతారు. మరి మీరు ఫుల్ పాస్ అయ్యేవారా లేక నెట్టడం ద్వారా పాస్ అయ్యేవారా? పాస్ అవ్వాలంటే ఫుల్‌గా పాస్ అవ్వండి. నెట్టడం వలన పాస్ అయ్యే వారిని పాస్ అని అనరు. అచ్ఛా. ఎక్కడ ఉండినా, మీ అందరి మనసు ఎక్కడ ఉంటుంది? సేవకు నిమిత్తంగా భలే వేరే వేరే స్థానాలలో ఉంటారు కానీ మనసు మధువనంలో ఉంటుంది కదా. మధువనం అనగా మధురంగా ఉండేవారు కదా లేక ఎప్పుడైనా పిల్లల పై కోపపడుతున్నారా? పాండవులకు ఆఫీసులో ఎప్పుడైనా కోపము వస్తుందా? పనులు చేయునప్పుడు కోపము చేసుకుంటున్నారా లేక మధురంగా ఉంటున్నారా? మాతలు ఎప్పుడూ ఎవ్వరి పైనా కోపపడడం లేదు కదా. పిల్లల పై గానీ, పెద్దల పై గానీ కోపపడుట లేదు కదా? మాతలకు కోపమొస్తూ ఉందా?(అప్పుడప్పుడు పిల్లల పై కోపమొస్తుంది). కనుక వారిని పిల్లలుగా భావించకండి. పిల్లలంటేనే వివేకము లేనివారు. పెద్దవారు కారు కదా, పిల్లలు. అరిచినందున పిల్లలు ఎప్పుడూ మారరు. కేవలం అణిగి ఉంటారు, పరివర్తన అవ్వరు. ఈ రోజు మీరు వారిని అరుస్తారు, కోపగించుకుంటారు. రేపు వారు కూడా ఇతరులను అలాగే అరుస్తారు, కోపగించుకుంటారు. కనుక మీరు వారికి అరవడం నేర్పిస్తున్నారు. పరివర్తన తీసుకురావడం లేదు, కానీ నేర్పిస్తున్నారు. ఎంతవరకు అణిగి ఉంటారు. ఒక గంటసేపు అణిగి కూర్చుంటారు, మళ్లీ ఎలా ఉండేవారు అలాగే ఉండిపోతారు. అందువలన ఎటువంటి పిల్లలైనా, అజ్ఞానులైనా, పెద్దవారు గానీ ఆ సమయంలో అజ్ఞానులే కదా! అజ్ఞానులు, అమాయకుల పై ఎప్పుడూ కోపగించుకోరు, దయ చూపుతారు. కనుక తండ్రిని అనుసరించండి. బాప్‌దాదా ఎప్పుడైనా కోప్పడ్తారా? మీరు తప్పులు చేస్తారు, పదే పదే తప్పులు చేస్తారు, విస్మృతిలోకి

వస్తారు కదా! అప్పుడు తండ్రి ఏమైనా కోప్పడ్తున్నారా? మరి మీరెందుకు కోప్పడ్తారు? తండ్రి ముందు పెద్ద పెద్ద వారైన మీరు కూడా పిల్లలే కదా. ఎలాగైతే తండ్రి దయాసాగరులో, అలా మీరు మాస్టర్ దయాసాగరులు. సదా శుభ భావన, శుభ కామనల ద్వారా పరివర్తన చేయండి. తండ్రి ఎలా పరివర్తన చేశారు? మీరు శ్రేష్ఠ ఆత్మలు, బ్రాహ్మణాత్మలు అని శుభ భావన ఉంచారు. దాని వలననే పరివర్తనైపోయారు కదా! కనుక ఫాలో ఫాదర్(తండ్రిని అనుసరించండి). మొదట నేను ఎన్ని తప్పులు చేస్తున్నాను అని స్వయాన్ని చూసుకోండి. తర్వాత తండ్రి ఏమి చేస్తారో, ఆ స్థానంలో ఉండి చూడండి. అలా చేస్తే ఎప్పుడూ కోపం రాదు. అర్థమయ్యిందా! శుభ భావన, శుభ కామనల దృష్టి ద్వారా స్వయం మీరు కూడా సంతుష్టంగా ఉంటారు. అనుభవముంది కదా! సంతుష్టముగా ఉండుటే సంతుష్ట పరచుట. ఏమి జరిగినా, ఎవరు ఎంతగా కదిలించేందుకు ప్రయత్నించినా మీరు సంతుష్ఠంగా ఉండాలి, ఇతరులను సంతుష్టపరచాలి. సదా ఇది స్మృతిలో ఉండాలి. ఇది బాగుంటుంది కదా. సంతుష్టంగా ఉండేవారు సదా మనోరంజనంలో ఉంటారు. అనగా వారి మనసు సదా సంతోషంగా ఉంటుంది. కనుక ఈ వరదానాన్ని స్మృతిలో ఉంచుకోండి. బ్రాహ్మణులనగా సంతుష్ట ఆత్మలు. అసంతుష్టత - బ్రాహ్మణ జీవితము కాదు. అచ్ఛా.

**07-03-1990**

బాప్‌దాదా ఈ రోజు చిరునవ్వు నవ్వుతూ ఉన్నారు. పిల్లలలో మూడు శబ్దాల కారణంగా కంట్రోలింగ్ పవర్, రూలింగ్ పవర్ తగ్గిపోతుంది. ఆ మూడు శబ్దాలు 1. ఎందుకు(వై/Why) 2. ఏమిటి(వాట్/What) 3. కావాలి(వాంట్/Want). ఈ మూడు శబ్దాలను సమాప్తం చేసి ఒకే శబ్దం చెప్పండి. వై వచ్చినా వాహ్ అని అనండి, వాట్ వచ్చినా వాహ్ అని అనండి. వాహ్ అని అనడం వస్తుంది కదా. "వాహ్ బాబా, వాహ్ నేను, వాహ్ డ్రామా". కేవలం వాహ్ అని అన్నట్లయితే ఈ మూడు శబ్దాలు సమాప్తమైపోతాయి. బాప్‌దాదా ఎటువంటి ఆటను చూశారో, ఆ రోజు కూడా వినిపించారు కదా! ఇంతకుముందు మీ అందరిదీ ఒక చిత్రం



తయారయ్యింది. అందులో యోగి యోగాన్ని జోడిస్తున్నారు, బుద్ధిని ఏకాగ్రం చేస్తున్నారు, బ్యాలన్స్ ఉంచుతున్నారు. బ్యాలన్స్ కొరకు త్రాసును చూపించారు. బుద్ధిని ఎంత ఎక్కువగా బ్యాలన్స్ చేస్తారో, అంత ఎక్కువగా ఏదో ఒక కోతి వచ్చి కూర్చుంటుంది. ఈ మూడు విషయాలనే కోతులు వచ్చేస్తే బ్యాలన్స్ ఏమవుతుంది? అలజడి అయిపోతుంది. బ్యాలన్స్ ఉండదు. కావున ఈ మూడు శబ్దాలు బ్యాలన్స్‌ను సమాప్తం చేసేస్తాయి. బుద్ధిని నాట్యం చేయిస్తాయి. కోతి విశ్రాంతిగా కూర్చోగలుగుతుందా? ఇంకేమీ చేయకపోయినా తన తోకనైనా కదిలిస్తూ ఉంటుంది. అలాగే ఇందులో కూడా బ్యాలన్స్ లేని కారణంగా తండ్రి ద్వారా ప్రతీ అడుగులో లభించే ఆశీర్వాదాలు లేక ఆత్మిక స్నేహము మరియు పరివారం ద్వారా లభించే ఆశీర్వాదాలను పొందుట నుండి వంచితులైపోతారు. ఎలాగైతే తండ్రితో సంబంధముంచుకోవడం ఎంత అవసరమో అలా ఈశ్వరీయ పరివారంతో సంబంధముంచుకోవడం చాలా అవసరం. మొత్తం కల్పములో నంబరువన్ ఆత్మ అయిన బ్రహ్మాబాబా మరియు ఈశ్వరీయ పరివారం - ఇరువురి సంబంధ-సంపర్కములోకి రావాలి. అచ్ఛా, 'తండ్రి మనవారు అని, మనం బాబావారము' అని అనుకోరాదు. ఇది కూడా పాస్ విత్ ఆనర్ అయ్యేవారి గుర్తు కాదు. ఎందుకనగా మీరు సన్యాసి ఆత్మలు కాదు, ఋషి-ముని ఆత్మలు కూడా కాదు, తప్పించుకునేవారు కాదు కానీ విశ్వానికి అధికారులుగా అయ్యే ఆత్మలు. విశ్వానికి దూరంగా ఉండేవారు కాదు, విశ్వకళ్యాణకారులు. బ్రాహ్మణాత్మల విషయాన్ని వదిలేయండి, ప్రకృతిని కూడా పరివర్తన చేసేందుకు ఆధారము మీరే. పరివారములోని అవినాశి ప్రేమ అనే దారము నుండి వెళ్ళిపోజాలరు. విజయీ రత్నాలు ప్రేమ అనే దారము నుండి బయట పడలేరు. అందువలన ఎప్పుడూ ఏ విషయంలోనైనా, ఏ స్థానంలోనైనా, ఏ సేవలోనైనా, ఎవరి నుండి అయినా దూరంగా ఉండి తమ స్థితిని మంచిగా తయారు చేసుకొని చూపించాలనే సంకల్పము చేయకండి. మేము వీరితో కలిసి నడవలేము, వారితో కలిసి నడుస్తాము, ఈ స్థానంలో ఉన్నతి జరగదు, వేరే స్థానంలో జరుగుతుంది, ఈ సేవలో విఘ్నముంది,

వేరే సేవ బాగుంటుంది అని అంటారు కదా! ఇవన్నీ తప్పించుకునేందుకు మాట్లాడే మాటలు. ఒకవేళ ఒకసారి మీకు ఈ అలవాటు అయ్యిందంటే అది మిమ్మలను ఎక్కడా నిలబడనివ్వదు, బుద్ధిని ఏకాగ్రంగా ఉండనివ్వదు. ఎందుకంటే బుద్ధిని మార్చే అలవాటు అయిపోయింది. ఇది కూడా లోపంగానే లెక్కించబడ్తుంది. ఉన్నతిగా పరిగణించబడదు. సదా తమలో శుభమైన ఆశలను ఉంచుకోండి. నిరాశ చెందకండి. ఎలాగైతే తండ్రి ప్రతీ పుత్రుని పై శుభమైన ఆశలు ఉంచుకున్నారో, ఆఖరి నంబరువారితో కూడా ఎప్పుడూ నిరుత్సాహంగా అవ్వలేదో, సదా ఆశ ఉంచుకున్నారో, అలా మీరు కూడా స్వయంతో గానీ, ఇతరులతో గానీ, సేవలో గానీ, నిరాశగా నిరుత్సాహంగా అవ్వకండి. దిల్‌షాహ్‌గా అవ్వండి. షాహ్ అనగా సదా విశాల హృదయము గలవారిగా, సదా గొప్ప మనసు గలవారిగా అవ్వండి. ఎలాంటి బలహీన సంస్కారాలను ధారణ చేయకండి. మాయ భిన్న-భిన్న రూపాలతో బలహీనంగా చేసే ప్రయత్నం చేస్తుంది. కానీ మీరు మాయ గురించిన జ్ఞానము తెలిసినవారే కదా లేక సగం జ్ఞానమే ఉందా? మాయ కొత్త కొత్త రూపాలలో వస్తుంది, పాత రూపంలో రాదని కూడా గుర్తుంచుకోండి. ఎందుకంటే వీరు గుర్తిస్తారని దానికి కూడా తెలుసు. విషయమేమో అదే ఉంటుంది, కానీ కొత్త రూపాన్ని ధరిస్తుంది. అర్థమయ్యిందా!

**31-12-1990**

మేము చలించని, స్థిరమైన ఆత్మలము అని అనుభవం చేస్తున్నారా? ఒకవైపు అలజడి, రెండవ వైపు బ్రాహ్మణ ఆత్మలైన మీరు సదా అచంచలంగా ఉన్నారు. ఎంతగా అక్కడ అలజడి ఉంటుందో, అంతగా మీలో అచంచలమైన, స్థిరమైన స్థితిని అనుభవం చేయడం పెరుగుతూ ఉంటుంది. ఏమి జరిగినా 'నథింగ్ న్యూ' - ఇదే అన్నిటికన్నా సహజ యుక్తి. ఏదీ కొత్త విషయం లేదు. అప్పుడప్పుడు ఇదేమిటి ఇలా జరుగుతూ ఉంది అని ఆశ్చర్యం కలుగుతుంది. ఏమవుతుంది? కొత్త విషయమైతే ఆశ్చర్యం కలుగుతుంది. ఏదైనా ఆలోచించని విషయం గానీ, వినని విషయం గానీ, అర్థం చేసుకోలేని విషయం గానీ అకస్మాత్తుగా జరిగితే



ఆశ్చర్యమనిపిస్తుంది. నథింగ్ న్యూ కనుక ఆశ్చర్యపడరాదు, ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రపంచంలోనివారు తికమక పడేవారు, మీరు ఆనందంగా ఉండేవారు. ప్రపంచంలోని వారు చిన్న చిన్న విషయాలకు ఏమి చేయాలి, ఎలా చేయాలి? అని తికమకపడ్తున్నారు కానీ మీరు సదా ఆనందంగా ఉన్నారు. తికమకపడడం సమాప్తమైపోయింది. బ్రాహ్మణులు అనగా ఆనందంగా ఉండేవారు. క్షత్రియులు అనగా అప్పుడప్పుడు ఆనందంగా, అప్పుడప్పుడు తికమకపడేవారు. మీరందరూ మీ పేరే బ్రహ్మకుమారీ - బ్రహ్మకుమారులమని చెప్తారు. క్షత్రియ కుమారీ - క్షత్రియ కుమారులుగా అయితే లేరు కదా. సదా మీ భాగ్యాన్ని తల్చుకుంటూ సంతోషంగా ఉండేవారు. మనసులో స్వతహాగా ఒకే పాట - 'వాహ్ బాబా' 'వాహ్ నా భాగ్యము' అని మ్రోగుతూ ఉంటుంది. ఈ పాటను మ్రోగించే అవసరం ఉండదు. ఇది అవినాశిగా మ్రోగుతూనే ఉంటుంది. అయ్యో, అయ్యో అనడం సమాప్తమైపోయింది. ఇప్పుడు వాహ్ వాహ్ అని అనేవారిగా ఉన్నారు. అయ్యో, అయ్యో అనేవారు చాలామంది ఉన్నారు. వాహ్ వాహ్ అనే మీరు చాలా కొద్దిమందే ఉన్నారు. కావున కొత్త సంవత్సరంలో ఏమి గుర్తుంచుకుంటారు? 'వాహ్ వాహ్'. ఎదురుగా ఏమి చూసినా, ఏమి విన్నా, ఏం మాట్లాడినా - అన్నింటిలో వాహ్ వాహ్, అయ్యో అయ్యో కాదు. అయ్యో ఇదేమి ఇలా జరిగింది! అని కాదు, వాహ్ చాలా మంచిదే జరిగింది. ఎవరైనా చెడు చేసినా మీరు మీ శక్తితో చెడును మంచిగా మార్చేయండి. పరివర్తన అంటే ఇదే కదా! మీ బ్రాహ్మణ జీవితములో చెడు జరగనే జరగదు. ఎవరైనా నిందించినా బలిహారమంతా నిందించేవారిదే ఎందుకంటే వారు సహనశక్తి అనే పాఠాన్ని చదివించారు. బలిహారి అయితే అయ్యారు కదా కనుక మీకు మాస్టరుగా అయిపోయారు. మీకు ఎంత సహనశక్తి ఉందో తెలిసింది కదా. కనుక చెడు జరిగిందా లేక మంచి జరిగిందా? బ్రాహ్మణుల దృష్టిలో చెడు ఉండనే ఉండదు. బ్రాహ్మణుల చెవులలో చెడు వినిపించనే వినిపించదు. అందువలననే బ్రాహ్మణుల జీవితం ఆనందాల జీవితం. అప్పుడప్పుడు మాత్రమే మంచిగా ఉంటే ఆనందంగా ఉండదు. సదా

ఆనందమే ఆనందము. పూర్తి కల్పమంతటిలో బ్రహ్మాకుమారీలు, బ్రహ్మాకుమారులు శ్రేష్ఠమైనవారు. దేవాత్మలు కూడా బ్రాహ్మణుల ముందు ఏమీ కాదు - సదా ఇదే నశాలో ఉండండి, సదా సంతోషంగా ఉండండి, ఇతరులను కూడా సంతోషంగా ఉంచండి. మీరూ ఉండాలి, ఇతరులను కూడా ఉంచాలి. నేనైతే సంతోషంగానే ఉన్నానని కాదు. నేను అందరినీ సంతోషంగా ఉంచుతాననేది కూడా ఉండాలి. నేనైతే సంతోషంగా ఉంటానని అనుకోవడం కూడా స్వార్థమే. బ్రాహ్మణుల సేవ ఏమిటి? మీరు జ్ఞానమిచ్చేదే సంతోషము కొరకు.

**18-01-1991**

పిల్లలందరికీ నథింగ్ న్యూ అనే పాఠము ప్రతి పరిస్థితిలో సదా గుర్తుండాలి. బ్రాహ్మణ జీవితము అనగా ప్రశ్నార్థకము మరియు ఆశ్చర్యార్థకము అనే రేఖలు ఉండజాలవు. ఎన్నోసార్లు ఈ సమాచారము కూడా విని ఉంటారు. కొత్త సమాచారమేదైనా ఉందా? లేదు. బ్రాహ్మణ జీవితము అనగా ప్రతి సమాచారాన్ని వింటూ కల్పక్రితపు స్మృతిలో సమర్థంగా ఉండాలి - ఏది జరగాలో, అది జరుగుతూ ఉంది. కనుక ఏమవుతుంది? అనే ప్రశ్న రాకూడదు. మీరు త్రికాలదర్శులుగా, డ్రామా ఆదిమధ్యాంతాలు తెలిసినవారుగా ఉన్నప్పుడు వర్తమానాన్ని తెలుసుకోలేరా? భయపడేవారైతే కాదు కదా! బ్రాహ్మణ జీవితంలో ప్రతి అడుగులో కళ్యాణముంది. భయపడే మాట లేదు. మీ శాంతి శక్తితో అశాంతి ఆత్మలకు శాంతి కిరణాలనివ్వడం మీ కర్తవ్యము. అందరూ మీ సోదరీ-సోదరులే కనుక మీ ఈశ్వరీయ పరివార సంబంధంతో సహయోగులుగా అవ్వండి. ఎంతగా యుద్ధంలో తీవ్ర గతి ఉంటుందో అంతగా యోగీ ఆత్మలైన మీ యోగము వారికి శాంతిని సహయోగముగా ఇస్తుంది. అందువలన ఇంకా విశేషంగా సమయాన్ని కేటాయించి మీరు శాంతిని సహయోగముగా ఇవ్వండి - ఇదే బ్రాహ్మణాత్మలైన మీ కర్తవ్యము.

**దాదీలతో**- ఆది బ్రాహ్మణుల మాలలో బ్రహ్మా తండ్రితో పాటు ఆది బ్రాహ్మణులు నిమిత్తంగా అయ్యారు కదా! ఆది బ్రాహ్మణులకు చాలా గొప్ప మహత్వముంది.



స్థాపన, పాలన మరియు పరివర్తన. వినాశనమనే శబ్దం కొంచెం అఫీషియల్‌గా(గంభీరంగా) అనిపిస్తుంది. కావున స్థాపన, పాలన మరియు విశ్వ పరివర్తన చేయడంలో ఆది బ్రాహ్మణులకు విశేషమైన పాత్ర ఉంది. శక్తుల పూజ చాలా వైభవంగా, ఆడంబరంగా జరుగుతుంది. నిరాకార తండ్రి మరియు బ్రహ్మా తండ్రికి ఇంత వైభవంగా(ధూంధాంగా) పూజలు జరగవు. బ్రహ్మా మందిరము కూడా చాలా గుప్తంగా ఉంది. కానీ శక్తి సైన్యం భక్తిలో కూడా ప్రఖ్యాతి చెందింది. అందువలన చివరివరకు స్టేజి పైన విశేష పిల్లల పాత్ర ఉంది. బ్రహ్మా పాత్ర కూడా గుప్తమైనదే. అవ్యక్త రూపము అనగా గుప్తము. బ్రాహ్మణులను తయారుచేశారు, బ్రాహ్మా పాత్ర గుప్తమైపోయింది. సరస్వతిని కూడా గుప్తంగా చూపిస్తారు. ఎందుకనగా ఆమె పాత్ర కూడా డ్రామాలో గుప్తంగా నడుస్తోంది.

**పిల్లలందరి పట్ల బాప్‌దాదా సందేశము - సర్వ తపస్వీ పిల్లలకు ప్రియస్మృతులు.** చూడండి పిల్లలూ! ఈ సమయంలో సమాచారాన్ని వింటూ, ఉన్నతోన్నతమైన సాక్షి స్థితి అను ఆసనము మరియు నిశ్చింత చక్రవర్తి అను సింహాసనము పై కూర్చొని ఆటనంతా చూస్తున్నారు కదా? ఈ బ్రాహ్మణ జీవితంలో భయపడే సంకల్పాలు స్వప్నంలో కూడా రాజాలవు. ఇదైతే తపస్యా సంవత్సరము. ఇందులో నిరంతర లగ్నమనే అగ్నిలో, అనంతమైన వైరాగ్య వృత్తిని ప్రజ్వలితము చేసే రెక్కలు వస్తున్నాయి. మీరు తండ్రి సమానంగా సంపన్నమవ్వాలని సంకల్పం చేశారు అనగా విజయ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్లాను తయారుచేశారు. కావున రెండవ వైపు సమాప్తమయ్యే అలజడి కూడా దీనికి తోడుగా నిశ్చితమై ఉంది కదా! రిహార్సల్సే డ్రామా లీలను సమాప్తం చేసే సాధనము. కావున నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు).

**13-02-1991**

తపస్యా సంవత్సరము అనగా తీవ్ర పురుషార్థము చేసి ఫస్టు జన్మలో, ఫస్టు నంబరు ఆత్మలతో పాటు రాజ్యంలోకి రావడం. ఇంటికి తోడుగా వెళ్ళాలి కదా? మళ్ళీ రాజ్యంలోకి కూడా బ్రహ్మాబాబా జతలో రావాలి. కనుక తపస్యా సంవత్సరము ఎందుకు ఉంచారో అర్థమయ్యిందా? ఏకాగ్రతా శక్తిని

పెంచుకోండి. ఇప్పుడు కూడా కోరుకోకపోయినా వ్యర్థం నడుస్తూ ఉంటుంది. కొన్ని కొన్ని సమయాలలో శుద్ధ శ్రేష్ఠ సంకల్పాల కన్నా వ్యర్థం వైపు భారమైపోతూ ఉంటుంది. తపస్సు అనగా వ్యర్థ సంకాల్పల సమాప్తి. ఎందుకంటే ఈ సమాప్తియే సంపూర్ణతను తీసుకొస్తుంది. సమాప్తి లేకుండా సంపూర్ణత రాదు. కనుక ఈ రోజు నుండి తపస్యా సంవత్సరాన్ని ప్రారంభం చేస్తున్నారు. ఉమంగ-ఉత్సాహాలు ఉన్నందుకు బాప్‌దాదా అభినందనలు తెలుపుతున్నారు. నాలుగు సబ్జెక్టులలో ఫుల్ పాస్ అయ్యే మార్కులు తీసుకోవాలి. నేను మూడు సబ్జెక్టులలో సరిగ్గా ఉన్నాను, కేవలం ఒక్క సబ్జక్టులోనే లోపముందని భావించకండి. అప్పుడు ఫుల్ పాస్ అయిపోతారా? అవ్వరు. అయినా పాస్ లిస్టులోకి వస్తారు. ఫుల్‌పాస్ అనగా నాలుగు సబ్జెక్టులలో ఫుల్ మార్కులు ఉండాలి. సదా ప్రతీ ఆత్మ పట్ల కళ్యాణ భావన ఉండాలి. వారు మీ స్థితిని కదిలించే ప్రయత్నం చేసినా అకళ్యాణం చేసేవారి పై కూడా కళ్యాణ భావన, కళ్యాణ దృష్టి, కళ్యాణ వృత్తి, కళ్యాణమయ కృతి(కర్మలు) ఉన్నవారినే 'కళ్యాణకారీ ఆత్మలని' అంటారు. శివుడంటే అర్థము కళ్యాణకారి కదా. కనుక శివజయంతి అనగా కళ్యాణకారి భావన. కళ్యాణం చేసేవారికి కళ్యాణం చేయడం - ఇది అజ్ఞానులు కూడా చేస్తారు. మంచివారితో మంచిగా నడవడం అందరికీ తెలుసు. కానీ అకళ్యాణ వృత్తి గలవారిని తమ కళ్యాణ వృత్తితో పరివర్తన చేయండి లేక వారిని క్షమించండి. పరివర్తన చేయలేకపోయినా క్షమించగలరు కదా! మీరు మాస్టర్ క్షమాసాగరులు కదా! కనుక మీ క్షమ ఆ ఆత్మ కొరకు శిక్షణ అయిపోతుంది. ఈ రోజులలో శిక్షణనిస్తే కొంతమంది అర్థం చేసుకుంటారు, కొంతమంది చేసుకోరు. ఇది చేయమని చెప్తే అది శిక్షణ అవుతుంది. క్షమ అనగా శుభ భావనలతో కూడిన ఆశీర్వాదాలు ఇవ్వడం, సహయోగం ఇవ్వడం. శిక్షణ ఇచ్చే సమయము ఇప్పుడు వెళ్ళిపోయింది. ఇప్పుడు స్నేహం ఇవ్వండి, గౌరవము ఇవ్వండి, క్షమించండి. శుభ భావన ఉంచండి, శుభ కామన ఉంచండి. ఇదే శిక్షణను ఇచ్చే విధి. ఆ విధి ఇప్పుడు పాతదైపోయింది. కనుక కొత్త విధి వస్తుంది కదా. తపస్యా సంవత్సరంలో ఈ కొత్త విధి ద్వారా అందరినీ ఇంకా



సమీపంగా తీసుకు రండి. పూసలు కొన్ని తయారైపోయాయి కానీ మాల ఇంకా తయారవ్వలేదని వినిపించాము కదా! దారం కూడా ఉంది, పూసలు కూడా ఉన్నాయి. కానీ పూసలు ఒకదానికొకటి సమీపంగా లేవు. అందువలన మాల తయారుగా లేదు. తమ అనుసారంగా పూస తయారై ఉంది కానీ సంఘటనలో, సమీపతలో తయారు కాలేదు. కావున తపస్యా సంవత్సరంలో బాబా సమానంగా అయితే అవ్వవలసిందే. కానీ పూసలు ఒకదానికొకటి సమీపంగా కూడా రావాలి. అర్థమయ్యిందా! పోతే యోగిగా ఉండేవారు, యోగిగా ఉన్నారు, సదా యోగీ జీవితంలోనే ఉండాలి. డ్రామాలోని ప్రతీ దృశ్యాన్ని ప్రేమగా చూస్తూ నడవండి. ప్రతీ దృశ్యం ప్రియమైనదే. ప్రపంచం వారికి ఏదైతే అప్రియమైన దృశ్యమో అది మీ కొరకు ప్రియమైనది. ఏదైతే జరుగుతూ ఉందో, అందులో ఏదో రహస్యం దాగి(నిండి) ఉంటుంది. రహస్యాన్ని తెలుసుకోవడం వలన ఎప్పుడూ, ఏ విషయంలోనూ, ఏ దృశ్యాన్ని చూసినా కోపగించుకోరు రహస్యాన్ని తెలుసుకున్నవారు కోపగించుకోరు. రహస్యాన్ని తెలుసుకోనివారే విసుగు చెందుతారు.

**13-02-1991**

పిల్లలందరూ మధురాతి మధురంగా ఆత్మిక సంభాషణ చేస్తారు. బాబా, మేము మీ వారమే కదా, ఇంకెక్కడికీ పోనే పోము అంతేకాక జ్ఞానీ - యోగీ జీవితము కూడా మాకు చాలా బాగుంది. కానీ ఏదైనా విషయములో కొంచెం సహించవలసి వస్తుంది. ఆ సమయములో మనసు, బుద్ధి, ఆందోళన చెందుతుంది. ఇది ఎంతవరకు జరుగుతుంది? ఎలా జరుగుతుంది? మధ్య-మధ్యలో స్వయంతో గానీ, సేవ ద్వారా గానీ, జతలో ఉన్నవారి ద్వారా గానీ, వచ్చే ఆందోళన నిరంతరములో అంతరము తీసుకొస్తుంది. అప్పుడు సహనశక్తి శాతము కొంత తగ్గిపోతుంది. పక్కాగానే ఉంటాము అని అంటారు కానీ పక్కగా ఉన్నవారిని కూడా అప్పుడప్పుడు ఈ విషయాలు కదిలించేస్తాయి. కనుక తపస్యా సంవత్సరము అనగా అన్ని గుణాలు, సర్వ శక్తులలో, సర్వ సంబంధాలలో, సర్వ స్వభావ -సంస్కారాలలో

నూరు శాతము పాస్ అవ్వడం. ఇప్పుడు పాస్‌గానే ఉన్నారు కానీ ఫుల్‌పాస్‌గా లేరు. ఒకటేమో సాధారణ పాస్, రెండవది ఫుల్‌పాస్, మూడవది పాస్ విత్ ఆనర్. కనుక తపస్యా సంవత్సరంలో పాస్ విత్ ఆనర్‌గా కొంతమందే అవుతే, ఫుల్ పాస్‌గా అయితే అందరూ అవ్వగలరు. ఫుల్‌పాస్‌గా అయ్యేందుకు అన్నిటికంటే సహజ సాధనం - అప్పుడప్పుడు ఏదైనా పేపరు(పరీక్ష) వస్తుంది. తపస్యా సంవత్సరంలో కూడా పరీక్ష వస్తుంది. రాదని అనుకోకండి. వస్తుంది. అయితే పరీక్షగా భావించి పాస్ అవ్వండి. వచ్చే విషయాలను(మాటలను) విషయాలుగా భావించకండి, పేపరుగా భావించండి. పరీక్షలో ప్రశ్నల విస్తారంలోకి వెళ్లరు. ఇది ఎందుకు వచ్చింది? ఎలా వచ్చింది? ఎవరు చేశారు? అని ఆలోచించరు. పాసవ్వాలని భావించి పేపరును దాటుకుంటారు. కనుక పేపరుగా భావించి పాసవ్వండి. ఇదేమి ఇలా జరిగిందే? ఇలా జరుగుతుందా? అని అనుకోకండి. మీ బలహీనతలో కూడా ఇది జరిగేదేలే అని అనుకోకండి. స్వయం కొరకు ఇలా జరుగుతూనే ఉంటుంది, ఇంత మాత్రము జరిగేదే అని అనుకుంటారు. ఇతరుల కొరకైతే ఇలా ఎందుకు చేశారు? ఏం చేశారు? అని ఆలోచిస్తారు. ఈ విషయాలన్నీ పరీక్షగా భావించి ఫుల్‌పాస్ అయ్యే లక్ష్యముంచుకొని పాస్ అవ్వండి. పాస్ అవ్వాలి, పాస్ చేయాలి(దాటుకోవాలి), తండ్రి వద్ద(పాస్) ఉండాలి. ఇలా ఉంటే ఫుల్‌పాస్ అవుతారు.

**17-03-1991**

తపస్సుకు అర్థమే సంతుష్టతా రూపం. దృష్టిలో, వృత్తిలో, ముఖంలో, నడవడికలో కనిపించాలి. అటువంటి సంతుష్టమణుల మాలను తయారు చేస్తున్నారు. ఎన్ని మాలలు తయారై ఉంటాయి? సంతుష్టమణి అనగా మచ్చలేని మణి. సంతుష్టతకు గుర్తు - సంతుష్ట ఆత్మలు సదా స్వయాన్ని ప్రసన్నచిత్తులుగా అనుభవం చేయడమే కాక ఇతరులు కూడా వారి ద్వారా ప్రసన్నమవుతారు. ప్రసన్నచిత్త స్థితిలో ప్రశ్నలు ఎప్పుడూ తలెత్తవు. ఒకటి ప్రసన్నచిత్తులుగా అవ్వడం, రెండవది ప్రశ్నచిత్తులుగా అవ్వడం. ప్రశ్న అనగా క్వశ్చన్. ప్రసన్నచిత్తులు డ్రామా జ్ఞానమున్న కారణంగా ప్రసన్నంగా ఉంటారు,



ప్రశ్నించరు. ఏ ప్రశ్నలైతే స్వయాన్ని గురించి, ఇతరులను గురించి ఉత్పన్నమవుతాయో వాటికి సమాధానం స్వయానికి ముందు తెలుస్తుంది. ఇంతకుముందు కూడా వినిపించాను. వాట్(ఏమిటి), వై(ఎందుకు) ఉండదు కానీ డాట్(బిందువు). ఏమిటి, ఎందుకు ఉండవు, ఫుల్‌స్టాప్ బిందువు ఉంటుంది. ఒక్క సెకండులో విస్తారం, ఒక్క సెకనులో సారం. అటువంటి ప్రసన్నచిత్తులు సదా నిశ్చింతులుగా ఉంటారు. కావున అటువంటి చిహ్నాలు సంతుష్టమణినైన నాలో ఉన్నాయా? అని చెక్ చేసుకోండి. బాప్‌దాదా అయితే అందరికీ సంతుష్టమణి అనే టైటిల్ ఇచ్చారు. కావున బాప్‌దాదా అడుగుతున్నారు - సంతుష్ట మణులారా! సంతుష్టంగా ఉన్నారా? తర్వాత ప్రశ్న - స్వయంతో అనగా స్వ పురుషార్థంలో, స్వ సంస్కార పరివర్తన చేయు పురుషార్థంలో, స్వయం చేసే పురుషార్థ పర్సెంటేజ్‌లో(శాతంలో), స్థితిలో సదా సంతుష్టంగా ఉన్నారా? ఎంతవరకు సంతుష్టంగా ఉన్నాము అని ఆలోచిస్తున్నారా? స్వయాన్ని చూసుకుంటున్నారా? మూడవ ప్రశ్న - సర్వ ఆత్మల సంబంధ-సంపర్కాలలో స్వయం ద్వారా మరియు సర్వుల ద్వారా సదా సంతుష్టంగా ఉన్నారా? ఎందుకనగా తపస్యా సంవత్సరంలో తపస్యా ఫలమును, సఫలతా ఫలమును ఇక్కడే ప్రాప్తి చేసుకోవాలి. స్వయంలో, సేవలో మరియు అన్నింటిలో సంతుష్టత. నాలుగు గంటలైతే యోగం చేశారు. చాలా మంచిది. నాలుగు గంటల నుండి ఎనిమిది గంటల వరకు కూడా చేరుకుంటారు. అది కూడా చాలా మంచిది. యోగం ద్వారా సిద్ధి స్వరూపులుగా అవ్వాలి. దానికి విధి - యోగము. కానీ ఈ విధి ద్వారా ఏ సిద్ధి లభించింది? యోగం జోడించడం విధి, యోగ ప్రాప్తిని సిద్ధి అంటారు. కావున 8 గంటల లక్ష్యం ఉంచినట్లే, కనీసం ఈ మూడు రకాల సంతుష్టతా సిద్ధి కొరకు స్పష్టమైన, శ్రేష్ఠమైన లక్ష్యం ఉంచండి. కొంతమంది పిల్లలు స్వయాన్ని మియామిట్టూ వలె(అంతా నాకు తెలుసని భావించి) సంతుష్టంగా(తృప్తిగా) ఉన్నట్లు భావిస్తారు. ఆ విధంగా సంతుష్టపడరాదు. ఒకటి మనసుతో అంగీకరించడం, రెండవది బుద్ధితో అంగీకరించడం. బుద్ధి ద్వారా స్వయాన్ని మేము సంతుష్టంగానే ఉన్నాము,

మాకేమి చింత ఉంది, మేమైతే నిశ్చింతగా ఉన్నామని భావిస్తారు. కావున బుద్ధితో స్వయాన్ని సంతుష్టంగా భావించడం - అటువంటి సంతుష్టత కాదు, యథార్థంగా భావించాలి. సంతుష్టతా గుర్తులు స్వయంలో అనుభవమవ్వాలి. మనసు సదా ప్రసన్నంగా ఉండాలి, పర్సనాలిటీ ఉండాలి. స్వయాన్ని సంతుష్ట పర్సనాలిటీగా భావించి ఇతరులు అలా భావించకపోతే దానిని మియామిట్టూ అని అంటారు. అలాంటి సంతుష్టత కాదు. యథార్థమైన అనుభవం ద్వారా సంతుష్ట ఆత్మగా అవ్వండి. సంతుష్టత అనగా మనసు, బుద్ధి సదా విశ్రాంతిగా ఉంటాయి. సుఖము, శాంతి స్థితిలో ఉంటాయి. అశాంతిగా అవ్వవు. అటువంటి సంతుష్ట మణులు సదా తండ్రి మస్తకంలో మణుల సమానంగా మెరుస్తూ ఉంటారు. కావున స్వయాన్ని చెక్ చేసుకోండి. సంతుష్టత తండ్రి మరియు సర్వుల దీవెనలను ఇప్పిస్తుంది. సంతుష్ట ఆత్మ సమయానుసారంగా సదా స్వయాన్ని తండ్రి మరియు సర్వుల దీవెనలనే విమానంలో ఎగురుతున్నట్లుగా అనుభవం చేస్తుంది. ఈ దీవెనలే వారికి విమానము. స్వయాన్ని సదా విమానంలో ఎగురుతున్నట్లుగా అనుభవం చేస్తుంది. దీవెనలు అడగరు కానీ స్వయం దీవెనలే స్వతహాగా వారి ముందుకు వస్తాయి. ఇటువంటి సంతుష్టమణులు అనగా సిద్ధి స్వరూప తపస్వీ ఆత్మలు. ఇవి అల్పకాలిక సిద్ధులు కావు, అవినాశి మరియు ఆత్మిక సిద్ధులు. అటువంటి సంతుష్ట మణులను చూస్తున్నారు. ప్రతి ఒక్కరు నేను ఎవరు? అని మిమ్ములను మీరు ప్రశ్నించుకోండి.

**03-04-1991**

అందరూ సంతోషంగా ఉన్నారా, సంతుష్టంగా ఉన్నారా? బయట ఉంటున్నా సంతుష్టంగా ఉన్నారా? డ్రామాలో ఈ పాత్ర కూడా ఉంది. మొత్తం ఆబూ అంతా మాదవుతుందని మీరంటారు. అయితే అది ఎలా అవుతుంది? ముందు మీరు పాదాలు మోపండి. తర్వాత ఇప్పుడు ఏదైతే ధర్మశాల అనే పేరుతో ఉందో అది మీదైపోతుంది. చూడండి, విదేశాలలో ఇప్పుడు అలా జరగడం మొదలయ్యింది. చర్చిలు అంతగా నడవకపోతే బి.కెలకు ఇచ్చారు. అటువంటి పెద్ద పెద్ద స్థానాలేవైతే ఉన్నాయో అవి నడవకపోతే ఆఫర్ చేస్తారు.



కావున ప్రతీ స్థానంలో బ్రాహ్మణులు పాదం మోపుతున్నారు. దీనిలో కూడా రహస్యముంది. బ్రాహ్మణులకు ఉండే(నివసించే) పాత్ర డ్రామాలో ఉంది. కావున మొత్తం అంతా మీదే అయిపోయినట్లైతే ఏం చేస్తారు? మీరే సంభాళించండి, ఆశ్రమాన్ని కూడా సంభాళించండి, మమ్ములను కూడా సంభాళించండి అని మీకే ఆఫర్ చేస్తారు. ఏ సమయంలో ఏ పాత్ర లభిస్తుందో దానిలో సంతుష్టంగా ఉండి పాత్రను అభినయించండి.

**దాదీలతో** - సదా ఏదో ఒక కొత్త దృశ్యం జరగాలి కదా. ఇది కూడా డ్రామాలో కొత్త దృశ్యమేదైతే ఉందో అదే రిపీట్ అయ్యింది. ఈ హాలు కూడా చిన్నదవుతుందని ఆలోచించారా? సదా ఒకే దృశ్యముంటే బాగుండదు. అప్పుడప్పుడు కొన్ని దృశ్యాలు బాగనిపిస్తాయి. ఇది కూడా ఆత్మిక శోభ కదా. ఈ ఆత్మలందరి సంకల్పం పూర్తి కావలసి ఉంది. అందువలన ఈ దృశ్యం జరిగింది. భలే రండి అని ఇక్కడ నుండి అందరికీ అనుమతి ఇచ్చారు. ఇప్పుడేం చేస్తారు? ఇప్పుడు కొత్తవారు ఇంకా పెరగాల్సిందే. పాతవారైతే పాతవారిగా అయిపోయారు. ఏ విధంగా ఉమంగంలో వచ్చారో అదే విధంగా తమను సెట్ చేసుకున్నారు. విశాలంగా అయితే అవ్వాల్సిందే. తక్కువగా అయితే అవ్వనే అవ్వదు. విశ్వకళ్యాణకారి అనే టైటిల్ ఉన్నప్పుడు విశ్వం ముందు ఇదైతే ఏమీ లేదు. వృద్ధి కూడా జరగాలి. విధి కూడా ఇంకా కొత్తగా అవ్వాలి. ఏదో ఒక విధి అయితే జరుగుతూనే ఉండాలి. ఇప్పుడు వృత్తి శక్తిశాలిగా అవుతుంది. తపస్సు ద్వారా వృత్తి శక్తిశాలిగా అయినప్పుడు స్వతహాగా ఆత్మల వృత్తి కూడా పరివర్తన అవుతుంది. మంచిది. ఈ రోజు అందరూ సేవ చేస్తూ అలసిపోవడం లేదు కదా! ఉత్సాహంలోకి వస్తున్నారు కదా! ఆనందమే ఆనందముంది.

**26-10-1991**

తపస్సు అనగా సంతోషంగా నాట్యం చేయడం. తండ్రి మరియు మీ ఆది, అనాది స్వరూప గుణాలను గానము చేయడం. కనుక ఈ గానము ఎంత పెద్దది మరియు సహజమైనది! ఇందులో గొంతు బాగుందా లేదా అనే విషయము కూడా చూడనవసరము లేదు. నిరంతరము ఈ

గుణగానము చేయవచ్చు. కనుక నిరంతరము సంతోషంగా నాట్యం చేస్తూ ఉండండి. కనుక తపస్సు అంటే అర్థమేమి? నాట్యము చేయడం, పాటలు పాడడం. ఎంత సులభము! ఎవరైతే చిన్న చిన్న తప్పులు చేస్తారో వారి తల వేడెక్కుతుంది, భారమైపోతుంది. బ్రాహ్మణ జీవితంలో ఎప్పుడూ ఎవ్వరి తల భారముగా అవ్వజాలదు. ఆసుపత్రిని నిర్మించువారి తల భారమేమైనా అయిందా? ట్రస్టీ ముందే కూర్చొని ఉన్నాడు కదా. తల భారంగా ఏమైనా ఉందా? చేసి చేయించే(కరన్ కరావన్‌హార్) తండ్రి ఉన్నప్పుడు మీకేం భారముంది? నిమిత్తంగా ఉండి భాగ్యాన్ని తయారు చేసుకునే సాధనాన్ని నిర్మిస్తున్నారు. మీకు బాధ్యత ఏముంది? తండ్రి బాధ్యత అనుకునేందుకు బదులు మీ బాధ్యత అని భావిస్తే తల భారమైపోతుంది. సర్వశక్తివంతుడైన తండ్రి నా జతలో, నాకు తోడుగా ఉంటే భారమేమైనా ఉంటుందా? చిన్న తప్పు చేస్తారు - 'నా బాధ్యత' అని భావించారంటే తల బరువెక్కుతుంది. కనుక బ్రాహ్మణ జీవితములో నాట్యము చేయండి, పాటలు పాడండి, ఆనందముగా ఉండండి. వాచా సేవ గానీ, కర్మణా సేవ గానీ, ఏ సేవ అయినా ఒక ఆట వంటిది. సేవ అంటే ఏదో వేరే బరువైనది కాదు. కొన్ని బుద్ధితో ఆడే ఆటలు, కొన్ని తేలికైన ఆటలు ఉంటాయి. ఏవైనా ఆటలే కదా. బుద్ధితో ఆడే ఆటలలో బుద్ధి ఏమైనా భారమౌతూ ఉందా? కనుక ఈ ఆటలన్నీ ఆడ్తారు. కనుక బుద్ధితో ఆలోచించే ఏ పెద్ద విషయమైనా, అటెన్షన్ ఇవ్వాల్సిన పని అయినా మాస్టర్ సర్వశక్తివాన్ ఆత్మకు అవన్నీ ఆటలే.

ఈ తపస్యా సంవత్సరంలో ఏమేమి జరుగుతూ ఉందో అందుకు కారణమేమి? పెద్ద పెద్ద ప్రాజెక్టులు చేస్తున్నారు. అందుకు కారణమేమి? కొంతమంది ఇది తపస్సుకు ఫలితమని భావిస్తున్నారు. కొంతమంది తపస్యా సంవత్సరంలో ఇవన్నీ ఎందుకు? అని అంటారు. రెండు వైబ్రేషన్లు వస్తున్నాయి. కానీ ఇది సమయము యొక్క తీవ్ర వేగము మరియు తపస్యా వైబ్రేషన్ల ద్వారా అవసరాలు పూర్తి అవ్వడం తపస్యా బలము యొక్క ఫలము. ఫలమేమో తినాల్సిందే కదా. తపస్సు అన్ని అవసరాలను సమయానికి సహజంగా పూర్తి చేయగలదని డ్రామా చూపిస్తుంది. అర్థమయ్యిందా.



ఇది ఎందుకు జరుగుతోందనే ప్రశ్న రాజాలదు. తపస్సు అనగా సఫలత సులభంగా అనుభవమవ్వాలి. పోను పోను అసంభవము ఎలా సహజమవుతుందనే అనుభవము చాలా ఎక్కువగా చేస్తూ ఉంటారు. విఘ్నాలు రావడం కూడా డ్రామాలో ఆది నుండి అంతిమము వరకు రచింపబడి ఉంది. ఈ విఘ్నాలు కూడా అసంభవం నుండి సంభవంగా అయ్యే అనుభవం చేయిస్తాయి. మీరందరూ అనుభవీలుగా అవ్వనే అయ్యారు. అందువలన విఘ్నాలు కూడా ఆటగా అనిపిస్తాయి. ఫుట్‌బాల్ ఆటలో ఏం చేస్తారు? బాల్ వస్తే కదా దానిని తన్నేది? ఒకవేళ బాల్(బంతి) రాకుంటే ఎలా తన్నగలరు? అది ఆట ఎలా అవుతుంది? ఇది కూడా ఫుట్‌బాల్ ఆటయే. ఆట ఆడేందుకు సంతోషంగా ఉంటుందా? లేక తికమకపడ్తారా? బాల్ నా కాలి వద్దకు రావాలి, నేను దానిని తన్నాలి అని ప్రయత్నిస్తారు కదా. ఈ ఆట జరుగుతూనే ఉంటుంది. కొత్తదేమీ కాదు(నథింగ్ న్యూ). డ్రామా ఆట కూడా చూపిస్తుంది, సంపన్న సఫలతను కూడా చూపిస్తుంది. ఇదే బ్రాహ్మణ కుల పద్ధతి, ఆచారము.

**18-12-1991**

అనంతమైన ఖుషీ ఉందా? ఈ రోజు కొద్దిగా సంతోషం తగ్గిపోయింది, కొద్దిగా ఉదాసీనంగా అయిపోయామని అనరాదు. ఉదాసీనంగా ఎవరు అవుతారు? ఎవరైతే మాయకు దాసులుగా అవుతారో వారు. ఏమి చేయాలి? ఎలా చేయాలి? అనే ప్రశ్నలు రావడం అనగా ఉదాసీనంగా అవ్వడం. ఎప్పుడైనా ఎందుకు? అన్న ప్రశ్న వచ్చినా, ఎందుకు జరిగింది? ఎందుకు చేశారు? అన్న ప్రశ్నలు వచ్చినా చక్రం గురించిన జ్ఞానం పూర్తిగా లేదని ఋజువవుతుంది. ఒకవేళ డ్రామా రహస్యాన్ని తెలుసుకున్నట్లయితే ఎందుకు, ఏమిటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవ్వవు. స్వయం కూడా కళ్యాణకారి, సమయం కూడా కళ్యాణకారిగా ఉన్నప్పుడు ఇదేమిటి? అనే ప్రశ్న ఉత్పన్నమవ్వగలదా? కావున డ్రామా జ్ఞానం మరియు డ్రామాలో కూడా సమయం గురించిన జ్ఞానం లోటుగా ఉన్నట్లయితే ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ఇది నా లెక్కాచారమేనా? కఠినమైన

లెక్కాచారము నాకేనా? ఇతరులది కాదు....... అని అప్పుడప్పుడు ప్రశ్నలు తలెత్తుతాయి. ఎంత కఠినమైనదైనా, యోగాగ్ని ముందు ఎంత కఠినమైన ఖాతా అయినా ఏముంది? ఇనుము ఎంత కఠినంగా ఉన్నా తీవ్రమైన అగ్ని ముందు మైనము వలె అయిపోతుంది. ఎంత కఠినమైన పరీక్ష అయినా, లెక్కాచారమైనా, కఠినమైన బంధనమైనా యోగాగ్ని ముందు ఏ విషయమూ కఠినమైనది కాదు. అన్నీ సహజమైపోతాయి. కొందరు ఆత్మలు అంటారు - ఇది నా శరీర లెక్కాచారమే, ఇంకెవ్వరివీ కావు...... నాకే ఇలాంటి పరివారం లభించింది, నాకే ఇలాంటి పని లభించింది, ఇలాంటి సహచరులు లభించారు అని అంటారు. కాని ఏదైతే జరుగుతోందో అది చాలా మంచిది, ఆ కఠినమైన లెక్కాచారం శక్తిశాలిగా చేస్తుంది. సహన శక్తిని పెంచుతుంది. తీవ్రమైన అగ్ని ముందు ఏ వస్తువైనా పరివర్తన అవ్వక పోవడమన్నది జరగనే జరగదు. కావున ఇది కఠినమైన లెక్కాచారమని ఎప్పుడూ అనకండి. బలహీనతలే సహజమైన దానిని కష్టంగా తయారు చేస్తాయి. ఈశ్వరీయ శక్తికి చాలా గొప్ప మహత్వముంది. కావున సదా స్వయాన్ని చూడండి, స్వదర్శన చక్రధారిగా అవ్వండి. ఇతర విషయాల్లోకి వెళ్లడం, ఇతరులను చూడడం అనగా పడిపోవడం. తండ్రిని చూడడం, తండ్రి చెప్పింది వినడం అనగా ఎగరడం.

**31-12-1991**

ఏమి వచ్చినా, ఏమి జరిగినా పరిస్థితులనే పెద్ద పెద్ద పర్వతాలు వచ్చినా, సంస్కార ఘర్షణ జరిగే మేఘాలు వచ్చినా, ప్రకృతి ద్వారా పరీక్షలు వచ్చినా అంగదుని సమానంగా మనసు-బుద్ధి అనే పాదాన్ని కదిలించరాదు. స్థిరంగా, అచలంగా ఉండాలి. గతంలో ఏదైనా అలజడి జరిగి ఉండినా, దానిని సంకల్పములో కూడా స్మృతిలోకి తీసుకు రారాదు. ఫుల్‌స్టాప్ ఉంచాలి. వర్తమానాన్ని తండ్రి సమానంగా శ్రేష్ఠంగా, సహజంగా చేసుకోవాలి. భవిష్యత్తును సదా సఫలతకు అధికారిననే దృష్టితో చూడాలి. ఈ విధి ద్వారా సిద్ధిని ప్రాప్తి చేసుకోవాలి. రేపటి నుండి కాదు, ఇప్పటి నుండే చేసుకోవాలి. స్మృతి మాసమనే ఈ కొద్ది సమయాన్ని విధి పూర్వకంగా



ప్రాప్తి చేసుకోండి. వరదానమంటే అర్థము - నిర్లక్ష్యంగా, సోమరిగా అవ్వమని కాదు, కానీ సహజ పురుషార్థులుగా అవ్వాలి.

రోజురోజుకు సమస్యలు, పరిస్థితులు ఇంకా బిగుసుకుంటాయి (జటిలమవుతాయి). ఇటువంటి సమయంలో కర్మ మరియు యోగాల బ్యాలన్స్ లేకుంటే బుద్ధి సరియైన నిర్ణయము తీసుకోలేదు. అందువలన యోగము మరియు కర్మల బ్యాలన్స్ ద్వారా మీ నిర్ణయ శక్తిని పెంచండి. అర్థమయ్యిందా. తర్వాత ఇలా కూడా జరుగుతుందని నాకు తెలియనే తెలియదని అనరాదు. ఇది నాకు ముందే చెప్పి ఉంటే దీనిని అభ్యాసము చేయండి. ఏ ఆత్మకైతే బ్యాలన్స్ కారణంగా బాప్‌దాదా నుండి ఆశీర్వాదాలు ప్రాప్తి అవుతాయో వారి గుర్తులేవి? ఎవరైతే సదా తండ్రి నుండి ఆశీర్వాదాలను అనుభవం చేస్తూ ఉంటారో, వారి సంకల్పములో కూడా ఎప్పుడూ ఇదేమి ఇలా జరిగింది? ఎందుకు జరిగింది? అని ఆశ్చర్యపడరు. ఏమి జరుగుతుంది? అనే ప్రశ్న కూడా తలెత్తదు. ఏదైతే జరుగుతూ ఉందో అందులో కళ్యాణము దాగి ఉంది అనే నిశ్చయము పక్కాగా ఉంటుంది. ఎందుకంటే ఇది కళ్యాణకారి యుగము. కళ్యాణకారి తండ్రి ఉన్నాడు అంతేకాక మీ అందరి కర్తవ్యము కూడా విశ్వకళ్యాణమే. కళ్యాణమే ఇమిడి ఉంది. బాహ్యానికి ఏ కర్మ ఎంత ఆందోళన కలిగించేదిగా కనిపించినా అందులో కూడా ఏదో ఒక గుప్త కళ్యాణము ఇమిడి ఉంటుంది. తండ్రి శ్రీమతము వైపు, తండ్రితో సంబంధాల వైపు అటెన్షన్ ఇప్పించే కళ్యాణముంటుంది. బ్రాహ్మణ జీవితములో జరగనిది ఏది? అకళ్యాణము జరగదు. ఇంత నిశ్చయముందా? లేక కొద్దో గొప్పో వస్తే కదిలిపోతారా?

**16-03-1992**

మీ సత్యయుగ రాజధానిలో ప్రకృతి స్వరూపము ఎంత శ్రేష్ఠంగా, సతోప్రధానంగా, సుందరంగా ఉంటుంది! అక్కడి ఉద్యానవనాలకు, ఇక్కడి ఉద్యానవనాలకు ఎంత తేడా ఉందో, ఆ నిజమైన సుగంధాన్ని అనుభవం చేశారు కదా? అయినా ప్రకృతి చివరివరకు తన పాత్రను మంచిగా చేస్తూ ఉంది. కానీ శ్రేష్ఠ ఆత్మలైన మీరు ప్రకృతి పతులు. ప్రకృతి పతులైన మీరు ఈ

ప్రకృతి అనే ఆటను చూచి హర్షితమౌతున్నారు. ప్రకృతి ఆందోళన పరచినా లేక ప్రకృతి సుందరమైన ఆటను చూపించినా - రెండిటిలో ప్రకృతిపతులైన ఆత్మలు సాక్షిగా ఉండి ఆటను చూస్తారు. ఆటలో మజాను అనుభవిస్తారు, భయపడరు. అందువలన బాప్‌దాదా తపస్సు ద్వారా సాక్షి స్థితి అనే ఆసనము పై అచలమైన, స్థిరమైన స్థితిలో స్థితమై ఉండేందుకు విశేషమైన అభ్యాసము చేయిస్తున్నారు. కనుక ఈ స్థితి అనే ఆసనము అందరికీ బాగుందా? లేక ఆందోళన చెంది చలించే, కదిలే ఆసనము బాగుందా? స్థిరమైన ఆసనము బాగుంటుంది కదా. ఏమి జరిగినా ప్రకృతి నుండి గానీ, వ్యక్తి నుండి గానీ, ఎలాంటి పరిస్థితులు వచ్చినా - ఆసనాన్ని కదిలించరాదు. ఇంత పక్కాగా ఉన్నారా లేక ఇంకా పక్కాగా అవ్వాల్సి ఉందా?

భారతవాసులకు ఏ నశా ఉంది? భారతదేశములోనే తండ్రి వస్తారనే నశా ఉంది. లండన్‌లో రారు కదా(రావచ్చు). ఇప్పటివరకు డ్రామాలో ఆ పాత్ర కనిపించడం లేదు. డ్రామాలోని నిర్ణయాన్ని భగవంతుడు కూడా ఎప్పుడూ తప్పించలేడు. డ్రామాకు అథారిటీ లభించింది.

**15-04-1992**

ప్రతీ విషయంలో మంచిది, మంచిది అని అంటూ మంచివారిగా అయిపోతూ ఉంటారు. ప్రతీ విషయంలో మంచి తప్పకుండా ఇమిడిపోయే ఉంటుంది. విషయమంతా చెడుగా ఉన్నా అందులో ఒకటి రెండు మంచివి కూడా తప్పకుండా ఉంటాయి. అవి మంచి పాఠాన్నే చదివిస్తాయి. ఇతరులలో ఆవేశముంటుంది. ఇతరులు ఆవేశపడ్తున్నా మీరు ఏ పాఠాన్ని చదువుతున్నారు? ఎంతగా వారు ఆవేశపడ్తారో ఆ విషయం మీకు అంత సహనాన్ని నేర్పిస్తుంది. సహనశీలతను నేర్పిస్తుంది. అందువలన ఏదైతే జరుగుతూ ఉందో అది మంచిది మరియు ఏదైతే జరగవలసి ఉందో అది ఇంకా మంచిది. మంచిని గ్రహించేందుకు కేవలం బుద్ధి ఉంటే చాలు. చెడును చూడకుండా మంచిని గ్రహించండి. దీని ద్వారానే నంబరు లభిస్తుంది కదా!



నాలుగు విషయాలలో నిశ్చయము సమానమైన శాతంలో ఉండాలి. కొంతమంది పిల్లలు బాబా, మీ పైన నిశ్చయముంది కానీ మా పైన మాకు అంత నిశ్చయం లేదని అంటారు. ఒకసారి ఉంటుంది, ఒకసారి మా పైన నిశ్చయం తగ్గిపోతుంది అని అన్నప్పుడు వారి భాష ఎలా ఉంటుంది? ఒకే పాట పాడుతూ ఉంటారు. తెలియదు, తెలియదు, తెలియదు......... అలా ఎందుకవుతుందో తెలియదు, నా భాగ్యంలో ఉందో లేదో తెలియదు, తండ్రి సహాయం లభిస్తుందో లేదో తెలియదు, సఫలత లభిస్తుందో లేదో తెలియదు అని అంటూ ఉంటారు. మాస్టర్ సర్వశక్తివంతులుగా ఉన్నా ఈ నిశ్చయంలో లోపముంది. అందుకే తెలియదు, తెలియదు అనే పాట పాడ్తారు. ఇక మూడవది - మళ్లీ ఏమంటారు? బాబా, మేమైతే మిమ్ములను చూసి వ్యాపారం చేశాము. మీరు మా వారు, మేము మీ వారము. ఈ బ్రాహ్మణ పరివారంతో వ్యాపారం చేయలేదు. బ్రాహ్మణ పరివారం గొడవలమయం. మీరు బాగున్నారు. బ్రాహ్మణుల సంఘటనలో నడవడం కష్టం. మీ ఒక్కరితో నడవడం సహజం అని అంటారు. అప్పుడు బాప్‌దాదా ఏమంటారు? బాప్‌దాదా చిరునవ్వు నవ్వుతారు. అటువంటి పిల్లలను బాప్‌దాదా ఒక ప్రశ్న అడుగుతున్నారు. అటువంటి ఆత్మలు ప్రసన్నచిత్తులుగా ఉండలేరు. ఇది ఇలా ఎందుకు? ఇలా జరుగుతుందా? అని చాలా ప్రశ్నలు వేస్తారు. కావున ఆ ఆత్మలు ప్రసన్నచిత్తులుగా ఉండరు. వారు ప్రశ్న చిత్తులైన ఆత్మలు. బాప్‌దాదా కూడా వారిని ఆత్మలైన మీరు ముక్తిధామంలో ఉండేవారా లేక జీవన్ముక్తిలోకి వచ్చేవారా? అని ప్రశ్నిస్తున్నారు. ముక్తిలో ఉండి మళ్లీ జీవన్ముక్తిలోకి రావాలి కదా. కావున జీవన్ముక్తిలో కేవలం బ్రహ్మాబాబా ఉంటారా లేక రాజధాని ఉంటుందా? కేవలం బ్రహ్మా, సరస్వతి రాజు-రాణిగా ఉంటారా? జీవన్ముక్తి వారసత్వం పొందాలి కదా! ఆది సనాతన ధర్మానికి మరియు ఇతర ధర్మాలకు చాలా గొప్ప వ్యత్యాసముందని మీరు ఛాలెంజ్ చేస్తారు. వారు కేవలం ధర్మ స్థాపన చేస్తారు. కాని మీరు ధర్మం మరియు రాజ్య స్థాపన చేస్తున్నారు. ఇది పక్కాగా ఉంది కదా. ధర్మస్థాపన మరియు రాజ్యస్థాపన కూడా

చేస్తున్నారు కదా! కనుక రాజ్యంలో ఏముంటుంది! కేవలం ఒక రాజు, ఒక రాణి ఉంటారా? ఒక రాజు, రాణి మరియు వారి అబ్బాయి, అమ్మాయిగా పిల్లలైన మీరు, అంతేనా! అటువంటి రాజ్యముంటుందా? కావున మనం రాజధానిలోకి రావాలి. ఇది గుర్తుంచుకోండి. రాజధానిలోకి రావడం అనగా బ్రాహ్మణ పరివారంలో సంతుష్టంగా ఉండాలి, పరివారాన్ని సంతుష్ట పరచాలి, శ్రేష్ఠమైన సంబంధంలోకి రావాలి.

**24-09-1992**

చూడండి, మంచివారిగా ఉన్నారు కనుకనే బాప్‌దాదా ఇష్టపడి తమవారిగా చేసుకున్నారు. మంచివారిగా ఉన్నారు, సదా మంచివారిగానే ఉంటారు. మంచిది. మంచిదని భావించడం వలన మంచివారిగా అవ్వనే అవుతారు. బాప్‌దాదా ప్రతీ పుత్రునిలో విశేషతలనే చూస్తారు. విశేషతలను చూస్తూ, వర్ణన చేస్తూ చేస్తూ విశేషంగా అవ్వనే అవుతారు. నిన్న ఉండేవారు, ఈ రోజు ఉన్నారు, రేపు మళ్లీ అవుతారు. ఈ రోజు మరియు రేపటిలో మొత్తం డ్రామా అంతా వచ్చేసింది. ఎంతెంతగా సంపూర్ణంగా అవుతూ ఉంటారో, అంతగా ఈ స్మృతి స్పష్టమవుతూ ఉంటుంది. ఎంతగా స్మృతి స్పష్టమవుతుందో అంత న్యాచురల్(సహజమైన) నశా ఉంటుంది.

**13-10-1992**

ఈ చదువులో సబ్జక్టులు కూడా ఎక్కువగా లేవు. నాలుగు సబ్జెక్టులు ధారణ చేయడంలో కష్టమేముంది! నాలుగు సబ్జెక్టులకు ఒకదానికొకటి సంబంధముంది. మొదటి సబ్జక్టు అయిన జ్ఞానాన్ని సంపూర్ణ విధి పూర్వకంగా ధారణ చేయండి. అనగా జ్ఞానానికి చెందిన ఒక్కొక్క పదాన్ని స్వరూపంలోకి తీసుకు రండి. జ్ఞానం ముఖ్యంగా రెండు పదాలది. "రచయిత మరియు రచన" లేక "అల్లా(అల్ఫ్) మరియు వారసత్వము(బే)" అని అంటారు. రచయిత అయిన తండ్రి గురించి అర్థమయ్యింది అనగా పరమాత్మ పరిచయం, వారితో సంబంధం స్పష్టమయ్యింది. రచన అనగా మొదట "నేను శ్రేష్ఠమైన ఆత్మను" రెండవది - ఆత్మనైన నాకు ఈ అనంతమైన



రచన అనగా అనంతమైన డ్రామాలో మొత్తం కల్పంలో ఏ ఏ పాత్ర ఉంది" - ఈ మొత్తం జ్ఞానమైతే అందరికీ ఉంది కదా! కానీ శ్రేష్ఠమైన ఆత్మ స్వరూపంగా అయ్యి ప్రతీ సమయంలో శ్రేష్ఠమైన పాత్రను అభినయించడంలో ఒకసారి గుర్తుంటుంది, ఒకసారి మర్చిపోతారు. ఒకవేళ ఈ రెండు పదాల జ్ఞానముంది, యోగం కూడా ఈ రెండు పదాల ఆధారం పైనే ఉంది కదా! జ్ఞానంతో యోగానికి స్వతహాగానే సంబంధముంది. ఎవరైతే జ్ఞాన యుక్త ఆత్మలుగా ఉంటారో, వారు స్వతహాగానే యోగయుక్త ఆత్మలుగా కూడా ఉంటారు. కావున జ్ఞానము మరియు యోగానికి సంబంధముంది కదా! ఎవరైతే జ్ఞానులుగా మరియు యోగులుగా ఉంటారో వారి ధారణ శ్రేష్ఠంగా ఉంటుందా? లేక బలహీనంగా ఉంటుందా? స్వతహాగానే శ్రేష్ఠంగా ఉంటుంది కదా. సహజంగా ఉంటుంది కదా! లేక ధారణలో కష్టముంటుందా? ఎవరైతే జ్ఞానయుక్త ఆత్మలుగా, యోగయుక్త ఆత్మలుగా ఉన్నారో, వారు ధారణలో బలహీనంగా ఉండగలరా? ఉండరు. అలా ఉన్నారంటే జ్ఞాన-యోగాలు లేవు. జ్ఞానులుగా ఉన్నారు గానీ జ్ఞానయుక్త ఆత్మల స్థితి లేదు. యోగాన్ని జోడించేవారుగా ఉన్నారు కానీ యోగీ జీవితాన్ని జీవించేవారుగా లేరు. జీవితం సదా ఉంటుంది మరియు న్యాచురల్‌గా ఉంటుంది. యోగీ జీవితం అనగా వారి ఒరిజనల్ నేచర్ (సహజ స్వభావం) యోగీదిగా ఉంటుంది.

కల్పక్రితం కలిసిన ఆ తండ్రియే మళ్లీ వచ్చి కలిశారని తండ్రి పై నిశ్చయముంది. అదే విధంగా మేము కూడా అదే కల్పక్రితము ఉన్న తండ్రితో పాటు పాత్రను అభినయించిన విశేష ఆత్మలమని మీ పైన మీకు నిశ్చయముందా? లేక తండ్రి పై నిశ్చయం ఎక్కువగా, స్వయం పై తక్కువగా ఉందా? మంచిది, డ్రామాలో ఏదైతే జరుగుతుందో దాని పైన కూడా పక్కా నిశ్చయముందా? ఏదైతే డ్రామాలో జరుగుతుందో అది కళ్యాణకారి యుగమైన కారణంగా అంతా కళ్యాణకారియేనా లేక కొంచెం అకళ్యాణం కూడా జరుగుతుందా? ఎవరైనా మరణించినట్లయితే అందులో కళ్యాణముందా? వారు మరణిస్తున్నారు, మీరేమో కళ్యాణమని అంటారు,

కళ్యాణమేనా? వ్యాపారంలో నష్టం కలిగింది, అది కళ్యాణమా? కావున నష్టం కూడా కళ్యాణకారియే. జ్ఞానంలోకి రాక ముందు ఏ విషయాలైతే ఎప్పుడూ మీ వద్దకు రాలేదో అవి జ్ఞానంలోకి వచ్చిన తర్వాత వచ్చినట్లయితే అందులో కళ్యాణముందా? మాయ మిమ్ములను పైకి-క్రిందికి చేస్తూ ఉంది, అందులో కళ్యాణముందా? ఇందులో ఏ కళ్యాణముంది? మాయ మిమ్ములను అనుభవీలుగా చేస్తుంది. మంచిది. అయితే డ్రామా పై కూడా అంత చలించని నిశ్చయముండాలి. చూచేందుకు మంచి విషయంగా ఉండకపోయినా అందులో కూడా గుప్తమైన మంచి ఏమి నిండి ఉందో దానిని పరిశీలించాలి. కొన్ని వస్తువులు ఎలా ఉంటాయంటే వాటి కవరు (మూత) బయటి నుండి బాగుండదు. కానీ లోపల చాలా మంచి వస్తువు ఉంటుంది. బయటి నుండి చూసినట్లయితే అందులో ఏముందో తెలియదని అనిపిస్తుంది. కానీ దానిని తెరచి లోపల చూసినట్లయితే ఫస్ట్ క్లాసైన వస్తువు బయట పడ్తుంది. కావున డ్రామాలో ప్రతి విషయాన్ని పరిశీలించే బుద్ధి కావాలి. నిశ్చయానికి గుర్తింపు అటువంటి సమయంలోనే వస్తుంది. పరిస్థితులు ఎదురుగా వచ్చినప్పుడు, పరిస్థితులు వచ్చిన సమయంలో నిశ్చయ స్థితి ఉన్నప్పుడే నిశ్చయబుద్ధి విజయంతి అని అంటారు. కావున తండ్రి పైన, స్వయం పైన మరియు డ్రామా పైన మూడింటి పై పక్కా నిశ్చయముండాలి. బాధలో విలవిలలాడుతున్నారు, మీరు వహ్వా డ్రామా, వహ్వా అని అంటారు. అలాంటి సమయంలో అరుస్తారా లేక వహ్వా వహ్వా అని అంటారా? అయ్యో! తండ్రీ రక్షించండి అని అనరు కదా! నిశ్చయముంటే, నిశ్చయానికి అర్థమే సంశయానికి నామ-రూపాలు కూడా ఉండరాదు. ఏమి జరిగినా చలించని అచంచలమైన నిశ్చయబుద్ధి గలవారిని, ఎటువంటి పరిస్థితి అయినా అలజడిలోకి తీసుకు రాజాలదు. ఎందుకంటే అలజడిలోకి రావడం అనగా బలహీనంగా అవ్వడం.

**21-11-1992**

నిశ్చింత చక్రవర్తుల విశేషత - వారు సదా ప్రశ్నచిత్తులకు బదులు ప్రసన్నచిత్తులుగా ఉంటారు. ప్రతి కర్మలో స్వంత సంబంధంలో లేక సర్వుల



సంబంధంలో లేక ప్రకృతి సంబంధంలో కూడా ఏ సమయంలోనైనా, ఏ విషయంలోనైనా, సంకల్ప మాత్రములో కూడా ప్రశ్న మార్కు ఉండదు - ఇది ఇలా ఎందుకు? ఏమి జరుగుతూ ఉంది? ఇలా కూడా జరుగుతుందా? ప్రసన్నచిత్తులైన ఆత్మలు ప్రతి కర్మను చేస్తూ, చూస్తూ, వింటూ, ఆలోచిస్తూ ఏదైతే జరుగుతూ ఉందో అది నా కొరకు మంచిది మరియు సదా మంచే జరుగుతుంది అని సంకల్పం చేస్తారు. ప్రశ్నచిత్తులైన ఆత్మలు ఏమిటి? ఎందుకు? ఇలాగ, అలాగ........ ఈ చిక్కుల్లో స్వయాన్ని నిశ్చింత స్థితి నుండి చింతలోకి తీసుకొస్తారు. నిశ్చింత ఆత్మలు చెడును కూడా మంచిలోకి పరివర్తన చేసుకుంటారు. అందువలన వారు సదా ప్రసన్నంగా ఉంటారు.

ఈ రోజుల్లో సైన్సు సాధనాల ద్వారా కూడా ఏవైతే వ్యర్థమైన, చెడిపోయిన పదార్థాలున్నాయో వాటిని పరివర్తన చేసి మంచి వస్తువులను తయారు చేస్తున్నారు. కావున ప్రసన్నచిత్తులైన ఆత్మలు సైలెన్స్ శక్తి ద్వారా విషయం చెడుగా ఉన్నా, సంబంధాలు చెడుగా అనుభవమవుతున్నా ఆ చెడును మంచిలోకి పరివర్తన చేసి స్వయంలో కూడా ధారణ చేస్తారు, ఇతరులకు కూడా తమ శుభ భావనతో కూడిన శ్రేష్ఠ సంకల్పాల ద్వారా చెడును మార్చి మంచిని ధారణ చేసే శక్తిని ఇస్తారు. చాలా మంది పిల్లలు - ఉన్నదే చెడు లేక తప్పుడు విషయమైనప్పుడు, తప్పును తప్పు అనే అనవలసి ఉంటుంది కదా లేక తప్పును తప్పుగానే భావించవలసి ఉంటుంది కదా అని అంటారు. కానీ తప్పును తప్పుగా భావించడం - ఇది అర్థం చేసుకునే లెక్కతో అర్థం చేసుకున్నారు. అది రైటా, రాంగా అన్నది తెలుసుకోవడం వేరే విషయం. కానీ జ్ఞాన స్వరూప రూపంతో అర్థం చేసుకున్న తర్వాత స్వయంలో ఏ ఆత్మ యొక్క చెడునైనా చెడుగా తమ బుద్ధిలో ధారణ చేయరు. కనుక అర్థం చేసుకోవడం వేరే విషయం. తెలుసుకునేంతవరకు సరిగ్గానే ఉంది కానీ స్వయంలో లేక తమ చిత్తంలో, తమ బుద్ధిలో, తమ వృత్తిలో, తమ వాణిలో ఇతరుల చెడును చెడు రూపంలో ధారణ చేయరాదు, ఇముడ్చుకోరాదు. కావున తెలుసుకోవడానికి, ధారణ చేయడానికి వ్యత్యాసముంది.

**30-11-1992**

దాదీలతో కలయిక - బాప్‌దాదా సెకండులో ఎన్ని మాటలు మాట్లాడగలరు? సమయం తక్కువ, విషయాలేమో ఎక్కువ. ఎందుకంటే ఫరిస్తాలు సైగలతోనే అర్థం చేసుకుంటారు. కనుక ఈ దృష్టికి చెందిన భాష ఫరిస్తాతనానికి గుర్తు. దీనిని కూడా బాప్‌దాదా నేర్పిస్తూ ఉంటారు. నేటి సమయ ప్రమాణంగా ఒకవేళ ఎవరైనా వాణి ద్వారా వినిపించాలంటే సమయం కూడా ఉండాలి, సాహసం కూడా ఉండాలి. ఒకవేళ మధురమైన దృష్టి ద్వారా అర్థం చేయించే ప్రయత్నం చేసినట్లైతే ఎంత సహజమైపోతుంది! సమయానుసారంగా దృష్టి ద్వారా పరివర్తనవ్వడం, పరివర్తన చేయించడం - ఇదే ఉపయోగపడ్తుంది. వినిపిస్తే మాకు ముందే తెలుసని అందరూ అంటారు. కానీ మధురమైన దృష్టి మరియు శుభవృత్తి ద్వారా ఒక నిముషంలోనే ఒక గంట సేపు అర్థం చేయించే కార్యం చేయగలరు. ఈ రోజుల్లో ఈ విధియే శ్రేష్ఠమైనది. అంతేకాక అంత్యములో కూడా ఇదే ఉపయోగపడ్తుంది. తండ్రిని అనుసరిస్తూ ఉంటారు. విఘ్నాలను కూడా మనోరంజనంగా భావించి నడుస్తూ ఉంటారు. వాహ్ డ్రామా వాహ్. ఏ రకమైన దృశ్యమైనా వాహ్ వాహ్‌గానే ఉండాలి, బాగుండాలి. బాప్‌దాదా పిల్లల ధైర్యం, ఉమంగ-ఉల్లాసాన్ని చూసి సంతోషిస్తున్నారు, ఇంకా పెంచుతూ ఉంటారు. ఇదే నిమిత్తంగా అయినందుకు లిఫ్ట్ అనే విశేషమైన గిఫ్ట్.

**20-12-1992**

స్వయాన్ని సదా విఘ్నవినాశక ఆత్మగా అనుభవం చేస్తున్నారా? లేక విఘ్నాలు వస్తే భయపడేవారా? విఘ్నవినాశక ఆత్మలు సదా సర్వశక్తులతో సంపన్నంగా ఉంటారు, విఘ్నాలకు వశమయ్యేవారు కాదు. విఘ్నవినాశకుల పై ఎప్పుడైనా కొద్దిగా విఘ్నాల ప్రభావం పడ్తుందా? ఎప్పుడైనా ఏ విధమైన విఘ్నమైనా వస్తే, విఘ్నాల పని రావడం, మా పని విఘ్నవినాశకులుగా అవ్వడం అని గుర్తుంచుకోండి. పేరే విఘ్నవినాశకులమని ఉన్నప్పుడు విఘ్నాలు వచ్చినప్పుడు వాటిని నాశనం చేస్తారు కదా. కనుక మా వద్దకు ఈ విఘ్నాలు ఎందుకు వస్తున్నాయని ఎప్పుడూ ఆలోచించకండి. విఘ్నాలు రావలసిందే,



మేము విజయులుగా అవ్వవలసిందే అని భావించండి. కనుక విఘ్నవినాశక ఆత్మలు ఎప్పుడూ విఘ్నాలకు భయపడరు, ఓడిపోరు. ఇటువంటి ధైర్యముందా? ఎందుకంటే ఎంత ధైర్యముంచుతారో, ఒక వంతు పిల్లలు ధైర్యము చేస్తే వెయ్యి రెట్లు తండ్రి సహాయము చేస్తారు కనుక తండ్రి ఇంతగా సహాయము చేస్తున్నప్పుడు విఘ్నాలు కష్టమనిపిస్తాయా? అందువలన విఘ్నాలు ఎంత పెద్దవైనా ఏమని అనుభవమవుతుంది? ఇది విఘ్నము కాదు, ఒక ఆటగా అనిపిస్తుంది. కావున ఆటలో ఎప్పుడైనా భయపడ్తారా? ఆట ఆడడంలో సంతోషమవుతుంది కదా! ఇలా ఆటగా భావించడం వలన భయపడరు, చాలా సంతోషంగా విజయులుగా అవుతారు. సదా డ్రామా జ్ఞానము స్మృతిలో ఉండడం ద్వారా ఏ విఘ్నము వచ్చినా "నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు)" అని భావిస్తారు. ఇది కొత్తగా రాలేదు, చాలా పాతది అని భావిస్తారు.

ఎన్నిసార్లు విజయులుగా అయ్యారు?(అనేక సార్లు). గుర్తుందా? లేక ఊరకే అంటున్నారా? డ్రామా రిపీట్ అవుతుందని విన్నారు కనుక అనేకసార్లు చేశామని అంటున్నారా లేక భావిస్తున్నారా? ఒకవేళ డ్రామా పాయింటు అనగా ఉన్నది ఉన్నట్లుగా రిపీట్ అవుతుంది అనే డ్రామా పాయింటు బుద్ధిలో స్పష్టంగా ఉన్నట్లయితే ఆ నిశ్చయం అనుసారంగా ఉన్నది ఉన్నట్లుగా రిపీట్ అవుతూ ఉంటే అనేకసార్లు పునరావృతమయ్యింది, ఇప్పుడు మళ్లీ రిపీట్ అవుతూ ఉంది. కానీ ఇది నిశ్చయానికి చెందిన విషయము. ముందు కల్పంలో వేరే ఎవ్వరో విజయులుగా అయ్యారు, ఈ కల్పంలో మీరు విజయులుగా అవ్వడం - ఇలా జరగనే జరగదు. ఎందుకంటే ఇది తయారైన డ్రామా అని చెప్తున్నప్పుడు ఇది ముందే తయారు చేయబడింది, ఇప్పుడు తయారవుతూ ఉంది అనగా రిపీట్ చేస్తున్నారు. ఇటువంటి నిశ్చయబుద్ధి గలవారు అచంచలంగా, స్థిరంగా ఉంటారు.

అచల్‌ఘర్ ఎవరి స్మృతిచిహ్నము? జ్ఞాన రహస్యాలలో ఎవరైతే అచంచలంగా ఉంటారో, వారి స్మృతిచిహ్నమే అచల్‌ఘర్. కావున మేము ప్రాక్టికల్‌గా మా స్మృతిచిహ్నాన్ని చూస్తున్నామనే నశా ఉంటుంది కదా. ఎవరైతే

సదా విఘ్నవినాశక స్థితిలో స్థితమై ఉంటారో, వారు సదా డబల్‌లైట్‌గా ఉంటారు. ఏదైనా భారముందా? సర్వస్వము నీదిగా చేసేశారా? లేక సగం మీది, సగం నాదిగా భావిస్తున్నారా? 75 శాతం తండ్రిది, 25 శాతం నాది అని అనుకుంటున్నారా? ఒకప్పుడు మీది అంటూ, అవసరమొచ్చినప్పుడు నాది అంటున్నారా? నాది నాది అన్నప్పుడు ఏం లభించిందో అనుభవం చేశారు కదా? నీది అని అనడం వలన సంపన్నంగా అయిపోతారు. నాది నాది అన్నప్పుడు ఖాళీ అయిపోతారు. సదా డబల్‌లైట్‌గా ఉండాలంటే సర్వస్వము నీదిగా భావించాలి. కొద్దిగానైనా మోహం ఉంటే నాది అనేది ఉంటుంది. నీది అనగా నిర్మోహులుగా అవ్వడం.

**దాదీలతో కలయిక –** వర్తమాన సమయంలో ఏ బ్యాలన్స్ నడుస్తూ ఉంది? ఒకవైపు ధమాల్(గలాటా, కోలాహలం), రెండవ వైపు కమాల్(అద్భుతం). ఏమి జరుగుతున్నా అద్భుతమే జరుగుతూ ఉంది కదా. ప్రతీ క్షేత్రంలో మీరైతే ముందుకే వెళ్తున్నారు కదా. కనుక ప్రపంచంలో ధమాల్ ఉంది, మీ వద్ద అద్భుతమైన సమాచారాలున్నాయి. ఎంత ధమాల్ అవుతుందో, అంత మీ అద్భుతం జరుగుతుంది. అంతేకాక ప్రత్యక్షమవుతూ ఉంటారు. ప్రపంచములోని వారు భయపడ్తారు, మీరు ఇంకా నిర్భయులుగా అవుతారు. నిర్భయులుగా ఉన్నారా లేక ధమాల్ జరిగితే భయపడ్తారా? ఎంత కోలాహలాన్ని చూస్తారో అంత ఈ రోజు కోలాహలముంది, రేపు మా అద్భుతం తప్పక జరుగుతుంది, జరిగే ఉంది అని ఆలోచిస్తారు. బ్యాలెన్స్ నడుస్తూ ఉంది కదా. చూడండి, డిగ్రీ కూడా లభిస్తూ ఉంది(దాదీగారికి ఉదయపూర్ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ డిగ్రీ లభించనున్నది). ఇండ్లు కూడా లభిస్తున్నాయి. ఏ విషయాలు అసంభవంగా ఉండినాయో, అవి సంభవమవుతూ ఉన్నాయి కనుక ఇది అద్భుతం కదా. ఆహ్వానాలు కూడా లభిస్తున్నాయి. కొంత సమయం ముందు ఇలా లేదు. ఇప్పుడు ఆహ్వానాలు పెరుగుతున్నాయి కనుక అద్భుతం పెరుగుతూ ఉంది కదా. ఈ తండ్రి బ్రహ్మా ద్వారా తీవ్రగతి సేవకు ఋజువు చూపిస్తున్నారు. కష్టమైన విషయాలు సమాయానుసారం అవన్నీ అయ్యే ఉన్నట్లు సహజమవుతూ పోతాయి.



అందువలన మీకు ఎలాంటి భయమూ లేదు. ఈ కోలాహలం, గలాటా ఎప్పుడైనా జరగాల్సిందే. దానితో పాటు మన అద్భుతం కూడా జరగాల్సిందే అని అనుకుంటారు. కర్ఫ్యూ పెట్టారు, గృహ యుద్ధాలు జరుగుతున్నాయి ఏమౌతుందో అని భయపడ్తారా? డ్రామానుసారం ఇవన్నీ పురుషార్థాన్ని ఇంకా దృఢంగా చేస్తాయి. మంచిది. అందరూ బాగున్నారా? (దాదీకి కొద్దిగా దగ్గు ఉంది). ఆరోగ్యానికి చెందిన లెక్కాచారాన్ని చుక్తా చేసుకుంటూ ఉంది. ఒకటేమో వయసు లెక్కలో కూడా లెక్కాచారం సమాప్తమవుతుంది, రెండవ రహస్యమేమంటే మహారథులు అన్ని లెక్కాచారాలు ఇక్కడే సమాప్తం చేసుకోవాలి. కొద్దిగా కూడా మిగలరాదు. బాప్‌దాదాకైతే ఇదంతా ఆటగా అనిపిస్తుంది. బ్రహ్మాబాబా ఇవన్నీ దాటినప్పుడు మీరందరూ కూడా వీటిని దాటాల్సిందే. యోగబలము ద్వారా సహజంగానైనా దాటాలి లేక ధర్మరాజు క్రాస్(శూలము) పైకి అయినా ఎక్కాలి. కనక దాదీ క్రాస్ చేస్తున్నారు (దాటుకుంటున్నారు). కనుక ధర్మరాజు క్రాస్(శూలము) పైకి ఎక్కరు.

**31-12-1992**

సేవలో సఫలత మరియు ప్రత్యక్షత డ్రామానుసారం పెరుగుతూ పోతుంది. ఇప్పుడు పెరుగుతూ ఉండడం మీరు చూస్తున్నారు కదా. ఇంతకు ముందు మీరు ఆహ్వానించేవారు, ఇప్పుడు వారే మిమ్ములను ఆహ్వానిస్తున్నారు. కనుక సేవలో సఫలత ప్రత్యక్షమవుతూ ఉంది కదా. మీకు ఏ స్టేజి గానీ, డిగ్రీ గానీ లభించే అవసరం లేదు. కానీ ఇది సేవ యొక్క ప్రత్యక్షత. భగవంతుడు ఇచ్చే డిగ్రీ ముందు ఈ డిగ్రీ లెక్కలోకి రాదు (ఉదయపూర్ విశ్వవిద్యాలయం దాదీగారికి హానరరీ డాక్టరేట్ డిగ్రీ ఇచ్చింది). కానీ ఇది కూడా ప్రత్యక్షత అయ్యేందుకు ఒక సాధనం. సాధన ద్వారా సేవ ప్రత్యక్షమవుతూ ఉంది. తయారు చేయబడిన స్టేజి లభించనే లభిస్తుంది. ఈ ధర్మనేతలు కూడా మిమ్ములను ఆహ్వానించి ముఖ్య అతిథిగా చేసే రోజు కూడా తప్పకుండా వస్తుంది. ఇప్పుడు ఇంకా బాహ్య రూపు రేఖలను వారు ఉంచుకోవలసి వస్తుంది. కానీ ఈ పవిత్ర ఆత్మలకు సీటు ఇవ్వాలి అని వారు లోలోపల అనుభవం చేస్తున్నారు. రాజకీయ నేతలైతే మీరు

మమ్ములను ముఖ్య అతిథులుగా చేశారు, మా కంటే మీరే ముఖ్య అతిథులుగా ఉంటే బాగుంటుంది అని అంటూనే ఉన్నారు. కానీ డ్రామాలో పేరు వారిది, పని మీదిగా అవుతుంది.

దాదీలతో కలయిక – డ్రామాలో ఈ దృశ్యాన్ని చూసి సంతోషిస్తున్నారు కదా. "వాహ్ డ్రామా వాహ్, వాహ్ బాబా వాహ్" ఈ పాట అనాది, అవినాశిగా నడుస్తూనే ఉంటుంది. పిల్లలు తండ్రిని ప్రత్యక్షం చేస్తారు, తండ్రి శక్తి సైన్యాన్ని ప్రత్యక్షం చేస్తారు.

**09-01-1993**

స్వయాన్ని త్రికాలదర్శులుగా అనుభవం చేస్తున్నారా? సంగమ యుగంలో తండ్రి ఆత్మలందరినీ త్రికాలదర్శులుగా చేస్తారు. ఎందుకంటే సంగమ యుగం శ్రేష్ఠమైనది, ఉన్నతమైనది. కనుక ఉన్నతమైన స్థానంలో నిలబడి చూస్తే మొత్తమంతా కనిపిస్తుంది. కనుక ఉన్నతమైన సంగమ యుగంలో నిలబడినందున మూడు కాలాలు కనిపిస్తాయి. ఒకవైపు దు:ఖధామమును గురించిన జ్ఞానము, రెండవ వైపు సుఖధామాన్ని గురించిన జ్ఞానము, ఇవి కాక వర్తమాన సమయంలో సంగమయుగ జ్ఞానము కూడా ఉంది. కనుక త్రికాలదర్శులుగా అయిపోయారు కదా. మూడు కాలాల జ్ఞానము ఎమర్జ్ రూపంలో ఉందా? మూడు కాలాలను స్మృతిలో ఉంచుకోండి - నిన్న దు:ఖధామంలో ఉండేవారము, ఈ రోజు సంగమ యుగంలో ఉన్నాము, మళ్లీ రేపు సుఖధామంలోకి వెళ్తాము. ఏ కర్మ చేసినా త్రికాలదర్శులై చేస్తే ప్రతీ కర్మ శ్రేష్ఠంగా ఉంటుంది. వ్యర్థమైనదిగా ఉండదు, సమర్థంగా ఉంటుంది. సమర్థమైన కర్మకు ఫలితము సమర్థమైనదే లభిస్తుంది. త్రికాలదర్శులుగా అయినందున ఇది ఎందుకు జరిగింది, ఎలా జరిగింది, ఇలా కాక అలా అవ్వాల్సింది,.... ఈ ప్రశ్నార్థకాలన్నీ సమాప్తము అయిపోతాయి. లేకుంటే చాలా ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఎందుకు అనే ప్రశ్న ఉత్పన్నమైనా వ్యర్థ సంకల్పాల క్యూ ఏర్పడ్తుంది. త్రికాలదర్శులుగా అయితే ఫుల్‌స్టాప్ పెట్టబడ్తుంది. నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు) అని భావిస్తే ఫుల్‌స్టాప్ పెట్టబడ్తుంది కదా. ఫుల్‌స్టాప్ అనగా బిందువు పెట్టినందున బిందు రూపం



సులభంగా గుర్తుకొస్తుంది.

అమృతవేళలో సదా మూడు బిందువుల తిలకాన్ని ధరించమని బాప్‌దాదా సదా చెప్తుంటారు. మీరు కూడా బిందువే, తండ్రి కూడా బిందువే, ఏదైతే గతించిపోయిందో, ఏదైతే జరుగుతూ ఉందో అవన్నీ కొత్తవేమీ కావు, కనుక ఫుల్‌స్టాప్. అది కూడా బిందువే. ఈ మూడు బిందువుల తిలకము అనగా స్మృతి తిలకము. మస్తకము స్మృతికి స్థానము. కనుక తిలకము మస్తకము పైననే దిద్దుకుంటారు. మూడు బిందువుల తిలకాన్ని పెట్టుకోవడమనగా స్మృతిలో ఉంచుకోవడం. అప్పుడు రోజంతా అచల్ అడోల్‌గా ఉంటారు. ఎందుకు, ఏమి అనే ప్రశ్నలే ఆందోళనను కలుగజేస్తాయి. కనుక అచలంగా(స్థిరంగా) ఉండేందుకు సాధనము - అమృతవేళలో మూడు బిందువుల తిలకాన్ని పెట్టుకోండి. ఇది మర్చిపోకండి. ఎప్పుడైనా ఏదైనా విషయం జరిగితే ఆ సమయంలో దానికి ఫుల్‌స్టాప్ పెట్టండి. గుర్తు ఉండేది కానీ ఆ సమయంలో మర్చిపోయామని అనరాదు. కారులో ప్రయాణించునప్పుడు సమయానికి బ్రేకు పని చేయకపోతే లాభం జరుగుతుందా లేక నష్టం సంభవిస్తుందా? కనుక సమయానికి ఫుల్‌స్టాప్ పెట్టండి. నథింగ్ న్యూ - జరగవలసిందే జరుగుతూ ఉంది. మీరు సాక్షిగా ఉండి చూస్తూ ముందుకు సాగుతూ ఉండండి. కనుక త్రికాలదర్శి అనగా ఆది-మధ్య-అంత్యం మూడు తెలుసుకొని ఎటువంటి సమయమో, అలా స్వయాన్ని సదా సురక్షితంగా ఉంచుకునేవారు. ఈ సమస్య చాలా పెద్దది కదా చిన్నదైతే నేను పాస్ అయ్యేవాడిని కానీ సమస్య చాలా పెద్దది అని అనకండి. సమస్య ఎంత పెద్దదైనా మీరు మాస్టర్ సర్వశక్తివంతులు కదా కనుక మీరు పెద్దవారయ్యారు కదా. పెద్దవారి ముందు సమస్య సమస్య కాదు ఒక ఆట వలె ఉంటుంది. అటువంటివారినే త్రికాలదర్శులని అంటారు. త్రికాలదర్శి ఆత్మ సదా నిశ్చింతగా ఉంటుంది ఎందుకంటే వారికి మా విజయము నిశ్చితము అని నిశ్చయముంటుంది.

**09-01-1993**

జానకి దాదీతో – మీ ధైర్యము మరియు అందరి సహయోగ దీవెనలు మీ

శరీరాన్ని నడిపిస్తున్నాయి. సమయానికి శరీరము కూడా సహయోగమునిస్తుంది. దీనిని ఆశీర్వాదాల అదనపు సహాయము అని అంటారు. విశేష ఆత్మలకు ఈ అదనపు సహాయం లభించనే లభిస్తుంది. శరీరానికి కొద్దిగా విశ్రాంతి కూడా ఇవ్వవలసి వస్తుంది. ఇవ్వకపోతే అది గొడవ చేస్తుంది. మీరు ఇతరులకు ఏది కావాలో అది ఇస్తారు కదా. కొంతమందికి శాంతి కావాలి, కొంతమందికి సుఖము కావాలి, కొంతమందికి ధైర్యము కావాలి - ఇవన్నీ ఇస్తున్నారు కదా! కనుక శరీరానికి ఏం కావాలో అది కూడా ఇస్తూ ఉండండి. దీనికి కూడా కొంత కావాలి కదా! ఎందుకంటే ఈ శరీరము కూడా తాకట్టు ఉంచబడింది కదా. దీనిని కూడా సంభాళించవలసి వస్తుంది కదా. చాలా ధైర్యంగా శరీరాన్ని నడిపిస్తున్నారు. అలా నడవాల్సిందే. సమయానికి దాని అవసరమనుసారము ఎలాగైతే శరీరం మీకు సహయోగం చేస్తుందో మీరు కూడా దానికి కొద్ది కొద్దిగా సహయోగమివ్వండి. నాలెడ్జ్‌ఫుల్‌గా అయితే ఉన్నారు. అంతా బాగుంది. ఎందుకంటే ఈ శరీరం ద్వారానే అనేక ఆత్మల కళ్యాణం జరగాలి. మీరు జతలో ఉంటే చాలు అందరూ చాలా పెద్ద సహాయం జరుగుతున్నట్లు అనుభవం చేస్తారు. హాజరవ్వడం కూడా సేవ జరిగినట్లవుతుంది. స్థూల సేవ చేయకపోయినా హాజరైనందున హాజరు పడిపోతుంది. ఒక్క సెకండు కూడా సేవ లేకుండా ఉండలేరు, ఉండరు కూడా. అందువలన సేవ ఖాతాలో జమ అవుతూనే ఉంది. చాలా బాగా పాత్ర చేస్తున్నారు. ఇలా చేస్తూనే ఉంటారు. మంచి పాత్ర లభించింది కదా. ఇంత ఫస్ట్‌క్లాస్ అయిన పాత్ర డ్రామానుసారం ఆశీర్వాదాల కారణంగా లభించింది. ఈ బ్రాహ్మణ జన్మ ఆది సంస్కారమైన దయాహృదయము మరియు సహయోగ భావనల ఫలము. శరీరంతో గానీ, మనసుతో గానీ దయాహృదయము మరియు సహయోగ భావనల పాత్ర ఆది నుండే మీకు లభించింది. అందువలన దాని ఫలము సులభంగా లభిస్తూ ఉంది. శరీరానికి సహయోగమిచ్చే సేవ కూడా హృదయపూర్వకంగా చేశారు. అందువలన ఆశీర్వాదాల కారణంగా శరీర ఆయువు కూడా పెరుగుతూ ఉంది.



చంద్రమణి దాదీతో - అనంతమైన చక్రవర్తిగా అయిపోయారు - ఈ రోజు ఇక్కడ, రేపు అక్కడ. దీనినే విశ్వంలోని ఆత్మలతో స్వతహాగా సహజంగా సంబంధాన్ని వృద్ధి చేసుకోవడం అని అంటారు. విశ్వం పై రాజ్యపాలన చేయాలి. మీరు విశ్వకళ్యాణకారులు కనుక విశ్వం మూలమూలలా పాదాలైతే ఉంచాలి కదా. అందువలన దేశ-విదేశాలలో సేవ చేసే అవకాశం లభిస్తుంది. ప్రోగ్రామ్ తయారు చేసుకోకపోయినా డ్రామానుసారం సంగమ యుగంలోని ఈ సేవ భవిష్యత్తును ప్రత్యక్షం చేస్తోంది. అందువలన అనంతమైన సేవ మరియు అనంతమైన సంబంధ-సంపర్కాలు వృద్ధి చెందుతూ ఉన్నాయి, ఇంకా వృద్ధి చెందుతూ ఉంటాయి. రాష్ట్రానికి రాజులుగా అవ్వడం కాదు, విశ్వానికి రాజులుగా అవ్వాలి. కేవలం పంజాబుకు మాత్రమే రాజుగా అవ్వరాదు. అది నిమిత్తంగా ఉన్న డ్యూటీ. దానిని డ్యూటీ అని భావించి నిభాయిస్తావు కానీ మధువన నివాసిగా అవ్వమని ఆజ్ఞ లభిస్తూనే పంజాబు ఏమవుతుందో అని ఆలోచిస్తావా? ఆలోచించవు. ఏ ఏ స్థానంలో ఎంతవరకు ఉంటావో ఏ ఏ డ్యూటీ లభిస్తుందో, ఆ డ్యూటీని మంచి రీతిగా నిభాయించాల్సిందే.

**18-02-1993**

సంగమ యుగంలోని ప్రతి సెకండు చాలా చాలా మంచిది - ఈ నిశ్చయంతో సహజ యోగిగా అవ్వండి. అన్ని పాయింట్ల సారమేమిటి? పాయింటుగా అవ్వడం. అన్ని పాయింట్ల సారము(ఎస్సెన్స్) పాయింటుగా అవ్వడం. అయితే పాయింటుగా అవ్వడం సులభమా, కష్టమా? ఏదైతే సహజ విషయంగా ఉంటుందో, అది సదా జరుగుతుంది. ఏ విషయమైతే కష్టంగా ఉంటుందో అది అప్పుడప్పుడు జరుగుతుంది. అన్నిటికంటే సహజమైనదేది? బిందువు(పాయింటు). కాగితం పై బిందువును వ్రాయడం సులభమే కదా. ఎప్పుడైనా బిందు రూపంలో స్థితం కాకుంటే ప్రశ్నార్థకాల క్యూ వచ్చేస్తుంది కదా. ప్రశ్నార్థకం ఉంచడం కష్టంగా ఉంటుంది. కనుక ప్రశ్నార్థకము ఎప్పుడు వచ్చినా దానికి బదులుగా సులభంగా ఉండే బిందువు పెట్టేయండి. ఏ విషయాన్నైనా సమాప్తము చేయాలంటే దానికి బిందువు

పెట్టేయండి అని అంటారు. ఫుల్‌స్టాప్ పెట్టడం వచ్చు కదా. ఫుల్‌స్టాప్ ఉంచేందుకు సహజమైన స్లోగన్ గుర్తుంచుకోండి - ఏది జరిగిపోయిందో, ఇప్పుడు ఏది జరుగుతూ ఉందో, ఇక ముందు ఏది జరుగుతుందో అంతా మంచిదే, మంచే జరుగుతుంది ఎందుకంటే మంచిగా అనిపించనప్పుడే ప్రశ్నలు తలెత్తుతాయి. అందువలన ఈ సంగమ యుగమే అత్యంత మంచిది. ప్రతి సెకండు కూడా అత్యంత మంచిదే. దీని ద్వారా సదా సహజయోగీ జీవితాన్ని అనుభవం చేస్తారు. మంచిది అని అనడం వలన మంచే జరుగుతుంది. స్వయం కూడా మంచివారిగా అవుతారు, మీరు ఏ పని చేస్తారో, అది కూడా మంచిగానే అవుతుంది. మంచిని చూసి ఇతరులు తప్పకుండా ఆకర్షితమవుతారు. అందరూ మంచినే ఇష్టపడ్తారు. మంచిది. సేవ బాగా నడుస్తోంది కదా. సంఖ్యనూ పెంచండి, క్వాలిటీని కూడా పెంచుతూ ఉండండి. ఒక్కరి పేరుతో అనేకమందికి కళ్యాణము జరిగే మైకులను తయారు చేయండి. స్వయం సదా సంతుష్టంగా ఉన్నారా? మీకైతే ఏ ప్రశ్నలూ లేవు కదా. నిశ్చయమే పునాది, నిశ్చయమనే పునాది ఉంటే కర్మలు స్వతహాగా శ్రేష్ఠంగా అవుతాయి. ముందు స్మృతిలో నిశ్చయముండాలి. సంకల్పంలో నిశ్చయం అనగా దృఢత ఉంటే కర్మలు స్వతహాగా ఫలాన్నిస్తాయి, మంచిది. అందరూ సంతోషంగా, తృప్తిగా ఉన్నారా? సదా సంతోషంగా నాట్యం చేసేవారు! ఆందోళన చెందే సమయం సమాప్తమైపోయింది. జరిగిందేదో జరిగిపోయింది. ఇక భవిష్యత్తు అంటారా అది చాలా సుందరంగా ఉంటుంది. బాంగారు భవిష్యత్తు ఉంటుంది.

మంచిది. వీరు ఏ భాష మాట్లాడేవారు?(స్పానిష్, పోర్చుగీసు). చూడండి, సైన్సు సాధనాలు మీకు ఉపయోగపడ్తున్నాయి కదా. డ్రామానుసారం సైన్సు వారికి కూడా తండ్రికి అవసరమున్నప్పుడే ఈ పరికరాలన్నీ టచ్ అయ్యాయి. సాధనాలను ఉపయోగించడం వేరే విషయము, సాధనాలకు వశమవ్వడం వేరే విషయము.

**26-03-1993**

జ్ఞానములో మూడు అనే సంఖ్యకు మహత్యముంది. త్రికాలదర్శిగా



కూడా అవుతారు, మీకు మూడు కాలాలూ తెలుసు లేక కేవలం వర్తమాన సమయం మాత్రమే తెలుసా? ఏ కర్మ చేస్తున్నా త్రికాలదర్శులుగా అయ్యి కర్మ చేస్తారా? లేక కేవలం ఏకదర్శిగా అయ్యి కర్మ చేస్తారా? ఏకకాలదర్శులా లేక త్రికాలదర్శులా? రేపు ఏమి జరగబోతుందో అది తెలుసా? రేపు ఏమి జరగబోతుందో అది చాలా మంచిదని మాకు తెలుసునని చెప్పండి. ఈ విషయమైతే తెలుసు కదా! కనుక మీరు త్రికాలదర్శులుగా అయినారు కదా. ఏదైతే జరిగిపోయిందో అది కూడా మంచిదే, ఇప్పుడేది జరుగుతూ ఉందో అది ఇంకా మంచిది, ఇక జరగబోయేది అది చాలా చాలా మంచిది! చాలా మంచిదే జరుగుతుంది, చెడు జరగజాలదు అనే నిశ్చయం ఉంది కదా. ఎందుకు? అత్యంత మంచి తండ్రి లభించారు. మీరు అత్యంత మంచిగా తయారయ్యారు, అత్యంత మంచి పనులే చేస్తున్నారు కనుక అంతా మంచే కదా లేక కొంచెం చెడ్డగా, కొంచెం మంచిగా ఉన్నారా? ఎప్పుడైతే నేనొక శ్రేష్ఠమైన ఆత్మను అని తెలిసిపోయిందో అప్పుడు శ్రేష్ఠ ఆత్మల సంకల్పాలు, మాటలు, కర్మలు అన్నీ మంచిగానే ఉంటాయి కదా. కనుక ఇది సదా స్మృతిలో ఉంచుకోండి - కళ్యాణకారి అయిన తండ్రి లభించాడు కనుక సదా కళ్యాణమే కళ్యాణము జరుగుతుంది. తండ్రినైతే విశ్వకళ్యాణకారి అనే అంటారు. ఇక మీరు మాస్టర్ విశ్వకళ్యాణకారులుగా అయ్యారు. కనుక ఎవరైతే విశ్వకళ్యాణం చేస్తారో వారికి అకళ్యాణం జరగనే జరగదు. అందువలన ప్రతి సమయం, ప్రతి కార్యం, ప్రతి సంకల్పం కళ్యాణకారి అని నిశ్చయముంచుకోండి. సంగమ యుగానికి కూడా కళ్యాణకారి యుగమనే పేరు ఉంది. కనుక అకళ్యాణము జరగజాలదు. కనుక ఏం గుర్తుంచుకుంటారు? ఇప్పుడు ఏది జరుగుతూ ఉందో అది మంచిది, ఇక మీదట జరగబోయేది చాలా చాలా మంచిది. ఈ విషయం స్మృతిలో ఉంటే ఇది మిమ్ములను సదా ముందుకు తీసుకెళ్తూ ఉంటుంది. మంచిది. అన్ని మూలమూలలా తండ్రి జెండాను ఎగురవేస్తూ ఉన్నారు. అందరూ చాలా ధైర్యంగా తీవ్ర పురుషార్థంతో ముందుకు వెళ్తున్నారు. ఇక ముందు కూడా సదా ముందుకే వెళ్తారు. భవిష్యత్తు కనిపిస్తూ ఉంది కదా. ఎవరైనా

మీ భవిష్యత్తు ఏమి అని అడిగితే మా భవిష్యత్తు గురించి మాకు తెలుసు, అది చాలా బాగుంటుంది అని చెప్పండి.

**02-12-1993**

**జానకీ దాదీతో కలయిక** - మంచి పాత్రను అభినయించారు కదా. విశేష పాత్రధారులు ఎక్కడ ఉన్నా విశేష పాత్రను అభినయించకుండా ఉండలేరు. ఇది డ్రామాలో నిర్ణయించబడింది. మంచిది. అన్ని వైపులా తిరగడం చాలా మంచిది. అన్ని వైపులా తిరిగారు మళ్ళీ స్వీటుహోంలోకి(మధువనం) వచ్చేశారు. సేవ కొరకు చేసే చక్కర్ అనేక ఆత్మల పట్ల విశేషంగా ఉమంగ-ఉత్సాహాలను ఇప్పించే చక్రము. అంతా బాగుంది కదా? అంతా మంచిదే. డ్రామాలోని నిర్ణయము తప్పకుండా లాగుతుంది. మీరు ఉండాలనుకుంటారు కాని డ్రామాలో లేకుంటే ఏమి చేస్తారు? పోవాల్సి వస్తుందని ఆలోచన కూడా వస్తుంది. ఎందుకంటే సేవ నిర్ణయించబడింది. కనుక అది తన పనిని చేయిస్తుంది. రావాలి మళ్ళీ వెళ్లాలి ఇదే కదా పద్ధతి. మంచిది. సంఘటన బాగుంది.

**09-12-1993**

**శ్రేష్ఠ స్థితిని తయారు చేసుకునేందుకు అమృతవేళలో మూడు బిందువుల తిలకాన్ని దిద్దుకోండి**

సదా అమృతవేళలో స్వయానికి మూడు బిందువుల తిలకాన్ని ఇచ్చుకుంటున్నారా? తిలకం అంటే అర్థమేమి? స్మృతి తిలకం. కనుక తిలకానికి చాలా మహత్వముంటుంది. తిలకము రాజ్యనికి కూడా గుర్తు. రాజ్యాన్ని ఇచ్చేటప్పుడు రాజతిలకమని అంటారు. భక్తిలో కూడా గుర్తుగా తిలకాన్ని తప్పకుండా ఉంచుకుంటారు అంతేకాక సౌభాగ్యానికి, భాగ్యానికి కూడా గుర్తు తిలకమే. కనుక తిలకానికి చాలా మహత్వముంది. ఎందుకంటే తిలకము స్మృతికి గుర్తు. జ్ఞానమార్గంలో కూడా స్మృతికే మహత్వముంది కదా. ఎటువంటి స్మృతి ఉంటుందో, అటువంటి స్థితి ఉంటుంది. స్మృతి శ్రేష్ఠంగా ఉంటే స్థితి కూడా శ్రేష్ఠంగా ఉంటుంది. స్మృతి వ్యర్థంగా ఉంటే స్థితి



కూడా సమర్థానికి బదులు వ్యర్థమైపోతుంది. కనుక తండ్రి మూడు బిందువుల తిలకాన్ని అనగా మూడు స్మృతుల తిలకమునిచ్చారు. ఎందుకంటే మూడు స్మృతులూ అవసరమే, మూడు బిందువులు కూడా సహజమే. చిన్న పిల్లలకు కూడా బిందువు పెట్టమని చెప్తే సులభంగా పెట్టేస్తారు కదా. కనుక నేను ఆత్మను అనేది స్వ స్మృతి. తర్వాత తండ్రి స్మృతి, ఆ తర్వాత శ్రేష్ఠ కర్మల కొరకు డ్రామా స్మృతి. డ్రామా నడుస్తూ ఉంటుంది, గడిచిపోతుంది. ఇప్పుడు వర్తమానంగా ఉండేది ఒక్క సెకండులో భూతకాలంగా అయిపోతుంది అనగా గడిచిపోతుంది. అందువలన బీతీ సో బీతీ(గతం గత:/అయిపోయిందేదో అయిపోయింది) ఫుల్‌స్టాప్(.). కనుక బిందువైపోయింది కదా. ఈ మూడు స్మృతులు సదా గుర్తుంటే స్థితి కూడా శ్రేష్ఠంగా ఉంటుంది. కేవలం ఆత్మ స్మృతే కాదు, ఆత్మతో పాటు తండ్రి స్మృతి ఉండనే ఉంటుంది. అంతేకాక తండ్రితో పాటు డ్రామా స్మృతి కూడా అతి ఆవశ్యకం. డ్రామా జ్ఞానం లేకుంటే కర్మ హెచ్చు-తగ్గులవుతూ ఉంటుంది. రకరకాల పరిస్థితులు ఏవైతే వస్తాయో అందులో డ్రామా జ్ఞానం చాలా అవశ్యం. మీరందరూ అనభవీలే కదా. ఏ స్మృతి ఉంటుంది? ఇది జరిగే తీరాలి, కొత్తదేమీ కాదు. ఇది జరుగుతుందని ముందే తెలుసు. ఈ జ్ఞానముంటే విచలితులుగా అవ్వరు. జరగాల్సిందే అనే జ్ఞానముంటే ఆటగా భావించి చూస్తూ ఉంటారు. తుఫాను కాదు ఇది ఒక ఆట అని భావిస్తారు. నాటకములో కూడా తుఫాన్లు, వరదలు అన్నీ చూస్తారు కదా. అవి చూసి విచలితులుగా అవుతారా? ఎందుకంటే ఇది ఒక డ్రామా అని తెలుసు. అందువలన అచలంగా ఉంటారా లేక కొద్ది కొద్దిగా కదుల్తారా? ఎందుకు? ఏమి? అనే ప్రశ్నలొస్తాయా? ఏమౌతుందో, ఎలా అవుతుందో...... అనే ఆలోచనలు వస్తాయా? డ్రామా జ్ఞానమున్నప్పుడు స్థిరంగా, అచంచలంగా ఉంటారు. డ్రామా జ్ఞానము లేకుంటే అలజడి చెందుతూ ఉంటారు.

## చింతల నుండి ముక్తులై సదా నిశ్చింతులుగా లేక చింతలేని చక్రవర్తులుగా ఉండేందుకు నిశ్చయ బుద్ధి గలవారిగా అవ్వండి

**09-12-1993**

సదా స్వయాన్ని కల్ప-కల్పానికి అధికారీ ఆత్మగా అనుభవం చేస్తున్నారా? ఈ అధికారాన్ని అనేకసార్లు ప్రాప్తి చేసుకున్నారు, ఇక ముందు కూడా అధికారాన్ని ప్రాప్తి చేసుకోవడం నిశ్చితమై ఉంది అనగా కల్ప-కల్పము దీని అనుభవం చేస్తూనే ఉంటారు. ఈ నిశ్చయం పక్కాగా ఉంది కదా. ఎందుకంటే ఈ నిశ్చయమే బ్రాహ్మణ జీవితానికి పునాది. ఒకవేళ నిశ్చయమనే పునాది పక్కాగా ఉంటే ఎప్పుడూ అటు-ఇటు కదలరు. ఎన్ని తుఫానులు వచ్చినా, భూమి ఎంతగా కంపించినా చలించరు. ఎందుకంటే పునాది పక్కాగా ఉంది. ఇప్పుడు కూడా ప్రకృతిలో భూకంపాలు వచ్చినప్పుడు ఎలాంటి భవనాలు కూలిపోతాయి? వేటి పునాది కచ్చాగా ఉంటుందో అవి కూలిపోతాయి. పునాదులు పక్కాగా ఉండే భవనాలు కూలిపోవు. కనుక మీ పునాది ఎంత పక్కాగా ఉంది? కదిలేదిగా ఉందా? కదలదు కాని కొంచెం బీటలేవైనా(నెరలు, చీలికలు) వచ్చేస్తాయా? కొంచెం కూడా కదలదు. ఎందుకంటే కొంతమంది పడిపోతారు, కొంతమంది పడరు కాని నెరలు వచ్చేస్తాయి. అయితే మీరు వారి కంటే పక్కాగా ఉన్నారు. నిశ్చయానికి గుర్తు ఏమంటే ప్రతి కార్యములో మనసా, వాచా, కర్మణా సంబంధ - సంపర్కాలలో కూడా ప్రతి విషయంలో సహజంగా విజయులుగా ఉంటారు. కష్టపడి విజయులుగా అవ్వడం విజయం కాదు. సులభంగా విజయులుగా అవ్వాలి. కనుక ఈ గుర్తు కనిపిస్తూ ఉందా? లేక విజయం ప్రాప్తి చేసుకోవడంలో కష్టమేమైనా అనిపిస్తూ ఉందా? అప్పుడప్పుడు సహజంగా, అప్పుడప్పుడు కష్టంగా అనిపిస్తోందా? కాని నిశ్చయానికి గుర్తు - సులభంగా విజయం పొందడం. ఒకవేళ కష్టమనిపిస్తూ ఉందంటే ఏదో మిక్స్(కల్తీ) అయ్యిందని భావించండి. సంశయము లేకున్నా ఎంతో కొంత వ్యర్థము మిక్స్ అయ్యిందని అర్థం చేసుకోండి. అందువల్లనే సులభంగా



విజయం లభించదు. లేకుంటే నిశ్చయబుద్ధి గల ఆత్మలకు విజయం సదా ఎవర్‌రెడీగా ఉంటుంది. వారి స్థానమే అది. ఎక్కడ నిశ్చయముంటే అక్కడ విజయముంటుంది. విజయము నిశ్చయముండే వారి వద్దకే వెళ్తుంది కదా. అందువలన అన్ని విషయాలలో నిశ్చయముండాలి. కేవలం తండ్రి ఒక్కరిలో మాత్రమే కాదు, స్వయం మీకు మీ పై కూడా నిశ్చయముండాలి, బ్రాహ్మణ పరివారంలో కూడా నిశ్చయముండాలి. డ్రామాలోని ప్రతీ దృశ్యములోనూ నిశ్చయముండాలి. అప్పుడే సంపూర్ణ నిశ్చయబుద్ధి గలవారని అంటారు. ఒకవేళ తండ్రిలో నిశ్చయముండి, స్వయంలో నిశ్చయం లేకుంటే, నడుస్తూ నడుస్తూ స్వయంతో వ్యాకులపడ్తూ ఉంటే నిశ్చయమ లేదని అర్థము. అందుకే అలా జరుగుతుంది. కనుక అది కూడా అసంపూర్ణ నిశ్చయమవుతుంది. తండ్రిలోనూ నిశ్చయముంది, స్వయంలోనూ నిశ్చయముంది కాని పరివారములో నిశ్చయం లేనందున పరివారం కారణంగా డగ్‌మగ్ అవుతారు(కంపిస్తారు, చలిస్తారు). ఇలా ఉండినా అసంపూర్ణ నిశ్చయమని అంటారు. డ్రామాలో కూడా పూర్తి నిశ్చయముండాలి. ఏదైతే జరిగిపోయిందో, అది మంచిదే జరిగింది అని భావిస్తే దానిని డ్రామాలో నిశ్చయమని అంటారు. ఇటువంటి నిశ్చయబుద్ధి ఉందా? అప్పుడప్పుడు ఫుల్‌గా, అప్పుడప్పుడు సగమే ఉందా? అనేకసార్లు అనే నిశ్చయము, నశా ఉంటే అనేకసార్లు విజయులుగా అయ్యారు, ఇప్పుడు మళ్లీ రిపీట్ చేస్తున్నారు. కొత్తదేమీ చేయడం లేదు. రిపీట్ చేస్తున్నారు. రిపీట్ చేయడం సులభమే కదా. కనుక “నిశ్చయబుద్ధి విజయీ” సదా ఈ స్మృతిలో ఉండాలి. నిశ్చయమూ ఉంది, విజయం కూడా ఉంది. మాకు విజయం లభించకుంటే ఇంకెవ్వరికి లభిస్తుంది అనే నశా ఉండాలి. మాకు ఇప్పుడు విజయం ఉంది, సదా ఉంటుంది. కనుక స్థిరమైన నిశ్చయం ఉండాలి. కదిలేది కాదు. ఏదైనా కొంచెం జరిగినా నిశ్చయం స్థిరంగా లేని నిశ్చయముండరాదు. స్థిరమైన నిశ్చయముంటే స్థిరమైన విజయముంటుంది. డ్రామాలో విజయం కదలదు, స్థిరంగా ఉంటుంది. కనుక ఇటువంటి నిశ్చయబుద్ధి గలవారు సదా హర్షితంగా ఉంటారు, నిశ్చింతులుగా

ఉంటారు ఎందుకంటే చింత సంతోషాన్ని సమాప్తం చేసేస్తుంది. నిశ్చింతులుగా ఉంటే సంతోషము సదా ఉంటుంది. కనుక నిశ్చయబుద్ధికి రెండవ గుర్తు నిశ్చింతత. లేకుంటే ఏ కొంచెం జరిగినా ఇదేమిటి ఇలా జరిగిందే?ఎందుకు జరిగింది? అనే చింత ఉంటుంది. ఎందుకు? ఏమి? అనే ప్రశ్నలు కూడా రాకుండా నిశ్చింతులుగా ఉంటారు. ఎందుకు? ఏమి? ఎలా? అనే ప్రశ్నలు వచ్చాయంటే అవి చింతను తీసుకొచ్చే అలలు. ఇప్పుడు పెద్ద చింతలేవీ ఉండవు కాని ఈ రూపములో ఉంటాయి. జరిగి ఉండరాదు, జరిగిపోయింది, ఇలా? అలా? ఎందుకు? ఏమి? ఎలా? ఈ శబ్దాలు మారిపోతాయి. ఇలా ఉందా లేక అప్పుడప్పుడు ప్రశ్నార్థకాలు వస్తున్నాయా? చాలామంది ఇవి నా వద్దకే ఎందుకు వస్తున్నాయని అంటారు కదా? నాకే ఎందుకు జరుగుతున్నాయి? ఈ బంధనాలు నా వెనుకే ఎందుకున్నాయి? నాకు మాయ ఎందుకు వస్తుంది? నా లెక్కాచారాలే కఠినంగా ఎందుకున్నాయి? ఇలా ఎందుకు? అనే ప్రశ్న వచ్చిందంటే అది చింతను తీసుకొచ్చే అల. కనుక ఈ చింతల నుండి కూడా అతీతంగా ఉంటే దానిని నిశ్చింత అని అంటారు. కనుక మీరు ఎవరు? నిశ్చింతగా ఉన్నారా? లేక కొద్ది కొద్దిగా ఎందుకు? ఏమి? అనే ప్రశ్నలు వస్తున్నాయా? నిశ్చింత ఆత్మల స్లోగన్ - "సదా మంచే జరిగింది, బాగుంది, మంచే జరుగుతుంది" చెడులో కూడా మంచినే అనుభవం చేస్తారు. చెడు నుండి కూడా పాఠము నేర్చుకుంటారు. చెడును చెడు రూపంలో చూడరు. ఇలా ఉండేవారిని నిశ్చయబుద్ధి గల నిశ్చింతులు అని అంటారు. చింత అనే శబ్దము కూడా తెలియనివారిగా ఉండాలి. ఎలాగైతే ఇచ్ఛా మాత్రం అవిద్యా అని గాయనముందో అలా చింత అనే శబ్దము నుండి కూడా అవిద్యాగా ఉండాలి. చింత అంటే ఏమిటో అనుభవమవ్వరాదు. కనుక ఇటువంటి అవస్థను నిశ్చింత స్థితి అని అంటారు. ఏ విషయము జరిగినా ఏమి జరుగుతుందో? అనే ప్రశ్న రాదు. వెంటనే మంచే జరుగుతుంది, జరిగిపోయింది మంచిగానే జరిగిపోయింది అనే మాట వస్తుంది. ఎక్కడైతే మంచి ఉంటుందో అక్కడ సదా చింతలేని సామ్రాజ్యముంటుంది. కనుక



నిశ్చయబుద్ధికి అర్థము - చింతలేని చక్రవర్తి. కనుక ఇలా ఉందా? లేక అప్పుడప్పుడు కొంచెం కొంచెం చింత ఏమైనా వచ్చేస్తుందా? చింతలేని చక్రవర్తులే తండ్రి సమానంగా ఉంటారు. తండ్రికి చింత ఏమైనా ఉందా? ఇంత పెద్ద పరివారం ఉంటున్నా చింత ఏమైనా ఉందా? అన్నీ తెలిసినా, చూస్తున్నా నిశ్చింతగా ఉంటారు. ఇలా నిశ్చింతగా ఉన్నారా!

**23-12-1993**

## సర్వస్వం తండ్రికి సమర్పించడం అనగా డబల్‌లైట్‌గా అవ్వడం

సదా స్వయాన్ని కమలపుష్ప సమానం అతీతంగా మరియు తండ్రికి ప్రియమైనవారిగా అనుభవం చేస్తున్నారా? ఎందుకంటే ఎంతగా అతీత స్థితి ఉంటుందో అంత తండ్రికి ప్రియంగా ఉంటారు. ఎటువంటి పరిస్థితులు వచ్చినా, సమస్యలు వచ్చినా వాటికి అధీనమవ్వరు. అధికారిగా అయ్యి సమస్యలను ఆటలాడుతూ దాటుతున్నట్లుగా దాటిపోతారు. ఆటలో సదా సంతోషముంటుంది. ఎటువంటి ఆట అయినా అది ఆటే కదా. కనుక ఎటువంటి పాత్రను అభినయిస్తున్నా లోపల సంతోషంగా ఉంటున్నారా? బయటకు ఏడ్చే పాత్ర ఉన్నా లోపల ఇదంతా ఆట అని ఉండాలి. కావున అదే విధంగా ఏ విషయాలు మీ ముందుకు వచ్చినా - ఇది అనంతమైన ఆట. దీనిని డ్రామా అని అంటారు. డ్రామాలో మీరందరూ హీరో పాత్రధారులు. సాధారణ పాత్రధారులైతే కాదు కదా! కనుక హీరో పాత్రధారి అనగా ఖచ్చితంగా పాత్రను అభినయించేవారు. అప్పుడే వారిని ' హీరో ' అని అంటారు. కావున ఇది సదా అనంతమైన ఆట అని అనుభవం చేస్తున్నారా? లేక అప్పుడప్పుడు ఆట అని మర్చిపోయి సమస్య సమస్యగా అనిపిస్తోందా? ఎటువంటి కఠినమైన పరిస్థితి అయినా దానిని ఆటగా భావించడం వలన కఠినమైన సమస్య కూడా తేలికగా అయిపోతుంది.

**23-12-1993**

మీరు నంబరువన్ జ్ఞాతలుగా అయితే అయిపోయారు. కేవలం ఒక విషయంలో అల్‌బేలా(నిర్లక్ష్యంగా) అయిపోతారు. అదేమంటే ' స్వయాన్ని

సెకండులో వ్యర్థము ఆలోచించుటలో, చూచుటలో, మాట్లాడుటలో, చేయడంలో ఫుల్‌స్టాప్ పెట్టి పరివర్తన చేసుకోవడం.' ఈ బలహీనతే సుఖమును అనుభవం చేయడంలో తేడా తీసుకొస్తుందని, శక్తి స్వరూపులుగా అవ్వడంలో లేక బాప్‌సమాన్‌గా(తండ్రి సమానంగా) అవ్వడంలో విఘ్న స్వరూపంగా అవుతుందని అర్థం కూడా చేసుకున్నారు. అయినా ఏమి జరుగుతుంది? స్వయాన్ని పరివర్తన చేసుకోవడం లేదు. ఫుల్‌స్టాప్ పెట్టలేకపోతున్నారు. కామా పెడ్తున్నారు లేక ఇతరులను చూసి ఇలా కూడా జరుగుతుందా అని ఆశ్చర్యార్థకము(!) పెట్టారు. ఇలా జరిగి ఉండాల్సింది అని అంటారు లేక ప్రశ్నార్థకాల క్యూ(లైన్) పెట్టున్నారు. ఎందుకు? అనే ప్రశ్నల క్యూ పెట్టేస్తున్నారు. ఫుల్‌స్టాప్ అనగా బిందువు(.). అయితే ఫుల్‌స్టాప్ ఎప్పుడు ఉంచగలరు? బిందు స్వరూపుడైన తండ్రి స్మృతి, బిందు స్వరూప ఆత్మ స్మృతి రెండూ ఉంటే ఫుల్‌స్టాప్ అనగా బిందువు ఉంచేందుకు సమర్థులుగా చేసేస్తుంది. ఆ సమయంలో కొంతమంది లోపల నేను ఆత్మిక స్థితిలో స్థితమవ్వాలని కూడా అనుకుంటారు. కాని మాయ తన తెర ద్వారా ఆత్మకు బదులు వ్యక్తిని లేక విషయాన్ని మాటిమాటికి మీ ముందుకు తీసుకొస్తుంది. దాని వలన ఆత్మ దాగిపోతుంది. పదే పదే ఆ వ్యక్తి లేక ఆ విషయాలే స్పష్టంగా మీ ముందుకు వస్తాయి. కనుక మూలకారణం స్వయం పై అదుపు చేసుకునే కంట్రోలింగ్ పవర్ తక్కువగా ఉంది. ఇతరులను కంట్రోల్ చేయడం చాలా బాగా వచ్చు. కాని స్వయం పై కంట్రోల్(అదుపు) అనగా పరివర్తన శక్తిని కార్యములో ఉపయోగించడం తక్కువగా వస్తుంది.

బాప్‌దాదా కొంతమంది పిల్లల మాటలు విని మందహాసము చేస్తూ ఉంటారు. స్వయాన్ని పరివర్తన చేసుకునే సమయము వచ్చినప్పుడు లేక సహనం చేసే సమయం వచ్చినప్పుడు లేక ఇముడ్చుకునే సమయం వచ్చినప్పుడు ఏమంటారు? చాలా వరకు, నేనే చేసి చావాలా? నేనే పరివర్తనవ్వాలా? నేనే సహించాలా? అని అంటారు. కానీ జనులు "మరణించి స్వర్గానికి వెళ్లారని అంటారు కదా". ఆ మరణించడం వలన స్వర్గానికి ఎవ్వరూ వెళ్లలేరు. కాని ఈ మరణించడంలో అయితే స్వర్గములో



శ్రేష్ఠమైన సీటు లభిస్తుంది. కనుక ఇది మరణించడం కాదు, స్వర్గములో స్వరాజ్యము తీసుకోవడం. కనుక మరణించడం మంచిదే కదా. కష్టమేమైనా ఉందా? ఆ సమయంలో కష్టమనిపిస్తుంది. నా తప్పు ఏమీ లేదు, వారు తప్పు చేశారని అంటారు. కాని తప్పును రైటుగా ఎలా చేయాలో రాదు. తప్పు చేసినవారు మారాలా లేక రైటు చేసినవారు మారాలా? ఎవరు మారాలి? ఇరువురూ మారాల్సి ఉంటుంది. 'మారుట' అనే శబ్దము ఆధ్యాత్మిక భాషలో ముందుకు వెళ్లడం అని అర్థం చేసుకోండి. మారడం కాదు, ముందుకు వెళ్లడం. వ్యతిరేక రూపంలో మారడం కాదు, మంచి(సుల్టా) రూపంలోకి మారడం. మీకు స్వయాన్ని మార్చుకునే శక్తి ఉందా? లేక ఎప్పుడైనా తప్పకుండా మారిపోతాము అని అనుకుంటున్నారా?

పవిత్రతకు అర్థమే - సదా సంకల్పము, మాట, కర్మ, సంబంధ-సంపర్కములో మూడు బిందువుల మహత్యాన్ని ప్రతి సమయంలో ధారణ చేయడం. ఏదైనా అటువంటి పరిస్థితి వచ్చినప్పుడు సెకండులో ఫుల్‌స్టాప్ ఉంచడంలో మొదట స్వయాన్ని ఆఫర్ చేయాలి."నేను చేయాలి" - ఇలా ఆఫర్ చేసేవారికి మూడు విధాలైన ఆశీర్వాదాలు లభిస్తాయి. 1. స్వయానికి స్వంత ఆశీర్వాదాలు లభిస్తాయి, సంతోషము లభిస్తుంది 2. తండ్రి ద్వారా 3. బ్రాహ్మణ పరివారంలోని శ్రేష్ఠ ఆత్మలు ఎవరైతే ఉన్నారో వారి ద్వారా కూడా ఆశీర్వాదాలు లభిస్తాయి. కనుక ఇది మరణించడమా? లేక పొందడమా? ఏమంటారు? పొందుతున్నారు కదా. కనుక ఫుల్‌స్టాప్ పెట్టే పురుషార్థాన్ని లేక కంట్రోలింగ్ పవర్ ద్వారా పరివర్తన శక్తిని తీవ్ర వేగంతో పెంచండి. సోమరిగా అవ్వకండి, నిర్లక్ష్యంగా ఉండకండి. ఇది జరుగుతూనే ఉంటుంది, ఇలా నడవాల్సిందే........ ఇవి అల్‌బేలా తనపు(సోమరి, నిర్లక్ష్యము) సంకల్పాలు నిర్లక్ష్యాన్ని పరివర్తన చేసుకొని అలర్ట్‌గా(చురుకుగా) అవ్వండి.

చాలామంది తండ్రి ఏమో తండ్రే కదా. వారి సమానంగా ఎలా అవ్వగలము? అని అనుకుంటారు. కాని ఎవరైతే నిమిత్తంగా ఉన్న ఆత్మలుగా ఉన్నారో వారు మీ హమ్‌జీన్సే కదా(తోటివారే కదా)? కనుక వారు

అవ్వగలిగినప్పుడు మీరు అవ్వలేరా? కనుక అందరి లక్ష్యము సంపూర్ణంగా, సంపన్నంగా అవ్వడం. 16 కళా సంపూర్ణంగా అవుతారా లేక 14 కళల వారిగా అవుతారా? అని చేతులెత్తమంటే ఎందులో ఎత్తుతారు? 16 కళలు. కనుక 16 కళలంటే అర్థమేమి? సంపూర్ణము కదా. లక్ష్యమే ఇది అయినప్పుడు అవ్వాల్సిందే, కష్టమేమీ లేదు. అయ్యే తీరాలి. చిన్న చిన్న విషయాలకు భయపడకండి. 'మూర్తి'(విగ్రహాలు)గా అవుతున్నారు. కనుక సుత్తి దెబ్బలైతే తగుల్తాయి కదా. లేకుంటే ఊరకే మూర్తిగా ఎలా అవుతారు. ఎవరు ఎంత ముందుకు వెళ్తూ ఉంటారో, వారు అందరికంటే ఎక్కువగా తుఫానులు ఎదుర్కోవలసి ఉంటుంది. కాని ఆ తుఫానులు వారికి తుఫానులుగా అనిపించవు, బహుమతులుగా(తోఫాలుగా) అనిపిస్తాయి. ఈ తుఫాన్లు కూడా అనుభవీలుగా అయ్యేందుకు బహుమతిగా అవుతాయి. కనుక బహుమతిగా అయిపోయింది కదా. బహుమతి తీసుకోవడం సులభమా? కష్టమా? కనుక ఇది కూడా తీసుకోవడమే గానీ, ఇవ్వడం కాదు. ఇవ్వడం కష్టమనిపిస్తుంది, తీసుకోవడం సులభమవుతుంది.

నాకేనా ఈ పాత్ర అని అనుకోకండి. అన్ని విఘ్నాల అనుభవం నాకే రావాలా? అని అనుకోకండి. విఘ్నాలను రమ్మని ఆహ్వానించండి. ఇది బహుమతి. ఎక్కువలో ఎక్కువ బహుమతులు ఇందులో లభిస్తాయా? ఎక్కువ సుందరమైన మూర్తిగా అవ్వడం అనగా సుత్తి దెబ్బలు తగలడం. సుత్తితోనే కదా కొట్టి కొట్టి సుందరంగా చేస్తారు? మీరు అనుభవీలుగా అయ్యారు. నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు). ఆటగా అనిపిస్తుంది. చూస్తూ ఉంటారు, మందహాసము చేస్తూ ఉంటారు. ఆశీర్వాదాలు ఇస్తూ ఉంటారు. టీచర్లు సాహసవంతులుగా ఉన్నారా లేక అప్పుడప్పుడు భయపడ్తారా? ఇలా జరుగుతుందని అనుకోనేలేదు, ముందు తెలిసి ఉంటే ఆలోచించేవారము...... డబల్ విదేశీయులు బ్రాహ్మణులుగా అవ్వడంలో కూడా ఇలా ఉంటుందని భావించలేదని అనుకుంటున్నారా? బాగా ఆలోచించి అర్థం చేసుకొని వచ్చారా లేక ఇప్పుడు ఆలోచించాల్సి వస్తోందా? అచ్ఛా.

ఎవరు ఎంత బాగలేకున్నా బాప్‌దాదా వారిలో మంచినే చూస్తారు.



అందువలన బాప్‌దాదా అందరినీ మంచి వారే అని అంటారు. చెడ్డవారని అనరు. 9 చెడు గుణాలుండి ఒక్క మంచి గుణమున్నా తండ్రి ఏమంటారు ? మంచి వాడని అంటారా లేక చాలా చెడ్డవాడని, చాలా బలహీనుడని అంటారా? మంచిది. ఇది చాలా పెద్ద గ్రూపు. (21 దేశాల వారు వచ్చారు). మంచిది. హౌస్‌ఫుల్ అయితే కదా రెండవది తయారయ్యేది! ఫుల్‌గా అవ్వకుంటే రెండవది తయారయ్యే అవకాశముండదు. అవసరమే సాధనాలను ముందుకు తీసుకొస్తుంది.

**31-12-1993**

సదా విజయీరత్నాల స్మృతి చిహ్నమేది? విజయమాల విజయీరత్నాల స్మృతిచిహ్నం. అనేకసార్లు విజయులుగా అయ్యారు. అందుకే కదా స్మృతిచిహ్నం తయారయ్యింది! అనేకసార్లు విజయులుగా ఉన్నారు. ఈ స్మృతి ద్వారా సదా సమర్థంగా ఉంటారు. అనేకసార్లు చేయబడిన కార్యమైనప్పుడు ఎలా చేయాలి? ఏమి చేయాలి? అనే ప్రశ్నలే తలెత్తవు. ఏదీ కొత్త విషయమైతే కానే కాదు. ఏదైనా కొత్త విషయాన్ని వింటున్నప్పుడు లేక చేయవలసి వచ్చినప్పుడు ఇలా చేయాలా? ఎలా చేయాలి? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఆత్మలైన మీలో లెక్కలేనన్ని సార్లు చేసిన సంస్కారం నిండి ఉంది. ఏమవుతుంది? అన్న సంకల్పం ఉండదు, మంచే జరిగి ఉంది. 'బాబా' అని అంటే చాలు అదే సెకండులో, అదే సంకల్పంలో బాబా తోడు అనుభవం అవ్వనే అవుతుంది. ఇది సెకండు విషయమే.

బ్రాహ్మణుల జాతకంలో మూడు కాలాలూ చాలా మంచివే. జరిగిపోయిందీ మంచిదే, ఏదైతే జరుగుతూ ఉందో అది ఇంకా మంచిది, ఇక ఏదైతే జరగబోతుందో అది ఇంకా చాలా చాలా మంచిది. కేవలం చెప్పుకోవడానికే కాదు, బ్రాహ్మణ జీవితానికి చెందిన జాతకం సదా చాలా మంచిగా ఉంటుంది. అందరి మస్తకంలో శ్రేష్ఠమైన భాగ్యరేఖ గీయబడే ఉంది. తమ భాగ్యరేఖను చూసుకున్నారా? బాగుంది కదా? ఎన్ని జన్మలకు గ్యారంటీ ఉంది?

10-01-1994

దాదీలతో కలయిక – శక్తి సైన్యం తీవ్ర వేగంతో నడుస్తోంది కదా. బాప్‌దాదా జతలో ఉంటూ నిమిత్త ఆత్మలైన మీరు కూడా సైన్యాన్ని నడిపించేందుకు నిమిత్తంగా ఉన్నారు. తండ్రి అయితే సదా తోడుగా ఉన్నారు, ఇక మీదట కూడా సదా ఉంటారు. అయినా మీరు బాప్‌దాదాకు శ్రేష్ఠ భుజాలుగా అయితే ఉన్నారు కదా. తండ్రి శక్తినిస్తారు. తండ్రి మైట్ రూపంలో ఉన్నారు కాని నిమిత్తంగా అర్థం చేయించే మైకులుగా అయితే మీరున్నారు. ఎంత ఆనందాన్ని కలిగించే విషయాలు వింటూ ఉంటారు! ఆటగా అనిపిస్తోంది కదా! ఆటే కదా. ఆట ఆడుతూ ఆడుతూనే విజయులుగా అయ్యి అందరినీ మాయాజీతులుగా, విజయులుగా చేయాల్సిందే. ఈ గ్యారంటీ అయితే ఉండనే ఉంది. కాని మధ్య మధ్యలో ఈ ఆట చూడవలసి ఉంటుంది. కావున అలసిపోవడం లేదు కదా? నవ్వుతూ, ఆడుతూ, దాటుతూ ఇతరులను దాటిస్తూ నడుస్తారు. ఏదైనా అటువంటి విషయం విన్నప్పుడు హృదయం నుండి ఏమని వెలువడ్తుంది? వాహ్ డ్రామా వాహ్! అని వెలువడ్తుంది. హాయ్(అయ్యో) డ్రామా అని వెలువడదు. వాహ్ డ్రామా వాహ్ వాహ్ అంటూ అందరూ వాహ్ వాహ్‌గా తయారవ్వాల్సిందే. ఇవన్నీ దాటాల్సిందే.

01-02-1994

సదా ఎలా ఉన్నవారము, ఎలా అయ్యాము అనే స్మృతి ఉంటోందా? నిన్న గవ్వ సమానంగా ఉండేవారు, ఈ రోజు వజ్ర సమానంగా అయ్యారు. కావున ఎక్కడ గవ్వ, ఎక్కడ వజ్రం? ఎంత వ్యత్యాసముంది? ఆ వ్యత్యాసం తెలిసినప్పుడు ఎంత సంతోషమవుతుంది! తండ్రి ఎలా ఉన్నవారిని ఎలా తయారుచేశారు! నిన్న అంధకారంలో ఉండేవారు, ఈ రోజు ప్రకాశంలోకి వచ్చేశారు. అంధకారంలో ఏమి లభించింది? ఎదురుదెబ్బలు తగిలాయి కదా. అంధకారంలో ఎదురుదెబ్బలు తింటారు, ప్రకాశంలో ఎంజాయ్ చేస్తారు(సరదాగా గడుపుతారు). కనుక నిన్న ఎలా ఉండినాము? ఈ రోజు ఎలా ఉన్నాము? ఇది సదా ఎదురుగా స్పష్టంగా ఉండాలి. డబల్ హీరోగా అయిపోయారని బాప్‌దాదా సదా అంటూ ఉంటారు. ఒకటి 'హీరా' అనగా వజ్ర సమానమైన జీవితం, రెండవది - ఈ డ్రామాలో హీరో పాత్రధారిగా అయిపోయారు. కావున డబల్ హీరోగా అయిపోయారు కదా. ఒకవేళ మొత్తం డ్రామా అంతటిలో హీరో పాత్రధారులెవ్వరు? అని చూసినట్లయితే అది మేమే అని అంటారు కదా! కనుక మీరు డబల్ హీరోలు కనుక డబల్ సంతోషం ఉంది కదా.



09-03-1994

(దాదీజీ బ్రహ్మాబాబా స్టాంప్ ఆల్బమ్‌ను బాప్‌దాదాకు చూపించారు) -

అందరి బుద్ధిని టచ్ చేశారు. అందరి పురుషార్థం మరియు శ్రేష్ఠ సంకల్పం విజయాన్ని ప్రాప్తి చేయించింది. సఫలత మీ అధికారంగా ఉంది. పురుషార్థం చేయడం కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. అంతేకాక సఫలత ప్రాప్తి అవ్వడం కూడా నిశ్చితమై ఉంది. కేవలం నిశ్చయాన్ని చూచేందుకు(పరీక్షించేందుకు) మధ్య మధ్యలో అలజడి జరుగుతుంది.

14-12-1994

ఈ రోజు బాప్‌దాదా ఏ సభలోకి వచ్చారు? ఈ మొత్తం సభ అంతా ఎటువంటి ఆత్మలది? ప్రతి ఒక్కరు అత్యంత ఉన్నతంగా(హైయ్యెస్ట్), అత్యంత ధనవంతంగా(రిచ్చెస్ట్) ఉండడాన్ని బాప్‌దాదా చూస్తున్నారు. ప్రపంచంలోనివారు రిచ్చెస్ట్ ఇన్ ది వరల్డ్ అని అంటారు. కాని మీరందరూ కల్పంలోనే అత్యంత ధనవంతులు(రిచ్చెస్ట్ ఇన్ ది కల్ప). ఈ సమయంలో జమ చేసుకోబడిన ఖజానాలు మొత్తం కల్పమంతా తోడుగా వస్తాయి. మొత్తం కల్పంలో - ఈ జన్మలో అయితే నేను అత్యంత ధనవంతునిగా ఉన్నాను కాని భవిష్యత్తులో కూడా అనేక జన్మలు ధనవంతులలో ధనవంతునిగా ఉంటానని ఆలోచించే వారెవ్వరూ లభించరు. కానీ మీరందరూ మా ఖజానాలు అనేక జన్మలు తోడుగా ఉంటాయని నిశ్చయంతో మరియు నశాతో చెప్తారు. గ్యారంటీ ఉంది కదా! కావున ఇటువంటి అత్యంత ధనవంతులను(రిచ్చెస్ట్) మొత్తం కల్పంలో చూశారా? కావున ఈ రోజు బాప్‌దాదా చక్రవర్తులకు చక్రవర్తులుగా ఉన్న, రాజులకు

కూడా రాజులుగా ఉన్న తమ పిల్లలను చూస్తున్నారు. ఒక్కొక్క రోజులో ఎంత సంపాదన జమ చేసుకుంటున్నారు? ఈ లెక్కను తీయండి. జమ ఖాతా ఎంత తీవ్ర వేగంతో వృద్ధి చెందుతోంది? పెంచుకునే సాధనం కూడా ఎంత సహజమయింది? ఇందులో శ్రమ ఏమైనా ఉందా? మీ సంపాదన లేక జమ ఖాతాను పెంచుకునేందుకు అన్నిటికన్నా సహజ సాధనం - బిందువు పెడ్తూ ఉండండి, పెంచుకుంటూ ఉండండి. మీరు కూడా బిందువే, తండ్రి కూడా బిందువే మరియు డ్రామాలో గతించిన దానికి బిందువు పెట్టడం. కావున సంపాదనకు ఆధారం - బిందువు ఉంచడం. ఇంకే మార్కు(గుర్తు) పెట్టనవసరం లేదు. ఎందుకు? ఏమి? ఎలా?..... ఇటువంటి ప్రశ్నార్థకాలు, ఆశ్చర్యార్థకము మొదలైన వాటి అవసరం లేదు. ఎందుకంటే మాస్టర్ నాలెడ్జ్‌ఫుల్‌గా అయిపోయారు. కనుక 'ఎలా' అన్న పదం 'ఇలా' అని మారిపోయింది. మారిపోయిందా ? లేక ఇప్పుడు కూడా 'ఎలా-ఎలా' అని అంటున్నారా? 'తెలియదు' అన్న మాట సంకల్పంలో కూడా మారిపోయిందా లేదా? త్రికాలదర్శి స్వప్నంలో కూడా ఇలా ఆలోచించనప్పుడు నోటితో అనే ప్రశ్నే లేదు. సంగమ యుగంలో మొత్తం ఆటంతా మూడు బిందువుల పైనే ఉంది. అన్నిటికంటే బిందువు పెట్టడం సహజమా? లేక ప్రశ్న మార్కు పెట్టడం సహజమా? బిందువు పెట్టడం సహజము కదా? బిందువు పెట్టేందుకు ఎంత సమయం పడ్తుంది? సెకండు కంటే తక్కువే. బిందువు పెట్టడం వస్తుందా? లేక పెన్ను జారిపోతుందా? చాలాసార్లు బిందువుకు బదులుగా పెన్ను కూడా దీర్ఘ రేఖను(పొడవైన రేఖను) గీసేస్తుంది. బిందువు ఉంచడం వలన ఒక్క సెకనులో మీ ఎన్ని ఖజానాలు రక్షించబడ్తాయి! ఖజానాల లిస్టు గురించి అయితే తెలుసు కదా! ఒకవేళ బిందువుకు బదులు వేరొక మార్కును(గుర్తును) పెట్టినట్లయితే ఇక ఏమవుతుందో ఆలోచించండి. జ్ఞాన ఖజానా పోయింది, శక్తుల ఖజానా పోయింది, గుణాల ఖజానా పోయింది, సంకల్పాల ఖజానా పోయింది, శక్తి(ఎనర్జీ) పోయింది, శ్వాస సఫలమయ్యేందుకు బదులు అసఫలమైపోయింది, సమయమూ పోయింది. ఎన్ని పోయాయి? పెద్ద



లిస్టు అయ్యింది కదా! కనుక ఒకటి, రెండు సెకండ్లు మాత్రమే పోయిందని ఎప్పుడూ అనుకోకండి. కాని ఒక్క సెకనులో ఎంత పోగొట్టుకున్నారు! ఒక్క సెకను కూడా ఎంత భారంగా అయిపోయింది? ప్రతి సమయంలో తమ జమ ఖాతాను పెంచుకుంటూ వెళ్లండి. ఏమి సంపాదించారు? ఏమి పోగొట్టుకున్నారు? ఈ ఖజానాలన్నిటి నుండి ఎన్ని ఖజానాలను పోగొట్టుకున్నారు? బాప్‌దాదా కూడా పిల్లల జమ ఖాతాను చెక్ చేస్తూ ఉంటారు. ఖాతాను చూచినప్పుడు నవ్వుకుంటూ ఉంటారు. నవ్వుకుంటున్నారంటే ఏమి చూసి ఉంటారు? అమృతవేళ మిలనం కూడా జరుపుకుంటారు, ఆత్మిక సంభాషణ కూడా చేస్తారు. ఇది చేస్తాము, ఇది చేస్తామని చాలా వాగ్దానాలు కూడా చాలా బాగా చేస్తారు, చాలా మంచి మంచి మాటలు మాట్లాడ్తారు. కాని నడుస్తూ నడుస్తూ మొత్తం రోజులో ఏదో ఒక ఖజానాను పోగొట్టుకుంటారు కూడా. మళ్లీ దేనిని ఆధారంగా చేసుకుంటారు? బాప్‌దాదాకు కూడా మంచి మంచి మాటలు వినిపించడం ప్రారంభిస్తారు. ఒకవేళ వ్యర్థ సంకల్పాలు నడిచినట్లయితే ఇది జమ అయినట్లా? లేక పోగొట్టుకున్నట్లా?

**23-12-1994**

జానకీ దాదీతో - బాగున్నారు, ఎగరడంలో తెలివైనవారిగా అయిపోయారు. ప్రాణ దానం లభించింది. అంతేకాక ఇప్పుడు ఎంత సేవ చేస్తూ ఉంటారో, అంత ఆరోగ్యం ఇంకా పెరుగుతూ ఉంటుంది. ఎందుకంటే అందరి ఆశీర్వాదాలు ఆరోగ్యంగా తయారు చేస్తాయి. తండ్రి సహాయమైతే ఉండనే ఉంది. కాని ఆశీర్వాదాలు యవ్వనవంతులుగా తయారు చేస్తున్నాయి. ఎవరికైనా ఆశీర్వాదాలు లభించినప్పుడు లేక ఎవరికైనా ఏదైనా సంతోషం, శాంతి ప్రాప్తించినప్పుడు మా ఆయుష్షు కూడా మీకు లభించాలని నోటి నుండి, హృదయం నుండి ఆశీర్వాదాలు ఇవ్వడం జరుగుతుంది. మా ఆయుష్షు కూడా మీకే లభించాలని గ్రీటింగ్ కార్డు కూడా పంపిస్తారు. కావున మీరు ఒక్క భ్రమణంలో వేల మందికి సేవ చేస్తూ ఉంటే దాని ద్వారా వేయి రెట్లు ఆశీర్వాదాలు లభిస్తాయి. బాగుంది. అందరూ తమ

తమ సేవ బాగా చేస్తున్నారు.

దాదీలందరి పై శుభమైన మోహము ఉంది కదా? సాధారణ మోహమైతే లేదు కదా! దు:ఖాన్నిచ్చే మోహము కాదు, సుఖమునిచ్చే మోహముంది. కాని ఎంత మోహమో అంత నిర్మోహి. అతీతంగానూ మరియు ప్రియంగానూ ఉన్నారు. ఇలా ఉన్నారు కదా? లేక కేవలం ప్రియంగా ఉండి, అతీతంగా లేరా? అతీతం మరియు ప్రియం - రెండిటి బ్యాలన్స్ ఉంచుకునేవారు. ఇది కూడా డ్రామాలో ఆది నుండి విశేష ఆత్మలు నిమిత్తంగా అయ్యే పాత్ర ఉంది. పాలన కూడా చాలా తీసుకున్నారు. డైరెక్టు తండ్రి ద్వారా మీరు ఎంత పాలన తీసుకున్నారో అంతగా వీరైతే తీసుకోలేదు. కావున ఎంత పాలన తీసుకున్నారో అంత పాలనను చేసే పాత్ర కూడా లభించింది. కనుక అందరూ సంతోషంగా ఉన్నారా? అందరి ఆయుష్షు వేల సంవత్సరాలుగా అయిపోవాలి. వేల సంవత్సరాలు అయితే ఇంటికి వెళ్లవద్దా? పాత ప్రపంచలోనే ఉండాలా?

మంచిది, ఈ మ్యూజియం కూడా అద్భుతం చేస్తుంది. ఇదే దృఢతకు ప్రత్యక్ష స్వరూపం. కనుక దృఢత సఫలత పొందడంలో అసంభవాన్ని కూడా సంభవం చేయిస్తుంది. ధైర్యవంతులుగా ఉన్నారు. కావున ఎవరైతే విశేషంగా నిమిత్తంగా ఉన్నారో వారందరికీ విశేషమైన ప్రియస్మృతులు. ఇది కూడా మంచి సేవా సాధనం. ఎవరో ఒకరు నిమిత్తంగా అయ్యి మీ భాగ్యాన్ని తయారు చేస్తారు. ఇచ్చేవారు ముందే డ్రామాలో నిశ్చితమై ఉన్నారు.

**09-01-1995**

ఏ పిల్లలైతే తమను బ్రాహ్మణులుగా పిలుచుకుంటున్నారో వారందరూ మేము నిశ్చయబుద్ధి గలవారమని నషాతో చెప్పడం గమనిస్తున్నారు. కావున బాప్‌దాదా నిశ్చయబుద్ధి కలిగిన పిల్లలందరిని అడుగుతున్నారు - " మేము నిశ్చయబుద్ధి విజయులమని,......... మీరందరూ అంటున్నప్పుడు ఒకసారి విజయం, మరోసారి ఓటమి ఎందుకు జరుగుతోంది? అప్పుడప్పుడు కొద్దిగా అలజడి జరిగినపుడు సదా



విజయులుగా ఉన్నారా? లేక మధ్య మధ్యలో గుటకలు మింగడం, కునికి పాట్లు పడడం జరుగుతోందా? నిశ్చయమనే పునాది నాలుగు వైపుల నుండి దృఢంగా ఉందా లేక నాలుగు వైపులకు బదులుగా ఒకసారి ఒకవైపు, మరోసారి రెండు వైపులు ఢీలా(లూజు) అయిపోతున్నాయా? ఏదైనా వస్తువును దృఢంగా చేసినప్పుడు నాలుగు వైపుల నుండి టైట్ అనగా బిగిస్తారు కదా! ఒకవేళ ఒకవైపు అయినా కొద్దిగా అలజడి కలిగినదిగా(కదిలేదిగా) ఉంటే ఆ వస్తువంతా కదులుతుంది కదా! కనుక నాలుగు రకాల నిశ్చయం అనగా తండ్రి పైన, స్వయం పైన, డ్రామా పైన మరియు బ్రాహ్మణ పరివారం పైన నిశ్చయం. ఈ నాలుగు రకాల నిశ్చయాన్ని తెలుసుకోవడమే కాదు, అంగీకరించి నడవాలి.

పరివారంతో సరిపడకపోయినా పర్వాలేదు తండ్రితో సంబంధం బాగుంది కదా, డ్రామాను మర్చిపోయినా తండ్రి అయితే సదా గుర్తు ఉండనే ఉన్నారు కదా! అని భావించకండి. కాని ఏ బలహీనత అయినా ఒక సమయములోనే వస్తుంది. స్వస్థితి అనగా స్వయం పై నిశ్చయం కూడా ఒకవేళ బలహీనంగా అయితే విజయం నిశ్చితమవ్వడానికి బదులు అలజడిలోకి వచ్చేస్తుంది. కనుక బాప్‌దాదా నిశ్చయమనే పునాదిని చెక్ చేస్తున్నారు. ఏమి చూశారు?

సదా నాలుగు రకాల నిశ్చయం ఒకే సమయంలో తోడుగా ఉండడం లేదు. ఒకప్పుడు ఉంటుంది, ఒకప్పుడు కదులుతుంది. అందువలన సదా విజయులము అనే అనుభవాన్ని చేయలేకున్నారు. మళ్లీ ఇది జరిగి ఉండాలి కాని ఎందుకు అవ్వలేదో తెలియదు అని అనుకుంటారు (ఆలోచిస్తారు). చాలా శ్రమనైతే చేసారు, చాలా మంచిగా అయితే ఆలోచించారు......... కాని ఆలోచించడం మరియు జరగడం ఇందులో వ్యత్యాసం ఏర్పడ్తోంది. నాలుగు వైపుల నిశ్చయం దృఢంగా లేదనే దీని అర్థం. ఇంకొక నవ్వు తెప్పించే విషయం ఏమంటే - డ్రామా అని కూడా అంటున్నారు, డ్రామా, ఉన్నదే డ్రామా...... అని అంటారు కాని కదులుతున్నారు కూడా. ఒకప్పుడు సంకల్పంలో కదులుతారు, ఒకప్పుడు మాటల్లో కూడా

కదులుతారు, ఒకప్పుడు కర్మ చేసేవరకు కూడా వచ్చేస్తారు. ఆ సమయంలో ఏమని అనిపిస్తూ ఉండవచ్చు. దృశ్యాన్ని ఎదురుగా తీసుకు రండి. డ్రామా, డ్రామా అని కూడా అంటున్నారు, మరొకవైపు కదులుతున్నారు కూడా. కాని నిశ్చయబుద్ధి గలవారి గుర్తు - నిశ్చింత విజయులుగా ఉండడం. ఒకవేళ విధి సరిగ్గా ఉంటే సిద్ధి ప్రాప్తించక పోవడమనేది ఉండనే ఉండదు. కావున ఎప్పుడైనా ఏదైనా కార్యంలో విజయం ప్రాప్తి అవ్వకపోతే నిశ్చయంలో లోపముందని భావించండి. ఒకవైపు కాదు, నాలుగు వైపులా చెక్ చేసుకోండి.

ఇంకొక విషయం, నిశ్చయబుద్ధి గలవారి గుర్తు - ఎలాగైతే నిశ్చిత విజయులుగా ఉంటారో, అలాగే నిశ్చింతగా ఉంటారు. ఎటువంటి వ్యర్థ చింతన రానే రాజాలదు. శుభ చింతన తప్ప వ్యర్థానికి నామ-రూపాలే ఉండవు. అలాగని వ్యర్థం వచ్చింది, తరిమేశారని కాదు. నిశ్చయబుద్ధి గలవారి ముందు వ్యర్థం రానే రాజాలదు. ఎందుకంటే ఎందుకు? ఏమిటి? మరియు ఎలా? అని అంటే అది వ్యర్థమవుతుంది. డ్రామా రహస్యాన్ని తెలుసుకున్నారు. డ్రామా ఆది-మధ్య-అంతాలను తెలుసుకున్నారు. ఎవరైతే డ్రామా ఆది-మధ్య-అంత్యాలను తెలుసుకున్నారో వారు ఆ చిన్న విషయం యొక్క ఆది-మధ్య-అంత్యాలను తెలుసుకోలేరా? తెలుసుకోని కారణంగా ఎందుకు? ఏమిటి? ఎలా? - ఇలాంటి వ్యర్థ సంకల్పాలు నడుస్తాయి. ఒకవేళ డ్రామా పై స్థిరమైన నిశ్చయముండి, జ్ఞాన స్వరూపులుగా, శక్తిశాలిగా కూడా ఉంటే వ్యర్థ సంకల్పాలు మిమ్ములను కదిపేందుకు ధైర్యం కూడా చేయలేవు. అయితే కదిలినప్పుడు ఏమయ్యిందో! తెలియదని ఆలోచిస్తారు. డ్రామా ఆది-మధ్య-అంత్యాలను తెలుసుకున్నారు, తమ 84 జన్మలను తెలుసుకున్నారు కానీ ఒక్క విషయాన్ని తెలుసుకోలేదని గమనించి బాప్‌దాదా నవ్వుతున్నారు. గొప్ప తెలివైనవారు కదా! సమయ ప్రతి సమయం తెలివిని చూపిస్తారు కదా! కల్పవృక్షానికి చెందిన అన్ని ఆకుల గురించి తెలుసుకున్నారా లేదా? అందరూ వృక్షము పునాదిలో కూర్చుని ఉన్నారా? లేక 7-8 మందే కూర్చుని ఉన్నారా? కనుక వేర్ల స్థానంలో కూర్చొని వృక్షం గురించి తెలుసుకున్నారా?



ఆకు ఆకు గురించి తెలుసుకున్నారు కాని ఇది ఎలాగో తెలియదా! కావున నిశ్చయానికి గుర్తు నిశ్చింత స్థితి - దీనిని అనుభవం చేయండి. అవుతుందా, అవ్వదా, ఏమవుతుంది, చేస్తూనే ఉన్నాము, ఏమి జరుగుతుందో చూద్దాము అని అంటే దీనిని నిశ్చింత అని అనరు. మళ్లీ తండ్రి ముందే ఫిర్యాదులు చేస్తూ ఉంటారు. బాబా, మీరు సహాయకులు కదా, మీరు రక్షకులు కదా, మీరు ఇలాంటివారు కదా, మీరు ఇలాంటివారు కదా....... విన్నవించుకోవడం, ఫిర్యాదు చేయడం అనగా అధికారం పోగొట్టుకోవడం. ఇది చేసి పెట్టండి, ఇది అయిపోతుంది కదా..... అని అధికారులు విన్నపాలు చేయరు. కావున నిశ్చయబుద్ధి గలవారు అనగా నిశ్చింతులుగా ఉండేవారు. కనుక ఈ ప్రాక్టికల్ గుర్తులు మాలో ఉన్నాయా అని మీలో మీరు చెక్ చేసుకోండి. మేము నిశ్చయబుద్ధి గలవారిగానే ఉన్నామనే నిర్లక్ష్యంలో ఉండిపోరాదు. ఏ నిశ్చయం బలహీనంగా ఉందో దానిని చెక్ చేసుకొని చేంజ్(పరివర్తన) చేసుకోండి. కేవలం చెక్ చేసుకోవడం కాదు. మీకు చెక్కర్‌గా(చెక్ చేసుకునే వారిగా) ఉండడంతో పాటు మేకర్‌గా(నియమాన్ని తయారుచేసేవారిగా) ఉండాలని బాప్‌దాదా చెప్పారు కదా! కేవలం చెక్కర్‌గా కాదు. చెక్ చేసుకోవడం అంటే సెకండులో చేంజ్ అవ్వడం అని అర్థం. కాని చెక్ చేసుకొని చేంజ్ చేసుకోకుంటే చాలాకాలం నుండి స్వయంలో నిరాశగా అయ్యే సంస్కారం పక్కా అవుతూ ఉంటుంది. అంతేకాక చాలాకాలపు సంస్కారం ఏదైతే ఉందో దానిని అంతిమంలో తప్పకుండా ఎదుర్కుంటూ ఉంటారు. కొందరైతే అంతిమంలో నేను శివబాబా గురించి తప్ప ఇంకెవ్వరి గురించి ఆలోచించనని అనుకున్నా అలా జరగజాలదు. దీనికోసం చాలాకాలపు అభ్యాసం కావాలి. లేకపోతే ఒక్క సెకండు శివబాబా, శివబాబా, శివబాబా అని అనుకుంటారు. ఆ తర్వాతి సెకండులో - కాదు, నీలో శక్తి లేదు, నీవు బలహీనంగా ఉన్నావు అని మాయ అంటుంది. ఇలా యుద్ధం నడుస్తూనే ఉంటుంది. ఒకవేళ నిశ్చింతగా అవ్వకుంటే బ్రాహ్మణ జీవితంలో అంతిమకాల లక్ష్యమునేదైతే వర్ణిస్తూ ఉంటారో అది ఎలా సహజమవుతుంది? మరియు ఒకవేళ అంతిమం వరకు ఈ వ్యర్థ సంకల్పాలు ఉన్నట్లయితే అవి

భూతాలు, యమదూతల రూపంలో ఎదురుగా వస్తాయి. ఇక వేరే యమదూతలెవ్వరూ రారు. ఈ వ్యర్థ సంకల్పాలు, మీ బలహీనతలు - ఇవే యమదూతల రూపంలో వస్తాయి. యమదూతలు ఏం చేస్తారు? భయపెడ్తారు. అంతేకాక ఇతరుల కోసం విమానం(పుష్పక విమానం)లో వెళ్తారని చెప్తారు. అనగా ఎగిరేకళ ద్వారా దాటుకుంటారు. విమానం మొదలైనవేవీ లేవు. కాని ఇది ఎగిరేకళను అనుభవం చేయడం. అందువలన ముందు నుండే చెక్ చేసుకొని చేంజ్ చేసుకోండి. ఎప్పటివరకు చేస్తారు? 'చేస్తాము' అని బాప్‌దాదానైతే సంతోషపెడ్తారు. ప్రతిజ్ఞను వ్రాసి కూడా ఇస్తారు. కాని(ఆ ప్రతిజ్ఞ) కాగితం వరకే ఉంటుందా లేక జీవితమంతా ఉంటుందా?

**19-01-1995**

బాప్‌దాదా ఇంతకు ముందు కూడా వినిపించారు - డ్రామాలో ఏ విషయాలైతే వస్తాయో ఆ విషయాలలో చాలా మంచి తెలివి ఉంది. కాని అప్పుడప్పుడు బ్రాహ్మణ పిల్లల్లో తెలివి కొద్దిగా తగ్గిపోతుంది. విషయం వస్తుంది, వెళ్లిపోతుంది. కాని బ్రాహ్మణ పిల్లలు విషయాన్ని పట్టుకొని కూర్చుంటారు. విషయం ఆగదు, వెళ్లిపోతుంది. కాని స్వయమే ఆ విషయాన్ని వదలరు. కావున విషయాలకు తెలివి ఎక్కువగా ఉందా ? లేక బ్రాహ్మణులకు తెలివి ఎక్కువగా ఉందా? విషయాలే తెలివైనవిగా అయిపోయాయి కదా? కొంతమంది పిల్లలు, రెండు రోజుల నుండి ఈ విషయం నడుస్తోంది, రెండు గంటలు ఈ విషయం నడిచిందని అంటారు. 2 గంటల్లో ఎంత పోగొట్టుకున్నారు? రెండు రోజుల్లో ఎంత పోగొట్టుకున్నారు? కావున తెలివైనవారిగా అవ్వండి.

**26-02-1995**

సంఘటనలో(సమూహంలో) ఉండే ఆనందం కూడా ప్రియమైనది. అలాగని రావడమైతే ప్రోగ్రామ్ అనుసారంగానే రావాలి, ఎక్కువ మంది రాకూడదు. కాని అందరిలో సర్దుకు పోగలిగే అలవాటు ఉండాలి. సర్దుకునే శక్తి సదా విజయులుగా తయారు చేస్తుంది. బ్రహ్మాబాబాను చూసినట్లైతే పిల్లలతో పిల్లవానిగా సర్దుకుపోయాడు, పెద్దవారితో పెద్దవాడిగా అయ్యి



సర్దుకుపోయాడు. బెగ్గరీ(పేద) జీవితంలోనైనా, సాధనాలున్న జీవితంలోనైనా రెండిటిలోనూ సర్దుకొని పోవాలి. చాలా సంతోషంతో సర్దుకుపోవాలి, ఆలోచించి కాదు. ఇక్కడ దుఃఖితులుగా అయితే అవ్వరు కాని సంతోషానికి బదులుగా ఇదేమి ఇలా జరిగింది? ఎలా జరిగింది?......... అని ఆలోచనలో పడిపోతారు. కావున ఆలోచించేవారికి సర్దుకోవడంలో ఉన్న ఆనందాన్ని పొందేందుకు కొంత సమయం పడ్తుంది. ఎలాంటి పరిస్థితి ఉన్నా, పరిస్థితి మంచిగా ఉన్నా, కదిలించేదిగా ఉన్నా ప్రతి సమయంలో, ప్రతి పరిస్థితిలో స్వయం సర్దుకోగలమా? అని మిమ్ములను మీరు చెక్ చేసుకోండి. డబల్ ఫారినర్స్‌కు ఏకాంతం కూడా మంచిగా అనిపిస్తుంది, సహచరులు (కంపానియన్స్) కూడా మంచిగా అనిపిస్తారు. కాని కంపెనీ అనగా సాంగత్యంలో ఉన్నా, ఒంటరిగా ఉన్నా రెండిటిలో సర్దుకోవడమే బ్రాహ్మణ జీవితం. సమూహంలో ఉంటే తల భారమెక్కి పోవడం కాదు - అలా అవ్వరాదు. నాకు ఏకాంతం కావాలి, ఈ గందరగోళం వద్దు, నేను ఒంటరిగా ఉండాలి,.... మనసుతో ఒంటరి అనగా బాహ్యముఖత నుండి అంతర్ముఖతలోకి వెళ్లిపోయినట్లయితే అదే ఒంటరితనం. నా ఒక్కరికే గది కావాలి, ఇద్దరికి కూడా వద్దు అని కొంతమంది అంటారు కదా. ఒంటరి గది లభించినా ఆనందంగా నిదురించండి, పది మంది మధ్యలో నిద్రించవలసి వచ్చినా ఆనందంగా నిదురించండి. ఫారినర్స్ పది మంది మధ్యలో నిదురించగలరా లేక కష్టమా? నిద్రపోగలరా? (హా జి / అవునండి). మంచిది. వచ్చే సంవత్సరం ఒక్కొక్క గదిలో 20-20 మందిని పడుకోబెడ్తాము. చూడండి, సమయం మారుతూనే ఉంది, ఇంకా మారుతూనే ఉంటుంది. ప్రపంచ పరిస్థితులు సున్నితంగా అవుతున్నాయి, ఇంకా సున్నితంగా అవుతాయి కూడా. అలా అవ్వవలసిందే. ఇప్పుడు కేవలం ఒక స్థానంలో వేరు వేరుగా జరుగుతున్నాయి. చివర్లో అన్ని వైపులా ఒకేసారి జరుగుతాయి. కావున సున్నితమైన సమయమైతే రావలసిందే. సమయం సున్నితంగా ఉన్నా మీ నేచర్(స్వభావం) సున్నితంగా ఉండరాదు. కొంతమంది స్వభావం చాలా సున్నితంగా ఉంటుంది కదా. కొద్దిగా

శబ్ధమైనా, ఏదైనా కొద్దిగా జరిగినా డిస్టర్బ్ అయిపోతారు. దీనినే సున్నితమైన స్థితి, సున్నితమైన స్వభావమని అంటారు. కావున సున్నితమైన స్వభావం ఉండరాదు. ఎలాంటి సమయం ఉంటుందో, అలా తమను సర్దుకోగలగాలి. ఈ అభ్యాసం ముందు ముందు మీకు చాలా ఉపయోగపడ్తుంది. ఎందుకంటే పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అంతేకాక మీ అంతిమ పరీక్ష సున్నితమైన సమయంలోనే జరగవలసి ఉంది. విశ్రాంతి సమయంలో జరగదు. సున్నితమైన సమయంలోనే జరగవలసి ఉంది. కావున ఎంతగా ఇప్పటినుండే స్వయంలో సర్దుకునే శక్తిని కలిగి ఉంటారో అంతగా సున్నితమైన సమయంలో పాస్ విత్ ఆనర్‌గా అవ్వగలరు. పరీక్ష చాలా సమయం వరకు ఉండదు. చాలా కొద్ది సమయం కొరకు ఉంటుంది. కాని నలువైపుల సున్నితమైన పరిస్థితులు ఉంటాయి. వాటి మధ్యలో పరీక్షను ఎదుర్కోవాలి. అందువలన స్వయాన్ని స్వభావంలో కూడా శక్తిశాలిగా తయారు చేసుకోండి. ఏం చేయాలి? నా స్వభావం ఇలా ఉంది, నా అలవాటే ఇలా ఉంది అని అనరాదు. దీనిని సున్నితమైన స్వభావమని అంటారు. చూడండి, బాప్‌దాదా స్థాపన ఆదిలో అన్నీ అనుభవం చేయించారు. యజ్ఞం ప్రారంభమైనప్పుడు రాకుమారులు, రాకుమారీల కంటే ఎక్కువగా పాలన, సాధనాలను అన్నీ అనుభవం చేయించారు. తర్వాత భికారి జీవితాన్ని కూడా అనుభవం చేయించారు. కావున ఎవరైతే రెండు అనుభవాలు చేశారో, వారికి అన్నీ అలవాటైపోయాయి. కాని మీ అందరి ముందైతే అలాంటి సమయం రాలేదు. కాని వస్తుంది. ఎక్కడ ఉన్నా అన్నీ కదులుతాయి, అన్ని ఆధారాలు తెగిపోతాయి. కావున అటువంటి సమయంలో ఏం కావాలి? తండ్రి ఆధారమొక్కటే ఉంటుంది. మీరైతే చాలా చాలా చాలా అదృష్టవంతులు. రాబోయే సమయం మీ సహజ సాధనాల సమయం. సహజ సాధనాల జత జతలో మీ బ్రాహ్మణ జన్మ ఉంది. కాని సాధన మరియు సాధనాలు - సాధనాలను చూస్తూ సాధనను మర్చిపోరాదు. ఎందుకంటే చివర్లో సాధన మాత్రమే పనికొస్తుంది. అర్థమయ్యిందా?



మీరు ఉత్సాహంగా ఉండేవారు. అనగా సదా ఉత్సవం జరుపుకునే శ్రేష్ఠమైన ఆత్మలు. ఎప్పుడూ ఉత్సాహం తగ్గిపోరాదు. ఇంతకు ముందు కూడా వినిపించాము కదా! బ్రాహ్మణ జీవితానికి శ్వాస ఉమంగ-ఉత్సాహాలు. ఒకవేళ శ్వాస ఆగిపోయినట్లయితే జీవితం ఒక్క సెకండులో సమాప్తమైపోతుంది కదా! కావున బ్రాహ్మణ జీవితంలో ఉమంగ-ఉత్సాహాల శ్వాస లేకుంటే అది బ్రాహ్మణ జీవితమే కాదు. ఎవరైతే సదా ఉమంగ-ఉత్సాహాలలో ఉంటారో వారు - బ్రాహ్మణులు ఉన్నదే ఉమంగ-ఉత్సాహాల కొరకు అని నషాతో చెప్తారు. ఎవరి ఉమంగ-ఉత్సాహాలు తక్కువైపోతాయో వారి మాటలే మారిపోతాయి. వారు - " ఇది నిజమే.... ఇదైతే జరగాల్సిందే.... అయిపోతుంది అని అంటారు. కావున ఈ భాష మరియు ఆ భాషలో ఎంత వ్యత్యాసముంది! వారి ప్రతి మాటలో 'అయితే' తప్పకుండా ఉంటుంది. ఇదైతే జరగాల్సిందే...... కనుక ఈ 'అయితే, అయితే' అనే శబ్ధము ఏదైతే ఉందో ఆ శబ్ధము ఉమంగ-ఉత్సాహాల ప్రెషర్(మోతాదు) తగ్గడం వలన అటువంటి మాటలు, బలహీనమైన మాటలు వెలువడ్తాయి. కనుక ఉమంగ-ఉత్సాహాలు ఎప్పుడూ తగ్గిపోరాదు. ఉమంగ-ఉత్సాహాలు ఎందుకు తగ్గుతాయి? సదా 'వాహ్ వాహ్' అని అనమని బాప్‌దాదా అంటారు. కాని వై వై(ఎందుకు ఎందుకు) అని అంటారు. ఒకవేళ ఏదైనా పరిస్థితిలో వై(ఎందుకు) అనే శబ్ధం వస్తే ఉమంగ-ఉత్సాహాల ప్రెషర్(ఒత్తిడి) తగ్గిపోతుంది. బాప్‌దాదా ముందు సంవత్సరం కూడా విశేషంగా డబల్ ఫారినర్స్‌కు చెప్పారు. వై(ఎందుకు) అనే పదాన్ని బ్రాహ్మణుల డిక్షనరీ(నిఘంటువు) నుండి మార్చేయండి. వై(ఎందుకు) అను మాట వచ్చినప్పుడు ఫ్లై(ఎగరాలి) అన్న మాటను గుర్తుంచుకుంటే 'వై ' అన్న పదం సమాప్తమైపోతుంది. ఏదైనా చిన్న పరిస్థితి కూడా పెద్దదిగా అనిపించినప్పుడు - ఇదెందుకు, ఇదేమిటి,....... అని 'వై' అనే పదం వచ్చేస్తుంది. అలా కాక( ఫ్లై ) ఎగిరినట్లయితే పరిస్థితి ఏమవుతుంది? చిన్న ఆటబొమ్మ. కావున ఎప్పుడైనా 'వై' అను పదము మనసులో వచ్చినట్లయితే బ్రాహ్మణ డిక్షనరీలో 'వై' అను పదం లేదు, ఫ్లై (ఎగరండి) అనే శబ్ధము ఉందని చెప్పండి. ఎందుకంటే వై - వై అన్నది

అయ్యో అయ్యో అనిపిస్తుంది. బాప్‌దాదాకు నవ్వు కూడా వస్తుంది. ఒకవైపేమో మా వంటి శ్రేష్ఠమైన భాగ్యము ఎవ్వరికీ లేదని అంటారు. ఇప్పుడిప్పుడే ఈ మాట అంటారు మళ్లీ ఇప్పుడిప్పుడే ఉత్సాహం తగ్గినప్పుడు - నా భాగ్యమే ఇలా ఉందేమో తెలియదు! నా భాగ్యంలో ఇంతే ఉందేమో అని అంటారు. కనుక అయ్యో అయ్యో అయిపోయింది కదా. కనుక ఎప్పుడైనా 'అయ్యో అయ్యో' అనాల్సిన దృశ్యం వచ్చినట్లయితే దానిని 'వాహ్ వాహ్' గా చేసుకున్నారంటే దృశ్యమూ మారిపోతుంది, మీరు కూడా మారిపోతారు.

**07-03-1995**

ఎప్పుడైనా ఏదైనా పరిస్థితి లేక ప్రకృతి అలజడి రూపంలో వచ్చినట్లయితే రెండు మాటలు గుర్తుంచుకోమని బాప్‌దాదా చాలా సహజమైన మాటలతో యుక్తిని, విధిని తెలుపుతున్నారు - ఆ పని చేయకండి(నాట్ అని చెప్పండి) లేక బిందువు(డాట్) పెట్టండి. 'నాట్ లేక డాట్.' ఒకవేళ ఏ విషయమైనా తప్పుగా ఉన్నట్లయితే 'నాట్' అనగా చేయరాదని అనుకోండి. దాని గురించి ఆలోచించరాదు, చేయరాదు, మాట్లడరాదు. బిందువు(డాట్) పెట్టినట్లయితే స్వతహాగానే 'నాట్'గా అయిపోతుంది(చెయ్యనే చెయ్యరు). ఆలోచించకండి(సోచో నాట్), బిందువు పెట్టండి(లగావో డాట్). అప్పుడు సమాప్తమైపోతుంది. బిందువు పెట్టేందుకు ఎంత సమయం పడ్తుంది? సెకండు కంటే తక్కువ. కాని ఏమి జరుగుతుంది? ఇది చేయరాదు, సరికాదని అర్థం చేసుకుంటారు కాని బిందువు పెట్టడం రావడం లేదు. జ్ఞాన స్వరూపులుగా అయితే అయిపోయారు. కాని కేవలం జ్ఞాన స్వరూపులుగానే ఉండరాదు. జ్ఞానంతో పాటు శక్తిశాలిగా కూడా ఉండాలి. శక్తిశాలి స్థితిలో బలహీనత ఉన్నందున బిందువును పెట్టలేకపోతున్నారు. ఎవరికైతే బిందువు పెట్టడం వస్తుందో వారు తండ్రిని కూడా మర్చిపోరు. తండ్రి కూడా బిందువే, మీరు కూడా బిందువులే కదా. కావున అన్నీ గుర్తుకు వచ్చేస్తాయి. ఫుల్‌స్టాప్(బిందువు) పెట్టండి. ప్రశ్న మార్కు(?) ఆశ్చర్య మార్కు(!) లేక కామా(,) పెట్టకండి. ఫుల్‌స్టాప్ పెట్టండి. ఫుల్‌స్టాప్ పెట్టడం సులభం కదా. మిగిలినవన్నీ పెట్టడం కష్టము.



అన్నిటికంటే కష్టమైనది ప్రశ్న మార్కు కాని దానిని పెట్టడం చాలా త్వరగా వస్తుంది.(వై)ఎందుకు అన్న పదం వచ్చినప్పుడు ఏమి చేయాలో వినిపించాము కదా! (ఫ్లై)ఎగరాలి. పైకి ఎగిరిపోండి. (వై)ఎందుకు అని అనకండి, (ఫ్లై)ఎగరండి. ' ఫ్లై' చేయడం (ఎగరడం) వస్తుందా ?

ఒక్క సెకండులో బిందువు పెట్టగలరా? ఇప్పుడిప్పుడే కర్మలో మరియు ఇప్పుడిప్పుడే కర్మకు అతీతంగా, కర్మ సంబంధానికి అతీతంగా అవ్వగలరా? ఈ ఎక్సర్‌సైజ్(వ్యాయామం) చేయడం వస్తుందా? ఏదైనా కర్మలో చాలా బిజీగా ఉన్నా, మనసు-బుద్ధి కర్మ సంబధంలో నిమగ్నమై ఉన్నా, బంధనంలో కాదు సంబంధంలో ఉన్నా బిందువు పెట్టమని ఆదేశం లభిస్తూనే ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఫుల్‌స్టాప్ పెట్టగలరా? లేక ఇది చేయాలి, ఇది చేయరాదు, ఇది ఇలా ఉంది, ఇది అలా ఉందని........ కర్మకు చెందిన సంకల్పాలు వస్తూ ఉంటాయా? కనుక ఈ అభ్యాసాన్ని ఒక్క సెకండు కొరకైనా చేయండి కాని అభ్యాసాన్ని చేస్తూ ఉండండి. ఎందుకంటే ఒక్క సెకండులో ఫుల్‌స్టాప్ పెట్టడం పైనే అంతిమ సర్టిఫికెట్ లభించవలసి ఉంది. సెకండులో విస్తారాన్ని ఇముడ్చుకుని సార స్వరూపంగా అయిపోవాలి. కనుక ఈ అభ్యాసాన్ని ఎప్పుడు అవకాశం లభిస్తే అప్పుడు, ఎప్పుడు చేయగల్గితే అప్పుడు చేస్తూ ఉండండి. అంతేగాని యోగంలో కూర్చుంటే బిందువు పెట్టగలమని అనరాదు. అలజడిలో ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఇంత శక్తిశాలి బ్రేక్ ఉందా? లేక బ్రేక్ ఇక్కడ వేస్తే వేరొక చోట ఆగుతుందా? సమయానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. సమయం గడిచిపోయిన తర్వాత ఫుల్‌స్టాప్ పెట్టినట్లయితే దాని వలన లాభమేమీ ఉండదు. అనుకున్న వెంటనే పెట్టేయాలి(జరిగిపోవాలి). నేను శరీరము కాదు, ఆత్మను, ఆత్మను అని ఆలోచిస్తూనే ఉండకండి. నేను ఫుల్‌స్టాప్ పెట్టాలి, ఇంకేమీ ఆలోచించరాదు........ అని ఇలా ఆలోచిస్తున్నా సమయం పడ్తుంది. ఇది సెకండులో ఫుల్‌స్టాప్ పెట్టడం కాదు. ఈ అభ్యాసాన్ని స్వయమే చేస్తూ ఉండండి. ఎవ్వరూ చేయించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కొత్తవారైనా, పాతవారైనా అందరికీ ఈ విధి అయితే తెలుసు కదా. అయితే చాలా కాలపు అభ్యాసముండాలి. ఆ సమయంలో నేను ఫుల్‌స్టాప్ పెట్టేస్తాను

అనుకుంటే పెట్టలేరు. ఈ విషయాన్ని మొదటే అర్థం చేసుకోవాలి. ఆ సమయంలో సమయానుసారంగా చేస్తామనుకుంటే చెయ్యలేరు. అలా జరగనే జరగదు. చాలా కాలపు అభ్యాసము ఉపయోగపడ్తుంది. ఎందుకంటే దీనితో సంబంధముంది. ఇక్కడి చాలాకాలపు అభ్యాసం చాలా కాలపు రాజ్యభాగ్యాన్ని ప్రాప్తి చేయిస్తుంది. ఒకవేళ అల్పకాలిక అభ్యాసముంటే ప్రాప్తి కూడా అల్పకాలికంగానే ఉంటుంది. కావున ఈ అభ్యాసాన్ని మొత్తం రోజంతటిలో ఎప్పుడు అవకాశం లభించినా చేస్తూ ఉండండి. ఒక్క సెకెండులో ఏమీ పాడైపోదు. మళ్లీ పని చేయడం ప్రారంభించండి. కాని అలజడిలో ఫుల్‌స్టాప్ పెట్టగలనా లేదా అని మిమ్ములను మీరు పరిశీలించుకోండి. కర్మ సంబంధంలోకి రావడానికి, కర్మ బంధనలోకి రావడానికి వ్యత్యాసముంది. ఒకవేళ కర్మబంధనలోకి వచ్చినట్లయితే కర్మ మిమ్ములను ఆకర్షిస్తుంది(లాగుతుంది). ఫుల్‌స్టాప్ పెట్టనివ్వదు. అదే అతీతంగా, ప్రియంగా(న్యారా, ప్యారాగా) అయ్యి ఏదైనా కర్మ సంబంధంలో ఉన్నట్లయితే సెకండులో ఫుల్‌స్టాప్ పెట్టగలరు. ఎందుకంటే బంధనము లేదు. బంధనము కూడా ఆకర్షిస్తుంది, సంబంధము కూడా ఆకర్షిస్తుంది, లాగుతుంది. కాని అతీతంగా అయ్యి సంబంధంలోకి రావాలనే దానిని అండర్‌లైన్ చేసుకోండి. ఈ అభ్యాసాన్ని చేసేవారే పాస్ విత్ ఆనర్‌గా (గౌరవపూర్వకంగా ఉత్తీర్ణులు) అవుతారు. ఇది అంతిమ కర్మాతీత స్థితి. పూర్తి అతీతంగా అయ్యి, అధికారిగా అయ్యి కర్మలోకి రావాలి. బంధనానికి వశమై కాదు.

**31-03-1995**

డబల్ విదేశీయులకు కూడా మేళా బాగా నచ్చిందా? మీరందరూ అలాగే నిద్రపోతారా, టెంట్‌లో నిద్రపోతారా? లేక నిద్రపట్టదా? నిద్రపోయేందుకు తయారుగా ఉన్నారా? వీరైతే తయారుగా ఉన్నారు కాని మీరు పడుకోబెట్టరు. చాలా సాహసవంతులుగా, ఎవర్‌రెడీగా ఉన్నారు. ఒకవేళ డన్‌లప్(పరుపు) లభించినా మంచిదే, నేల లభించినా మంచిదే. ఈ సీజన్‌లోని డబల్ విదేశీయులు కూడా మంచి ఉమంగ-ఉత్సాహాలు



గలవారిగా కనిపించారు. వృద్ధిని కూడా చూశారు. సంఖ్యలో కూడా వృద్ధి ఉంది. కనుక స్థితిలో కూడా వృద్ధి ఉంది. ఇప్పుడు బాల్యతనములోని ఆటలు సమాప్తమైపోయాయి. ఇప్పుడు పెద్దవారైపోయారు. అచ్ఛా, అందరూ బాగున్నారా? మేళా నచ్చిందా? ఈ జంజాటమేమిటని ఆలోచించడం లేదు కదా? లేదు చాలా బాగుంది. ఏదైతే డ్రామాలో జరుగుతుందో అదే మంచిది, చాలా చాలా మంచిగా ఉంటుంది.

**07-11-1995**

(ప్రసిద్ధ గాయకుడైన ఓంవ్యాస్ గారు కొత్త పాటల క్యాసెట్‌ను బాబాతో ప్రారంభింపజేశారు). మంచిది. డ్రామా మిమ్ములను నిమిత్తంగా చేసింది. అలా నిమిత్తంగా అవ్వడమే భాగ్యానికి గుర్తు. కనుక భాగ్యాన్ని తయారు చేసుకుంటున్నారు, ఇంకా చేసుకుంటూనే ఉంటారు.

**16-11-1995**

ఇది కూడా డ్రామానుసారంగా విశేషంగా వరదాత నుండి వరదానం లభిస్తుంది. ఏదైనా ఆర్ట్(కళ) ఉన్నట్లయితే ఆ ఆర్ట్‌ను వరదానంగా భావించి కార్యంలో ఉపయోగించండి. ఇది తండ్రి ఇచ్చిన వరదానము - డ్రామానుసారంగా విశేషంగా నిమిత్తంగా అయినట్లయితే దాని ద్వారా కార్యము సహజంగా సఫలమయ్యే ఉంటుంది. ఇలాగే ఉంది కదా? కనుక విశేషమైన వరదానీ ఆత్మలుగా ఉన్నారు, వారిని అదే విశేషత ద్వారానే కార్యంలో ఉపయోగిస్తూ ఉండండి. తండ్రి వరదానముంది - ఈ విషయం సదా స్మృతిలో ఉండాలి. అలా స్మృతిలో ఉంటే కేవలం మీ చేతులు మాత్రమే పని చేయవు, మీ చేతులతో పాటు తండ్రి శక్తి కూడా పని చేస్తుంది. చాలా బాగుంది.

**22-12-1995**

దాదీలతో - ఎప్పుడైతే మీరు మరియు వీరు(దాదీ, దీదీ జానకీ) కలుసుకుంటారో అప్పుడు మీకేమనిపిస్తుంది?(దాదీలు - బాబా, మీకు ఏమనిపిస్తుంది అని అన్నారు). బాబాకైతే మంచిగా అనిపిస్తుంది.

మీకేమనిపిస్తుంది? (బాబా మంచి జోడీని తయారు చేశారు, దేశ విదేశాలు వేరుగా ఉంటున్నా ఒక్కటిగా ఉన్నాయి). ఈ పాత్ర కూడా డ్రామాలో రచింపబడింది. మీరు బ్రాహ్మణ పరివారానికి పునాదిగా ఉన్నారు కదా. కనుక మీకు కూడా మంచిగా అనిపిస్తుంది కదా. బాప్‌దాదా తమ పునాదికి నిమిత్తమైన ఆత్మలను తనకంటే కూడా ముందు ఉంచుతారు. ఎందుకంటే ఇప్పుడు తండ్రి అయితే నిరాకారులు, బ్రహ్మాబాబా కూడా ఆకారిగా అయిపోయారు, ఇప్పుడు సాకారంలో వినాలన్నా, వినిపించాలన్నా, చూడాలన్నా, ఇవ్వాలన్నా......... అందుకు మీరు నిమిత్తంగా ఉన్నారు కదా. అంతేకాక సహజంగా నడుస్తున్నారు, ఇది చూసి మీరందరు కూడా సంతోషపడ్తున్నారు కదా? చూడండి, మీ ద్వారా(దాదీ జానకి) విదేశీ సేవ జరగాలని ఫిక్స్ అయ్యి ఉండినది. కనుక డ్రామాను ఎవ్వరూ మార్పు చెయ్యలేరు. మీరు వెళ్లాల్సి వచ్చింది, నిమిత్తంగా అవ్వాల్సి వచ్చింది. విదేశానికి అవసరమే కదా?(బాబా సకాశ్ ఉంది). బాప్‌దాదా అయితే వేరుగా లేనే లేరు, ఆ విధంగా అతుక్కుపోయి ఉన్నారు. ఎందుకంటే మీరు పూర్తి రోజంతా - బాబా ఇది చేస్తారు, బాబా ఇలా చెప్తారు.......... అని చెప్పాల్సి ఉంటుంది. బాబా, బాబా అనే శబ్దమే వెలువడ్తూ ఉంటుంది కదా. స్మృతి చేయించేందుకు కూడా - శివబాబా గుర్తున్నారా? అని అనాల్సి ఉంటుంది. ఎవరైనా ఏడ్చి వస్తే మీరు బాబా, బాబా అంటూ వారిని నవ్విస్తారు కదా. మంచిది.

**31-12-1995**

భారతవాసులతో - భారతవాసులు బాగున్నారా? ఒకవేళ తండ్రి భారతదేశంలో రాకపోతే విదేశీయులు ఎక్కడి నుండి వస్తారు? అని భారతవాసులకు నషా ఉంది. ఎందుకంటే బాప్‌దాదాను డ్రామాలో డ్రామాలో పేదల పాలిటి పెన్నిధి అని అంటారు. అందువలన విదేశాలు పేదవిగా లేవు. భారతదేశం పేదగా ఉంది. అంతేకాక తండ్రికి పేదవారంటే ఇష్టం. అందువలన చాలా పేదగా ఉన్న భారతదేశంలోనే వచ్చారు. లండన్‌లో రాలేదు. అమెరికాలో కూడా రాలేదు. భారతదేశం అవినాశి. అవినాశి ఖండంగా మళ్లీ భారతదేశమే అవుతుంది. ఈ అమెరికా అయితే ఇప్పుడు వెలువడింది,



ఇప్పుడే సమాప్తమైపోతుంది. తండ్రి అవినాశిగా ఉన్నారు అందువలన అవినాశి ఖండంలోనే వస్తారు. భారతదేశానికి నషా కూడా ఎక్కువగా ఉంది. మేము భగవంతుని కూడా మా ప్రేమ అనే తాడుతో బంధించేశామని భారతదేశానికి అన్నిటికన్నా గొప్ప నషా ఉంది. చూడండి - ఇప్పుడు కూడా భారతదేశంలోనే వస్తారు కదా! మీరందరూ భారతదేశంలో కలవడానికి రావాలి. కావున భారతదేశం కూడా తక్కువ కాదు మరియు విదేశాలు కూడా తక్కువ కావు. ఇరువురూ గారాబు పిల్లలే.

**18-01-1996**

ఏ పిల్లలైతే సాకారం తర్వాత వచ్చారో వారు బ్రహ్మాబాబా తమ సాకార పాత్రను ఇంత త్వరగా ఎందుకు పూర్తి చేశారు? అని అనుకుంటారు. మేము చూసేవారము కదా! మేము కలిసేవారము కదా! ఇలా ఆలోచిస్తారు కదా! కానీ కౌరవ సైన్యానికి నిమిత్తంగా అయిన మహావీరుల కళ్యాణం ఎవరి ద్వారా జరిగిందో కల్పక్రితం కూడా గాయనముంది. శక్తుల ద్వారా జరిగింది కదా! కావున శక్తుల పాత్ర డ్రామాలో సాకార రూపంలో నిశ్చితమై ఉంది. అంతేకాక మాతృ శక్తి లేకుండా ఈ విశ్వకళ్యాణం జరగడం అసంభవమని అందరూ అంగీకరిస్తారు కూడా. కనుక బ్రహ్మాబాబా ఫరిస్తాగా ఎందుకు అయ్యారు? సాకార పాత్ర ఎందుకు పరివర్తన అయ్యింది? ఒకవేళ బ్రహ్మాబాబా ఫరిస్తా రూపాన్ని ధారణ చేయకపోతే మీరింత మంది ఆత్మలు ఇక్కడకు వచ్చేవారు కాదు(చేరుకోలేక పోయేవారు). ఎందుకంటే వాయుమండలంలోని భ్రాంతులు(భ్రమలు) ఈ విశ్వ క్రాంతి(విప్లవం) కార్యాన్ని తేలికగా చేస్తూ ఉండేవి(చేసేవి). కావున బ్రహ్మాబాబా ఫరిస్తాగా అవ్వడం మీ మెజారిటీ(అనేకమంది) పిల్లల భాగ్యాన్ని తెరవడానికి (మేల్కొల్పడానికి) కారణమయ్యింది. ఇప్పుడు ఫరిస్తా రూపంలో సేవలో తీవ్ర గతి ఏదైతే ఉందో, దానిని చూస్తున్నారు కదా! వేగం తీవ్రమయ్యిందా? లేక తగ్గిందా? తీవ్రమయ్యింది కదా! తీవ్రమయ్యింది కనుకనే మీరందరూ ఇక్కడకు చేరుకున్నారు. లేకుంటే మంచి నిద్రలో ఉండేవారు. కావున ఈ రోజు, ఏ విధంగా జనులు వెళ్లిపోయారు, వెళ్లిపోయారని జరుపుకున్నట్లుగా

కాదు, తండ్రిని అనుసరించాలి(ఫాలో ఫాదర్), మేము కూడా అలా స్మృతి స్వరూపంగా, నిర్మోహులుగా అవ్వాలనే ఉమంగ-ఉత్సాహం వస్తుంది. ఇది ప్రాక్టికల్‌గా(ఆచరణ ద్వారా) పాఠము చదువుకునే రోజు.

ట్రస్టీగా ఉన్నారు అనగా మొదటి నుండే అన్నీ(సర్వస్వం) వదిలిపోయాయి. ట్రస్టీ అనగా అన్నీ తండ్రికి స్వాధీనం చేసేశారు (అర్పించారు). నా గురించి ఏమవుతుంది! అని ఆలోచించలేదు. ఏమవుతుందో, ఏమవుతుందో(గా, గా) అని వచ్చిందంటే గడబిడ అవుతుంది. అంతా మంచిదే, మరియు మంచి జరగాల్సిందే అని నిశ్చింతగా ఉన్నారు. దీనినే సమర్థ స్వరూపమని అంటారు. కావున ఈ రోజు ఏ రోజు? సమర్థంగా అయ్యే రోజు, నిర్మోహులుగా అయ్యే రోజు. కేవలం బ్రహ్మాబాబా చాలా గుర్తుకు వచ్చే రోజు, పాటలు పాడే రోజు కాదు. కావున బ్రహ్మాబాబా ఫరిస్తా రూపంగా అవ్వడం, డ్రామాలో పరమాత్మ కార్యాన్ని ప్రత్యక్షం చేసేందుకు నిమిత్తమైన కారణంగా అయింది. బ్రహ్మాబాబా ఉన్నారా లేక లేనే లేరా?(ఉన్నారు). అయితే కనిపించడం లేదు!

చూడండి! మీరెవరైతే వెనకాల వచ్చారో వారు చాలా లక్కీ (అదృష్టవంతులు). ఎందుకు? ఇప్పుడు సేవ చేసేందుకు తయారై, తయారు చేయబడిన సేవా సాధనాలు ఉన్న సమయంలో వచ్చారు. 60 సంవత్సరాలుగా ఉన్నవారు వెన్న తీశారు, ఇప్పుడు వెన్న తినేవారైన మీరు వచ్చేశారు. ఈ రోజు చరిత్రను(హిస్టరీని) విని ఉంటారు కదా! ఇంత శ్రమను మీరు చేసి ఉంటే పారిపోయేవారు. అంతేకాక వర్తమాన సమయంలో సేవ జరిగే వాయుమండలం తయారై ఉంది. ఇప్పుడు ప్రెసిడెంట్ అయినా, ప్రైమ్ మినిస్టర్ అయినా, ఏ నాయకుడైనా మెజారిటీ(చాలా మంది), ఈ కార్యం మంచిది, మేము చేయగలమా లేదా అన్నది వేరే విషయం అనైతే అంగీకరిస్తారు. ప్రతి ఒక్కరికి తమ తమ పాత్రలు వేరు వేరుగా ఉన్నాయి. కాని ఇది మంచి కార్యము, ఈ కార్యము ఇంకా ముందుకు సాగాలని అయితే అంటున్నారు కదా! ముందు ఏమనేవారు? బ్రహ్మాకుమారీల ముఖము కూడా చూడరాదని అనేవారు. ప్రారంభంలో ఒకవేళ



ఆహ్వానించేందుకు వెళ్ళినా తలుపులు వేసుకునేవారు కదా. కనుక మీరైతే మంచి సమయంలో వచ్చారు కదా! ఇప్పుడు సేవకు చాలా అవకాశముంది. ఎంత సేవ చేయాలనుకుంటే అంత సేవ చేయవచ్చు. ఇప్పుడు అందరూ సాకార బ్రహ్మ వెళ్ళిన తర్వాత కూడా బ్రహ్మాకుమారీలు సిల్వర్ జూబ్లీ కూడా జరుపుకున్నారు, గోల్డెన్‌జూబ్లీ కూడా జరుపుకున్నారు, ఇప్పుడు డైమండ్ జూబ్లీ వరకు కూడా చేరుకున్నారని భావిస్తున్నారు. ఎందుకంటే ఎవరైనా పెద్ద గురువు వెళ్ళిపోయినట్లైతే గడబిడ(గందరగోళం) అయిపోతుంది. ఇక్కడేమైనా గడబిడ ఉందా? ఇక్కడైతే ఇంకా వృద్ధి జరుగుతోంది, పెరుగుతూ పోతోంది. కావున దీని ద్వారా ఈ కార్యాన్ని చేయించేవారు తండ్రి అయిన పరమాత్మ అని, నిమిత్త మాధ్యమంగా బ్రహ్మాబాబా ఉన్నారని నిరూపించబడింది. ఇప్పుడు కూడా మాధ్యమంగా బ్రహ్మాబాబాయే ఉన్నారు. ఈ పాత్ర(అవ్యక్త పాత్ర) విషయం వేరు. కాని డ్రామాలో మాధ్యమంగా ముందు సాకార బ్రహ్మ ఉన్నారు, ఇప్పుడు ఫరిస్తా రూపంలో బ్రహ్మ ఉన్నారు. బ్రహ్మను తండ్రి అని అంటారు. రచయితగా అయితే బ్రహ్మయే ఉన్నారు కదా. వీరి పాత్ర అయితే మధ్య మధ్యలో పిల్లల పాలన చేసేందుకు నిమిత్తంగా ఉంది. ఇకపోతే రచయిత అయిన బ్రహ్మ ఉన్నాడు మరియు రచనా కార్యంలో ఇప్పుడు కూడా చివరి వరకు బ్రహ్మకే పాత్ర ఉంది.

**27-02-1996**

(మధువనానికి చెందిన ప్రఫుల్ భాయి ఏక్సిడెంట్‌లో శరీరాన్ని వదిలారు). ఈ పుత్రుడు మంచివాడు. సేవ చేయాలనే ఉమంగ-ఉత్సాహాలతో కూడా ఉండేవాడు. కాని లెక్కాచారాల సమయం తయారైనప్పుడు ఏదో ఒక కారణం తయారైపోతుంది. ఇకపోతే ఈ పుత్రుడు స్వయం మంచివాడు.

(బాబా పిల్లలకు సహాయం చేస్తారు కదా, మరి ఆ సమయంలో ఎందుకు సహాయం చేయలేదు?) అతడి లెక్కాచారం అదే డ్రైవరుతో, అదే స్థానంతో అవుతుంది. నిశ్చితమైన దానిని ఆపలేము. (డాక్టర్లు రక్షించేందుకు చాలా ప్రయత్నించారు). అందరి ప్రేమ కూడా ఉంది. మృత్యువు

తేదీని ఆపజాలరు. భగవంతుడు కూడా మార్చజాలరు.

**10-03-1996**

తండ్రి మీ అందరినీ కర్మాతీతులుగా చెయ్యాల్సిందే. తయారవ్వాల్సిందే కదా! లేక తండ్రి బలవంతంగా తయారు చేయాలా? తండ్రి తయారుచేయాలి, మీరందరూ తయారవ్వాల్సిందే. ఇది మధురమైన డ్రామా. డ్రామా బాగుందనిపిస్తోంది కదా! లేక అప్పుడప్పుడు విసిగిపోతున్నారా? ఇదేమి ఇలా తయారయ్యింది! ఇది మారాలి అని ఆలోచిస్తున్నారా? బాబా ఎప్పుడూ ఇది తయారు చేయబడిన డ్రామా, ఇది మారజాలదని అంటారు. రిపీట్ (పునరావృతం) అవ్వాలి. కాని మారజాలదు. డ్రామాలోని మీ అంతిమ జన్మకు పవర్స్(శక్తులు) ఉన్నాయి. ఇది డ్రామాయే కానీ డ్రామాలో ఈ శ్రేష్ఠ బ్రాహ్మణ జన్మలో చాలా శక్తులు లభించాయి. తండ్రి విల్లు చేశారు కావున విల్‌పవర్(సంకల్ప శక్తి) ఉంది.

**03-04-1996**

మీ అందరికీ(బాబాను) తనవారిగా చేసుకోవడం సులభమా లేక కష్టమా? మంచిది. తమవారిగా చేసుకున్నారా లేక తయారు చేసుకుంటున్నారా? తయారు చేసుకున్నారా, పక్కా? లేక అప్పుడప్పుడు తలను వెనుకకు తిప్పుకుంటున్నారా?(నాజ్ నఖరే) వయ్యారాలైతే ఒలకబోయడం లేదు కదా! అప్పుడప్పుడు చాలా ఆటలు చూపిస్తారు. కావున తండ్రినైతే తమవారిగా చేసుకున్నారు. తండ్రిని తమవారిగా చేసుకోవడం అనగా సదా తండ్రి తోడును మరియు చేయిని అనుభవం చేయడం. ఆదిరత్నాలకు తండ్రి తోడును అనుభవం చేయడం చాలా సహజం. ఎందుకంటే సాకారంలో తోడును అనుభవం చేశారు. మీరైతే ఎమర్జ్ చేసుకోవలసి ఉంటుంది. కాని వీరు ప్రాక్టికల్‌గా తోడుగా ఉండడం, తినడం, నడవడం, తిరగడం వీటిని సాకారంలో అనుభవం చేశారు. కావున సాకారంలో అనుభవం చేసిన విషయం సహజంగా గుర్తుంటుంది. ఇది వీరి లక్(అదృష్టం). తండ్రి తోడుగా ఉన్నారనే అనుభవాన్ని వీరు ఎప్పుడు



కావాలంటే అప్పుడు చేయగలరు. ఇలా ఉన్నారా? కాని డ్రామాలో మీ అందరి కోసం విశేషంగా ఒక లిఫ్ట్ ఉంది. ఎవరైతే అవ్యక్త రూపంలో ఉన్నప్పుడు వచ్చారో, సాకార రూపంలో డ్రామానుసారంగా వెనకాల వచ్చారో వారికి అదనపు లిఫ్ట్ ఉంది. ఆ లిఫ్ట్ ఏది? ఎప్పుడు కావాలంటే అప్పుడు బాప్‌దాదాల అదనపు సహాయం లభిస్తుంది. సంకల్పమనే ఒక్క అడుగు మీది, సహయోగమనే అనేక అడుగులు తండ్రివి. కావున మీకు అదనపు లిఫ్ట్ ఉంది. అర్థమయ్యిందా? మీరు కూడా తక్కువ కాదు.

**13-12-1996**

చూడండి, ఈ రోజుకు రెండు విశేషతలు ఉన్నాయి. ఒకటి ఈ శాంతివనాన్ని ఎవరైతే ఉమంగ-ఉత్సాహాలతో తయారుచేశారో దానిని బాప్‌దాదా జతలో పిల్లలైన మీరందరూ ప్రారభోత్సవం చేస్తున్నారు. అంతేకాక డ్రామానుసారంగా ఈ రోజు కొత్త సంవత్సరం కూడా ప్రారంభమవ్వనున్నది. కావున బాప్‌దాదా పిల్లలందరిని తమ రెండు బాహువుల్లో(భుజాల్లో) ఇముడ్చుకుంటూ రెండు విషయాలకు శుభాకాంక్షలను ఇస్తున్నారు. ఎలాగైతే ఇప్పుడు ఈ సమయంలో సాకార రూపంలో తండ్రి జతలో ఉమంగ-ఉత్సాహాలతో, సంతోషంలో ఊగుతున్నారో అలా కొత్త సంవత్సరంలో సదా అవ్యక్త రూపంలో సాథీగా(సహచరునిగా) భావించండి. అనుభవం చేయండి. తోడుగా ఉండే ఈ అనుభవం చాలా ప్రియమైనది. బాప్‌దాదాకు కూడా పిల్లలు లేకుండా బాగనిపించదు(మైకు ఆగిపోయింది). మొట్టమొదటి అనభవం కదా! అందువలన ఇది కూడా డ్రామాలోని ఆటగా భావించండి. ఏ విషయాన్నైనా హెచ్చు తగ్గులు అయినట్లుగా భావించకండి. బాగుంది మరియు బాగానే ఉంటుంది. చాలా మంచిది, చాలా మంచిది అంటూ మీరు కూడా మంచిగా అయిపోతారు, డ్రామాలోని ప్రతి దృశ్యమూ మంచిగా అయిపోతుంది. ఎందుకంటే మీరు మంచిగా అయ్యే వైబ్రేషన్లు ఎటువంటి దృశ్యంగా ఉన్నా, నెగటివ్‌ను కూడా పాజిటివ్‌లోకి మార్చేస్తుంది. పిల్లలైన మీలో ఇంత శక్తి ఉంది. కేవలం దానిని ఉపయోగించండి. శక్తులు చాలా ఉన్నాయి. సమయానికి ఉపయోగించి చూడండి, చాలా మంచి

మంచి అనుభవాలు చేస్తారు.

(((( 06-03-1997

(వినాశనానికి ముందు ఒక్కొక్క ఖండంలో ఒక్కొక్కసారి బాబా రావాలి). డ్రామాను చూడండి. తండ్రి లండన్‌లో వచ్చినా మధువన మహిమ మధువనానికి ఉంది. భవిష్యత్తులో ఏమి జరగబోతుందో దానిని చెప్పేస్తే ఆనందం(మజా) సమాప్తమైపోతుంది. అందువలన ఏమి జరుగుతుందో చూడండి. మంచిది. కానుకను పార్శిల్ చేసేశారా! వాపస్ తీసుకోరాదు. మంచిది. డబల్ విదేశీయులు సంతోషంగా ఉన్నారా? డబల్ విదేశీయులందరూ విశ్రాంతిగా ఉంటున్నారా? (భవనాలన్నీ నిండుగా ఉన్నాయి). ఎవరూ పట్టపురాణిగా అవ్వలేదా? ఇప్పుడు పట్టపురాణిగా తయారుచేస్తాము.(క్రింద నిద్రపోయేవారు పట్టపు రాణులు). మీ అటాచి(సూట్ కేసు, బ్యాగ్) ఏదైతే ఉందో దానిని పరుపుగా చేయండి. కనీసం తలగడగానైనా తయారవుతుంది. ఆ దృశ్యం కూడా బాగుంటుంది కదా! అటాచీ తలగడగా అవుతుంది. అందరూ విశ్రాంతిగా విష్ణువు వలె పడుకొని ఉంటారు. ఎంత బాగుంటుంది! డబల్ విదేశీయులను పట్టపురాణులుగా తప్పకుండా చేస్తాము. చూడండి, ప్రారంభంలో స్థాపనా సమయంలో ఈ విశేష ఆత్మలందరూ మూడు అడుగుల జాగాలో నిద్రించారు. నాలుగు అడుగులు కూడా కాదు, మూడు అడుగుల నేల పై నిద్రించారు. విశేషమైన మహారథులు నేల పైన నిద్రించేవారు కావున ఏదైతే ఆదిలో జరిగిందో అది మీరు అంతిమంలో చేస్తారు కదా! నడుము నొప్పిగా ఉందనే కారణాన్ని అయితే చెప్పరు కదా! ఏదైనా నొప్పి ఉన్నట్లయితే నేరుగా నేల పై నిద్రించమని, బెడ్(పరుపు) పైన పడుకోకండి, సందిలి(బెంచ్) పైన నేరుగా నిదురిస్తే(పడుకుంటే) ఆరోగ్యం కూడా బాగయిపోతుందని డాక్టర్లు కూడా చెప్తారు. మీరందరైతే ఎవర్‌రెడీగా ఉన్నారు. డబల్ విదేశీయులు అనగా డబల్ ఎవర్‌రెడీ. అచ్ఛా. బాగా జరుపుకోండి.



14-12-1997

ఈ సంవత్సరం వీడ్కోలు మరియు శుభాకాంక్షలు తెలిపేది. ఈ సంవత్సరంలో ఏ పిల్లలైతే విశేషమైన సంకల్పాన్ని చేశారో, అది ప్రాక్టికల్‌గా చేసేవారికి బాప్‌దాదా ద్వారా అదనపు సహాయం కూడా లభిస్తుంది. కేవలం దృఢంగా ఉండండి. మధ్య మధ్యలో డ్రామా పరీక్ష తీసుకుంటుంది. కాని సంకల్పంలో దృఢంగా ఉండాలి. సంకల్ప రూపీ పాదం కదలరాదు. అచలంగా ఉంటే బాప్‌దాదా ద్వారా అదనపు సహాయం అనుభూతి అవుతుంది. కేవలం తీసుకునే శక్తి కావాలి. ఒకే బలం, ఒకే విశ్వాసం - ఏమైపోయినా తయారవ్వాల్సిందే. ఈ సంకల్ప రూపీ పాదాన్ని దృఢంగా ఉంచండి. విషయాలు వస్తాయి కూడా. కాని ఎలాగైతే విమానంలో ప్రయాణించునప్పుడు మేఘాలు కింద ఉండిపోయి, స్వయం మేఘాల పైన ఉంటారో అలాంటి అనుభవాన్ని చేస్తారు. మేఘాలు ఒక మనోరంజన దృశ్యంగా అయిపోతుందో అలా నల్లని మేఘాల వంటి విషయాలు ఎన్ని ఉన్నా వాటిలో కొన్ని సమస్యలకు పరిష్కారం లేక సమాధానం ఆ సమయంలో కనిపించకపోయినా ఈ మేఘాలు వెళ్లిపోయేందుకే వచ్చాయనే దృఢమైన నిశ్చయముండాలి. ఈ మేఘాలు చెదిరిపోయేవి, అలాగే ఉండేవి కావు. ఇలాంటి ఎగిరేకళ స్థితిలో స్థితులైనట్లైతే ఎన్ని కారునలుపు మేఘాలైనా చెదిరిపోతాయి, మీరు దృఢతా బలం ద్వారా సఫలురుగా అవ్వనే అవుతారు. ఇదెలా అవుతుంది! అని గాభరా పడకండి. మంచే జరుగుతుంది. ఎందుకంటే సమయం ఎంత సమీపంగా వస్తూ ఉంటుందో అంత కొత్త కొత్త విషయాలు, సంస్కారాలు, లెక్కాచారాల నల్లని మేఘాలు వస్తాయని బాప్‌దాదాకు తెలుసు. ఇక్కడే అన్నీ సమాప్తమవ్వాలి. రోజురోజుకు ఇంకా అలాంటి విషయాలు ఎందుకు పెరుగుతున్నాయని కొందరు పిల్లలు అంటారు. ఏ పిల్లలైతే ధర్మరాజపురిని దాటనవసరం లేదో వారికి సంగమయుగ ఈ అంతిమ సమయంలో స్వభావ సంస్కారాల లెక్కాచారాలన్నీ ఇక్కడే సమాప్తమవ్వాలి. ధర్మరాజ పురిలోకి వెళ్లే పని ఉండదు. మీ వద్దకు(ఎదురులో) యమదూతలు రారు.

ఈ విషయాలే యమదూతలు. అవి ఇక్కడే సమాప్తమవ్వాలి. అందువలన రోగాలు బయటికి రావడం అవి సమాప్తమయ్యేందుకు గుర్తు. సమయం సమీపంగా ఉందని కనిపించడం లేదని, ఇంకా వ్యర్థ సంకల్పాలు పెరుగుతున్నాయని ఆలోచించకండి. కాని ఇవి సమాప్తమవ్వడానికే బయటకు వస్తున్నాయి. వాటి పని రావడం, మీ పని ఎగిరేకళ ద్వారా, సకాశ్ ద్వారా పరివర్తన చేయడం, భయపడకండి. కొంతమంది పిల్లల విశేషత ఏమిటంటే గాభరాపడడం బయటకు కనిపించదు కాని మనసులో భయపడ్తారు. బయటకు లేదు, లేదు ఏమీ లేదని, ఇదైతే జరుగుతూనే ఉంటుందని అంటారు. కాని లోపల దాని సెగ(వేడి) ఉంటుంది. కావున గాభరాపడే విషయాలు వస్తాయి కాని మీరు గాభరాపడరాదని బాప్‌దాదా ముందు నుండే వినిపిస్తున్నారు. తమ శస్త్రాలను వదిలేయకండి. ఎవరైతే గాభరాపడ్తారో అప్పుడు వారి చేతిలో ఉండే వస్తువులు కింద పడిపోతాయి. కావున ఎప్పుడైనా మనసులోనైనా గాభరాపడినా శస్త్రాలు లేక శక్తులు ఏవైతే ఉన్నాయో అవి పడిపోతాయి, అదృశ్యమైపోతాయి. అందువలన గాభరా పడకండి. మీకు అన్నీ ముందే తెలుసు. త్రికాలదర్శులుగా అవ్వండి. మాయతో నిర్భయులుగా అవ్వండి. సంబంధంలో అయితే స్నేహం మరియు నిరహంకారత ఉంటాయి. ఎవరు ఎలా ఉన్నా మీరు హృదయపూర్వకమైన స్నేహాన్ని ఇవ్వండి, శుభ భావన ఇవ్వండి, దయ చూపండి, నిర్మానంగా (నిరహంకారిగా) అయ్యి వారిని ముందు ఉంచి ముందుకు నడిపించండి. దీనినే కారణమనే నెగటివ్‌ను(చెడును) సమాధాన రూపీ పాజిటివ్‌గా(మంచిగా) చేయడం అని అంటారు. ఈ కారణం, ఈ కారణం, ఈ కారణం............ కారణం లేక సమస్యను పాజిటివ్ సమాధానంగా చేయండి.

**24-02-1998**

**దాదీలతో** - సదా ఒకే విధమైన ఆట బాగుండదు. ఛేంజ్(మార్పు) కావాలి. కావున డ్రామా ఆటలో భిన్న భిన్న ఆటలు కనిపిస్తూ ఉంటాయి. మంచిది. అన్ని సంకల్పాలు పూర్తి అవుతూ ఉంటాయి కదా! ఎంత అతీతంగా, ప్రియంగా



అయ్యి సంకల్పాలు చేస్తారో, ఆ సంకల్పాలన్నీ పూర్తి అయిపోతాయి. బ్రాహ్మణుల ప్రతి సంకల్పము సఫలతా బీజం ద్వారా సంపన్నమవుతాయి. బీజమే సఫలత పొందేదిగా ఉన్నప్పుడు సఫలతా ఫలమే వెలువడ్తుంది.

**30-03-1999**

ఎంత గొప్ప మల్టీ మిలియనీర్‌గా(కోటీశ్వరులుగా) ఉన్నా ఒక్క రోజులో మీలాంటి రిచ్చెస్ట్‌గా(ధనవంతులుగా) ఎవ్వరూ అవ్వజాలరు. ఇంత రిచ్చెస్ట్‌గా అయ్యే సాధనమేది? చాలా చిన్న సాధనం - మనుష్యులు రిచ్చెస్ట్‌గా అయ్యేందుకు ఎంత శ్రమ చేస్తారు! కాని మీరు ఎంత సహజంగా సంపన్నవంతులుగా అవుతారు! ఆ సాధనమేదో తెలుసు కదా! కేవలం చిన్న బిందువు ఉంచితే చాలు. బిందువు పెట్టానే సంపాదన జరిగింది. ఆత్మా బిందువే, తండ్రి కూడా బిందువే. జరిగిపోయిన దానికి డ్రామా అని ఫుల్‌స్టాప్ పెట్టడం కూడా బిందువే. కావున బిందువైన ఆత్మను స్మృతి చేస్తారు, సంపాదన పెరిగింది. లౌకికంలో కూడా చూడండి, బిందువుతోనే (సున్నతోనే) సంఖ్య పెరుగుతుంది. ఒకటి తర్వాత బిందువు ఉంచితే ఏమైపోతుంది? 10. రెండు బిందువులు పెట్టండి, మూడు బిందువులు పెట్టండి, నాలుగు బిందువులు పెట్టండి, అలా పెరుగుతూనే ఉంటుంది. కావున మీ సాధనం ఎంత సులభమైనది! 'నేను ఆత్మను' - అన్న ఈ స్మృతిలో ఉండడమే బిందువు పెట్టడం అనగా ఖజానా జమ అవ్వడం. తర్వాత 'తండ్రి' బిందువు పెట్టండి, ఇంకా ఖజానాలు జమ అవుతాయి. కర్మలో, సంబంధ-సంపర్కంలో డ్రామా ఫుల్‌స్టాప్(బిందువు) పెట్టండి. గతానికి ఫుల్‌స్టాప్ పెట్టానే ఇంకా ఖజానాలు పెరిగిపోతాయి. కావున మొత్తం రోజంతటిలో ఎన్నిసార్లు బిందువు పెడ్తారో చెప్పండి. బిందువు పెట్టడం ఎంత సహజం! కష్టమేమైనా ఉందా? బిందువేమైనా జారిపోతోందా?

అన్నిటికంటే సహజమైనది 'బిందువు పెట్టడం'. ఎవరైనా కనులతో చూడలేని అంధులైనా వారు కాగితం పై పెన్సిల్ ఉంచితే బిందువు పెట్టబడ్తుంది. మరి మీరైతే త్రినేత్రులు. అందువలన ఈ మూడు బిందువులను సదా ఉపయోగించండి. ప్రశ్నార్థకము ఎంత వంకరగా ఉంటుందో వ్రాసి

చూడండి. వంకరగా ఉంది కదా! మరి బిందువు ఎంత సహజమైనది! బాప్‌దాదా పిల్లలు తన సమానంగా అయ్యేందుకు రకరకాల విధులు వినిపిస్తూ ఉంటారు. బిందువు ఉంచడమే విధి. ఇక వేరే విధి లేదు. ఒకవేళ విదేహిగా అవ్వాలనుకున్నా విధి - బిందువుగా అవ్వడమే. కావున బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు - "అమృతవేళ బాప్‌దాదాతో మిలనం చేసి, ఆత్మిక సంభాషణ చేసి కార్యంలోకి వచ్చినప్పుడు ముందు మూడు బిందువుల తిలకాన్ని మస్తకంలో దిద్దుకోండి. ఆ ఎరుపు రంగు బిందువుల తిలకాన్ని(స్థూలమైన తిలకం) దిద్దుకోవడం ప్రారంభించకండి, స్మృతి తిలకాన్ని దిద్దుకోండి. ఏ కారణంతో కూడా ఈ స్మృతి తిలకం చెరిగిపోకుండా చెక్ చేసుకోండి.

దాదీజీతో – ఇప్పుడు డ్రామా ఏదైతే జరుగుతోందో దీని ద్వారా అందరి స్నేహం పెరుగుతుంది. నిమిత్త ఆత్మల్లో కూడా అందరి లాంటి ప్రాణముంది. కావున ఆపరేషన్ అయితే నిమిత్తంగా జరుగుతుంది కాని తద్వారా అందరి స్నేహం మరియు ఆశీర్వాదాల ఖజానా చాలా జమ అయిపోయింది. డ్రామాలో మురళీలు కూడా ఎంతగా సమయ ప్రమాణంగా రిపీట్ అయ్యాయో చూడండి. బాప్‌దాదా సకాశ్‌ను ఇచ్చే పాఠాన్ని, తీసుకునే పాఠాన్ని అందరికీ చదివించారు. సమయానుసారంగా మురళీలు కూడా అవే నడిచాయి. బాప్‌దాదాలకైతే ప్రేమ ఉండనే ఉంది. కాని ప్రతి పుత్రునికి హృదయపూర్వకమైన ప్రేమ ఉంది. పరమాత్మ ప్రేమతో పాటు బ్రాహ్మణాత్మల ప్రేమ ఎగిరింపజేస్తుంది. ఎందుకంటే మీ అందరికీ సాకారంతో కొంత కాలమైనా కలిసిన మహత్వం ఉంది. ఇంత ఎక్కువ సమయం కలవడానికి బదులు ఫరిస్తాల వలె ఈ మిలనం - డ్రామాలో ఈ పాత్ర కూడా బాగుంది. ఇప్పుడు తమను బ్రహ్మాబాబా సమానమైన ఫరిస్తా రూపంలో కలవడం, నడవడం మరియు ఎగరడం ఇదే పాత్ర నడుస్తోంది. ఎలాగైతే బ్రహ్మాబాబాను చూసినప్పుడు పూర్తి అతీతంగా, కర్మాతీతంగా ఉన్నారని అనుభవమయ్యిందో, అదే విధంగా మహారథులైన మీరందరూ ఇప్పుడు అలా బ్రహ్మాబాబా సమానంగా కర్మాతీత స్థితికి సమీపంగా రావలసిందే. ఫాలోఫాదర్ (తండ్రిని



అనుసరించండి). మీ ఒక్క సెకను దృష్టి అనేక గంటల ప్రాప్తిని అనుభవం చేయిస్తుంది. ఇప్పుడు మాట్లాడే, కూర్చునే శ్రమ కూడా తగ్గిపోతూ ఉంటుంది. ఒక్కసారిగా బ్రహ్మాబాబాయే కనిపిస్తాడు. వీరు దాదీలు కాదు, బ్రహ్మాబాబాయే. అవ్యక్త బ్రహ్మ అవ్యక్త రూపంలో పాలననిస్తున్నారు. మీ ద్వారా సాకార బ్రహ్మాబాబా అనుభూతి పెరుగుతూ ఉంటుంది. మిమ్ములను దాదీగా చూడరు, బ్రహ్మగా చూస్తారు. అలాగే జరుగుతుంది కదా! మంచిది. మీరు విలువైన రత్నాలు. విలువైన రత్నాలను సంభాళించడం జరుగుతుంది.

**30-11-1999**

ప్రతి ఒక్కరు రోజంతటిలో ఎంత జమ చేసుకుంటున్నాము? లేక ఎంత పోగొట్టుకుంటున్నాము? అని చెక్ చేసుకుంటున్నారా? చెక్ చేసుకుంటున్నారా? తప్పకుండా చెక్ చేసుకోవాలి. ఎందుకంటే ఇది ఒక్క జన్మ కోసం కాదు. ప్రతి జన్మ కోసం. అనేక జన్మల కోసం జమ అవ్వాలి. జమ చేసుకునే విధి తెలుసా? చాలా సులభము. కేవలం బిందువు పెడ్తూ వెళ్లండి. బిందువు గుర్తుంటే జమ అవుతుంది. ఎలాగైతే స్థూల ఖజానాలో కూడా ఒకటి పక్కన బిందువు పెడ్తూ ఉంటే విలువ పెరుగుతూ ఉంటుందో, అదే విధంగా ఆత్మ కూడా బిందువే, తండ్రి కూడా బిందువే, డ్రామాలో ఏదైతే గడిచిపోయిందో అది కూడా ఫుల్‌స్టాప్ అనగా బిందువు. ఒకవేళ ప్రతి ఖజానాను బిందువు రూపంలో స్మృతి చేసినట్లయితే జమ అవుతూ ఉంటుంది. అనుభవముంది కదా! బిందువు పెట్టారంటే వ్యర్థమవ్వకుండా జమ అవుతూ ఉంటుంది. బిందువు పెట్టడం వస్తుందా? బిందువు పెట్టేందుకు ప్రయత్నిస్తారు కాని కొన్నిసార్లు బిందువుకు బదులు పొడవైన గీతగా అయిపోతుంది. కొన్నిసార్లు బిందువుకు బదులు ప్రశ్నార్థకంగా, ఆశ్చర్యార్థకంగా అయిపోతుంది. కనుక జమ ఖాతాను పెంచుకునే విధి - బిందువు, పోగొట్టుకునే మార్గం - పొడవైన గీత గీసుకోవడం, ప్రశ్నార్థకం పెట్టడం, ఆశ్చర్యార్థకం పెట్టడం. అన్నిటికంటే సహజమైనదేది? బిందువు కదా! కావున విధి చాలా సులభము. స్వమానంలో ఉంటూ తండ్రిని స్మృతి చేస్తూ వ్యర్థానికి ఫుల్‌స్టాప్ పెట్టడం.

బాప్‌దాదా ఇంతకుముందు కూడా చెప్పారు - రోజూ అమృతవేళ తమకు తామే మూడు బిందువుల స్మృతి తిలకాన్ని దిద్దుకుంటే ఒక్క ఖజానా కూడా వ్యర్థంగా పోదు. ప్రతి సమయంలో ప్రతి ఖజానా జమ అవుతూ ఉంటుంది. బాప్‌దాదా పిల్లలందరి ఖజానాల చార్టును చూశారు. అందులో ఏమి చూశారు? ఇప్పటివరకు జమ ఖాతాలో ఎంత ఉండాలో అంత లేదు. సమయం, సంకల్పాలు, మాటలు వ్యర్థంగా కూడా పోతున్నాయి. నడుస్తూ నడుస్తూ ఒకసారి సమయానికున్న మహత్వం ఎమర్జ్(ప్రత్యక్ష) రూపంలో తగ్గిపోతుంది. ఒకవేళ సమయ మహత్వాన్ని సదా గుర్తుంచుకుంటే, ఎమర్జ్‌గా ఉన్నట్లయితే సమయాన్ని ఇంకా ఎక్కువగా సఫలం చేసుకోవచ్చు. రోజంతా సమయము సాధారణ రూపంలోనే వెళ్ళిపోతుంది. పొరపాట్లు ఉండవు కాని సాధారణంగా గడిచిపోతుంది. అదే విధంగా సంకల్పాలు కూడా చెడు సంకల్పాలు నడవవు కాని వ్యర్థ సంకల్పాలు నడుస్తూ ఉంటాయి.

భాగ్య చిత్రాన్ని చూడండి. సదా తమ భాగ్య చిత్రాన్ని చూసి వాహ్ వాహ్ అనే పాటను పాడండి. వాహ్ నా భాగ్యము! వాహ్ నా తండ్రి! వాహ్ నా పరివారము! పరివారము కూడా వాహ్ వాహ్‌గా ఉన్నారు. వీరైతే చాలా వాహ్ వాహ్‌గా ఉన్నారు, వీరు కొంచెం అలా ఉన్నారని అనుకోరాదు. వాహ్ నా పరివారం! వాహ్ నా భాగ్యం! వాహ్ నా బాబా! బ్రాహ్మణ జీవితం అనగా వాహ్ వాహ్. అయ్యో అయ్యో కాదు. శారీరిక వ్యాధి ఉన్నప్పుడు కూడా అయ్యో అయ్యో అని అనకండి. వాహ్! అని అంటే ఆ భారం కూడా దిగిపోతుంది. ఒకవేళ 10 మణుగుల నుండి 3-4 మణుగుల భారం తగ్గిపోతే బాగుంటుందా లేక అయ్యో అయ్యో అని అంటారా? వాహ్ నా బరువు తగ్గిందని అంటారా లేక అయ్యో నా పాత్రయే ఇలా ఉంది, అయ్యో! నన్ను ఈ వ్యాధి వదలడం లేదు అని అంటారా? మీరు వ్యాధిని వదలాలా లేక వ్యాధి వదులుతుందా? వాహ్ వాహ్ అంటూ ఉంటే, వాహ్ వాహ్ అని అనడం వలన వ్యాధి కూడా సంతోషిస్తుంది. చూడండి, ఇక్కడ కూడా అలాగే జరుగుతుంది కదా! ఎవరినైనా మహిమ చేస్తున్నప్పుడు వాహ్ వాహ్ అని అంటారు. కావున వ్యాధికి కూడా వాహ్ వాహ్! అని చెప్పండి. అయ్యో!



ఇది నా వద్దకు ఎందుకు వచ్చింది? నా లెక్కాచారమే ఇలా ఉందని అంటారు. అయితే ప్రాప్తి ముందు లెచ్చాచారమేమీ ఉండదు. ప్రాప్తులను ఎదురుగా ఉంచుకోండి, లెక్కాచారాలను ఎదురుగా ఉంచుకోండి, అప్పుడు ఆ లెక్కాచారమేమని అనిపిస్తుంది? చాలా చిన్న విషయంగా అనిపిస్తుంది. బ్రాహ్మణ జీవితంలో ఏమి జరిగినా పాజిటివ్ రూపంలో చూడండి.

బిజినెస్‌మెన్(వ్యాపారవేత్తలు) మీరెవరైతే వచ్చారో వారికేదైనా చింత ఉందా? ఏమవుతుంది? ఎలా అవుతుంది? అన్న చింత ఉందా? చింత లేకపోతే చేతులెత్తండి. రేపు ఏదైనా జరిగినా నిశ్చింత చక్రవర్తులుగా ఉన్నారా? బిజినెస్‌మెన్ నిశ్చింత చక్రవర్తులుగా ఉన్నారా? కొద్దిమందే చేతులెత్తారు. ఎవరికైతే కొద్ది కొద్దిగా చింత ఉందో, వారు చేతులెత్తగలరా లేక సిగ్గనిపిస్తుందా? బాప్‌దాదా నిశ్చింత చక్రవర్తి, దు:ఖరహిత పురానికి మహారాజులు అనే టైటిల్(బిరుదు) కూడా ఇచ్చారు. కావున ఎప్పుడైనా ఏదైనా అలాంటి విషయం వచ్చినప్పుడు చింత తప్పకుండా వస్తుంది. కాని మీరు దు:ఖరహిత పురంలోకి వెళ్ళిపోండి. దు:ఖరహిత పురి(బేగమ్ పురి)లో కూర్చుండిపోయినప్పుడు చక్రవర్తిగా కూడా అయిపోతారు అంతేకాక దు:ఖరహిత పురంలో కూడా ఉండిపోతారు. పాత ప్రపంచం పోయి కొత్త ప్రపంచం కావాలని మీరే ఆహ్వానించారు. అయితే ఎలా పోతుంది? క్రిందిది పైకి వచ్చినప్పుడే ఇది పోతుంది. ఏమైపోయినా మీరు నిశ్చింతగా అవ్వాల్సిందే. ఈ పాత ప్రపంచము అంతమవ్వాలని మీరే ఆహ్వానించారు. కావున పాత ప్రపంచంలో, పాత ఇంట్లో ఏమవుతుంది? ఎప్పుడు ఏమి విరిగిపోతుందో, ఎప్పుడు ఏమి పడిపోతుందో అనిపిస్తుంది కదా. కావున ఇదైతే జరగాల్సిందే. నథింగ్ - న్యూ(కొత్తదేమీ కాదు). బ్రహ్మాబాబా ప్రతి మాటలో నథింగ్ న్యూ అన్న శబ్దమే ఉండేది. జరగవలసిందే జరుగుతోంది, మనం నిశ్చింత చక్రవర్తులమని అనేవారు. అలా బ్రహ్మాబాబాలాగా నిశ్చింతగా ఉన్నారా? నిశ్చింతగా ఉంటే దివాలా తీయడం నుండి కూడా రక్షింపబడ్తారు. చింతలో ఉండి నిర్ణయం సరిగ్గా లేకపోతే ఒక్క రోజులోనే ఎలా ఉన్నవారు ఎలా అయిపోతారో మీకు ముందే తెలుసు. నిశ్చింతగా ఉండి, నిర్ణయం

బాగుంటే రక్షింపబడ్తారు. ఇప్పుడు సమయానుసారంగా ఇది చేయాలా, చేయరాదా? అని టచింగ్ అవుతుంది.

**03-03-2000**

బాప్‌దాదా తమ చేతులతో జెండా ఎగురవేశారు. 64వ శివజయంతి నిమిత్తంగా 64 క్రొవ్వొత్తులను వెలిగించారు మరియు పిల్లలందరికి శివజయంతి శుభాకాంక్షలు తెలిపారు.

అందరూ తమ బర్త్‌డే కూడా జరుపుకున్నారు, జెండాను కూడా ఎగుర వేశారు. ఇప్పుడు ప్రతి ఆత్మ హృదయంలో ఈ జెండాను ఎగుర వేయాలి. మీ అందరి హృదయాలలో అయితే తండ్రి జెండా ఎగురుతూ ఉంటుంది. ఇప్పుడు మేరా బాబా(నా తండ్రి) అని విశ్వమంతా అనాలి. ఎలాగైతే ఢంకా మ్రోగినప్పుడు అది బిగ్గర శబ్ధంతో మ్రోగుతుందో అదే విధంగా 'మేరా బాబా' అనే ఢంకా చాలా జోరుగా, కోలాహలం వలె బిగ్గరగా మ్రోగాలి. ఇదే పిల్లలందరి హృదయంలోని ఆశ. జరగాల్సిందే ఎందుకంటే అనేకసార్లు జరిగింది. ఇప్పుడు మళ్ళీ రిపీట్(పునరావృతం) అవ్వాల్సిందే. ఆ రోజు అందరూ కలిసి ఏ పాట పాడ్తారు? వాహ్ బాబా వాహ్! వాహ్ డ్రామా వాహ్! అందరి హృదయంలో బాబా, బాబా మరియు బాబాయే ఉంటారు. ఆ రోజు కనిపిస్తోంది కదా! కనిపిస్తోందా? ఆ రోజు రానే వచ్చింది. అందరికీ అభినందనలైతే లభించాయి. మీ అందరికీ అభినందనలు ఉండనే ఉన్నాయి. అంతేకాక అందరికీ ఈ రోజు శుభాకాంక్షలు ఇప్పించవలసి ఉంటుంది. అవతరణ దినం, జన్మదినం, పరివర్తన దినం, ప్రత్యక్షతా దినం రావలసిందే, మంచిది. అందరికీ ఈ రోజున గోల్డెన్ నైట్(బంగారు రాత్రి), డైమండ్ నైట్(వజ్రపు రాత్రి).

**19-03-2000**

లాస్ట్‌లో (అంతిమంలో) హోమ్‌వర్క్ అయితే ఇస్తారు కదా! కొంచెం హోమ్‌వర్క్ అయితే లభిస్తుంది కదా! అయితే బాప్‌దాదా రాబోయే సీజనులో వస్తారు. కాని...... కండిషన్(షరతు) పెడ్తారు. చూడండి, సాకార పాత్ర కూడా



నడిచింది, అవ్యక్త పాత్ర కూడా నడిచింది. ఇంత సమయం అవ్యక్త పాత్ర నడుస్తుందని స్వప్నంలో కూడా లేదు. కావున రెండు పాత్రలు డ్రామానుసారంగా నడిచాయి. ఇప్పుడు ఏదైనా కండిషన్‌ను(షరతును) ఉంచవలసి ఉంటుందా, లేదా! మీ అభిప్రాయమేమిటి? అలాగే నడుస్తూ ఉంటుందా? ఎందుకు? ఈ రోజు వతనంలో ప్రోగ్రామ్ గురించి కూడా అడిగారు. కావున బాప్‌దాదాల ఆత్మిక సంభాషణలో - ఈ డ్రామా పాత్ర ఎంతవరకు? అనే విషయమే నడిచింది. ఏదైనా తేదీ ఉందా? (డెహరాడూన్ ప్రేమ్ అక్కయ్యతో) జాతకాన్ని వినిపించండి. ఎప్పటి వరకు? ఇప్పుడు ఎంతవరకు? అన్న ప్రశ్న తలెత్తింది. ఎప్పటి వరకు? అయినా కాని..... దీని కొరకు 6 నెలలైతే ఉంది కదా! 6 నెలల తర్వాతనే మళ్ళీ సీజను ప్రారంభమవుతుంది. కావున బాప్‌దాదా రిజల్టు చూడాలనుకుంటున్నారు. మానసిక స్వచ్ఛత, మనసులో ఏ విధమైన పాత సంస్కారాల, అభిమానం, అవమానాల అనుభవాల మచ్చ ఉండరాదు.

**15-01-2001**

ఈ రోజు విశేషంగా బ్రహ్మాబాబా ఎక్కువగా గుర్తుకొచ్చారు కదా! బ్రహ్మాబాబా కూడా పిల్లలందరిని స్మృతి స్వరూపులుగా, సమర్థ స్వరూపులుగా గుర్తు చేసుకున్నారు. కొందరు పిల్లలు బ్రహ్మాబాబాతో ఆత్మిక సంభాషణ చేస్తూ, మీరు ఇంత త్వరగా ఎందుకు వెళ్ళిపోయారని మధురాతి మధురంగా ఫిర్యాదులు చేశారు. పిల్లలైన మా అందరి నుండి శెలవు తీసుకొని ఎందుకు వెళ్ళలేదు? అని రెండవ ఫిర్యాదు చేశారు. అప్పుడు బ్రహ్మాబాబా ఇలా చెప్పారు - 'నన్ను అకస్మాత్తుగా ఎందుకు పిలిచారు? అని నేను కూడా శివబాబాను అడిగాను. అప్పుడు శివబాబా అన్నారు - ఒకవేళ పిల్లల నుండి శెలవు తీసుకొని రమ్మని చెప్పినట్లయితే మీరు పిల్లలను వదలగలిగేవారా లేక పిల్లలు మిమ్ములను వదలగలిగేవారా? చివర్లో నష్టోమోహా స్మృతి స్వరూపంగా ఉన్నారనే స్మృతిచిహ్నం అర్జునుడైన మీకే ఉందని చెప్పారు. అప్పుడు బ్రహ్మాబాబా చిరునవ్వు నవ్వుతూ చెప్పారు - ఇదైతే అద్భుతంగా ఉంది. వెళ్ళిపోతున్నారని పిల్లలూ భావించలేదు, బ్రహ్మా కూడా నేను

వెళ్తున్నానని భావించలేదు. ఎదురుగా ఉంటున్నా రెండువైపులా మౌనంగా ఉన్నారు. ఎందుకంటే సమయ ప్రమాణంగా సన్ షోస్ ఫాదర్(పిల్లలు తండ్రిని ప్రత్యక్షం చేస్తారు) ఈ పాత్ర డ్రామాలో నిశ్చితమై ఉంది. దీనినే వాహ్ డ్రామా వాహ్ అని అంటారు. సేవలో పరివర్తన నిశ్చితమై ఉంది. బ్రహ్మాబాబా పిల్లలకు వెన్నముకగా(బ్యాక్‌బోన్‌గా) అవ్వవలసి ఉంది. కనుక అవ్యక్త రూపంలో ఫాస్ట్ సేవా పాత్రను అభినయించాల్సి ఉంది.

డబల్ ఫారినర్స్ - కేవలం రెండు మూడు సంవత్సరాలు మీరు ఆగినట్లయితే మేము చూసేవారమని బ్రహ్మాబాబాతో అన్నారు. అప్పుడు బ్రహ్మాబాబా నవ్వుతూ, అయితే డ్రామా అలా ఎందుకు చేసిందో డ్రామాతో మాట్లాడండి అని హాస్యమాడారు.

**31-02-2001**

బాప్‌దాదా వద్దకు ప్రకృతి కూడా నేను ఎవర్‌రెడీ అని చెప్పేందుకు వస్తోందని బాప్‌దాదా ముందు కూడా వినిపించారు. పోతే సమయం కూడా బ్రాహ్మణులు తయారుగా ఉన్నారా అని పదే పదే చూస్తూ ఉంటుంది. పదే పదే బ్రాహ్మణుల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. కనుక బాప్‌దాదా అడుగుతున్నారు - చేతులైతే చాలా బాగా ఎత్తుతారు, బాప్‌దాదా కూడా సంతోషిస్తున్నారు. ఇప్పుడు ప్రతి సంకల్పం, ప్రతి సెకను, ప్రతి శ్వాస ఏదైతే గడుస్తుందో అది వాహ్ వాహ్‌గా ఉండే విధంగా ఎవర్‌రెడీగా అవ్వండి. అయ్యో! అనేలాగ ఉండరాదు, వాహ్ వాహ్‌గా ఉండాలి. ఇప్పుడు ఒక సమయంలో వాహ్ వాహ్‌గా ఉంటుంది, మరొక సమయంలో అయ్యో అనే విధంగా అయిపోతుంది. ఒక్కో సమయంలో బిందువు పెడ్తారు, మరొక సమయంలో ప్రశ్న మార్కు మరియు ఆశ్చర్యార్థకము పెట్టబడ్తుంది. మీ అందరి మనసు కూడా వాహ్ అని అనాలి. అంతేకాక ఎవరి సంబంధ-సంపర్కాలలోకి వస్తారో బ్రాహ్మణులు గాని లేక సేవ చేసేవారు గాని వారి నుండి వాహ్ వాహ్ అనే శబ్ధం వెలువడాలి.



**21-11-2001**

సంకల్పం ద్వారా, మాటల ద్వారా, కర్మల ద్వారా, సంబంధ - సంపర్కాల ద్వారా ఆశీర్వాదాలను ఇవ్వాలి, ఆశీర్వాదాలను తీసుకోవాలి. ఒకవేళ ఏ ఆత్మ గురించి అయినా ఏదైనా వ్యర్థ సంకల్పం లేక నెగటివ్ సంకల్పం వచ్చినా, నా కర్తవ్యం ఏమిటి? అన్నది గుర్తుంచుకోండి. ఎలాగైతే ఎక్కడైనా మంటలు అంటుకున్నప్పుడు కూడా మంటలు ఆర్పేవారు ఉంటే వారు మంటలను చూసి వాటిని ఆర్పేందుకు నీళ్లు వేసే తమ కార్యాన్ని మర్చిపోరు. మేము నీరు పోసేవారము, మంటలు ఆర్పేవారమని వారికి ఎలా గుర్తు ఉంటుందో అలాగే ఒకవేళ ఎవరైనా ఏదైనా వికారమనే అగ్నికి వశమై, మీకు మంచిగా అనిపించని కార్యాన్ని చేసినట్లైతే మీరు మీ కర్తవ్యాన్ని గుర్తుంచుకోండి - నా కర్తవ్యం ఏమిటి - ఎటువంటి అగ్నినైనా ఆర్పడం, ఆశీర్వాదాలను ఇవ్వడం, శుభ భావనల భావనా సహయోగమివ్వడం.

ఏదైనా కారణం ఎదురుగా తయారైనప్పుడు ఒక్క సెకండులో కారణానికి నివారణను ఆలోచించండి. నేను విశ్వంలో నివారణ చేసేదానిని అన్నప్పుడు నా చిన్న చిన్న సమస్యలకు స్వయం నేనే నివారణ చేసుకోలేనా! అని ఆలోచించండి. ఇప్పుడైతే ఆత్మల క్యూ మీ ఎదురుగా వస్తుంది - హే ముక్తిదాతా! ముక్తినివ్వండి. ఎందుకంటే ముక్తిదాతకు మీరు డైరెక్టు పిల్లలుగా, అధికారి పిల్లలుగా ఉన్నారు. మాస్టర్ ముక్తిదాతలుగా అయితే ఉన్నారు కదా! కాని క్యూ ముందు మాస్టర్ ముక్తిదాతలైన మీ వైపు నుండి ఒక ఆటంకమనే ద్వారం మూయబడి ఉంది. క్యూ ఏమో తయారుగా ఉంది. కాని ఏ ద్వారం మూసి ఉంది? పురుషార్థంలో బలహీన పురుషార్థంతో కూడిన ఒక శబ్ధమనే ద్వారం. ఆ శబ్ధము "ఎందుకు". ఎందుకు? అనే ప్రశ్న మార్కు. ఈ ఎందుకు అనే శబ్ధం ఇప్పుడు క్యూను మీ ఎదురుగా తీసుకు రావడం లేదు. కావున బాప్‌దాదా ఇప్పుడు సమస్యల ద్వారమైన 'ఎందుకు' అన్న దానిని సమాప్తం చేయండి అని దేశ - విదేశాల్లోని పిల్లలందరికీ గుర్తు చేస్తున్నారు.

కారణాన్ని సమాప్తం చేసి నేను నివారణ స్వరూపంగా అవ్వాల్సిందే.

ఏమి జరిగినా, సహించవలసి వచ్చినా, మాయను ఎదుర్కోవలసి వచ్చినా, ఒకరికొకరి సంబంధ సంపర్కంలో సహించవలసి వచ్చినా నేను సమస్యగా అవ్వరాదని హృదయపూర్వకంగా దృఢ సంకల్పాన్ని చేయాలి.

అదే విధంగా ఎప్పుడైనా ఏదైనా సమస్య వచ్చినట్లయితే ఎదురుగా బాప్‌దాదాను చూడండి. హృదయపూర్వకంగా 'బాబా' అని అనండి, బాబా హాజరైపోతారు, సమస్య సమాప్తమైపోతుంది. సమస్య మీ ముందు నుండి తొలగిపోతుంది, బాప్‌దాదా మీ ఎదురుగా హాజరైపోతారు.

**03-02-2002**

**రోజీ బెహన్‌తో** – డ్రామాలో మీకెంత మంచి పాత్ర ఉంది! లెక్క పూర్తయ్యింది. ఏదైతే లెక్కాచారం మిగిలి ఉందో అది మీరు పూర్తి చేశారు. చాలా సంతోషంగా పూర్తి చేశారు. ఈ లెక్కాచారమైతే సేవ కోసం జరుగుతూనే ఉంటుంది. సేవాధారులుగా ఎవరైతే ఉన్నారో వారు ఎక్కడికి వెళ్ళినా సేవ లేకుండా ఉండలేరు. వారికి ఆ సేవకు ఫలమైన ఆశీర్వాదాలు లభిస్తూనే ఉంటాయి.

**24-02-2002**

ఇప్పుడు మీలో మీరు నా వృత్తి(భావం)లో ఏ ఆత్మ పట్ల అయినా ఏవైనా నెగటివ్ వైబ్రేషన్లు ఉన్నాయా అని చెక్ చేసుకోండి. మీరు విశ్వ వాయుమండలాన్ని పరివర్తన చేయాలి. కాని మనసులో ఏ ఆత్మ పట్ల అయినా వ్యర్థ వైబ్రేషన్లు లేక సత్యమైన వైబ్రేషన్లు కూడా నెగటివ్‌గా ఉన్నట్లయితే వారు విశ్వ పరివర్తనను చేయజాలరు. ఆటంకాలు వస్తూ ఉంటాయి. సమయం పడుతుంది. వాయుమండలంలో శక్తి రాదు. చాలామంది పిల్లలు వారున్నదే అలా కదా! అలాగే ఉన్నారు కదా! అని అంటారు. అప్పుడు వైబ్రేషన్లు(ప్రకంపనాలు) అయితే ఉంటాయి కదా! తండ్రికి కూడా జ్ఞానమిస్తారు. "బాబా, మీకు తెలియదు, ఆ ఆత్మ అలాంటిదే" అని అంటారు. కాని తండ్రి అడుగుతున్నారు - వారు చెడ్డవారే, తప్పు చేశారు, అలా జరగరాదు కాని చెడును మీ వృత్తిలో ఉంచుకునేందుకు తండ్రి



అనుమతించారా? దీనికి తండ్రి అనుమతి లేదని ఎవరు భావిస్తున్నారో వారు ఒక చేయి ఎత్తండి. టీ.వీలో చూపించండి(దాదీజీతో). మీరు చూస్తున్నారు కదా! మంచిది. చేయి ఎత్తామని గుర్తుంచుకోండి. డబల్ ఫారినర్లు చేతులెత్తారు. బాప్‌దాదా టీ.వీలో అయితే వస్తోంది. ప్రతి బ్రాహ్మణాత్మ తన వృత్తిలో ఏ ఆత్మ పట్ల అయినా నెగటివ్ వైబ్రేషన్లు కలిగి ఉంటే వారు విశ్వకళ్యాణం కోసం తమ వృత్తి ద్వారా వాయుమండలాన్ని వ్యాపింపజేయలేరు. దీనిని పక్కాగా అర్థం చేసుకోండి. ఎంత సేవ అయినా చేయండి. రోజూ ఎనిమిదేసి ఉపన్యాసాలివ్వండి, యోగ శిబిరాలు చేయించండి, అనేక రకాల కోర్సులు చేయించండి కాని ఎవరి పట్ల అయినా ఎలాంటి పాత నెగటివ్ వైబ్రేషన్లు ఉంచుకోకండి. వారు చెడ్డవారు, చాలా పొరపాట్లు చేస్తారు, అనేక మందికి దు:ఖమునిస్తారు, కరెక్టే అయితే మీరు వారిని దు:ఖమివ్వడంలో బాధ్యులుగా చేసేందుకు బదులు వారు పరివర్తన అయ్యేందుకు సహాయకులుగా అవ్వండి. ఒకవేళ వీరు మారనే మారరు అని మీరు భావిస్తున్న అలాంటి ఆత్మ ఎవరైనా ఉందనుకోండి, సరే మీ జడ్జిమెంట్‌లో(నిర్ణయంలో) వారు మారేవారే కాదు. కాని నంబరువారీగా అయితే ఉన్నారు కదా! వీరు మారేవారే కాదని మీరెందుకు ఆలోచిస్తున్నారు? మీరెందుకు జడ్జిమెంట్ ఇస్తున్నారు? జడ్జిమెంట్ ఇచ్చేందుకు జడ్జి అయిన తండ్రి ఉన్నారు కదా! వీరు ఇలా ఉన్నారు, వీరు ఇలా ఉన్నారు, వీరు ఇలా ఉన్నారని మీరందరూ ఒకరికొకరు జడ్జిగా అయిపోయారు. ఇదంతా తండ్రి చూస్తున్నారు. బ్రహ్మాబాబాను ప్రత్యక్షంగా చూశారు. పదే పదే ఎలాంటి పొరపాట్లను చేసే ఆత్మ అయినా బాప్‌దాదా(విశేషంగా సాకార రూపంలో బ్రహ్మాబాబా) పిల్లలందరి కోసం ప్రియస్మృతులను ఇస్తూ, పిల్లలందరినీ మధురాతి మధురమైనవారనే అన్నారు. ఇద్దరు - నలుగురు చేదుగా, మిగిలినవారు మధురంగా అని అన్నారా! అలాంటి ఆత్మల పట్ల కూడా సదా దయాహృదయులుగా అయ్యారు, క్షమాసాగరులుగా అయ్యారు. మంచిది. ఒకవేళ మీరు వృత్తిలో ఎవరి గురించి అయినా నెగటివ్ భావాన్ని ఉంచుకుంటే దాని వలన మీకేమి లాభముంటుంది? ఒకవేళ మీకు

ఇందులో లాభముంటే భలే ఉంచుకోండి. అనుమతి ఉంది. ఒకవేళ లాభం లేదు, ఆందోళన అవుతుంది....... అంటే ఆ విషయం బాప్‌దాదా ఎదురుగా వస్తుంది. బాప్‌దాదా చూస్తారు, ఆ సమయంలో వారికి అద్దాన్ని చూపించాలి. కావున ఏ విషయంలో తమకు లాభమేమీ లేదో, నాలెడ్జ్‌ఫుల్‌గా (జ్ఞాన స్వరూపులుగా) అవ్వడం వేరే విషయం. ఇది రాంగ్, ఇది రైట్ అనే జ్ఞానముంది. నాలెడ్జ్‌ఫుల్‌గా అవ్వడం రాంగ్ కాదు. కాని ఆ రాంగ్‌ను వృత్తిలో ధారణ చేయడమే రాంగ్. ఎందుకంటే మీరే మూడ్ ఆఫ్ అయ్యి, వ్యర్థ సంకల్పాలు వస్తూ, స్మృతి శక్తి తక్కువగా ఉంటే మీకు నష్టం వాటిల్లుతుంది. మీరు ప్రకృతిని కూడా పావనంగా చేసేవారైనప్పుడు వీరైతే ఆత్మలు. వృత్తి, వైబ్రేషన్లు మరియు వాయుమండలం మూడింటికీ సంబంధముంది. వృత్తి ద్వారా వైబ్రేషన్లు వస్తాయి. వైబ్రేషన్ల ద్వారా వాయుమండలం తయారవుతుంది. వృత్తియే మూలం. ఒకవేళ త్వరత్వరగా తండ్రి ప్రత్యక్షత జరగాలనే తీవ్రగతి ప్రయత్నముండాలని మీరు భావిస్తున్నట్లయితే అందుకు తమ వృత్తిని తమ కోసం, ఇతరుల కోసం పాజిటివ్‌ను(మంచిని) ధారణ చేయండి. భలే నాలెడ్జ్‌ఫుల్‌గా అవ్వండి కాని తమ మనసులో నెగటివ్‌ను (చెడును) ధారణ చేయకండి. నెగటివ్ అనగా చెత్త అని అర్థం. ఇప్పుడిప్పుడే వృత్తిని శక్తిశాలిగా తయారు చేసుకోండి. ఎందుకంటే అందరూ అనుభవం చేసుకున్నారు. వాణి ద్వారా, శిక్షణ ద్వారా పరివర్తన చాలా మెల్లగా జరుగుతుంది. చాలా మందగించినట్లుగా జరుగుతుంది. ఒకవేళ మీరు తీవ్ర గతిని కోరుకున్నట్లయితే నాలెడ్జ్‌ఫుల్‌గా అయ్యి, క్షమా స్వరూపులుగా అయ్యి, దయా హృదయులుగా అయ్యి, శుభ భావన, శుభ కామనల ద్వారా వాయుమండలాన్ని పరివర్తన చేయండి. చూడండి, మీరందరూ ప్రత్యక్షంగా చూశారు - మధువనానికి ఎవరైతే వస్తారో వారి పై అన్నిటికన్నా దేని ప్రభావం ఎక్కువగా పడ్తుంది? వాయుమండలానిది. ఇక్కడ కూడా అందరూ నెంబరువారీగా ఉన్నా ఇది బ్రహ్మాబాబా కర్మ భూమి, బాప్‌దాదా వరదాన భూమి అయినందున ఆ వాయుమండలం పరివర్తన చేస్తుంది.



**14-11-2002**

అలాగే డ్రామా పై కూడా పూర్తి నిశ్చయముండాలి. సఫలత మరియు సమస్య రెండు రకాల విషయాలు డ్రామాలో వస్తాయి. కాని సమస్యా సమయంలో నిశ్చయబుద్ధికి గుర్తు సమాధాన స్వరూపం. సమస్యకు సెకనులో సమాధాన స్వరూపం ద్వారా పరివర్తన చేసుకోవడం. సమస్య పని రావడం, నిశ్చయబుద్ధి ఆత్మ పని సమాధాన స్వరూపం ద్వారా సమస్యను పరివర్తన చేయడం. ఎందుకు? ప్రతి బ్రాహ్మణాత్మ బ్రాహ్మణ జన్మ తీసుకుంటూనే మాయను ఛాలెంజ్ చేశారు. చేశారు కదా లేక మర్చిపోయారా? మేము మాయాజీత్‌గా అయ్యేవారమనే ఛాలెంజ్ ఉంది. కావున సమస్యా స్వరూపమే మాయా స్వరూపం. ఛాలెంజ్ చేశారు కనుక మాయ అయితే ఎదుర్కుంటుంది కదా! అది భిన్న భిన్న సమస్యల రూపంలో మీ ఛాలెంజ్‌ను పూర్తి చేసేందుకు వస్తుంది. మీరు నిశ్చయబుద్ధి విజయీ స్వరూపంలో దానిని దాటాలి. ఎందుకు? నథింగ్ న్యూ(కొత్తదేమీ లేదు). ఎన్నిసార్లు విజయులుగా అయ్యారు? ఇప్పుడు ఒకేసారి సంగమ యుగంలో విజయులుగా అవుతున్నారా? లేక అనేకసార్లు విజయులుగా అయ్యి ఇప్పుడు రిపీట్ చేస్తున్నారా? అందువలన సమస్య మీకు కొత్త విషయమేమీ కాదు. నథింగ్ న్యూ(కొత్తదేమీ కాదు). అనేకసార్లు విజయులుగా అయ్యారు, అవుతున్నారు. ఇక ముందు కూడా అవుతూనే ఉంటారు. ఇదే డ్రామా పై నిశ్చయబుద్ధి విజయులుగా ఉండడం.

**28-02-2003**

తండ్రి మీ కోసం కానుకను తీసుకొచ్చారు. అయితే ఏ కానుక తీసుకొచ్చారు? బంగారు ప్రపంచం. సతోప్రధాన ప్రపంచాన్ని కానుకగా తీసుకొచ్చారు. ఇది నిశ్చయముందా? నిశ్చయానికి గుర్తు ఆత్మిక నషా. ఎంతగా మీ రాజ్యానికి సమీపంగా వస్తున్నారో, ఇంటికి సమీపంగా వస్తున్నారు. ఎప్పుడైతే మీ రాజ్యానికి సమీపంగా వస్తున్నారో అప్పుడు పదే పదే తమ స్వీట్ హోమ్(మధురమైన ఇల్లు) మరియు స్వీట్ రాజ్యం స్పష్టంగా స్మృతిలోకి రావాలి. ఇవి సమీపంగా వస్తున్నారనేందుకు గుర్తులు. తమ

ఇల్లు, తమ రాజ్యం ఎంత స్పష్టంగా స్మృతిలోకి రావాలంటే అవి మూడవ నేత్రం ద్వారా స్పష్టంగా కనిపించాలి. ఈ రోజు ఇది(ఇల్లు), రేపు అది(రాజ్యం) అని అనుభవమవ్వాలి. ఎన్నిసార్లు పాత్రను పూర్తి చేసి తమ ఇంటికి, తమ రాజ్యంలోకి వెళ్లారో గుర్తుకు వస్తోంది కదా! ఇప్పుడు మళ్లీ వెళ్లాలి. డబల్ ఫారినర్లకు స్పష్టంగా గుర్తుకు వస్తోందా? లేక లాగవలసి ఉంటుందా? ఏమిగా అవుతామో తెలియదు, ఎలా అవుతామో తెలియదు! లాగవలసి ఉంటుందా లేక స్పష్టంగా ఉందా? గుర్తుందా? స్పష్టంగా ఉందా?

డబల్ ఫారినర్లకు ఒక్క సెకండులో ఏదైనా వ్యర్థ విషయం, ఏదైనా నెగటివ్ విషయం, ఏదైనా గతించిన విషయానికి మనసులో బిందువు పెట్టడం వస్తుందా? డబల్ ఫారినర్లు ఎప్పుడు, ఎలాంటి గతించిన విషయాలైనా, మంచి విషయాలైతే మర్చిపోరాదు, వ్యర్థ విషయాలనే మర్చిపోవలసి ఉంటుంది అని భావిస్తున్నారో వారు, ఏ విషయాన్నైనా దేనినైతే మర్చిపోవాలనుకుంటున్నారో దానికి సెకండులో బిందువు పెట్టగలరా? ఫారినర్లు ఎవరైతే బిందువు పెట్టగలరో వారు నేరుగా పెద్ద చేయిని ఎత్తండి. అభినందనలు, మంచిది. ఒక్క సెకండులో కాదు, ఒక గంట అయితే పడ్తుంది అని భావిస్తున్నారా? సెకండు అయితే చాలా తక్కువ కదా! ఒక గంట తర్వాత బిందువు పెట్టగలుగుతామని భావించేవారు చేతులెత్తండి. గంటలో బిందువు పెట్టగలిగేవారు చేతులెత్తండి. ఫారినర్లు అయితే చాలా బాగున్నారని గమనించాము. భారతవాసులు కూడా ఒక గంటలో కాదు, సగం రోజులో బిందువు పెట్టగలమన్నవారు చేతులెత్తండి(ఎవ్వరూ చేతులెత్తలేదు). సరిగ్గానే ఉన్నారని బాప్‌దాదాకు తెలుసు. బాప్‌దాదా అయితే చూస్తూ ఉంటారు. చేతులెత్తరు. కాని బిందువు పెట్టబడ్తుంది. కాని సగం రోజు పట్టినా, ఒక గంట పట్టినా, మీకు అడ్వాన్స్ పార్టీ వారి ఆహ్వానం వచ్చినట్లయితే ? ఫలితమెలా ఉంటుంది? అంతమతి సో గతి ఏమవుతుంది? తెలివైనవారే కదా!

**17-02-2004**

కర్మలోకి వచ్చినప్పుడు ఈ సృష్టి రంగస్థలం పైన కర్మలు చేసేందుకు



వచ్చారు. ఈ సృష్టి ఒక నాటక రంగము. కావున డ్రామాలో ఏవైతే కర్మలు చేశారో, ఏదైతే గతించిపోయిందో, దానికి ఫుల్‌స్టాప్ కూడా పెట్టారా? అనగా బిందువు. అందుకు మూడు బిందువులను సదా గుర్తుంచుకోండి. అద్భుతమంతా చూడండి. ఈనాటి ప్రపంచంలో అన్నిటికన్నా దేనికి మహత్వముంది? ధనానికి. ధనానికి మహత్వముంది కదా! తల్లిదండ్రులకు కూడా ఏ మహత్వము లేదు. ధనమే సర్వస్వం. అందులోనూ చూడండి, ఒకవేళ ఒకటి పక్కన ఒక బిందువు పెట్తే ఏమవుతుంది? పది అయిపోతుంది. రెండవ బిందువు పెడ్తే 100 అయిపోతుంది. మూడవ బిందువు పెడ్తే 1000 అయిపోతుంది. కావున బిందువుకు అద్భుతముంది కదా! ధనంలో కూడా బిందువుకు అద్భుతముంది, శ్రేష్ఠ ఆత్మగా అవ్వడంలో కూడా బిందువుకు అద్భుతముంది. అంతేకాక చేసి చేయించేవారు కూడా బిందువే. కావున అన్ని వైపులా ఎవరికి మహత్వముంది? బిందువుకే కదా! బిందువును గుర్తుంచుకోండి. వేరే విస్తారంలోకి వెళ్లకండి. బిందువును గుర్తుంచుకోగలరా! బిందువుగా అవ్వండి, బిందువును స్మృతి చేయండి, బిందువు పెట్టండి. ఇది చాలు. ఇదే పురుషార్థం.

**15-10-2004**

బాప్‌దాదా ఇప్పుడు స్వ పరివర్తనా వేగంలో ఇంకా తీవ్రతను చూడాలనుకుంటున్నారు. బాప్‌దాదా ఏమి కోరుతున్నారు? అని అందరూ అడుగుతారు కదా! పరస్పరం ఆత్మిక సంభాషణను చేస్తారు కదా! అప్పుడు బాప్‌దాదా ఏమి కోరుతున్నారు? అని ఒకరినొకరు అడుగుతారు. బాప్‌దాదా ఇది కోరుతున్నారు. సెకండులో బిందువు ఉంచబడాలి. ఎలాగైతే కాగితం పైన బిందువు పెట్టబడ్తుంది కదా! అంతకంటే వేగంగా పరివర్తనలో ఏదైతే అయ్యథార్థత ఉందో అందుకు బిందువు పెట్టబడాలి. బిందువు పెట్టడం వస్తుందా? వస్తుంది కదా! కాని అప్పుడప్పుడు ప్రశ్న మార్కు అయిపోతుంది. బిందువు ఉంచుతారు కాని అది ప్రశ్నార్థకమైపోతుంది. ఇదెందుకు? ఇదేమిటి? ఈ ప్రశ్నలు బిందువును ప్రశ్న మార్కులోకి మార్చేస్తాయి. బాప్‌దాదా ఇంతకు ముందు కూడా చెప్పారు. వై - వై (ఎందుకు, ఎందుకు) అనకండి.

ఏమి చేయాలి? (ఫ్లై) ఎగరండి. వాహ్ వాహ్ అనండి లేక ఎగరండి (ఫ్లై). వై వై అని అనకండి. వై - వై అనడం త్వరగా వస్తుంది కదా! వచ్చేస్తుందా? వై అని వచ్చినప్పుడు దానిని వాహ్ వాహ్‌గా చేయండి. ఎవరు ఏమి చేసినా, ఏమి అన్నా వాహ్ డ్రామా వాహ్! అని అనుకోండి. వీరెందుకు చేస్తున్నారు? వీరెందుకు అంటున్నారని అనుకోకండి. వీరు చేస్తే నేను చేస్తానని కాదు.

**31-12-2004**

ఇప్పుడు అందరూ ముక్తిని కోరుకుంటున్నారు. విడిపించండి, విడిపించండి అని బాధతో అరుస్తున్నారు. కనుక ఈ నాలుగు విషయాలు మంచి పర్సెంటేజ్(శాతం)లో ప్రాక్టికల్ జీవితంలో ఉండాలి. వారిని తీవ్ర పురుషార్థులని అంటారు. అప్పుడు బాప్‌దాదా వాహ్ పిల్లలూ వాహ్! అని అంటారు. మీరు కూడా వాహ్ బాబా వాహ్! వాహ్ డ్రామా వాహ్! వాహ్ నా పురుషార్థం వాహ్! అని అంటారు. కాని ఇప్పుడు ఏమి చేస్తున్నారో తెలుసా? ఒకసారి వాహ్ అని అంటారు, ఒకసారి 'వై(ఎందుకు)' అని అంటారు. వాహ్! అని అనడానికి బదులు 'వై' అని అంటారు. 'వై' అయ్యోగా అయిపోతుంది. కావున వై(ఎందుకు) కాదు. వాహ్! అని అనండి. మీకు కూడా ఏది బాగనిపిస్తుంది. వాహ్! బాగనిపిస్తుందా? లేక వై(ఎందుకు) బాగనిపిస్తుందా? ఏమి బాగనిపిస్తుంది! వాహ్. ఎప్పుడూ వై అని అనడం లేదా? పొరబాటున వచ్చేస్తుంది.

**20-02-2005**

ఒక్క సెకండులో మనసుకు యజమానిగా అయ్యి మనసును ఆజ్ఞాపించగలరా? చేయగలరా? మనసును ఏకాగ్రం చేయగలరా? ఫుల్‌స్టాప్ పెట్టగలరా? లేక ఫుల్‌స్టాప్ పెట్టే అది ప్రశ్నార్థకంగా అయిపోతోందా? ఎందుకు, ఏమిటి, ఎలా, ఇదేమిటి, అదేమిటి అనే ఆశ్చర్యార్థకం కూడా వద్దు. ఫుల్‌స్టాప్ పెట్టండి. సెకండులో పాయింట్(బిందువు)గా అయిపోండి. ఇంకే శ్రమా లేదు. కేవలం ఒక్క పాయింట్(బిందువు) అన్న శబ్దాన్ని మాత్రమే అభ్యాసంలోకి తీసుకురండి. పాయింట్ స్వరూపంగా అవ్వాలి. వేస్ట్‌కు



(వ్యర్థానికి) పాయింట్ పెట్టాలి. ఇంకే కష్టమూ లేదు. పాయింట్‌ను గుర్తుంచుకోండి, పాయింట్ పెట్టండి, పాయింట్‌గా అయిపోండి. ఈ అభ్యాసాన్ని రోజంతటిలో మధ్య మధ్యలో ఎంత బిజీగా ఉన్నా ఇది ప్రయత్నించాలి. ఒక్క సెకండులో పాయింట్‌గా అవ్వగలరా? ఒక్క సెకండులో పాయింట్‌ను పెట్టగలరా? ఇలా పదే పదే చేసే అభ్యాసమున్నప్పుడే రాబోయే అంతిమ సమయంలో ఫుల్ పాయింట్లను తీసుకోగలరు. పాస్ విత్ ఆనర్‌గా అయిపోతారు. ఇదే పరమాత్మ చదువు. ఇదే పరమాత్మ పాలన.

**07-03-2005**

క్రొత్త విషయమేమీ కాదు. ఎన్ని కల్పాలు, ఎన్ని సార్లు సంపూర్ణంగా అయ్యారో గుర్తుందా? క్రొత్త విషయమేదీ లేదు. కల్ప కల్పమూ అయ్యారు. తయారయ్యే ఉన్నారు, అయ్యారు, కేవలం రిపీట్ చేయాలి. తయ్యారైన దానినే తయారు చేయాలి. కావున తయ్యారై తయారవుతున్న డ్రామా అని అంటారు. కేవలం ఇప్పుడు రిపీట్ చేయాలి అనగా తయారు చేయాలి.

**25-03-2005**

సదా సంకల్పాలు చేస్తూ ఈ సంకల్పాన్ని ఎమర్జ్(ఉత్పన్నం) చేయండి. మర్జ్(అణచరాదు) కాదు, ఎమర్జ్. నేను చేయవలసిందే అని ఎమర్జ్ చేయండి. తయారవ్వాల్సిందే, అవ్వాల్సిందే, అయ్యే ఉంది. వీరినే నిశ్చయబుద్ధి విజయంతి అని అంటారు. డ్రామాలో విజయం తయారయ్యే ఉంది. కేవలం రిపీట్ చేయాలి. తయ్యారై తయారవుతున్న డ్రామా తయారయ్యే ఉంది. రిపీట్ చేసి తయారు చేయాలి. కష్టమా? అప్పుడప్పుడు కష్టమైపోతూ ఉంటుందా? ఎందుకు కష్టమవుతుంది? మీకు మీరే సహజాన్ని కష్టంగా చేసుకుంటారు. చిన్న తప్పు చేస్తారు. ఏ తప్పు చేస్తారో తెలుసా? ఆ సమయంలో బాప్‌దాదాకు పిల్లల పై చాలా దయ అని అనాలా, ఏమనాలి, ప్రేమ వస్తుంది. ఏ ప్రేమ వస్తుంది ? ఒకవైపు అయితే తండ్రి మాతో కంబైండ్‌గా ఉన్నారని అంటారు. కంబైండ్‌గా ఉన్నారా? కంబైండ్‌గా ఉన్నారా? జతలో కాదు, కంబైండ్‌గా. కంబైండ్‌గా ఉన్నారా? డబల్ ఫారినర్లు కంబైండ్‌గా ఉన్నారా? వెనకాల ఉన్నవారు కంబైండ్‌గా ఉన్నారా? గ్యాలరీలోని వారు

కంబైండ్‌గా ఉన్నారా?

అందరూ సంతోషంగా ఉన్నారా? ఏర్పాట్ల కంటే ఎక్కువగా వచ్చేశారు. (23 వేల మంది కన్నా ఎక్కువగా వచ్చేశారు). ఏమీ ఫర్వాలేదు. ఎక్కువగా వచ్చినట్లయితే దాదీకి ఇంకా పెంచాలనే సంకల్పం నడుస్తుంది కదా! భలే వచ్చారు. బాగుంది. హాలు అయితే ఎప్పుడైనా చిన్నదిగా అవ్వాల్సిందే. అవ్వాల్సిందే కదా! మొదటి లైను వారు చెప్పండి. అవ్వాల్సిందే కదా! అప్పుడే కదా తయారు చేస్తారు! డ్రామాలో వృద్ధి జరగాల్సి ఉంది. సేవాధారులు అలసిపోవడం లేదు కదా! ఇప్పుడు ఎవరి టర్న్? గుజరాత్‌ది.

**02-02-2007**

ఖజానాలను జమ చేసుకునే సహజ విధిని కూడా బాప్‌దాదా వినిపించారు. ఏవైతే అవినాశి ఖజనాలున్నాయో ఆ ఖజానాలన్నీ ప్రాప్తి చేసుకునే విధి 'బిందువు'. ఎలాగైతే వినాశీ ఖజానాలలో కూడా బిందువు ఉంచుతూ ఉంటే అవి పెరుగుతూ ఉంటాయి కదా! కావున అవినాశి ఖజానాలను జమ చేసుకునే విధి - బిందువు ఉంచడం. మూడు బిందువులు ఉన్నాయి. ఒకటి నేను ఆత్మ బిందువును, తండ్రి కూడా బిందువే, డ్రామాలో ఏదైతే జరిగిపోయిందో అది ఫుల్‌స్టాప్ అనగా బిందువు. కావున బిందువు ఉంచడం వస్తుందా? అన్నిటికంటే సహజమైన గుర్తు ఏది? బిందువే కదా! కనుక ఆత్మ బిందువు, తండ్రి కూడా బిందువు. ఈ స్మృతి ద్వారా స్వతహాగానే ఖజానాలు జమ అవుతాయి. కావున బిందువును సెకండులో స్మృతి చేయడం వలన ఎంత సంతోషం కలుగుతుంది! ఈ సర్వ ఖజానాలు మీ బ్రాహ్మణ జీవితానికి లభించిన అధికారాలు. ఎందుకంటే పిల్లలుగా అవ్వడం అనగా అధికారులుగా అవ్వడం.

**దాదీలతో** – బాగుంది. అందరూ ఆదిరత్నాలు. ఆదిరత్నాలలో విశేషతలు ఉన్నాయి. అందరూ రత్నాలను చూసి చాలా సంతోషిస్తారు. దాదీని కూడా అందరూ గుర్తు చేస్తున్నారు.(దాదీజీని విశేషమైన ట్రీట్‌మెంట్ మరియు చెకింగ్ కొరకు బొంబాయి ఆసుపత్రికి జనవరి 31 న తీసుకెళ్లారు. మోహినీ బహన్, మున్నీ బహన్, నిర్వైర్ భాయి, యోగినీ బహన్ మొదలైన వారందరూ



స్మృతులను పింపించారు.). పెద్ద వారి ముందు ఏదో ఒక అనుభవమొస్తుంది కదా! అతీతంగా మరియు తండ్రికి ప్రియంగా ఉన్నారు. అతీతంగా ఉంటూ చిన్న చిన్న విషయాలలో పరీక్షలు వచ్చేందుకు ఉదాహరణగా అవుతారు. పూర్తి 100 శాతం సంపన్నంగా అవ్వాలి ఎందుకంటే మొదటి నెంబరు వారికి కొద్దిగా కూడా అంశంలో అంశం కూడా మిగిలిపోరాదు. అంతా ఇక్కడే సమాప్తమవ్వాలి. ఎందుకంటే వీరి ఆధారంతో క్రొత్త ప్రపంచ రాజ్య స్థాపన జరగాలి. అంతేకాక రాజ వంశం తయారవ్వాలి. కావున అంశ మాత్రాన్ని కూడా భస్మం చేసుకుంటున్నారు. అందువలన ఏమి జరిగినా అతీతంగా ఉంటారు. సర్వ గుణ సంపన్నంగా, సంపూర్ణ నిర్వికారిగా, మర్యాదా పురుషోత్తములుగా ఇలా ప్రాక్టికల్‌గా సంపన్నంగా అయ్యేందుకు కొద్దో గొప్పో ఈ ఆటనైతే ఆడవలసి ఉంటుంది. (బాబా కోసం ఇది ఆట అని జానకి దాదీ అన్నారు). మీ కోసం కూడా ఇది ఆటనే. ఈ పాత్ర కూడా ఉంది. ఎలాగైతే వేరొక పాత్రను అభినయిస్తారో, ఈ పాత్ర కూడా నిశ్చితమై ఉంది. కొద్దిగా కూడా లేకుండా భస్మమవుతోంది. పూర్తి పవిత్రంగా అవుతున్నారు. అంశ మాత్రము కూడా ఉండదు. కావున అందరికీ ప్రేమ అయితే ఉంది. ప్రేమతో కూడిన ఆశీర్వాదాలు కూడా దాదీకి లభిస్తున్నాయి. బాగుంది. మీరందరూ కలిసి నిమిత్తంగా అయ్యి నడిపిస్తున్నారు. ఇది కూడా చాలా బాగుంది. ( పరదాదీ(నిర్మలశాంత దాదీ) కూడా స్మృతులనిచ్చారు). ఇది కూడా ఒక ఆటలో ఆటలాంటిది. అందరూ ఒక్కసారే కలిసి పవిత్రంగా అవుతున్నారు. ఈమె అయితే(శాంతమణి దాదీ) ధైర్యాన్ని చూపించారు, చేసి చూపించారు. డాక్టర్లకు కూడా తమ ధైర్యాన్ని చూపించారు కదా! ప్రతీ ఒక్కరికి తమ తమ విశేషతలు ఉన్నాయి. కావున బాగుంది. కలిసి సహచరులుగా అయ్యారు. యజ్ఞ కార్యమైతే ఆగనే ఆగదు. అమరమైనది. నడవాలి ఇంకా పెరగాలి. అందరూ సాక్షిగా అయ్యి ఆటను చూస్తున్నారా? లేక ప్రశ్నార్థకాలు వస్తున్నాయా?(ఉత్పన్నమవుతున్నాయా?) ఎందుకు? ఏమిటి? అనైతే ప్రశ్నలు రావడం లేదు కదా! ఏదైతే జరుగుతుందో అందులో అనేక రహస్యాలు ఇమిడిపోయి ఉంటాయి. అవి తండ్రికి తెలుసు, డ్రామాకు

తెలుసు. మంచిది. అందరూ బాగున్నారు కదా! బాగున్నారు.

బాప్‌దాదా బొంబాయి ఆసుపత్రిలో దాదీజీ సేవకు వెళ్ళిన అన్నయ్యలు, అక్కయ్యలకు విశేషంగా స్మృతులనిచ్చారు. బాప్‌దాదా బొంబాయిలో అందరికీ ప్రియమైన, అందరి హృదయాల గారాబు దాదీ సేవలో ఎవరైతే నిమిత్తంగా ఉన్నారో వారందరికీ ప్రియస్మృతులను ఇస్తున్నారు. దాదీది (పాత్రను) ఏదైతే డ్రామాలో చూస్తున్నారో, చూస్తున్నా సాక్షిగా అయ్యి ఆశీర్వాదాల, హృదయపూర్వకమైన స్నేహము మరియు స్నేహముతో కూడిన సకాశ్ ఇచ్చే సేవను చేస్తూ ఉంటారు, అలా చేస్తూ ఉండండి. ఆటలో ఆటను చూస్తూ ఉండండి. సాక్షిగా అయ్యి చూడండి, ఎగురుతూ ఉండండి. బాప్‌దాదా హృదయపూర్వకంగా అందరికీ ఆశీర్వాదాలు ఇస్తున్నారు. అందరూ ప్రేమతో సేవ చేస్తున్నారు. సేవ చేసినందుకు కూడా అభినందనలు. (డాక్టర్లు కూడా చాలా బాగా సేవ చేస్తున్నారని జానకీ దాదీ చెప్పారు). ఏదైతే జరుగుతుందో అందులో సేవ మరియు కళ్యాణము నిండే ఉన్నాయి. మంచిది.

**03-03-2007**

విశ్వరతన్ దాదా ఫిబ్రవరి 26 న అకస్మాత్తుగా తమ పాత శరీరాన్ని వదిలేశారు. ఎందుకంటే డ్రామాలో కొందరు - కొందరు ఆత్మలు అకస్మాత్తుగా మరియు ఎవర్‌రెడీ పాఠాన్ని పక్కా చేయించవలసి ఉంది. చూడండి, చంద్రమణి(దాదీ) శరీరం వదిలినప్పుడు కొద్ది సమయం ఆ అల(లహర్) పని చేసింది. అందరూ అకస్మాత్తుగా అనే పాఠంలో పక్కాగా అయినారు. మళ్ళీ నెమ్మది నెమ్మదిగా తేలికైపోయారు. మళ్ళీ డ్రామాలో పాత్ర ఏదైతే జరిగిందో అది వాయుమండలంలో అకస్మాత్తుగా మరియు ఎవర్‌రెడీ పాఠాన్ని మళ్ళీ పక్కాగా చేసేందుకు నిమిత్తంగా అయ్యింది. విశ్వరతన్‌కు నిరాకారీ స్థితి పై ధ్యాస బాగుండేది. గుప్తంగా ఈ పాఠం పక్కాగా ఉండేది. అందువలన త్వరగా ఒక సెకండులో పాత్ర పూర్తయిపోయింది. ఈ సమయం కూడా అందరికీ అటెన్షన్ ఇప్పించేందుకు నిమిత్తంగా అయ్యింది. అందరూ ఇప్పుడు సమయమైతే ఇంకా కొద్దిగా మిగిలి ఉందని భావిస్తున్నారు. ఇప్పుడే



అల ఉండరాదు. ఎవర్‌రెడీగా ఉండాలి. ఎందుకంటే చాలాకాలపు అటెన్షన్ ఉండాలి. మంచిది.

దాదీలతో - మీ గ్రూపు అయితే అటెన్షన్ కలిగి ఉన్న వారి గ్రూపే కదా! అటెన్షన్ ఉంటుంది కదా! మీ అటెన్షన్ అయితే ఉంటుంది కదా! ఎవర్‌రెడీగా ఉన్నారా?

విశ్వరతన్ సేవాధారి అయిన మనోజ్‌తో - డ్రామాను చూసి సంతోషంగా ఉన్నావు కదా! డ్రామాలో ఏదైతే జరుగుతుందో మంచే జరుగుతుంది. (దాదా చాలా గుర్తుకొస్తున్నారు). భలే గుర్తుకు రానీ, వారి గుణాలు మరియు వారి కర్తవ్యాలు గుర్తు రావాలి. వారిని ఫాలో చేయండి. గుర్తు అయితే తప్పకుండా వస్తారు. అయితే వారిని ఫాలో చేయండి, సంతోషంగా ఉండండి, అందరికీ సంతోషాన్ని పంచండి అనే ఆజ్ఞ ఉంది. అంతే.

**17-03-2007**

బాప్‌దాదా చూస్తున్నారు - ఈ రోజుల్లో అయితే ప్రతి వర్గము వారి మీటింగులు చాలా జరుగుతున్నాయి. డబల్ ఫారినర్ల మీటింగ్ గురించి కూడా బాప్‌దాదా విన్నారు. చాలా బాగుందనిపించింది. మీటింగులన్నీ బాప్‌దాదా వద్దకైతే చేరుకుంటూనే ఉంటాయి. కావున బాప్‌దాదా దీని తేదీని ఎప్పుడు ఫిక్స్ చేశారని అడుగుతున్నారు. ఈ తేదీని డ్రామా ఫిక్స్ చేస్తుందా లేక మీరు ఫిక్స్ చేస్తారా? ఎవరు చేస్తారు? లక్ష్యమైతే మీరే ఉంచుకోవలసి ఉంటుంది. చాలామంది చాలా ఫస్ట్‌క్లాసైన లక్ష్యాన్ని ఉంచుకున్నారు. ఇప్పుడు కేవలం ఎలాంటి లక్ష్యం ఉందో, దాని అనుసారము లక్షణాలు, శ్రేష్ఠ లక్ష్యానికి సమానంగా అవ్వాలి. ఇప్పుడు లక్ష్యం మరియు లక్షణాలలో తేడా ఉంది. ఎప్పుడైతే లక్ష్యం మరియు లక్షణాలు సమానమైపోతాయో లక్ష్యం ప్రాక్టికల్‌లోకి వచ్చేస్తుంది. పిల్లలందరూ అమృతవేళ మిలనం చేసినప్పుడు, సంకల్పాలు చేసినప్పుడు చాలా మంచి సంకల్పాలు చేస్తారు. పురుషార్థం కూడా చాలా బాగా చేస్తారు. కాని పురుషార్థంలో ఒక్క విషయంలో తీవ్రత ఉండాలి. పురుషార్థం ఉంది కాని తీవ్ర పురుషార్థముండాలి. దానికి అదనంగా తీవ్రతతో కూడిన దృఢత

ఉండాలి.

ఈ రోజు మీ దాదీ గుర్తుకు వస్తున్నారు. దాదీలో ఏ విశేషతను చూశారు? అందరినీ ఎలా కంట్రోల్ చేశారు? ఎప్పుడూ ఎలాంటి వృత్తి (భావాలు) గలవారి లోపాలను కూడా దాదీ మనసులో ఉంచుకోలేదు. అందరికీ ఉత్సాహమునిప్పించారు. మీ జగదంబ తల్లి వాయుమండలాన్ని తయారుచేశారు. తెలిసి ఉండినా తమ వృత్తిని సదా శుభంగా ఉంచుకున్నారు. దీని వాయుమండలాన్ని మీరందరూ అనుభవం చేస్తున్నారు. ఫాలో ఫాదర్‌గా ఉన్నా ప్రతి ఒక్కరి విశేషతను తెలుసుకొని ఆ విశేషతను మీదిగా చేసుకోండి అని బాప్‌దాదా చెప్తున్నారు. అంతేకాక ప్రతి పుత్రునిలో దీనిని(విశేషతను) నోట్ చేయాలి. బాప్‌దాదా పిల్లలుగా ఎవరైతే అయ్యారో ఆ ఒక్కొక్కరిలో వారు మూడవ నంబరు వారైనా, ఇది డ్రామా విశేషత, బాప్‌దాదా వరదానముంది, పిల్లలలో 99 తప్పులు ఉన్నా ఒక విశేషత తప్పకుండా ఉంటుంది. ఆ విశేషతలో " నా తండ్రి (మేరా బాబా) " అనేందుకు హక్కుధారులుగా ఉన్నారు. పరవశమై ఉన్నా తండ్రితో ప్రేమ తెగిపోకుండా ఉంటుంది. కావున బాప్‌దాదా ఇప్పుడు సమయం యొక్క సమీపత అనుసరించి ప్రతి ఒక్క తండ్రి స్థానమేదైతే ఉందో అది గ్రామంలో ఉన్నా, పెద్ద జోన్‌లో ఉన్నా, సెంటర్లలో ఉన్నా ప్రతి స్థానంలో మరియు సహచరులలో శ్రేష్ఠ వృత్తి కలిగిన వాయుమండలం తప్పకుండా ఉందని చెప్తున్నారు.

**06-09-2007**

దాదీ మీ క్లాసులోకి వస్తూ ఉంటారు. రారని కాదు. మీరు ఏదైతే సమాధిని తయారు చేశారో అందులో కూడా తిరుగుతూనే ఉంటారు. కాని మీతో చాలా చాలా ఆత్మిక సంభాషణ చేయాలని అనుకుంటారు. అందువలన కొద్ది సమయం కావాలి. పోతే దాదీ శరీరాన్ని వదిలి 12 రోజులు సమాప్తమవుతున్నాయి. దాదీ సాకార వతనంలో విశేషంగా అతీతమైన మరియు ప్రియమైన అత్యవసరమైన కార్యం కోసం నిమిత్త మాత్రంగా పాత్రను అభినయించాల్సి ఉంటుంది. కాని దాదీ జన్మ, వారి కార్యము చాలా అతీతమైనవి. తర్వాత వచ్చి దాని విస్తారాన్ని వినిపిస్తాము.



బాప్‌దాదా కూడా డ్రామాలో నిశ్చితమైన పాత్రను అభినయించాల్సి ఉంటుంది, నటింపజేయవలసి ఉంటుంది. అలౌకికత అంటే ఏమిటో తర్వాత వినిపిస్తాము. అందరూ బాగున్నారా? మొదటి లైనులోని వారందరూ బాగున్నారా? దాదీలు బాగున్నారా? పాండవులు కూడా బాగున్నారా? పాండవులందరూ బాగున్నారు కదా! డబల్ ఫాలో. దాదీ వినిపించిన మూడు శబ్ధాలను సదా గుర్తు చేసుకుంటూ ఉండండి - నిమిత్తము, నిర్మానము మరియు నిర్మల వాణి. ఈ మూడు శబ్ధాలు ప్రతి సమయంలో, ప్రతి కార్యాన్ని ప్రారంభించేందుకు ముందు గుర్తు చేసుకోండి. భలే కార్యము (పని) మారినా ఈ మూడు శబ్ధాల స్మృతి మారిపోరాదు. ఎంత కఠినమైన కార్యమైనా ఈ మూడు శబ్ధాలు మర్చిపోరాదు. ఎలాగైతే బాప్‌దాదా, దీదీ, దాదీ ముగ్గురు గుర్తున్నారు కదా కనుక ఈ మూడు శబ్ధాలు మర్చిపోరాదు. ప్రతి కార్యము ప్రారభించేందుకు ముందు ఈ మూడు శబ్ధాలను గుర్తు చేసుకొని తర్వాత పని ప్రారంభించాలి. అప్పుడు దాదీ సమానంగా చాలా త్వరగా సహజంగా సమానంగా అయిపోతారు. మంచిది. ఇప్పుడేం చేయాలి?

**15-10-2007**

ఇంత సహజమైన విధిని వినిపించారు. సంగమయుగంలో కేవలం బిందువు యొక్క అద్భుతమే ఉంది. బిందువును ఉపయోగించండి చాలు, ఇక ఏ గుర్తు అవసరం లేదు. మూడు బిందువులను ఉపయోగించండి. ఆత్మ బిందువు, తండ్రి బిందువు మరియు డ్రామా బిందువు. మూడు బిందువులను ఉపయోగిస్తూ ఉంటే తండ్రి సమానంగా అవ్వడమేమీ కష్టము కాదు. బిందువు పెట్టాలనుకుంటారు కాని పెట్టే సమయంలో చేయి కదిలిపోతుంది. అప్పుడు ప్రశ్న మార్కుగా లేక ఆశ్చర్య రేఖగా అయిపోతుంది. అక్కడ చేయి కదులుతుంది, ఇక్కడ బుద్ధి కదులుతుంది. లేకపోతే మూడు బిందువులను స్మృతిలో ఉంచుకోవడంలో కష్టమేముంది?

**15-12-2007**

దాదీలతో – పిల్లలు హాజరై ఉన్నారు కనుక తండ్రి అయితే హాజరుగా

ఉండనే ఉన్నారు. తండ్రి పిల్లల నుండి దూరమవ్వజాలరు, పిల్లలు తండ్రి నుండి దూరమవ్వజాలరు. జతలో ఉంటాము, జతలో నడుస్తాము అని ప్రతిజ్ఞ ఉంది. అర్ధకల్పం బ్రహ్మాబాబాతో కలిసి ఉంటారు(వారు కూడా ఇమిడిపోయి తోడుగా ఉన్నారని జానకి దాదీ చెప్పారు). మీ అనుభూతి సరిగ్గా ఉంది. ఇప్పుడైతే గ్యారంటీ ఉంది కాని ఎప్పుడైతే రాజ్యం చేస్తారో అప్పుడు రారు. ఎవరైనా చూసేవారు కూడా ఉండాలి కదా! (పైన మనసు ఎలా లగ్నం చేయాలి) డ్రామాలో పాత్ర ఉంది. బ్రహ్మాబాబా అయితే తోడుగా ఉన్నారు కదా! చూడండి, డ్రామా ఏమి చేస్తుంది? మంచిది. అందరూ ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ, స్వమానంలో ఉంటూ నడుస్తున్నారు, నడుస్తూ ఉండండి.

**30-11-2008**

ఏమి జరిగినా డ్రామా చాలా బాగుంటుంది. పట్టణాలలో కొత్త కొత్త పిల్లలెవరైతే ఉంటున్నారో వారు అక్కడ ఇప్పుడు సేవ చేయాలనే ఉమంగ - ఉత్సాహాలతో ఉన్నారు. అందరికంటే ధైర్యం గల ఒక అమ్మాయి ఉంది. ఆమె ధైర్యవంతురాలు(సాహసవంతురాలు). బాప్‌దాదా ఆమెకు రోజూ అమృతవేళలో వరదానమిస్తారు. ఆ అమ్మాయి కూడా ఆక్యురేట్‌గా ఉంది. పేరేమిటి?(వజీహా). అలాంటి పని చేసి చూపించండి. ధైర్యవంతురాలు, భయపడేది కాదు. ఇంకా చూడండి, తన ఇంట్లో వారిని కూడా యుక్తిగా సరి చేసింది. తెలివైనది. నైరోబీ వారు కూడా చాలా మంచి పురుషార్థము చేశారు. వారి విశేషత, నైరోబీ వైపు విశేషత ఏమంటే, సోదరీలు తక్కువైపోయినప్పుడు ఎవరైతే విద్యార్థులు వెలువడ్డారో వారు సెంటరును సంభాళిస్తారు. ఇది కూడా విశేషతే. కావున అందరి విశేషతలను కలుపుకొని ప్రతి ఒక్కరు తమ తమ స్థానాన్ని విశేషంగా తయారు చేయండి. పోతే మిగిలినదంతా బాగుంది. డబల్ పురుషార్థులు మంచి పురుషార్థాన్ని చేసి ముందుకు వెళ్తున్నారు. కాని బాబా చార్టును చూశారు. ఏ సమాచారమునైతే చెప్పారో ఆ సంపూర్ణ పవిత్రతా చార్టును చూస్తారు. బాగుంది. అందరి లక్ష్యం చాలా బాగుంది. కాని మధ్యలలో నిర్లక్ష్యమనే



మాయ చాలా వస్తుంది. ఇప్పుడు దానికి వీడ్కోలు చెప్పండి. నిర్లక్ష్యానికి వీడ్కోలు మరియు ఫుల్‌స్టాప్‌కు ఆహ్వానం. సరిగ్గా ఉంది కదా! ఇది చేస్తారు కదా! నిర్లక్ష్యాన్ని చూపించకండి. బాప్‌దాదా నిర్లక్ష్యం ఆటలు చాలా చూశారు. ఇప్పుడు సెకండులో ఫుల్‌స్టాప్ పెట్టే ఆటను చూపించండి. ఆ లెక్కలో కూడా చూడండి, అన్నిటికన్నా సహజమైనది ఫుల్‌స్టాప్. పెన్సిల్ ఉంచండి, ఫుల్‌స్టాప్ వచ్చేస్తుంది. మంచిది. డబల్ విదేశీయులు సదా టర్న్ తీసుకుంటూ ఉంటారు. ఇది చాలా బాగుంది. తీసుకుంటూ ఉండండి. మంచిది.

**05-02-2009**

పరస్పర అనుభవాలను వినడం వలన ఉత్సాహంలోకి వచ్చేస్తారు. ఒకరి అనుభవాలు మరొకరి అనుభవాల కంటే తక్కువైనవేమీ కావు. డ్రామానుసారంగా ప్రతి ఒక్కరికి ఏదో ఒక విశేషత తండ్రి ద్వారా లభించింది. కావున ఆ అనుభవాలను వినడం వలన, వీరు చేయగలిగినప్పుడు నేనెందుకు చేయలేనని ఉత్సాహంలోకి వచ్చేస్తారు. ఎప్పుడూ హృదయాన్ని చిన్నగా చేసుకోకండి. పెద్ద హృదయం, పెద్ద బాబా. బాబా చిన్నవారా ఏమిటి? అత్యంత గొప్ప బాబా(తండ్రి). కావున పిల్లల హృదయం సదా పెద్దదిగా ఉండాలి. పెద్ద హృదయం, సత్యమైన హృదయం, స్వచ్ఛమైన హృదయం ఉన్నట్లయితే ప్రతి మనోకామన పూర్తవుతుందని బాప్‌దాదా స్లోగన్ ఉంది.

**24-03-2009**

అతిథులతో - మీరు అతిథులా లేక మహాన్‌గా అయిపోయారా? అతిథిగా అయితే భావించడం లేదు కదా! మహాన్‌గా అయ్యేవారు, మహాన్‌గా అవ్వాల్సిందే. ఇక్కడకు రావడం, సంబంధంలోకి రావడం అనగా ముందుకు వెళ్తూనే ఉంటారు. ఆశీర్వాదాలు ఉండనే ఉన్నాయి. చూడండి, మీరు ఇక్కడి వరకు చేరుకున్నారంటే మిమ్ములను ఇక్కడకు ఎవరు పంపించారు? డ్రామా మిమ్ములను ఇక్కడి వరకు చేర్చింది.

**07-04-2009**

ఎవరైతే మొదటిసారి వచ్చారో, మొదటిసారి బాప్‌దాదాతో

కలుసుకునేందుకు వచ్చారో వారు లేవండి. సగం క్లాసు మొదటిసారి వచ్చినవారు ఉన్నారు. వెనక ఉన్నవారు చేతులెత్తండి. లేచి నిల్చోని చూడండి. ఎవరైతే మొదటిసారి వచ్చారో వారికి బాప్‌దాదా క్రొత్త జన్మ యొక్క బర్త్‌డే(జన్మదిన) శుభాకాంక్షలు తెలుపుతున్నారు. లక్షల లక్షల శుభాకాంక్షలని జనులు అంటారు. పదమా, పదమాల రెట్ల శుభాకాంక్షలని తండ్రి అంటారు. అంతేకాక బాప్‌దాదా ఇప్పుడు వచ్చేవారికి సదా ఒక ఛాన్సు ఇస్తారు. ఆ ఛాన్స్ ఏమంటే, ఇప్పుడు వచ్చేవారు కూడా ఒకవేళ తీవ్ర పురుషార్థము చేస్తే బాప్‌దాదా లేక డ్రామా వారికి లాస్ట్ నుండి ఫాస్ట్, ఫాస్ట్ నుండి ఫస్ట్‌గా అయ్యి, వారు కూడా ముందు నంబరు తీసుకోవచ్చు. వారికి కూడా ఛాన్స్ ఉంది. ఛాన్స్‌లర్‌గా(ఛాన్సు తీసుకునే వారిగా) అవ్వండి. కేవలం అటెన్షన్ ఇవ్వవలసి ఉంటుంది.

**సాకార మురళి 18-01-1995**

**శివభగవానువాచ** - మధురాతి మధురమైన పిల్లలూ! మీ స్థితిని ఏకరసంగా తయారు చేసుకునేందుకు ఎప్పుడూ విని - వినిపించిన విషయాలను నమ్మకండి. మీరు ఒక్క తండ్రి నుండి మాత్రమే వినండి. తప్పుడు మాటల నుండి దూరంగా ఉండండి. మీరు ఎప్పుడూ ఎవ్వరినీ నిందించరాదు. ఎందుకంటే ఈ అనాది డ్రామాలో ప్రతి ఆత్మ తమ పాత్రను ఆక్యురేట్‌గా(ఖచ్చితంగా) అభినయిస్తోంది. ఈ డ్రామాలోని ప్రతి దృశ్యం పిల్లలైన మీకు ఇష్టమవ్వాలి. ఎందుకంటే ఈ డ్రామా స్వయం రచయిత అయిన తండ్రికి చాలా ఇష్టమైనది. ఈ సుఖ - దు:ఖాల, ఓటమి - గెలుపుల ఆట తయారైన చాలా సుందరమైన నాటకము. ఇందులో ప్రతి పాత్రధారి తమ విశేషమైన పాత్రను అభినయిస్తున్నారు. కావున డ్రామాలోని ప్రతి దృశ్యాన్ని చూస్తూ, సదా హర్షితంగా ఉండండి. మీరు ఈ కళ్యాణకారి డ్రామాలో ఎవ్వరినీ దోషిగా చేయలేరు. ఎందుకంటే ఏదైతే గతించిపోయిందో అదే మళ్లీ జరగాలి. తయారై, తయారు చేయబడిన, తయారవుతున్న డ్రామా.......... కావున ఎవ్వరినీ దోషిగా చేయలేము. ఈ డ్రామా చాలా సుందరంగా నిశ్చితమై తయారై ఉంది. ఏ పిల్లలైతే సాక్షీ



దృష్టగా అయ్యి డ్రామాలో ప్రతి ఒక్కరి పాత్రను చూస్తారో వారి స్థితి మధువు (తేనె) సమానంగా మధురంగా అయిపోతుంది. వారు సదా ఏకరసంగా, అచంచలంగా, స్థిరంగా ఉంటారు.